

శ్రీమతే రామానుజాయ నమః

భగవద్రామానుజానుగృహీతమగు

# వేదార్థ సంగ్రహము

(ఉపనిషద్వాక్య సమన్వయరూపము)

సంస్కృత మూలము :

భగవద్రామానుజ యతీంద్రులు

ఆంధ్రానువాద వివరణములు


"శాస్త్రరత్నాకర" "సాహిత్య విద్యాప్రవీణ"

డా॥ సముద్రాల వేంకట రంగరామానుజాచార్యులు
M.A., Ph.D.

రాజమహేంద్రి

శ్రీమతేరామానుజాయనమః

# ॥ భగవద్రామానుజదర్శన వైభవము ॥

'వేదోఽఖిలో ధర్మమూలమ్' 'వేదైశ్చ సర్వైరహమేవవేద్యః' అను వాక్యములను ప్రమాణముగా స్వీకరించి, వేద పూర్వభాగ-ఉత్తర భాగములను సమన్వయముచేసిన మహామనీషి భగవద్రామానుజులు. వేదములో పూర్వభాగమునే ఆదరించి, కర్మలకే ప్రాధాన్యమును భావించినవారు మీమాంసకులు. ఉత్తరభాగమునకే ఆవశ్యకతను సంభావించి కర్మసంబంధములేని జ్ఞానమునే ఆదరించినవారు వేదాన్తులలో అద్వైతులు. కాని, పూర్వభాగము-ఆరాధనస్వరూపమును, ఉత్తరభాగము-ఆరాధ్య స్వరూపమును, ప్రతిపాదించేదిగా సమప్రామాణ్యమును పూర్వాచార్య సమ్మతమైనదానిని గ్రహించినారు భగవద్రామానుజులు. ఉపనిషత్తులలోని పరస్పర విరుద్ధములుగా తోచెడికొన్ని వాక్యములను సమన్వయము చేయుట పొసగదని, కొన్నిటికిమాత్రమే ప్రామాణ్యమును అంగీకరించినది శాంకరదర్శనము. ఉపనిషత్తుల సమన్వయముతో అవతరించిన బ్రహ్మసూత్రములలో సమన్వయమున్నను, దాని నవగాహనము చేసికొనలేక, సరియైన విధములో శ్రుతిసమన్వయమును సాధించలేకపోయినారు భగవద్రామానుజులకు పూర్వులు. ఋషి అభిప్రాయమును ఋషియేయెరుంగగలడుగాని, ఇతరులెరుంగలేరని భగవద్రామానుజులు బ్రహ్మసూత్రములకు బోధాయనమహర్షి రచించిన వృత్తిగ్రంథమును అతి ప్రయాసచే సాధించి, దానిచేలభించిన సమన్వయమును, శ్రీభాష్యము అనుపేర సూత్రభాష్యముగా ప్రకాశింపజేసిరి. దానికిపూర్వము శ్రీమన్నాథమునుల గ్రంథములనాధారముగా చేసికొని, తత్త్వత్రయము, విశిష్టాద్వైతము, శ్రుతిసమ్మతమని నిర్ధరించుకొనినారు. భగవదనుగ్రహలబ్ధ దివ్యజ్ఞానసంపన్నులగు ఆళ్వారుల గేయములను, శ్రీ కాంచీపూర్ణుల ద్వారా వరదరాజస్వామి అనుగ్రహించిన 'తత్త్వనిర్ణయము'ను, అవలంబ

నముగా జేసికొని, భగవద్రామానుజులు, కంటకితమైన వైదికమార్గమును శోధించి విశిష్టమైన మార్గమును ఏర్పరచిరి.

వారి జీవితము విచిత్రమైనది. వారధ్యయనముచేసినది మాయావాదులవద్ద. దర్శించినది సగుణ–సాకార–పరతత్త్వమును. తమ దర్శనమునకు, ఉపనిషత్తులకుకూడ విరుద్ధముగనుండుటచే మాయావాదమును వారు విశ్వసింపలేకపోయినారు. ఏ అర్థమునైనను యథార్థముగ నిర్ణయించునది ప్రమాణముచేతనేకాని స్వానుభవముచే కారాదని వారి నిర్ణయము. అందరిచే ప్రామాణికములుగా ఆదరింపబడు ఉపనిషత్తులలో, బ్రహ్మసూత్రములలో పరామర్శింపబడిన ఉపనిషత్తులలో పూర్వాపరవిరోధములేకుండ ప్రకరణానుగుణముగ సకలశ్రుత్యర్థములకు అవిరోధముగ సమన్వయముచేసినవారు భగవద్రామానుజులు. అందుచే శ్రుతులకు అర్థములనుచెప్పుటకు వారు వేరేప్రయత్నముచేయలేదు. బ్రహ్మసూత్రములకు భాష్యమును రచించునప్పుడే సిద్ధాంతమైన అర్థమును ప్రతిపాదించుచు ఉపనిషద్భాష్యమంతయు గతార్థమొనరించినారు. అందుచే భగవద్రామానుజులు బ్రహ్మసూత్రములకు శ్రీభాష్యమును రచించి, భగవద్గీతకు భాష్యమునురచించి ఉపనిషత్తులకు ప్రత్యేకముగ భాష్యమును రచించు ప్రయత్నమును విరమించినారు. ఆ లోపమును తీర్చుటకై శ్రీనివాసుని సన్నిధిలో వేంకటాచలమున ఉపన్యాసరూపముగ 'వేదార్థసంగ్రహము'ను అనుగ్రహించినారు.

ఇది భగవద్రామానుజ దర్శనమునకే సారభూతమైనగ్రంథము. శ్రుతులలో సమన్వయముకానివి భేద – అభేదశ్రుతులు, సగుణ – నిర్గుణ శ్రుతులు. వీటిని సమన్వయముచేయుట కుదరదని, కొందరు అభేదశ్రుతులను నిర్గుణశ్రుతులనుమాత్రమే ఆశ్రయించి, భేద–సగుణశ్రుతులు పరమార్థ విషయములుకావని సమన్వయించిరి. మరికొందరు భేదశ్రుతులనే ప్రధానముగా ఆదరించి అభేదశ్రుతులను విడచినారు. వేదములో యే ఒక్క శ్రుతిని అపరమార్థవిషయకముగా భావింపరాదని, అది వేదమునకే అప

చారమని, వేదము కొంత పరమార్థమును కొంత అపరమార్థమును వివరింపనేరదని, వేదప్రతిపాద్యమంతయు పరమార్థమేనని భగవద్రామానుజదర్శనము. ఆ సమన్వయము భగవద్రామానుజులుచేసినదికాదు. విరుద్ధశ్రుతులసమన్వయమునుగూడ ఎట్లుచేయవలయునో వేదమాతయే సూచించినది. దానినిగ్రహించి ఘటకములైన శ్రుతులుండగా విరుద్ధములని భావించి, ఒకటి పరమార్థవిషయము మరియొకటి అపరమార్థవిషయము అనుట తగదనినారు భగవద్రామానుజులు. ఉపనిషత్తులను సమ్యగ్బుద్ధితో పరిశీలించినవారికి, దీని సామంజస్యము గోచరముకాగలదు. తత్త్వమొక్కటేయన్నవారు, తత్త్వములురెండుఅన్నవారు, తత్త్వములు పదునారు అన్నవారుకూడ ఉన్నారు దార్శనికులలో. కాని శ్రుతిమాత తత్త్వములు మూడేనని నిర్ధరించినది. మూడైనచో ఒక్కటినను ఎట్లు పొసగును? అని శంక సహజముగానేర్పడును. దానికికూడ ఉపనిషత్తే సమాధానముచెప్పినది. విడదీయరాని విశేషణములు రెండిటితోకూడిన ఒక విశేష్యమున్నప్పుడు అవి 'ఒక్కటే' అనుటకు, 'వేరు' అనుటకు తగియుండునని, లోకానుభవముకలవారందరికి తెలియును. దీనిని యుపనిషత్తు 'శరీరాత్మభావము' అని పేర్కొనినది. అందరు ప్రమాణముగా అంగీకరించిన ఉపనిషత్తులలో బృహదారణ్యకమొక్కటి. అందు అంతర్యామి బ్రాహ్మణము పరిశీలింపదగినది. దానిని పరిశీలించినచో జీవ–ప్రకృతి తత్త్వములకు ఈశ్వరతత్త్వముతోగల సంబంధమేమో స్పష్టముకాగలదు. పృథివిమొదలు మృత్యువువరకు అచేతనములన్నియు ఈశ్వరునకు శరీరములనియు, ఈశ్వరుడు ఆత్మయనియు నిరూపించి, ఆత్మ–విజ్ఞానము–అనబడు జీవతత్త్వముకూడ ఈశ్వరునకు శరీరమేనని నిరూపించినది. ఆత్మ–శరీరము అను పదములకు అర్థముతెలియనివారు శరీరమనగానే భూతసంఘాతమని, భోగాయతనమని అర్థమును చెప్పికొందురేమో! ఉపనిషన్మాత అభిప్రాయము అదికాదు అని భగవద్రామానుజులు, సర్వత్ర సరిపడు శరీరలక్షణమును నిర్వచించిరి. వేరుగా ఉండుటకుగాని, వేరుగా

విడుగబడుటకుగాని వీలుకానిదై, ధరింపబడి, నియమింపబడి, తన యతిశయమునకే చేతనునిచే వినియోగపరచుకొనబడు ద్రవ్యము-శరీరము. అట్టిశరీరము జీవుడుకావచ్చును, ప్రకృతికావచ్చును. కాని, అది వేరుగా నుండకపోవుటచే ఒకటిగనే గ్రహింపబడును. దీనినే 'విశిష్టాద్వైతము' అను పేరుతో శరీరాత్మభావమును ప్రధాన 'ప్రతితంత్రము'గా స్వీకరించి భగవద్రామానుజులు భేదశ్రుతులను, అభేదశ్రుతులను పరమార్థవిషయముగనే సమన్వయించిరి. శంకరభగవత్పాదుల అద్వైతమును-'విశిష్టమే'నని భగవద్రామానుజుల యభిప్రాయము. కాలానుగుణముగ తాత్కాలికదర్శనకారుల మనోరంజనమునకనుగుణముగా వారు 'అద్వైతము'ని వదలియుందురు. కాని ఆ యద్వైతము-విశిష్టమేనని భగవద్రామానుజులు శాంకరదర్శనమును పూరించిరి. కార్యకారణముల అభేదస్థితిని గుర్తించినవాడే విశ్వమునంతను ఎరుగగలిగినవాడు. కాని-కార్యము అసత్యమని, కారణమునే సత్యముగా స్వీకరించినవాడు విశ్వద్రష్టకాడని ఛాందోగ్యమున సద్విద్యాప్రకరణము నిరూపించినది. ఈ కార్యకారణముల అద్వైతమే-'తత్త్వమసి'. దీని నెఱింగినవాడే జ్ఞాని. అదియెఱింగినవాడు విశ్వమునంతను బ్రహ్మమయముగా భావింపగలడుగనుక, విశ్వమునంతను ప్రేమింపగలడు. విశ్వమేలేదనువాడు ప్రేమసిద్ధాంతమును ఆదరింపలేడుకదా! కారణతత్త్వమును ధ్యానించి, కార్యమునందు ఆ కారణతత్త్వమును దర్శించుచు, నామరూపభేదముచేతనే భేదముకాని, సృష్టికిముందు, సృష్టికి తరువాత ఉన్నదంతయు ఒక్కటే-అనిగ్రహించినవాడే, విశ్వమును-విశ్వాంతర్యామిని, సమముగాప్రేమించగలడుగాని, విశ్వము లేదనుకొనినవాడెట్లు ప్రేమింపగలడు. ప్రేమయే భగవద్రామానుజదర్శనమునకు మూలసూత్రము. సౌందర్యదర్శనమే భగవద్రామానుజదర్శనము. రూపములేనిచోట సౌందర్యము అనుభవింపబడదుకదా! గుణములులేనిదానిని ప్రేమించలేముకదా! అందుచే శ్రుతి-ఈశ్వరునకు కల్యాణగుణములున్నవని, దివ్యమైన జగన్మంగళదాయకమైనరూపము

న్నదని, దర్శించిచెప్పినది. గుణములులేవు, రూపములేదు అనికూడ శ్రుతియేచెప్పినది. అవును. లేవు. అనినారు భగవద్రామానుజులు. రూపములేదు అనుమాటకు మనవంటి కర్మకృతమగు శరీరము లేదని యర్థము, మనకుగల దూషింపదగిన గుణములులేవని, రజస్తమస్సులకు, ఆకలిదప్పులకు, జరామృత్యువులకు అతీతుడని ఉపనిషత్తే చెప్పినది. ఈ సగుణ-నిర్గుణసమన్వయమునుగూడ–'అపహతపాప్మా, విజరో విమృత్యుః, విజిఘత్సః, సత్యకామః, సత్యసంకల్పః' అనిఒక్కవాక్యములోనే నిరూపించినది. ఈశ్వరుడు విగ్రహముతోనున్నచో అవయవసంఘాతము కనుక నశ్వరముఅని సందేహము. జన్మించినచో భావవికారములుకల వాడగునుకనుక, నిర్వికారశ్రుతికుదరదని వ్యథ. ఇవియన్నియు–శ్రుతుల సమగ్రపరిశీలనములేక కల్గునవి. మనవంటి కర్మకృతమైన భూతసంఘాతరూపమైన శరీరము కాదనియు, స్వసంకల్పకృతమనియు, అదియు దివ్యమనియు, అట్టిరూపము అసాధారణమైనది ఉన్నదనియు, అసాధారణరూపముతోనుండియు, అదృశ్యుడై, సర్వవ్యాపియైయుండగలవాడనియు ఉపనిషత్తులేచెప్పుచున్నవి. సాక్షాత్తు భగవానుడే, ఈ విషయములనన్నిటిని భగవద్గీతలో స్పష్టపరిచినాడు. భగవద్గీతను, బ్రహ్మసూత్రములను, శ్రుతులను సమగ్రముగ పరిశీలించి, అన్యోన్యవిరోధము లేకుండ సగుణ-నిర్గుణ, భేద-అభేద, సాకార-నిరాకార, నిష్క్రియ-సక్రియ, అజత్వ-జాయమానత్వములను సమన్వయముచేసి, మహోదాత్తముగ, గంభీరముగ మాత్సర్యములేక చూచువారలకందరకు మనోభిరామమగు భగవద్రామానుజుల మహోపన్యాసమే–'వేదార్థసంగ్రహము'. సమగ్రముగ ఉపనిషత్తులభావమును ఎరుంగగోరువారు–శ్రుతి-సూత్ర-స్మృతిసమన్వయమునెరుంగగోరువారు, భగవత్స్వరూప-రూప-గుణ-విభూతులను సమగ్రముగ అవగాహనమొనరించుకొనవలయునను కోరికగలవారు ఈ వేదార్థసంగ్రహమును అధ్యయనముచేయవలయును.

కాని, ఈ గ్రంథము సంస్కృతభాషలోనున్నది. విషయము

శాస్త్రప్రవేశములేనివారికి సుబోధకము కాదు. గ్రహింపవలసినవిషయమెంతోకలదు. అర్చామూర్తి మొదలు పరతత్త్వమువరకు, కారణతత్త్వము మొదలు జగత్తువరకు శ్రుతి-సూత్ర-స్మృతి-పురాణ-ఆగమ-దివ్యప్రబంధ రహస్యములను ఏకత్ర దర్శింపవలయునను కోరికగలవారెందరో ఉందురు. అట్టివారికి ఈ వేదార్థసంగ్రహము ఎంతయో ఉపకరించును. పరతత్త్వమెవ్వరు? అదియేకారణతత్త్వముకదా! దానినే ధ్యానింపవలయును కదా! అది ఎట్లు నిర్ధరింపబడవలయునను జిజ్ఞాసకలవారికి ఈ గ్రంథము ఎంతో ఉపకరించును. ఇట్టి మహాగ్రంథమును చి॥ రంగరామానుజాచార్యుల ద్వారా ఆంధ్రపాఠకలోకమునకందింప సంకల్పించినారు భగవద్రామానుజులు. ఉపనిషద్భాష్యమునురచించిన శ్రీ రంగరామానుజస్వామి నామధేయమును వీనికి కల్పించిన పితృపాదులు సార్థకముగ నామధేయము స్థిరపడగలదని భావించియుంచియుందురేమో!

ఆంధ్రమున ననువదించుట క్లేశసాధ్యము. ఈతడు అనువాదముగాగాక సామాన్యమైన జ్ఞానముకలవారికికూడ అందవలయుననుకోరికతో, వివరణరూపనుగకూడ, శాస్త్రీయవిషయములను సులభముగ, స్పష్టముగ, సంగ్రహముగనందించినాడు. ధన్యజీవనుడు. శ్రియఃపతిశ్రీనివాసుడు వీనికి ఇతోఽధికముగ వేదాన్తగ్రంథములను, సంప్రదాయమును ప్రవర్తింపజేయగలపాటవమును శ్రద్ధను ప్రసాదించుగాకయని అనేకమంగళాశాసనములుచేయుచున్నాను.

ప్రమోద జ్యేష్ఠ॥ బ॥ తృతీయ
సోమవారము 11-6-'90. విన్నవించు విధేయుడు,
విశాఖపట్టణము. శ్రీ భాష్యం అప్పలాచార్యుడు.

# వి ష య సూ చీ


| | | |
|---|---|---|
| 1. | ప్రథమ మంగళశ్లోకము | 1-7 |
| 2. | ద్వితీయశ్లోకము | 7-10 |
| 3. | స్వమతసంక్షేపము | 10-13 |
| 4. | వేదాన్తవాక్యప్రయోజనము | 13-21 |
| 5. | జీవాత్మస్వరూపము | 21-26 |
| 6. | పరమాత్మస్వరూపము | 26-37 |
| 7. | శంకరభగవత్పాదమతము | 38-58 |
| 8. | భాస్కరమతసంక్షేపము | 58-65 |
| 9. | యాదవప్రకాశమతము | 65-69 |
| 10. | శంకరభగవత్పాదమతనిరాకరణము | 69-220 |
| 11. | అవాంతరపూర్వపక్షము | 73-78 |
| 12. | తత్ఖండనపురస్సరముగ సద్విద్యాప్రకరణతాత్పర్యము | 78-101 |
| 13. | 'తత్త్వమసి' వాక్యవిచారము | 101-124 |
| 14. | తత్త్వమసి యనుచోటున లక్షణ లేదనుట | 124-134 |
| 15. | నిర్విశేషవస్తుబోధనమున శబ్దము ప్రమాణముకాదని నిరూపించుట | 134-147 |
| 16. | నిర్వికల్పకప్రత్యక్షమునకూడ సవిశేషవస్తువే భాసించును | 147-176 |
| 17. | అసత్కార్యవాదనిరాకరణము | 176-198 |
| 18. | అవిద్యావిషయమున సప్తవిధానుపపత్తుల నిరూపించుట | 189-220 |
| 19. | భాస్కరమతనిరాకరణము | 220-229 |
| 20. | యాదవప్రకాశమతఖండనము-భేదాభేదనిరాకరణము | 229-236 |
| 21. | స్వసిద్ధాన్తప్రతిష్ఠాపనము | 236-356 |
| 22. | పరమాత్మకును-చిదచిత్ప్రపంచమునకును శరీరశరీరిభావమును సమర్థించుట | 243-256 |

23. శేషశేషిభావమూలకముగ సర్వశబ్దములు పరమాత్మ
బోధకములని నిరూపించుట 256–260

24 సర్వశాస్త్రముల ప్రధానతాత్పర్యము 261–272

25. అన్ని శ్రుతులు ప్రమాణములే (సర్వశ్రుతిసమన్వయము) 272–281

26. బ్రహ్మాత్మైక్యజ్ఞానమే మోక్షసాధనమనుట కుదరదు 281–285

27. సద్విద్యయందుపాసింపబడు బ్రహ్మము సగుణమే 285–288

28. సర్వజీవులకు పరమాత్మయే ప్రేరకుడు. ఆయనకెట్టి
దోషములంటవు. 288–292

29. పరమాత్మ భక్తిమాత్రలభ్యుడు 292–301

30. విష్ణుమాహాత్మ్య ప్రతిపాదకములగు సాత్త్వికపురాణములే
ప్రమాణము 301–307

31. శ్రీమన్నారాయణుడే పరతత్త్వము 307–321

32. ప్రణవమూలమగు అకారమునకర్థము శ్రీమన్నారాయణుడే. 322–338

33. ఇతిహాసపురాణప్రతిపాద్యతత్త్వము శ్రీమన్నారాయణుడే 338–356

34. కార్యవాక్యార్థవాదుల మతము–తత్ఖండనము 356–385

35. స్వర్గాదిసాధనమున 'అపూర్వము' ద్వారముకాదు.
శ్రీమన్నారాయణుడే సర్వఫలప్రదాత 385–398

36. నిత్యవిభూతి సమర్థనము 398–420

37. దివ్యమంగళవిగ్రహ వర్ణనము 420–426

38. వేదములు అపౌరుషేయములని నిరూపించుట 426–439

39. సృష్టిప్రకారము 439–441

40. భగవత్ప్రాప్త్యుపాయనిరూపణము 441–442

41. భగవంతునకు శేషము లేదా దాసుడై యుండుటయే సుఖము 442–452

42. గ్రంథపరిసమాపనము 452–453

43. పారిభాషికపదమాల 454–457

44. దివ్యమంగళవిగ్రహ నిరూపకప్రమాణములు 458–461

శ్రియఃపతయే నమః

శ్రీమద్యామునమునయే నమః - శ్రీమద్రామానుజమునయే నమః

భగవద్రామానుజానుగృహీతః

# ॥ వేదార్థ సంగ్రహః ॥

మూలమ్॥

అశేషచిదచిద్వస్తుశేషిణే శేషశాయినే।
నిర్మలానన్త కల్యాణనిధయే విష్ణవే నమః॥

అవతరణిక —

మాయావాద మహామోహప్రదారణ పరాయణః।
శ్రీమాన్యామున యోగీంద్రో జీయాద్యతిపతేర్గురుః॥

చార్వాకార్హత బౌద్ధముఖ్య వివిధశ్రౌత ప్రతిద్వంద్విదుర్-
వాదవ్యాహత వేదధర్మభరణ ప్రోద్బద్ధకక్షః స్వయమ్।
శేషో వైష్ణవ తత్త్వవిత్త్వమహితశ్రీలక్ష్మణార్యోఽభవద్
యస్యాజ్ఞా నిరతం ప్రపన్నశిరసిప్రోద్దీప్తభూషాయతే॥

పూర్వాచార్య సుసంప్రదాయదయితామ్నాయరీతిం శ్రితః
పారాశర్యవచః సుధామధురిమోద్గారాను భావోజ్జ్వలః।
శ్రీభాష్యాది యథార్థతత్త్వకథనోదగ్రార్ష భావాఢ్య సద్-
గ్రంథావిష్కృతి తోషితాఖిల జగజ్జీయాద్యతీంద్రశ్చిరమ్॥

స్తుత్యం ప్రహ్వహృదాఽప్రమేయమహిమ శ్రీలక్ష్మణార్యాభిధం
జ్యోతిర్యత్ప్రతివాది ఘూకనిచయస్యాంధ్యం సమాపాదయత్।
విద్యాభాసమహాంధకార జఠరాత్ప్రకాశ్యమానీయ సద్-
-విద్యావైభవ భాసమానమకరోద్దుర్వాదనష్టం జగత్॥

శ్రీరామానుజ దేశికేంద్ర విహితో బ్రహ్మప్రతిష్ఠాపకః
శ్రుత్యుక్త్యన్వయతత్త్వబోధన విధోదగ్రః సమగ్రశ్చయః।
శ్రీమద్ద్రావిడ వేదసార మహితో భాష్యాదివాక్యోచ్చయః
భో భూయాద్ధరిభక్తి భావిత హృదామానంద కందశ్చిరమ్॥

క్వాహాలక్ష్మణ దేశికేంద్ర భణితిః? క్వాహాల్ప బుద్ధిశ్చమే?
నూనం స్వీయలఘుత్వమేవ విశదీకర్తుం ప్రవృత్తో హ్యయమ్।
నోచేన్మందమతే రసంశ్రితగురూపాస్తేర్మమైతత్కథం
వేదాన్తార్థగభీరవార్ధి తరణవ్యగ్రత్వమద్ధా! భవేత్?

చేతో మే సతతం యతీంద్రచరణ శ్రీపుండరీకోద్గత-
క్షౌద్రాస్వాదనలోలుపభ్రమరతామాతాయతా మన్వహమ్।
యద్ధిప్రోద్ధత దుష్టసంస్కృతి మహామోహాతి ఖిన్నం చలం
తత్త్వాలోకన శక్తిహీన మతులం చాపల్యమాగాహతే॥

వేదార్థసంగ్రహస్యేదమాంధ్రీయం వివరణంకృతమ్।
రంగరామానుజాఖ్యేన భూయాత్ శ్రీహరితోషకమ్॥

వివిధవాద కోలాహల సమ్మూర్ఛితమై, తత్త్వప్రకాశవిదూరమై అపమార్గమున బడిన యార్షవచన సమన్వయశైలిని, సంస్కరింపనెంచి అపారకరుణాపరవశులైన భగవద్రామానుజ మునీంద్రులు, ప్రతిపక్ష నిరాకరణ పురస్సరముగా, స్వపక్ష ప్రతిష్ఠాపనమొనర్చుటకు—వివిధోపనిషద్వచన—తత్త్వయాథార్థ్య నిర్ణాయకమగు "వేదార్థ సంగ్రహ" మను ప్రకరణగ్రంథము నారంభించుచు స్వాభిమత దేవతోపాసనాత్మకమగు మంగళమును, తన్ముఖముగా ప్రతిపాద్యవిషయ సంగ్రహమును

నిర్దేశించుచున్నారు, 'అశేష' ఇత్యాది.

అనువాదము:- సమస్తమైన చిత్ (జీవ) అచిద్ (జడప్రపంచ) రూపమగు వస్తుజాతమునకు 'శేషి' (స్వామి) యైనవాడును, పాలసంద్రమున 'శేష'శయ్యపై పవ్వళించినవాడును, నిర్మలము, అపారమునైన కల్యాణమునకు (మంగళమునకు) ఆకరమైనవాడును, సర్వవ్యాపియునైన శ్రీమన్నారాయణునకు ప్రణతిని సమర్పించుచున్నాను.

వివరణము:- ఈ శ్లోకమున ఉపేయము (పొందదగినది) ఉపాయము (సాధనము) ప్రతిపాదింపబడినవి. నిఖిలోపనిషత్సిద్ధమగు శ్రీమన్నారాయణాత్మక పరబ్రహ్మము ఉపేయము. ఇది నాలుగు విశేషణ విశేష్యవాచకశబ్దములచే నిర్దేశింపబడినది. 'నమః' అను శబ్దముచే ఉపాయము నిర్దేశింపబడినది. 'విష్ణవే' అను విశేష్యవాచకశబ్దముచే నిర్దేశింపబడిన పరబ్రహ్మము శ్రీమన్నారాయణుడు. విష్లువ్యాప్తౌ అను ధాతువునకు అంతట వ్యాపించియుండుటయని అర్థము. 'అతర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' ఇత్యాది శ్రుతిసముదాయముచే శ్రీమన్నారాయణునకే సర్వవ్యాపిత్వము (అంతట - వెలుపల లోపల వ్యాపించియుండుట) సిద్ధించుచున్నది. సర్వవ్యాప్తిరూపమగు ఐశ్వర్యగుణమును ఖ్యాపనమొనర్చుటద్వారా బ్రహ్మరుద్రాదులందీశ్వరత్వము లేదని చెప్పుటకే 'విష్ణు' శబ్దమును విశేష్యముగా నిర్దేశించుట. నిఖిలజగత్సృష్టిస్థితిలయకారకుడై, సర్వవ్యాపియై, పరమప్రాప్యుడైన భగవానుని స్వరూపస్వభావముల నిష్కర్షించుటకే 'అశేష చిదచిద్వస్తుశేషిణే', 'శేషశాయినే' 'నిర్మలానన్తకల్యాణ నిధయే' అను మూడు విశేషణములు. 'చిత్' అనగా జీవుడు. 'అచిత్' అనగా జడమైన ప్రపంచము. ఈ రెండిటిని నియమించువాడు కనుక శ్రీమన్నారాయణుడు 'శేషి'. అనగా స్వామి. చిదచిదాత్మక (జీవజడాత్మక) సమస్తవస్తుజాతము శ్రీమన్నారాయణునకు శేషము. అనగా ఆయనకే పరతంత్రమై, ఆయన కతిశయమును కల్గించుట కొరకే పరిగ్రహింపబడునది. ఇట్టి భగవత్పారతంత్ర్యభాగ్యమును

పొందినవారు కనుక అనన్తగరుడ విష్వక్సేనాదులుకూడ శేషులే. శ్రీమన్నారాయణుడు శేషి. అనగా చేతనాచేతనాత్మక సమస్త వస్తుజాతమును సృజించి, అందు తాను అంతర్యామిగా ప్రవేశించి, లోనుండి నియమించుచుండువాడు. 'అశేష' అను పదముచేత చేతనులు అనేకులు—అనగా జీవనానాత్వము (జీవానేకత్వము) సూచింపబడుచున్నది 'అశేషచిదచిద్వస్తు' అనుచోట 'వస్తు' పదముచేత—చేతనాచేతనాత్మకమైన సమస్త ప్రపంచము—వస్తువు, అనగా వాస్తవమైనది—అనగా మాయావాదులు చెప్పునట్లు [అసత్యము] మిథ్య, కాదని సూచింపబడినది. స్వామియగు శ్రీమన్నారాయణునకు—చేతనాచేతనాత్మకమగు వస్తుజాతమునకునుగల సంబంధము 'శేషశేషి భావము' అని సూచింపబడినది. ఈ శేషశేషిభావమును గురించి భగవద్రామానుజులు వేదార్థసంగ్రహమును ప్రస్తుత గ్రంథమున నిరూపించియున్నారు. 'అశేష వస్తు శేషిణే' అన్నంతమాత్రముననే వస్తుశబ్దముచేతనే, చేతనాచేతనాత్మక ప్రపంచగ్రహణమగుచుండగా, చిత్-అచిత్ శబ్దముల రెండిటిని ప్రయోగించుటచే యాదవ ప్రకాశమతము నిరాకరింపబడుచున్నది. యాదవమతమున సర్వము చేతనమే. ఘటాది వస్తువులయందు చైతన్యము అభివ్యక్తముకాక యుండును. కనుక—అచ్చట చిత్-అచిత్—అను విభాగము లేదు. ఈ మతముకంటె వైలక్షణ్యమును తెలుపుటకే చిత్-అచిత్ అని నిర్దేశము. 'అశేష చిదచిద్వస్తు శేషిణే' అను ఈ విశేషణముచేతనే—'తత్త్వమసి' ఇత్యాది వేదాన్తవాక్యములందు, జగత్తు-బ్రహ్మము అను నీరెండిటికిని శరీర-శరీరిభావము నిమిత్తముగ జేసికొని, సామానాధికరణ్యము ముఖ్యముగనే కుదురుచున్నదనియు సూచింపబడినది. ఈ శరీర శరీరిభావము, సామానాధికరణ్యము మున్నగునవి—గ్రంథమున ముందు ముందు వివరింపబడగలవు. ఈ విశేషణముచేతనే—శాంకరాభిమతమగు జీవబ్రహ్మ తాదాత్మ్యము మున్నగునవి నిరాకరింపబడుచున్నవి. ఇక్కడనే భాస్కరమతము కూడ నిరాకరింపబడుచున్నది. ఈ విశేషణముచే "లీలావిభూతి" విశిష్టుడు భగవానుడని తెలియజేయబడుచున్నది. ఈ సమస్త జగత్తునకు లీలా

విభూతియని పేరు. వైకుంఠము, అక్కడగల అనన్తగరుడ విష్వక్సే నాదులు నిత్యవిభూతియని పిలువబడుదురు. నిత్యవిభూతితో కూడినవాడు కూడ శ్రీమన్నారాయణుడేనని తెలుపుటకు—'శేషశాయినే' అని విశేషణము. శేషుడనగా దాసుడు-కింకరుడు. అనంతునకు శేషుడను పేరు సార్థకము. కనుకనే భగవద్ధ్యానమున మునులు-స్తోత్రరత్నమున—

'నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతపవారణాదిభిః।
శరీరభేదైస్తవశేషతాంగతైః నిరంతరం శేషఇతీరితో జనైః'॥

'నివాసము, పడక, ఆసనము, పాదముంచుకొను పీట, వస్త్రము, దిండు మున్నగు వస్తువులుగానమరియు, తన పడగలచే స్వామిపై వర్షము, ఎండ పడకుండగా నివారించియు, తన దేహముయొక్క వివిధ భంగిమలచే కైంకర్యమొనర్చుచు, అనంతుడు—శేషధర్మ నిర్వహణమునకాద్యుడై—ఆదిశేషునిగా లోకులచే కీర్తింపబడుచున్నాడ'ని నుడివిరి. 'శేషశాయినే' అను శబ్దమునకు శేషనామధేయుడగు అనంతుని శయ్యగా జేసికొని పాలసంద్రమున పవ్వళించినవాడని సామాన్యార్థము కాగా, నిత్యవిభూతియని పిలువబడు వైకుంఠము—అందలి సమస్త పార్షద(సేవక)వర్గము, పత్నీప్రభృతి సమస్తము భగవానునకు 'శేష' భూతమని చెప్పబడినది.

ఈవిధముగా రెండు విశేషణములచేతను—లీలావిభూతి, నిత్యవిభూతులతో కూడినవాడు భగవానుడని చెప్పబడినది.

'నిర్మలానన్త కల్యాణ నిధయే' అను విశేషణముచే—నిర్మలము, అనన్తమునైన కల్యాణమునకు నిధియైనవాడని యొకయర్థము. సకలవిధ దోషరహితమై అపారమైన మంగళమునకు నిధి (స్థానము) అయినవాడని యభిప్రాయము. ఈ విశేషణముచే ఉపాధి సంబంధముచే వివిధ మలాస్పదము బ్రహ్మమని చెప్పిన భాస్కర యాదవాదుల మతములు నిరాకరింపబడినవి. మరియు—నిర్మలుడు, అనంతుడు, కల్యాణనిధి యని చెప్పుకొన్నచో—'నిరవద్యం' 'నిరంజనమ్' 'అపహతపాప్మా' 'సమస్తహేయ

రహితం విష్ణ్వాఖ్యం పరమం పదమ్' ఇత్యాది వచనములచే సిద్ధించిన నిర్దోషత్వము 'నిర్మల' పదముచేతను, 'అనన్త' పదముచే—దేశ, కాల, వస్తు రూపమైన త్రివిధ పరిచ్ఛేదము లేనివాడును, 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' ఇత్యాది శ్రుతులచే ప్రతిపాదింపబడిన పరబ్రహ్మస్వరూపుడు శ్రీమన్నారాయణుడేననియు సూచింపబడుచున్నది. కల్యాణ శబ్దమును కల్యాణ గుణ పరముగా వ్యాఖ్యానించినచో—అపార కల్యాణగుణ గణ విశిష్టుడని స్ఫురించుచుండగా, నిర్గుణబ్రహ్మవాదము నిరాకరింపబడుచున్నది. ఈవిధముగ హేయప్రత్యనీకత్వము (హేయములైన దోషములకు విరుద్ధమైయుండుట) కల్యాణగుణాకరత్వము (మాధుర్య, సౌశీల్యాద్యపార మంగళగుణముల కాకరమైయుండుట) యను ద్వివిధలింగవిశిష్టము (ఉభయలింగ విశిష్టము) బ్రహ్మము అని సూచింపబడినది. విష్ణుశబ్ద ప్రయోగమునుబట్టి, యోగశక్తి (ప్రకృతి-ప్రత్యయవ్యుత్పత్తి)ని పురస్కరించుకొనిమాత్రమేకాక, రూఢిచేకూడ, ప్రాప్యుడు (పొందదగినవాడు) శ్రీమన్నారాయణుడేనని నిర్ణయింపబడినది. ఇంతవరకు నాలుగుశబ్దముల చేతను (అశేష చిదచిద్వస్తు శేషిణే, శేషశాయినే, నిర్మలానన్త కల్యాణ నిధయే, విష్ణవే అను నాలుగు పదములచేతను) ప్రాప్యము నిర్ణయింపబడినది. ఇంక 'నమః' అను శబ్దముచే పూర్వోక్త పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీమన్నారాయణుని పొందుటకు 'ఉపాయము' నిరూపింపబడుచున్నది. 'మన్మనాభవ మద్భక్తః మద్యాజీ, మాంనమస్కురు' అను గీతావచనముచేతను, 'ధ్యానార్చనప్రణామాదిః అత్యర్థప్రియః తత్ప్రాప్తిఫలః' అను భగవద్రామానుజ వచనముచేతను ఉపాసనాంతర్గతముగ నమస్కారము ఉపాయముగా చెప్పబడినది. ప్రాప్యుడు (పొందదగినవాడు)ను, ప్రాపకము (పొందించునట్టి ఉపాయమైనవాడును) భగవానుడేనని సంప్రదాయము. కాని ఉపాసనాంగముగా నిచ్చట ప్రణామమునకుకూడ ఉపాయత్వము అర్థ సిద్ధము.

ఈవిధముగా నీశ్లోకమున విశిష్టాద్వైతమని పిలువబడు భగవద్రామా

నుజమతసారము సంగ్రహింపబడినది. అశేష శ్రుతివచన తాత్పర్యసిద్ధ మగు పరబ్రహ్మము శ్రీమన్నారాయణుడే. ఆయన ఈ కనుపించుచున్న నిఖిల జీవ జడ ప్రపంచమును సృజించి—లోపల ప్రవేశించి నియమించు చున్నాడు కావున శేషి. నిత్యవిభూతియని పిలువబడు శ్రీవైకుంఠము, లీలావిభూతియని పిలువబడు ఈ జీవజడాత్మక ప్రపంచము—అస్వతంత్ర మై భగవానునకు శరీరముగా వేరుచేయరాని విధముగ నమరియుండి ఆ భగవానునకే అతిశయమును కలిగించునది కావున శేషమని పిలువబడును. ఈవిధముగ—'చిత్' (జీవుడు) 'అచిత్' (జడము) 'ఈశ్వరుడు' (నియ మించువాడు) అని తత్త్వత్రయము. శ్రీమన్నారాయణుడు సకల కల్యాణ గుణవిశిష్టుడు. కనుక నిర్గుణుడు కాడు (గుణరహితుడు కాడు). తత్త్వ మస్యాది వేదాన్తవాక్యములు ఆ భగవానునకు—ఈ జీవజడాత్మక ప్రపంచ మునకుగల శరీర శరీరిభావ మూలమగు తాదాత్మ్యమునే ముఖ్యముగ సామానాధికరణ్య నిర్దేశముఖమున ప్రతిపాదించుచున్నవి. కనుక జీవ బ్రహ్మములకు స్వరూప తాదాత్మ్యము లేదు. అట్టి శ్రీమన్నారాయణుడే పరమప్రాప్యుడు. ఆయనను పొందుటకు ఆయనే ప్రాపకమైన యుపాయము. నమస్కారాదులుకూడ ఉపాసనాంగముగా ఉపాయము లగుచున్నవి.

శ్లో॥ పరబ్రహ్మాజ్ఞం, భ్రమపరిగతం, సంసరతి, తత్
పరోపాధ్యాలీఢం వివశమశుభస్యాస్పదమితి।
శ్రుతిన్యాయాపేతం జగతి వితతం మోహనమిదం
తమోయేనాపాస్తం సహి విజయతే యామునమునిః॥

అనువాదము:- పూర్వము చెప్పబడిన నిఖిల గుణాకరము—సమస్త జీవజడాత్మక ప్రపంచ విశిష్టము, నారాయణాఖ్యమైన యా పర బ్రహ్మమే, అజ్ఞానవిశిష్టమై దేహాత్మత్వాది భ్రాంతితో కూడినదై సంసార మును పొందుచున్నది. ఆ పరబ్రహ్మము తనకంటె వేరైనయొక ఉపాధి విశేషముతో కూడినదై, అమంగళాస్పదమై, పరాధీనమగుచున్నది. అని

యీ విధముగా శ్రుతివిరుద్ధము (వేదవిరుద్ధము) యుక్తివిదూరమునైన యే అజ్ఞానము లోకమున వ్యాపింపచేయబడినదో, ఆ మోహాత్మకతమస్సు నేమహానుభావులు పటాపంచలుచేసిరో యట్టి యామునమునులు సర్వోత్కర్షను పొందుచున్నారు.

వివరణము:- ఈ శ్లోకమున పూర్వాచార్యులగు శ్రీ యామునాచార్యులను భగవద్రామానుజులు స్తుతించుచున్నారు. వీరు సిద్ధిత్రయము, ఆగమప్రామాణ్యము, స్తోత్రరత్నము మున్నగు గ్రంథములననుగ్రహించి కువాదధ్వాంతనిరసనమొనర్చి భగవద్రామానుజులకు మార్గదర్శకులైన మహానుభావులు. వీరిని స్తుతించు ప్రస్తుతశ్లోకమున మాయావాద భేదాభేదవాదాది నిరాకరణమొనర్పబడుచున్నది. 'పరబ్రహ్మైవాజ్ఞం భ్రమపరిగతం సంసరతి' అనునది శాంకరమతసారము. పరబ్రహ్మైవ = నిఖిల కల్యాణగుణాకరమై, షాడ్గుణ్యపూర్ణమై యంతర్యామిగ సమస్తమును వ్యాపించియున్న పరబ్రహ్మమే; అజ్ఞం = అవిద్యచే కప్పబడిన స్వరూపము కలదై, భ్రమపరిగతం = వివిధభేదదర్శనరూపమగు భ్రాంతితో కూడినదై; సంసరతి = భేదదర్శనమువలన నేర్పడిన జన్మము, జర, మరణము మున్నగు సాంసారిక దుఃఖమునకు భాజనమగుచున్నది. 'పరబ్రహ్మైవ' అనుచోటగల 'ఏవ' అను అవధారణార్థక శబ్దము విరోధమును బోధించుచున్నది. అనగా సకలకల్యాణగుణాకరము, సర్వజ్ఞము, సర్వశక్తిసంపన్నమునైన పరబ్రహ్మమే అజ్ఞానముచే తిరోహితమైనప్పుడు ఇక లోకమును రక్షించువారెవరుందురు. కనుక ఇది విరుద్ధమని యభిప్రాయము. పరబ్రహ్మమే అనాద్యవిద్యారూపమగు దోషముతోకూడినదై తానే నానాజీవ జగద్రూపమైన భేదమును దర్శించుచు, ఈ భేదదర్శన రూపమైన భ్రాంతిచే (దేహాత్మాది భ్రాంతిచే) జన్మము, జర (ముదుసలి తనము) మరణము మున్నగు అపారసంసారక్లేశములబడుచున్నదని శాంకరమత సంక్షేపము. 'తత్ పరోపాధ్యాలీఢం, వివశమ్, అశుభస్య అస్పదమ్' అనిభాస్కరయాదవప్రకాశమతములు నిర్దేశింపబడినవి. పరోపాధ్యాలీఢం,

వివశమ్ అను రెండుపదములు భాస్కరమతమును సూచించుచున్నవి. పరోపాధ్యాలీఢమ్ (పర = తనకంటె వేరైన, ఉపాధి = ఒకానొకధర్మముతో, ఆలీఢమ్ = కూడియున్నదై); వివశమ్ = కర్మమునకు వశపడియున్నది. ఆ పరబ్రహ్మమే ఒకానొక ఉపాధితోకూడినదై కర్మపరవశమగుచున్నదని భాస్కరమతము. ఇంక 'అశుభస్య ఆస్పదమ్' అను రెండు పదములచేతను యాదవప్రకాశమతము నిర్దేశింపబడినది. ఆ పరబ్రహ్మము జడప్రపంచగతమగు పరిణామమునకాస్పదమగుట, జీవగతమగు అపురుషార్థమునకు ఆస్పదమగుట యనుద్వివిధములైన అశుభములకు స్థానమగుచున్నది. భాస్కరమతమున అచిద్రూపమైన జగత్తునకు బ్రహ్మమునకు అభేదము సహజము, భేదమును సహజమే. చిద్రూపుడైన జీవునకు, బ్రహ్మమునకు అభేదమే స్వాభావికము. భేదము ఉపాధివలన నేర్పడుచున్నది. ముక్తియందు జీవుడు బ్రహ్మభేదమును పొందుచున్నాడు. యాదవప్రకాశమతమున జీవబ్రహ్మములకును, జడజగద్-బ్రహ్మములకు భేదాభేదములు రెండును సహజములే. ముక్తియందుకూడ భేదమున్నదికనుక. ఈ విధముగ మూడు మతములు రెండుపాదములలోను నిర్దేశింపబడినవి.

ఈ మతత్రితయము—శ్రుతిన్యాయాపేతమ్ = శ్రుతియనగా వేదవచనము, న్యాయమనగా దానికనుకూలమైన యుక్తి లేక తర్కము; ఈ రెండును లేనిది. అనగా పూర్వమతత్రయము నుపపాదనముచేయు శ్రుతిప్రమాణము కాని, యుక్తి కాని లేదని తాత్పర్యము. కొందరు 'శ్రుతి-న్యాయ' శబ్దమునకు ప్రమాణతర్కమని యర్థముచెప్పి—ఇచ్చట ప్రమాణతర్కము లేదు, బాధతర్కము మాత్రమే కలదని వ్యాఖ్యానించియున్నారు. ఈవిధముగ శ్రుతిప్రమాణముగాని, శ్రుత్యనుకూలమైన స్మృతిపురాణేతిహాసప్రమాణముగాని, శ్రుత్యనుకూలయుక్తిగాని లేని ఈ యజ్ఞాన తమస్సు లోకమున విజృంభింపగా, దీనిని తత్త్వదీపప్రభచే పటాపంచలుచేసి విశిష్టాద్వైతమున కప్రతిహతమైన మార్గమును చూపించిన శ్రీమద్భాష్యమున

మునులు జయించుచున్నారని తాత్పర్యము.

శ్రుతిన్యాయోపేతమైనదానిని నిరాకరించుటకు విశేషప్రయత్నమేల చేయవలయునని యన్నచో దీనికి సమాధానముగా 'జగతి వితతం మోహన మిదమ్ తమః' అని చెప్పబడినది. 'తమః' అనగా వాస్తవజ్ఞానమునకు ప్రతిరోధియైన అవరణాజ్ఞానము. 'మోహనమ్' అనగా అజ్ఞానమునందే జ్ఞానబుద్ధి లేదా అపార్థమునందే తత్త్వార్థబుద్ధి. ఇది తప్పక నిరసింప దగినదేనని భావము. ఇట్టి 'మోహన'మగు 'తమస్సు' నణచి యంధకార నివారకులైనవారే 'గురు' 'ఆచార్య' శబ్దవాచ్యులు. శ్రీమద్వ్యాసములు భగవద్రామానుజులకు గురువైన యాచార్యపురుషులు కనుక—'విజయతే' అను శబ్దముచే వారికి నమస్కారమనియే పర్యవసితార్థము.

ఈవిధముగ నీ రెండు శ్లోకములలోను ఇష్టదేవతోపాసనము, ఆచార్యోపాసనము, స్వాభిమత సిద్ధాంత ప్రతిపాదన, పరమత నిరసనపురస్సరముగా నిర్దేశింపబడినది.

ఇప్పుడు స్వమతమును సంక్షేపముగ నిర్దేశించుచున్నారు.

## ॥స్వమతసంక్షేపము॥

**మూ॥ అశేష జగద్ధితానుశాసనశ్రుతినికరశిరసి, సమధిగతోఽయమర్థః। జీవ-పర-యాథాత్మ్యజ్ఞానపూర్వక, వర్ణాశ్రమ ధర్మేతి కర్తవ్యతాక, పరమపురుషచరణయుగలధ్యానా-ర్చన ప్రణామాదిః అత్యర్థప్రియః తత్ప్రాప్తిఫలః।**

అనువాదము:– సమస్తలోకములకు హితమును శాసించునట్టి వేదాన్తవాక్యరూపములైన యుపనిషత్తులందు, ఈవిషయము తెలియుచున్నది. జీవుడు—పరుడు—ఈ ఇరువురియొక్క యథార్థస్వరూపము నెరుగుటద్వారా, వర్ణధర్మములు—ఆశ్రమధర్మములును అంగములుగా గలిగిన, పరమపురుషుడగు శ్రీమన్నారాయణుని పాదద్వంద్వమును

ధ్యానించుట, అర్చించుట, నమస్కరించుట మున్నగునది అత్యంత ప్రేమాస్పదమై—భగవత్ప్రాప్తియే ఫలముగా కలిగియున్నది.

వివరణము:— 'తత్ప్రాప్తిఫలః' అను శబ్దమునకు తత్ప్రాప్తిః ఫలం యస్యసః = భగవత్ప్రాప్తియే ఫలముగా కలదని యర్థము. భగవత్ప్రాప్తి -ఫలమని పర్యవసితార్థము. ఇది దేనికి ఫలము? అన్నప్పుడు 'పరమ పురుష చరణయుగల ధ్యానార్చనాదిః' అనునది విధేయముగా విశేష్యమైయున్నది. పరమపురుషుడనగా పురుషోత్తముడు. అనగా పరమాత్మయగు శ్రీమన్నారాయణుడు. 'ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః' అని కదా గీతావచనము. అక్కడ పురుషోత్తముడు వాసుదేవ శబ్దవాచ్యుడగు శ్రీమన్నారాయణుడే. అట్టి భగవానుని పాదద్వంద్వము ను ధ్యానించుట, ఆరాధించుట, నమస్కరించుట యనునదే భగవత్ప్రాప్తికుపాయము. ఇంతకంటె ఇతరములైన యుపాయములెవ్వియు భగవానునకు ప్రీతికరములు కావని తెల్పుటకే—'అత్యర్థప్రియః' అని విశేషణము. అత్యన్త ప్రేమాస్పదమని తాత్పర్యము. 'అర్చనాదిః' అనుచోట ఆదిశబ్దముచే సంకీర్తనాదులుకూడ గ్రహింపదగియున్నవి. ధ్యానమనునది—మనస్సునకు, నామసంకీర్తనము—వాక్కునకు, అర్చనాదికము—శరీరమునకు సంబంధించిన క్రియలు— అనగా మనోవాక్కాయకర్మములతో భగవదుపాసనమొనర్పవలయునని తాత్పర్యము.

'సతతం కీర్తయంతోమామ్' అనియు,

'స్మరణం కీర్తనం విష్ణోః శ్రవణం పాదసేవనమ్।

అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్॥' అనియు చెప్పబడిన యుపాసనా ప్రక్రియలలో ధ్యానము ప్రధానతమము. ఈ ధ్యానముయొక్క పరవిపాకదశయే పరభక్తియని వ్యవహరింపబడును. ఇట్టి యుపాసనమువలన ఉపేయమైన భగవత్తత్త్వమునకు విరోధియైన చిత్తసంస్కారము నశించును. అప్పుడా మనస్సు అనన్యభావనతో భగవానుని చరణద్వంద్వమునే యాశ్రయించును. అప్పుడే తత్ప్రాప్తిరూప

మగు ఫలము లభించుట. ఇట్టి ధ్యానార్చనాదికమునకు వర్ణాశ్రమధర్మములు అంగములు. దీనినిబట్టి భగవదుపాసనాంగములుకాని కేవల వర్ణాశ్రమాచారములు భస్మ హవనతుల్యములేనని ఎరుగవలయును. కనుకనే శ్రీ కులశేఖరులు ముకుందమాలలో—

ఆమ్నాయాభ్యసనాన్యరణ్యరుదితం, వేదవ్రతాన్యన్వహం
మేదశ్ఛేదఫలాని, పూర్తవిధయః సర్వే హుతం భస్మని।
తీర్థానామవగాహనానిచ గజస్నానం, వినాయత్పద-
ద్వంద్వాంభోరుహ సంస్మృతిం విజయతే దేవస్సనారాయణః॥

శ్రీమన్నారాయణచరణయుగళకమల సంస్మరణ విదూరములైన-లౌకికవైదికకర్మజాతములు నిష్ఫలములని చెప్పినారు. కనుక వర్ణాశ్రమ ధర్మములన్నియు పరమపురుషచరణయుగల ధ్యానార్చనాద్యుపాసనమున కంగములగునని చెప్పుటకే 'వర్ణాశ్రమధర్మేతి కర్తవ్యతాక' అని విశేషణము. ఇతికర్తవ్యతా శబ్దమునకు అంగములనియర్థము. దీనికి ముందు కావలసినది జీవుడననేమో, పరుడననేమో, యథార్థముగ తెలిసికొనుట. జీవ స్వరూపమును, పర స్వరూపమును యథార్థముగ తెలియలేనివాడు దేహాత్మతాదాత్మ్యబుద్ధితోడనే ప్రవర్తించును. కావున మొదట జీవస్వరూపమేమో—స్వభావమేమో, అట్లే పరమాత్మయొక్క స్వరూప స్వభావములేమో యెరుగవలయును. దీనినిబట్టి పర్యవసించిన యర్థమేమనగా—

ఎవ్వడు, జీవాత్మపరమాత్మలయొక్క యథార్థస్వరూపమునెరిగి, వర్ణాశ్రమధర్మములను, భగవత్పాదార్చనము, ధ్యానము, నమస్కారము మున్నగు నుపాసనమునకంగములుగాజేసి, యాచరించుచుండునో వానికి భగవత్ప్రాప్తి కలుగును అని.

ఇక్కడనీవిషయము విశేషముగ తెలియదగియున్నది. ప్రస్తుత గ్రంథముచే—జీవపర యథార్థస్వరూప పరిజ్ఞానపురస్సరముగ—వర్ణా

శ్రీమద్ధర్మ నిర్వహణమంగముగాగల భగవదుపాసనాత్మకమైన భక్తియే భగవత్ప్రాప్తికి ఉపాయమని స్ఫురించుచున్నది. కాని భగవద్రామా నుజుల గీతాచరమశ్లోకభాష్యమునుబట్టియు, శరణాగతిగద్యమునుబట్టియు ప్రపత్తి లేక శరణాగతియే మోక్షప్రాప్త్యుపాయమని సిద్ధించుచున్నదని పెద్దలు చెప్పుదురు. దీనినిబట్టి ప్రాప్త్యుపాయము 'భగవానుడేతప్ప భక్తి కాదు. అనగా ప్రాప్యుడు (ఉపేయము) ప్రాపకము (ఉపాయము) భగ వానుడేనని తాత్పర్యము. ఈ విధముగ భగవానునే ప్రాపకముగ నిశ్చ యించి శరణుజొచ్చుట ప్రపత్తి. దీని విశిష్టతను శ్రీవచన భూషణము మున్నగు సాంప్రదాయగ్రంథములు ప్రతిపాదించుచున్నవి. ఈ ప్రపత్తి శ్రుతిపురాణాది సమ్మతమే. 'ముముక్షుర్వైశరణమహం ప్రపద్యే' అను శ్వేతా శ్వతరవచనము, 'తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః' అను తైత్తిరీయవచనము, 'ప్రపత్తింసర్వఫలదాం సర్వోపాయానపేక్షిణీమ్' ఇత్యాది సనత్కుమారసంహితావచనము, ఇట్టివేయగుననేక వచనములు ప్రమాణములు. ఈ ప్రపత్తికి దేశకాలవ్యవస్థగాని, అధికారతారతమ్యము కాని లేదు. ఇది సందర్భోచితముగ ముందు వివరింపబడగలదు.

పూర్వోక్త భగవద్రామానుజ గ్రంథమును ఈ క్రింది విష్ణుపురాణ వచనములు ప్రమాణించు చున్నవి.

'వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరఃపుమాన్।
విష్ణురారాధ్యతే నాన్యఃపంథాః తత్తోషకారకః॥'

'వర్ణాశ్రమాచార సంపన్నుడగు పురుషునిచే పురుషోత్తముడగు విష్ణువు ఆరాధింపబడుచున్నాడు. ఇంతకంటె తత్తోషకరమగు వేరు మార్గములేదు.' అని దీని తాత్పర్యము.

## ॥వేదాన్తవాక్య ప్రయోజనము॥

మూ॥ అస్య జీవాత్మనోఽనాద్యవిద్యా సంచితపుణ్యపాపరూప

కర్మప్రవాహ హేతుక - బ్రహ్మాది సురనరతిర్యక్స్థావ-రాత్మక చతుర్విధ దేహప్రవేశకృత-తత్తదాత్మాభిమాన జనితావర్జనీయ భవభయవిధ్వంసనాయ, దేహాతిరిక్తాత్మస్వరూప–తత్స్వభావ–తదన్తర్యామి పరమాత్మ స్వరూప-తత్స్వభావ-తదుపాసన-తత్ఫలభూతాత్మస్వరూపావిర్భావ పూర్వకానవధికాతిశయానంద బ్రహ్మానుభవజ్ఞాపనే ప్రవృత్తం హి వేదాన్తవాక్యజాతమ్—

"తత్త్వమసి"; "అయమాత్మాబ్రహ్మ:" "య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మా నవేద యస్యాత్మా శరీరం, య ఆత్మానమన్తరో యమయతి సతే ఆత్మా అంతర్యామ్యమృతః"; "ఏషసర్వభూతాంతరాత్మా అప-హతపాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః"; "తమేవం వేదానువచనేన బ్రాహ్మణావివిదిషన్తి యజ్ఞేన, దానేన, తపసాఽనాశకేన"; "బ్రహ్మవిదాప్నోతి పరమ్"; "తమేవం విద్వానమృత ఇహభవతి, నాన్యః పంథా అయనాయ విద్యతే" ఇత్యాదికమ్.

అనువాదము:- ఈ జీవాత్మ అనాదియగు అవిద్యచే పుణ్యపాప రూపమగు కర్మపరంపరను ప్రోగుచేసికొనుచున్నాడు. దీనివలన బ్రహ్మ మొదలు దేవతలు, నరులు, పశుపక్ష్యాదులు, పర్వతము మున్నగు నాలుగు విధములగు దేహములలో ప్రవేశించుచున్నాడు. ఇట్లు ప్రవేశించుటవలన అయాయి దేహములే ఆత్మలను అభిమానముకలిగి, దానిచే పరిహరింప శక్యముగాని సంసారభయమును పొందుచున్నాడు. ఇట్టి సంసారభయమును పోగొట్టుకొనుటకై – దేహముకంటె వేరైన ఆత్మయొక్క స్వరూపము, దాని స్వభావము ఆ జీవాత్మయందు అంతర్యామిగా (లోనుండి నియమించువానిగా) నున్న పరమాత్మయొక్క స్వరూపము, స్వభావము, ఆ భగవానుని యుపాసనము, దానికి ఫలమైన, ఆత్మస్వరూపమావిర్భవిం

చుటద్వారా నిరవధికమగు అతిశయముతోకూడిన ఆనందస్వరూపమగు బ్రహ్మమునొక్క అనుభవమును—తెలియజేయుటయందు వేదాన్త వాక్యములు ప్రవర్తించుచున్నవి. (అవియేవన) 'తత్త్వమసి' మున్నగునవి.

వివరణము:- ఇక్కడ జీవాత్మకు—అవిద్యాసంబంధము—అవిద్య వలన పుణ్యపాపకర్మాచరణము—దీనిని నిమిత్తముగాజేసికొని దేవతలు, నరులు, పశుపక్ష్యాదులు, పర్వతాదులు అను నాలుగువిధములైన దేహములలో ప్రవేశము—దేహప్రవేశము వలన దేహమే యాత్మయను అభిమానము—దానివలన—అపరిహార్యమైన (తొలగించుకొన నలవికాని) సంసారభయము—అను నీ క్రమము అనుభవసిద్ధమైయున్నది.

'అస్య జీవాత్మనః' 'ఈ జీవాత్మకు' అనుటచే పరమాత్మకంటె భిన్నమైన స్వరూపస్వభావములు కలవాడు జీవాత్మయని చెప్పబడుచున్నది. కనుక 'అవిద్యా' సంబంధము జీవునకేకాని పరమాత్మకు కాదని స్పష్టము. అవిద్యయనగా ఆత్మకానిదానియందు ఆత్మయను బుద్ధియే. అట్లే తనది కానిదానియందు తనది అను బుద్ధికూడ అవిద్యయే. విష్ణుపురాణమిట్లునుడువుచున్నది.

'శ్రూయతాంచాప్య విద్యాయాః స్వరూపం కురునందన।
అనాత్మన్యాత్మబుద్ధి ర్యా, అస్వే స్వమితియామతిః॥'

(వి. పు. 6-8-10)

దీనివలననే (అవిద్య వలననే) కర్మము ప్రోగుచేసికొనబడుచున్నది. ఈ కర్మము పుణ్యరూపము—పాపరూపమునని ద్వివిధము.

దీనినే విష్ణుపురాణము—

'కర్మవశ్యాగుణా హ్యేతే సత్త్వాద్యాః పృథివీపతే।
అవిద్యాసంచితం కర్మ తచ్చాశేషేషు జంతుషు॥'

(వి. పు. 2-13-70)

ఇత్యాదిగ కర్మపరంపర—అవిద్యవలన నేర్పడుచున్నదని తెలుపుచున్నది. మరి, పాపము—అవిద్యామూలము కనుక దేహమందు ఆత్మాభిమానముకల జీవుడు దానినాచరించుట సహజము. కాని పుణ్యము అవిద్యామూల మెట్లగును? అన్నచో ఇది సమాధానము. ఈ ఆత్మ భగవానునకు 'శేష'మైయున్నది. కనుక దానికి స్వతంత్రమైన ఆత్మజ్ఞానముకూడ అవిద్యయే. దానివలన (స్వతంత్రమైన యాత్మజ్ఞానము వలన) జీవుడు పుణ్యకర్మములైన యజ్ఞాదుల నాచరించి స్వర్గాదులను—దేవతాదేహాదుల పొందుచున్నాడు. కనుక పుణ్యముకూడ అవిద్యామూలమగు కర్మమే. జడముకాని యాత్మయందు జడత్వాదుల నారోపించుకొనుట ఎట్లవిద్యయో, అట్లే స్వతంత్రముకాని యాత్మయందు స్వతంత్రతను, కర్తృత్వాదుల నారోపించుకొనుటయు అవిద్యయే. ఈ అవిద్య—దీనివలన పుణ్యపాప కర్మాచరణము—అనాదిగా ప్రవాహరూపముగ ఎడతెగక కలుగుచున్నది. అవిద్యచే—కర్మాచరణము—కర్మాచరణము వలన—దేహప్రవేశము—దేహసంబంధముచే దేహమందాత్మబుద్ధిరూపమైన అవిద్య—మరల కర్మాచరణము—దేహప్రవేశము—ఈ విధముగనీ ప్రవాహము అవిచ్ఛిన్నముగ సాగుచునేయున్నది. కనుక ఈ అవిద్యా—కర్మ—దేహప్రవేశరూపమైన ప్రవాహము అవర్జనీయము. విడిపించుకొందమన్నను అలవి కానిది. దీనినే భవభయమందురు. 'అవర్జనీయము' అనుటచే—ఈ జన్మజరామరణాది భయము—మిథ్యయుని, వేయిసార్లు ఎలుగెత్తి చాటినను ఇదిపోదని తేలుచున్నది. కనుక దీనిని నశింపజేసికొనుటకేమి యుపాయమను ప్రశ్నమునకు సమాధానము—'దేహాతిరిక్తాత్మస్వరూప' అనియారంభించి 'ప్రవృత్తంహి వేదాన్తవాక్యజాతమ్' ఇత్యాది గ్రంథముచే నిర్దేశింపబడినది. ఈ వాక్యమున 'బ్రహ్మానుభవమే' భవభయ విధ్వంసన హేతువని చెప్పబడినది. ఈ బ్రహ్మానుభవము—'అనవధికాతిశయానంద'మే స్వరూపముగా కలది. అనగా అపరిమితమైన యతిశయము (వైభవము)తో కూడిన యానందమే బ్రహ్మానుభవ స్వరూపమని భావము. ఇది ఎప్పుడు కల్గును? 'ఆత్మ

స్వరూపావిర్భావ'మైనప్పుడు. అనగా ఆత్మకుగల దేహాది వ్యతిరిక్తత్వము, పరమాత్మకు పరతంత్రమైయుండుట అను స్వరూపము ఏర్పడినప్పుడని తాత్పర్యము. ఇట్టి ఆత్మస్వరూప మావిర్భవించుట ఎట్లు? పరమాత్మయొక్క ఉపాసనముచేతనే. అనగా పరమాత్మయొక్క ఉపాసనమునకు ఫలమే ఆత్మస్వరూపావిర్భావము, తత్పూర్వకముగా బ్రహ్మానుభవము. పరమాత్మయొక్క ఉపాసనమెప్పుడు కల్గును? దేహముకంటె వేరుగ నాత్మ కలదని దాని స్వరూపము, స్వభావము తెలిసికొనుటయు, ఇట్టి జీవాత్మకు లోపలనుండి నియమించుచు పరమాత్మ కలడనియు, ఆయన స్వరూపము, స్వభావము ఇట్టిది అని తెలిసినప్పుడే. దీనివలన పర్యవసించిన దేమనగా—ముందుగ దేహముకంటె వేరుగా జీవాత్మకలదని ఎరుగవలయును. దాని 'స్వరూపము' జ్ఞానానందములేననియు, భగవంతునకు శేషమై (పరతంత్రమై) యుండుటే దాని 'స్వభావ'మనియు తెలిసికొనవలయును. ఎప్పుడు తాను పరతంత్రుడనని యెరిగినాడో—తనను నియమించునట్టి సర్వస్వతంత్రుడైన పరమాత్మయెట్టివాడు? ఆయన స్వరూపస్వభావములెట్టివి? అని తెలిసికొనగోరును. ఆయన (పరమాత్మ) అంతర్యామియనియు అనగా తనలోనుండి నియమించువాడనియు, నియామకత్వము లేదా ఈశ్వరత్వము ఆయనయొక్క స్వరూపమనియు, ప్రణతులైనవారికి సులభుడగుట స్వభావమనియు తెలిసికొనును. ఈ విషయమునంతటిని అనగా దేహాతిరిక్తాత్మ స్వరూపస్వభావములను, అంతర్యామియైన పరమాత్మయొక్క స్వరూపస్వభావములను, పరమాత్మోపాసనమును, దానికి ఫలమైన బ్రహ్మానుభవమును, దాని స్వరూపమును నిష్కర్షించునవి వేదాన్తవాక్యములే. కనుక వేదాన్తవాక్య పర్యాలోచనము అత్యావశ్యకమని సూచింపబడుచున్నది. మరి యావేదాన్తవాక్యములేవి? అను ప్రశ్నమును సమాధానించుటకై—

'తత్త్వమసి' అని యారంభించి వేదాన్తవాక్యములు నిర్దేశింపబడినవి. ఇది వీటి సామాన్యాభిప్రాయము.

1. 'తత్త్వమసి' (ఛాం. 6-9-4) త్వమ్ = నీవు, తత్ = బ్రహ్మాత్మకుడవు, అసి = అయివున్నావు. శాస్త్రకారులచే చెప్పబడు షడ్విధ తాత్పర్య లింగములు కలది కనుక ఈ వాక్యము ముందు నిర్దేశింపబడినది. (షడ్విధతాత్పర్య లింగములననేమో ముందు నిరూపింపబడగలదు.) ఇది జీవవిశేషమగు శ్వేతకేతువునకు బ్రహ్మాత్మకత్వమును ప్రతిపాదించుచున్నది.

2. 'అయమాత్మా బ్రహ్మ' (బృహ. 6-4-5)

అయమ్ = ఈ, ఆత్మా = జీవుడు, బ్రహ్మ = బ్రహ్మాత్మకుడు

ఈ వాక్యము జీవులందరకు బ్రహ్మాత్మకత్వమును ప్రతిపాదించుచున్నది.

3. య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరోయమాత్మాన వేద
యస్యాత్మా శరీరం య ఆత్మానం యమయతి సతఆత్మా
అంతర్యామ్యమృతః। (బృహ. 5-7-7.)

యః = ఏ పరమాత్మ; ఆత్మని = జీవునియందు; తిష్ఠన్ = అధిష్ఠాతగ ఉన్నవాడై; ఆత్మనః = జీవాత్మకు; అంతరః = లోపలనంతర్యామిగ నున్నాడో; యం = ఏ పరమాత్మను (అంతర్యామిగ తనలోనున్నవానిని); ఆత్మా = జీవాత్మ; న వేద = తెలిసికొనుచుండుటలేదో; యస్య = ఏ పరమాత్మకు; ఆత్మా = జీవాత్మ; శరీరమ్ = దేహమైయున్నాడో (పరమాత్మకు జీవాత్మ శరీరమని యభిప్రాయము); యః = ఏ పరమాత్మ; ఆత్మానం = జీవాత్మను; అంతరః = లోనుండి; యమయతి = నియమించుచున్నాడో; సః = ఆ పరమాత్మయే; తే = నీకు (జీవునకు); అంతర్యామీ = అంతర్యామిస్వరూపుడు; అమృతః = నాశరహితమైన శాశ్వతస్వభావము కలవాడు.

పరమాత్మ, తానంతర్యామిగ జీవునియందుండి నియమించు చున్నను, జీవుడు తెలియజాలకున్నాడనియు, జీవుడు-అంతర్యామియు అమృతస్వభావుడైన పరమాత్మకు శరీరమనియు ఈ మంత్ర తాత్ప ర్యము. ఈ శ్రుతి, జీవాత్మ పరమాత్మలకుగల సంబంధమును బోధించు 'ఘటక' శ్రుతి.

4. ఏషసర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకో నారాయణః (సుబాల. 7)

ఏషః = ఈ; సర్వభూతాంతరాత్మా = సర్వభూతములకు లోపల ఆత్మగానున్న భగవానుడు; అపహతపాప్మా = పాపాది దోషసంబంధ మెంతమాత్రము లేనివాడును; దివ్యః = పరమవ్యోమమని పిలువబడు శ్రీవైకుంఠమునధివసించిన వాడును; దేవః = నిత్యప్రకాశశీలుడును; (అయిన) ఏకః = ఒక్క; నారాయణః = నారాయణుడే.

సర్వభూతములయందంతర్యామిగానున్న పరమాత్మ, సమస్త కల్యాణగుణోపేతుడును, నిరస్త సమస్త దోషుడును, శ్రీవైకుంఠుడును, పరం జ్యోతియునగు శ్రీమన్నారాయణుడొక్కడే.

ఈ శ్రుతి, ఉపాస్యమగు దేవతావిశేషమును నిర్ణయించునది.

5. తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి, యజ్ఞేన, దానేన, తపసాఽనాశకేన. (బృ. 4-4)

తం = ఈ, ఏతమ్ = పరమాత్మను; వేదానువచనేన = వేదవాక్య ముల యధ్యయనముచేతను; యజ్ఞేన = యాగాది కర్మానుష్ఠానముచేతను; దానేన = త్యాగముచేతను; అనాశకేన = ఫలాభిసంధిరహితమగు; తపసా = తపస్సుచేతను; బ్రాహ్మణాః = బ్రహ్మజ్ఞానసంపన్నులు; వివిదిషన్తి = ప్రీతి పూర్వకముగ నుపాసించుచున్నారు. 'అనాశకేన' అను శబ్దమునకు ద్వివిధములైన యర్థములు చెప్పబడుచున్నవి. ఆశః = అశనము (తినుట) అదిలేనిది-అనాశకము-ఉపవాసమనియర్థము. ఆశః = ఫలాభిసంధి, అది

లేనిది అనాశకము, ఫలాభిసంధిరహితమని మరియొక అర్థము.

ఈ పరమాత్మను, అనేక ప్రకారములుగా నుపాసించుచున్నారు. కొందరు వేదాధ్యయనముచేతను, మరికొందరు యజ్ఞాదినిర్వహణము చేతను, మరికొందరు దానముచేతను, కొందరు ఫలాభిసంధిరహితమైన తపస్సుచేతను ఉపాసించుచున్నారని తాత్పర్యము. ఈ వాక్యము— వర్ణధర్మములు, ఆశ్రమధర్మములు ఉపాసననునకు అంగములని బోధించునది.

6. బ్రహ్మవిదాప్నోతిపరమ్. (తై. ఆనంద.7)

బ్రహ్మవిత్ = పరమపురుషుడైన శ్రీమన్నారాయణుని ఉపాసించువాడు, పరం = పరమప్రాప్యుడగు పరమాత్మనే; ఆప్నోతి = పొందుచున్నాడు.

బ్రహ్మమునుపాసించువారు అపరబ్రహ్మమునే పొందుదురు.

'యాన్తి మద్యాజినోఽపిమామ్' నన్ను ఉపాసించినవారు నన్నే పొందుదురనికదా గీతావచనము. ఇది ఉపాసనము ఉపాయమని నిర్ణయించు శ్రుతి.

7. తమేవం విద్వానమృత ఇహభవతి నాన్యః పంథా అయనాయ విద్యతే (పురుషసూక్తము.)

తం = ఆ పరమాత్మను; ఏవం = ఈ ప్రకారముగా; విద్వాన్ = ఉపాసించినవాడు, ఇహ = ఇక్కడనే, అమృతః భవతి = అమృతత్వమును పొందును. అనగా జననమరణప్రవాహరూపమగు సంసారభయమును నశింపజేసికొనునని తాత్పర్యము.

అయనాయ = అట్టి పరమాత్మను పొందుటకు; అన్యః = ఇతరమైన; పంథాః = మార్గము; న = లేదు;

భగవత్ప్రాప్తికి శరణాగతిపూర్వకమగు నుపాసనముతప్ప వేరు ఉపాయములేదని భావము. ఈ శ్రుతి ఉపాయాంతరముల నిషేధించునది.

ఈ పై నిబేర్కొనిన శ్రుతివచనములు—జీవపరయాథాత్మ్యజ్ఞాన పూర్వకముగ భగవత్ప్రాప్త్యుపాయము నెరిగించి భవభయమును పోగ్రోలునని సంపిండితార్థము. ఇక్కడ నీవిషయముకూడ గుర్తింపవలయును. శ్రీవైష్ణవ సాంప్రదాయమున, ప్రతి ఒక్కనికి, అర్థపంచక జ్ఞానమవసరమని చెప్పబడినది.

1. స్వస్వరూప 2. పరస్వరూప 3. విరోధిస్వరూప 4. ఉపాయ స్వరూప 5. పురుషార్థస్వరూపములు అర్థపంచకమని యందురు.

'దేహాతిరిక్తాత్మస్వరూపతత్స్వభావ' అను మాటచే 'స్వస్వరూపము' యొక్కయు (తానన గానేమో తెలిసికొనుట)

'తదంతర్యామి పరమాత్మస్వరూపతత్స్వభావ' అను మాటచే 'పర స్వరూపము' యొక్కయు, (పరమాత్మయననేమో యెరుగుట);

'అనాద్యవిద్యాసంచిత' అని యారంభించి 'భవభయ' వరకు 'విరోధిస్వరూపము' యొక్కయు, (తనకు పరమాత్మప్రాప్తి కలుగనీయక ప్రతిబంధమైనదేమో ఎరుగుట);

'తదుపాసన' అనుమాటచే 'ఉపాయస్వరూపము' యొక్కయు (భగవానుని పొందుటకుపాయమూ భగవానుడేనని యెరుగుట);

'ఆత్మస్వరూపావిర్భావపూర్వకానవధికాతిశయానంద బ్రహ్మానుభవ' అను మాటచే 'పురుషార్థస్వరూపము' యొక్కయు (భగవత్ప్రాప్తియే పరమపురుషార్థమని యెరుగుట); స్వరూపములు పరామర్శింపబడినవని యెరుగవలయును.

## ॥ జీవాత్మ స్వరూపము ॥

మూలము॥ జీవాత్మస్వరూపమ్. దేవమనుష్యాది ప్రకృతిపరిణామ విశేషరూపనానావిధభేదరహితమ్, జ్ఞానానందైకగుణమ్.

**తస్య ఏతస్య కర్మకృతదేవాదిభేదే అపధ్వస్తే, స్వరూప భేదో వాచామగోచరః, స్వసంవేద్యః, 'జ్ఞాన-స్వరూపమ్'-ఇత్యేతావదేవ నిర్దేశ్యమ్. తచ్చ సర్వేషామాత్మనాం సమానమ్.**

అనువాదము:-ఇక జీవాత్మస్వరూపమేమన, దేవతలు, మనుష్యులు, మున్నగు ప్రకృతి పరిణామమువలన కల్గిన వివిధశరీరభేదములు లేక, జ్ఞానము, ఆనందము, అనునవియే గుణములుగా కలిగియుండుట. అట్టి ఈ జీవాత్మలకు కర్మసంబంధముచే నేర్పడిన వివిధశరీరభేదము నశించగా, చివరకు మిగిలిన వాస్తవముగుభేదము, మాటలతో చెప్పనలవి కానిది. కేవలము స్వానుభవముచే తెలియదగినది. 'జ్ఞానస్వరూపము' అని మాత్రమే పేర్కొనదగినది. ఈ స్వరూపము జీవాత్మలన్నింటికిని సమానమే.

వివరణము: ముందు జీవాత్మయొక్క స్వరూపము నిరూపింపబడుచున్నది. జీవాత్మకు ప్రకృతిసంసర్గమూలముగ దేవనరతిర్యగాది వివిధ దేహసంబంధమేర్పడుచున్నదికాని, స్వరూపతః ఎట్టి పరిణామము లేదు. కావుననే, పుంస్త్వము, దేవత్వము, నరత్వము, పశుత్వము, వృక్షత్వము, మున్నగు శరీరభేదములు, ఆకారభేదములు కర్మమువలన ప్రకృతి సంబంధముచే నేర్పడిన పరిణామమే. ఈ విషయమునే భగవద్రామానుజులు 'అనాద్యవిద్యాసంచిత' ఇత్యాది వాక్యమున పేర్కొనినారు. శ్రీవిష్ణుపురాణముకూడ-

> 'తథాత్మా ప్రకృతౌ సంగాదహమ్మానాది దూషితః।
> భజతే ప్రాకృతాన్ధర్మాన్ అన్యస్తేభ్యోహిసోఽవ్యయః॥'
>
> (వి.పు. 6-7-24)

'అట్లే ఆత్మ, ప్రకృతిసంసర్గముచే 'నేనునాది' అను అభిమానముచే దూషితమై ప్రకృతిసంబంధములగు ధర్మములను పొందుచున్నది. వీటి

కంటె భిన్నుడు, నిత్యుడునైనవాడు జీవుడు' అనియు,

పుమాంస్త్రీగౌరజోవాజీ కుంజరో విహగస్తరుః।
దేహేషులోకసంజ్ఞేయం విజ్ఞేయాకర్మహేతుషు॥'

'పురుషుడు, స్త్రీ, గోవు, మేక, గుఱ్ఱము, ఏనుగు, పక్షి, చెట్టు మున్నగు కర్మమునుబట్టి యేర్పడిన దేహములయందు లోకవ్యవహారమే తప్ప వేరుకాదు' అనియు,

'పుమాన్నదేవో, ననరః, నపశుర్నచ పాదపః।
శరీరాకృతిభేదాస్తు భూపైతేకర్మయోనయః॥' (వి.పు. 2-13-98)

'జీవుడు వాస్తవమునకు దేవత, నరుడు, పశువు, వృక్షము ఇవియే వియు కాడు. ఓ రాజా! ఈ శరీరభేదములన్నియు కేవలము కర్మముల వలన కలుగుచున్నవి' అనియు తెలుపుచున్నది. కావున ప్రకృతి సంబంధముచేనేర్పడు వివిధదేహములేవియు లేనిది ఆత్మ. మరియు దీనికి జ్ఞానానందములే గుణములు. కనుక అజ్ఞానము మున్నగు దోషములు ప్రకృతికి సంబంధించినవేకాని ఆత్మకు సంబంధించినవికావు. ఈ విషయమే విష్ణుపురాణమున—

'నిర్వాణమయ ఏవాయమాత్మా జ్ఞానమయోఽమలః।
దుఃఖాజ్ఞానమలాధర్మాః ప్రాకృతాస్తే నచాత్మనః॥' (వి.పు.6-7-22)

'జ్ఞానానందమయుడై నిర్మలస్వభావుడైన యీజీవునకు దుఃఖము, అజ్ఞానమమున్నగు ధర్మములు ప్రకృతిసంబంధముచే నేర్పడినవేకాని, ఆత్మకు సహజములు కావు.' అనికూడ చెప్పబడినది.

ఈవిధముగ కర్మములవలన కల్గిన వివిధదేహములలో ప్రవేశించుచున్న, జ్ఞానానందాది గుణములుకల జీవులకు, కర్మమూలకములగు దేవ మనుష్యాదిదేహ భేదములు నశించగా, స్వరూపభేదము అనగా జీవులకు కల పరస్పరభేదము, వాక్కులచే చెప్పనలవికానిదియు, స్వసంవేద్యము,

అనగా తాను తనంతగ తెలియదగినదని భావము.

ఈవిషయమును కూడ విష్ణుపురాణమిట్లు స్పష్టపరచుచున్నది.

'ఏకస్వరూపభేదోహి బాహ్యకర్మావృతిప్రజః।
దేవాది భేదేఽపధ్వస్తే నాస్త్యేవావరణోహిసః॥' (వి. పు. 2-4-33)

జ్ఞానానందైకస్వరూపుడగు జీవాత్మకు, బుద్ధిసుఖము మున్నగు అంతరభేదము (అంతర్గతభేదము) సంసారకారణమగు కర్మమువలన కల్గిన వివిధదేహములనెడి యావరణములకు హేతువగుచున్నది. అనగా శరీరములనెడి యావరణములు (పైనికప్పియుండెడి ముసుగుల వంటివి) వాస్తవమునకు సమానస్వరూపస్వభావములుకల జీవాత్మలకు భేదమును కల్గించుచున్నవి. ఈ శరీరావరణములు నశించగనే ఆత్మలకు పైనికనుపించుచున్న భేదములు తొలగిపోవును. మరి, అప్పుడు జీవులందరు ఒక్కటిగా తాదాత్మ్యమును చెందుదురా? లేక—అప్పుడుకూడ జీవులకు పరస్పరభేదముండునా? అను ప్రశ్నమును సమాధానించుటకే—'స్వరూపభేదోవాచామగోచరః స్వసంవేద్యః' అని భగవద్రామానుజులు చెప్పినారు. ఆ దశలోను (దేహాదులు అపధ్వస్తములైనదశలోను) జీవులకు (ఆత్మలకు) పరస్పరభేదమున్నది. కాని అదిమాటలతో చెప్పనలవి కానిది. తానుమాత్రమే తెలిసికొనదగినది. మరి, ఆదశలో జీవులకెట్టి వ్యవహారమున్నది? అన్నచో—'జ్ఞానస్వరూపమ్' 'జ్ఞానమేస్వరూపముగను, గుణముగను, కలవాడు' అని జీవులందరియందు సమానాకారమగు వ్యవహారము కలదు. కనుక జ్ఞానస్వరూపత్వమునుబట్టి జీవులందరుసమానులేనని తాత్పర్యము.

'జీవాత్మస్వరూపమ్' అనియారంభించి—'తచ్చసర్వేషాం సమానమ్' అనునంతవరకు పేర్కొనబడిన జీవస్వరూపమునుబట్టి అద్వైతసిద్ధాంతమునకు—రామానుజసిద్ధాంతమునకు జీవస్వరూప నిర్వచనమునగల భేదము స్పష్టముగతెలియదగును. అద్వైతమున జీవబ్రహ్మ

ములకు వాస్తవముగా తాదాత్మ్యమే. అనగా బ్రహ్మముకంటెవేరైన జీవతత్త్వమేదియులేదు. కావున ఆత్మయనగా బ్రహ్మమే. నిత్యము, శుద్ధము, బుద్ధము, ముక్తము, నిర్గుణము, జ్ఞానానందస్వరూపమునైన బ్రహ్మము, అనాద్యవిద్యయొక్కసంబంధముచే జీవాదిభేదములతో భాసించుచు, సంసారచక్రమున తగిలియున్నది. ఇదితొలగగనే బ్రహ్మస్వరూపము అనిర్వచనీయమై భాసించును. ఈయభిప్రాయమునే ఈ క్రింది విష్ణుపురాణశ్లోకము స్పష్టపరచుచున్నది.

'ప్రత్యస్తమితభేదం యత్ సత్తామాత్రమగోచరమ్।
వచసామాత్మసంవేద్యం, తజ్జ్ఞానం బ్రహ్మసంజ్ఞితమ్॥' అని.

ఎట్టి భేదములు లేనిదై కేవలము 'సత్' అని మాత్రమే పిలువదగియుండి, వాక్కునకు గోచరముకాక (అనిర్వచనీయమై) ఆత్మమాత్రసంవేద్యమైన (తెలియదగిన) జ్ఞానమే బ్రహ్మమని వ్యవహరింపబడును.

ఇది విశిష్టాద్వైతసమ్మతముకాదు. పైని నిర్దేశింపబడిన భగవద్రామానుజగ్రంథమునుబట్టి—పరమాత్మతోపాటు జీవులకును, జీవులలోకూడ పరస్పరము భేదమే వాస్తవము. జీవులందరు జ్ఞానానందస్వరూపులును, జ్ఞానానందగుణములు కలవారును కావున సమానులే. కాని వారికి కర్మమని చెప్పబడు అవిద్యవలన ప్రకృతి సంబంధమేర్పడి, దేవమనుష్యాది వివిధదేహములయందు ప్రవేశముకలిగి—బాహ్యమగుభేదముకూడ స్పష్టమగుచున్నది. కాని యీ బాహ్యభేదము ప్రాకృతికదేహసంబంధము వలన కలిగినదికనుక, తన్మూలమైన కర్మసంబంధము నశింపగనే అదియును నశించును. ఈ బాహ్యభేదము నశించినప్పుడు జీవులందరు జ్ఞానానందస్వరూపులై, జ్ఞానానందాది గుణములు కలిగి సమానులుగనుందురేతప్ప వారికి వాస్తవమైన స్వరూపభేదము నశింపదు. కాని ఆ భేదము వాచామగోచరము, అనగా చెప్పనలవికానిది. కేవలస్వాత్మమాత్రసంవేద్యము. ఈ క్రింది శౌనకీయవచనముచే కూడ—

'కర్మిణాం కర్మభేదేన దేవభేదాదయో యతః।
కర్మక్షయాదశేషాణాం భేదానాం సంక్షయస్తతః॥'

కర్మవశ్యులైన జీవులకు కర్మభేదమునుబట్టి కల్గిన దేవమనుష్యాది బాహ్యభేదములన్నియు, కర్మక్షయముకాగానే నశించునని చెప్పబడినది. 'అశేషాణాం భేదానాం సంక్షయః' అనగా అన్నిభేదములు నశించునని యర్థము. ఈ వచనము బాహ్యభేదములన్నియు నశించునని చెప్పునే కాని, స్వభావసిద్ధమైన జీవభేదము నశించునని చెప్పదు. కనుక స్వభావ భేదముండితీరును. కాని వాగ్గోచరముకాదని పర్యవసితార్థము.

## ॥ పరమాత్మ స్వరూపము ॥

మూ॥ ఏవం విధ చిదచిదాత్మక ప్రపంచస్య ఉద్భవస్థితిప్రలయ సంసారనివర్తనైకహేతుభూతః, సమస్త హేయప్రత్యనీక-తయా అనన్త కల్యాణైకతానతయా చ, స్వేతర సమస్త వస్తువిలక్షణస్వరూపః, అనవధికాతిశయాసంఖ్యేయకల్యాణ గుణగణః, సర్వాత్మ-పరంజ్యోతిః-పరతత్త్వ-పరమాత్మ-సదాదిశబ్దభేదైః నిఖిలవేదాన్తవేద్యః, భగవాన్ నారాయణః పురుషోత్తమః ఇతి అంతర్యామిస్వరూపమ్. తస్యచ వైభవప్రతిపాదనపరాః శ్రుతయః స్వేతరసమస్తచిద చిద్వస్తుజాతాంతరాత్మతయా నిఖిలనియమనం తచ్ఛక్తి-తదంశ-తద్విభూతి-తద్రూప-తచ్ఛరీర-తత్తను-ప్రభృతిభిః శబ్దైః తత్సామానాధికరణ్యేన చ ప్రతిపాదయన్తి।

అనువాదము:- ఇట్టి చిత్ (జీవులు) అచిత్ (జడము) రూపమగు ప్రపంచముయొక్క పుట్టుక, ఉనికి, నాశనము అనువాటికిని, సంసారము యొక్క నివృత్తికిని (తొలగుటకును) తానే కారణమైనవాడును, నిఖిలము లైన హేయములగు (నింద్యములగు) గుణములు లేనివాడగుటచేతను,

అనంతమైన కల్యాణమునకు (శుభమునకు) (అనంతములైన కల్యాణ గుణములకును) ఆస్పదమైనవాడగుటచేతను, తనకంటె వేరుగానున్న నిఖిలజీవజడప్రపంచముకంటె విలక్షణమైన (భిన్నమైన) స్వరూపము కలవాడును, అపారమగు వైభవము (మహత్త్వము) కల లెక్కింపరాని కల్యాణగుణ సముదాయము కలవాడును, సర్వాత్మ, పరబ్రహ్మ, పరం జ్యోతి, పరతత్త్వము, పరమాత్మ, సత్ మొదలగు వివిధశబ్దములచే సమస్తోపనిషత్తులందును తెలియబడువాడును, 'భగవత్' శబ్దముచే ప్రతిపాదింపదగినవాడును అగు శ్రీమన్నారాయణుడే పురుషోత్తముడు-అని అంతర్యామియొక్క స్వరూపము.

అట్టి భగవంతుని వైభవమును (గొప్పతనమును) ప్రతిపాదించుటయందు ప్రవర్తించుచున్న శ్రుతులు (వేదములు) తనకంటె (పరమాత్మకంటె) భిన్నమైన చేతనాచేతనాత్మకమగు వస్తుసముదాయమును లోనుండి నియమించునంతరాత్మయగుటచే-ఆ పరమాత్మ సమస్తప్రపంచమును నియమించుచున్నాడనుటను, శక్తి, అంశము, విభూతి, రూపము, శరీరము, తనువు మున్నగుననేక శబ్దములచే 'సామానాధికరణ్యముఖమున' (విశేషణవిశేష్యభావముఖమున) ప్రతిపాదించుచున్నవి.

వివరణము:- ఈ సమస్త ప్రపంచము 'చిత్' (జ్ఞానస్వరూపులగు జీవులు); 'అచిత్' (జడమగు ప్రపంచము) అని ద్వివిధముగానున్నది. అట్టి జీవజడాత్మకమగు ప్రపంచముయొక్క పుట్టుకకు, స్థితికి, లయమునకు (నాశనమునకు) కారణమైనవాడు పరమాత్మ. 'జన్మాద్యస్యయతః' (1-1-2) అను బ్రహ్మసూత్ర శ్రీభాష్యమున భగవద్రామానుజులు నిఖిల ప్రపంచసృష్టిస్థితిలయములకు కారణము పరబ్రహ్మమేనని నిరూపించిరి.

'యతోవా ఇమాని భూతాని జాయన్తే, యేనజాతాని జీవన్తి, యత్ప్రయన్త్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ బ్రహ్మేతి' అను తైత్తిరీయోపనిషద్వచనము. 'దేనినుండి యీ సమస్తభూతములు పుట్టుచున్నవో, దేనిచే ఈ పుట్టినవి బ్రతుకుచున్నవో, తుదకు దేనిలో ప్రవేశించి లయమును

పొందుచున్నవో, అదియే పరబ్రహ్మమని యెరుగుము' అని, పరమాత్మ కు జగజ్జన్మస్థితిప్రలయహేతుత్వమును ప్రమాణించుచున్నది. శ్రీవిష్ణు పురాణము—

'సర్గస్థితివినాశానాం జగతో యో జగన్మయః।
మూలభూతో నమస్తస్మై విష్ణవే పరమాత్మనే॥' (వి.పు. 1-1-1)

ఇత్యాదిగ జగదంతర్యామియగు పరమాత్మయే జగత్సృష్టిస్థితి లయకారణమని నొడువుచున్నది. ఇట్లనుటచే, పరమాత్మకుగల జగత్ స్రష్టృత్వము (జగత్తు సృజించువాడగుట), ఈశ్వరత్వము (పరిపాలకు డగుట) మున్నగు ధర్మములు, అవిద్యాకల్పితములుకాని వాస్తవములు కావను వాదము నిరాకరింపబడుచున్నది.

అట్లే అనాదిసిద్ధమగు అవిద్యయను కర్మముయొక్క సంబంధ ముచే జీవులకు ప్రకృతిసంబంధము కలిగి, దానివలన ఏర్పడుచున్న జనన-మరణ-సుఖ-దుఃఖ-ప్రవాహరూపమగు సంసారమును నశింపజేయు టకుకూడ, ఆ పరమాత్మయే కారణమని చెప్పబడుచున్నది. కనుకనే—

'నాయమాత్మా ప్రవచనేన లభ్యః నమేధయా, బహుధావా శ్రుతేన।
యమేవైష వృణుతే తేన లభ్యః, తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్॥'

'ఈ పరమాత్మ ప్రవచనముచేతగాని (అధ్యాపనముచేతగాని), బుద్ధిచేతగాని, బహువిధశాస్త్రజ్ఞానముచేతగాని పొందబడడు. ఎవ్వడు ఇతరోపాయములవిడచి పరమాత్మనే యుపాయముగావరించునో, వానికే స్వస్వరూపము నాపరమాత్మ ఆవిష్కరించును' అని కఠోపనిషత్తు (2-23) చెప్పుచున్నది. అనగా అవిద్యామూలమగు సంసారమును నశింపజేసి స్వవిషయకదర్శనమును కల్గించువాడు పరమాత్మయేనని తాత్పర్యము. శ్రీగీతలో భగవానుడు—

'తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగంతం యేనమాముపయాన్తి తే॥
తేషామేవానుకంపార్థమహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥'

'నన్నే అనన్యభావముతో శరణుపొంది ప్రీతితోనుపాసించువారికి, నన్ను పొందుటకువలయు బుద్ధియోగమును నేనే అనుగ్రహింతును. వారి ననుగ్రహించుటకై వారియజ్ఞానతిమిరమును సుప్రకాశమగు జ్ఞానప్రదీప ముచే నశింపజేయుదు'నని చెప్పియున్నాడు.

దీనినిబట్టి పర్యవసించినదేమనగా పరమప్రాప్యుడగు భగవానుడు, తనను ఉపాయముగా వరించినవారికవిద్యామూలమైన కర్మబంధము-తన్మూలమగు దేహబంధము-దానివలన కలిగెడి సుఖదుఃఖములు-అనెడి సంసారమును తానే నశింపజేయును అని. యీ విషయమే మూలగ్రంథ మున-'సంసారనివర్తనైకహేతుభూతః' 'సంసారమును నివర్తింపజేయు టకు తానొక్కడే కారణమైనవాడు' అని చెప్పబడినది. ఈ విధముగా-'ఉద్భవస్థితిప్రలయ-సంసారనివర్తనైకహేతుభూతః' అను విశేషణముచే-జగత్కారణము, ముక్తిప్రదుడు భగవానుడేనని తెలియజేయబడినది.

ఇట్టి భగవానుడు సర్వవిధములాత్మకదోషములకు (అశుభములకు) విరుద్ధమైన స్వరూపముకలవాడును, సమస్తకల్యాణమునకు (మంగళము నకు) ఆస్పదమైనవాడుననని, 'సమస్తహేయప్రత్యనీకతయా' 'అనన్త కల్యాణైకతానతయాచ' అను రెండు పదములచే చెప్పబడినది. దీనివలన హేయగుణములు లేనివాడును, కల్యాణగుణములు కలవాడుననుటచే భగ వంతునకు సర్వవస్తువిలక్షణత్వమును ప్రతిపాదించు ఉభయలింగములు (రెండు విశేషచిహ్నములు) కలవని సూచింపబడుచున్నది. ప్రత్యనీక శబ్దమునకు విరుద్ధము అనియర్థము. 'ఏకతాన' శబ్దముచే 'ప్రచురము' అను అర్థము చెప్పబడుచున్నది. ఆనందాదులే కల్యాణగుణములు. ఈ మాటచే 'ఆనందమయోఽభ్యాసాత్' అను (బ్ర.సూ. 1-1-12) బ్రహ్మ

సూత్రముయొక్క తాత్పర్యము ఆవిష్కరింపబడుచున్నది. 'ఆనందం బ్రహ్మణో విద్వాన్' ఇత్యాది శ్రుతివచనసిద్ధమగు ఆనందాది వివిధకల్యాణ గుణప్రచురత్వము వ్యక్తమగుచున్నది. కనుక 'స్వేతరసమస్తవస్తు విలక్షణస్వరూపః' 'తనకంటె వేరైన సమస్తవస్తుజాతముకంటె విలక్షణ మైన స్వరూపము కలవాడని చెప్పబడినది. 'రూప్యతే ఇతరభిన్నతయా నిరూప్యతే, వస్తు, అనేన ఇతి రూపమ్--స్వస్యరూపం స్వరూపమ్' అని వ్యుత్పత్తి. ఇతరవస్తువులకంటె భిన్నమని నిరూపించు అసాధారణలక్ష ణమే రూపము. తనయొక్క అసాధారణలక్షణమే స్వరూపమనియర్థము. దీనివలన సమస్తజగత్సృష్టిస్థితిలయములకు కారణమైన భగవంతుడు చిదచిదాత్మకప్రపంచముకంటె భిన్నుడని తెలియుచున్నది. ఇట్టి భగవా నునకు ఉపాస్యత్వము (ఉపాసింపదగియుండుట) ప్రాప్యత్వము (పొందదగియుండుట) అనునవి స్వభావము. ఈ స్వభావమునకుప యోగించునట్టి గుణములు అసంఖ్యాకములు (లెక్కలేనన్ని) కలవని చెప్పుటకే-'అనవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణః' అని చెప్పబడి నది. ఇంతవరకుగల గ్రంథముచే కొందరు చెప్పినట్లు నిర్గుణుడుకాని, మలాస్పదుడుకాని కాదని స్పష్టపరుపబడినది. భగవంతునకుగల కల్యాణ గుణగణమెట్టిది? అను ప్రశ్నమునకు సమాధానముగా భగవద్రామాను జులు, గీతాభాష్యారంభమునను, ఇతరత్ర గద్యగ్రంథములలోను పలుతావులందు మాధుర్యాదుల విశేషముగా నిరూపించియున్నారు. ప్రస్తుతగ్రంథమునకూడ ముందుముందు నిర్దేశింపగలరు. ఇట్టి భగవా నునకు ప్రతిపాదకములై వేదాన్తములయందు ప్రసిద్ధములైన శబ్దము లేవి? అన్న ప్రశ్నమునకు సమాధానముగా-'సర్వాత్మ' 'పరబ్రహ్మము' 'పరంజ్యోతి' 'పరతత్వము' 'పరమాత్మ' 'సత్' ఇత్యాది శబ్దములు నిర్దే శింపబడినవి. వీటియర్థమిది.

'సర్వాత్మా'-'సర్వమ్ ఆప్నోతి ఇతి'-సమస్త చిదచిదాత్మక ప్రపంచమును వ్యాపించియున్నవాడు సర్వాత్మ.

'పరంబ్రహ్మ'-స్వరూపముచేతను గుణములచేతను అనవధికమైన అతిశయముకలవస్తువు బ్రహ్మము—బృంహతి ఇతిబ్రహ్మ అనిఒక వ్యుత్పత్తి. బృంహయతి = అతిశయింపచేయువాడు. తనకు శరీరభూతమగు సమస్తచిదచిత్ప్రపంచమును తానంతర్యామిగాప్రవేశించి అతిశయింపజేయువాడని తాత్పర్యము.

'పరంజ్యోతిః'- సర్వోత్కృష్టమైనజ్యోతిస్సు. అనగా ప్రకాశద్రవ్యము. అపరిచ్ఛిన్నమైన (అపరిమితమైన) ప్రకాశరూపమగువస్తువే 'పరంజ్యోతి'. 'పరంజ్యోతిరుపసంపద్య' ఇత్యాది ఛాందోగ్యవచనమిచ్చట ప్రమాణము.

'పరతత్త్వమ్'-సర్వోత్కృష్టమై పరమప్రాప్యమైన తత్త్వము. తత్త్వమనగా యథార్థమైనవస్తువనియర్థము.

'పరమాత్మా'-పరో మా అస్య పరమః, పరమశ్చఅసౌఆత్మాచ పరమాత్మా. వేరొకటి (దీనికంటె) ఉత్కృష్టమైనది దేనికిలేదో అది. దేశముచేతను, కాలముచేతను, స్వరూపముచేతను అపరిచ్ఛిన్నమైన వ్యాప్తికలది. ఎట్లుగ ఇతర సమస్తభూతములకు భగవానుడే ఆత్మయై యున్నాడో, అట్లు భగవానునకు వేరొక ఆత్మలేదు, కనుక పరమాత్మ. నిరంతరము పూర్వోక్తమగు త్రివిధపరిచ్ఛేదము లేనివాడుకనుక 'సత్'. ఈపైనిపేర్కొన్న శబ్దములచే ఉపనిషత్తులందు కీర్తింపబడిన భగవానుడు శ్రీమన్నారాయణుడేతప్పవేరుకాదు అనియు, ఆయనకే 'పురుషోత్తము'డనికూడ వ్యవహారమనియు,—ఆయనే 'అంతర్యామి'స్వరూపుడనియు—'సదాదిశబ్దభేదైర్నిఖిలవేదాన్తవేద్యః భగవాన్ నారాయణః పురుషోత్తమ ఇతి అంతర్యామి స్వరూపమ్' అనుగ్రంథముచే చెప్పబడినది.

'భగవత్' శబ్దముచే హేయప్రత్యనీకత్వము (నింద్యములైనదోషములకువిరుద్ధమైయుండుట) కల్యాణగుణములకు ఆస్పదుడైయుండుట అనునది తెలియజేయబడినది. జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము,

వీర్యము, తేజస్సు అనునారుగుణములెవ్వనికుండునో వానికే భగవానుడని వ్యవహారము ముఖ్యము. ఇతరులయందు 'భగవాన్' అనుశబ్దము ప్రయోగించుట నారాయణాంశకలిగియున్నప్పుడే సముచితము. కనుకనే పూర్వాచార్యులందరు నారాయణాంశసంభూతులైన యవతారపురుషులు కావున వారికి భగవచ్ఛబ్దవిశేషణము సముచితమే. భగవచ్ఛబ్ద నిర్వచన మీక్రిందివిధముగ కలదు.

'సంభర్తేతితథాభర్తా భకారోఽర్థద్వయాన్వితః।
నేతా, గమయితా, స్రష్టా, గకారార్థస్తథా మునే॥

ఐశ్వర్యస్య సమగ్రస్య, వీర్యస్య, యశసః, శ్రియః।
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ, షణ్ణాం భగ ఇతీరణా॥

వసన్తి తత్రభూతాని భూతాత్మన్యఖిలాత్మని।
సచభూతేష్వశేషేషు వకారార్థస్తతోఽవ్యయః॥

జ్ఞానశక్తిబలైశ్వర్య వీర్యతేజాంస్యశేషతః।
భగవచ్ఛబ్దవాచ్యాని వినాహేయైర్గణాదిభిః॥'

'భగవచ్ఛబ్దములోని 'భ' అను అక్షరమునకు 'సంభర్తా' 'భర్తా' అని రెండర్థములు చెప్పబడినవి. సంభర్తయనగా తానే యధిష్ఠానమై (ఆధారమై) సమస్తజగత్తును ధరించువాడనియర్థము. భర్తయనగా పోషించువాడు. తానే ఆధారమై పోషకుడైనవాడని తాత్పర్యము. 'గ' వర్ణమునకు నేతా (నాయకుడు-నడుపువాడు); గమయితా = లోనుండి అంతర్యామిగా ప్రేరించువాడు, 'స్రష్టా' = సృజించువాడు; ఈ విధముగ సర్వజగత్తునకాధారమై, స్రష్టయై, పోషకుడై, అవతారముల ద్వారమున స్వయముగ నడపించుచు, లోనుండి యంతర్యామిగా ప్రేరించుచుండువాడుకావున యీ నిర్వచనముచే సమగ్రమగు ఐశ్వర్యము, వీర్యము (బలము), యశస్సు (కీర్తి), సంపద, జ్ఞానము, వైరాగ్యము అనునారుగుణములు 'భగ' శబ్దమునకర్థమని పర్యవసించుచున్నది.

ఇక 'వ' అను వర్ణమునకు సర్వభూతాత్మకుడును, అఖిలాత్మకుడునైన యెవ్వనియందు సమస్తము, ఇమిడియున్నదో, ఎవ్వడఖిలభూతముల యందు నివసించుచున్నాడో, ఆతడే అవ్యయుడనియర్థము. ఈ విధముగ జ్ఞాన–శక్తి–బల–ఐశ్వర్య–వీర్య–తేజస్సులు–సంపూర్ణముగ కలవాడే భగవచ్ఛబ్దమున కర్థమని తెలుచున్నది.

ఇట్టి భగవచ్ఛబ్దమునకు శ్రీమన్నారాయణైక ప్రతిపాదకత్వమున్నది. అనగా శ్రీమన్నారాయణుని మాత్రమే బోధించునదని తాత్పర్యము. నారాయణ శబ్దమునకు విష్ణుపురాణమీక్రింది నిర్వచనమును ప్రదర్శించుచున్నది.

> 'ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః।
> అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః॥

'నరుడనగా పరమాత్మ 'నరతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః' అని భారతవచనము. పరమాత్మనుండి (నరునినుండి) పుట్టినవి కనుక నారములనగా జలములు. 'తస్యార్చత ఆపోఽజాయన్త। అర్చతే వై మే కమభూదితి। తదేవార్కస్యార్కత్వమ్। ఆపో వా అర్కః' (బృహ. 1–2) అను బృహదారణ్యకవచనము భగవంతుని ప్రథమసృష్టిజలములనేనని యు, ఆ జలములనుండి పృథివ్యాదులేర్పడినవనియు నొడువుచున్నది. ఇదియీ వచనార్థము. అర్చతః తస్య = ఆత్మప్రేరణమందు (తనను తానానందించుటయందు) ప్రవర్తించిన ఆ పరమాత్మయొక్క సకాశము నుండి, ఆపోఽజాయన్త = జలములు పుట్టినవి, అర్చతే వై మే = ఆత్మ ప్రేరణమొనర్చుచున్న నాకొరకు, కమ్ = జలము, అభూత్ = పుట్టినది, అని భావించినవాడని తాత్పర్యము. కనుక పరమాత్మకు అర్కుడని పేరు (తదేవార్కస్య అర్కత్వమ్) ఆపో వా అర్కః = జలము–అర్కశబ్ద

వాచ్యుడగు పరమాత్మను అంతర్యామిగా కలిగయున్నవికనుక, వీటికిని అర్కమనిపేరు. ఈ శ్రుతినిబట్టి జలాధిష్ఠాతకనుక నారాయణుడని యొక వ్యుత్పత్తి.

నరాణాం సమూహః నారః = నరులయొక్క సముదాయమునకు నారమని పేరు. నారస్య = అట్టి నారమునకు (నరసముదాయమునకు) అయనం = ప్రాప్యమైనవాడు నారాయణుడని మరియొక వ్యుత్పత్తి. ఈ క్రింది భాగవతశ్లోకముకూడ నారాయణశబ్దవ్యుత్పత్తిని బహుప్రకారములుగా పేర్కొనుచున్నది.

'నారాయణస్త్వంనహిః సర్వదేహినా-
మాత్మాసి, అధీశోఽఖిలలోకసాక్షీ।
నారాయణోఽంగం నరభూజలాయనాత్
తచ్చాపి సత్యం, నతవైవమాయా॥ (శ్రీభాగ. 10-24-14)

స్వామీ! సర్వదేహములకంతరాత్మవై యున్నావు కనుకను, అధీశ్వరుడవుకనుకను, అఖిలలోకములకు సాక్షివై యున్నావుకనుకను నీవు నారాయణుడవుకావా? (అవునని తాత్పర్యము). నరులకు, భూమికి, జలములకు అధిష్ఠానమైనవాడవుకనుక నారాయణుడనుట సత్యమే. ఇది యెంతమాత్రము మిథ్యకాదనియభిప్రాయము. ఇచ్చట 'సర్వదేహినా-మాత్మాసి' సర్వదేహములకాత్మవై యున్నావనుటచే 'నారం' (నర సమూహము) అయనం = స్థానము, యస్య = ఎవ్వనికో, సః = అతడు, నారాయణః = నారాయణుడు అనియు, నారం = నరసంబంధియగు సర్వము, అయసే = తెలిసికొనుచున్నావుకనుక నారాయణః అని 'అఖిల లోకసాక్షీ' అను శబ్దముచేతను, నారస్య = నరసమూహమునకు, అయనం = ప్రవృత్తి ('యతః' ఎవ్వరినుండి కలుగుచున్నదో) వానికి నారాయణః అని పేరు అనుటచే 'అధీశః' అను శబ్దముచేతను, 'నర-భూ-జలాయనాత్ నారాయణః' అనుటచే జలములకు, భూమికి, నరులకు ఆశ్రయమైనవాడ

నియు నారాయణశబ్దవ్యుత్పత్తి అనేకవిధములుగా తెలియుచున్నది. ఇట్టి నారాయణునకే 'భగవ'చ్ఛబ్దవ్యవహారమని యెరుగవలయును. కనుకనే-

'నారాయణః పరోఽచిన్త్యః పరేషామపిచ ప్రభుః।
బ్రహ్మస్వరూపీ భగవాన్ అనాదిః సర్వసంభవః॥

'పరుడు, అచింత్యుడు (మనస్సుచే చింతింపనలవికానివాడు) పరాత్పరుడు, బ్రహ్మస్వరూపుడు, అనాది (ఆదిలేనివాడు) సమస్త ప్రపంచ స్రష్ట కనుకనే భగవచ్ఛబ్దబోధ్యుడు' అని విష్ణుపురాణము నొడువుచున్నది.

అట్టి శ్రీమన్నారాయణునకే 'పురుషోత్తము'డనికూడ వ్యవహారము. "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః" అను గీతావచనము పురుషోత్తముడన పరమాత్ముడేనని తెలియజేయుచున్నది.

సమస్త చిదచిదాత్మక ప్రపంచమునకు లోనుండి నియామకుడగుటచే 'అంతర్యామి' అని పరమాత్మకు పేరు. అంతః = లోపల, యమయతి = నియమించుచున్నాడు కనుక అంతర్యామియని వ్యుత్పత్తి.

ఇంతవరకు భగవత్స్వరూపము, స్వభావము నిరూపింపబడినవి. పరమాత్మకు ఈ ప్రపంచమునకుగల సంబంధమును తెలియజేయుటకే వేదాన్తవాక్యములు—ఈ చిదచిదాత్మక ప్రపంచమును—భగవచ్ఛక్తి భగవదంశము, భగవద్విభూతి, భగవద్రూపము, భగవచ్ఛరీరము, భగవత్తనువు మున్నగు శబ్దములచే వ్యవహరించుచున్నవి. కనుక ఈ చిదచిదాత్మకప్రపంచము అస్వతంత్రమనియు భగవంతునిచే నియమింపబడుచుండుననియు, కనుకనే 'శేష'మనియు, బోధించుచున్నవి. తనకు శేషమైన చిదచిదాత్మక ప్రపంచముతో కూడినవాడుకావున భగవానునకు 'శేషి' అని పేరు. ఈ రెండింటికిగల సంబంధము శేషశేషిభావము. ఇది ముందుముందు విశేషముగ వివరింపబడగలదు. ఈ శేషశేషిభావ సంబంధమును పురస్కరించుకొనియే వేదాన్తవాక్యములు పరబ్రహ్మమును, చిద

చిదాత్మకప్రపంచమును, ఒకేవిభక్తిగల పదములచే విశేషణవిశేష్యభావముతో అభేదము స్ఫురించునట్లు ప్రతిపాదించుచున్నవి. దీనినే (ఇట్లు నిర్దేశించుటనే) సామానాధికరణ్యమనియందురు. భిన్నభిన్నవ్యవహార కారణములుగల రెండుశబ్దములచే ఒకేయర్థమును బోధించుట సామానాధికరణ్యము. 'ఏకవిభక్త్యన్త నిర్దేశః' (ఒకే విభక్తితోగలపదముల నిర్దేశించుట) 'ఏకార్థనిష్ఠత్వమ్' (ఒకేయర్థమును బోధించుట) ఇత్యాదులు సామాన్యముగా చెప్పుకొను లక్షణములు. భగవద్రామానుజులు 'తత్త్వమస్యా'ది వాక్యసమన్వయసందర్భమున సామానాధికరణ్యస్వరూపమును నిర్దేశింతురు.

సామాన్యరూపముగ ఈ క్రిందియుదాహరణముచే సామానాధికరణ్యము తెలిసికొనవచ్చును.

'నల్లని-కలువ' (నీలమ్-ఉత్పలమ్) అనుచోట రెండు శబ్దములును ఒకే విభక్తితో (ప్రథమావిభక్తితో) కూడినవై విశేషణవిశేష్యభావముకలిగి ఒకేయర్థమును అనగా 'కలువ'ను బోధించుచున్నవి. ఇచ్చట 'కలువ' అను శబ్దము సామాన్యరూపముగా నాపుష్పమును బోధింపగా, 'నల్లని' అను పదము, ఆ పుష్పము నల్లనిరంగుకలది అని బోధించుచున్నది. ఇక్కడ ఈ రెండింటికిని విశేషణవిశేష్యభావముకలదు. ఏదేని ఒక విశేషముతోకూడిన వస్తువును బోధించు శబ్దము విశేష్యవాచకము. దానియందు గల విశేషమును బోధించుశబ్దము విశేషణము. ఈ రెండును ఎప్పుడును ఒకే విభక్తిగల శబ్దములుగా నిర్దేశింపబడవలయును. అప్పుడివి ఒకేయర్థమును నిమిత్తభేదముతో బోధింపగలవు. 'కలువ' అనునది జాతిని వ్యవహారకారణము (ప్రవృత్తినిమిత్తము) గ జేసికొని పుష్పమును బోధింపగా 'నల్లని' అనునది నల్లతనము అను గుణమును ప్రవృత్తినిమిత్తముగా జేసికొని కలువనే బోధించుచున్నది. ఈ విధముగా నీరెండు శబ్దములు ఒకే విభక్తిగల శబ్దములచే, ఒకేయర్థమున, వేరువేరు వ్యవహార కారణములబట్టి ప్రయోగింపబడినవి. ఏదేని ఒక శబ్దము ఒక అర్థమును

బోధింపవలయునన్నచో, ఒక వ్యవహారకారణముండవలయును. దానినే శాస్త్రకారులు 'ప్రవృత్తినిమిత్తమ'ని వ్యవహరింతురు. రెండు శబ్దములు భిన్నభిన్నప్రవృత్తినిమిత్తములనుబట్టి ఒకే యర్థమును బోధించినచో దానిని సామానాధికరణ్యమందురు. దీనినే భగవద్రామానుజులు— 'సామానాధికరణ్యంహి ద్వయోః పదయోః ప్రకారద్వయముఖేనైకార్థ-నిష్ఠత్వమ్' అని ఈ గ్రంథమునవే చెప్పినారు. ప్రకారమనగా వేరుచేయరాని విశేషణము. దీనినే అపృథక్సిద్ధవిశేషణమందురు. పూర్వము పేర్కొన్న 'నీలమ్-ఉత్పలమ్' (నల్లని-కలువ) అనుచోట నీలగుణము-ఉత్పలత్వజాతి అనునవి 'కలువ' యను వస్తువునందుగల ప్రకారములు అనగా అపృథక్సిద్ధ (వేరుచేయరాని) విశేషణములు. నీలశబ్దము గుణమును, ఉత్పలశబ్దము జాతిని, ప్రవృత్తినిమిత్తములుగా (వ్యవహారకారణముగా) జేసికొని ఒకేయర్థమును అనగా 'కలువను' బోధించుచున్నవి. కనుక ఈ రెండుశబ్దములకు విశేషణవిశేష్యభావము, 'సామానాధికరణ్యము' కలవు. ఇట్లే 'తత్త్వమసి' ఇత్యాది వేదాన్తవాక్యములలోని—తత్-త్వమ్—ఇత్యాదిపదములుకూడా ప్రవృత్తినిమిత్తభేదమును (వ్యవహారకారణములభేదమును) బట్టి ఒకే బ్రహ్మమును బోధించుచున్నవికనుక ఇచ్చట సామానాధికరణ్యము కలదనియభిప్రాయము. వేదాన్తవాక్యములందుగల—ఈ సామానాధికరణ్యమునుబట్టి పరమాత్మకును, ఆయన శక్తి, లేక అంశము, లేక రూపము, లేక విభూతి, అట్లే తనువు, శరీరము మున్నగు శబ్దములచే నిర్దేశింపబడు జీవజడాత్మకప్రపంచమునకును తాదాత్మ్యము (అభేదము) కలదని చెప్పుచున్న వేదాన్తవాక్యములు ఎట్టి తాదాత్మ్యమును బోధించుచున్నవి? స్వరూపతాదాత్మ్యమునా? అనగా పరబ్రహ్మము, ఈ చిదచిదాత్మక ప్రపంచము ఒక్కటే తత్త్వమనియా? లేక ఇతరసంబంధములనుబట్టి తాదాత్మ్యమనియా? అను విషయమున శాంకరాది వివిధవేదాన్తదర్శనములకు సమన్వయభేదమునుబట్టి, తాత్పర్యభేదమున్నది. భగవద్రామానుజులిప్పుడా విభిన్నసమన్వయరీతుల పూర్వపక్షముగ ప్రదర్శించుచున్నారు.

## ॥ శ్రీమచ్ఛంకరభగవత్పాదమతము ॥

మూ॥ తస్యవైభవప్రతిపాదనపరాణామేషాం సామానాధికరణ్యాదీనాం వివరణేప్రవృత్తాః కేచన—

'నిర్విశేషజ్ఞాన మాత్రమేవ బ్రహ్మ। తచ్చ నిత్యముక్త స్వప్రకాశమపి తత్త్వమస్యాదిసామానాధికరణ్యావగత జీవైక్యం, బ్రహ్మైవ అజ్ఞం, బధ్యతేముచ్యతేచ। నిర్విశేషచిన్మాత్రాతిరేకి - ఈశ్వరేశితవ్యాద్యనన్త వికల్పస్వరూపం-కృత్స్నం-జగత్—మిథ్యా। కశ్చిద్బద్ధః, కశ్చిన్ముక్తః ఇతీయం వ్యవస్థా-న విద్యతే। ఇతఃపూర్వం కేచన ముక్తాః ఇతి అయమర్థః—మిథ్యా। ఏకమేవ శరీరం జీవవత్, నిర్జీవాని ఇతరాణి శరీరాణి। తచ్చ శరీరం కిమ్? ఇతి నవ్యవస్థితమ్। ఆచార్యో జ్ఞానస్యోపదేష్టా మిథ్యా। ప్రమాతా-మిథ్యా। శాస్త్రం చ మిథ్యా। శాస్త్రజన్యజ్ఞానం చ మిథ్యా। ఏతత్సర్వం, మిథ్యాభూతేన శాస్త్రేణైవ అవగతమ్। ఇతి వర్ణయన్తి।

అనువాదము:-పూర్వము చెప్పబడిన పరమాత్మయగు శ్రీమన్నారాయణుని వైభవమును (గొప్పతనమును) ప్రతిపాదించునట్టి (తత్త్వమసి ఇత్యాది) వేదాన్తవాక్యములందలి 'సామానాధికరణ్యము' మున్నగు వాటిని వివరించుటయందు ప్రవర్తించిన కొందరు—ఈ క్రిందివిధముగా చెప్పుచున్నారు.

'ఎట్టి విశేషములులేని కేవలజ్ఞానమే బ్రహ్మము. ఆ పరబ్రహ్మము నిత్యము, ముక్తము (సంసారబంధమెంతయు లేనిది) స్వయముగ ప్రకాశించునదియునైనప్పటికి, 'తత్త్వమసి' ఇత్యాది వేదాన్తవాక్యము అందు నిర్దేశింపబడిన 'సామానాధికరణ్యము'నుబట్టి జీవులతోనైక్యము

పొందియున్నదని తెలియబడుచు, ఆ బ్రహ్మమే అజ్ఞానముతోకూడి సంసారబంధమును, మోక్షమును పొందుచున్నది. ఎట్టి విశేషములు (గుణములు మున్నగునవి) లేని కేవలజ్ఞానరూపమగు పరబ్రహ్మముకంటె వేరుగ కన్పట్టుచున్న ఈశ్వరుడు (నియమించువాడు) ఈశితవ్యము (నియమింపబడునది) మొదలగు అనంతములైన భేదములతోకూడిన ఈ సమస్త జగత్తు మిథ్య (వాస్తవమునకు లేకున్నను దోషవశమునను న్నట్లు కన్పించునది.) ఒకడు బద్ధుడు, మరియొకడు ముక్తుడు అను వ్యవస్థ ఏదియు లేదు. ఇంతకుముందు కొందరు మోక్షమును పొందిరనుటకూడ మిథ్యయే (అసత్యమే). ఒక్క శరీరమే జీవముతోకూడినది. ఇతర శరీరములన్నియు జీవములేనివే. మరి, జీవముతోకూడిన యాశరీర మేది? అన్నచో నిర్ణయములేదు. జ్ఞానమునుపదేశించు ఆచార్యుడు మిథ్యయే. జ్ఞానమునుపొందు శిష్యుడును మిథ్యయే. శాస్త్రము మిథ్యయే. శాస్త్రమువలనకలిగెడి జ్ఞానము మిథ్యయే. ఈ విషయమంతయు మిథ్యయైన శాస్త్రమువలననే తెలియుచున్నది.'

వివరణము: భగవద్రామానుజులు స్వపక్షమును సంక్షేపముగ నిర్దేశించినతరువాత వేదాన్తవాక్యములకు విభిన్నసమన్వయరీతుల ప్రదర్శించిన భగవత్పాదశంకరాదుల మతముల నిరాకరించుటకై మందుగా పూర్వపక్షముగ వారియభిప్రాయముల సంగ్రహముగ ప్రదర్శించుచున్నారు. శంకరులమతమున ఎట్టి విశేషములులేని కేవలజ్ఞానస్వరూపమే బ్రహ్మము. 'సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ' (తై. 2-1-1), 'విజ్ఞానమానన్దం బ్రహ్మ' (బృహ 3-9-28) ఇత్యాది శ్రుతివచనప్రామాణ్యముచే పరబ్రహ్మము జ్ఞానస్వరూపమనియు, 'నిష్కలం' 'నిష్క్రియం' 'శాన్తం' 'నిరవద్యం' 'నిరంజనం' ఇత్యాది శ్రుతులచే నాపరబ్రహ్మము ఎట్టి విశేషములు లేని నిర్గుణతత్త్వమనియు చెప్పబడినది. బ్రహ్మసూత్రభాష్యమున—'అస్తి బ్రహ్మ! నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావం, సర్వజ్ఞం, సర్వశక్తిసమన్వితమ్' ఇత్యాదిగా జిజ్ఞాసాధికరణమున బ్రహ్మస్వరూపము

నిర్దేశింపబడినది. ఉభయలింగాధికరణములోని—'నస్థానతోఽపి పరస్యోభయలింగం సర్వత్రహి' (బ్ర.సూ. 3-2-11) అను సూత్రభాష్యమున 'సర్వకర్మా, సర్వకామః, సర్వగంధః, సర్వరసః' (ఛాం. 3-14-2) 'సర్వకర్మములు, సర్వకామములు, సర్వవిధములైన గంధములు, సర్వవిధములైనరసములు కలవాడు' ఇత్యాది సవిశేషలింగమును (విశేషములను బోధించు శ్రుతివాక్యములు); అట్లే 'అస్థూలమహ్రస్వమనణ్వదీర్ఘమ్' (బృ. 3-8-8) 'స్థూలముకానిది, హ్రస్వముకానిది, అణువుకానిది, దీర్ఘముకానిది' ఇత్యాది నిర్విశేషలింగములు (ఎట్టి విశేషములు బ్రహ్మమునకులేవని బోధించు శ్రుతివాక్యములు) కలవు. ఈ విధముగ వేదవాక్యములందు ఉభయలింగమగు బ్రహ్మము (సవిశేషనిర్విశేషలక్షణములు రెండునుగల బ్రహ్మము) తెలియబడవలయునా? లేక ఒకేవిధమగు లక్షణము కలదా? అని వికల్పించి, ఒకవేళ ఏదో ఒక విధమైన బ్రహ్మమునే తెలిసికొనవలసియున్నప్పుడు నిర్విశేషబ్రహ్మమునే తెలియవలయునా? లేక సవిశేషమునా? అని విచారించి—'సర్వత్రహి బ్రహ్మస్వరూపప్రతిపాదనపరేషు వాక్యేషు', 'అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్' (కఠో. 3-15) 'ఇత్యేవమాదిషు అపాస్తసమస్తవిశేషమేవ బ్రహ్మోపదిశ్యతే' 'అశబ్దమస్పర్శ'మిత్యాది వేదాన్తవాక్యములందంతట, ఎట్టి విశేషములులేని బ్రహ్మమే ఉపదేశింపబడుచున్నది' అని భగవత్పాదులు నిష్కర్షించిరి. ఈ సందర్భముననే నిర్విశేషమైన యాబ్రహ్మము 'చిన్మాత్రమ'నికూడ నిష్కర్షించిరి. కనుకనే—'ఆహచతన్మాత్రమ్' (బ్ర. 3-2-16) అను ఈ ఉభయలింగాధికరణసూత్రభాష్యమున—'యథాసైంధవఘనః అనన్తరోఽబాహ్యః కృత్స్నః రసఘన ఏవ, ఏవమయమాత్మా అనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘనఏవ' (బృ. 4-5-13) అను బృహదారణ్యకవచనముఁనుదాహరించి 'ఎట్లుగ ఉప్పుగల్లులోపల వెలుపల ఉప్పదనముతోనే (లవణరసముతోనే) సంపూర్ణముగ నిండివున్నదో అట్లే ఆత్మకు (పరమాత్మకు) వెలుపలలోపల సంపూర్ణముగ జ్ఞానమే నిండియున్నది. కనుక చైతన్యమాత్రమే ఆత్మస్వరూపమని పేర్కొనిరి. 'ఏతదుక్తం భవతి—

నాస్యాత్మనో అంతర్బహిర్వా చైతన్యాదన్యద్రూపమస్తి। చైతన్యమేవతు నిరంతరమస్యస్వరూపమ్' 'ఇది చెప్పబడినట్లైనది. ఈయాత్మకు లోపల గాని, వెలుపలగాని, చైతన్యము (జ్ఞానము–సంవిద్) కంటె వేరొకరూపము లేదు. కనుక చైతన్యమేదాని సంపూర్ణస్వరూపము' అని పేర్కొనిరి. 'అథాత ఆదేశో నేతినేత్యాత్మా' (బృ. 2-3-6) 'అన్యదేవతద్విదితాత్ అథో అవిధితాదధి' (కే. 1-3) ఇత్యాది శ్రుతివచనములనుబట్టి బ్రహ్మము నకు రూపము నిషేధింపబడుచున్నదికనుక నిర్విశేషబ్రహ్మమే కేవల చైతన్యరూపమని శ్రుతితాత్పర్యసిద్ధమని యీ ఉభయలింగాధికరణ సూత్రభాష్యమున భగవత్పాదులు నిరూపించిరి. దీనినే భగవద్రామా నుజులు—'నిర్విశేషచిన్మాత్రమేవబ్రహ్మ' అను మాటచే నిర్దేశించినారు.

ఇటువంటి బ్రహ్మము స్వయముగ నిత్యము, ముక్తము, స్వయ ముగ ప్రకాశించునదియునైనప్పటికి 'తత్త్వమసి' ఇత్యాది వేదాన్త వాక్యములందు నిర్దేశింపబడిన సామానాధికరణ్యమునుబట్టి జీవైక్యమును పొందినదని శాంకరమతము. బ్రహ్మముకంటె వేరుగ జీవత్త్వమేదియు వాస్తవముగలేదు. 'అహమస్మి' (నేనున్నాను) ఇత్యాదివ్యవహారముచే 'నేను' అని గ్రహింపబడునదే ఆత్మ. ఆత్మాస్తిత్వముచేతనే బ్రహ్మాస్తి త్వము అనుభవప్రతిపన్నమగుచున్నది. ప్రతివ్యక్తియుతనయునికిని (ఆత్మాస్తిత్వమును) అనుభవించుచున్నాడుకదా! బ్రహ్మాతిరిక్తమగు జీవస్వరూపము వాస్తవముగ లేకున్నను అవిద్యాకల్పితమై భాసించు చున్నది. ఆకాశమున తలము, మలినము మున్నగునవి కల్పింపబడి నట్లు, నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావము, కూటస్థనిత్యము (ఎట్టివికారములు లేక నిత్యమైయుండునది), ఏకము, సర్వవిధసంగరహితమునైన పర మాత్మయందు (పరబ్రహ్మమునందు) జీవరూపము కల్పింపబడినదని భగవత్పాదశంకరులు సూత్రభాష్యమున విభిన్నస్థలములందు స్పష్ట పరచియున్నారు. 'నిత్య-శుద్ధ-బుద్ధ-ముక్త-స్వభావే, కూటస్థనిత్యే, ఏక- స్మిన్నసంగే, పరమాత్మని, తద్విపరీతం జైవంరూపం, వ్యోమ్నీవ

తలమలినాది పరికల్పితమ్' (బ్రి. సూ. భాష్యము 1-3-19) అనియు, 'తస్మాదవిద్యాప్రత్యుపస్థాపితమ్, అపారమార్థికం జైవంరూపం, కర్తృత్వ భోక్తృత్వరాగద్వేషాది దోషకలుషితమ్, అనేకానర్థయోగి; తద్విలయనేన తద్విపరీతమ్, అపహతపాప్మత్వాదిగుణకం, పారమేశ్వరం స్వరూపం విద్యయాప్రతిపద్యతే, సర్పాదివిలయనేనేవ రజ్జ్వాదీనామ్' (బ్రి. సూ. భా. 1-3-19) 'కనుక అవిద్యవలనకల్పింపబడిన మిథ్యాభూతమగు జీవస్వరూపము—కర్తృత్వము, భోక్తృత్వము, రాగము, ద్వేషము మున్నగు వివిధదోషములచే కలుషితమైనదై అనేకానర్థములతోకూడి యున్నది. ఇది లయముకాగా, దీనికంటె విరుద్ధమై అపహతపాప్మ త్వము (పాపసంశ్లేషమెంతమాత్రములేకుండుట) మున్నగు గుణములతో కూడిన పరమేశ్వరస్వరూపము విద్యావశమున తెలియబడును. రజ్జువును చూచి భ్రాన్తిచే సర్పమని భావించినప్పుడు, భ్రాన్తికల్పితమగు సర్ప జ్ఞానము, విద్యచే (తత్త్వజ్ఞానముచే) తొలగింపబడి, పరమార్థమగు రజ్జు స్వరూపము తెలియబడినట్ల'నియు భగవత్పాదులు చెప్పియున్నారు. దీనినిబట్టి జీవాత్మపరమాత్మలకు స్వరూపస్వభావములచే భేదమెంత మాత్రము లేదనియు, అనగా ఈ రెండును ఒకేతత్త్వమనియు అవిద్యా వశమున (అజ్ఞానవశమున) భేదము ప్రతిభాసించుచున్నదనియు తెలియు చున్నది.

ఈ విషయమే—కర్మానుస్మృతిశబ్దవిధ్యధికరణభాష్యమున (3-2-9) 'అపిచ, నజీవోనామకశ్చిత్ పరస్మాదన్యోవిద్యతే, యోజలబిందురివ జల రాశేః సతో వివిచ్యేత! సదేవతు ఉపాధిసంపర్కాజ్జీవఇత్యుపచర్యతే ఇత్య సకృత్ ప్రపంచితమ్' 'మరియు పరమాత్మకంటె భిన్నముగ జీవుడన వేరుగనుండియున్నచో, జలరాశినుండి జలబిందువునువలె వేరుచేయుట కుదిరియుండెడిది. కాని అట్లు పరమాత్మకంటె వేరుగ జీవాత్మలేడు. సత్పదార్థమైన పరమాత్మయే ఉపాధిసంబంధముచే జీవుడని ఔపచారిక ముగ (ఆరోపించి) వ్యవహరింపబడుచున్నదని పలుమారులు చెప్పబడినది.

జీవబ్రహ్మములకైక్యము పారమార్థికమనియు, బ్రహ్మముకంటె వేరుగనున్న సమస్త భోగ్యభోక్తృప్రపంచము మిథ్యయనియు దృష్టాంతపురస్సరముగా ఆరంభణాధికరణమున నిరూపింపబడినది. 'తత్త్వమసి' 'అహంబ్రహ్మాస్మి' 'అయమాత్మాబ్రహ్మ' ఇత్యాది వాక్యములలోని 'తత్-త్వమ్' 'ఆత్మా-బ్రహ్మ' 'అహం-బ్రహ్మ' ఇత్యాదిరూపముగానున్న సామానాధికరణ్యమును (ఏకవిభక్త్యన్త శబ్దనిర్దేశమును) బట్టి జీవబ్రహ్మములకు స్వరూపతాదాత్మ్యము (అభేదము) యథార్థమని భగవత్పాదుల యభిప్రాయము—భాష్యారంభమునను, ఆత్మాధికరణజ్ఞాధికరణ భాష్యములలోను (2-3-17, 2-3-18) స్పష్టపరుపబడినది.

ఈ విధముగ పరమార్థముగ జీవతాదాత్మ్యమును పొందిన బ్రహ్మమే, నిత్యముక్తము, స్వయంప్రకాశము అయ్యును అవిద్యా సంబంధముచే బంధమును, అవిద్యామోచనముచే మోక్షమును పొందుచున్నది. ఇదియే భగవద్రామానుజులచే మూలమున—'నిత్యముక్తం స్వప్రకాశమపి తత్త్వమస్యాది సామానాధికరణ్యావగతజీవైక్యం బ్రహ్మాజ్ఞం బధ్యతేముచ్యతేచ' అని నిర్దేశింపబడినది. "అజ్ఞమ్" అను శబ్దమునకు అజ్ఞానవిశిష్టము, అవిద్యాశబలితమని యర్థము. అవిద్యాసంబంధముచే బ్రహ్మమునకేబంధము—అవిద్యావిమోచనముచే మోక్షమునను విషయమును భగవత్పాదశంకరులు, 'ఇతరవ్యపదేశాధికరణము'లోని 'అధికంతు భేదనిర్దేశాత్' (బ్ర.సూ. 2-1-22) అను సూత్రభాష్యమున—'యదా 'తత్త్వమసి' ఇత్యేవంజాతీయకేన అభేదనిర్దేశేన అభేదః ప్రతిబోధితో భవతి, అపగతం భవతి తదా జీవస్య సంసారిత్వం, బ్రహ్మణశ్చ స్రష్టృత్వం, సమస్తస్య మిథ్యాజ్ఞానవిజృంభితస్య భేదవ్యవహారస్య సమ్యక్ జ్ఞానేన బాధితత్వాత్' 'ఎప్పుడు 'తత్త్వమసి' ఇత్యాదివాక్యరూపమగు అభేదనిర్దేశముచేత (సామానాధికరణ్యముచేత) అభేదము (బ్రహ్మాత్మైక్యము) తెలియబడినదో, అప్పుడు జీవునకు సంసారిత్వము, బ్రహ్మమునకు సృష్టికర్తృత్వము తొలగిపోవును. మిథ్యాజ్ఞానమూలముగానేర్పడిన

సమస్త భేదవ్యవహారము (జీవుడు, ఈశ్వరుడు, ఈశితవ్యమగు (నియమింపదగు జగత్తు మున్నగు భేదవ్యవహారము) జీవబ్రహ్మైక్యరూపమగు తత్త్వజ్ఞానముచే బాధింపబడినది. కనుక అసత్యము.' అని పేర్కొనియున్నారు.

శాంకరమతమున పరమాత్మ, ఈశ్వరుడు, జీవుడు అను మూడును ఒకేతత్త్వము. నిరుపాధికచైతన్యము పరమాత్మకాగా, ఉత్కృష్టోపాధితోకూడిన చైతన్యము ఈశ్వరుడు. అపకృష్టోపాధితోకూడిన చైతన్యము జీవుడు. ఉత్కృష్టాపకృష్టోపాధులు రెండును అవిద్యాకల్పితములు కావునమిథ్యయే. కనుక, ఉత్కృష్టోపాధితోకూడిన చైతన్యమగు ఈశ్వరునకుగల సర్వజ్ఞత్వము, ఈశ్వరత్వము మున్నగునవికూడ, అవిద్యాకల్పితములేకాని వాస్తవములుకావు. 'తదనన్యత్వమారంభణశబ్దాదిభ్యః' (బ్ర. సూ. 2-1-14) అను సూత్రభాష్యమున 'తదేవమవిద్యాత్మకోపాధి పరిచ్ఛేదాపేక్షమేవ ఈశ్వరస్య ఈశ్వరత్వమ్, సర్వజ్ఞత్వమ్, సర్వశక్తిత్వంచ. నపరమార్థతః విద్యయా అపాస్త సర్వవిధోపాధిరూపే ఆత్మని, ఈశిత్రీశితవ్య-సర్వజ్ఞత్వాదివ్యవహార ఉపపద్యతే।' 'కనుక ఈ విధముగ అవిద్యారూపమగునుపాధియొక్క పరిచ్ఛేదము (పరిమితత్వము) ను బట్టియే ఈశ్వరునకు ఈశ్వరత్వము సిద్ధించుచున్నది. అట్లే సర్వజ్ఞత్వము సర్వశక్తిత్వము (సర్వమునెరిగియుండుట, సర్వవిధశక్తులతోకూడియుండుట) మున్నగునవికూడ సిద్ధించుచున్నవి. పరమార్థముగ (వాస్తవముగ) విద్యచే (జ్ఞానముచే) తొలగింపబడిన సమస్తోపాధులతోకూడిన (ఎట్టి యుపాధులులేని) పరమాత్మయందు ఈశ్వరుడు (నియమించువాడు); ఈశితవ్యము (నియమింపదగినది); సర్వజ్ఞత్వము మున్నగు వ్యవహారము కుదరదని' చెప్పదగినది. పరమార్థముగ నెట్టివ్యవహారములు లేవని ఈ గ్రంథతాత్పర్యము. కనుక బ్రహ్మముకంటె వేరైన వ్యవహారములన్నియు అవిద్యాకల్పితములుకాన మిథ్యయని పర్యవసితార్థము. దీనినిబట్టి నిర్విశేషచిన్మాత్రమైన (ఎట్టి విశేషములులేని కేవల చైతన్య

(జ్ఞాన) మాత్రస్వరూపముగల) బ్రహ్మమునకే పూర్వోక్తప్రకారముగ అవిద్యాసంబంధముచే బంధము, అవిద్యామోచనముచే మోక్షమునని స్పష్టమగుచున్నది.

భగవత్పాదులు—కొందరు బద్ధులు, కొందరు ముక్తులు అను వ్యవస్థ నంగీకరింపలేదు. జీవస్వరూపమే మిథ్యకావున జీవులలో కల్పింపబడిన అవాన్తరభేదములన్నియు మిథ్యయేనని వారి తాత్పర్యము. ఈయభిప్రాయమునే భగవద్రామానుజులు మూలమున—'కశ్చిత్‌బద్ధః కశ్చిన్ముక్తః ఇతి ఇయం వ్యవస్థానవిద్యతే' అని పేర్కొనియున్నారు. ఇట్లే ఇతఃపూర్వము కొందరు ముక్తులైనారనుటకూడ మిథ్యయే.

'ననిరోధోనచోత్పత్తిః నబద్ధోనచ సాధకః।
నముముక్షుర్నవైముక్తః ఇత్యేషా పరమార్థతా॥
(గౌడపాద. కా. 2-32)

అను మాండూక్యకారికను వ్యాఖ్యానించుచు మాండూక్యకారికాభాష్యమున భగవత్పాదులు—'నిరోధనం నిరోధః ప్రలయః, ఉత్పత్తిః జననం, బద్ధః సంసారీ జీవః, సాధకః, ముముక్షుః మోచనార్థీ, ముక్తః విముక్తబంధః। ఉత్పత్తిప్రలయయోరభావాత్ బద్ధాదయో నసంతీత్యేషాపరమార్థతా।' 'నిరోధమనగా ప్రలయము, ఉత్పత్తి యనగా జన్మము' బద్ధుడనగా సంసారియైన జీవుడు, ముముక్షువనగా మోక్షమును కోరువాడు, ముక్తుడనగా మోక్షమును పొందినవాడు. వాస్తవముగ ప్రలయము ఉత్పత్తి అనునవే లేవుకనుక, బద్ధుడు ఇత్యాదులు లేరనుటయే పరమార్థము అని పేర్కొనిరి. ఈ భాష్యమునుబట్టి కొందరు బద్ధులు, కొందరు ముక్తులు అను వ్యవస్థ లేదనుట శాంకరమతమున స్పష్టమగుచున్నది.

ఈ సందర్భమున భగవద్రామానుజులు—'ఏకమేవ శరీరం సజీవం, నిర్జీవాని ఇతరాణి శరీరాణి' 'ఒక్క శరీరమే జీవునితో కూడినది,

ఇతర దేహములన్నియు జీవరహితములే' అను శాంకరమతమును నిర్దే శించిరి. మరి యొకక్క దేహము ఏది? అను ప్రశ్నమునకు -- ఇదియను వ్యవస్థలేదని పేర్కొనిరి. 'కింతత్ శరీరమితి నవ్యవస్థితమ్' అని. ఈ గ్రంథముచే భగవద్రామానుజులు అద్వైతవాదులచే నంగీకరింపబడిన 'ఏకజీవ వాదము'ను పరామర్శించు చున్నారనుట స్పష్టము. తామంగీక రించిన నానా జీవవాదమునకు (జీవానేకత్వ వాదమునకు) ఏకజీవవాదమే విరుద్ధము కదా! మరియీ ఏకజీవవాదము భగవత్పాద శంకరులే స్వయ ముగ ప్రస్తావించిరా? లేక తదనుయాయులెవ్వరైన యీ వాదమును లేవ నెత్తిరా? యని విచారించినచో యీ క్రింది విధముగ నవగతమగు చున్నది.

భగవత్పాద శంకరులు సూత్రభాష్యములో భిన్నభిన్న తావులలో పరబ్రహ్మమునకు, ఈశ్వరునకు, జీవునకుగల స్వరూపతారతమ్యమును, వాటి యథార్థతాఽయథార్థతను, పరస్పర సంబంధములను, భిన్నభిన్న నిదర్శనములద్వారా ప్రతిపాదించిరి. వారి మతమున బ్రహ్మ మొక్క టియే సర్వవిధ పరిచ్ఛేద రహితమై నిరాకారము, నిరంజనము, నిర్వి శేషచిన్మాత్రమై సత్యమనియు, ఈశ్వరుడు, జీవుడు అనునవి అవిద్యా కల్పితములు కావున అసత్యములనియు పూర్వము ప్రతిపాదింపబడినది.

'అంశో నానావ్యపదేశాత్ అన్యథాచాపి దాశకితవాదిత్వ మధీయత ఏకే' (బ్ర. సూ. 2-3-43) అను సూత్రభాష్యమున జీవునకు బ్రహ్మాంశత్వ మును అగ్నివిస్ఫులింగ దృష్టాంతముచే ఉపపాదన మొనర్చినారు. ఈ విస్ఫులింగ దృష్టాంతము ఉపనిషత్ప్రసిద్ధమే. బృహదారణ్యకమున-- 'యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగావ్యుచ్చరన్తి, ఏవమేవ అస్మాదాత్మనః సర్వేప్రాణాః, సర్వేలోకాః, సర్వేదేవాః, సర్వాణిభూతాని, వ్యుచ్చరన్తి' (2-1-20) 'ఎట్లుగ అగ్ని నుండి చిన్నరవ్వలు నలువైపులకు ఎగియు చున్నవో, అట్లే విజ్ఞానమయుడగు ఆత్మనుండి వాక్కు మున్నగునవియు, భూప్రభృతి లోకములు, కర్మఫలములు, ప్రాణిలోకాధిష్ఠాతలగు, అగ్న్యాది

దిదేవతలు, బ్రహ్మ మొదలు స్తంబము వరకుగల సమస్త ప్రాణిజాతము ఆవిర్భవించుచున్నదో..... (శాంకరభాష్యానువాదము) ఇత్యాదిగ విస్ఫులింగ దృష్టాన్తము నిర్దేశింపబడినది.

భగవత్పాదులు 'అంశో నానావ్యపదేశాత్' ఇత్యాది సూత్ర భాష్యమున– 'జీవ ఈశ్వరస్యాంశో భవితుమర్హతి, యథాగ్నేర్విస్ఫులింగః' 'జీవుడు ఈశ్వరునకు అంశభూతుడగును. అగ్నికి విస్ఫులింగము (నిప్పురవ్వ) అంశమైనట్లు' అనియు; 'చైతన్యంచ అవిశిష్టం జీవేశ్వరయోః, యథా అగ్నివిస్ఫులింగయోరౌష్ణ్యమ్.' 'అగ్నికి విస్ఫులింగమునకు [అగ్ని నుండి పుట్టిన రవ్వ (తేజః కణము)] కు ఉష్ణత్వము సమానమైనట్లు జీవేశ్వరులకు చైతన్యము సమానము' 'అతో భేదాఽభేదావగమాభ్యామంశత్వావగమః' 'కనుక భేదము అభేదము రెండును తెలియుచున్నందున జీవుడు ఈశ్వరాంశము' అని పేర్కొనినారు. ఇట్లే 'మంత్రవర్ణాచ్చ' (బ్ర.సూ. 2-3-44); 'అపిచస్మర్యతే' (2-4-45); 'ప్రకాశాదివన్నైవం పరః' (2-4-46) అను సూత్రములచే గూడ అంశాంశి భావము జీవేశ్వరులకు సిద్ధించుచున్నదనియు–'మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః' ఇత్యాది స్మృతులు కూడ దీనిని సమర్థించుచున్నవని చెప్పిరి. కాని యీ అంశాంశిభావము వాస్తవమునకు భగవత్పాదులకు సమ్మతము కాదు. కనుకనే 'అంశ ఇవ అంశః' 'అంశమువంటిది అంశము' అని నిర్వచించి, వాస్తవముగ నిరవయవమైన బ్రహ్మమునకు అంశము సంభవింపదు కనుక ఈ అంశాంశిభావము ముఖ్యము కాదని చెప్పిరి.

మరి, ఈశ్వరాంశము జీవుడనియన్నచో జీవగతదుఃఖము ఈశ్వరునకంటదా? అని ప్రశ్నించి జీవునకుకూడ సాంసారికదుఃఖము వాస్తవము కాదనియు, దేహేంద్రియాద్యుపాధుల వివేకములేమిచే కలిగినదనియు, కనుక జీవునకు అపారమార్థికమైన యీ దుఃఖాదులు ఈశ్వరునకంటవని సమాధానించుచు ఈ సందర్భమున ఘటాకాశాదిదృష్టాంతమును, జలసూర్యబింబప్రతిబింబదృష్టాంతమును ప్రదర్శించినారు, 'యథాహ్యా–

కాశే ఘటాదిషుగచ్ఛత్సుగచ్ఛన్నివ విభావ్యమానోఽపి, నపరమార్థతో గచ్ఛతి, యథాచ ఉదశరావాదికంపనాత్—తద్గతే సూర్యేకంపమానేఽపి, నతద్వాన్ సూర్యః కంపతే, ఏవమవిద్యాప్రత్యుపస్థాపితే బుద్ధ్యాద్యుపహితే జీవాఖ్యే అంశే దుఃఖాయమానేఽపి, నతద్వాన్ ఈశ్వరోదుఃఖాయతే. జీవస్యాపితు దుఃఖప్రాప్తిరవిద్యానిమిత్తైవేత్యుక్తమ్. తథాచావిద్యానిమిత్తజీవభావవ్యుదాసేన బ్రహ్మభావమేవ జీవస్య ప్రతిపాదయంతి వేదాన్తాః 'తత్త్వమసి' ఇత్యేవమాదయః. తస్మాన్నాస్తి జైవేన దుఃఖేన పరమాత్మనో దుఃఖిత్వప్రసంగః. ఇతి.' 'ఎట్లుగ—ఘటాదులు కదులుచున్నప్పుడు అందున్న ఆకాశము కదులుచున్నట్లు కన్పించినను వాస్తవముగ కదులుటలేదో, ఎట్లుగ—మూకుడు, కుండ మొదలగు పాత్రిలలోగల నీటిలో ప్రతిబింబించిన సూర్యబింబము మలినమైనట్లు కదులుచున్నట్లు కన్పించినను వాస్తవముగ సూర్యబింబమునకు మాలిన్యము, చలనము లేవో, అట్లే—అవిద్యవలన కల్పింపబడి, బుద్ధ్యాదులతోకూడియున్న జీవాంశము దుఃఖముననుభవించుచున్నను, ఈ జీవాంశముతో కూడిన ఈశ్వరునకేదుఃఖముంటదు. వాస్తవమునకు జీవులకుగల దుఃఖము కూడ అవిద్యానిమిత్తమేకాని సత్యముకాదని చెప్పియుంటిమి. ఈ విధముగ అవిద్యానిమిత్తముగనేర్పడిన జీవభావమును నిరాకరించుటద్వారా బ్రహ్మభావమే వాస్తవమని—'తత్త్వమసి' ఇత్యాది వేదాన్తవాక్యములు నిరూపించుచున్నవి. కనుక, స్వాంశభూతజీవదుఃఖముచే ఈశ్వరునకు దుఃఖిత్వము (దుఃఖముకలిగియుండుట) ప్రసక్తముకాదు. అని.'

ఈ పూర్వనిర్దిష్ట గ్రంథమున నీయబడిన రెండు దృష్టాంతములను బట్టి, ఘటాదులందు కదులుచున్నట్లు కన్పించుచున్న పరిచ్ఛిన్నమైన యాకాశమువంటివాడు జీవుడనియు, అపరిచ్ఛిన్నమైన మహాకాశమువంటిది బ్రహ్మమనియు, అట్లే దేహసంయుక్తములైన బుద్ధ్యాదులయందు ప్రతిబింబించిన చైతన్యము (వివిధజలపాత్రములందు ప్రతిబింబించిన సూర్యబింబమువంటిది) జీవుడనియు, ప్రతిబింబములకు మూలమైన

సూర్యబింబమువంటివాడు పరమాత్మయనియు, ఘటాకాశగతములైన పరిచ్ఛేదాదులతోను, జలపాత్రములందు ప్రతిబింబించిన సూర్యబింబము నందుగల చలనమాలిన్యాదులతోను మహాకాశమునకు, మూలభూతమగు సూర్యబింబమునకు సంబంధము లేనట్లే, స్వాంశభూత జీవునియందు గల దుఃఖిత్వాదులు ఈశ్వరున కంటవని పర్యవసించుచున్నది.

ఈ రెండు దృష్టాన్తములలో మొదటిదానిని (ఘటాకాశ దృష్టాంతమును) ఆలంబించి భామతీకారులగు వాచస్పతిమిశ్రులు 'అవచ్ఛేద వాదము'ను చేసిరనియు, రెండవ దృష్టాంతమునుబట్టి (జలసూర్య దృష్టాంతమునుబట్టి) సంక్షేప శారీరకారులగు సర్వజ్ఞాత్మముని ప్రతిబింబవాదమును చేసినారనియు విమర్శకులు చెప్పుదురు. ఇంక వాస్తవమునకు జీవతత్త్వమే అవిద్యాకల్పితముకావున మాండూక్యకారికాకర్తలైన గౌడపాదులవారి కల్పనావాదమును ఆధారముగజేసికొనియు, 'ఆభాసఏవచ' (బ్ర. 2-3-50) అను సూత్రమును, దానికి భగవత్పాదులొనర్చిన భాష్యమును ఆధారముగాజేసికొనియు, వార్తికకారులగు సురేశ్వరాచార్యులు 'ఆభాసవాదమును' చేసిరనియు తెలియుచున్నది. ఈ ఆభాసవాదమునకుకూడ జలసూర్యబింబప్రతిబింబదృష్టాంతమే మూలమని తోచుచున్నది. ఈక్రింది 'ఆభాసఏవచ' అను సూత్రశాంకరభాష్యమునుచూడుడు. 'ఆభాస ఏవచైషజీవః పరస్య ఆత్మనో, జలసూర్యకాదివత్ ప్రతిపత్తవ్యః' 'జలమందు ప్రతిబింబించిన సూర్యునివలె పరమాత్మయొక్క ఆభాసమే యీ జీవుడని తెలియవలయును.' 'ఆభాసస్యచ అవిద్యాకృతత్వాత్ తదాశ్రయస్య సంసారస్య అవిద్యాకృతత్వోపపత్తిరితి, తద్వ్యుదాసేనచ పారమార్థికస్య బ్రహ్మాత్మభావస్యోపదేశోపపత్తిః' 'ఆభాసమనునది అవిద్యచే కల్పింపబడినదికనుక, ఆభాసాశ్రయమైన సంసారముకూడ అవిద్యా కల్పితమనుట కుదురును. కనుక ఆయాభాసమునకు మూలమైన అవిద్య

ను తిరస్కరించుటద్వారా పరమార్థమైన బ్రహ్మాత్మభావముయొక్క ఉప దేశము కుదురుచున్నది' అని. దీనినిబట్టి జీవుడు అవిద్యామూలముగ నాభాసించువాడే (లేకున్నను ఉన్నట్లు కన్పించువాడే) నని తెలియు చున్నది. ఈ మూడువాదములును ఈ క్రింది శ్లోకమున సంగ్రహముగ నిట్లు చెప్పబడియున్నవి—

'వాచస్పతేరవచ్ఛేదః, ఆభాసోవార్తికస్యచ।
సంక్షేపశారీరకకృతాం ప్రతిబింబమిహేష్యతే॥'

'భగవత్పాదశంకరుల సూత్రభాష్యముపై 'భామతీ' వ్యాఖ్యను వ్రాసిన సర్వతంత్రస్వతంత్రులైన శ్రీవాచస్పతిమిశ్రులు 'అవచ్ఛేదవాద ము'ను; వార్తికములరచించిన శ్రీసురేశ్వరాచార్యులు (భగవత్పాదుల శిష్యులు) 'ఆభాసవాదము'ను; సంక్షేపశారీరమను గ్రంథమునురచించిన శ్రీసర్వజ్ఞాత్మమునిి 'ప్రతిబింబవాదము'ను చేసిర'ని దీని తాత్పర్యము.

అవచ్ఛేదవాదమునుబట్టి—మహాకాశమునకు ఘటము, మఠము మున్నగు ప్రదేశభేదములందు కన్పట్టుచున్న ఆకాశములనుబట్టి పరిచ్ఛే దము (పరిమితి) ఏర్పడుచున్నట్లున్నను, ఆ ప్రదేశముల తొలగించగనే అందు పరిచ్ఛిన్నముగానున్న ఆకాశము మహాకాశమున లీనమైనట్లు, ఒకే అపరిచ్ఛిన్న బ్రహ్మమునకు భిన్నభిన్నోపాధుల సంబంధమునుబట్టి భిన్నభిన్నపరిచ్ఛేదములేర్పడినట్లు కన్పించుచున్నను, ఆయుపాధులు తొలగిపోగనే మహాకాశతుల్యముగ స్వయముగ నపరిచ్ఛిన్నమైన బ్రహ్మమేమిగులును. ఈ పరిచ్ఛిన్నములైన యుపాధులవలననే నానా జీవతత్త్వము బ్రహ్మముకంటె వేరుగ కన్పట్టుచున్నది. అట్లే, ఒక ఘట మున పరిచ్ఛిన్నమైన ఆకాశము ధూళి, ధూమము మున్నగువాటితోకూడి యున్నను, మహాకాశమునకు సంబంధించిన యితరభాగములకు ఆ దోష మెంతమాత్రమంటనట్లే, ఉపాధిపరిచ్ఛిన్నమైన బ్రహ్మచైతన్యములోని ఒక భాగమగు జీవునకు సుఖదుఃఖాదిసంబంధమున్నను, ఉపాధ్యన్తర

(వేరొక ఉపాధిచేత) పరిచ్ఛిన్నమైన బ్రహ్మచైతన్యభాగమగు మరియొక జీవునకాదోషము అంటదు. ఈ భిన్నభిన్నోపాధిపరిచ్ఛేదములను బట్టియే విభిన్నజీవనామరూపాదివ్యవహారము, ఘటశరావాది విభిన్న పాత్రములలోగల ఆకాశములకు భిన్నభిన్ననామవ్యవహారములు పరిచ్ఛేదభేదమునుబట్టి ఎట్లు యేర్పడినవో అట్లేననియెరుగవలయును. ఈ విధముగ అపరిచ్ఛిన్నమైన బ్రహ్మచైతన్యము, ఈ భిన్నభిన్నపరిచ్ఛిన్నోపాధులలో అంతర్భావమును పొందినప్పుడు బ్రహ్మస్వరూపమునకు తిరోభావమేర్పడుచున్నది. ఈ యుపాధిసంబంధములచేనేర్పడిన పరిచ్ఛేదములనుబట్టి బ్రహ్మమునకేర్పడుచున్న స్వరూపతిరోభావమును స్ఫటికదృష్టాంతముతో వాచస్పతిమిశ్రులు ఉభయలింగాధికరణములోని ప్రథమసూత్రభాష్యభామతిలో యీ క్రిందివిధముగ వివరించియున్నారు. 'స్ఫటికమణేరివస్వభావస్వచ్ఛధవలస్య లాక్షారసావసేకోపాధిరరుణిమా, సర్వగంధత్వాదిరౌపాధికో బ్రహ్మణి అధ్యస్త ఇతి పశ్యామో, నిర్విశేషతా ప్రతిపాదనార్థత్వాత్ శ్రుతీనామ్' 'అస్థూలమనణు అహ్రస్వమదీర్ఘమ్' (బృ. 3-8-8) ఇత్యాదిగ బ్రహ్మమునకెట్టి పరిచ్ఛేదము స్వయముగలేకున్నను- 'సర్వకర్మా సర్వకామః, సర్వగంధః సర్వరసః' (ఛాం. 3-14-2) ఇత్యాద్యుపనిషద్వచనములచే కర్మకామగంధరసాది విశిష్టత్వము తన్మూలమగు పరిచ్ఛేదము తెలియుచున్నదికదాయన్నచో, స్వచ్ఛమై ఎట్టి రంగులేని స్ఫటికమునకు లాక్షారసము (లత్తుక) యొక్క పూతనుబట్టి రక్తరూపము (ఎర్రదనము) ఉపాధినిబట్టి ఏర్పడినట్లు బ్రహ్మమునకు ఉపాధినిబట్టియే సర్వగంధత్వాదులు ఆరోపింపబడినవని భావింపవలయునని తాత్పర్యము. ఈ వాదమునుబట్టి పర్యవసించినదేమనగా అవిద్యావచ్ఛిన్నుడు జీవుడు, అవిద్యాఽనవచ్ఛిన్నుడు ఈశ్వరుడు అని. ఈ విషయమై సిద్ధాన్తబిందువను గ్రంథముననిట్లు చెప్పబడినది. 'అజ్ఞానవిషయీకృతం చైతన్యమీశ్వరః, అజ్ఞానాశ్రయీభూతః జీవః....అస్మింశ్చపక్షే అజ్ఞాననానాత్వాత్, జీవనానాత్వమ్, ప్రతిజీవంచ ప్రపంచభేదః. అయ

మేవ అవచ్ఛేదవాదః.' 'అజ్ఞానమునకు విషయమైన (అజ్ఞానముచే గ్రహింపబడిన) చైతన్యమే ఈశ్వరుడు. అజ్ఞానమునకాశ్రయుడైన వాడు జీవుడు. ఈ పక్షమున నజ్ఞానములనేకములుకనుక జీవులును అనేకులే. జీవభేదమునుబట్టి ప్రపంచభేదమున్నది. ఇదియే అవచ్ఛేదవాదము, అని.

ఇంక ప్రతిబింబవాదమునుబట్టి అవిద్యయందు ప్రతిబింబించిన బ్రహ్మమే జీవుడు. "అవిద్యాప్రతిబింబితం బ్రహ్మైవజీవః" (పద్మపాదుల పంచపాదిక పే 14) "అవిద్యయందు (అజ్ఞానమందు) ప్రతిబింబించిన బ్రహ్మమే జీవుడు." "బింబస్థానీయ బ్రహ్మస్వరూపతా ప్రతిబింబస్థానీయస్య జీవస్య అపదిశ్యతే" "బింబమువంటివాడైన పరమాత్మయొక్క స్వరూపము, ప్రతిబింబమువంటివాడైన జీవునియందారోపింపబడుచున్నది". (పంచపాదికా-పే.22)

ఈ రెండువాదములలోను ఏ జీవస్వరూపము భిన్నభిన్నముగా స్ఫురించుచున్నదో అది వాస్తవముకాదనియు, కేవలము 'ఆభాస' మాత్రమేననియు ఆభాసవాదతాత్పర్యము.

ఈ మూడువాదములు వేరువేరుగ కన్పట్టుచున్నను ఒకదానితో ఒకటి పెనవేసికొనియున్నట్లుతోచును. ఈ మూడువాదములకు భగవత్పాదుల వచనములే ఆధారములని పూర్వమే స్పష్టపరుపబడినది. అవచ్ఛేదవాదము, ప్రతిబింబవాదము అను యీ రెండువాదములలోను కొన్ని దోషములు ప్రసక్తములగుటచే కొందరు శాంకరమతానుయాయులు ఏకజీవవాదమును ప్రతిపాదించిరి. అప్పయ్యదీక్షితులు తమ "సిద్ధాన్తలేశసంగ్రహ"మను గ్రంథమున యీ వాదమును, దీని అవాన్తరభేదములను నిర్దేశించియున్నారు. ఈ క్రింది పంక్తులను చూడుడు.

"అథాయం జీవఏకః? ఉతానేకః? అనుపదోక్తపక్షావలంబినః కేచిత్—జీవైక్యమాశ్రిత్య ఆహుః—ఏకోజీవః। తేనచైకమేవ శరీరం

సజీవం, అన్యాని స్వప్నదృష్టశరీరాజీవ నిర్జీవాని. తదజ్ఞానకల్పితం సర్వంజగత్, తస్యస్వప్నదర్శనవత్ యావదవిద్యం సర్వోవ్యవహారః. బద్ధముక్తవ్యవస్థాపినాస్తి। జీవస్యైకత్వాత్, శుకముక్త్యాదికమపి స్వాప్న పురుషాన్తరముక్త్యాదికమివ కల్పితమ్, అత్ర చ సంభావిత సకలశంకా పంకప్రక్షాలనంస్వప్నదృష్టాన్తసలిలధారయైవ కర్తవ్యమ్." (సిద్ధాన్తలేశ సంగ్రహః పే. 105, 106)

'ఇక ఈ జీవుడు ఒక్కడా? అనేకులా? అనియన్నప్పుడు పూర్వము చెప్పబడిన వాదముల ననుసరించి (బ్రహ్మమే జీవభావమును పొంది బంధమోక్షముల పొందుచున్నదను వాదముననుసరించి) జీవైక్యమును (జీవుడొక్కడే అను మతమును) ఆశ్రయించి యిట్లు చెప్పుచున్నారు. జీవుడొక్కడే, అట్టి జీవునితోకూడిన ఒక్క శరీరమే సజీవము. (జీవ విశిష్టము) ఇతర శరీరములన్నియు, స్వప్నమున (కలలో) కనుపించెడి దేహములవలె జీవరహితములే. జీవునియొక్క అజ్ఞానముచే కల్పింపబడి నదే యీ జగత్తు. ఆ జీవునకు–స్వప్నదర్శనమువలె (కలగన్నయట్లు) ఎంతవరకవిద్య యుండునో అంతవరకు సకలవిధ వ్యవహారముండును. బద్ధుడు, ముక్తుడు మున్నగు వ్యవస్థకూడ లేదు. జీవుడొక్కడే కనుక శుకాదులు ముక్తిచెందిరనుటకూడ, స్వప్నమందగుపించెడి ఇతర పురుషుల ముక్తివలె కల్పింపబడినదే. ఈ పక్షమున నూహింపబడెడి సకల దోషము లను బురదను స్వప్నదృష్టాంతమను నీటితోనే కడుగవలయును' అని.

ఇంచుమించుగ ఇది భగవద్రామానుజులు ప్రదర్శించిన శాంకర వాదమునకు, 'నకలు' అని చెప్పవచ్చును. ఈ ఏకజీవవాదములోనే ఇతర పక్షములుకూడ కలవు.

ఇంకొక వాదము— 'మరికొందరి యేకజీవవాదమున మానసిక విశ్వాసమును పొందజాలనివారై 'అధికంతు భేదనిర్దేశాత్' 'లోకవత్తు లీలా కైవల్యమ్' ఇత్యాది సూత్రములనుబట్టి జీవునికంటె గొప్పవాడగు నీశ్వరుడే

జగత్తుకు స్రష్టగాని, జీవుడు కాడనియు; సర్వ కామముల పొందినవా-డగుటచే నా పరమేశ్వరునకు జగత్ సృష్టివలన నెట్టి ప్రయోజనము లేకున్నను, కేవలము లీలగ నీ సృష్టి చేయుచున్నాడని ప్రతిపాదించు చున్నారు. మరి యట్టి ఈశ్వరుడు సర్వ కర్మముల నొనరించుట యెట్లని శంకించి—బ్రహ్మమునకు ప్రతిబింబమైన హిరణ్యగర్భుడొక్కడే జీవుడని పేర్కొనుచున్నారు.'

"మరికొందరు—హిరణ్యగర్భులు ప్రతికల్పమున ననేకులున్నారు కనుక-ఏ హిరణ్యగర్భుడు ముఖ్య జీవుడో నిర్ణయించుటకుపాయము లేదు కావున—ఒక్క జీవుడే—ఎట్టి విశేషము లేకయే అన్ని దేహములందున్నా డనియు, మరి శరీరావయవములకువలె, శరీర భేదమున్నను (జీవు డొక్కడే కనుక) ఒక దేహమునగల సుఖదుఃఖాదులకు దేహాన్తరముల యందనుసంధానము ప్రసక్తము కాదా? యని శంకించి ఈ జీవునకు పూర్వముండిన దేహములలోని సుఖదుఃఖాదులయొక్క అనుసంధానము ప్రస్తుత దేహమున కలుగుచున్నట్లనుభవములేదు కావున—దేహాన్తర సుఖదుఃఖాదుల యనుసంధానము ప్రసక్తము కాదని చెప్పుదురు. మరి యోగులకు యోగశక్తిచే భిన్నభిన్న దేహములయందు ప్రవేశమున్న ప్పుడు ఆయాయి దేహముల సుఖదుఃఖాద్యనుసంధానమున్నదికదా? అన్నచో—యోగులకాయనుసంధానము-యోగప్రభావమువలన కల్గినది కనుక అది యుదాహరణముకాదని చెప్పుదురు. కనుక—అవిశేషముగ నన్నిశరీరములలోను ఒక్కడే జీవుడున్నాడని ఏకజీవవాదమునే స్వీక రించుచున్నారు."

"మరికొందరు—పూర్వము పేర్కొనినట్లు హిరణ్యగర్భుడే ముఖ్య జీవుడుకాగా-చిత్రపటమున లిఖింపబడిన మనుష్యదేహములకు కల్పింప బడిన వస్త్రములవలె—హిరణ్యగర్భ ప్రతిబింబములైన-జీవాభాసములే (జీవులుగా ప్రతిభాసించునవే) సంసారాదుల పొందుచున్నవి. కనుక విశేషములతోకూడిన అనేక శరీరములయందొక్కజీవుడే ఉన్నాడు అని

చెప్పుచున్నారు."

(సిద్ధాన్తలేశసంగ్రహవిషయానువాదము: పే. 106, 107.)

మరికొందరనేకజీవవాదముల చేసిరి. ప్రస్తుతమున నా వాదము లన్నియు-విషయవిస్తారకారణములు కనుక విడువబడుచున్నవి.

ఏకాత్మవాదమునకు శాంకరసూత్రభాష్యమునకూడ కొన్ని సూచనములు కలవు. 'ప్రదేశాదితిచేన్న అంతర్భావాత్' (బ్ర.సూ. 2-3-53) అను సూత్రభాష్యమున నానాత్మవాదులగు కాణాదసాంఖ్యాదుల వాదముల ఖండించుచు—'తస్మాదాత్మైకత్వపక్ష ఏవ సర్వదోషాభావ ఇతి సిద్ధమ్' 'కనుక ఆత్మైకత్వవాదమున (ఒక్కటే ఆత్మయనువాదమున) ఎట్టిదోషములు లేవని సిద్ధించుచున్నది' అని పేర్కొనినారు. దీని వ్యాఖ్యానించుచు భామతీకారులగు వాచస్పతిమిశ్రులు—"తస్మాదాత్మైకత్వస్య ఆగమసిద్ధత్వాత్, వ్యవస్థాయాశ్చ ఏకత్వేప్యుపపత్తేః, న అనేకాత్మకల్పనా, గౌరవాత్, ఆగమవిరోధాచ్చ." "కనుక ఆత్మ ఒకటేనమట ఆగమమువలన (శ్రుతిప్రమాణమువలన) సిద్ధించుచున్నదికనుకను, ఆత్మ ఒక్కటేనని యంగీకరించినప్పుడుకూడ వ్యవస్థకుదురుచున్నది కనుకను, అనేకాత్మలను కల్పించుట కుదరదు. గౌరవదోషము, అగమవిరోధదోషము ప్రసక్తమగుచున్నవికనుక" అని పేర్కొనినారు. మరియు, భగవత్పాదులు, ఆరంభణాధికరణభాష్యమున ఘటాకాశాది దృష్టాన్తమునుచూపి ఘటాద్యనురోధముకల ఆకాశమువలె, అవిద్యాకల్పితములైన నామరూపాదులయనురోధముకల బ్రహ్మమే ఈశ్వరుడనియు, ఈ ఈశ్వరుడే స్వాత్మభూతులగు 'జీవులను' అవిద్యాకృతనామరూపములుకలవారిని, ఘటాద్యాకాశస్థానీయులగు జ్ఞానాత్మలని పిలువబడువారిని, సృజించునని చెప్పిరి. ఈ సందర్భమున 'జీవాత్మనః' (జీవాత్మలను) అనుచోటగల బహువచన ప్రయోగమునుబట్టి—జీవనానాత్వము భగవత్పాదసమ్మతమా? యను శంకను నిరాకరించుటకై భాష్యరత్నప్రభాకరులగు గోవిందానందులు—"నచాత్రనానాజీవాః భాష్యోక్తా ఇతి భ్రమితవ్యమ్. బుద్ధ్యాదిసంఘాత

భేదేన భేదోక్తిః। అవిద్యాప్రతిబింబస్తు ఏకఏవజీవ ఇత్యుక్తమ్." "ఇక్కడ జీవానేకత్వము (జీవులనేకులని) భాష్యకారునిచే చెప్పబడినదని భ్రాన్తి చెందరాదు. బుద్ధ్యాదిసంఘాతములయొక్క భేదమునుబట్టియే భేదము. అవిద్యయందు ప్రతిబింబించిన జీవుడొక్కడేనని చెప్పబడినది." అని ఏకజీవవాదమే భాష్యసమ్మతమని పేర్కొనినారు. ఈ ప్రఘట్టకమునంత టినిబట్టి ఏకజీవవాదమున కొన్ని అవాంతరభేదములున్నను సామాన్య రూపముగ నీయేకజీవవాదము భగవత్పాదసమ్మతమేనని స్పష్టమగు చున్నది. కనుక ఏకజీవవాదము భగవత్పాదసమ్మతముకాదని చెప్పు వారివాదమెంతవరకు సమంజసమో విమర్శకులు వివేచింపగలరు.

ఇంతవరకు పరాభిమతమగు ఏకజీవవాదమునుపస్థాపనమొనర్చి "ఆచార్యో జ్ఞానస్యోపదేష్టా" అనియారంభించి "శాస్త్రేణావగతమ్" అను నంతవరకు ఆచార్యుడు, శిష్యుడు, శాస్త్రము సర్వము మిథ్యయేననియు, యీ విషయము 'మిథ్య'యైన శాస్త్రముచేతనే తెలియుచున్నదని చెప్పుట టచే "మమమాతా వంధ్యా" "నా తల్లి గొడ్రాలు" అనువచనమువలె పర స్పర విరుద్ధము, అనుభవవిరుద్ధమునై యున్నదని భగవద్రామానుజులు సూచించుచున్నారు. ఆచార్యునకు, శిష్యునకు, శాస్త్రమునకు మిథ్యాత్వ మును భగవత్పాదులు భిన్నభిన్నసందర్భములలో స్పష్టపరచియు న్నారు. "తదనన్యత్వమారంభణశబ్దాదిభ్యః" అను సూత్రభాష్యమున "నన్వేకత్వైకాన్త్యభ్యుపగమే, ప్రత్యక్షాదీని లౌకికప్రమాణానివ్యాహన్యేరన్, నిర్విషయత్వాత్, స్థాణ్వాదిష్వివ పురుషాది. తథావిధిప్రతిషేధశాస్త్రమపి భేదాపేక్షత్వాత్, తదభావేవ్యాహన్యేత। మోక్షశాస్త్రస్యాపిశిష్యశాసిత్రాది భేదాపేక్షత్వాత్, తదభావేవ్యాఘాతఃస్యాత్. కథంచ అనృతేన మోక్ష శాస్త్రేణ ప్రతిపాదితస్య ఆత్మైకత్వస్య సత్యత్వముపపద్యేత? ఇతి. అత్రోచ్యతే నైషదోషః। సర్వవ్యవహారాణామేవ ప్రాగ్బ్రహ్మాత్మతావిజ్ఞా- నాత్ సత్యత్వోపపత్తేః। స్వప్నవ్యవహారస్యేవ ప్రాక్ప్రబోధాత్" "మరి సర్వాత్మనా, ఏకత్వమే సత్యము, భేదమసత్యమని యంగీకరించుచో,

భేదములేదుకనుక ప్రత్యక్షాదిలౌకికప్రమాణములు ప్రతిహతములు కావలసి వచ్చును. తెలిసికొనువాడు, తెలియబడునది అను భేదము లేదుకావున ప్రమాణమునకు విషయములేదుకదా! అట్లే విధిప్రతిషేధశాస్త్రముకూడ (ఇదిచేయుము, ఇదిచేయవద్దు అని చెప్పెడి శాస్త్రవచనముకూడ) వ్యర్థమే. మోక్షశాస్త్రమగు వేదాన్తవాక్యజాతముకూడ శిష్యుడు, గురువు మున్నగు భేదమునే ఆశ్రయించి ప్రవర్తించునప్పుడు, ఆ భేదము మిథ్యయైనచో, ఆ శాస్త్రము ప్రతిహతము (నిష్ప్రయోజనమై అప్రమాణము) కావలసి వచ్చునుకదా! మరియు, అసత్యమైన మోక్షశాస్త్రముచే ప్రతిపాదింపబడిన బ్రహ్మాత్మైకత్వజ్ఞానము సత్యమెట్లగును? అను శంకకిది సమాధానము. బ్రహ్మాత్మజ్ఞానము కలుగుటకుపూర్వము సర్వవిధిలౌకికవైదికవ్యవహారములు సత్యమేయని యంగీకరింతుము. మెలకువకలుగుటకు పూర్వము స్వప్నజ్ఞానము సత్యమే. అనగా మెలకువకలిగిన తరువాతనే స్వప్నమసత్యమని నిర్ధారింపబడినట్లు, బ్రహ్మాత్మైకత్వ (బ్రహ్మము ఆత్మ ఒక్కటేనను) జ్ఞానముకలిగినవెంటనే శాస్త్రముమిథ్యయని పర్యవసించును' అని పేర్కొనినారు. అట్లే —"కథంత్వసత్యేన వేదాన్తవాక్యేన సత్యస్య బ్రహ్మాత్మత్వప్రతిపత్తిరుపపద్యేత, నహిరజ్జుసర్పేణదష్టోమ్రియతే, నాపి మృగతృష్ణికాంభసా పానావగాహనాది ప్రయోజనం క్రియత ఇతి. నైష దోషః. శంకావిషాదాది నిమిత్తమరణాదికార్యోపలబ్ధేః" "మరి, అసత్యమైన వేదాన్తవాక్యముచే సత్యమైన బ్రహ్మాత్మత్వము ఎట్లుతెలియును. రజ్జువునుచూచి సర్పమని భ్రాన్తిపడినవానికి మరణముకలుగుటలేదు, అట్లే ఎండమావులనీటిలో దప్పికతీర్చుకొనుట, స్నానమాచరించుట ఎవ్వరు చేయజాలరుకదా! అన్నచో ఇది దోషముకాదు. పాముకరచినదేమో అను శంకచేతను, దానివలనకలిగిన విషాదముచేతను మరణముకలుగుట అనుభవగోచరమేకదా! కనుక, మిథ్యయైన శాస్త్రమువలనకూడ సత్యమైన బ్రహ్మాత్మజ్ఞానము (బ్రహ్మము, ఆత్మ ఒక్కటేనను జ్ఞానము) కలుగవచ్చును అనియు పేర్కొనియున్నారు. ఈ వాక్యములచే శాస్త్రము,

ఉపదేష్ట, శిష్యుడు అంతయు మిథ్యయనియు, ఇట్లు మిథ్యయైన శాస్త్రముచేతనే పైనిపేర్కొనబడిన బ్రహ్మమాత్రసత్యత్వము, జగన్మిథ్యాత్వము మున్నగునవి తెలియుచున్నవనియు స్పష్టమగుచున్నది.

ఈ మతమునగల యస్వారస్యమును భగవద్రామానుజులు ముందు ప్రదర్శింపగలరు.

## ॥ భాస్కరమతసంక్షేపము ॥

మూ॥ అపరేతు—"అపహతపాప్మత్వాది సమస్తకల్యాణగుణోపేతమపి బ్రహ్మ, తేనైవ ఐక్యావబోధేన కేనచిదుపాధి విశేషేణ సంబద్ధం బధ్యతేముచ్యతేచ, నానావిధమలరూప పరిణామాస్పదంచ"—ఇతి వ్యవస్థితాః।

అనువాదము:- మరికొందరు—"అపహతపాప్మత్వము మున్నగు నిఖిలకళ్యాణగుణములతోకూడినదయ్యును, ఆ బ్రహ్మమే దానితో ఐక్యము పొందినట్లుగ తెలియబడుచున్న ఒకానొక ఉపాధివిశేషముతో కూడినదై, బంధమును, మోక్షమును పొందుచున్నది. అనేకవిధములగు దోషరూపములైన అశుభపరిణామములకు ఆశ్రయమగుచున్నది" — అని నిశ్చయించిరి.

వివరణము:- ఇప్పుడు భగవద్రామానుజులు భాస్కరమతమును పూర్వపక్షముగ ప్రదర్శించుచున్నారు. వాస్తవమునకు భాస్కరమతము శాంకరమతమునకు ప్రతిద్వంద్వియైనది. భగవద్రామానుజులకు పూర్వమే భాస్కరులు తమసూత్రభాష్యమున మాయావాదమును తీవ్రముగా ప్రతిఘటించి భేదాభేదవాదమును ప్రతిష్ఠాపించినారు. భగవద్రామానుజుల శాంకరమతఖండన ప్రకారమునకును, భాస్కరుల శాంకరమతనిరాకరణ ప్రక్రియకును చాలసామ్యమున్నది. బ్రహ్మసూత్రభాష్యమున పలుతావులందు భాస్కరులు, స్వయముగ తమమతమును 'భేదాభేద

వాదము'గ స్పష్టపరచియున్నారు.

"కార్యరూపేణ నానాత్వమభేదః కారణాత్మనా।
హేమాత్మనాయథాభేదః కుండలాద్యాత్మనా భిదా॥ అనియు;

"అతో భిన్నాభిన్న రూపం బ్రహ్మేతివ్యవస్థితమ్" ఇత్యాది వచనములచే ఈ భేదాభేదవాదము నిర్దేశింపబడినది. (బ్ర.సూ. 1-1-4 పే.18) కటకకుండలాదివస్తునిర్మాణమునకు కారణమైన హేమము (బంగారము) కారణరూపముగ (మూలద్రవ్యముగ) ఒక్కటే అయ్యును, కటకాది (గాజులు మున్నగు) కార్యరూపమునుబట్టి వేరువేరుగనున్నట్లు, నిఖిల జగత్కారణమైన బ్రహ్మము, కారణరూపముగ అభిన్నమైనప్పటికిని, వివిధకార్యజాతమునుబట్టి (మనుష్యులు, పర్వతములు మున్నగు వివిధ చిదచిద్వస్తురూపములనుబట్టి) భిన్నభిన్నముగనున్నది. కారణమగు బ్రహ్మమే కార్యమగు ప్రపంచముగ పరిణమించుచున్నదని భాస్కరుల సిద్ధాన్తము. ఈ విధముగ బ్రహ్మము భిన్నాభిన్నరూపము.

"అనుపపత్తేస్తు నశారీరః" (బ్ర.సూ. 1-2-3); "కర్మకర్తృవ్యపదేశాచ్చ" (1-2-4); "శబ్దవిశేషాత్" (1-2-5); "స్మృతేశ్చ" (1-2-6) అనునీనాలుగు సూత్రములచేతను జీవాత్మపరమాత్మలకుగల భేదము ప్రతిపాదింపబడినదనియు, అది న్యాయసహితమనియు, ప్రత్యక్షానుమానప్రమాణములచేతను, 'తత్త్వమసి' 'నాన్యోఽతోఽస్తి' ఇత్యాద్యాగమప్రమాణముచేతను అభేదముకూడ సిద్ధమేననియు పేర్కొని, తన 'భేదాభేదవాదము'ను సహింపరానివారివాదమును భాస్కరులు ఖండించియున్నారు. 'తదేతత్ భేదాభేదదర్శనం సూత్రకారాభిమతమరోచయమానాః కేచిన్మాయావాదినః వదన్తి — "ఈశ్వరస్యైవ సంసారిత్వమ్, తదంశభూతో జీవో నామనాస్తి, అవిద్యాకల్పితోపాధికృతభేదాత్ వ్యవహారః సంసారీతి। తదేతదయుక్తమ్. నేశ్వరస్యసంసారిత్వమ్, అవిద్యాఽయోగాత్, 'విజ్ఞానమానందంబ్రహ్మే"తి నిరతిశయానందరూపత్వాత్, స్వభావసిద్ధ

విద్యారూపత్వాచ్చ, నచతస్యాఽవిద్యాయోగః సంభవతి; సచసర్వజ్ఞః సర్వశక్తిః, కస్మాదాత్మానం సంసారిణంకుర్యాత్? యోహిపరతంత్రః, స బంధనాగారే ప్రవేశ్యతేఽపి. తస్మాత్-తదంశభూతస్యజీవస్య అవిద్యా కామకర్మయోగాత్ సంసారిత్వమ్, యథాచైతత్ తథా ఉత్తరత్ర నిపుణం వక్ష్యామః."

ఈ వాక్యములు భాస్కరులమతమును సంగ్రహముగ స్పష్టపరచు చున్నవి. ఇది వీటి తాత్పర్యము—

"సూత్రకారులకు సమ్మతమైన యీ భేదాభేదదర్శనమును సహింప జాలని కొందరు మాయావాదులు, ఇట్లు చెప్పుచున్నారు. "ఈశ్వరునకే సంసారిత్వము, ఈశ్వరాంశభూతుడగు జీవుడనెవ్వడులేడు. అవిద్యవలన కల్పింపబడిన ఉపాధులవలన నేర్పడిన భేదవ్యవహారమే ఈశ్వరుడు, జీవుడు అనునది. కావున ఈశ్వరుడే సంసారి" అని. ఇది యుక్తము కాదు. ఈశ్వరునకు అవిద్యాసంబంధములేదు. కనుక తన్మూలమగు సంసారిత్వములేదు. 'విజ్ఞానమానందంబ్రహ్మ' (విజ్ఞానము, ఆనందము స్వరూపముగకలవాడు పరమాత్మ) ఇత్యాది వచనములచే, బ్రహ్మము నిరతిశయానందరూపమని తెలియుచున్నది. కావున స్వభావతః జ్ఞాన స్వరూపముకదా బ్రహ్మము! కనుక అట్టి ఈశ్వరునకు (బ్రహ్మమునకు) అవిద్యాసంబంధమెంతమాత్రము కుదరదు. సర్వజ్ఞుడు, సర్వశక్తిసంప న్నుడు అయిన పరమాత్మ తనను తానేల సంసారిగా చేసికొనును? ఎవ్వడు పరతంత్రుడో (స్వతంత్రుడుకాడో) వాడే బంధనాగారమున ప్రవే శింపజేయబడును. కనుక, పరమాత్మకు అంశమైన జీవునకే అవిద్యా, కామ, కర్మముల సంబంధముచే సంసారిత్వము. ఈ విషయమును ముందుముందు యుక్తియుక్తముగ నిరూపింతుము" అని.

ఈ వాక్యములనుబట్టి భాస్కరులు అద్వైతులచే నంగీకరింపబడిన— "బ్రహ్మేశ్వరజీవులకు ఔపాధికమైన భేదవ్యవహారము కల్పితమనిగాని,

బ్రహ్మమునకే సంసారిత్వమనిగాని అంగీకరింపలేదని స్పష్టమగుచున్నది. ఈయనమతమున బ్రహ్మేశ్వరభేదమేమియులేదు. బ్రహ్మము, లేదా ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడు, మరియు 'అపహతపాప్మత్వాది కల్యాణగుణములుకలవాడు. అద్వైతులంగీకరించిన 'నిర్విశిష్ట బ్రహ్మము'ను భాస్కరులంగీకరింపలేదు. కనుకనే—'అస్మిన్నస్యచ తద్యోగంశాస్తి' (బ్ర.సూ. 1-1-19) అను సూత్రభాష్యమున—నిర్విశేష బ్రహ్మవాదమును నిరాకరించి, సగుణబ్రహ్మమునే అంగీకరించినారు. "యదప్యుక్తం నిర్విశిష్టం బ్రహ్మ వివక్షితమితి, తదప్యయుక్తం. ఆనంద గుణస్య బ్రహ్మణో వివక్షితత్వాత్, అతఏవోత్తరత్ర కేవలేనగుణవచనేన గుణీనిర్దిశ్యతే—'సైషా ఆనందస్యమీమాంసా, ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే' ఇతి". "నిర్విశిష్టమైన (ఎట్టి విశేషములు (గుణాదులు) లేని కేవలనిర్గుణమైన బ్రహ్మమే ఇచ్చట చెప్పదలచినదన్నమాట కూడసరికాదు. ఆనందగుణముగల బ్రహ్మమే ఇచ్చట వివక్షితము. (చెప్పదలచినది). కనుక అందువలననే ముందుముందు కేవలగుణవాచక శబ్దమును ప్రయోగించి, తద్ద్వారమున 'గుణి' (గుణములుకలబ్రహ్మము) నిర్దేశింపబడుచున్నది. ఎక్కడననగా—'సైషానందస్య మీమాంసా' ఇత్యాదిమంత్రమున." ఈ గ్రంథమునుబట్టి భాస్కరమతమున— బ్రహ్మము సవిశేషమని తెలియుచున్నది.

మరియు బ్రహ్మమునకు రూపముకూడ కలదని భాస్కరులు నిరూపించిరి. "పరమేశ్వరస్యాపి సర్వశక్తిత్వాదుపాసకానుగ్రహాయ రూపోపాదాన సంభవాత్. కిం మాయారూపం? నేతి బ్రూమః. పారమార్థికమేతత్" (బ్ర.సూ. 1-1-20 'అంతస్తద్ధర్మోపదేశాత్' అను సూత్రభాష్యమున) "యఏషోఽన్తరాదిత్యే—ఇత్యాది మంత్రమున హిరణ్యశ్మశ్రువులతోకూడినరూపము వర్ణింపబడినదికనుక ఇక్కడ జీవుడే పరామర్శింపబడినాడుకాని పరమాత్మకాదు అన్నచో—ఇది యుక్తముకాదు. పరమాత్మకుకూడ ఉపాసకానుగ్రహనిమిత్తముగ రూపమును గ్రహించుట

కుదురునుకదా! ఈ రూపము మాయా కల్పితమా? కాదు. ఇది యథార్థమైన రూపమే.” ఇత్యాది గ్రంథముచే పరమాత్మకు రూపవత్త్వము ప్రతిపాదింపబడినది.

భాస్కరులు మాయావాదులంగీకరించిన అవిద్యాస్వరూపమును, ప్రపంచమిథ్యాత్వమును సమ్మతింపలేదు. వారియభిప్రాయము— ‘తత్తు సమన్వయాత్’ (బ్ర. 1-1-4) అను సూత్రమున విస్తారముగ స్పష్టపరుపబడినది. (పే. 17, 18, 19). ఈ క్రింది వాక్యములు భాస్కరుల యభిప్రాయమును స్పష్టపరచుచున్నవి. “తస్మాన్న భేదదర్శనమవిద్యా। నాపీశ్వరస్య, కింతర్హి? జీవస్య-వస్తుభూతస్య-దేహాదిష్వనాత్మసు విప-రీతజ్ఞానం, బ్రహ్మస్వరూపాపత్తిశ్చ, తదుభయం గ్రహణాగ్రహణ-మవిద్యా! సో‘తత్త్వమస్యా’ది వాక్యశ్రవణజనితయా-విద్యయా-నివర్తతే. నప్రపంచదర్శనమ్. బ్రహ్మకార్యత్వాత్ ప్రపంచస్య వస్తుత్వం; బ్రహ్మైవహి కారణాత్మనా కార్యాత్మనావాఽవస్థితమిత్యుక్తమ్. నహి బ్రహ్మవిషయం జ్ఞానం మిథ్యాభవితుమర్హతి.” (బ్ర. 1-1-4, పే. 19)

ఇది దీని భావము. “కనుక—అద్వైతవేదాన్తులు చెప్పినట్లు భేద దర్శనము (భేదమునుచూచుట) అవిద్యయనరాదు. ఈ అవిద్య ఈశ్వరు నకుండదు. మరియెవ్వరికి? జీవునకు—సత్యమైనస్వభావముకలజీవు నకు—ఆత్మలుకానిదేహములయందు ఆత్మయనుబుద్ధి, అనగా విపరీత జ్ఞానము, మరియు బ్రహ్మస్వరూపమును తెలియకుండుట. ఈ రెండును, అనగా అనాత్మలగుదేహములనాత్మలుగా గ్రహించుట, బ్రహ్మముయొక్క స్వరూపమును గ్రహింపకుండుట—అవిద్య. ఈ అవిద్య ‘తత్త్వమసి’ మున్నగు వేదాన్తవాక్యములశ్రవణమువలన కల్గిన విద్యచే తొలగిపోవును. కనుక ప్రపంచదర్శనము అవిద్యకాదు. విపరీతజ్ఞానమే అవిద్య. ప్రపంచము బ్రహ్మమువలన పుట్టినదికావున వాస్తవమే. కారణముగనున్న బ్రహ్మమే కార్యరూపముగగూడనున్నదని చెప్పబడినది. కావున ప్రపంచ జ్ఞానము అనగా బ్రహ్మవిషయకజ్ఞానమే. ఇది మిథ్య యెంతమాత్రము

కాదు" అని చెప్పియున్నారు.

మరియు—"అస్మత్పక్షేతు నభేదజ్ఞాన నివృత్తిరవిద్యానివృత్తిః. కింతర్హి? శరీరాదావనాత్మని ఆత్మబుద్ధి నివృత్తిః। తన్నివృత్తౌ చ శరీర పాతాదనన్తరం సర్వజ్ఞః, సర్వశక్తిః, నిరతిశయసుఖసంవేదీ ముక్తో భవతీతి నిరవద్యమ్." "మాపక్షమున భేదజ్ఞానము తొలగుట అవిద్యతొలగినట్లు కాదు. మరియేమి? అన్నచో, ఆత్మకాని శరీరాదులయందు ఆత్మబుద్ధి తొలగుటయే. ఇట్టి విపరీతజ్ఞానము తొలగగనే ముక్తుడు (ముక్తిని పొందిన జీవుడు) సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడు, నిరతిశయమైన సుఖమును దెలిసికొనువాడును కాగలడు". ఈ వాక్యములనుబట్టి భాస్కర మతానుసారముగ జగత్సత్యత్వము, మోక్షస్వరూపము స్పష్టమగు చున్నవి.

భాస్కరులు శంకరులవలె పాంచరాత్రమును నిరాకరింపరైరి. శంకరభగవత్పాదులు ఉత్పత్త్యసంభవాధికరణమున (2-2-42) పాంచ రాత్రప్రతిపాదితమగు—'వాసుదేవునినుండి సంకర్షణాఖ్యజీవుడావిర్భవిం చుట' మున్నగునది నిరాకరించినారు. కాని భాస్కరులు పాంచరాత్ర ప్రతిపాదితమతమును స్వీకరించిరి. ఈ క్రింది వాక్యములు వారియభి ప్రాయమును స్పష్టపరచుచున్నవి. "వాసుదేవఏవ ఉపాదానకారణం, జగతో నిమిత్తకారణంచేతి తేమన్యన్తే.... తదేతత్ సర్వం. శ్రుతిప్రసిద్ధ మేవ. తస్మాన్నాత్రనిరాకరణీయం పశ్యామః" (బ్ర. సూ. 2-2-41) "వాసుదేవుడే జగత్తునకు ఉపాదానకారణము (సమవాయికారణం) నిమి త్తకారణమునని వారు (పాంచరాత్రమతావలంబకులగు భాగవతులు) భావించుచున్నారు. ....ఇదియంతయు వేదప్రసిద్ధమే. కనుక, ఇక్కడ నిరాకరింపదగినదేమియు కన్పట్టదు" అని.

ఇంక బ్రహ్మపరిణామవాదమును గురించిన భాస్కరుల యభిప్రా యములనొకింత పరిశీలింతము.

"తదనన్యత్వమారంభణశబ్దాదిభ్యః" (బ్ర. 2-1-14) అను సూత్ర భాష్యమున భాస్కరులు ఔపనిషదమగు మృద్దృష్టాన్తమును సమన్వయించుచు—"మాయావాదులు పేర్కొనినట్లు, మృత్తికే సత్యము, తద్వికారజాతమసత్యమనిగాని, బ్రహ్మమే సత్యము, జగదాదిమిథ్యయనిగాని యనుట కుదరదనియు, జగన్మిథ్యాత్వము ప్రత్యక్షానుమానాదిప్రమాణ ప్రతిపన్నముకాద"నియు విస్తారముగ నిరూపించి—బ్రహ్మపరిణామమే యీ జగత్తని పేర్కొనినారు. నిరవయవమైన బ్రహ్మపదార్థమునకు పరిణామమెట్లు సంభవమను మాయావాదుల శంకను సమాధానించుచు— "సర్వజ్ఞత్వాత్, సర్వశక్తేశ్చ-స్వేచ్ఛయా పరిణమయేదాత్మానమ్, ఇతి శక్యతేవక్తుమ్". సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడునునైన పరమాత్మ స్వేచ్ఛగా తనసుతాను పరిణమింపజేసికొనునని చెప్పవచ్చునని పేర్కొనిరి. ఈ సందర్భమున క్షీరదధిపరిణామమిచ్చట దృష్టాన్తముగ నీయబడినది. (క్షీరవత్) "లోకమునగల భావవస్తువులపరిణామములే, విచిత్రముగ నూహింపనలవికానట్లుండగా చేతనుడును, సర్వజ్ఞుడును, స్వతంత్రుడునై, శాస్త్రమాత్రసమధిగమ్యుడై, జగత్కారణమైన పరమాత్మయొక్క పరిణామమిట్టిదియని యెవ్వరు నిరూపింపగలరు? ఆ పరమాత్మ స్వేచ్ఛగా, తనసుతాను, లోకహితార్థమై పరిణమింపజేసికొనును. శ్రుతిగూడనిట్లే చెప్పుచున్నది—"తస్మాదాత్మన ఆకాశః సంభూతః" (ఆ యాత్మనుండి ఆకాశము పుట్టినది.) సంకల్పమాత్రముచేతనే పరమాత్మనుండి సమస్తాకాశాది సృష్టి యేర్పడుచున్నది. సర్వస్రష్టయగు పరమాత్మయొక్క శక్తిని తెలిసికొననెవ్వరికి సాధ్యముకాదని—'కో అద్ధా వేద? కో ఇహప్రావోచత్ కుత ఆయాతా, కుత ఇయం విసృష్టిః' ఇత్యాది వేదము నుడువుచున్నది. మరియు శ్వేతాశ్వరవచనములుకూడ ఈశ్వరునకు అచింత్యశక్తికలదని పేర్కొనుచున్నవి. 'పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే' ఇత్యాది. 'స్వాభావికీ' అనుటచే పరమాత్మకుగలశక్తి, ఆగన్తుకముకాదని చెప్పబడుచున్నది. నిరవయవమైన మనస్సునకు, కామక్రోధాదిపరిణామములేర్పడుచున్నను దానికి స్వరూప ప్రచ్యుతిలేదు.

అట్లే బ్రహ్మపరిణామ విషయమునగూడనని యెరుగవలయును. ఆకా శమునుండి వాయువు, వాయువునుండి అగ్ని, ఇత్యాదిగ సృష్టిక్రమము చెప్పబడగా నచ్చటకూడ కారణమునకు స్వరూపప్రచ్యుతి (స్వరూప నాశము) లేదని స్పష్టమగుచున్నది కదా!" అని యీవిధముగ భాస్క రులు పరిణామ వాదమునుపపాదనము చేసిరి. (పే 96, 97, 98.)

సర్వజ్ఞత్వాది విశిష్టమైన బ్రహ్మమునకైనను-స్వరూప పరిణామ మంగీకరించినచో అపరిహార్యములైన దోషములు అంటక తప్పదుకనుక ఈ అస్వారస్యమును పురస్కరించుకొనియే భగవద్రామానుజులీమతమును ముందు ముందు నిరాకరింతురు.

## ॥ యాదవప్రకాశమతము ॥

మూ॥ అన్యేపునః—ఐక్యావబోధయాథాత్మ్యంవర్ణయన్తః, "స్వాభా వికనిరతిశయాపరిమితోదారగుణసాగరం బ్రహ్మైవ, సుర-నర-తిర్యక్-స్థావర-నారకి-స్వర్గ్యపవర్గి-చేతనైక స్వభావం, స్వభావతో విలక్షణం చా విలక్షణంచ వియదాదినానావిధ పరిణామాస్పదంచ" ఇతి ప్రత్యవతిష్ఠంతే.

అనువాదము:- మరికొందరు తత్త్వమస్యాది వాక్యములచే ప్రతి పాదింపబడిన ఐక్యావబోధయే (ఏకత్వ జ్ఞానమే) యథార్థమని వర్ణించు చున్నవారై, "సహజసిద్ధమును, నిరతిశయమును, లెక్కింపనలవికానిదియు నగు సర్వోత్కృష్టగుణగణమునకు ఆశ్రయమైన పరమాత్మయే, దేవతలు-నరులు-పశుపక్ష్యాదులు-స్థావరములు (చెట్లు మున్నగునవి)-నరకమం దుండు జీవులు-స్వర్గమందుండు జీవులు-ముక్తులు (మోక్షమును పొందిన జీవులు) మున్నగు చేతనులే స్వరూపముగా కలవాడై, సహజముగనే విలక్ష

ణుడు (భిన్నుడు). అవిలక్షణుడు (అభిన్నుడు) అయి, ఆకాశముమున్నగు అనేక పరిణామముల కాశ్రయమగుచున్నాడు" అని శ్రుతి వాదమొనర్చుచున్నారు.

వివరణము:– ఈ గ్రంథము(వాక్యసముదాయము) యాదవప్రకాశ మతమును ప్రదర్శించుచున్నది. యాదవ ప్రకాశులు భగవద్రామాను జులకు పూర్వము విద్యను బోధించిన గురువులు. తరువాత భగవద్రా మానుజులకుశిష్యులై 'గోవిందదాస' నామముతో 'యతిధర్మసముచ్చ యము'ను గ్రంథమును రచించినట్లు ఐతిహాసికులు చెప్పుదురు. ఈ గ్రంథము పదకొండు పర్వములతోకూడి, సన్న్యాసవిషయకములగు శ్రుతి స్మృతి ప్రసిద్ధ ధర్మముల నిరూపించుచున్నది. ఇదికాక వీరు స్వసిద్ధా న్త ప్రతిపాదకములగు గ్రంథముల వేటిని రచించినట్లు ప్రమాణములులేవు. భగవద్రామానుజులచే పూర్వపక్షముగనుద్ధరింపబడిన భావములు, తదను సారముగ వేదాన్త దేశికాదులచేతను – తత్తద్వ్యాఖ్యాతలచేతను ప్రదర్శిం పబడిన యంశములు తప్ప, భాస్కరులమతమువలె యాదవప్రకాశమత మును సాక్షాత్తుగ తెలిసికొనుటకు గ్రంథములేవియులేవు.

భగవద్రామానుజగ్రంథతాత్పర్యమిది.

'తత్త్వమసి' ఇత్యాది వేదాన్తవాక్యములచే బోధింపబడిన జీవ–పర– తాదాత్మ్యము (జీవులకు–పరమాత్మకుగల అభేదము) యథార్థమని యాదవ ప్రకాశమతము. అనగా అచిత్‌బ్రహ్మములకును (జడప్రపంచము– బ్రహ్మము ఈ రెండిటికిని), జీవ బ్రహ్మములకును తాదాత్మ్యము (అభే దము) స్వాభావికమని యభిప్రాయము. అట్లే భేదముకూడ స్వాభావి కమే. ఈ.యభిప్రాయమునే భగవద్రామానుజులు – 'స్వభావతో విల క్షణం చావిలక్షణంచ' 'సహజముగనే భిన్నము–అభిన్నము' అని పేర్కొ నినారు. ఈ విధముగ యాదవప్రకాశమతము–'స్వాభావిక భేదాభేదవాద' మని యెరుగవలయును.

శ్రీభాష్యములోని జిజ్ఞాసాధికరణమున భగవద్రామానుజులు భాస్కరమతమును – 'భేదాభేదవాదము'గను, యాదవప్రకాశ మతమును 'స్వాభావికభేదాభేదవాదము'గను నిర్దేశించి యున్నారు. ఈ వాదమునను సరించి బ్రహ్మము జీవభావమును పొందియున్నది. ఈ విషయమే – 'బ్రహ్మైవ సుర – నర – తిర్యక్ – స్థావర – నారకి – స్వర్గి – అపవర్గి – చేతనైక స్వభావం' — ఇత్యాది వాక్యములచే భగవద్రామానుజులు నిర్దేశించియున్నారు. బ్రహ్మమే స్వయముగ దేవతలు – నరులు – పశు పక్ష్యాదులు – స్థావరములైన (కదలికలేని) చెట్లు, పర్వతములు మున్నగు వస్తుజాతము – నరకమందుండు జీవులు – స్వర్గవాసులగు జీవులు – ముక్తులైన జీవులు – మున్నగు చేతన (జీవ) స్వభావమును పొందుచున్నది. అంతియేకాక – ఆకాశాదిభూత పరిణామమును గూడ పొందుచున్నది. కనుకనే యీ వాదమును కొందరు 'బ్రహ్మపరిణామ' వాదమనికూడ పేర్కొనినారు. ఈ వాదమున బ్రహ్మము సగుణమే. ఈ విషయమే– 'స్వాభావికనిరతిశయాపరిమితగుణసాగరమ్' అను మాటచే చెప్పబడినది.

మరి, బ్రహ్మమునకు సహజములగు భేదాభేదములు ఎట్లు సిద్ధించును? అను ప్రశ్నమునకు సమాధానముగా సముద్రఫేన తరంగ దృష్టాంతము చూపబడినది. జలరూపముగ సముద్రము అభిన్నమే అయినను – జల వికారములగు – నురుగు – తరంగములు – బుద్బుదములు (బుడగలు) మున్నగువాటినిబట్టి భిన్నముకూడ నగుచున్నది. అట్లే బ్రహ్మము–స్వభావముచే–అభిన్నము, వివిధ చేతనస్వభావమునుబట్టి భిన్నముకూడనగు చున్నది. ఈ 'సముద్రఫేన తరంగ దృష్టాన్తము' శంకరభగవత్పాదులకంటె ప్రాచీనుడగు 'భర్తృప్రపంచుడ'ను వేదాన్తి ప్రదర్శించినాడు. భగవత్పాదులీ దృష్టాన్తమును బృహదారణ్యకభాష్యమునను, సూత్రభాష్యములోని భోక్త్రాపత్త్యధికరణమునను ప్రదర్శించియున్నారు. 'సముద్రాదుదకాత్మనోఽనన్యత్వేఽపి, తద్వికారాణాం ఫేనవీచీతరంగబుద్బుదాదీ

నామ్, ఇతరేతరవిభాగః, ఇతరేతరసంశ్లేషాది లక్షణశ్చవ్యవహారః ఉపలభ్యతే.' (బ్ర.సూ. 2-1-13)

'జలవికారములగు నురుగు, అలలు, బుడగలు మున్నగువాటికి జలరూపమగు సముద్రముకంటె భేదములేకున్నను, ఒకదానికంటె నొకటి వేరుగనుండుట, ఒకదానితోనొకటి కలియుటమున్నగు వ్యవహారము కలుగుచున్నది.' ఈ వాక్యములచే భగవత్పాదులీసూత్రభాష్యమున—భోక్తృభోగ్యవిభాగమునుపపాదించినారు. ఈ గ్రంథమును వ్యాఖ్యానించు వ్యాఖ్యాతలు, పరిణామవాదమునాశ్రయించి ఆపాతతః విరోధమును పరిహరించి, తరువాతగల ఆరంభణాధికరణభాష్యముచే వివర్తవాదమునాశ్రయించి పరమసమాధానమునిచ్చినారని పేర్కొనినారు. (న్యాయనిర్ణయవ్యాఖ్య చూడనగును.) కాని భగవత్పాదుల బృహదారణ్యకభాష్యమున నీసముద్రఫేనదృష్టాన్తము నిరాకరింపబడినది. బృహదారణ్యక భాష్యముననీ భేదాభేదవాదము 'ద్వైతాద్వైతము'గా నిర్దేశింపబడినది. సురేశ్వరాచార్యులు తమ బృహదారణ్యకవార్తికమున—

'సముద్ర-తరు-గోపిండ-దృష్టాన్తైః పరమాత్మనః।
వ్యాచక్షతే బలాత్కేచిత్ సమస్తవ్యస్తదర్శనమ్॥' (బృ.వా.693)

'సముద్రము-తరువు-గోపిండము-అను నీమూడుదృష్టాన్తములచే పరమాత్మకు, కొందరు, బలాత్కారముగ, భేదాభేదదర్శనమును ప్రతిపాదించుచున్నారు' అని పేర్కొనినారు.

ఈ భర్తృప్రపంచసిద్ధాన్తమే యాదవప్రకాశులచే గ్రహింపబడినదని వ్యాఖ్యాతలయభిప్రాయము. వేదాన్తదేశికుల 'తత్త్వముక్తాకలాప'ముపై శ్రీబ్రహ్మతంత్రపరకాలయతివిరచితమైన 'భావప్రకాశ'వ్యాఖ్యానమున— ఈ వాదము విస్తారముగ విచారింపబడినది. ఈ క్రింది వచనము 'భర్తృప్రపంచ'మతమే యాదవప్రకాశసమ్మతమని స్పష్టపరచుచున్నది.—'అతః ఇతరబ్రహ్మసూత్రాణ్యపి భర్తృప్రపంచసమ్మత 'ప్రాచీనపరిణామాద్వైత' పరతయైవయోజనీయానీత్యభిప్రేత్య, యాదవప్రకాశాః బ్రహ్మసూత్ర

భాష్యమచీక్లుపన్' (పి.347). 'తనుక, భోక్త్రాపత్త్రేరవిభాగశ్చేత్స్యాల్లోక-వత్' (2-1-13) అను సూత్రమువలె ఇతర బ్రహ్మసూత్రములుకూడ భర్తృ ప్రపంచసమ్మతమైన 'ప్రాచీనపరిణామాద్వైత'పరముగనే వ్యాఖ్యానింప దగినవనిభావించి, యాదవప్రకాశులు బ్రహ్మసూత్రభాష్యమును నిర్మించిరి'. పై సూత్రమును వ్యాఖ్యానించుచు భాస్కరులుకూడ పై సముద్ర ఫేనదృష్టాంతమును యథాతథముగ పరిగ్రహించి తమ భేదాభేదవాదమును సమర్థించుకొనినారు. (చూ. 2-1-13 భాస్కరభాష్యము) పైనిపేర్కొనబడిన గ్రంథమునుబట్టి యాదవప్రకాశులవాదమును 'స్వాభావికభేదాభేద వాదము', 'ద్వైతాద్వైతవాదము', 'బ్రహ్మపరిణామవాదము' అని పిలువ వచ్చును.

ఈ వాదమున బ్రహ్మమునకు సహజముగనే జీవభావము అంగీకరింపబడినందున, బ్రహ్మము జీవగతదోషములకాస్పదమగుచున్నదనుట, దోషబీజము. శ్రీభాష్యమున భగవద్రామానుజులు—"స్వాభావికభేదాభేద వాదేఽపి బ్రహ్మణః స్వతఏవ జీవభావాభ్యుపగమాత్ గుణవత్-దోషాశ్చ స్వాభావికాః భవేయుః" ఇత్యాదిగ దోషబీజమునుద్ఘాటించినారు. ఈ యాదవప్రకాశమతమును, సముద్రఫేనదృష్టాంతమును భగవద్రామానుజులు భోక్త్రాపత్త్యధికరణ శ్రీభాష్యములో విస్తారముగవిచారించి నిరాకరించిరి.

## ॥ శంకరభగవత్పాదమత నిరాకరణము ॥

మూ। తత్ర ప్రథమపక్షే శ్రుత్యర్థపర్యాలోచనపరాః—దుష్పరిహా-రాన్ దోషాన్ ఉదాహరన్తి. తథాహి—ప్రకృతపరామర్శి తచ్ఛబ్దావగతస్య బ్రహ్మణః, స్వసంకల్పకృతజగదుదయ-విభవలయాదయః—'తదైక్షత బహుస్యాం ప్రజాయేయ' (ఛాం. 6-2-3) ఇత్యారభ్య—'సన్మూలాః సోమ్యః ఇమాః సర్వాః

**ప్రజాః, సదాయతనాః, సత్ప్రతిష్ఠాః' ఇత్యాదిభిః పదైః ప్రతిపాదితాః। తత్సంబంధితయా, ప్రకరణాంతరనిర్దిష్టాః సర్వజ్ఞతా-సర్వశక్తిత్వ-సర్వేశ్వరత్వ-సర్వప్రకారత్వ-సమాభ్యధికనివృత్తి-సత్యకామత్వ-సత్యసంకల్పత్వ-సర్వావభాసకత్వాద్యనవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణాః, 'అపహతపాప్మా' (ఛాం.8-7-1) ఇత్యాద్యనేకవాక్యావగత నిరస్తనిఖిలదోషతా చ సర్వే తస్మిన్ పక్షేవిహన్యంతే.**

అనువాదము:-ఈ మూడుపక్షములలోను-మొదటిపక్షమున శ్రుతివచన తాత్పర్యమును పర్యాలోచనమొనర్చుటయందు అభినివిష్టులైన విద్వాంసులు, ఏవిధముగను తొలగింపనలవికాని దోషములనుట్టంకించుచున్నారు. ఎట్లనగా—(తత్త్వమసి-అనుచోట) ప్రస్తుతమును పరామర్శించు తచ్ఛబ్దముచే తెలియబడిన బ్రహ్మమునకు-'తదైక్షత బహుస్యాంప్రజాయేయ' అనియారంభించి ఛాందోగ్యమున-'సన్మూలాః సోమ్య! ఇమాస్సర్వాః ప్రజాః సముదాయతనాః సత్ప్రతిష్ఠాః' ఇత్యాదివచనములచే ప్రతిపాదింపబడినవియు, భగవత్ సంకల్పముచేతనే కల్పింపబడినవియునగు – జగదుత్పత్తి-స్థితి-లయములును; అట్లే పరబ్రహ్మమునకు సంబంధించినవిగా ఇతరప్రకరణములందు నిర్దేశింపబడిన – సర్వజ్ఞత్వము (సర్వమునెరిగినవాడగుట); సర్వశక్తిత్వము (సంపూర్ణశక్తిమంతుడై యుండుట); సర్వేశ్వరత్వము (సమస్తమునకు నియామకుడగుట); సర్వప్రకారత్వము (సమస్తచిదచిత్ప్రపంచమును ప్రకారముగా కలిగియుండుట); సమభ్యధికనివృత్తి (సమానుడు – అధికుడు లేనివాడగుట); సత్యకామత్వము (భోగ్యము-భోగోపకరణములు – భోగస్థానము మున్నగు నిత్యములైన కామములు కలిగియుండుట); సత్యసంకల్పత్వము (అమోఘమగు సంకల్పము కలిగియుండుట); సర్వావభాసకత్వము (సమస్తమునుప్రకాశింపజేయువాడగుట) మున్నగు అపరిచ్ఛిన్నమగు నతిశయముతో(మహత్త్వముతో) కూడిన అసంఖ్యాకములగు కల్యాణగుణబృందములు, అట్లే– 'అప

హత పాప్మా' మున్నగు అనేక వేదాన్తవాక్యములవలన తెలియబడిన 'నిఖిలదోషరాహిత్యము' (ఎట్టిదోషములు లేకుండుట), అనునవియు న్నియు—ఈ పక్షమున (శాంకరపక్షమున) ప్రతిహతములగుచున్నవి.

వివరణము:— భగవద్రామానుజులు మొదట శంకరభగవత్పాద మతమున యామునాది పూర్వాచార్యులచే 'సిద్ధిత్రయా'ది గ్రంథములందు ద్భావితములైన దోషములనుద్ఘాటించుచున్నారు. వాటిలో మొదటి దోషము—బ్రహ్మమునకు సగుణత్వమును ప్రతిపాదించు శ్రుతులకు వ్యాఘాతము కల్గుట అనునది. జగత్సృష్టిస్థితిలయాదులను భగవంతుడు స్వసంకల్పముచేతనే కల్పించుచున్నాడని—'తదైక్షత' ఇత్యాదిఛాందోగ్య వచనముచే సిద్ధించుచున్నయర్థము ప్రతిహతమగుచున్నది. ఏలయన—శంకరభగవత్పాదులు నిర్విశేషబ్రహ్మమునంగీకరించినారు కనుక — వారి మతమున సగుణత్వబోధకములగు శ్రుతులు వ్యర్థములు కావలసివచ్చును. 'తత్త్వమసి' అనువాక్యమునగల 'తత్' అను శబ్దముచే పరబ్రహ్మము బోధింపబడుచున్నదని యంగీకరింపబడినది. దీనికిముందుగల 'తదైక్షత, బహుస్యాం ప్రజాయేయ ఇతి' అనువాక్యమునగల తచ్ఛబ్దముకూడ ప్రకృత విషయమునే అనగా పరబ్రహ్మమునే పరామర్శించుచున్నది. 'తత్ = ఆ పరబ్రహ్మము; బహుస్యాం ప్రజాయేయ = అనేకవిధములుగా పుట్టుదును గాక; ఇతి = అని; ఐక్షత = సంకల్పించినది'. అనియారంభించి—'సన్మూలాః' ఇత్యాది చెప్పబడినది (సోమ్య! = సోమార్హుడవగునోశ్వేతకేతూ!, ఇమాః = ఈ కన్పట్టుచున్న; సర్వాః ప్రజాః = సమస్తప్రజలును (సమస్తజీవులును); సన్మూలాః = 'సత్' అని పిలువబడు బ్రహ్మమునే మూలముగా కల్గియున్నారు; సదాయతనాః = అసద్రూపమగు బ్రహ్మమునే ఆశ్రయముగకలిగియున్నారు; సత్ప్రతిష్ఠాః = ఆ 'సత్' పదార్థమగు పరబ్రహ్మమునందే స్థానమును పొందియున్నారు). అనిచెప్పుటచే—ఆపరమాత్మయే సమస్తసృష్టికి, స్థితికి, లయమునకు కారణమనియు, ఈ విధముగ ఉపనిషద్వాక్యములందు 'తచ్ఛబ్దముచే ప్రతిపాదింపబడిన

బ్రహ్మమునకు 'స్రష్టృత్వము' (సృష్టికర్తృత్వము) మున్నగు గుణము లున్నవని, తెలియుచున్నది. నిర్విశేషబ్రహ్మవాదమున నీ గుణబోధక శ్రుతివాక్యములు నిరర్థకములు కావలసివచ్చును. మఱియు–ఇతర ప్రకరణములందు–

1. యఃసర్వజ్ఞఃసర్వవిత్ (ఎవ్వడు సర్వజ్ఞుడో, సర్వవేత్తయో) అను ముక్తికోపనిషద్వచనము పరబ్రహ్మమునకు సర్వజ్ఞత్వమును ప్రతిపాదించుచున్నది, (1-1-10).

2. పరాస్యశక్తిర్వివిధైవశ్రూయతే
స్వాభావికీజ్ఞానబలక్రియాచ॥

"ఆ భగవానునకు సహజసిద్ధమగు జ్ఞానము, బలము, క్రియ మున్నగు, సర్వోత్కృష్టశక్తి అనేక ప్రకారములుగా వినబడుచున్నది." అను శ్వేతాశ్వతరవచనముచే భగవానునకు 'సర్వశక్తిత్వము' అను గుణము ప్రతిపాదింపబడుచున్నది. (6–8).

3. నతస్యకశ్చిత్ పతిరస్తి లోకే... సఈశోఽస్యజగతో నిత్యమేవ, నాఽన్యోహేతుర్విద్యతఈశనాయ (అస్యజగతః=ఈ ప్రపంచమునకు, నిత్యమేవ=నిరంతరము, సఈశః= ఆతడే నియామకుడు; ఈశనాయ=ఈ జగత్తును నియమించుటకు సమర్థమగు, అన్యోహేతుః=పరమాత్మకంటె వేరైన కారణము, న=లేదు) (శ్వేతాశ్వతరోపనిషత్-6) అను వచనము 'సర్వేశ్వరత్వము'ను ప్రతిపాదించుచున్నది.

4. నతత్సమశ్చాభ్యధికశ్చవిద్యతే (శ్వే. 6) (తత్సమశ్చ=ఆ పరమాత్మతో సమానమైనవాడును, అభ్యధికశ్చ=స్వరూపగుణాదులచే గొప్పవాడును, నవిద్యతే=లేడు) అను వచనముచే 'సమాభ్యధికనివృత్తి' బోధింపబడుచున్నది.

5. సత్యకామః సత్యసంకల్పః (ఛాం. 8-7-1) అను వచనముచే సత్యకామత్వ–సత్యసంకల్పత్వములు తెలియుచున్నవి. కామశబ్దము

నకు కోరికలని యర్థముకాదు. కామశబ్దమునకు 'భోగ్యభోగోపకరణాదు లని యర్థము. సత్యములైన భోగ్యభోగోపకరణాదులు కలవాడు సత్య కాముడు. సత్యసంకల్పశబ్దమునకు అప్రతిహతమైన (మొక్కపోని) సం కల్పము కలవాడని యర్థము. ఇచ్చట సత్యకామత్వము, సత్యసంకల్ప త్వము అను గుణములు ప్రతిపాదింపబడినవి.

6. తస్యభాసా సర్వమిదం విభాతి (కఠో. 2-5-15) (తస్య = ఆ పరమాత్మయొక్క, భాసా = దీప్తిచే, ఇదంసర్వం = ఈ సమస్త ప్రపం చము, విభాతి = ప్రకాశించుచున్నది) అను వచనముచే సర్వావభాస కత్వము (అంతటిని ప్రకాశింపజేయుట) అను గుణము ప్రతిపాదింప బడినది.

7. అపహతపాప్మా (ఛాం. 8-7-1) (సుకృతదుష్కృతములకు ఫలములైన జరారోగాది దోషములెంతమాత్రము అంటనివాడు.) ఈ వచ నముచే అపహతపాప్మత్వమునది చెప్పబడినది.

ఈ వాక్యములనుబట్టి సకల కల్యాణగుణాకరత్వము, హేయప్రత్య నీకత్వము (నింద్యములైన గుణములకు విరుద్ధమై యుండుట) అను ఉభయలింగ వైశిష్ట్యము (రెండు అసాధారణ లక్షణములం కలిగియుం డుట) తెలియుచుండగా నిర్గుణవాదమున నీ శ్రుతులన్నియు నిరర్థకములు కావలసివచ్చునని తాత్పర్యము.

## ॥ అవాంతర పూర్వపక్షము ॥

మూ॥ అథస్యాత్ — "ఉపక్రమేఽపి ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానముఖేన కారణస్యైవ సత్యతాం, ప్రతిజ్ఞాయ, తస్యకారణభూతస్యైవ సత్యతాం-వికారభూతస్యచ అసత్యతాంమృద్దృష్టాన్తేన దర్శ- యిత్వా, సత్యభూతస్యైవ బ్రహ్మణః "సదేవసోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్" ఇతి సజాతీయవిజాతీయ-

నిఖిలభేదనిరసనేన నిర్విశేషతైవ ప్రతిపాదితా. ఏతచ్చోదకాని ప్రకరణాంతరవాక్యాన్యపి—"సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ" "నిష్కళం" "నిష్క్రియం" "నిర్గుణం" "నిరంజనం" "విజ్ఞానమ్" "ఆనందమ్"—ఇత్యాదీని సర్వవిశేషప్రత్యనీకైకాకారతాం బోధయన్తి. నచ ఏకాకారబోధనేఽపి పదానాం పర్యాయతా, ఏకత్వేఽపివస్తునః సర్వప్రత్యనీకాకారతోపస్థాపనేన సర్వ-పదానామర్థవత్త్వాత్" ఇతి.

అనువాదము:- ఇంకనిట్లన్నచో (ఎట్లన) "ఆరంభమున ఒకటి తెలిసినచో అన్నియు తెలియుననిచెప్పుటచే, కారణమొక్కటే సత్యమని ప్రతిజ్ఞచేసి—మృత్తికాదృష్టాన్తముఖమున—కారణమైనవస్తువే సత్యము, దానివలనకల్గిన వికారమగు వస్తుజాతమంతయు అసత్యము, అని ప్రదర్శించి; (కారణరూపముగ) సత్యమైనబ్రహ్మమునకే—'సదేవసోమ్య' ఇత్యాదివచనములచే సజాతీయములు, విజాతీయములునైన సమస్తభేదములను నిరాకరించుటద్వారా—నిర్విశేషత్వము (ఎట్టివిశేషములులేనిదనుట) ప్రతిపాదింపబడినది.

ఇట్టి (నిర్విశేషమగు) పరబ్రహ్మమును శోధించునట్టివగు ఇతర ప్రకరణములందుగల వాక్యములుకూడ—సమస్తవిశేషములకు విరుద్ధమైన ఆకారముకలిగినదే పరబ్రహ్మమని బోధించుచున్నవి. ఆ వాక్యములు—"నిష్కలం' 'నిష్క్రియం' 'నిర్గుణం' 'నిరంజనమ్' 'విజ్ఞానమ్' 'ఆనందమ్' మున్నగునవి. ఎట్టివిశేషములులేని ఒకేవిధమగునాకారముగల వస్తువును బోధించినంతమాత్రమున పదములకు పర్యాయత్వము లేదు. ఈ పదములచే బోధింపబడినవస్తువు ఒక్కటే అయినప్పటికిని, సర్వవిధవిశేషములకు విరుద్ధమైన ఆకారములనే ప్రతిపాదించుచున్నవి కనుక, పదములన్నిటికిని అర్థవత్త్వమున్నదికదా!" అని.

వివరణము:- ఈ వాక్యములు భగవత్పాదుల 'నిర్గుణబ్రహ్మవాదము'ను పూర్వపక్షముగ ప్రతిపాదించుచున్నవి. ఛాందోగ్యోపనిషత్తులోని

ఆరుణిశ్వేతకేతుసంవాదరూపమగు 'సద్విద్యా' ప్రకరణమునకు భగవత్పాద శంకరులును, భగవద్రామానుజులును స్వాభిమతములగు సమన్వయ ముల ప్రతిపాదించిరి. ఈ ప్రకరణము నిర్విశేషబ్రహ్మవాదమును, బ్రహ్మ మాత్ర సత్యత్వ-జగన్మిథ్యాత్వములను ప్రతిపాదించునదని భగవత్పాద శంకరమతము. సగుణమగు బ్రహ్మమునకును—ఆ బ్రహ్మము కారణ ముగాకలిగి ఏర్పడిన ప్రపంచమునకును రెండిటికిని సత్యత్వమునే బోధించునది ఈ ప్రకరణమని భగవద్రామానుజమతము.

శంకరభగవత్పాదులు ఆరంభణాధికరణములోని "తదనన్యత్వమా రంభణశబ్దాదిభ్యః" అను సూత్రభాష్యమున (శాం.భా. 2-1-14) ఔపని షదమైన మృద్దృష్టాన్తమును ఈ క్రింది విధముగా సమన్వయించియు న్నారు. "యథా సోమ్యైకేనమృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్, వాచారంభణం, వికారో, నామధేయం మృత్తికేత్యేవసత్యమ్'- ఇతి. ఏతదుక్తంభవతి. ఏకేన మృత్పిండేన పరమార్థతో మృదాత్మనా విజ్ఞాతేన, సర్వం మృణ్మయం ఘటశరావోదంచనాదికం మృదాత్మకత్వా ఽవిశేషాత్ విజ్ఞాతం భవేత్, యతోవాచారంభణం, వికారో, నామధేయం- వాచైవ-కేవలమస్తీతి ఆరభ్యతే, వికారోఘటః, శరావః, ఉదంచనం చేతి. నవస్తువృత్తేన వికారోనామకశ్చిదస్తి. నామధేయమాత్రం హ్యేతదనృ- తం, మృత్తికేత్యేవ సత్యమితి ఏషబ్రహ్మణోదృష్టాన్త ఆమ్నాతః। తత్ర శ్రుతాద్వాచారంభణశబ్దాత్ దార్ష్టాంతికేఽపి బ్రహ్మవ్యతిరేకేణ కార్యజాతస్య అభావ ఇతి గమ్యతే." (బ్ర.శాం.భా. 2-1-14)

ఈ గ్రంథతాత్పర్యమిది. "యథాసోమ్యైకేన మృత్పిండేన— ఇత్యాద్యుపనిషద్వచనముచే నీయభిప్రాయము చెప్పబడుచున్నది. ఒక్క మృత్పిండము (మట్టిముద్ద) వాస్తవముగ తెలియబడినంతమాత్రముననే, మృద్వికారములైన (మట్టితోచేయబడిన) ఘటము (కుండ), శరావము (చట్టి), ఉదంచము (మూకుడు) మున్నగు వస్తుజాతము మృద్రూపమే కనుక, (మృత్తుకంటె వేరుకాదుకనుక) తెలియబడును. ఎందువలననగా

ఘటాశరావాదివస్తుజాతమంతయు వాక్కుచేమాత్రమే కేవలమున్నదని ఆరంభింపబడుచున్నది. (వ్యవహరింపబడుచున్నది). కనుక 'వాచారంభణ'మే. (వాగ్వ్యవహారమాత్రసిద్ధమే). మరియునిదివికారము. వాస్తవమునకు వికారమనగానేమియులేదు. ఇదియంతయు నామధేయము మాత్రమే. కనుక అసత్యమే. మృత్తికయనునది (కారణద్రవ్యము) మాత్రమే సత్యము అని యిది బ్రహ్మమునకు దృష్టాన్తముగ (ఉదాహరణముగ) చెప్పబడినది. (అనగా అసత్యమైన యీ ఘటాశరావాదివికారజాతమునకు మూలమైన మృత్తికమాత్రమే సత్యమైనట్లు—బ్రహ్మవికారమైన ఈ సమస్త జగత్తునకు, కారణమైన బ్రహ్మమొక్కటే సత్యము, వికారమైన జగత్తు మిథ్య (అసత్యము). కనుకనే 'వాచారంభణం' అను దృష్టాంతమున (ఉదాహరణమున) గల పదముచేతనే (ఇది వాగ్వ్యవహారముమాత్రమే, సత్యముకాదు, అని) బ్రహ్మముకంటె వేరుగకన్పట్టుచున్న సమస్తప్రపంచము బ్రహ్మవికారముకనుక అసత్యమేనని దార్ష్టాన్తికమునకూడ నిరూపింపబడినది" అని. దార్ష్టాన్తికమనగా ఉదాహరణముచే (దృష్టాన్తముచే) నిరూపింపదలచిన ప్రస్తుతవిషయము. జగద్బ్రహ్మముల విషయము దార్ష్టాన్తికము—మృత్శరావాది విషయము దృష్టాన్తమని యెరుగవలయును.

ఈ పూర్వోక్త సమన్వయముమబట్టి బ్రహ్మమాత్రసత్యత్వము—జగన్మిథ్యాత్వము భగవత్పాద సమ్మతమని స్పష్టమగుచున్నది. దీనినే భగవద్రామానుజులు — 'కారణస్యైవసత్యతాంప్రతిజ్ఞాయ — కారణభూతస్యైవసత్యతాం వికారభూతస్య చ అసత్యతాం మృద్దృష్టాన్తేన దర్శయిత్వా' అను మాటలచే నిర్దేశించినారు.

కారణరూపముగ సత్యమైన ఆ పరబ్రహ్మమునకే ఛాందోగ్య వచనముచే నిర్విశేషత్వము (ఎట్టి విశేషములు లేకపోవుట) సిద్ధించుచున్నదని శాంకరమతము. 'సదేవసోమ్యేదమగ్రఆసీత్ – ఏకమేవాద్వితీయమ్'

అను వచనమునుబట్టి బ్రహ్మమునకు నిర్విశేషత్వము సిద్ధించుచున్నదని తాత్పర్యము. ఛాందోగ్యభాష్యమున భగవత్పాదులు–'సదేవ సదిత్యస్తితామాత్రం వస్తు, సూక్ష్మం నిర్విశేషం సర్వగతమ్, ఏకం నిరంజనం నిరవయవం విజ్ఞానం యదవగమ్యతే....ఇదం జగన్నామరూపక్రియావద్వికృతం యత్ తత్ సదేవాసీత్...., అగ్రే=జగతః ప్రాగుత్పత్తేః,.... ....సద్వ్యతిరేకేణ–సతః సహకారికారణం వస్త్వంతరం ప్రాప్తం ప్రతిషిధ్యతే అద్వితీయమితి' (బృ. భా. 6-2-1) ఇత్యాదిగ 'సత్' శబ్దముచే అస్తిత్వమాత్రమైన సూక్ష్మవస్తువు, ఎట్టి విశేషములు లేనిది (నిర్విశేషం), ఒక్కటే, ఎట్టి అవయవములు లేనిది, విజ్ఞానస్వరూపమగు బ్రహ్మము బోధింపబడుచున్నదనియు, దీనికంటె వేరుగ సహకారి కారణము లేదనుటకు అద్వితీయశబ్దము వేయబడినదనియు, ఈ నామరూపవికారముతో కూడిన జగత్తు, సృష్టికి పూర్వము ఎట్టి వికారములు లేకయే సద్రూపముగనున్నదనియు, పేర్కొనినారు. దీనినిబట్టి బ్రహ్మము నిర్విశేషమేనని వారియభిప్రాయము స్పష్టమగుచున్నది.

ఈ యభిప్రాయమునే (ఈ నిర్గుణవాదమునే) ఇతర ప్రకరణములలోగల శబ్దములుకూడ బోధించుచున్నవని వారియభిప్రాయము. 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' (సత్యస్వరూపము, జ్ఞానస్వరూపము, అపరిచ్ఛిన్నస్వరూపమునైనది బ్రహ్మము); నిష్కలమ్ (ఎట్టి అంశములు లేనిది); నిర్గుణమ్ (ఎట్టి గుణములు లేనిది); నిష్క్రియం (ఎట్టి క్రియలు లేనిది); 'నిరంజనమ్' (ఎట్టి ఆరోపితధర్మములు లేనిది); విజ్ఞానమ్ (జ్ఞానము మాత్రమే స్వరూపముగా కలది); ఆనందమ్ (నిరతిశయ సుఖమే స్వరూపముగా కలది) మున్నగు శ్రుతివచనములన్నియు, ఆ పరబ్రహ్మము–సర్వ విశేషములకు ప్రత్యనీకమగు (విరుద్ధమైన) అనగా ఎట్టి విశేషములులేని ఆకారము (స్వరూపము) కలదని బోధించుచున్నవి. అనగా నీ శ్రుతులన్నియు, నిర్గుణబ్రహ్మ ప్రతిపాదకములేనని భగవత్పాదమతము మరి, ఈ శబ్దములన్నియు ఎట్టి విశేషములు లేని ఒక్క

బ్రహ్మమునే బోధించునన్నచో, ఘటము-కలశము మున్నగు శబ్దములకు వలె పర్యాయపదత్వ మేర్పడి సహప్రయోగము (కలిపి ప్రయోగించుట) కుదరకపోవలసివచ్చునుకదా అన్నచో అట్లుకాదు-ఈ పదములు ఒకే అర్థమును బోధించినను-ఆయాయి విశేషములకంటె విలక్షణమైన బ్రహ్మమునే బోధించుచున్నవి కనుక దోషములేదు. అనగా 'సత్యశబ్దము' అసత్య ప్రత్యనీకమైన బ్రహ్మమును, అట్లే జ్ఞానశబ్దము-అజ్ఞాన ప్రత్యనీకమగు బ్రహ్మమును ఇట్లే ఇతర శబ్దములుకూడ తత్తత్ ప్రత్యనీకాకారమగు బ్రహ్మమును బోధించుచున్నవి. ప్రత్యనీకమనగా విరుద్ధమని యర్థము. ఈ విధముగ నీ పదములకు పర్యాయత్వము లేదని తాత్పర్యము.

## ॥ అవాంతరపూర్వపక్షఖండనము ॥

మూ॥ నైతదేవమ్. ఏకవిజ్ఞానేనసర్వవిజ్ఞానప్రతిజ్ఞానం సర్వస్య మిథ్యాత్వే-సర్వస్యజ్ఞాతవ్యస్యాభావాత్ నసేత్స్యతి. సత్య మిథ్యాత్వయోరేకతాప్రసక్తిర్వా; అపిచ ఏకవిజ్ఞానేన సర్వ విజ్ఞానప్రతిజ్ఞా సర్వస్యతదాత్మకత్వేనైవ సత్యత్వే సిద్ధ్యతి.

అనువాదము:- ఇది యిట్లుకాదు. ఒకటి తెలియబడుటచే సర్వము తెలియబడునని ప్రతిజ్ఞచేయుట (మీ మతమున) కుదరదు. ఏలన, సర్వము మిథ్యయే అయినప్పుడు తెలియదగినదేదియు లేదుకదా! మరియు, ఒకటి సత్యము-మరియొకటి మిథ్యయనియన్నచో సత్యము-మిథ్యాత్వము ఈ రెండిటికి ఏకత్వమే ప్రసక్తమగును (సత్యమైనవస్తువు మిథ్యాభూతమగు వస్తువు ఒక్కటే కావలసివచ్చును.) మరియు, ఒకటి తెలిసినచో - సర్వము తెలియుననుమాట - సర్వముతదాత్మకమేకనుక-సత్యమనియంగీకరించినప్పుడే సిద్ధించును. (మృత్పిండమువలె ఘటశరావాదులును సత్యమన్నప్పుడే ఒకటితెలిసినప్పుడు-సర్వము తెలియుననుట కుదురును).

వివరణము:- భగవత్పాద శంకర సమ్మతమగు సమన్వయము

నాశ్రయించి, కారణముమాత్రమే (మృత్పిండము-బ్రహ్మము) సత్యమనియు కార్యము (ఘటశరావాదులు-ప్రపంచము) అసత్యమనియంగీకరించినచో సద్విద్యారంభమున 'ఏకేనవిజ్ఞాతేన సర్వం విజ్ఞాతంభవతి' 'ఒకటితెలిసినంతనే సర్వము తెలియును' అనగా కారణము తెలిసినచో తద్వికారమగు కార్యజాతమంతయు తెలియునను ప్రతిజ్ఞ కుదరక పోవలసివచ్చును. 'ఏకమ్' 'సర్వమ్' అనురెండు పదములచే గ్రహింపబడిన యర్థములకు పరస్పర సంబంధమున్నదికనుక- 'ఏకమ్' అను పదముచే సత్యమైనవస్తువు పరామర్శింపబడినప్పుడు, 'సర్వమ్' అను పదముచేగూడ సత్యమైనవస్తువే పరామర్శింపబడవలయును. అప్పుడు మాత్రమే-ఒక సత్యవస్తువునుండిపుట్టి - తద్వికారములైన - ఇతరసత్యవస్తువులన్నియు తెలియుననుట కుదురును. అనగా కారణమైనసువర్ణము (బంగారము) సత్యమని తెలియబడినప్పుడు, దానినుండి పుట్టిన ఇతరములైన కుండలాది సత్యవస్తువులు తెలియుననుట కుదురును. అట్లుకాక కారణము (మృత్సువర్ణాదికము) సత్యము-దానివలన పుట్టిన కార్యజాతము (ఘటాదులు, కటకకుండలాదులు) అసత్యము అన్నచో-సత్యమువలన నసత్యముతెలియుననుమాట ఎట్లుకుదురును? మీదుమిక్కిలి, వికారజాతమగు ఘటశరావాదులు, కటకకుండలాదులు మిథ్యయని తెలిసినప్పుడు- వాటికి కారణమైన మృద్ద్రవ్యము, సువర్ణము కూడ మిథ్యయేనని తెలియును. అట్లే బ్రహ్మకార్యమైన జగత్తుమిథ్యయని తెలిసినప్పుడు-కారణమగు బ్రహ్మముకూడ మిథ్యయేనని పర్యవసింపవలసివచ్చును. ఈ విధముగా 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్' అను ప్రతిజ్ఞకును-దృష్టాన్తసమన్వయమునకును పొంతనలేకుండ పోవునని తాత్పర్యము.

## :: సద్విద్యాప్రకరణ తాత్పర్యము ::

మూ॥ అయమర్థః। శ్వేతకేతుంప్రత్యాహ—"స్తబ్ధోఽసి, ఉత తమాదేశమప్రాక్ష్యః?" ఇతి; "పరిపూర్ణ ఇవలక్ష్యసే, తానా-

చార్యాన్ ప్రతి తమప్యాదేశం పృష్టవానసి" ఇతి. ఆదిశ్యతే అనేనేత్యాదేశః. ఆదేశః ప్రశాసనమ్. "ఏతస్యవా అక్షరస్యప్రశాసనే గార్గి! సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః" ఇత్యాదిభిః ఐకార్థ్యాత్. తథాచ—మానవం వచః—"ప్రశాసితారం సర్వేషా"మిత్యాది. అత్రాపి 'ఏకమేవ' ఇతి జగదుపాదానతాం ప్రతిపాద్య, అద్వితీయపదేన అధిష్ఠాత్రన్తరనివారణాత్, అస్యైవ అధిష్ఠాతృత్వమపి ప్రతిపాద్యతే. అతః తంప్రశాసితారం జగదుపాదానభూతమ్—అపిపృష్టవానసి? "యేన శ్రుతేన మతేన విజ్ఞాతేన అశ్రుతమ్, అమతమ్, అవిజ్ఞాతం, శ్రుతం, మతం, విజ్ఞాతం భవతి" ఇత్యుక్తం స్యాత్. నిఖిలజగదుదయవిభవవిలయాది—కారణభూతం—సర్వజ్ఞత్వ—సత్యకామత్వ—సత్యసంకల్పత్వాద్యపరిమితోదారగుణసాగరం—కిం బ్రహ్మత్వయాశ్రుతమ్? ఇతిహార్దోభావః.

అనువాదము:– ఇది దీనియర్థము. కుమారుడగు శ్వేతకేతువు నుద్దేశించి తండ్రి యిట్లనెను. 'స్తబ్ధోఽసి ఉతతమాదేశమప్రాక్ష్యః?' 'పరిపూర్ణునివలె కన్పట్టుచున్నావు. ఆ యాదేశమునుగురించి యాచార్యుల ప్రశ్నించితివా? అని. ఆదిశ్యతే అనేన = వీనిచేత ఆదేశింపబడుచున్నది కనుక, ఆదేశః = ప్రశాసనమ్ అనగా ప్రశాసనమును (ప్రశాసకత్వము కలవానిని గురించి) అని యర్థము. 'ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి! సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః' 'ఓ గార్గీ! అక్షరమగు నీ పరబ్రహ్మముయొక్క శాసనమునందే సూర్యచంద్రులిరువురును నియమింపబడుచున్నారు' అనువాక్యముతో ఏకార్థత్వమున్నది కావున (అవాక్యముచే బోధింపబడిన యర్థమునే బోధించుచున్నది కావున) 'ఆదేశ' శబ్దమునకు ప్రశాసనుడు అనగా శాసించువాడు అనియే అర్థము. కనుకనే మను వచనము—'ప్రశాసితారం సర్వేషామ్' 'అన్నిటికిని శాసకుడు (నియామ

కుడు) అయినవానిని' అని కలదు.

ప్రస్తుతమున—'ఏకమేవాద్వితీయమ్' అనుచోట కూడ 'ఏకమేవ' (ఒక్కటే) అనుమాటలచే పరమాత్మ—నిఖిలప్రపంచమునకు ఉపాదాన కారణము (మూలకారణము) అని ప్రతిపాదించి, 'అద్వితీయమ్' అను పదముచే ఈ ప్రపంచమునకు పరమాత్మకంటె వేరొక అధిష్ఠానము (ఆధారము-ప్రేరకము) లేదని నివారించుచు, ఈ పరమాత్మయే అధిష్ఠానమని ప్రతిపాదింపబడినది. కనుక, అట్టి జగత్ప్రశాసకుడు (నియామకుడు) జగత్తుకు ఉపాదానకారణము అయిన పరమాత్మను గురించి ప్రశ్నించితివా? 'యేన-శ్రుతేన, మతేన, విజ్ఞాతేన—అశ్రుతమ్, అమతమ్, అవిజ్ఞాతం—శ్రుతం మతం విజ్ఞాతం భవతి' 'ఏ నిఖిల-జగదుపాదానమైన పరమాత్మ వినబడి, మననము చేయబడి తెలియబడినప్పుడు, (ఇక్కడ 'విజ్ఞాతం' అనుపదమునకు 'నిదిధ్యాసనము'ని యర్థము. అట్లే ఇతరత్ర) ఆ పరమాత్మయేఅధిష్ఠానముగాగలిగి నియమింపబడు ఈ అఖిలజగత్తు శ్రుతము, మతము, విజ్ఞాతము అగుచున్నదో' అనిచెప్పబడినట్లైనది.

ఈ విధముగ 'సమస్త ప్రపంచముయొక్క పుట్టుకకు, స్థితికి, లయమునకుకారణమై, సర్వజ్ఞత్వము - సత్యకామత్వము-సత్యసంకల్పత్వము-మున్నగు అపారములును (అసంఖ్యాకములును) ఉదారములునైనగుణములకు స్థానమైన ఆ పరమాత్మకూడ నీచే వినబడినదా! (అట్టి పరమాత్మనుగురించివింటివా?) అని హృదయగతమగు అభిప్రాయము.

వివరణము:- పూర్వము ఛాందోగ్య "సద్విద్యా" ప్రకరణమునందలి వాక్యములకు భగవత్పాదులు నిర్గుణబ్రహ్మవాదపరముగను, బ్రహ్మసత్యత్వ-జగన్మిథ్యాత్వ ప్రతిపాదనపరముగను సమన్వయించిన రీతిని ప్రదర్శించియుంటిని. ఇక్కడ-భగవద్రామానుజ సమన్వయమును పరి

శీలింపవలయును.

ఛాందోగ్య సద్విద్యాప్రకరణసారమిది.

అరుణ పుత్రుడగు నుద్దాలకుని కుమారుడు శ్వేతకేతువనువాడు, పితాదేశముచే బ్రహ్మచర్యమును వహించి, ఉపాధ్యాయ సన్నిధిని పండ్రెండవ వత్సరము నుండి ఇరువదినాలుగు వర్షములవరకు సమస్త వేదములను సాంగముగ నధ్యయనముచేసి, ప్రౌఢమతియై, తాను సర్వాంగ వేదవిదుడనను అభిమానముతో పరిపూర్ణునివలె తండ్రి చెంతకు తిరిగి వచ్చెను. ఆతనితో తండ్రి యిట్లనెను—"శ్వేతకేతూ! సోమ్యుడా! (సోమరసపానమున కర్హుడైనవాడా! లేక–ప్రియదర్శనుడా!) మహామతివై సాంగవేదాధ్యయన సంపన్నుడనని భావించుచున్నవాడవై పరిపూర్ణునివలె కన్పట్టుచున్నావు! దేనిని గురించి విన్నచో–సర్వము వినబడినట్లగునో, దేనిని మననము చేసినచో సర్వము మననమొనర్చినట్లగునో, దేనిని తెలిసికొన్నచో అంతయు తెలిసినట్లగునో, అట్టి 'ఆదేశము'ను గురించి ప్రశ్నించితివా?"–అని. తన కుమారుడు బ్రహ్మజ్ఞానరహితుడని యెరిగియు—'పరమాత్మయే జగదుపాదాన కారణము, నిమిత్త కారణము అని యెరిగినవాడు మాత్రమే పూర్ణుడనియు—అది తెలియనివాడు అపరిపూర్ణుడే'ననియు–పుత్రునకు తెలియజేయగోరి, పరిపూర్ణుడనని యభిమానపడుచున్న కుమారుని యజ్ఞానమును పోద్రోలి, అతనికి బ్రహ్మజిజ్ఞాసను కలిగించుటకై–తండ్రి యుద్దాలకుడు ఇట్లు ప్రశ్నించినాడు. 'ఉత తమాదేశమప్రాక్ష్యః' అని. ఇచ్చటగల 'ఆదేశ' శబ్దమునకు శంకరభగవత్పాదులు ఛాందోగ్యభాష్యమున–"ఆదిశ్యత ఇత్యాదేశః, కేవల శాస్త్రాచార్యోపదేశ గమ్యమ్ ఇత్యేతద్యేనవా పరంబ్రహ్మాదిశ్యతే స ఆదేశః" ఇత్యాదిగా 'ఉపదేశగమ్యము' లేక 'ఉపదేశరూపమగు వాక్యము' అను అర్థమును బోధించుచున్నదని తెలిపియున్నారు. కాని భగవద్రామానుజులు 'ఆదిశ్యతే అనేన ఇత్యాదేశః' 'ఎవ్వనిచే ఆదేశింపబడుచున్నదో ఆ పరమాత్మయే ఆదేశమని పేర్కొనినారు'. ఆదేశః = ప్రశాసనమ్ = ప్రశాసనమొన

ర్చువాడని వారి తాత్పర్యము. ఈ ఆదేశశబ్ద వ్యుత్పత్తిని గురించి శ్రీ రంగరామానుజముని ప్రణీతమైన ఛాందోగ్య సద్విద్యాప్రకరణభాష్య మున విస్తృత విచారణ మొనర్చబడినది. (చూ.పు. 276 నుండి 283 వరకు) ఇది వారి అభిప్రాయము. "ఆదేశనమ్–ఆదేశః ఇతి 'ఘఞ్' అన్తాత్ భావవాచినః ఆదేశశబ్దాత్, అర్శఆద్యజన్తాదపి ప్రశాసితృత్వార్థ-కత్వమేవ ఆదేశశబ్దస్య యుక్తమితివయముత్ప్రేక్ష్యామః" 'ఆదేశించుటయే ఆదేశము అను నిర్వచనమునుబట్టి భావార్థమున నేర్పడిన ఆదేశశబ్దము కంటె—ఆదేశముకలవాడు అను నర్థమున 'అర్శఆదిభ్యోఽచ్' అను పాణినీయసూత్రముచే 'అచ్' ప్రత్యయము చేర్చగా ఆదేశించువాడై యుండుట (ప్రశాసకుడై యుండుట) అను అర్థము సిద్ధించుచున్నదని భావము.

మరి, ప్రశాసనమగు బ్రహ్మము అను యర్థమును చెప్పుటకు ప్రమాణమేమి? అన్నచో—'ఏతస్యవా అక్షరస్యప్రశాసనే గార్గి! సూర్యా చంద్రమసౌ విధృతౌతిష్ఠతః' అను వచనము 'ప్రశాసితారం సర్వేషామ్' అను మనువచనము ప్రమాణములు. దీనివలన పర్యవసించినదేమనగా–నిఖిల ప్రపంచముయొక్క ఉత్పత్తి–స్థితి–లయములకు కారణమై సర్వజ్ఞత్వాది ధర్మములు కలిగి, నిఖిల నియామకుడైన పరమాత్మను గురించి ఆచార్యుని ప్రశ్నించితివా? అని పితృహృదయ తాత్పర్యము.

మరియు 'ఏకమేవాద్వితీయమ్' అను వాక్యమునగల 'ఏకమ్-ఏవ' (ఒక్కటి) అను మాటలచే, పరమాత్మయే నిఖిలజగత్తునకు ఉపాదాన కారణమని ప్రతిపాదింపబడినది. ఉపాదానకారణమనగా 'సమవాయి కారణ'మని శాస్త్రకారపరిభాష. ఘటనిర్మాణమునకు మృద్ద్రవ్యము ఉపాదానకారణమగును. అదిలేనిచో ఘటాదులు నిర్మింపబడవు. అట్లే సమస్త జగన్నిర్మాణమునకు పరమాత్మయే ఉపాదానకారణము. అనగా మూల కారణము లేక ప్రధానకారణము. అంతియేకాదు. జగన్నిర్మాణమునకు నిమిత్తకారణముకూడ పరమాత్మయే. ఈయంశమునే 'అద్వితీయమ్' అని పేర్కొనుచున్నది. 'నవిద్యతే ద్వితీయం–నిమిత్తకారణం యస్మాత్

తత్ — అద్వితీయమ్' 'దేనికంటె రెండవదైన నిమిత్తకారణములేదో అదియే అద్వితీయము. దీనివలన పరమాత్మకంటె వేరైన అధిష్ఠానము (ఆధారము) లేదని స్పష్టమగుచున్నది. ఈ విధముగ 'ఏకమేవా ద్వితీయమ్ అను శ్రుతివాక్యము-జగత్తునకు ఉపాదానకారణము, నిమిత్తకారణముకూడనైన పరమాత్మను నిర్దేశించుచున్నది. ఇట్టి పరమాత్మను గురించి ప్రశ్నించితివా? అని యొద్దాలకుని యభిప్రాయమని భగవద్రామానుజ గ్రంథ తాత్పర్యము. ఇట్టి పరమాత్మను గురించి విని, మననముచేసి, తెలిసికొన్నచో, ఆయన వలన నేర్పడిన సమస్తజగత్తు వినబడి, మననముచేయబడి, తెలియబడునని యభిప్రాయము. ఇచ్చట తెలియుట అనగా నిదిధ్యాసన విషయమగుటయని అర్థము.

మూ॥ తస్యనిఖిలకారణతయా, కారణమేవ నానాసంస్థానవిశేషసంస్థితం కార్యమిత్యుచ్యతఇతి, కారణభూతసూక్ష్మచిదచిద్వస్తుశరీరకబ్రహ్మవిజ్ఞానేనకార్యభూతమఖిలం జగత్ విజ్ఞాతం భవతీతి—హృదినిధాయ — 'యేన అశ్రుతంశ్రుతంభవతి—అమతంమతమ్, అవిజ్ఞాతం విజ్ఞాతం' స్యాత్ ఇతి పుత్రం ప్రతిపృష్టవాన్ పితా. తదేతత్—సకలస్యవస్తుజాతస్య ఏక-కారణత్వం—పితృహృది నిహితమజానన్ పుత్రః, పరస్పర విలక్షణేషు—వస్తుషు—అన్యస్యజ్ఞానేన తదన్యజ్ఞానస్య అఘటమానతాం బుద్ధ్వా, పరిచోదయతి—'కథంను భగవఃసఆదేశ' ఇతి. పరిచోదితః పునః—తదేవ, హృదినిహితం—జ్ఞానానందామలత్వైక—స్వరూపమ్, అపరిచ్ఛేద్యమాహాత్మ్యం, సత్యసంకల్పత్వమిశ్రైః అనవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణగణైః జుష్టమ్, అవికారస్వరూపం పరంబ్రహ్మైవ, నామరూపవిభాగానర్హ సూక్ష్మచిదచిద్వస్తుశరీరం, స్వలీలార్థై—స్వసంకల్పేన, అనన్తవిచిత్రస్థిరత్రసరూపజగత్ సంస్థానం స్వాంశేనావస్థితమితి, తజ్జ్ఞానేన అన్యస్య నిఖిలస్య జ్ఞాత

తాంబుభ్రవన్, లోకదృష్టం కార్యకారణయోరనన్యత్వం దర్శయితుం పృష్టవన్తమాహ — "యథాసోమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతంస్యాత్ – వాచారంభణం, వికారో, నామధేయం, మృత్తికేత్యేవసత్యమ్" ఇతి.

ఏవమేవ, మృద్ద్రవ్యం, స్వైకదేశేన నానావ్యవహారాస్పదత్వాయ ఘటశరావాది నానాసంస్థానాఽవస్థారూప వికారాపన్నం నానానామధేయమపి మృత్తికాసంస్థానవిశేషత్వాత్ మృద్ద్రవ్యమేవేత్థమవస్థితం నవస్త్వంతరమ్ ఇతి; యథా మృత్పిండవిజ్ఞానేన తత్సంస్థానవిశేషఘటశరావాదిరూపం సర్వం విజ్ఞాతమేవభవతీత్యర్థః.

అనువాదము:- "అట్టి పరమాత్మయే సమస్త కారణము కావున, కారణమే అనేకాకారవిశేషములతోకూడి కార్యమని వ్యవహరింపబడుచున్నది. కనుక-కారణమైనట్టిదియు, సూక్ష్మములగు చిత్-అచిత్తులే (జీవ-జడ ప్రపంచములే) శరీరముగా కలిగినట్టిదియునగు పరబ్రహ్మము-తెలియబడినప్పుడు దానివలన పుట్టిన నిఖిలజగత్తు తెలియబడును". అని యీ యభిప్రాయమును హృదయమందుంచుకొని — 'యేనాశ్రుతంశ్రుతంభవతి, అమతంమతమ్, అవిజ్ఞాతం విజ్ఞాతమ్' 'దేనిని విన్నంతనే పూర్వము వినియుండని సమస్తము వినబడునో, మననముచేయబడనిదికూడ మననము చేయబడునో, తెలియనిదికూడ తెలియబడునో-దానిని గురించి వింటివా?' అని తండ్రి పుత్రుని ప్రశ్నించినాడు. ఈ విధముగ సమస్త వస్తుసముదాయమునకు ఒక్కటే కారణమని తండ్రియొక్క హృదయమునగల అభిప్రాయమును తెలిసికొనజాలక-ఒకదానికంటె నొక్కటి పరస్పరభిన్నములుగా కన్పట్టుచున్న వస్తువులలో, ఒకటి తెలిసినంతమాత్రమున వేరొకటి తెలియుననుట అసమంజసము కావున కుదరదని భావించి పుత్రుడిట్లు ప్రశ్నించుచున్నాడు. 'తండ్రీ! అట్టి ప్రశాసనమెట్లుండును?' అని.

ఇట్లు కుమారునిచే నడుగబడినవాడై తండ్రి-తన హృదయమునయున్న అభిప్రాయమును - అనగా "జ్ఞానము, ఆనందము, అమలత్వములు మాత్రమే స్వరూపముగా కల్గినట్టియు, ఇంతని కొలువరాని మాహాత్మ్యము కలిగినట్టియు, సత్యసంకల్పత్వముతోపాటు కలసి అపార వైభవముతో కూడిన-లెక్కింపనలవికాని కల్యాణగుణములతో కూడినట్టియు, ఎట్టి వికార ములులేని స్వరూపముకల పరమాత్మయే—నామము (పేరు), రూపము (ఆకృతి) మున్నగు విభాగములులేని సూక్ష్మములైన చిదచిత్తులే (జీవ-జడ ప్రపంచములే) శరీరముగా కలిగియుండి, తన లీలకొరకు (క్రీడార్థమై) తాను స్వయముగ సంకల్పించి, అనంతమైన వైచిత్ర్యముకలిగి-స్థిరము-త్రసరూపము (జంగమము-కదలునట్టిదియు) నయిన జగత్తుగా తన యంశముచేతనే యున్నాడనియు; అట్టి కారణమైన పరమాత్మను తెలియగనే తదితరమగు కార్యమంతయు (పరమాత్మవలన పుట్టిన జగమంతయు) తెలియబడుననియు"—చెప్పుచు—లోకమున కన్పించుచున్న కార్యకారణదృష్టాంతభావముఖమున, కార్యకారణములు రెండును-ఒక్కటే తత్త్వమని నిరూపించుటకై - 'యథాసోమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతంస్యాత్, వాచారంభణం వికారో, నామధేయం మృత్తి కేత్యేవసత్యమ్' 'ప్రియదర్శనుడా! ఎట్లుగ ఒక్క మట్టిముద్ద తెలియగనే దానితో నేర్పడిన సమస్త మృణ్మయవస్తుజాతము తెలియబడునో, వాగ్వ్యవహారము, ఘటశరావాద్యాకారవికారము, పేరులు ఇవియంతయు-మృద్ద్రవ్యమేతప్ప వేరుకాదు-కనుక సత్యమే' అని పేర్కొనినాడు. ఒక్క మట్టిముద్దయే తనలోని కొంతభాగముచే వివిధ వ్యవహారముల కుదుర్చుటకై కుండ, చట్టి మున్నగు అనేక - ఆకారవిశేషరూపములగు వికారమును (మార్పును) పొంది అనేక పేరులతో వ్యవహరింపబడు చున్నను, వాస్తవమునకు మట్టివలన నేర్పడిన ఆకారమే కనుక మట్టి ముద్దయేతప్ప-వేరొక వస్తువుకాదనియు, ఏ విధముగ మట్టిముద్ద తెలిసినచో దానివలన పుట్టిన వివిధాకృతులుకల కుండ, చట్టి మున్నగు వస్తువు

లన్నియు తెలియునో, (అట్లే పరమాత్మ తెలియగనే ఆయనవలన పుట్టిన సమస్త జగత్తు తెలియును) అని యర్థము.

వివరణము:- పై వాక్యములలో తండ్రి కొడుకుల సంవాదమును బట్టి, తండ్రియడిగిన ప్రశ్నమునకుగల తాత్పర్యమును తెలియజాలని పుత్రునకు, తన యభిప్రాయమును మృద్దృష్టాంతముద్వారా తండ్రి యెరుక పరచినాడని స్పష్టమగుచున్నది. కారణద్రవ్యమే కార్యరూపమగు అవస్థాంతరమును (వేరొకయవస్థను) పొందినదికనుక-కారణకార్యములకు అనన్యత్వము (ఏకత్వము) కలదు కనుక-కారణము తెలిసినప్పుడు కార్యము తెలిసినట్లగునను ప్రారంభప్రతిజ్ఞ (ఒకటి తెలిసినచో అన్నియు తెలిసినట్లగుననునది) బ్రహ్మసత్యత్వ-జగన్మిథ్యాత్వవాదుల పక్షమున కుదరదనియు-బ్రహ్మమునకువలెనే-తత్కార్యమైన (దానినుండిపుట్టిన) జగత్తు కూడ సత్యమేనని యంగీకరించిన 'ఉభయసత్యత్వవాదుల మతము'న మాత్రమే కుదురుననియు సూచింపబడినది.

మూలమున-'పునస్త దేవహృదినిహితం' అని యారంభించి 'స్వాంశేనావస్థితం' అనునంతవరకు 'స్వయముగనెట్టి వికారములు లేనివాడును, సమస్త కల్యాణగుణోపేతుడును అయిన పరమాత్మకును-చిద-చిదాత్మకమైన (జీవ-జడాత్మకమైన) ప్రపంచమునకును-శరీరశరీరిభావమూలమగు కార్యకారణభావము, తన్మూలమగు తాదాత్మ్యముకలదని స్పష్టపరుపబడినది. దీనినిబట్టి పరమాత్మకును—జీవజడాత్మక ప్రపంచమునకును 'శరీరశరీరిభావ' మూలమగు తాదాత్మ్యమున్నది కనుక-కార్యరూపమగు సమస్తజగత్తు పరమాత్మని వేరొక 'యవస్థ' యేననియు-కారణావస్థలోనున్న పరమాత్మ తెలిసినప్పుడు-కార్యావస్థలోనున్నదికూడ ఆ పరమాత్మయే కనుక ఒక యవస్థలోనున్న వస్తువు తెలిసినప్పుడు-వేరొక యవస్థలోనున్నదికూడ అదే వస్తువుకనుక-అదియు తెలియుననుట కుదురుచున్నది. దీనినిబట్టి పరమాత్మయొక్క శరీరపరిణామమే జగత్తని కూడ స్పష్టమగుచున్నది. ఇట్లనుటచే పరమాత్మకు-స్వరూపపరిణామము

నంగీకరించినవారి మతమున ప్రసక్తములైన దోషములెవ్వియు ఇచ్చట ప్రసక్తములుకావనికూడ విశదపరుపబడినట్లైనది. "అవికారస్వరూపం బ్రహ్మైవ–నామరూప విభాగానర్హ సూక్ష్మ చిదచిద్వస్తుశరీరం–స్వలీలార్థం స్వసంకల్పేన–అనన్త విచిత్రస్థిరత్రసరూప జగత్ సంస్థానం—స్వాంశేనావస్థితమ్" అను వాక్యముచే వికారరహితుడైన పరమాత్మయే–క్రీడార్థమై తానే స్వయముగ 'బహుస్యాం ప్రజాయేయ' 'అనేక విధములుగా పుట్టుదునుగాక' అని సంకల్పించి, వివిధవిచిత్రప్రపంచముగ వేరొకయవస్థను పొందినాడనియు, కనుక ఆ పరమాత్మకు–ఈ జగత్తు 'అంశ'మే (అవయవమే) ననియు తెలియజేయబడుచున్నది. "నామరూపానర్హ సూక్ష్మ చిదచిద్వస్తు శరీరమ్" అనగా 'నామ–రూపములకు యోగ్యముకాని (ఇట్టి పేరుకలది–ఇట్టి రూపముకలది అని వ్యవహరించుటకు యోగ్యముకాని) సూక్ష్మదశలోనున్న చిదచిత్తులు (జీవులు–జడప్రపంచము) సృష్టికి పూర్వముకూడ పరమాత్మకు శరీరముగా నమరియున్నదని యర్థము. పరమాత్మకు శరీరమైయున్నదికనుకనే దీనిని (ఈ జీవజడాత్మక ప్రపంచమును) 'ప్రకారము' (అపృథక్సిద్ధ విశేషణము) అనియందురు. సూక్ష్మదశలో పరమాత్మకు శరీరముగానున్న జీవజడాత్మక ప్రపంచమే 'అనన్త విచిత్రస్థిర–త్రసరూప'మగు స్థూలజగత్తుగా నైయుండి–పరమాత్మకు శరీరముగ నమరియున్నది. దీనినిబట్టి సూక్ష్మదశయందును (సృష్టికి పూర్వము) స్థూలదశయందును (సృష్టికి తరువాత) ఈ సమస్త జగత్తు భగవంతునకు శరీరమై–విడదీయరాని విశేషణమైయున్నది.

దీనినిబట్టి స్థూలముగనున్న ఈ జీవజడాత్మక ప్రపంచము సృష్టికి పూర్వము సూక్ష్మరూపముగనున్నదని స్పష్టమగుచున్నది. ఈ విషయమును స్పష్టపరచుటకై తండ్రి–కుమారునితో నిట్లనెను – 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్' అని. సోమ్య! = సోమ్యుడా (సోమార్హుడా! లేక ప్రియదర్శనుడా); ఇదం = ఈ పురోదృశ్యమానమగు స్థూలమైన చిదచిదాత్మక జగత్తు; అగ్రే = సృష్టికి పూర్వము [ఈ స్థూలదశను పొందుటకుముందు];

సదేవ = సత్తుగనే; ఆసీత్ = ఉండెను. అనగా సద్రూపమైన పరమాత్మకు శరీరముగ సూక్ష్మదశలోనుండెనని తాత్పర్యము. అప్పుడు ఆ సూక్ష్మదశ ఎట్టిది? అన్న శంకకు సమాధానముగా—'అసద్వా ఇదమగ్ర ఆసీత్-తతో వై సదజాయత' అని తండ్రి మరల పలికెను. ఇదం = ఈ జగత్తు, అగ్రే = సృష్టికి పూర్వము, అసద్వా = అసత్తుగనే అనగా విభక్త నామరూపములులేని సూక్ష్మముగనే; ఆసీత్ = ఉండెను. తతో వై = ఆ యవిభక్తనామరూపమైన సూక్ష్మదశాపన్న జగత్తునుండే; సత్ = విభక్తనామరూపమైన జగత్తు (అనగా విడివిడిగా పేరులతోను-ఆకృతులతోను కూడిన స్థూలజగత్తు) అజాయత = ఆవిష్కరింపబడినది. ఈ ఛాందోగ్యవాక్యములలోని 'అసత్' అను పదమునకు వ్యాఖ్యానముగనే భగవద్రామానుజులు పూర్వము నిర్దేశింపబడిన వాక్యములలో - 'నామరూపవిభాగానర్హసూక్ష్మచిదచిద్వస్తు-శరీరం' అని పేర్కొనినారు. 'సదజాయత' అనుచోటగల 'సత్' అను పదమునకు వ్యాఖ్యానముగ-'అనన్తవిచిత్రస్థిరత్రసరరూపజగత్సంస్థానం' అని పేర్కొనినారు. ఈ అంశమును ముందు గ్రంథముచే మరింత స్పష్టపరచుచున్నారు. ఇట్లు సూక్ష్మమైన జగత్తును స్థూలముగ నావిష్కరించుట భగవానునకు క్రీడయేనను విషయమును భగవద్రామానుజులు - 'లోకవత్తు లీలా కైవల్యమ్' [బ్ర.సూ. 2-1-33] అను సూత్రశ్రీభాష్యమున ఈ క్రింది విధముగ విశదపరచియున్నారు. 'అవాప్తసమస్తకామస్య, పరిపూర్ణస్య, స్వసంకల్పవికార్యవివిధవిచిత్రచిదచిన్మిశ్రజగత్సర్గే లీలైవ కేవలా ప్రయోజనమ్" 'పొందబడిన నిఖిలకామములు కలవాడును, పరిపూర్ణుడును అయిన పరమాత్మకు-తన సంకల్పముచే వివిధవికారవిచిత్రమగు జీవజడాత్మకమైన జగత్తును సృజించుటలో-కేవలము-లీల (క్రీడ) మాత్రమే ప్రయోజనము'. ఈ విషయమునే విష్ణుపురాణము-

వ్యక్తంవిష్ణుః, తథాఽవ్యక్తం, పురుషః, కాలఏవచ।
క్రీడతో బాలకస్యేవ చేష్టాంతస్యనిశామయ॥

'ఈ సమస్తమైన వ్యక్తావ్యక్తప్రపంచము, పురుషుడు, కాలము ఇవియన్నియు (తనలోతాను) ఆడుకొను పిల్లవానికివలె శ్రీహరికి క్రీడా రూపమగు చేష్టయని యెరుగుము' అని తాత్పర్యము.

ఇప్పుడు 'సదేవసోమ్య!' ఇత్యాదిగ పూర్వము చూపబడిన ఛాందోగ్య సద్విద్యాప్రకరణవచనముల తాత్పర్యమును విశేషముగ వ్యాఖ్యానించుచున్నారు.

మూ॥ అత్ర ఇదమితి జగన్నిర్దిష్టమ్; అగ్ర ఇతిచ సృష్టేః పూర్వకాలః, తస్మిన్కాలే జగతః సదాత్మకతాం "సదేవ" ఇతి ప్రతిపాద్య, తత్సృష్టికాలే అపి అవిశిష్టమ్ ఇతికృత్వా, "ఏకమేవ" ఇతి, సదాపన్నస్య జగతః తదానీమవిభక్తనామరూపతాం ప్రతిపాద్య, తత్ప్రతిపాదనేనైవ సతో జగదుపాదానత్వం ప్రతిపాదితమితి, స్వవ్యతిరిక్తనిమిత్తకారణమ్, "అద్వితీయ"పదేన ప్రతిషిద్ధమితి, "తమాదేశమప్రాక్ష్యః యేనాశ్రుతం శ్రుతం భవతి" ఇతి ఆదావేవ ప్రశాసితైవ జగదుపాదానమితి హృదినిహితమ్ ఇదానీ మభివ్యక్తమ్. ఏతదేవఉపపాదయతి—స్వయమేవ జగదుపాదానం జగన్నిమిత్తంచ సత్ "తదైక్షత బహుస్యాంప్రజాయేయ" ఇతి.

తదేతత్ సచ్ఛబ్దవాచ్యం పరం బ్రహ్మ సర్వజ్ఞం, సర్వశక్తి, సత్యసంకల్పమ్, అవాప్త సమస్తకామమపి లీలార్థం విచిత్రానన్తచిదచిన్మిశ్ర జగద్రూపేణ అహమేవ "బహుస్యాం"—తదర్థం "ప్రజాయేయ"- ఇతి స్వయమేవసంకల్ప్య, స్వాంశైకదేశాదేవ వియదాదిభూతాని సృష్ట్వా, పునరపి సైవ సచ్ఛబ్దాభిహితా పరాదేవతా ఏవమ్ ఐక్షత, "హన్తాహమిమాస్తిస్రో దేవతాః అనేనజీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" ఇతి. "అనేన జీవేనా-

**త్మనా" ఇతి జీవస్య బ్రహ్మాత్మకత్వం ప్రతిపాద్య, బ్రహ్మాత్మక జీవానుప్రవేశాదేవ కృత్స్నస్య అచిద్వస్తునః పదార్థత్వమ్, ఏవంభూతస్యైవ అచిద్వస్తునో నామరూపభాక్త్వమ్ ఇతిచ దర్శయతి.**

అనువాదము:– 'సదేవసోమ్యేదమగ్రఆసీత్–ఏకమేవాద్వితీయమ్' అను ప్రస్తుత (ఛాందోగ్య సద్విద్యాప్రకరణగతమగు) వాక్యమునగల 'ఇదమ్' అను [సర్వనామ] శబ్దముచే [ఎదుటగల] జగత్తు నిర్దేశింపబడినది. 'అగ్రే' [పూర్వము] అను శబ్దముచే సృష్టికి ముందుగల కాలము చెప్పబడుచున్నది. ఆ కాలమున (సృష్టికి ముందు) జగత్తు సదాత్మకమని 'సదేవ' (సత్పదార్థమే అయిఉన్నది) అని ప్రతిపాదించి, సృష్టికాలమునకూడ (అనంతరముకూడ) అది (సద్రూపమైయుండుట) సమానమే కనుక–'ఏకమేవ' [ఒక్కటే] అనియు; సదాత్మకత్వమును పొందిన జగత్తునకు ఆ సమయమున [సృష్టికి పూర్వకాలమున] నామ–రూప–విభాగములేదని ప్రతిపాదించి, ఇట్లు ప్రతిపాదించుటచేతనే–'సత్' అని పిలువబడు పరమాత్మయే జగత్తునకు ఉపాదానకారణమని చెప్పబడినదనియు, ఈ విధముగనే తనకంటె వేరైన నిమిత్తకారణమేదియు జగత్తునకు లేదని–'అద్వితీయమ్' అను పదముచే నిషేధింపబడినదనియు, ఈ విధముగ తొట్టతొలుత—'తమాదేశమప్రాక్ష్యః? యేనాశ్రుతంశ్రుతం భవతి' [ఆ ప్రశాసనమును గురించి ప్రశ్నించితివా? దేనివలన వినబడనదికూడ వినబడినట్లగునో!] ఇత్యాది వాక్యముచే–ప్రశాసకుడైన పరమాత్మయే జగత్తునకుపాదానకారణమని హృదయమందు గల అభిప్రాయమే ప్రస్తుతమున – 'అద్వితీయ' పదముచే వ్యక్తపరుపబడినదనియు తెలియవలయును.

దీనినే విశేషముగ నిరూపించుచున్నాడు. 'తదైక్షతబహుస్యాం ప్రజాయేయ ఇతి' అని. తనంతతానుగ–జగత్తునకుపాదానకారణమైన [మూలకారణమైన] భగవానుడే–జగన్నిమిత్తముకూడనై–వివిధవిచిత్ర

ప్రపంచముగ కావలెనని సంకల్పించినాడని–'తదైక్షత' ఇత్యాదిగ చెప్ప బడినది. ఇచ్చట 'సత్' అని పిలువబడు పరబ్రహ్మమే–స్వయముగ–సర్వజ్ఞము, సర్వశక్తిసంపన్నము, పొందబడిన సమస్త కామములుకల దయ్యును, తన క్రీడార్థమై–విచిత్రము–అపారముసైన యీ జీవజడ సంమిశ్రితమగు జగత్తుగా 'నేనే అనేక విధములుగా [బహుస్యాం]–పుట్టుదునుగాక (ప్రజాయేయ)' అని (ఇతి) సంకల్పించి—తనయొక్క అంశాంశముచే (అంశముయొక్క భాగముచే) ఆకాశము మున్నగు భూతములను సృజించి, 'సత్' అని పిలువబడు పరబ్రహ్మాత్మకదేవతయే యీ విధముగ సంకల్పించినది (ఐక్షత). "హన్త! అహమిమాస్తిస్రోదేవతాః అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" "అహః నేను–ఈ మూడు దేవతలను (పృథివ్యప్తేజస్సులను) ఈ జీవాత్మద్వారా స్వయముగ ప్రవేశించి, నామరూపములను విస్తరింపజేతును" అని. ఇచ్చట 'అనేన జీవేన ఆత్మనా' (ఈ జీవాత్మద్వారముగ) అనియనుటచే జీవుడు బ్రహ్మాత్మకుడు (బ్రహ్మమే ఆత్మగా కలవాడు) అని ప్రతిపాదించి, బ్రహ్మాత్మకుడైన జీవునితో కూడినదగుటచేతనే యీ సమస్త జడవస్తువునకు పదార్థత్వము కలుగుచున్నదనియు, ఇట్టి బ్రహ్మాత్మకుడైన జీవునితో కూడిన జడవస్తువునకే నామరూపముల పొందు యోగ్యత కలదనియు ప్రదర్శింపబడుచున్నది.

వివరణము:– ఛాందోగ్యమున షష్ఠాధ్యాయాత్మకము, షోడశ (పదునారు) ఖండాత్మకమును నయిన సద్విద్యాప్రకరణమునందలి ప్రధానములైన శ్రుతివాక్యములను పూర్వాపరసమన్వయపురస్సరముగా ఏకవాక్యతను ప్రదర్శించుటకై—'స్తబ్ధోసి' అని ప్రారంభించి–'అనేన జీవేన ఆత్మనా' అను వాక్యమువరకు ఏకవాక్యత ప్రతిపాదింపబడినది. ఈ సందర్భమున–

1. 'ఉత తమాదేశమప్రాక్ష్యః?' అను వాక్యముచే నిఖిలజగదుపాదానకారణమైన పరమాత్మయొక్క ప్రశాసనమును గురించిన ప్రశ్న ప్రతి

పాదింపబడినది.

2. జగదుపాదానమైన పరమాత్మ తెలిసినప్పుడు తత్కార్యమైన సమస్తము తెలియునని ప్రతిజ్ఞ—'యేనాశ్రుతం శ్రుతం భవతి, అమతం మతమ్ అవిజ్ఞాతం విజ్ఞాతం' అను వాక్యముచే నిర్దేశింపబడినది.

3. ఒకటి తెలిసినచో సర్వము తెలియుననుట ఎట్లని సందేహించిన పుత్రునకు మృద్దృష్టాంతముచే—'యథాఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతంస్యాత్' అను వాక్యముఖమున కారణకార్యములకు అనన్యత్వమును ప్రతిపాదించుటద్వారా ప్రతిజ్ఞ సమాధానింపబడినది.

4. ఈ వాక్యముచేతనే కారణమైన బ్రహ్మమువలెనే కార్యమగు జగత్తును సత్యమేనని జగత్సత్యము నిరూపింపబడినది.

5. ఈ కనుపించుచున్న జగత్తు సృష్టికి పూర్వము సదాత్మకై పరమాత్మకు సూక్ష్మరూపమున శరీరమైయున్నదనియు—ఆ దశలో నామరూపవిభాగములేదనియు — 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్' అను వచనముచే చెప్పబడినది.

6. 'అసద్వాఇదమగ్ర ఆసీత్' అను వచనముచే స్థూలముగ నామరూపవిభక్తమైయున్న యీ జగత్తుకు—సృష్టికి పూర్వమందు 'అసత్త్వము' (నామరూపవిభాగానర్హత) కలదని చెప్పబడినది.

7. 'ఏకమేవ' అను శ్రుతిచే బ్రహ్మము జగదుపాదానమునియు— 'అద్వితీయమ్' అను శ్రుతిచే నిమిత్తకారణముకూడ బ్రహ్మమేననియు ప్రతిపాదింపబడినది.

8. ఇట్లు జగదుపాదాననిమిత్తమైన బ్రహ్మమే స్వయముగ సంకల్పించి నానావిధప్రపంచముగనైనదని—'తదైక్షత బహుస్యాం ప్రజాయేయ' అను శ్రుతిచే ప్రతిపాదింపబడినది. అవాప్తసమస్తకాముడగు పరమాత్మకిది లీలామాత్రమని సూచింపబడినది.

9. ఈ పరబ్రహ్మము తేజస్సు, అప్ (జలము), అన్నము (పృథివి) అను మూడు తత్త్వముల సృజించి—జీవునితోపాటు తాను ఆత్మగా ప్రవేశించి నామరూపవిభాగములకల్గించినదని—"సేయందేవ తైక్షత! హన్తాహమిమాస్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామ రూపేవ్యాకరవాణి" అను వాక్యముచే ప్రతిపాదింపబడినది. ఈ విధముగ జడప్రపంచమంతయు, జీవసద్భావముచేతను, ఆ జీవునియందు అంతర్యామిగా ప్రవేశించియున్న పరమాత్మచేతను పదార్థత్వమును, వ్యవహారమును పొందుచున్నదని ప్రతిపాదింపబడినది. తేజోఽబన్నముల త్రివృత్కరణములచే సమస్త ప్రపంచసృష్టి నిరూపింపబడినది,

10. ఈ విధముగ సమస్త ప్రపంచము 'సత్' అని పిలువబడు పరమాత్మనే ఆధారముగా జేసికొని—పరమాత్మయందే ఉన్నదనియు కనుక సన్మూలము, సదాయతనము, సత్ప్రతిష్ఠితమునని—"సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః, సత్ప్రతిష్ఠాః" అను వచనముచే ప్రతిపాదింపబడినది.

11 ఈ విధముగ సమస్తము బ్రహ్మాత్మకమనియు—శ్వేతకేతు రూపుడగు జీవుడుకూడ బ్రహ్మాత్మకుడే (బ్రహ్మము ఆత్మగాకలవాడు) అని శరీరశరీరిభావమూలమగు అనన్యత్వమును (తాదాత్మ్యమును) ప్రతిపాదించి—అరంభమునచేసిన "ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం" అను ప్రతిజ్ఞకు ఉపపత్తి చూపుటకై—"ఐతదాత్మ్యమిదంసర్వం" "తత్సత్యం" "తత్త్వమసిశ్వేతకేతో!" అను శ్రుతులతో సద్విద్యాప్రకరణసమన్వయము పరిసమాపనమొనర్పబడినది.

ప్రస్తుతము—ఈ ముందుచూపబడిన సద్విద్యాప్రకరణోపసంహార వాక్యముల తాత్పర్యమును అగ్రిమగ్రంథముచే భగవద్రామానుజులు నిరూపించుచున్నారు.

"అనేనజీవేన" ఇత్యాది శ్రుతులను భగవద్రామానుజులు సంజ్ఞా

మూర్తిక్లృప్త్యధికరణమున—

1. సంజ్ఞామూర్తిక్లృప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్
(బ్ర. సూ. 2-4-17)

2. మాంసాదిభౌమం యథాశబ్దమితరయోశ్చ (బ్ర. సూ. 2-4-18)

అను సూత్రముల శ్రీభాష్యమునందును ఇతరత్ర విస్తృతముగ విచారించియున్నారు.

మూ॥ ఏతదుక్తం భవతి— జీవాత్మా తు బ్రహ్మణః శరీరతయా ప్రకారత్వాత్ బ్రహ్మాత్మకః "యస్యాత్మా శరీరమ్" ఇతి శ్రుత్యన్తరాత్, ఏవం భూతస్య జీవస్య శరీరతయా ప్రకారభూతాని దేవమనుష్యాదిసంస్థానాని వస్తూని ఇతి బ్రహ్మాత్మకాని తాని సర్వాణి; అతః—దేవో, మనుష్యః యక్షో, రాక్షసః, పశుః, మృగః, పక్షీ, వృక్షః, లతా, కాష్ఠం, శిలా, తృణం, ఘటః, పటః, ఇత్యాదయస్సర్వే ప్రకృతిప్రత్యయయోగేన అభిధాయకతయా ప్రసిద్ధాః శబ్దాః లోకే తత్తద్వాచ్యతయా ప్రతీయమాన తత్తత్సంస్థానవస్తుముఖేన, తదభిమానిజీవతదన్తర్యామి పరమాత్మపర్యన్త సంఘాతస్యైవ వాచకాః ఇతి।

అనువాదము:- ఇది చెప్పబడినట్లగుచున్నది—"జీవాత్మ పరబ్రహ్మమునకు శరీరమైయుండి ప్రకారభూతుడు (వేరుగనుండజాలని విశేషణము), కనుక బ్రహ్మాత్మకుడని యెరుగవలయును. 'యస్యాత్మాశరీరమ్' (ఎవ్వనికి జీవాత్మశరీరమైయున్నాడో) అను వేరొక శ్రుతిచేనిది సిద్ధము. బ్రహ్మమునకు శరీరముగానుండిన యీ జీవాత్మకు—దేవతలు, మనుష్యులు మున్నగు ఆకారవిశేషములుకల వస్తువులు శరీరముగా ప్రకారములై (అపృథక్సిద్ధవిశేషణములై) యున్నవి. కనుక నివియన్నియు (దేవమనుష్యాద్యాకారములుకల వస్తువులన్నియు) బ్రహ్మాత్మకములే.

(బ్రహ్మము ఆత్మగా కలవే.) కావున దేవత, మనుష్యుడు, యక్షుడు, రాక్షసుడు, పశువు, మృగము, పక్షి, వృక్షము, లత, చెక్క, రాయి, గడ్డి, కుండ, వస్త్రము మున్నగు — ప్రకృతిప్రత్యయసంబంధముచే అర్థమును బోధించునవిగా ప్రసిద్ధములైన శబ్దములన్నియు, లోకమున నాయాయిశబ్దములకర్థములుగా తెలియుచున్న, ఆయాయి ఆకృతులుకల వస్తువుల బోధించుటద్వారా—ఆయావస్తువులందు ప్రవేశించియున్న జీవులను (జీవాత్మలను), ఆ జీవాత్మలలో 'అంతర్యామి'గానుండి నియమించుచున్న పరమాత్మను—ఈ సముదాయమునే (జడవస్తువు—అందలి జీవాత్మ—అందలి పరమాత్మ అను సముదాయమునే) బోధించుచున్నవి.

వివరణము:— సమస్త వస్తుజాతము జీవులకు శరీరమనియు, ఆ జీవులు పరమాత్మకు శరీరములనియు, కనుక లోకమున వస్తుబోధకములైన శబ్దములన్నియు పరమాత్మబోధకములేననియు భగవద్రామానుజులీ ప్రస్తుత గ్రంథముచే నిరూపించుచున్నారు. సమస్త జీవరాశియు, పదార్థజాతము బ్రహ్మాత్మకమే. 'బ్రహ్మాత్మకము' అను శబ్దమునకు బ్రహ్మముతో స్వరూప తాదాత్మ్యమును పొందినదని యర్థముకాదు. బ్రహ్మము ఆత్మగా కలది. 'బ్రహ్మఆత్మాయస్యతత్' అని వ్యుత్పత్తి. జీవుల యందన్తర్యామిగా బ్రహ్మమున్నది. కనుక జీవులు బ్రహ్మాత్మకులు (బ్రహ్మము ఆత్మగా కలవారు) ఈ విధముగా బ్రహ్మమునకును జీవులకునుగల సంబంధము స్వరూపతాదాత్మ్యము కాదు. శరీర శరీరిభావము. శరీరమునకును ఆత్మకును గల సంబంధమే. 'యస్యాత్మా శరీరమ్' (యస్య=ఏపరమాత్మకు, ఆత్మా=జీవాత్మ, శరీరమ్=దేహమైయున్నాడో) అను సుబాలోపనిషద్వచనమిచ్చట ప్రమాణము. మూలమున—'జీవాత్మాతుబ్రహ్మణః శరీరతయా ప్రకారత్వాత్ బ్రహ్మాత్మకః' "ఏవంభూతస్యజీవస్య శరీరతయా ప్రకారభూతాని దేవమనుష్యాది సంస్థానాని వస్తూని ఇతి బ్రహ్మాత్మకాని తానిసర్వాణి" అను వాక్యములు పై యర్థమునే బోధించుచున్నవి. ఇచ్చట "ప్రకార"శబ్దము ప్రయోగింపబడినది. ప్రకారమనగా "అపృథక్

సిద్ధ విశేషణము' అని యర్థము. ఏ వస్తువులు దేనినాశ్రయించియుండి, దేనికంటె వేరుగ సిద్ధింపవో అవి ప్రకారములు. జీవాత్మలేనిదే శరీరము నకు 'పృథక్సిద్ధి' (వేరుగా స్వతంత్రమైన ఉనికి) లేదు. కనుక ఆత్మకు శరీరము ప్రకారము. ఇట్టి ప్రకారముతోకూడివది కనుక 'ఆత్మ' ప్రకారి. ఇట్లే జీవునితోకూడిన జడప్రపంచమంతయు – అంతర్యామిగా లోపల పర మాత్మతోకూడియుండనిచో పృథక్సిద్ధి లేనిదికనుక, పరమాత్మకు ప్రకా రము. పరమాత్మ ఈ జీవులకు, జడప్రపంచమునకు ప్రకారి. ఈ శరీర శరీరిభావమును, ప్రకారప్రకారిభావమును ముందుముందు విశేషించి భగవద్రామానుజులు నిరూపింతురు.

ఈ విధముగ దేవత, మనుష్యుడు, యక్షుడు, రాక్షసుడు, పశువు, మృగము, పక్షి, వృక్షము, లత, కాష్ఠము (కట్టె), శిల (రాయి), గడ్డి, కుండ, గుడ్డ మున్నగువస్తువులన్నియు బ్రహ్మమునకు శరీరములై ప్రకా రముగ అమరియున్నవికనుక బ్రహ్మాత్మకములే. కనుక వీటిని బోధించు శబ్దములన్నియు, లోకమున వ్యాకరణశాస్త్రమర్యాదననుసరించి ఆయాయి ప్రకృతిప్రత్యయములతోకూడి, ఆయాయి వస్తువులను బోధించుచున్న వైనను, ఆయాయి వస్తువుల బోధించుటద్వారా అంతర్యామిగానున్న పరమాత్మను బోధించుచున్నవి. ఈ విధముగ ప్రతిశబ్దము లోకప్రసిద్ధ మగు వస్తువును, దానిలోని జీవాత్మను, ఈ రెండిటిలోనున్న అంతర్యామి యగు పరమాత్మను బోధించుచున్నవి.

మరి, యిట్లు లోకమున ప్రసిద్ధిలేదుకదా! ఘటశబ్దము కుండయను వస్తువును బోధించుట అందరకు తెలియునుగాని, దానిలోనున్న జీవుని, వానిలోనుండి నియమించుచున్న అంతర్యామియగు పరమాత్మను బోధిం చుచున్నదని అనుభవములేదుకదా! అన్నచో—నైషస్థాణోరపరాధఃయదేన మంధోనపశ్యతి అని సూక్తి—రాతిని చూడజాలకపోవుట గ్రుడ్డివానిదోషమే

కాని, రాయి తప్పుకాదు. అట్లే శబ్దమునకుగల ఈ పరమాత్మపర్యంత బోధకత్వశక్తిని గ్రహింపకుండుట వ్యక్తిదోషమేకాని, శబ్దగతమగు దోషముకాదు. కనుక ప్రతిశబ్దము లౌకికముకాని వైదికముకాని పరమాత్మ వరకుగల 'జడవస్తు-జీవ-పరమాత్మ' సముదాయమును సహజముగనే బోధించుచుండునని భగవద్రామానుజమతము.

మరి కాష్ఠలోష్ఠాదులయందు జీవసత్త్వము ప్రత్యక్షాదిగోచరము కాదుకదా! అట్టియెడ జీవరహితములుగా కన్పట్టుచున్న జడవస్తువులు పరమాత్మ పర్యంతబోధకము లెట్లగుచున్నవి? అన్నచో ఈ క్రింది విష్ణు పురాణశ్లోకములు ప్రతివస్తువునందును జీవతత్త్వము తారతమ్యముచే నున్నదని స్పష్టపరచుచున్నవి.

తయా తిరోహితత్వాచ్చ శక్తిః క్షేత్రజ్ఞసంజ్ఞితా।
సర్వభూతేషు భూపాలతారతమ్యేనవర్తతే॥

(ఆ అవిద్యాత్మకకర్మముచే కప్పబడినదగుటచే సర్వభూతములందును క్షేత్రజ్ఞశక్తి (జీవశక్తి) హెచ్చుతగ్గులతోనున్నది) (వి.పు.6-7-66)

అప్రాణవత్సు స్వల్పాసా, స్థావరేషు తతోఽధికా।
సరీసృపేషు తేభ్యోఽపి హ్యతిశక్త్యాపతత్త్రిషు॥ (వి.పు. 6-7-67)

(ప్రాణరహితములగు వస్తువులందు తక్కువగను, వాటికంటె చెట్లు మున్నగువాటియందు అధికముగను క్షేత్రజ్ఞశక్తి కలదు.)

ఈ క్రమమున క్షేత్రజ్ఞశక్తి—ప్రాణరహితములైన రాయి, కట్టె మున్నగువస్తువులనుండి హిరణ్యగర్భునివరకు తారతమ్యముతోనున్నది. కనుక సృష్టిలోని ప్రతివస్తువు జీవునితోను, అంతర్యామియగు పరమాత్మ తోను కూడియున్నదికనుక బ్రహ్మాత్మమేనని యీ క్రింది శ్లోకము స్పష్టపరచుచున్నది. (వి.పు. 6-7-68)

'ఏతాన్యశేషరూపాణి తస్యరూపాణి పార్థివ।
యతస్తచ్ఛక్తియోగేన యుక్తానినభసాయథా॥'

ఈ సృష్టిలోని ప్రతివస్తువు ఆకాశసంబంధము కలిగియున్నట్లుగనే విష్ణుశక్తితోకూడియున్నది కనుక — పరమాత్మరూపమే అగుచున్నది. కనుక ప్రతిపదము—లోకప్రసిద్ధమగు తత్తదాకృతితోకూడిన వస్తువుతో పాటు, దానిలో జీవాత్మ, పరమాత్మలవరకుగల సముదాయమునే బోధించు చున్నదని స్పష్టమగుచున్నది.

ముందుముందు భగవద్రామానుజులు విష్ణుశక్తి – క్షేత్రజ్ఞశక్తి – అవిద్యాత్మకకర్మశక్తులగురించి మూలమున నిరూపింతురు.

మూ॥ ఏవమ్, సమస్తస్య చిదచిదాత్మకప్రపంచస్య సదుపాదానతా-సన్నిమిత్తతా-సదాధారతా-సన్నియామ్యతా-సచ్ఛేషతాది సర్వంచ-"సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః, సత్ప్రతిష్ఠాః" ఇత్యాదినా విస్తరేణప్రతిపాద్య, కార్యకారణభావాదిముఖేన — "ఐతదాత్మ్యమిదం సర్వం, తత్సత్యమ్" ఇతికృత్స్నస్యజగతః బ్రహ్మాత్మకత్వమేవ "సత్యమ్" ఇతి ప్రతిపాద్య, కృత్స్నస్యజగతః స ఏవ ఆత్మా, కృత్స్నంచజగత్ తస్య శరీరమ్, తస్మాత్—"త్వం" శబ్దవాచ్యమపి జీవప్రకారం బ్రహ్మైవ — ఇతి సర్వస్య బ్రహ్మాత్మకత్వం ప్రతిజ్ఞాతం, "తత్త్వమసి" ఇతి జీవవిశేషే ఉపసంహృతమ్.

అనువాదము:- ఈ విధముగ నిఖిలమగు జీవజడాత్మక ప్రపంచమునకు 'సత్' అను శబ్దముచే బోధింపబడు పరమాత్మయే ఉపాదాన కారణమనియు, ఆపరమాత్మయే నిమిత్తకారణము-ఆధారము-నియామకము. సమస్తప్రపంచము ఆ సచ్ఛబ్దవాచ్యమైన పరమాత్మచే నియమింపదగినది—అనియు—ఆ పరమాత్మకే శేషమనియు, ఇదియంతయు 'సన్మూలాః సోమ్య!' ఇత్యాది శ్రుతివచనములచే విస్తారముగ నిరూపించి, "ఐతదాత్మ్యమిదం సర్వమ్" "సచ్ఛబ్దముచే బోధింపబడు పరమాత్మయే"

'ఆత్మ'గా కలది ఈ సమస్త ప్రపంచము" "తత్సత్యమ్" 'ఇది సత్యము' ఇత్యాదిగ కార్యకారణభావనిరూపణపురస్సరముగ (పరమాత్మకారణము, జగత్తు కార్యము అని ఈ సంబంధమును నిరూపించుటద్వారా) సమస్త జగత్తు బ్రహ్మాత్మకము కావున సత్యమేనని ప్రతిపాదించి, నిఖిలజగత్తున కాపరమాత్మయే ఆత్మయనియు; సమస్త జగత్తు ఆ పరమాత్మకు శరీరమ నియు; కావున 'తత్త్వమసి' అనుచోటగల 'త్వమ్' (నీవు) అనుపదముచే బోధింపదగినదికూడ జీవుడు శరీరముగాకల పరబ్రహ్మమేననియు; ఈ విధముగ సర్వము బ్రహ్మాత్మకమేనని ప్రతిజ్ఞచేసిన విషయము—'తత్త్వ-మసి' (తత్ = ఆ పరబ్రహ్మము ఆత్మగాకలవాడవు, త్వం = నీవు, అసి = అయి ఉన్నావు) 'నీవాపరబ్రహ్మాత్మకుడవు' అని జీవవిశేషమైన శ్వేత కేతువునందు పర్యవసింపజేయబడినది.

వివరణము:- సద్విద్యాప్రకరణమందలి 'తత్త్వమసి' అను ఉప సంహారరూపమగు మహావాక్యముకూడ ముఖ్యముగ పరబ్రహ్మప్రతిపాదక మేనని నిరూపించుటకుముందు—'సన్మూలాః సోమ్య!' ఇత్యాదివచనము, 'ఐతదాత్మ్యమిదంసర్వమ్, తత్సత్యమ్' 'తత్త్వమసి శ్వేతకేతో!' అను మూడు వాక్యములకు ఏకవాక్యత (ఏకతాత్పర్యబోధకత్వము) కలదని ప్రతిపాదింపబడుచున్నది.

'సన్మూలాః' అను వచనముచే సమస్త ప్రజలు పరమాత్మను కారణ ముగా కలిగియుండి, పరమాత్మనాశ్రయించి, పరమాత్మచే నియమింప బడుచు, సత్పదార్థమగు పరమాత్మనే యాధారముగా కలిగియున్నార నియు, అందువలననే—సమస్త ప్రపంచము పరబ్రహ్మాత్మకము అని 'ఐతదాత్మ్యమిదం సర్వమ్' (ఇదం సర్వం = ఈ సమస్తము, ఐతదా-త్మ్యమ్ = పరమాత్మయే ఆత్మగా కలది) అను వచనముచే ప్రతిపాదించి, 'తత్త్వమసి' అనుచోట 'త్వమ్' (నీవు) అను పదముచే నిర్దేశింపబడిన జీవవిశేషమైన శ్వేతకేతువుకూడ—'తత్' (ఆ పరబ్రహ్మమే)నని సద్విద్యా ప్రకరణము ముగింపబడినది.

ఇక్కడ 'తత్సత్యమ్' (అది సత్యము) అనుటచే బ్రహ్మాత్మకమైన సమస్త ప్రపంచమునకు సత్యత్వమే ఉద్ఘోషింపబడినదితప్ప—జగన్మిథ్యాత్వమెంతమాత్రము ప్రసక్తముకాలేదని స్పష్టముగ తెలియుచున్నది.

ఈ విధముగ సద్విద్యాప్రకరణమంతయు—బ్రహ్మము ఉపాదాననిమిత్తకారణములుగాకలిగి, బ్రహ్మాత్మకమైన ఈ సమస్త జగత్తు సత్యమనిమాత్రమే ప్రమాణించుచున్నదితప్ప మాయావాదులు వ్యాఖ్యానించునట్లు ఇచ్చట జగన్మిథ్యాత్వము లేశమాత్రమైన వ్యక్తమగుటలేదని నిరూపింపబడినది.

## ॥ "తత్త్వమసి" వాక్యవిచారము ॥

మూ॥ ఏతదుక్తంభవతి—'ఐతదాత్మ్యమిదంసర్వమ్' ఇతి, చేతనాచేతనప్రపంచమ్—'ఇదంసర్వమ్' ఇతినిర్దిశ్య, తస్యప్రపంచస్యఏషః ఆత్మా ఇతిప్రతిపాదితః। ప్రపంచోద్దేశేన బ్రహ్మాత్మకత్వం ప్రతిపాదితమిత్యర్థః। తదిదం బ్రహ్మాత్మకత్వం, కిమ్ ఆత్మశరీరభావేన? ఉత స్వరూపేణ ఇతి వివేచనీయమ్। స్వరూపేణ ఇతిచేత్, బ్రహ్మణః సత్యసంకల్పత్వాదయః "తదైక్షతబహుస్యాం ప్రజాయేయ" ఇత్యుపక్రమావగతాః బాధితాః భవన్తి। శరీరాత్మభావేన చ తదాత్మకత్వం శ్రుత్యన్తరాద్విశేషతోఽవగతమ్। "అంతః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా" ఇతి. ప్రశాసితృత్వరూపాత్మత్వేన సర్వేషాం జనానాం—"అంతఃప్రవిష్టః"; అతః—"సర్వాత్మా" సర్వేషాం జనానామ్ ఆత్మా; సర్వంచాస్యశరీరమ్—ఇతి విశేషతో జ్ఞాయతే బ్రహ్మాత్మకత్వమ్; "య ఆత్మని తిష్ఠన్ ఆత్మానమంతరోయమయతి, సతే ఆత్మాఽన్తర్యామ్యమృతః"। అత్రాపి "అనేన జీవేన ఆత్మనా" ఇతి ఇదమేవ జ్ఞాయత

ఇతి పూర్వమేవోక్తమ్। అతః సర్వస్య చిదచిద్వస్తునో బ్రహ్మశరీరకత్వాత్ సర్వశరీరం సర్వప్రకారం సర్వశబ్దైః బ్రహ్మైవాభిధీయత ఇతి; "తత్-త్వమ్" ఇతి సామానాధికరణ్యేన జీవశరీరతయా జీవప్రకారం బ్రహ్మైవాభిహితమ్।

అనువాదము:- ఇంతవరకీయభిప్రాయము చెప్పబడినట్లగుచున్నది. 'ఐతదాత్మ్య మిదం సర్వమ్' అనుచోట 'ఇదం సర్వమ్' (ఇదియంతయు) ఇత్యాదిగ చేతనా చేతనాత్మకమగు ప్రపంచము నిర్దేశింపబడినది. 'ఏషః-ఆత్మా' (ఏషః = పరమాత్మయే, ఆత్మా = ఆత్మగా లోనున్నాడు) అను వాక్యముచే ఈ ప్రపంచమునకు పరబ్రహ్మమే 'ఆత్మ' యని ప్రతిపాదింపబడినది. ఈ విధముగ ప్రపంచమును నిర్దేశించి బ్రహ్మాత్మకమని ప్రతిపాదించుట ఆత్మశరీర భావమును (జీవాత్మకు-శరీరమునకుగల సంబంధమును) పురస్కరించుకొనియా? లేక స్వరూప తాదాత్మ్యమునుబట్టియా? అనునది వివేచింపవలసియున్నది. స్వరూపతః ప్రపంచమునకు బ్రహ్మాత్మకత్వ మనియన్నచో — 'బ్రహ్మమునకు— 'తదైక్షత-బహుస్యాం ప్రజాయేయ' ఇత్యాది వాక్యములచే ఆరంభమున తెలియబడిన 'సత్యసంకల్పత్వము' మున్నగు గుణములు బాధింపబడవలసి వచ్చును. (కుదరక పోవలసివచ్చును) విశేషముగ—'అంతఃప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా' అను వేరొక శ్రుతిచే, చిదచిదాత్మక ప్రపంచమునకు శరీరాత్మ భావమునుబట్టి బ్రహ్మాత్మకత్వము తెలియుచున్నది. ప్రశాసకుడగుటయనునదే ఆత్మత్వము. దీనినిబట్టియే సర్వచేతనులకు ఆత్మగా —'అంతఃప్రవిష్టః' లోనప్రవేశించినాడు, కనుక 'సర్వాత్మా' సర్వజనులకు ఆత్మ. సర్వము—సర్వాత్మకుడగు పరమాత్మకు శరీరము అని విశేషముగ బ్రహ్మాత్మకత్వము తెలియుచున్నది. 'య ఆత్మని తిష్ఠన్ ఆత్మానమంతరోయమయతి, సతే ఆత్మా అంతర్యామ్యమృతః' 'ఏ పరమాత్మ ఆత్మయందు (జీవాత్మయందు) ఉన్నవాడై, జీవాత్మను లోనుండి నియ

మించుచున్నాడో అట్టి అంతర్యామియు, అమృతస్వభావుడునగు పరమాత్మయే నీకు 'ఆత్మ' అనువాక్యముచే విశేషించి ప్రపంచమునకు బ్రహ్మాత్మకత్వము తెలియుచున్నది. ఇక్కడనే—'అనేనజీవేన ఆత్మనా' ఇత్యాది వాక్యముచే బ్రహ్మాత్మకత్వము తెలియుచున్నదని పూర్వమే నొడివితిమి. కావున సమస్తమైన జీవజడ ప్రపంచము బ్రహ్మమునకు శరీరము కనుక—సర్వము శరీరముగను, ప్రకారముగను కలిగియున్న పరబ్రహ్మమే, సమస్త శబ్దములచేతను బోధింపబడుచున్నది. ఈవిధముగ 'తత్త్వమసి' అనుచోటగల "తత్" పదముచేతను, "త్వం" పదముచేతను సామానాధికరణ్యమునుబట్టి జీవాత్మల శరీరముగను, ప్రకారముగను కల పరబ్రహ్మమే బోధింపబడుచున్నది.

వివరణము:— భగవద్రామానుజులీగ్రంథముచే శాంకరమత సమ్మతమగు జీవబ్రహ్మముల స్వరూపతాదాత్మ్యమును నిరాకరించి, శరీరశరీరి భావమూలమగు తదాత్మ్యమే ఉపనిషద్వాక్యసిద్ధమని నిరూపించుచున్నారు. పూర్వము వివరింపబడిన—'ఐతదాత్మ్యమిదం సర్వమ్' అను వాక్యముచేతను, దీని తరువాతగల 'సయ ఏషోఽణిమా। ఐతదాత్మ్యమిదం సర్వమ్. తత్సత్యమ్. స ఆత్మా.' (ఛాం. 6-8) ఇత్యాది వాక్యముచేతను సామాన్యరూపముగ తెలియబడుచున్న చిదచిదాత్మక ప్రపంచమునకుగల బ్రహ్మాత్మకత్వము స్వరూపతాదాత్మ్యమును బట్టి చెప్పవలయునా? లేక శరీరశరీరిభావమునుబట్టి చెప్పవలయునా? అనియాశంకించి, 'తత్త్వమసి' అను ఉపసంహారవాక్యమునుబట్టి స్వరూప తాదాత్మ్యమే చెప్పవలయునని పూర్వపక్షముచేసి, అది సరికాదని భగవద్రామానుజులు శరీరశరీరిభావమునుబట్టియే బ్రహ్మాత్మకత్వమును నిరూపించుచున్నారు. 'ఐతదాత్మ్యమిదం సర్వమ్' (ఇదం సర్వం = ఈ పురోదృశ్యమాన చేతనాచేతనాత్మక ప్రపంచమంతయు; ఐతదాత్మ్యమ్ = పరమాత్మయే ఆత్మగా కలిగియున్నది) అను వాక్యమునుబట్టియు, 'ఏషఆత్మా' (ఏషః = ఈ పరమాత్మయే; ఆత్మా = ఆత్మ)

అను నిర్దేశమును బట్టియు బ్రహ్మమునకు ఆత్మత్వము, ప్రపంచమునకు శరీరత్వము అర్థతః సిద్ధించుచున్నది. 'య ఆత్మని తిష్ఠన్' ఇత్యాది వచనమునగల 'యస్యాత్మా శరీరమ్' అను మాటచే కంఠోక్తముగ శరీరాత్మ భావము ప్రమాణసిద్ధమగుచున్నది. 'అనేన జీవేన ఆత్మనా' అను వాక్యముచేగూడ నిదియే తెలియబడుచున్నదని పూర్వమే వివరింపబడినది. ఈ విధముగ శరీరాత్మభావమునుబట్టి యవగతమైన బ్రహ్మాత్మకత్వమే 'తత్త్వమసి' అను చివరివాక్యమున (ఉపసంహారవాక్యమున)గూడ తెలియుచున్నదని యంగీకరింపవలసియున్నది.

పూర్వము సర్వశబ్దములు పరమాత్మ పర్యన్త సముదాయవాచకములని నిరూపింపబడినది కావున ప్రస్తుతమున 'తత్త్వమసి' అను వాక్యమున—'తత్–త్వమ్' అను ఏకవిభక్త్యన్తశబ్దములచే విశేషణ విశేష్య భావ పురస్సరముగ నిర్దేశింపబడిన పదములకు రెండిటికిని పరమాత్మపర్యన్త సముదాయ బోధకత్వమే ముఖ్యము (స్వభావసిద్ధము) కనుక 'త్వమ్' "నీవు" అను శబ్దముచే లోకవ్యవహారదృష్ట్యా నిర్దేశింపబడిన శ్వేతకేతువునకు కూడ బ్రహ్మాత్మకత్వము శరీర శరీరి భావమూలమేనని సిద్ధించుచున్నది. ఈ సమన్వయముచే స్వరూప తాదాత్మ్యవాదము నిరాకరింపబడినట్లైనది. అద్వైతమతానుసారము 'తత్త్వమసి' (తత్ - త్వమ్ - అసి) అను వేదాన్తవాక్యమున తత్–త్వమ్ అను రెండు శబ్దములలో, 'తత్' శబ్దము కేవల నిర్విశేష చిన్మాత్రమగు బ్రహ్మమును బోధించునదికాగా, 'త్వం' శబ్దము వాచకత్వస్థితినిబట్టి శ్వేతకేతురూప జీవవిశేష మాత్రబోధకమని యంగీకరించుటచే - ఈ రెండుశబ్దములకు ఏకార్థబోధకత్వమూలకమగు సామానాధికరణ్యము కుదరనందున—"లక్షణ"యను వేరొక అముఖ్య శక్తిచే అర్థనిర్ణయము చేయవలసివచ్చినది. అట్లుకాక భగవద్రామానుజ మతమున సర్వశబ్దములు భగవత్పర్యన్త వాచకత్వశక్తి కలవియే యని యంగీకరింపబడుటచే లక్షణాశక్తి నంగీకరింపనక్కరలేకయే తత్–త్వమ్ అను రెండుపదములకు ఏకార్థబోధకత్వము, తన్మూలమగు సామా

నాధికరణ్యము (ఏకవిభక్త్యన్త శబ్దనిర్దేశము) ముఖ్యముగనే కుదురునని నిరూపింపబడుచున్నది. ఈ విషయమింకను విస్తృత విచారపురస్సరముగ నిరూపింపబడగలదు. లక్షణను గురించికూడ యథాసందర్భముగ ముందు వివరింపబడగలదు.

**మూ॥ ఏవమభిహితే సతి అయమర్థో జ్ఞాయతే। "త్వమ్" ఇతి యః పూర్వం దేహస్య అధిష్ఠాతృతయా ప్రతీతః, సః పరమాత్మ శరీరతయా పరమాత్మప్రకారభూతః పరమాత్మపర్యన్తః; అతః "త్వమ్" ఇతి శబ్దః తత్ప్రకారవిశిష్టం తదన్తర్యామిణ-మేవ ఆచష్టే ఇతి। "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపేవ్యాకరవాణి" ఇతి బ్రహ్మాత్మకతయైవ జీవస్యశరీ-రిణః స్వనామభాక్త్వాత్, "తత్" "త్వమ్" ఇతి సమానాధికరణ ప్రవృత్తయోః ద్వయోరపిపదయోః బ్రహ్మైవవాచ్యమ్. తత్ర "తత్" పదం జగత్కారణభూతం సర్వకల్యాణగుణాకరం నిరవద్యం నిర్వికారమాచష్టే. "త్వమ్" ఇతి చ, తదేవ బ్రహ్మ, జీవాన్తర్యామిరూపం సశరీరజీవప్రకారవిశిష్టమాచష్టే. తదేవం ప్రవృత్తినిమిత్తభేదేన ఏకస్మిన్ బ్రహ్మణ్యేవ "తత్-త్వమ్" ఇతి ద్వయోః పదయోః వృత్తిరుక్తా. బ్రహ్మణో నిరవద్యత్వం నిర్వికారత్వం సర్వకల్యాణగుణాక-రత్వం జగత్కారణత్వంచ అబాధితమ్.**

అనువాదము:- ఇట్లు చెప్పబడగా ఈ క్రిందియర్థము తెలియుచున్నది. 'త్వమ్' అను శబ్దముచే దేహమునందధిష్ఠాతగా (దేహములోనున్న) ఏ జీవుడు చెప్పబడినాడో ఆ జీవుడు పరమాత్మకు శరీరమైయున్నాడుకావున పరమాత్మకు ప్రకారము (వేరుచేయరాని విశేషణము) అయియున్నాడు. కావున పరమాత్మయే పర్యంతముగా (పర్యవసానముగా-పరమప్రాప్యముగా) కలిగియున్నాడు. కనుక 'త్వమ్' అను శబ్దము జీవుని ప్రకారముగా కలిగి జీవునియందంతర్యామిగానున్న పరమా

త్మనే బోధించుచున్నది. "అనేనజీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి" "ఈ జీవునిద్వారా లోపలప్రవేశించి నామరూపముల కల్పింతునుగాక-" అనువాక్యముచే శరీరధారియగుజీవుడు - బ్రహ్మమునాత్మగా కలిగినవాడగుటచేతనే, తాను నామవ్యవహారమును పొందుచున్నాడు. (ఈవిధముగ) 'తత్' 'త్వమ్' అని సామానాధికరణ్యము (ఏకవిభక్త్యంత శబ్దముల నిర్దేశము)చే వ్యవహరింపబడుచున్న రెండుశబ్దములకు పరబ్రహ్మమే వాచ్యార్థము (ముఖ్యార్థము). ఈ రెండుశబ్దములలో 'తత్' అనునది నిఖిలజగత్తుకుకారణమైనట్టిదియు, సమస్తకల్యాణగుణములకు ఆస్పదమైనట్టిదియు, ఎట్టిదోషములు, వికారములు లేనిదియునగు పరబ్రహ్మమును బోధించుచున్నది. 'త్వమ్' అను పదము—జీవునియందు అంతర్యామిగానుండి, శరీరవిశిష్టుడైన జీవుడే ప్రకారముగా కలిగిన ఆ పరబ్రహ్మమునే బోధించుచున్నది. ఈ విధముగా ప్రవృత్తినిమిత్తముల (వ్యవహారకారణముల) భేదమునుబట్టి, ఒక్క పరబ్రహ్మము అర్థమందే 'తత్'-'త్వమ్' అను రెండుపదములు బోధకములుగా ప్రవర్తించుచున్నవి. (ఇట్లు చెప్పబడినను) పరబ్రహ్మమునకుగల నిరవద్యత్వము (ఎట్టిదోషములులేకుండుట); నిర్వికారత్వము (ఎట్టి వికారములకాస్పదము కాకుండుట); సమస్తకల్యాణగుణములకు స్థానమైయుండుట, జగత్కారణమైయుండుట అను ధర్మములకు ఎట్టి బాధయు లేదు.

వివరణము:- ఈ వాక్యములచే భగవద్రామానుజులు 'తత్-త్వమ్-అసి' అను ఛాందోగ్యవాక్యమునగల తత్-త్వమ్-అను రెండు పదములకు, ఒక్క పరబ్రహ్మమే వాచ్యార్థమని చెప్పుచున్నారు.

ఏ శబ్దము సహజముగ ఎట్టి బాధయులేక ఏయర్థమునుబోధించునో ఆ యర్థమే వాచ్యార్థము. శాస్త్రీయపరిభాషలో ఈ వాచ్యార్థమునే ముఖ్యార్థము, సంకేతికార్థము, అభిధేయార్థము అని అందురు. ఘటము అనగా కుండ అనునర్థము శబ్దమువిన్నవెంటనే సహజముగ స్ఫురించునదికనుక వాచ్యార్థము. ఇట్టియర్థమును శబ్దము బోధింపవలయునన్నదానియందొక

సహజశక్తియుండవలయును కనుక, ఆ శక్తియే అభిధ, వాచకత్వము, ముఖ్యశక్తి, బోధకత్వము, వాచ్యవాచకభావము మున్నగు శబ్దములచే శాస్త్రకారులచే వ్యవహరింపబడుచున్నది.

ఈ శక్తిచే బోధింపబడినయర్థము కుదరనప్పుడు, కుదురునట్టి వేరొక యర్థమును బోధించుటకై 'లక్షణ' అను రెండవశక్తినికూడ శాస్త్రకారులంగీకరించినారు. ఈ క్రిందివాక్యప్రయోగములలోని భేదమును పరిశీలించినచో అభిధా-లక్షణాశక్తుల స్వభావభేదము స్పష్టమగును. "గంగలో స్నానము చేయుచున్నాడు" అనుచోట 'గంగలో' అనుపదమునకు 'గంగాప్రవాహమున' అని సహజముగ స్ఫురించునర్థము. ఇక్కడ ఈ యర్థము బాగుగనే కుదురుచున్నదికనుక ఆయాయిశబ్దముల తమ సహజ శక్తియగు "అభిధద్వారమువనే అర్థములను బోధించుచున్నవి. కనుక ఇచ్చట శబ్దములచే బోధింపబడిన యర్థములు వాచ్యార్థములు లేక ముఖ్యార్థములు అని వ్యవహరింపబడును. "గంగలో గొల్లపల్లియున్నది" అని వేరొక ప్రయోగమున్నది. ఇచ్చటకూడ 'గంగలో' అను పదమునకు 'గంగాప్రవాహమున' అను ముఖ్యార్థము ముందు స్ఫురించుచున్నది. కాని ప్రవాహమున గొల్లపల్లియుండుట కుదరదుకదా! కనుక వాచ్యార్థమునకు (సహజముగ స్ఫురించునర్థమునకు) బాధ (కుదురుబాటు లేకుండుట) కలదు. కనుక—ఇక్కడ 'గంగలో' అను పదమునకు 'ప్రవాహమున' అనునర్థమును విడిచి 'గంగ ఒడ్డున' అని వేరొకయర్థమును చెప్పికొన్నప్పుడు, వాక్యముయొక్క అర్థము కుదురును. ఇట్టి రెండవ యర్థమును బోధించుటకు పదములకు సహజశక్తి పనికిరాదు కనుక వేరొక శక్తిని అంగీకరింపవలసియున్నది. ఇట్టి రెండవశక్తియే "లక్షణ" లేక అముఖ్యశక్తి, ఉపచారము ఇత్యాది పారిభాషికపదములచే శాస్త్రకారులు వ్యవహరించుచున్నారు.

'తత్త్వమసి' అనుచోట ముఖ్యశక్తిచేతనే అర్థము కుదురునని భగవ

రామానుజమతముకాగా, ఇచ్చట తత్-త్వమ్ అను రెండుపదములకు లక్షణాశక్తి నంగీకరించి యర్థముచెప్పవలయునని యద్వైతవాదులు చెప్పుదురు. 'తత్త్వమసి'యను వాక్యము మూడువిధములైన సంబంధములను బట్టి అఖండమైన యర్థము బోధించుచున్నదని వారియభిప్రాయము. ఈ సంబంధత్రయమేదియనగా-పదములకు సామానాధికరణ్యము, పదార్థములకు-విశేషణవిశేష్యభావము, పదార్థ-ప్రత్యగాత్మలకు లక్ష్యలక్షకభావము. ఈ విషయమే సురేశ్వరాచార్యుల నైష్కర్మ్యసిద్ధిలోని యీ క్రింది శ్లోకము స్పష్టపరచుచున్నది.

'సామానాధికరణ్యంచ విశేషణవిశేష్యతా।
లక్ష్యలక్షణ సంబంధః పదార్థప్రత్యగాత్మనామ్॥' అని.

అద్వైతమతము ననుసరించి-తత్-త్వమ్ అను రెండు పదముల లోను 'తత్' అను పదము సర్వజ్ఞత్వాదులతో కూడిన చైతన్యమును బోధించుచున్నది. 'త్వమ్' అను పదము అంతఃకరణాది విశిష్టమును బోధించుచున్నది. ఈ రెండును ఒక్కటియనుట కుదరదు కనుక సర్వజ్ఞత్వాది ధర్మముల విడచి కేవల చైతన్యరూపార్థమే 'లక్షణాశక్తి' ద్వారమున చెప్పబడుచున్నది. అనగా నిచ్చటి తత్-త్వమ్ పదములు తమతమ యర్థములలోని కొంత భాగమును విడచి కొంత యర్థమునే లక్షణద్వారా బోధించుచున్నవి. కనుక దీనిని భాగలక్షణ లేక జహదజహల్లక్షణయని వారు వ్యవహరించిరి. ఈ విషయము ముందుముందు మరికొంత వివరింపబడగలదు.

ఇచ్చట తత్-త్వమ్ పదములు రెండును ఒకే యర్థమును బోధించుచున్నవి కనుక సామానాధికరణ్యము ముఖ్యముగనే కుదురునని భగవద్రామానుజ మతము. మరి-ఒకే యర్థముకల రెండు శబ్దములను వెంట వెంటనే ఒకే వాక్యమున కలిపి ప్రయోగించినచో పునరుక్తిదోషము కల్గును గదా? అనియన్నచో ప్రవృత్తినిమిత్తభేదముచే రెండుపదములొకే యర్థ

మును బోధించుట కుదురునని యెరుగవలెను. దీనినే భగవద్రామానుజులు–'తదేవంప్రవృత్తినిమిత్తభేదేన ఏకస్మిన్‌బ్రహ్మణ్యేవ తత్–త్వమ్ ఇతిద్వయోఃపదయోర్వృత్తిరుక్తా' అను వాక్యముచే చెప్పియున్నారు.

ఇది దీని తాత్పర్యము.

ఏదేనియొక శబ్దమొక యర్థమును బోధింపవలయునన్నచో ఒక వ్యవహారకారణముండవలయును. అట్లు వ్యవహరించుటకు ఏదేని నిమిత్తముండవలయునని తాత్పర్యము. ఈ నిమిత్తమునే 'ప్రవృత్తి నిమిత్తము' అందురు. ప్రవృత్తియనగా ఒకశబ్దము ఒకయర్థమందు వ్యవహరింపబడుట. దీనికిగల నిమిత్తము లేక కారణము 'ప్రవృత్తి నిమిత్తము'– ఉదాహరణమునకు 'గోవు' అనుశబ్దము గోత్వజాతిని (గంగడోలు మున్నగు అవయవములతో కూడియుండుటను) ప్రవృత్తి నిమిత్తముగా జేసికొని గోవ్యక్తిని (ఆ పదార్థమును) బోధించుచున్నదని మీమాంసకులు, వైయాకరణులు చెప్పుదురు. ఈ గోత్వజాతి అన్ని గోవులయందు సమానముగానున్నది కనుక గోశబ్దము–జాతిని నిమిత్తముగా జేసికొని ఆయాయి గోవులను బోధించుచున్నది. ఇట్లే కొన్ని శబ్దములు గుణమును, కొన్ని శబ్దములు క్రియను, మరికొన్ని సంజ్ఞను ప్రవృత్తినిమిత్తముగా జేసికొని ఆయాయి అర్థముల బోధించుచున్నవని వైయాకరణులు చెప్పుదురు. 'నల్లనిది' అను శబ్దము "నలుపు" అను గుణమును, 'పాచకుడు' అను శబ్దము పచనము (వండుట) అను క్రియను, రాముడు, కృష్ణుడు మున్నగు శబ్దములు ఆయాయి సంజ్ఞలను (పేర్లను) నిమిత్తములుగా జేసికొని ఆయాయి వస్తువులను బోధించుచున్నవని వారి యభిప్రాయము. 'నల్లని–గోవు' అనుచోట 'నల్లని' అను శబ్దము గుణమును, గోవు అను శబ్దము గోత్వజాతిని ప్రవృత్తినిమిత్తముగా చేసికొని ఒకే గోవ్యక్తిని బోధించుచున్నవి. ఇట్లే తత్–త్వమ్ అను రెండు పదములు ఒకే బ్రహ్మమును బోధించినను ప్రవృత్తినిమిత్తములు వేరువేరుగనున్నవి కనుక దోషములేదు. ఏలన–'తత్' శబ్దము జగత్కారణత్వము, సకలకల్యాణ

గుణాకరత్వము, నిరవద్యత్వము, నిర్వికారత్వము ఇత్యాది ధర్మను లను నిమిత్తముగా జేసికొని బ్రహ్మమును బోధించుచున్నది. 'త్వమ్' శబ్దము సశరీరజీవప్రకారత్వము (శరీరముతోగూడినజీవుడు ప్రకారముగా కలిగియుండుట) అంతర్యామిత్వము మున్నగు ధర్మములతోగూడిన బ్రహ్మమును బోధించుచున్నది. ఈ విధముగ ప్రవృత్తినిమిత్తముల భేదముచే ఒకేయర్థమును బోధించుటవలన పర్యాయత్వములేదు. ఇట్లు ముఖ్యముగనే [లక్షణ అక్కరలేకయే] ఇట్టియర్థము ప్రతిపాదింపబడ వచ్చును కనుక లక్షణావాదము స్వాభిమతముకాదని భగవద్రామానుజులు సూచించుచున్నారు. ఈ లక్షణావాదమును ముందు విశేషముగ నిరాక రింతురు.

మూ॥ అశ్రుతవేదాన్తాః పురుషాః, "సర్వేపదార్థాః సర్వే జీవాత్మా- నశ్చ బ్రహ్మాత్మకాః" ఇతి న పశ్యన్తి. సర్వశబ్దానాం చ కేవ లేషు తత్తత్పదార్థేషు వాచ్యైకదేశేషు వాచ్యపర్యవసానం మన్యన్తే. ఇదానీం వేదాన్తవాక్యశ్రవణేన, బ్రహ్మకార్య తయా తదన్తర్యామితయాచ సర్వస్య బ్రహ్మాత్మకత్వం సర్వ శబ్దానాంతత్తత్ప్రకారసంస్థిత బ్రహ్మవాచిత్వంచ జానన్తి.

నన్వేవం గవాదిశబ్దానాం. తత్తత్పదార్థవాచితయా వ్యుత్పత్తిర్బాధితా స్యాత్. నైవం; సర్వేశబ్దాః అచిజ్జీవ విశిష్టపరమాత్మనో వాచకా ఇత్యుక్తం—"నామరూపే వ్యాకర- వాణి" ఇత్యత్ర. తత్ర లౌకికాస్తు పురుషాః శబ్దం వ్యవహ- రన్తః, శబ్దవాచ్యే ప్రధానాంశస్య పరమాత్మనః ప్రత్యక్షా- ద్యపరిచ్ఛేద్యత్వాత్, వాచ్యైకదేశభూతే వాచ్యసమాప్తిం మన్యన్తే. వేదాన్త శ్రవణేన హి వ్యుత్పత్తిః పూర్యతే.

ఏవమేవ వైదికాః శబ్దాః సర్వే పరమాత్మ పర్యన్తాన్ స్వార్థాన్ బోధయన్తి. వైదికాఏవ సర్వే శబ్దాః, ఆదౌ

వేదాదేవ ఉద్ధృత్య ఉద్ధృత్య, పరేణైవ బ్రహ్మణా సర్వపదా-
ర్థాన్ పూర్వవత్ సృష్ట్వా, తేషు పరమాత్మపర్యన్తేషు పూర్వ
వత్ నామతయా ప్రయుక్తా॥

తదాహ మనుః —

'సర్వేషాంతు సనామాని కర్మాణిచ పృథక్ పృథక్।
వేద శబ్దేభ్య ఏవాదౌ పృథక్సంస్థాశ్చ నిర్మమే॥'

(1-21) ఇతి;

సంస్థాః=సంస్థానాని, రూపాణీతి యావత్।

ఆహచ భగవాన్ పరాశరః —

'నామరూపంచ భూతానాం కృత్యానాంచప్రపంచనమ్।
వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాం చకారసః॥'

(వి. పు. 7-5-63)

శ్రుతిశ్చ—'సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమ్ అకల్పయత్' ఇతి. సూర్యాదీన్ పూర్వవత్ పరికల్ప్య నామానిచపూర్వవత్ చకార ఇత్యర్థః॥

అనువాదము:- వేదాన్తవాక్యముల వినియుండని (సామాన్య) జనులు, "సర్వపదార్థములు, సర్వజీవాత్మలు బ్రహ్మాత్మకములు" (బ్రహ్మమే ఆత్మగా కలవి) అని చూడజాలకున్నారు. అన్ని శబ్దములకు కేవలము (లోకవ్యవహారమాత్రప్రసిద్ధములగు) ఆయాయి అర్థములందు అనగా వాచ్యార్థములలో ఒక భాగమందుమాత్రమే శక్తిని (బోధకత్వమును) గ్రహించి, అంతమాత్రమే వాచ్యార్థమని భావించుచున్నారు. ఇప్పుడు వేదాన్తవాక్యములను విని, పరబ్రహ్మముచే నిర్మింపబడినదగుటచేతను, బ్రహ్మమునే అంతర్యామిగ కలిగియున్నదగుటచేతను, సమస్తము బ్రహ్మాత్మకమేననియు; అన్ని శబ్దములు-ఆయాయిపదార్థములు

ప్రకారములుగా (అపృథక్సిద్ధవిశేషణములుగా) గల బ్రహ్మమునే బోధించుచున్నవనియు తెలిసికొనుచున్నారు.

మరియట్లన్నచో—(లోకమున) గోవు మున్నగు శబ్దములకు ఆయాయిపదార్థములను బోధించుటయందు శాస్త్రకారులచే కల్పింపబడిన 'శక్తి' (బోధకత్వము) బాధింపబడవలసివచ్చునుకదా? అన్నచో - అట్లు కాదు. అన్ని శబ్దములు జడజగత్తుతోను, జీవులతోను, కూడిన పరమాత్మనే బోధించుచున్నవని పూర్వము—"నామరూపేవ్యాకరవాణి" అనువాక్యము వివరించు సందర్భమున చెప్పియున్నాము. ఈ విషయమున—లౌకిక ప్రజ్ఞగలజనులు ఆయాయిశబ్దమును వ్యవహరించుచున్నవారై—శబ్దము యొక్క వాచ్యార్థమునందలి ప్రధానాంశమగు పరబ్రహ్మము-ప్రత్యక్షము మున్నగు ప్రమాణములచే తెలియదగినదికానందున, వాచ్యార్థము యొక్క ఏకదేశమందు (ఒకభాగమందు) వాచ్యార్థపర్యవసానమును భావించుచున్నారు. (ఏకదేశమునే సంపూర్ణవాచ్యార్థముగా భావించుచున్నారు.) అట్టివారికి వేదాన్తవాక్యశ్రవణమువలనమాత్రమే వారి వ్యుత్పత్తి (అర్థజ్ఞానము) పూరింపబడుచున్నది. ఇట్లే వేదములందుగల వైదికములైన (ఇంద్రాది) శబ్దములుకూడ పరమాత్మవరకుగల స్వార్థములనే బోధించుచున్నవి. వేదములందుగల వైదికశబ్దములనే తొలుత వెలికి దీసి, ఆ పరబ్రహ్మమే వెనుకటివలెనే సమస్తపదార్థముల సృజించి, పరమాత్మపర్యన్తములగు ఆయర్థములందే ఆ శబ్దములను వెనుకటివలెనే పేరులుగా ప్రయోగించెను. దీనినే మనువిట్లు చెప్పినాడు. "సర్వేషాంతు సనామాని........" "అన్నిటికిని విభిన్నములగు నామములను, కర్మములను, విభిన్నములగు రూపములను తొలుత వేదశబ్దములనుండియే నిర్మించెను".

సంస్థాః = అనగా సంస్థానములు అనగా రూపములని భావము.

భగవానుడగు పరాశరమహర్షికూడ—(విష్ణుపురాణమున) ఇట్లు

చెప్పెను. (నామరూపంచభూతానాం) "ప్రాణులయొక్క నామరూపము లను, వాటివాటి కర్మములను (క్రియలను) వేదశబ్దములనుండియే వేరు వేరుగ కల్పించెను. దేవాదులకుకూడ ఇట్లే కల్పించెను. ఈ విషయ మునే వేదము—'సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్' 'సూర్యచంద్రులను బ్రహ్మ పూర్వమువలెనే కల్పించెను' అని చెప్పు చున్నది. సూర్యాదులను వెనుకటివలెనే కల్పించి, నామరూపములను కూడ వెనుకటివలెనే కల్పించెనని భావము.

వివరణము:— ఈ గ్రంథముచే భగవద్రామానుజులు లౌకికశబ్దము లకును, వైదికశబ్దములకును పరబ్రహ్మమే చివరికి వాచ్యార్థమని చెప్పు చున్నారు. ఇంతియేగాక—వేదాన్తవాక్యములను వినుటకుపూర్వము జనులకుగల లౌకిక వ్యుత్పత్తి పరిపూర్ణముకాదనియు, వేదాన్తవాక్యముల విన్నతరువాతమాత్రమే వారి వ్యుత్పత్తి (శబ్దార్థజ్ఞానము) పరిపూర్ణమగు ననియు చెప్పినారు. ఏలన—లోకమున నాయాయిశబ్దములకాయాయి అర్థములను జనులు లోకవ్యవహారమునుబట్టి గ్రహించినను—వారు గ్రహించినయర్థము—సంపూర్ణవాచ్యార్థములో ఒకభాగమేతప్ప పూర్ణము కాదు. అన్నిశబ్దములు పరబ్రహ్మపర్యన్తము బోధించుచున్నవి. అనగా 'పర్వత' శబ్దము పైకగుపించు పదార్థము, దానిలోగల జీవునితోపాటు లోనుండి నియమించుచున్న అంతర్యామియగు పరమాత్మవరకు బోధిం చును. అనగా నాయాయి శబ్దములు జడవస్తువును, దానిలోని జీవుని, జీవునియందుగల పరమాత్మను బోధించినప్పుడే పరిపూర్ణార్థబోధకములగు చున్నవి. కాని పరమాత్మ లౌకికములగు ప్రత్యక్షాది ప్రమాణములచే తెలియరాడు కావున, ప్రధానమగు పరమాత్మాంశమును విడచి – బాహ్య ముగ కనుపించు లౌకికవ్యవహారగోచరమగు నర్థమును–అనగా ఒక అంశ మును మాత్రమే తెలిసికొని సామాన్యజనులు వ్యవహరించుచున్నారు. ఈ

సామాన్యజనులు వేదాన్తవాక్యముల విన్నతరువాత అన్ని వస్తువులు (జడములు – జీవులు మున్నగునవియన్నియు) పరమాత్మతోకూడిన వై పరమాత్మకు ప్రకారములుగా వేరుచేయరానివై యున్నవని–'అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి' ఇత్యాది వేదాన్తవాక్యము లవలన తెలిసికొని – అన్ని శబ్దములకు పరమాత్మయే 'పర్యన్తము' (చివరికి బోధింపదగినది) అని తెలిసికొనుచున్నారు. అప్పుడు మాత్రమే (అన్ని శబ్దములు పరమాత్మపర్యన్తబోధకములని తెలిసికొన్నప్పుడు మాత్రమే) వారి యర్థజ్ఞానము పరిపూర్ణమగును. ఈ లౌకిక శబ్దములకు గల వ్యవస్థయే వేదములందలి శబ్దములకుగూడ నని యెరుగవలయును. ఏలన — వైదికశబ్దములనుండియే పూర్వసృష్టి స్మరణపూర్వకముగా– బ్రహ్మ–లౌకికవస్తువులను, వాటి నామరూపకర్మములను వేరువేరుగా కల్పించినాడని మనువు, పరాశరుడు మున్నగువారు పల్కిన మాటలేకాక, శ్రుతిగూడ నిర్ధారించుచున్నది. మూలోద్ధృతములగు శ్లోకముల యర్థమిది—

1. సః = ఆ పరమాత్మ; సర్వేషాం = సమస్త వస్తువులకు; పృథక్ పృథక్ = వేరువేరుగ; నామాని = పేర్లను; కర్మాణిచ = కర్మములను (క్రియలను); పృథక్ సంస్థాశ్చ = వేరువేరురూపములనుగూడ; వేదశబ్దేభ్యఏవ = వేదశబ్దములనుండియే; నిర్మమే = నిర్మించెను.

2. భూతానాం = ప్రాణులకును, దేవాదీనాంచ = దేవతలుమున్నగువారికిని; నామరూపం = పేర్లను, రూపములను; కృత్యానాం = కర్మములయొక్క; ప్రపంచనం = విస్తారమును (విభాగమును) వేదశబ్దేభ్య ఏవ = వేదములందలిశబ్దములనుండియే; సః = ఆ పరమాత్మ; చకార = కల్పించెను.

3. ధాతా = హిరణ్యగర్భునియంతర్యామియగు పరమాత్మ; సూర్యాచంద్రమసౌ = సూర్యుడు, చంద్రుడు అను గ్రహములను; యథా

పూర్వమ్ = పూర్వపూర్వకల్పములందున్నట్లుగనే; అకల్పయత్ = సృజించెను.

ఈ విధముగ 'తత్' 'త్వమ్' అను పదములకుగూడ పరమాత్మ పర్యన్తబోధకత్వము సహజముగనే యున్నదనియు, ఇచ్చట లక్షణ కల్పింపనక్కరలేదనియు భగవద్రామానుజ గ్రంథతాత్పర్యము.

మూ॥ ఏవమ్ – జగద్బ్రహ్మణోరనన్యత్వం ప్రపంచితమ్. తేన ఏకేన జ్ఞానేన సర్వస్యజ్ఞాతతా ఉపపాదితా భవతి. సర్వస్య బ్రహ్మకార్యతాప్రతిపాదనేన తదాత్మకతయైవ సత్యత్వం నాన్యథేతి–"తత్సత్యమ్" ఇత్యుక్తమ్. యథా దృష్టాన్తే సర్వస్య మృద్వికారస్య మృదాత్మనైవ సత్యత్వమ్.

అనువాదము:– ఈవిధముగ జగత్తు–బ్రహ్మము అను ఈ రెండిటికిని అభేదము (ఏకత్వము) నిరూపింపబడినది. దీనివలన 'ఒకటి' తెలియుటచే 'అన్నియు' తెలియబడుననుట కుదర్చబడుచున్నది. సమస్తము—పరబ్రహ్మమునకు కార్యము (బ్రహ్మమునుండి పుట్టినది) కనుక పరబ్రహ్మాత్మకమగుటచేతనే సత్యమగుచున్నది. వేరుగకాదు. ఈ అభిప్రాయమే 'తత్–సత్యమ్' (అది–సత్యము) అనువచనముచే చెప్పబడినది. ఉపనిషద్దృష్టాన్తమున—సమస్తమగు మృద్వికారము—మృత్తు వలన ఏర్పడినదగుటచేతనే 'సత్యము' అనునదికూడ సిద్ధించుచున్నది.

వివరణము:– ఛాందోగ్యప్రఘట్టకమున నీయబడిన మృద్దృష్టాన్తమును సమన్వయించి జగత్సత్యత్వమును నిరూపించుటద్వారా జగన్మిథ్యాత్వవాదమును భగవద్రామానుజులు నిరాకరించుచున్నారు. సమస్త జగత్తు పూర్వము పేర్కొనబడినట్లు బ్రహ్మమునకు ప్రకారమై (వేరుగ సిద్ధింపని విశేషణమై) బ్రహ్మాత్మకమైయున్నదికనుక—ఈవిధముగ శరీర శరీరి భావమూలమగు నభేదము, జగత్తునకు—బ్రహ్మమునకు సిద్ధించుచున్నదని విస్తారముగ నిరూపింపబడినది. 'తత్త్వమసి' అనుచోటునగల

తత్-త్వమ్ పదములుకూడ కారణత్వ విశిష్టబ్రహ్మమును—కార్యవిశిష్ట బ్రహ్మమును బోధించుచున్నవి కావున, రెండును ఒకే అర్థమును బోధించునవగుటచే ముఖ్యముగనే సామానాధికరణ్యము కుదురుచున్నది. ఈవిధముగ కారణము—కార్యము (జగత్తు) ఒకే బ్రహ్మము కనుక, కారణము తెలిసినచో కార్యము తెలియుటలో ఎట్టి అనుపపత్తి లేదుకావున 'ఏక-విజ్ఞానేన' (ఒకటి తెలియుటచే) 'సర్వవిజ్ఞానమ్' (అన్నియు తెలియుట) కూడ కుదురుచున్నది. ఇట్లే కారణమైన బ్రహ్మము సత్యమైనట్లుగ, కార్యము కూడ (చిదచిదాత్మక ప్రపంచముకూడ) ఆ బ్రహ్మమే కనుక సత్యమే ననియు, మృద్దృష్టాంతముకూడ కారణ-కార్యములకు అనన్యత్వము (అభేదము)ను-మృత్తువలె-మృత్తునుండిపుట్టిన ఘటశరావాది కార్యజాతము కూడ సత్యమే అయినట్లు—కారణమగు బ్రహ్మమువలె—తత్కార్యమైన జగత్తు కూడ సత్యమేనని నిష్కర్షించుచున్నదనియు స్పష్టపరుపబడినది.

ఇచ్చట నీ విశేషము తెలియవలయును -

ఇంతవరకు వివరింపబడిన ఛాందోగ్య సద్విద్యాప్రకరణముచే 'విశిష్టాద్వైతమే' షడ్విధతాత్పర్యలింగ పురస్సరముగ నిరూపింపబడుచున్నదని యెరుగవలయును. ఏదేనియొక ప్రఘట్టకమునకు తాత్పర్యమేమియని నిర్ణయించుటకు షడ్విధములగు లింగములు (విశేషనిరూపకలక్షణములు) ఉండవలయునని శాస్త్రకార మర్యాద. అవి. 1. ఉపక్రమోపసంహారములు 2. అభ్యాసము 3. అపూర్వతా 4. ఫలము 5. అర్థవాదము 6. ఉపపత్తి అనునవి.

ప్రస్తుత సద్విద్యాప్రకరణమున నీలక్షణములు ఈక్రిందివిధముగ సమన్వయించుచున్నవి.

1. 'సదేవసోమ్య!' ఇత్యాది వాక్యము, భగవానుడు అభిన్ననిమిత్తోపాదాన కారణమనియు, దీనికుపయోగించు సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్త్వము మున్నగు గుణములున్నవని తెలుపుచున్నదికావున, సవిశేష

బ్రహ్మపరమేనని ఉపక్రమము తెలియజేయుచున్నది. ఉపసంహారమున (చిట్టచివర)గల 'తత్త్వమసి' అను మహావాక్యము, తత్–త్వమ్ పదములు సమానాధికరణములై విశిష్టబ్రహ్మమును బోధించునవియై ఏకార్థకములు కనుక, విశిష్టాద్వైత బోధకము. సూక్ష్మ చిదచిద్విశిష్టమగు కారణబ్రహ్మము—స్థూల చిదచిద్విశిష్టమగు కారణబ్రహ్మము ఒక్కటేనని బోధించుచున్నది.

2. ఈ విశిష్టాద్వైతబోధకమగు 'తత్త్వమసి' అను మహావాక్యము పలుసారులు చెప్పబడినది కనుక అభ్యాసము (ఆవృత్తి) కలదు. అభ్యాసమనగా ఒకే విషయమును పలుమారులు చెప్పుట.

3. చిదచిదాత్మక ప్రపంచము—పరబ్రహ్మమునకు ప్రకారము (అపృథక్ సిద్ధవిశేషణము) అని ప్రమాణాంతర ప్రతిపన్నముకాని విషయము చెప్పబడుటచే అపూర్వతకలదు.

4. ఇది యెరిగినవారికి—'తస్యతదేవచిరమ్' ఇత్యాదిగ మోక్ష ఫలము చెప్పబడుటచే ఫలము కలదు.

5. ఈ విషయమంతయు పితాపుత్రుల సంవాదముగ నుపనిషత్తులో చెప్పబడినదికావున అర్థవాదమున్నది. (ప్రశంస లేక నిందను బోధించు వాక్యము అర్థవాదము)

6. ఈ విషయముననే బ్రహ్మముతోపాటు—బ్రహ్మము కారణముగా కలిగి, బ్రహ్మమునకు కార్యమైన జగత్తును సత్యమేనని మృద్దృష్టాన్తముచే నుపన్యసింపబడినది కనుక 'ఉపపత్తి' (యుక్తి) కూడకలదు. ఈవిధముగ షడ్విధ తాత్పర్య లింగములబట్టి భగవద్రామానుజాభిమతమగు 'విశిష్టాద్వైతమే' సద్విద్యాప్రకరణతాత్పర్యసిద్ధమని పర్యవసించుచున్నది.

**మూ॥ శోధకవాక్యాన్యపి నిరవద్యం సర్వకల్యాణగుణాకరం బ్రహ్మ**

**శోధయన్తి. సర్వప్రత్యనీకాకారబోధనేఽపి, తత్తత్ప్రత్యనీకాకారతాయాం భేదస్య అవర్జనీయత్వాత్ న నిర్విశేషత్వసిద్ధిః.**

అనువాదము:- శోధకవాక్యములుకూడ నిరవద్యము (ఎట్టిదోషములు లేనిదియు) సమస్తకల్యాణగుణములకు స్థానమైనట్టిదియునగు పరబ్రహ్మమునే శోధించుచున్నవి. సర్వవిధహేయగుణవిరహితముగ పరబ్రహ్మము (శోధకవాక్యములచే) బోధింపబడినప్పటికిని, అయాయి హేయగుణములకు ప్రత్యనీకమగు (విరుద్ధమగు) భేదముకూడ విడువరానిదేకావున, ఎట్టి విశేషములులేనిది బ్రహ్మమనుట సిద్ధింపదు.

వివరణము:- శోధకవాక్యములనగా భగవానుడు జగత్కారణమని అంగీకరించినప్పుడు శంకింపబడు దోషములనన్నింటిని నిరాకరించు శ్రుతివాక్యములు. "సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ" ఇత్యాది శ్రుతివాక్యములు అసత్యత్వాదిదోషములకు విరుద్ధమైనబ్రహ్మమును ప్రతిపాదించుచు, అట్టి దోషముల నిరాకరించుచున్నవి. కనుకనిట్టివే శోధకవాక్యములు. "కారణత్వశంకితదోషవ్యుదాసకం వాక్యమ్" అని నిర్వచనము. భగవానుని యందెట్టిదోషములులేవని నిష్కర్షించువాక్యములు శోధకవాక్యములని తాత్పర్యము. ప్రత్యనీకశబ్దమునకు "తదత్యన్తాభావవత్" "అదియెంత మాత్రము లేనిది" అనియు, ప్రతిపక్షము, విరుద్ధము, ఇత్యాద్యర్థములు. ప్రస్తుతమున శోధకవాక్యములు అయాయి హేయగుణములెంతమాత్రము లేని పరబ్రహ్మస్వరూపమును ప్రతిపాదించుచున్నవని తాత్పర్యము. ఈ విధముగ శోధకవాక్యములవలన నాయాయి దోషప్రత్యనీకాకారములుగల సవిశేషబ్రహ్మమే బోధింపబడుచున్నదికాని, నిర్విశేషబ్రహ్మముకాదని పర్యవసించుచున్నది.

**మూ॥ నను జ్ఞానమాత్రంబ్రహ్మేతి ప్రతిపాదితే నిర్విశేషజ్ఞాన-మాత్రం బ్రహ్మేతి నిశ్చయతే. నైవమ్; స్వరూపనిరూపణ**

ధర్మశబ్దా హి ధర్మముఖేన స్వరూపమపి ప్రతిపాదయన్తి గవాదిశబ్దవత్. తథా ఆహ సూత్రకారః — "తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్"; "యావదాత్మభావిత్వాచ్చ నదోషః—"ఇతి. జ్ఞానేన ధర్మేణ స్వరూపమపి నిరూపితం, నతు జ్ఞానమాత్రం బ్రహ్మేతి. కథమిదమవగమ్యత ఇతిచేత్ "యస్సర్వజ్ఞస్సర్వవిత్" ఇతి జ్ఞాతృత్వ శ్రుతేః; "పరాస్యశక్తిర్వివిధైవశ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ", "విజ్ఞాతారమరే కేన విజానీయాత్" ఇతి శ్రుతిశతసమధిగతమిదమ్. జ్ఞానస్య ధర్మమాత్రత్వాత్ ధర్మమాత్రస్యైకస్య వస్తుత్వప్రతిపాదనానుపపత్తేశ్చ. అతః సత్యజ్ఞానాది పదాని స్వార్థభూత జ్ఞానాది విశిష్టమేవ బ్రహ్మ ప్రతిపాదయన్తి.

'తత్—త్వమ్' ఇతిద్వయోరపి పదయోః స్వార్థప్రహాణేన నిర్విశేషవస్తుస్వరూపోపస్థాపనపరత్వే ముఖ్యార్థపరిత్యాగశ్చ.

అనువాదము:— మరి జ్ఞానమాత్రమే బ్రహ్మమని ప్రతిపాదింపబడినప్పుడు, ఎట్టి విశేషములేని జ్ఞానమాత్రమే బ్రహ్మమని నిశ్చయింపబడు ననుట కుదరదు. స్వరూపమును నిర్ణయించునట్టి ధర్మములు, ఆయాయి ధర్మములద్వారా స్వరూపమునుకూడ ప్రతిపాదించును. గోవు మున్నగు శబ్దములవలె. దీనినే సూత్రకారుడు — 'తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్'; 'యావదాత్మభావిత్వాచ్చనదోషః' ఇత్యాదిగ చెప్పియున్నాడు. జ్ఞానరూపమగు ధర్మముచే స్వరూపముగూడ నిరూపింపబడినట్లైనది. అంతియేగాని, జ్ఞానముమాత్రమే (ఎట్టి విశేషములేనిది) బ్రహ్మము అనికాదు. మరి యీ విషయమెట్లు తెలియుచున్నదనియన్నచో—'యస్సర్వజ్ఞస్సర్వవిత్' మున్నగు జ్ఞాతృత్వమును ప్రతిపాదించు

శ్రుతిచేతనే. 'పరాస్య శక్తిర్వివిధైవశ్రూయతే స్వాభావికీజ్ఞానబలక్రియాచ' 'విజ్ఞాతారమరే కేనవిజానీయాత్' మున్నగు శతాధికములగు శ్రుతివచనములచేనిది తెలియబడినది. జ్ఞానమనునది ధర్మముమాత్రమే కనుక, ఒక్క కేవల ధర్మమును వస్తువుగా ప్రతిపాదించుటకుదరదుకదా! కనుక సత్యము, జ్ఞానము మున్నగు పదములు తమయర్థమైన జ్ఞానాదిధర్మములను, వాటితోకూడిన బ్రహ్మమునే బోధించుచున్నవి. తత్–త్వమ్ అను రెండు పదములును, తమ యర్థములనువిడచి కేవలనిర్విశేషవస్తువు యొక్క స్వరూపమును ప్రతిపాదించునన్నచో ముఖ్యార్థమును (తప్పక బోధింపవలసియున్న వాచ్యార్థమును) విడచుటయను దోషమేర్పడును.

వివరణము:– "సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ" ఇత్యాది వాక్యములలో జ్ఞానమాత్రస్వరూపము పరబ్రహ్మమని తెలియబడుచున్నందున స్వరూపభూతమగు జ్ఞానము నిర్విశేషమేనని యద్వైతవాదను. దీనికి భగవద్రామానుజుల సమాధానమిది.

జ్ఞానము ద్వివిధము. ధర్మిభూతజ్ఞానము, ధర్మభూతజ్ఞానముఅని. పైని పేర్కొనబడిన వేదాన్తవాక్యములలోని జ్ఞానశబ్దము ధర్మస్వరూపమును బోధించి తద్ద్వారముననే, ధర్మియగు పరమాత్మను ప్రతిపాదించుచున్నది. దీనివలన జ్ఞానము ధర్మముగాగల బ్రహ్మము జ్ఞానస్వరూపమని పర్యవసితార్థము. అద్వైతులు–జ్ఞానశబ్దము కేవల బ్రహ్మస్వరూపమాత్రప్రతిపాదకమని యందురు. ఈ విధముగ వారి మతమున జ్ఞానస్వరూపమగు బ్రహ్మమున ధర్మమేమియులేదు, కావున నిర్విశేషజ్ఞానమాత్రమే బ్రహ్మమని తెలియుచున్నదని వారి యభిప్రాయము.

భగవద్రామానుజులు — ఈ నిర్విశేషజ్ఞానమాత్రబ్రహ్మవాదమును నిరాకరించుటకు–జ్ఞానాదిధర్మిబోధకశబ్దములు ధర్మమును బోధించుటద్వారముననే ధర్మిని బోధించుచున్నవను సూత్రకారుని అభిప్రాయమును చూపించుచున్నారు. బ్రహ్మ సూత్రకారుడు – "తద్గుణసారత్వాత్తు తద్వ్య

పదేశః-ప్రాజ్ఞవత్"-అను సూత్రముచేతను, "యావదాత్మభావిత్వాచ్చన దోషః" — అను సూత్రముచేతను పైయభిప్రాయమునే వ్యక్తపరచుచున్నాడు.

ఈ సూత్రములయర్థమిది.

"యోవిజ్ఞానే తిష్ఠన్" "విజ్ఞానంయజ్ఞంతనుతే" "జ్ఞానస్వరూపమత్యన్తనిర్మలమ్" ఇత్యాది వాక్యములందు జ్ఞానశబ్దముచే, జ్ఞానమే ఆత్మయని నిర్దేశింపబడుచున్నదను పూర్వపక్షమును నిరాకరించుటకై-"తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః" (బ్ర.సూ. 2-3-29) అను సూత్రము నిర్దేశింపబడినది. తద్గుణసారత్వాత్ = విజ్ఞానమనుగుణముసారముగా (ప్రధానముగా) కలవాడగుటచే, తద్వ్యపదేశః = ఆత్మకు విజ్ఞానమనివ్యవహారము; ప్రాజ్ఞవత్ = ప్రాజ్ఞునకువలె, అని దృష్టాన్తనిర్దేశము. ఎట్లుగ ప్రాజ్ఞునకు (పరమాత్మకు) ఆనందము సారభూతగుణముకావున, ఆనందశబ్దముచే వ్యపదేశము (నిర్దేశము-వ్యవహారము) కలదో, అట్లే ఆత్మకు విజ్ఞానమే సారభూతగుణముకావున విజ్ఞానశబ్దముచే వ్యపదేశమున్నది.

"యావదాత్మభావిత్వాచ్చ నదోషః, తద్దర్శనాత్" (బ్ర.సూ.2-3-30)

యావదాత్మభావిత్వాచ్చ = విజ్ఞానమనునది ఆత్మస్వరూపముండునంతవరకు ఉండెడి ధర్మముకనుక; నదోషః = ఆత్మను విజ్ఞానశబ్దముచే వ్యపదేశించుట దోషముకాదు; తద్దర్శనాత్ = అట్లుగనే అది కన్పట్టుచున్నదికనుక. ఇచ్చట 'యావదాత్మభావిత్వ'మనగా ధర్మిస్వరూపమెంతకాలముండునో అంతకాలముండుట'యని యర్థము. ఖండగోవు (తెగిన కొమ్ములుగల యావు) మున్నగునవి, ఆ ధర్మిస్వరూపముండునంతవరకు ఉండెడి 'గోత్వము' మున్నగు ధర్మములను బోధించు గవాది శబ్దములచేతనే నిర్దేశింపబడుట కన్పట్టుచున్నది. అట్లే విజ్ఞానమును ధర్మము-ధర్మియైన 'ఆత్మ'యొక్క స్వరూపముండునంతవరకు ఉండునదేకనుక, ఈ ధర్మవాచకశబ్దముచేతనే ధర్మియగు ఆత్మను బోధించుట

దోషముకాదని సూత్ర తాత్పర్యము.

ఈ రెండు సూత్రములును స్వరూపనిరూపకములైన ధర్మశబ్దములు-ధర్మముతోపాటు, ఆ ధర్మముతో కూడిన ధర్మినికూడ బోధించునను విషయమును ప్రమాణించుచున్నవి.

ఇక్కడనొక శంక కలుగవచ్చును. సుఖము, దుఃఖము, ఇచ్ఛ మున్నగువానివలె జ్ఞానముకూడ ధర్మమైయున్నచో అది ప్రకాశించితీర వలయునుకదా! ఏది ప్రకాశించుటలేదో అది జ్ఞానము కాజాలదు. ఒకవేళ యీ జ్ఞానము-ఆత్మస్వరూపముండునంత వరకుండునది (యావదాత్మ భావి) అయినచో ఎల్లవేళల ప్రకాశించుచునేయుండవలయునుకదా! అని.

దీనికిది సమాధానము. ఆత్మయందనాదిసిద్ధమైన గుణమొక్కటి కలదు. ఆ గుణము విషయగ్రహణవేళయందే ప్రకాశించును. పరిణామ దశయందే అది విషయముల గ్రహించుట. ఆ అనాదిసిద్ధమైన గుణము యొక్క పరిణామమే ప్రత్యక్షానుమానాదులు, జ్ఞానము, ఇచ్ఛ, కృతి, సుఖము, దుఃఖము మున్నగునవి. ఎట్లుగ ప్రకృతి, పరిణామదశయందే వ్యక్తమై, ఇతరవేళలయందు అవ్యక్తమైయుండునో, అట్లే ఇదియును. అన్నివిధములైన పరిణామములకు మూలమైన జ్ఞానపరిణామముతోకూడిన దగుటచేతను, జ్ఞానపరిణామము ప్రచురముగా కలదగుటచేతను ఈ అనాదిసిద్ధమగు గుణమునకే జ్ఞానమని వ్యపదేశము. కార్యవాచకమైన పదముచేతనే కారణమునకు వ్యపదేశమేర్పడినదను కారణముచే - అన్ని వేళల ఆ జ్ఞానగుణమునకు సర్వవిషయకత్వము (సమస్తము విషయముగ కలిగియుండుట) ఎల్లప్పుడు ప్రకాశించుచుండుట అనునవి నియతములు కావు. మరి, గుణమైన జ్ఞానమునకు పరిణామమెట్లని శంకింపనక్కరలేదు. ఎట్లుగా జ్యోత్స్న (వెన్నెల) ద్రవ్యమే అయినప్పటికిని, చంద్రుని ఆశ్రయించి ధర్మముగానుండుటచే గుణమను వ్యపదేశము కుదురుచున్నదో, అట్లే జ్ఞానముకూడ పరిణామయోగ్యమైన ద్రవ్యమే అని అంగీకరించి

నమా, అది ధర్మియైన ఆత్మను ఆశ్రయించియుండి ధర్మమైయున్నది కనుక—దానిని గుణమని వ్యపదేశించుట దోషముకాదు. తార్కికులు చెప్పి నట్లే గుణవ్యపదేశము చేయవలయునను నియమమేమియులేదు. కనుక జ్ఞానము (ధర్మము)ను బోధించు విజ్ఞానాదిశబ్దములు (ధర్మియగు) ఆత్మను కూడ బోధించుటలో ఏ విప్రతిపత్తియులేదు. (పై విషయమును శ్రీభాష్యార్థ దర్పణవ్యాఖ్యలో పు. 582, 583 చూడనగును.)

ఈ విధముగ జ్ఞానశబ్దము కేవలస్వరూపప్రతిపాదకమని అంగీక రింపనక్కరలేదని తేలుచున్నది.

మరి, పరమాత్మయందు జ్ఞానధర్మమున్నదనుటకు ప్రమాణమేమి? అన్నచో—'యః సర్వజ్ఞః సర్వవిత్' ఇత్యాదులు. ఈ వాక్యముచే పర మాత్మకు 'జ్ఞాతృత్వము'ను ధర్మము కలదని తెలియుచున్నది. అట్లే— 'పరాస్యశక్తిః' ఇత్యాది శ్వేతాశ్వతరవాక్యముకూడ జ్ఞానము పరమాత్మ ధర్మమని తెలియజేయుచున్నది. (చూ. పు. 72) అట్లే 'విజ్ఞాతారమరే కేన విజానీయాత్' (అరే = ఓయీ, విజ్ఞాతారమ్ = అన్నిటిని తెలిసికొను వానిని, కేన = ఏ ప్రమాణముచే, విజానీయాత్ = తెలిసికొనవలయును ) అను వాక్యముకూడ పరమాత్మకు 'విజ్ఞాతృత్వము' (తెలిసికొనువాడై యుండుట) అను ధర్మము కలదని బోధించుచున్నది.

ఈ విధముగ 'సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ' అను వాక్యమునగల సత్యజ్ఞానాదిశబ్దములు సత్యజ్ఞానాదిధర్మవిశిష్టుడగు పరమాత్మను బోధించు చున్నవి. ఇట్లే తత్—త్వమ్ పదములుకూడ స్వార్థమైన సర్వజ్ఞత్వ—జగత్ కారణత్వాదివిశిష్టమగు బ్రహ్మమును, జీవాదిప్రకారవిశిష్ట బ్రహ్మమును బోధించుచున్నవై, స్వార్థమును విడచుటలేదనియే చెప్పవలయును. అట్లు కాక స్వార్థమును విడచి కేవల నిర్విశేషవస్తుస్వరూపమునే బోధించుచున్న వని యంగీకరించినచో—స్వార్థపరిత్యాగరూపమగు దోషము ప్రసక్తమగు వని భగవద్రామానుజ గ్రంథ తాత్పర్యము.

## ॥ తత్త్వమసి యనుచోటున లక్షణ లేదనుట ॥

మూ॥ "నను ఐక్యతాత్పర్యనిశ్చయాత్, నలక్షణా—దోషః, "సోఽయం దేవదత్తః" ఇతివత్। యథా 'సోఽయమ్' ఇత్యత్ర, 'స' ఇతి శబ్దేన, దేశాన్తరకాలాన్తరసంబంధీ పురుషః ప్రతీయతే, 'అయమ్' ఇతిచ సన్నిహితదేశ వర్తమానకాలసంబంధీ, తయోస్సామానాధికరణ్యేన ఐక్యం ప్రతీయతే। తత్ర ఏకస్యయుగపత్ విరుద్ధదేశకాలసంబంధితయా ప్రతీతిః న ఘటత ఇతి, ద్వయోరపి పదయోః స్వరూపమాత్రోపస్థాపన పరత్వం స్వరూపస్యచైక్యం ప్రతిపాద్యతే" ఇతిచేత్—

నైతదేవమ్. 'సోఽయం దేవదత్తః' ఇత్యత్రాపి లక్షణాగంధో నవిద్యతే, విరోధాభావాత్. ఏకస్యభూతవర్తమానక్రియాద్వయసంబంధో నవిరుద్ధః. దేశాన్తరస్థితిః భూతా; సన్నిహితదేశస్థితిఃవర్తతే; అతః భూతవర్తమానక్రియాద్వయసంబంధితయా ఐక్యప్రతిపాదనమవిరుద్ధమ్। దేశద్వయవిరోధశ్చ కాలభేదేన పరిహృతః। లక్షణాయామపి నద్వయోరపి పదయోః లక్షణాశ్రయణమ్; ఏకేనైవలక్షితేన విరోధ పరిహారాత్, లక్షణాఽభావ ఏవ ఉక్తః। దేశాన్తర సంబంధితయా భూతస్యైవ అన్యదేశ సంబంధితయా వర్తమానత్వాఽవిరోధాత్.

ఏవమత్రాఽపి జగత్కారణ భూతస్యైవబ్రహ్మణః జీవాన్తర్యామితయా జీవాత్మత్వమవిరుద్ధమితి ప్రతిపాదితమ్. యథాభూతయో రేవహి ద్వయోః ఐక్యం సామానాధికరణ్యేన ప్రతీయతే। తత్పరిత్యాగేన స్వరూపమాత్రైక్యం న సామానాధికరణ్యస్యార్థః। "భిన్నప్రవృత్తినిమిత్తానాం శబ్దానామ్ ఏకస్మిన్నర్థే వృత్తిః సామానాధికరణ్యమ్" ఇతి హి తద్విదః। తథాభూతయో రేవ ఐక్యముపపాదితమస్మాభిః.

అనువాదము:- "మరి, తత్-త్వమ్ అను రెండు పదములకును ఒకేయర్థమున తాత్పర్యమున్నదని (లక్షణద్వారా) నిర్ణయించుటవలన 'లక్షణ' దోషము కాదుకదా! 'సోఽయం దేవదత్తః' 'వాడే యీ దేవదత్తుడు' అనుచోటునగూడ-ఇట్లే కదా! ఎట్లుగ-'వాడే-వీడు' అనుచోటున గల 'వాడు' (సః) అను తచ్ఛబ్దముచేత-వేరొకదేశము, వేరొకకాలముతో సంబంధముగల వ్యక్తి తెలియబడుచున్నాడు. 'వీడు' (అయమ్) అను శబ్దముచే దగ్గరగానున్న ప్రదేశమునకు, వర్తమాన (జరుగుచున్న) కాలమునకు సంబంధించిన వ్యక్తి తెలియబడుచున్నాడు. 'వానికి'-'వీనికి' (సః-వాడు—అయమ్-వీడుఅని) ఏకవిభక్త్యంత శబ్దములచే సామానాధికరణ్యమునుబట్టి ఐక్యము (ఇద్దరూ ఒక్కటే అనునది) తెలియుచున్నది. ఒకే వ్యక్తికి, ఒక్కమారుగ, భిన్నదేశకాలములతో సంబంధము కుదరదు కనుక-ఆ రెండు పదములకు (అయాయి దేశకాలముల విడచి) కేవల స్వరూపమాత్రబోధకత్వము, ఆ స్వరూపమునకు ఐక్యము, తెలియజేయబడుచున్నది."—అనియున్నచో నిది యిట్లుకాదు.

'సోఽయం దేవదత్తః' (వాడే యీ దేవదత్తుడు) అనుచోటునగూడ లక్షణ-లేశమాత్రమైననులేదు. అక్కడ నారెండు శబ్దముల యర్థములకు ఎట్టి విరోధములేదుకదా! ఒకే వస్తువునకు భూత-వర్తమాన కాలములకు చెందిన క్రియలతో సంబంధముండుట విరుద్ధముకాదు. ఏలన - వేరొక ప్రదేశమునసుండుట భూతకాలమునకు చెందినది. దగ్గరగానుండుట వర్తమానకాలమునకు చెందినది. అందువలన భూత-వర్తమానకాలములకు సంబంధించిన క్రియలతోకూడినవాటికి ఐక్యముచెప్పుట విరుద్ధమెంతమాత్రముకాదు. ఈ రెండు ప్రదేశములకుగల వైరుధ్యము కాలభేదముచే పరిహరింపబడినదికదా! ఒకవేళ, లక్షణాశక్తి నాశ్రయించినను, రెండు పదములకు లక్షణ చెప్పరాదు. ఒక శబ్దమునకు "లక్షణ" చెప్పినంతనే విరోధము తీరునుకదా!

వాస్తవమునకు లక్షణలేదనియే చెప్పబడినది. వేరొక దేశముతో

సంబంధము భూతకాలికముకాగా, అన్యదేశ–సంబంధము వర్తమానకాలికముకనుక విరోధములేదుకదా! అట్లే 'తత్ త్వమసి' అనుచోటునకూడ (లక్షణ అక్కరలేదు) జగత్కారణమైన పరబ్రహ్మమే, జీవుల కంతర్యామికనుక, జీవులకు ఆత్మయైయుండుట – విరుద్ధముకాదని ప్రతిపాదించి యుంటిమి. (కనుక) ఉన్నవాటికియున్నట్లే (కొంత యర్థమును విడచుట కొంత పరిగ్రహించుట అనునది లేక–యథాతథముగనే) రెండు శబ్దములకు (తత్–త్వమ్ అనువాటికి) సామానాధికరణ్యమునుబట్టి ఐక్యము తెలియుచున్నది. ఈ యర్థమును విడచి, స్వరూపమందు మాత్రమే ఐక్యము – సామానాధికరణ్యముచే సిద్ధించునర్థముకాదు. సామానాధికరణ్యము అనగా భిన్నములైన ప్రవృత్తినిమిత్తములు (వ్యవహారకారణములు) కల శబ్దములకు ఒకే యర్థమున బోధకత్వముండుటయే. అట్టి శబ్దములకే (స్వార్థమును త్యజింపని శబ్దములకే) ఐక్యము మాచే కుదర్పబడినది.

వివరణము:– ఈ గ్రంథముచే భగవద్రామానుజులు 'తత్త్వమసి' అనుచోట అద్వైతులంగీకరించిన 'లక్షణ' అక్కరలేదని నిరాకరించుచున్నారు. 'సోఽయం దేవదత్తః' 'వాడే యీ దేవదత్తుడు' అనునది "తత్త్వమసి' అను వేదాన్తవాక్యమునకు దృష్టాన్తముగా లక్షణయొక్క ఆవశ్యకతను నిరూపించుటకై నిర్దేశింపబడినది. 'సోఽయం దేవదత్తః' 'వాడే యీ దేవదత్తుడు' అనుచోటున అర్థములకుగల వైరుధ్యమును కుదుర్చుటకై కొంత యంశమును విడచి కొంత పరిగ్రహించి లక్షణ యంగీకరించినట్లే–'తత్త్వమసి' అనుచోటునకూడ లక్షణను అంగీకరింపవలయునని పూర్వపక్షము. 'సోఽయం దేవదత్తః' అనుచోటున అర్థముల కెంత మాత్రము వైరుధ్యము లేనందున లక్షణ అక్కరలేనట్లే, 'తత్త్వమసి' అనుచోటునకూడ తత్–త్వమ్ పదములచే బోధింపబడిన యర్థములకు వైరుధ్యములేదుకనుక లక్షణ అక్కరలేదని భగవద్రామానుజ సమాధానగ్రంథ తాత్పర్యము.

ఈ ప్రఘట్టకమునకిది యభిప్రాయము.

భగవత్పాదమతముననుసరించి 'తత్త్వమసి'యను వేదాన్త వాక్యమునగల సామానాధికరణ్యమును కుదుర్చుటకై లక్షణ – నంగీకరించుట అవసరమని చెప్పబడినది. దీనికి దృష్టాన్తముగా 'సోఽయం దేవదత్తః' అను లౌకికవాక్యము చూపబడినది. వేదాన్తసారమున సదానందుడిట్లీ సమన్వయరీతిని విశదపరచియున్నాడు.

'తస్మాద్యథా సోఽయం దేవదత్తః ఇతివాక్యం–తదర్థోవా, తత్కాలై తత్కాలవిశిష్టదేవదత్తలక్షణస్యవాక్యార్థస్య అంశే విరోధాత్, విరుద్ధ తత్కాలైతత్కాల విశిష్టాంశం పరిత్యజ్య, అవిరుద్ధం దేవదత్తాంశమాత్రం లక్షయతి, తథా తత్త్వమసీతి వాక్యం, తదర్థోవా, పరోక్షత్వాపరోక్షత్వాది విశిష్ట చైతన్యైకత్వలక్షణస్య వాక్యార్థస్య అంశే విరోధాత్, విరుద్ధపరోక్ష-త్వాపరోక్షత్వవిశిష్టాంశం పరిత్యజ్య, అవిరుద్ధమఖండచైతన్యమాత్రం లక్షయతి.' 'సోఽయం దేవదత్తః'–వాడే యీ దేవదత్తుడు అని లోకమున వ్యవహరించుటకలదు. ఇచ్చట 'వాడు' అను పదముచే పూర్వమెప్పుడో ఎక్కడో చూడబడిన దేవదత్తుడు చెప్పబడుచున్నాడు. 'ఈ' అను శబ్దముచే ఈ దేశమున, ఈ కాలమున ఎదుట కనుపించుచున్న దేవదత్తుడు చెప్పబడుచున్నాడు. దేశకాలభేదములుగల ఒకే దేవదత్తుడు ఈ రెండు శబ్దములచే (వాడే–ఈ అనువాటిచే) చెప్పబడుచున్నాడు. "వాడే–యీ" అను రెండు శబ్దములును ఒకే విభక్తిచే సమానాధికరణముగ నిర్దేశింపబడుటచే ఈ దేవదత్తులిరువురు ఒక్కడేనను అర్థము స్ఫురించుచున్నది. కాని దేశకాలభేదము స్పష్టముగనుండుటచే వీరిరువురు ఒక్కడగుట కుదరదు కదా! కనుక ఆయాయి దేవదత్తులకు విశేషణములుగానున్న తత్తద్దేశ కాలాదులను విడచిపెట్టి రెండు శబ్దములు లక్షణాశక్తిద్వారా కేవల దేవదత్తుడను నర్థమును మాత్రమే బోధించుటచే బాధ నివారింపబడినట్లైనది. ఈ విధముగ శబ్దమునకుగల కొంత యర్థమును విడచి కొంత యర్థమును మాత్రమే లక్షణద్వారా పరిగ్రహించుటచే ఈ లక్షణ–భాగలక్షణ–లేక జహదజహల్లక్షణ అని వ్యవహరింపబడుచున్నది. ఈ ప్రక్రియనే "తత్త్వమసి"

అను వేదాన్త వాక్యమునకూడ అన్వయించి భాగలక్షణ సంగీకరించి నప్పుడు-తత్-అను పదముచే సహజముగా బోధింపబడవలసిన సర్వజ్ఞత్వ-పరోక్షత్వాది విశిష్టబ్రహ్మము అను నర్థమునను; త్వం పదముచే బోధింపబడవలసిన కించిజ్ఞత్వ-అపరోక్షత్వాది విశిష్టబ్రహ్మమను అర్థమునను-విశేషణాంశములను (పరోక్షత్వము-అపరోక్షత్వము మున్నగు అంశములను) విడచి, కేవల "బ్రహ్మమ"నునర్థముమాత్రమే భాగలక్షణ నాశ్రయించి చెప్పవలసియున్నది. అట్లుకానిచో-తత్-త్వం పదార్థముల సామానాధికరణ్యమువలన స్ఫురించుచున్న ఐక్యము కుదరకపోవలసి వచ్చును.' అని పై వాక్యముల తాత్పర్యము. ఇక్కడ నీ క్రింది విషయము గమనింపదగియున్నది. "తత్త్వమసి" యనుచోటున లక్షణ నంగీకరింపవలయునని భగవత్పాదులు స్వయముగ సూత్రభాష్యాదులలో నెచ్చటనైన చెప్పిరా? లేక తదనుయాయులే యిట్లంగీకరించిరా? అని వివేచించినప్పుడు ఈ క్రింది విషయము తెలియుచున్నది.

సూత్రభాష్యమునగాని, ఛాందోగ్యసద్విద్యాప్రకరణభాష్యమున గాని భగవత్పాదులు లక్షణాప్రసంగమును చేసినట్లు కన్పట్టదు. "తత్త్వమసి" అను వాక్యములోని తత్-త్వం పదముల యర్థమును నిర్ణయించుచు భగవత్పాదులు ఆవృత్త్యధికరణములోని "లింగాచ్చ" (బ్ర. సూ. 4-1-2) అను సూత్రభాష్యమున నీ క్రింది విధముగా పేర్కొనిరి. "అపిచ తత్త్వమసీత్యే తద్వాక్యం త్వంపదార్థస్య తత్పదార్థభావమాచష్టే। తత్పదేనచ ప్రకృతం సద్బ్రహ్మ ఈక్షితృ, జగతో జన్మాదికారణమ్, అభిధీయతే। "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"........ ఇత్యాది శాస్త్ర ప్రసిద్ధమ్।........ ఏష వ్యావృత్త సర్వసంసారధర్మకః అనుభవాత్మకః బ్రహ్మసంజ్ఞకః తత్పదార్థో, వేదాన్తాభియుక్తానాం ప్రసిద్ధః। తథా త్వంపదార్థోఽపి ప్రత్యగాత్మా, శ్రోతా, దేహాదారభ్య ప్రత్యగాత్మతయా సంభావ్యమానః చైతన్య పర్యన్తత్వేన అవధారితః।" (మరియు 'తత్త్వమసి' అనునీవాక్యము 'త్వం' శబ్దబోధ్యమగునర్థమునకు—'తత్' శబ్దబోధ్యమగు నర్థముతో తాదాత్మ

ముును బోధించుచున్నది. 'తత్' పదముచే ప్రస్తుతమై సచ్ఛబ్దముచే బోధింపబడునట్టిదియు, జగత్తుయొక్క జన్మాదులకు కారణమైనట్టిదియు, ద్రష్టృత్వముఁకలదియునగు బ్రహ్మము చెప్పబడుచున్నది. సాంసారిక ధర్మముల వ్యావృత్తి (నిషేధము) కలదియు, అనుభవ స్వభావము నైన తత్పదార్థమగు బ్రహ్మము, వేదాన్తవాక్యముల లెస్సగనెరిగినవారికి ప్రసిద్ధమే. అట్లే త్వంపదమునకర్థమై శ్రోతయు, దేహము మొదలు చైతన్య పర్యంతము ప్రత్యగాత్మగా భావింపబడు జీవాత్మయు తెలియ బడినాడు.) ఈ వాక్యములలో 'అభిధీయతే' "చెప్పబడుచున్నది" ఇత్యా దిగ వాచ్యవృత్తి (అభిధ) చేతనే తత్-త్వమ్ పదములాయాయి అర్థముల బోధించుచున్నవనియే అవగతమగుచున్నది. కాని "భావ్యరత్నప్రభా" "న్యాయనిర్ణయ"కారులుమాత్రము "తత్త్వం పదలక్ష్యార్థస్య దుర్బోధ త్వాత్" (తత్త్వం పదముల లక్ష్యార్థము తెలియరానిదగుటవలన) అనియు; "తత్పదార్థంవాచ్యం లక్ష్యంచ సప్రమాణముక్త్వా త్వం పదార్థమపి విభజ్య దర్శయతి" ("తత్"పదార్థమైన వాచ్యమును, లక్ష్యమును సప్రమాణముగా పేర్కొని "త్వం" పదార్థముఁనుగూడ విభజించి చూపుచున్నాఁడు) అనియు; లక్షణాశక్తిని గురించి ప్రస్తావించినారు. భగవత్పాదుల ఛాందోగ్య సద్విద్యా ప్రకరణ భాష్యముఁనగూడ లక్షణాప్రస్తావన కన్పట్టదు. కాని భగవత్పాదులు స్వవిరచితమైన "వివేకచూడామణి"యను శ్లోకాత్మక గ్రంథమున "తత్త్వమసి" యను మహావాక్యమున "జహదజహల్లక్షణ" కలదని ఈ క్రిందిశ్లోకములలో పేర్కొనినారు. ఇదియే భాగలక్షణ.

"తతస్తు తౌ లక్షణయాసులక్ష్యౌ
తయోరఖండైకరసత్వ సిద్ధయే।
నాలం జహత్యా న తథాఽజహత్యా
కింతూభయార్థాత్మిక యైవ భావ్యమ్॥"

"కనుక పరబ్రహ్మము–జీవాత్మ అను రెండర్థములును "లక్షణ" యను శక్తిద్వారముననే తెన్నగ లక్షింపదగియున్నవి. ఈ రెండిటికి సర్వాత్మనా తాదాత్మ్యము సిద్ధింపవలెనన్న జహల్లక్షణచేగాని, అజహల్లక్షణచేకాని కుదరదు. కనుక ఉభయాత్మకమైన జహదజహల్లక్షణచేతనే తెలియదగియుండును."

"సదేవదత్తో ఒయమితీహ చైకతా
విరుద్ధ ధర్మాంశమపాస్య కథ్యతే।
తథాతథా తత్త్వమసీతివాక్యే
విరుద్ధ ధర్మావుభయత్ర హిత్వా॥
సంలక్ష్య చిన్మాత్రతయా చిదాత్మనోః
అఖండభావః పరిచీయతే బుధైః।
ఏవం మహావాక్య శతేన కథ్యతే
బ్రహ్మాత్మనోరైక్య మఖండభావః॥"

"సఃదేవదత్తః అయమ్" (ఆ దేవదత్తుడితడే) అనుచోట విరుద్ధములైన ఆదేశము—ఆకాలములతో కూడియుండుట, ఈ దేశము-ఈ కాలములతో కూడియుండుట అను అంశములవిడచి అవిరుద్ధమైన అంశమే ఎట్లు చెప్పబడుచున్నదో, అట్లే "తత్త్వమసి" అనుచోట విరుద్ధధర్మముల రెండుచోటుల (తత్-త్వమ్ అనుచోటుల) విడచి సద్రూపమగు బ్రహ్మము—జీవాత్మ అను రెండిటిని కేవలచిన్మాత్రముగ లక్షణచే ప్రతిపాదించి విద్వాంసులు ఐక్యమునే తెలిసికొనుచున్నారు. ఇట్లే వందలాది మహావాక్యములందు బ్రహ్మము–జీవాత్మ అను రెండిటికిని అఖండమగు నైక్యభావమే తెలియనగును." అని.

ఈ లక్షణాప్రక్రియనే సురేశ్వరాచార్యులు "నైష్కర్మ్యసిద్ధి"లోను, విద్యారణ్యులు "వేదాన్త పంచదశి"లోను నిరూపించియున్నారు.

భగవద్రామానుజులీ లక్షణావాదము నంగీకరింపరైరి. శబ్దములకు

గల యర్థము సాధారణముగనే కుదురుచుండగా లక్షణయక్కరలేదని వారి తాత్పర్యము. లక్షణను కుదుర్చుటకై భగవత్పాదులు, తదనుయాయులు చూపిన—"సోఽయం దేవదత్తః" (అతడే యీ దేవదత్తుడు) అనుచోట కూడ లక్షణకెంతమాత్రము అవకాశము లేదనియు, తత్సామ్యముచే "తత్త్వమసి" అనుచోటకూడ లక్షణ లేశమాత్రమైన లేదనియు పేర్కొనినారు. తత్-పదముచే బోధింపబడిన జగత్కారణత్వాది విశిష్టబ్రహ్మము, త్వం-పదముచే బోధింపబడిన యంతర్యామిత్వ-సశరీర జీవప్రకారత్వాది ధర్మములతో కూడిన బ్రహ్మము ఒక్కటేనని సహజమగు శబ్దశక్తిచేతనే (అభిధ) చేతనే తెలియుచుండగా, లక్షణాశక్తి అక్కరలేదని వారియభిప్రాయము. శబ్దముచే తొలుత బోధింపబడిన యర్థములకు వైరుద్ధ్యము కలిగినప్పుడు కదా లక్షణావశ్యకత! వైరుద్ధ్యము లేనప్పుడు, తత్-త్వమ్ పదములచే బోధింపబడిన వాచ్యార్థములు (ముఖ్యార్థములు) కుదురుచున్నప్పుడు లక్షణనేల యంగీకరింపవలెను? అట్లంగీకరించుట దోషమేయగునని తాత్పర్యము.

మరియు ఒకవేళ లక్షణ నంగీకరింపవలసివచ్చినచో ఒక్కపదమునకే లక్షణనంగీకరించి వైరుద్ధ్యము పరిహరింప వీలగుచుండగా రెండు పదములకు (తత్-త్వమ్ అను రెండింటికి) లక్షణ నాశ్రయించుట వ్యర్థమే యగును. సోఽయం దేవదత్తః (వాడే యీ దేవదత్తుడు) అనుచోట వాస్తవమునకెట్టి వైరుద్ధ్యము లేదు. ఎదురుగా దేవదత్తుడగుపించి నప్పుడు, వీడెవ్వడను శంకను వారించుటకై, పూర్వము వేరొక ప్రదేశమున నగుపించినవాడే ఇప్పుడు-ఇక్కడ నున్నాడని పూర్వస్మరణము ద్వారా ఆ దేవదత్తుడు-వీడు ఒక్కడేనని ప్రత్యభిజ్ఞ (గుర్తింపు) కలుగ జేయబడుచున్నది. ఒక్కడే రెండు ప్రదేశములందెట్లుండు నన్నచో-కాల భేదముచేనని సమాధానము. ఒకే వ్యక్తి కాలభేదముచే భిన్నప్రదేశములందుండుటయు, వర్తమానకాలమున చూచినప్పుడు పూర్వము వేరొక తావున చూచినవాడే వీడని గుర్తించుటయు సహజమేకదా! కనుక ఇచ్చట

లక్షణకిసుమంతయైనను తావులేదు. ఇట్లే–'తత్త్వమసి' అనుచోటకూడనని పర్యవసితార్థము.

మరియు ఈ సందర్భమున సామానాధికరణ్యస్వరూపమును నిష్కర్షించుచు–ఏ శబ్దములచే నే యర్థములు సహజమగు అభిధాశక్తిచే బోధింపబడినవో, ఆ యర్థములకు యథాతథముగనే ఐక్యము సామానాధికరణ్యముచే స్ఫురించునుకాని, కొంత యర్థమును విడువగా మిగిలిన స్వరూపమునకు మాత్రమే ఐక్యము సామానాధికరణ్యముచే సిద్ధించునర్థమనియనరాదని పేర్కొనినారు. ఇది దీని తాత్పర్యము.

భిన్నములైన ప్రవృత్తి నిమిత్తములు (వ్యవహార కారణములు) కల శబ్దములు ఏకార్థమును బోధించుట సామానాధికరణ్యమని చెప్పబడినది. 'నల్లనిగోవు' అనుచోట 'నల్లని' అను శబ్దము నల్లదనమను గుణమును, గో శబ్దము గోత్వజాతిని ప్రవృత్తినిమిత్తములుగా జేసికొని ఒకే యావును బోధించుచున్నవి. ఇచ్చట ఏ యర్థమువిడువబడలేదు. మరియు ఏ విశేషణములవలన రెండు శబ్దములకు ప్రవృత్తి నిమిత్తభేదమేర్పడుచున్నదో ఆ విశేషణములను పరిత్యజించుట కుదరదుకదా! తత్–త్వమ్ అను పదములు వేరువేరు విశేషణములుకల ఒకే బ్రహ్మమును బోధించుచున్నవి. ఈ భిన్నవిశేషణములబట్టియే వీటికి సామానాధికరణ్యమను లక్షణము అన్వయించుచున్నది. అట్లుకాక విశేషణాంశముల విడచినచో ప్రవృత్తినిమిత్తభేదములేదు కనుక ఈ రెండు పదములు పర్యాయములై సహాప్రయోగయోగ్యతను కోలుపోవును. కనుక భిన్నవిశేషణవిశిష్టమగు ఒకేయర్థము భిన్నశబ్దములచే బోధింపబడినప్పుడే ఆ రెండర్థములకు ఐక్యము సామానాధికరణ్యమునకర్థముగా పర్యవసించునని తాత్పర్యము. కనుక ఏ యర్థములను విడువకయే సామానాధికరణ్యము కుదర్పబడవలయును.

కావున జహదజహల్లక్షణ యంగీకరించినప్పుడు కొంత యర్థము

విడువబడుచున్నదికనుక, తత్-త్వం పదములకు వాస్తవమగు సామానాధి కరణ్యము కుదురుటలేదని యభిప్రాయము.

**మూ॥ ఉపక్రమ విరోధ్యుపసంహారవాక్య తాత్పర్య నిశ్చయశ్చ న ఘటతే। ఉపక్రమే హి "తదైక్షతబహుస్యాం ప్రజాయేయ" ఇత్యాదినా సత్యసంకల్పత్వం జగదేక కారణత్వముప్యుక్తమ్, తద్విరోధిచ అవిద్యాశ్రయత్వాది బ్రహ్మణః॥**

అనువాదము:- ఉపక్రమమున (ప్రఘట్టకారంభమున) నే యర్థము చెప్పబడినదో దానికి విరుద్ధముగా ఉపసంహారవాక్యము (చిట్ట చివరి వాక్యము) యొక్క అర్థమును నిర్ణయించుట కుదరదు. ఉపక్రమమున (ఛాందోగ్య సద్విద్యాప్రకరణారంభమున) 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయ' (అనేక విధములుగా పుట్టుదును గాకయని సచ్ఛబ్దవాచ్య మగు పరబ్రహ్మము సంకల్పించినది.) ఇత్యాదిగ, పరబ్రహ్మమునకు సత్యసంకల్పత్వము (అప్రతిహతమైన సంకల్పము కలిగియుండుట); జగదేకకారణత్వము (జగత్తునకు తానొక్కడే కారణమైయుండుట) చెప్ప బడినది. దానికి విరుద్ధముగా ఉపసంహారమున బ్రహ్మమునకు అవిద్యా శ్రయత్వము (అజ్ఞానమున కాశ్రయమైయుండుట) మున్నగునవి కల్పిం చుట యుక్తముకాదు.

వివరణము:- ఏదేని ప్రకరణమునకు ఆరంభమున నే విషయము ప్రతిజ్ఞ చేయబడినదో, ఆ ప్రకరణపు చివరకూడ అదే విషయము పరామ ర్శింపబడవలయునుగాని తద్విరుద్ధముకాదు. అట్లైనచో ఆ గ్రంథమునకు (ప్రకరణమునకు) తాత్పర్యభేదమేర్పడి ప్రామాణ్యము లుప్తముకావలసి వచ్చును. లోకమునగూడ ఎవ్వడు ముందాడిన మాటకు విరుద్ధముకాకుం డగ చివర మాటాడునో, వాని మాటలకు యథార్థత, విశ్వసనీయత, ప్రామాణ్యము కల్గును. లౌకికవాక్యములస్థితియే యిట్టిదైనప్పుడు సర్వ ప్రమాణమూర్ధన్యమగు శ్రుతివచనములకు పరస్పర విరుద్ధార్థములను కల్పిం

చుట యుక్తముకాదుకదా! కనుక ఛాందోగ్యసద్విద్యాప్రకరణముయొక్క ఆరంభమున — 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయ' ఇత్యాదిగ పర బ్రహ్మము సత్యకామత్వము, సత్యసంకల్పత్వము జగత్కారణత్వాది ధర్మములతో కూడినదిగా చెప్పబడినది. అదే పరబ్రహ్మమును 'తత్త్వమసి' అను ఉపసంహారవాక్యమునగల 'త్వమ్' పదముచే అవిద్యాశ్రయత్వ - కించిజ్జ్ఞత్వాదులు కలదిగా చెప్పినచో ఉపక్రమోపసంహార వాక్యముల తాత్పర్యములు భిన్నములుకావలసివచ్చును. కనుక–తత్త్వం పదములయర్థమును అద్వైతులు చెప్పినట్లు చెప్పరాదని భగవద్రామానుజ గ్రంథతాత్పర్యము.

ఈ విధముగ నింతవరకు తత్త్వమసియను వేదాన్తవాక్యమునకు భగవత్పాదమతానుసారము లక్షణ నాశ్రయించి కొంత యర్థమును విడచి పరిశిష్టార్థమందు తాత్పర్యమును నిర్ణయించినందున శాస్త్రకార మర్యాద ననుసరించి నాలుగు దోషములు ప్రసక్తములగుచున్నవి.

1. ప్రకృతపరామర్శియైన తచ్ఛబ్దముచే తెలియబడిన గుణములకు బాధ.

2. పదద్వయలక్షణ (రెండు పదములకు లక్షణ నంగీకరింపవలసి వచ్చుట)

3. సామానాధికరణ్యము కుదరకపోవుట.

4. ఉపక్రమవాక్యవిరోధము.

కనుక ఇది యుక్తముకాదని పర్యవసితార్థము.

## ॥ నిర్విశేషవస్తుబోధనమున శబ్దముప్రమాణముకాదని నిరూపించుట ॥

మూ॥ అపిచ అర్థభేద–తత్సంసర్గవిశేషబోధనకృతపదవాక్యస్వరూ

పతా-లబ్ధప్రమాణభావస్య శబ్దస్య, నిర్విశేషవస్తుబోధనా2-సామర్థ్యాత్. ననిర్విశేషవస్తుని శబ్దఃప్రమాణమ్. నిర్విశేష ఇత్యాది శబ్దాస్తు కేనచిద్విశేషేణ విశిష్టతయా అవగతస్య వస్తునః, వస్త్వంతరావగతవిశేషనిషేధపరతయా బోధకాః, ఇతరథా తేషామపి అనవబోధకత్వమేవ; ప్రకృతిప్రత్యయ రూపేణ పదస్యైవ అనేకవిశేషగర్భితత్వాత్ అనేకపదార్థ సంసర్గబోధకత్వాచ్చ వాక్యస్య।

అనువాదము:- అర్థభేదమునను, విభిన్నార్థములగు శబ్దములకు గల పరస్పరసంబంధ విశేషములను బోధించుట వలనను, ఏర్పడిన పదములు—వాక్యములు మున్నగు స్వరూపములనుపొంది, తన్మూలముగనే ప్రమాణమగుచున్న శబ్దము, నిర్విశేషవస్తువును (ఎట్టి విశేషములులేని వస్తువును) బోధించుటలో సమర్థముకాదు. (కనుకనే) ఎట్టివిశేషములులేని (నిర్విశేషమైన) వస్తువు విషయమున శబ్దము ప్రమాణముకాదు. నిర్విశేషాది శబ్దములుకూడ ఏదియో ఒక విశేషముకలదిగా తెలియబడిన వస్తువునకు, ఇతర వస్తువులందుగల విశేషములులేవని నిషేధించుటద్వారముననే అర్థబోధకములగుచున్నవి. అట్లుకానిచో ఆ నిర్విశేషాది శబ్దములు కూడ అర్థబోధకములు కాకపోవలసి వచ్చును. ప్రకృతి, ప్రత్యయము ఇత్యాది రూపముగ పదమే అనేక విశేషములతోకూడి యున్నదికదా! ఇట్టి (అనేక విశేషములతోకూడిన) పదములచే బోధింపబడిన పదార్థముల యొక్క పరస్పర సంబంధమును బోధించునదే-వాక్యము.

వివరణము:- ఇప్పుడు, పరాభిమతమగు-'నిర్విశేషవస్తువు', శబ్ద ప్రతిపాద్యము కాజాలదని నిరూపింపబడుచున్నది. ఎట్లన, శబ్దమునకు సహజముగ సవిశేషవస్తుబోధనమందే తప్ప నిర్విశేషవస్తు బోధనమందు సామర్థ్యములేదు. ఏలయన—పదములకు పదత్వము, వాక్యములకు వాక్యత్వము ఎట్లు సిద్ధించినదని పర్యాలోచనమొనర్చినప్పుడు, భిన్న భిన్నార్థముల బోధించుటచేతనే పదములకు పదత్వము; పదములచే

బోధింపబడిన యర్థములకుగల పరస్పర సంబంధమును (సంసర్గమును) బోధించుటచే, పదసముదాయరూపమగు వాక్యమునకు వాక్యత్వము సిద్ధించినవని యెరుగవలయును. ఈ విషయమును మరికొంత వివేచించినచో —అక్షర సముదాయరూపమగు శబ్దము, తనకంటె వేరైన శబ్దముచే బోధింపబడిన యర్థముకంటె, భిన్నమైన విశేషములుకల యర్థమును బోధించినప్పుడే అది పదమని వ్యవహరింపబడును. ఒక్కొకప్పుడు వేరొకశబ్దముచే బోధింపబడిన యర్థమునే తానును బోధింపవలసివచ్చినను —ఏదియో ఒక విశేషమును ప్రవృత్తి నిమిత్తముగ (వ్యవహారకారణముగ) చేసికొనియే ఆ యర్థమును బోధించి పదత్వమును పొందుచున్నది. ఘటః (కుండ) పటః (వస్త్రము) అను రెండుశబ్దములయర్థములను పరిశీలించినచో, ఘటశబ్దము తనకంటె వేరైన-పటశబ్దముచే బోధింపబడిన యర్థముకంటె భిన్నమైన కంబుగ్రీవాదులతో (శంఖమువంటి మెడమున్నగు అవయవములతో) కూడి జలాదులు దెచ్చుటకుపయోగించు వస్తువును బోధించుటచేతనే తాను పదమగుచున్నది. ఇచ్చట ఘటశబ్దము ఘటత్వమను ధర్మమును (జాతిని) ప్రవృత్తి నిమిత్తముగ జేసికొని 'కుండ'యను వస్తువును బోధించి పదమగుచున్నది. ఇట్లే పటశబ్దము పటత్వమును ప్రవృత్తి నిమిత్తముగా జేసికొని వస్త్రమును బోధించుచున్నది. ఏదేనియొక శబ్దము ఒక అర్థమును బోధింపవలయుననన్నచో, ఏదేని నిమిత్తముండవలయును. దానినే (వ్యవహార కారణమునే) శాస్త్రకారులు ప్రవృత్తి నిమిత్తముయందురని పూర్వమే పేర్కొనియుంటిని. ఒక్కొకప్పుడు రెండుశబ్దములు ఏకవిభక్త్యన్తశబ్దములచే నిర్దేశింపబడి ఒకేయర్థమును బోధింపవలసినప్పుడు ఆ రెండు శబ్దములును భిన్నభిన్న ప్రవృత్తి నిమిత్తములనుబట్టి ఆ యర్థమును (ఒకే యర్థమును) బోధించినను పర్యాయపదములుకావు.

దీనినిబట్టి తేలినదేమనగా పదములు భిన్నభిన్న ప్రవృత్తి నిమిత్తములనుబట్టి ఆయాయి యర్థములు బోధించుటద్వారా వాక్యముగ నేర్పడి,

సముదాయరూపమగు వాక్యార్థమును బోధించుచున్నవి. శాస్త్రకారులు ఇట్లు పదములొకదానితో నొకటి కలసి సముదాయరూపమగు వాక్యార్థమును బోధించుటనే 'సంహత్యకారిత్వ'మని వ్యవహరింతురు. ఈ పదముల సముదాయమే వాక్యమనియు, ఒకదానితో నొకటికలసి పదములు బోధించిన సముదాయార్థమునే వాక్యార్థమనియు శాస్త్రకారులు వ్యవహరించిరి. వాక్యార్థము విషయమునగల వివిధవాదములు ఇక్కడ ప్రస్తుతముకాదు.

ఈవిధముగ పదార్థబోధచే పదములు, పదార్థసమన్వయ రూపమగు 'సంసర్గ'మును బోధించుటచే వాక్యము, ప్రమాణములగుచున్నవి. ఇట్లు సవిశేషమగు (అనేక విశేషములతోకూడిన) అర్థమును బోధించుటచేతనే పద-వాక్యరూపమగు శబ్దము ప్రామాణ్యమును పొందుచున్నది. కనుక శబ్దమునకు సవిశేషార్థబోధనమందేతప్ప నిర్విశేషమగు వస్తువును బోధించుటకెట్టి సామర్థ్యములేదని స్పష్టమగుచున్నది. ఈ యభిప్రాయమునే భగవద్రామానుజులు 'అర్థభేద-తత్సంసర్గ విశేషబోధనకృత పదవాక్యస్వరూపతాలబ్ధప్రమాణభావస్య శబ్దస్య నిర్విశేషవస్తుబోధనాఽసామర్థ్యాత్ న నిర్విశేషవస్తుని-శబ్దః ప్రమాణమ్' అను వాక్యముచే పేర్కొనినారు.

మరి, 'నిర్విశేష' శబ్దమున్నదికదా! అది సర్వవిశేష నిషేధమునే బోధించుచున్నది కదా! అన్నచో నట్లుకాదు. నిర్విశేషాది శబ్దములుకూడ ఏదేనియొక విశేషముతోకూడినదిగా తెలియబడిన వస్తువునందు-ఇతర వస్తువులందుగల విశేషములులేవని బోధించునేకాని, ఎంతమాత్రము ఎట్టి విశేషములులేవని బోధింపజాలవు. ఏలన—'నిర్విశేష' శబ్దము కూడ పూర్వము పేర్కొనినట్లు పదమై యర్థమును బోధించి ప్రమాణము కావలయునన్నచో దానికంటె విభక్తి ప్రత్యయములు చేరుట, ఇతర పదములతో నన్వయించి అర్థమును బోధించుట కలదు. అట్టియెడ ప్రకృతి-ప్రత్యయముల సంబంధముచేతను, పదార్థాన్తర సమన్వయము చేతను బోధింపదగు విశేషములను 'నిర్విశేష' శబ్దముకూడ నిషేధింప

జాలదు కదా! ఈ అభిప్రాయమునే భగవద్రామానుజులు—'నిర్విశేష ఇత్యాది శబ్దాస్తు' అనియారంభించి 'ఇతరథాశేషామపి అనవబోధకత్వమేవ' అనునంతవరకు చెప్పినారు. విశేష బోధనములేనిదే నిర్విశేషాది శబ్దములుకూడ అర్థావబోధకత్వమును కోల్పోవునని తాత్పర్యము. ప్రకృతి ప్రత్యయవిభాగములతోడను, పద-వాక్యభేదముతోను కూడిన శబ్దము సవిశేషవస్తుమాత్రబోధకమని సంపిండితార్థము.

ఈవిధముగ అర్థబోధన స్వభావమునుబట్టి లౌకికశబ్దములు సవిశేషార్థబోధన మాత్రసమర్థములని తెలియుచుండగా ఉపనిషత్తులందలి నిర్విశేషశ్రుతులు (నిర్గుణ వాక్యములు) విశేషాంతరములవ్యావర్తింప జేయునవేగాని, స్వగతవిశేషనుల నిషేధించునవి కావని భగవద్రామానుజ గ్రంథతాత్పర్యము.

మూ॥ అథస్యాత్; "నాస్మాభిః నిర్విశేషే స్వయం ప్రకాశేవస్తుని శబ్దఃప్రమాణమిత్యుచ్యతే, స్వతఃసిద్ధస్యప్రమాణానపేక్ష-త్వాత్। సర్వైశ్శబ్దైః తదుపరాగవిశేషాః జ్ఞాతృత్వాదయః సర్వే నివర్త్యన్తే। సర్వేషు విశేషేషు నివృత్తేషు, వస్తు-మాత్రమ్, అనవచ్ఛిన్నమ్, స్వయంప్రకాశం, స్వతఏవా-వతిష్ఠతే"-ఇతి; నైతదేవమ్।

కేనశబ్దేన తద్వస్తునిర్దిశ్య తద్గతావిశేషా నిరస్యన్తే? 'జ్ఞప్తిమాత్రశబ్దేన' ఇతిచేన్న, సోఽపి, సవిశేషమేవ వస్త్వ-వలంబతే। ప్రకృతిప్రత్యయరూపేణ విశేషగర్భత్వాదేవ। 'జ్ఞా—అవబోధనే' ఇతి—సకర్మకః, సకర్తృకః, క్రియా-విశేషః, క్రియాన్తరవ్యావర్తక స్వభావవిశేషశ్చ, ప్రకృత్యా అవగమ్యతే। ప్రత్యయేన చ లింగసంఖ్యాదయః। స్వతః-సిద్ధావపి, ఏతత్ స్వభావవిశేషవిరహే సిద్ధిరేవనస్యాత్। అన్య సాధనస్వభావతయాహి జ్ఞప్తేః స్వతఃసిద్ధిరుచ్యతే। "బ్రహ్మ

స్వరూపం కృత్స్నం, సర్వదా స్వయమేవప్రకాశతే"చేత్-నతస్మిన్ అన్య ధర్మాధ్యాసః సంభవతి. నహిరజ్జుస్వరూపే అవభాసమానే సర్పత్వాదిరధ్యస్యతే। అతఏవహి భవద్భిః 'ఆచ్ఛాదికా అవిద్యా' అభ్యుపగమ్యతే। తతశ్చ శాస్త్రీయ నివర్తకజ్ఞానస్య, బ్రహ్మణి, తిరోహితాంశః విషయః। అన్య-థాతస్య నివర్తకత్వంచ నస్యాత్। అధిష్ఠానాతిరేకి రజ్జుత్వ-ప్రకాశనేనహి సర్పత్వం బాధ్యతే। 'ఏకశ్చేద్విశేషః జ్ఞాన-మాత్రే వస్తుని, శబ్దేన అభిధీయతే, నచ బ్రహ్మవిశేషణం భవతి--ఇతి సర్వశ్రుతిప్రతిపాదిత సర్వవిశేషణవిశిష్టం బ్రహ్మ భవతి। అతఃప్రామాణికానాం న కేనాపిప్రమాణేన నిర్విశేషవస్తుసిద్ధిః।'

అనువాదము!- ఒకవేళ నిట్లన్నచో—(ఎట్లన) "ఓయీ! మాచే నెట్టి విశేషములు లేక స్వయముగనే ప్రకాశించునట్టి వస్తువును బోధించుటలో శబ్దము ప్రమాణమని చెప్పబడుటలేదు. స్వయముగ సిద్ధించిన వస్తువునకు వేరుగ ప్రమాణమక్కరలేదుకదా! సర్వశబ్దములచేతను బ్రహ్మమున కల్పింపబడిన జ్ఞాతృత్వము (తెలిసికొనువాడై యుండుట) మున్నగు విశేషములన్నియు నివర్తింప జేయబడుచున్నవి. (నిషేధింపబడుచున్నవి). ఈ విధముగ విశేషములన్నియు తొలగిపోగా, ఎట్టి విశేషములతోను కూడియుండని కేవల వస్తువు స్వయముగనే ప్రకాశించునదై మిగులునుకదా!" అని.

ఇది సరికాదు. ఏ శబ్దముచే నెట్టి వస్తువు నిర్దేశించి దానియందుగల విశేషములు నిషేధింపబడుచున్నవో చెప్పవలసియున్నది. 'జ్ఞప్తిః' (జ్ఞానమ్) అను శబ్దముచేనన్నచో-అది కుదరదు. ఏలన-జ్ఞప్తి శబ్దము కూడ ప్రకృతి, ప్రత్యయము మున్నగు రూపముగ విశేషములచే గర్భితమై యున్నదికదా! (ఎట్లన) జ్ఞా = అవబోధనే అను ధాతువు (తెలిసికొనుట యను) ఒకానొక క్రియావిశేషమును బోధించుచున్నది. ఆ క్రియకు ఒక

'కర్మము' (తెలియబడు నంశము); ఒక 'కర్త' (తెలిసికొనువాడు) కూడ కలవు. ఇచ్చట-వేరొక క్రియను వ్యావర్తింపజేయు (తొలగింపజేయు) స్వభావవిశేషము ప్రకృతిచే తెలియుచున్నది. ప్రత్యయముచే లింగము సంఖ్య మున్నగునవి తెలియుచున్నవి. 'జ్ఞప్తి' యనునది స్వయముగ సిద్ధించినదయ్యెను, ఈ స్వభావవిశేషములులేనిచో సిద్ధియే (ప్రామాణ్యమే) లేదుకదా! ఏలన—ఇతర వస్తువును సాధించు స్వభావము కలదగుటచేతనేకదా 'జ్ఞప్తి' (జ్ఞానము) స్వతఃసిద్ధమని చెప్పబడుచున్నది?

మరి, 'బ్రహ్మస్వరూపము అంతయు, ఎల్లప్పుడు స్వయముగనే ప్రకాశించుచున్నదికదా!' అన్నచో అట్టియెడ పరబ్రహ్మమునందు ఇతర ధర్మముల నారోపించుట కుదరదుకదా! త్రాటిరూపము అగుపించుచుండగా పాము మున్నగువాటిని ఆరోపించుట కుదరదు. కనుకనే మీచే—'బ్రహ్మ స్వరూపమును కప్పునట్టి అవిద్య అనునది అంగీకరింపబడినదికదా! కనుక శాస్త్రమువలన నేర్పడెడి నివర్తకజ్ఞానమునకు, బ్రహ్మమునందు అవిద్యచే కప్పబడిన ఏ యంశముకలదో అదియేకదా విషయము? లేనిచో ఆ నివర్తక జ్ఞానము (తొలగించునట్టి జ్ఞానము) నివర్తింపజేయునది (తొలగింపజేయునది) కాకపోవలసివచ్చును. అధిష్ఠానము (ఆధారమైన వస్తువు) కంటె వేరుగ రజ్జుత్వము ప్రకాశించినప్పుడే (దానియందారోపింపబడిన) సర్పత్వము బాధింపబడును. జ్ఞానమాత్రస్వరూపముగల వస్తువునందు ఒక్క విశేషము శబ్దముచే చెప్పబడినట్లైన, అది బ్రహ్మమునకు విశేషణమగును. ఈ విధముగ సమస్త శ్రుతివచనములచేతను ప్రతిపాదింపబడిన సమస్త-విశేషణములతో కూడినదే పరబ్రహ్మమగుచున్నది. కనుక ప్రమాణబద్ధులైనవారికి ఏ ప్రమాణముచేతను నిర్విశేషవస్తువు (ఎట్టి విశేషణములులేని వస్తువు) సిద్ధింపదు.

వివరణము:- ఈ గ్రంథముచే భగవద్రామానుజులు నిర్విశేష వస్తువు ఏ ప్రమాణముచేతను సిద్ధింపదని పూర్వపక్షనిరాకరణపురస్సర-ముగ నిరూపించుచున్నారు.

ఇది దీని తాత్పర్యము.

నిర్విశేషమగు బ్రహ్మమును గురించి చెప్పెడివారిట్లందురు. "నిర్విశేషమగు (ఎట్టి విశేషములులేని) పరబ్రహ్మము తనంత తానుగనే ప్రకాశించునదగుటవలన, దానిని ప్రకాశింపజేయు ప్రమాణము వేరుగ నక్కరలేదు. కనుక శబ్దముకూడ నిర్విశేషవస్తువును తెలిసికొనుటకు ప్రమాణము కాజాలదు. స్వతఃసిద్ధమైన వస్తువు తనంత తానుగనే తెలియునుగాని, దానిని తెలియజేయు ప్రమాణముతో నవసరమేమున్నది. బ్రహ్మమును బోధించుటకు శ్రుతులందు ప్రయోగింపబడిన శబ్దములన్నియు నిర్విశేషమైన బ్రహ్మమునకంటియున్న విశేషములనన్నిటిని తొలగింపజేయుచున్నవి. కనుక తెలిసికొనుట (జ్ఞాతృత్వము) తెలియబడుట (జ్ఞేయ-త్వము) మున్నగు విశేషములన్నియు తొలగిపోగా, ఎట్టి విశేషణములు లేని బ్రహ్మవస్తువు తనంత తానుగ ప్రకాశించుచు మిగిలియుండునుకదా! అట్టియెడ దానిని తెలియజేయుటకు ప్రమాణముల యవసరమేమున్నది! ఇతర ప్రమాణములు (ప్రత్యక్షము మున్నగునవి) అవసరము కానట్లే శబ్దముకూడ ప్రమాణము కానక్కరలేదు. కనుక నిర్విశేషవస్తువును బోధింప శబ్దము సమర్థమా? కాదా? అను విచారము అనావశ్యకము" అని.

ఈవాదము సరియైనదికాదు. ఏలన—'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' 'విజ్ఞానమానన్దం బ్రహ్మ', 'అనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞాన ఘన ఏవ' ఇత్యాది శ్రుతివచనములనుబట్టియేకదా బ్రహ్మము జ్ఞానస్వరూపమనియు, ఎట్టి విశేషములు లేనిదనియు నిర్ణయించుట? అనగా శ్రుతివచనము ప్రమాణముగ నంగీకరింపబడినట్లే అయినది. అనగా వేదాత్మకమగు శబ్దము ప్రమాణముగ నంగీకరింపబడినదనుట స్పష్టము. భగవత్పాదులు కంఠోక్తిగ శబ్దప్రామాణ్యమునిట్లు ప్రతిపాదించియున్నారు.

'ప్రత్యక్షం శ్రుతిః, ప్రామాణ్యం ప్రత్యపేక్షత్వాత్ (బ్ర. సూ. 1-3-2) అను సూత్రభాష్యమున—'తస్మాత్ శబ్దమూల ఏవ అతీంద్రి

యార్థయాథాత్మ్యావగమః। తస్మాదనతి శంకనీయమౌపనిషదం దర్శనమ్' కనుక శబ్దమే ఇంద్రియములచే తెలియరాని తత్త్వముయొక్క యథార్థత నెరుగుటకు మూలము. కనుక ఔపనిషదదర్శనము (ఉపనిషద్వాక్యముల నాలంబించిన మతము) శంకింపరానిదియగును'అని. ఈ వాక్యములు శబ్దప్రామాణ్యమునుట్టంకించుచున్నవి. శబ్దము ప్రమాణముగా నంగీకరింప బడినప్పుడు—శబ్దమునకుగలయర్థప్రతిపాదనస్వభావమును, దానికిగల సామర్థ్యమును, శాస్త్రకారులు చెప్పినరీతిని తప్పక యంగీకరింపవలసియే యున్నది. కనుకనే పూర్వము ప్రకృతిప్రత్యయాది వివిధాంశములు వాటియర్థములుకల శబ్దము—విశేషములతోకూడిన యర్థమునేతప్ప విశేష ములెంతమాత్రములేని వస్తువును బోధింపజాలదని చెప్పియున్నారు.

మరియు సర్వశబ్దములచేతను నిర్విశేషవస్తువునందలి జ్ఞాతృత్వము, జ్ఞేయత్వము మున్నగు ఉపరాగములు (ఆరోపింపబడిన ధర్మములు) తొలగింపబడగ, చివరకు ఎట్టి విశేషములు లేనిదియు స్వయంప్రకాశము నగు నిర్విశేషవస్తువు మిగులునని యనుటకూడ కుదరదు. ఏలన—ఇక్కడ నొకప్రశ్నము సమాధానింపవలసియున్నది. ఏమన—ఏ శబ్దముచే ఆ నిర్విశేషవస్తువును నిర్దేశించి, దానియందుగల విశేషములన్నియు నివ ర్తింపజేయబడుచున్నవో చెప్పవలసియున్నది. జ్ఞానము, లేక—జ్ఞప్తి యను శబ్దమే అట్టిదని యన్నచో ఈ శబ్దముకూడ—తమకు సహజముగ ప్రకృతి ప్రత్యయ వ్యుత్పత్తి (నిర్వచనము) వలన సిద్ధించెడియర్థము కంటె వేరుగనెట్టి యర్థమును బోధింపజాలదు. ఎట్లనగా—జ్ఞప్తిశబ్దము జ్ఞా=అవబోధనే అను ధాతువునుండి పుట్టినది. కనుక 'అవబోధనము' అను క్రియను బోధించుచున్నది. ఈవిధముగ అవబోధనక్రియను బోధిం చుటద్వారా ఇతరక్రియలను వేరుచేయునట్టి స్వభావము కలదియై యున్నది. క్రియయనగా కర్మము, కర్త, మున్నగు వాటితో సంబంధము కలిగియుండును. అనగా నాక్రియ దేనినుద్దేశించి చేయబడుచున్నదో, ఎవ్వనిచే చేయబడుచున్నదో వాటితో సంబంధము కలిగియుండునని

తాత్పర్యము. జ్ఞప్తియనుచోట కూడ ధాతువు (జ్ఞా) ప్రత్యయములు (క్తిన్) (సుప్) అనునవి క్రమముగ క్రియను, భావ-లింగ సంఖ్యాదులను బోధించుచున్నవి. కనుక జ్ఞప్తిశబ్దముకూడ ప్రకృతిప్రత్యయవిభాగముచే అనేక విశేషములనే బోధించుచున్నదితప్ప నిర్విశేషవస్తువునుకాదని స్పష్టమగుచున్నది.

మరి, జ్ఞా అనునది స్వతః సిద్ధము(అనగా స్వయంప్రకాశము) కనుక ఇది యితర విశేషములనపేక్షింపదనియన్నచో, స్వతఃసిద్ధమైనను పూర్వము చెప్పిన కర్తృకర్మాది విశేషముల నాలంబించి యుండనిచో క్రియగా దానికి సిద్ధియేలేదు. ఇతర వస్తువుయొక్క వ్యవహారమునకు కారణమైయుండుటచేతనే కదా 'జ్ఞప్తి'కి (జ్ఞానమనుక్రియకు) స్వయంప్రకాశత్వ మంగీకరింపబడినది। అనగా తనయొక్క సంబంధముచే వేరొక విషయమునకు వ్యవహార హేతువగుటచేతనే 'జ్ఞప్తి స్వయంప్రకాశమని యూహింపబడుచున్నదని యభిప్రాయము. ఈవిధముగ 'బ్రహ్మము'ను బోధించు జ్ఞప్తి లేదా 'జ్ఞానము' అను శబ్దములు సవిశేషములే యగుచున్నవితప్ప నిర్విశేషములు కావు.

ఒకవేళ, జ్ఞానము బ్రహ్మమునకు స్వరూపమని యంగీకరింపబడినది కనుక, అది సంపూర్ణముగ ఎల్లప్పుడు స్వయముగనే ప్రకాశించుచుండును. కనుక దానికి వస్త్వంతరాపేక్ష ఎంతమాత్రము లేదని యందురా? అట్లన్నచో ఇతర నిరపేక్షమై స్వయముగ ప్రకాశించు జ్ఞానస్వరూపమైన బ్రహ్మమునందు ఇతర ధర్మముల నారోపించుట ఎట్లుకుదురును? కాని శాంకరమతమున బ్రహ్మమందు జగదాదికము అధ్యస్తమగుచున్నది. అధ్యాసమనగా ఒక వస్తువునందు వేరొక వస్తువుయొక్క ధర్మముల నారోపించుట. దీనినే భగవత్పాదులు 'అన్యస్య అన్యధర్మావభాసః' అని పేర్కొనినారు. ఆత్మయందు (తనయందు) దేహధర్మముల నారోపించి, నేనుస్థూలముగనున్నాను, నేను కృశుడనైయున్నానని వ్యవహరించుట అధ్యాసము. అట్లే పరమాత్మయందు ప్రపంచాధ్యాసము.

ఇదియెంత మాత్రముకుదరదు. ఏలన-నిరస్త సమస్త-విశేషమైన పరబ్రహ్మము స్వయముగ ప్రకాశించుచుండగ దానియందు ఇతర ధర్మముల నారోపించుట ఎట్లు కుదురును? ఈ విషయమునే భగవద్రామానుజులు—'నతస్మిన్ అన్యధర్మాధ్యాసస్సంభవతి' 'బ్రహ్మమందన్య ధర్మాధ్యాసము కుదరదు' అని చెప్పినారు. దీనిని నిరూపించుటకై భగవద్రామానుజులు రజ్జుసర్పదృష్టాన్తమును స్మరింపజేసినారు. అద్వైతులు బ్రహ్మమందు భ్రాన్తిచే ప్రపంచము ఆరోపింపబడినదని నిరూపించుటకై రజ్జుసర్పదృష్టాన్తమును చూపుదురు. రజ్జువునందు (త్రాటియందు) భ్రాన్తిచే సర్పధర్మముల నారోపించి భయముచే ప్రవర్తించుట లోకవ్యవహారసిద్ధమే. అట్లే బ్రహ్మమందు అనాద్యవిద్యారూపమైన భ్రాన్తిచే జీవత్వము-ఈశ్వరత్వము మున్నగు ధర్మములారోపింపబడుచున్నవని యభిప్రాయము. రజ్జువుయొక్క స్వరూపము ప్రకాశించుచున్నప్పుడు సర్పధర్మముల నారోపించుట కుదరనట్లే, బ్రహ్మముయొక్క స్వరూపము సంపూర్ణముగ ప్రకాశించుచున్నప్పుడు ఇతరధర్మముల నారోపించుట కుదరదుకదా! కనుక స్వయంప్రకాశమైన బ్రహ్మమందుకూడ ప్రకాశింపని అంశము కొంతకలదని అంగీకరింపవలసియుండును. ఆ యంశమేదో తెలియదు. ఆ యజ్ఞాతమైన అంశమున్నదికనుకనే దానిని కప్పియుంచు (ఆచ్ఛాదించు) అవిద్యను అంగీకరించియున్నారు. ఈ విధముగ ఆచ్ఛాద్యమైన (కప్పియుంచదగిన)అంశము సంభవమైనప్పుడే ఆచ్ఛాదనము (కప్పుట) కుదురును. కనుక ఆచ్ఛాదకమగు అవిద్యచే ఆచ్ఛాదింపదగిన అంశమును అంగీకరించి, ఆయంశమునకు ఆచ్ఛాదనముచే తిరోభావము ఏర్పడినప్పుడు—ఆ తిరోభావమును (అవిద్యచే కప్పియుంచబడుటను) నివర్తింపజేయు (పోగొట్టు) శాస్త్రజన్యమగు విద్య (జ్ఞానము) ప్రవర్తించుచున్నదని చెప్పవలయును. ఈవిధముగ శాస్త్రజ్ఞానము, లేక విద్య, నివర్తకము కాగా—బ్రహ్మమందుకల తిరోహితాంశము నివర్త్యము [ఆచ్ఛాదనము లేకుండ తొలగింపజేయుదగినది] అగును. నివర్త్యము లేనిదే నివర్తకమగు శాస్త్రజ్ఞానమునకు [విద్యకు] వినియోగమేలేదు కదా!

మరియు, ఎదురుగానున్న వస్తువుయొక్క కేవలజ్ఞానమాత్రమే అనగా 'ఇది' అనుజ్ఞానము మాత్రమే భ్రాన్తిని తొలగింపజాలదు. మరి యేదన్నచో—రజ్జువునందు సర్పత్వమారోపింపబడినప్పుడు తిరోహితమై తెలియరానిదై యున్న యే అంశమున్నదో ఆ యంశముయొక్క స్వరూప యాథాత్మ్య జ్ఞానమే భ్రమమును పోగొట్టును. ఇట్లే బ్రహ్మము నందుకూడ అవిద్యచే అచ్ఛాదితమై తెలియరానియంశమొక్కటి పూర్వ మున్నదన్నప్పుడే, ఆ యంశము స్వరూపతః తెలిసినప్పుడే శాస్త్రజన్య నివర్తకజ్ఞానము సార్థకమగును. ఈ సందర్భమున భగవద్రామాను జులు—'అధిష్ఠానాతిరేకి రజ్జుత్వ ప్రకాశనేనహి సర్పత్వం బాధ్యతే' అని పేర్కొనినారు. దీని తాత్పర్యమిది.

మొట్టమొదట అధిష్ఠానము, అనగా దేనియందితర వస్తుధర్మముల నారోపించితిమో ఆ వస్తువు తెలియబడిన తరువాత, దానికంటె వేరుగ దానియందున్న పారమార్థికమైన ధర్మము, కప్పబడినప్పుడే భ్రాంతి యనబడును. అట్టి పారమార్థిక ధర్మము తెలియబడినప్పుడే భ్రమము తొలగినట్లని యర్థము. భగవద్రామానుజులీవిషయమునే శ్రీభాష్య మందలి జిజ్ఞాసాధికరణమున దృష్టాన్త ప్రదర్శనముద్వారా నిరూపించి యున్నారు. ఈ క్రిందిపంక్తులను చూడుడు—

"అతః అధిష్ఠానాతిరేకి, పారమార్థికధర్మ తిరోధానానభ్యుపగమే, భ్రాన్తిబాధౌ దురుపపాదౌ। అధిష్ఠానేహి పురుషమాత్రాకారే ప్రతీయమానే, తదతిరేకిణి పారమార్థికే రాజత్వే తిరోహితే సత్యేవ వ్యాధత్వభ్రమః। రాజ త్వోపదేశేన తన్నివృత్తిశ్చభవతి, న అధిష్ఠానోపదేశ మాత్రేణ" 'రాజైన ఒక వ్యక్తిని చూచి భ్రాంతిచే ఆతని కిరాతుడని భావించినప్పుడు—ఆ వ్యక్తి యొక్క సామాన్యస్వరూపము (మనుష్యత్వము) అధిష్ఠానముకాగా, ఆ వ్యక్తియందలి రాజత్వమను విశేషధర్మము పారమార్థికము (వాస్తవ

మైనది). ఈ పారమార్థికరాజత్వధర్మము, భ్రాన్తి మూలమగు వ్యాధత్వ ధర్మముచే తిరోహితమైనప్పుడు—రాజును వ్యాధునిగా గ్రహించుట కలుగును. పారమార్థికమైన రాజత్వధర్మమును ఉపదేశించినప్పుడు (ఈతడు కిరాతుడు కాడు, రాజు అని బోధించినప్పుడు) భ్రాన్తి కల్పితమగు కిరాతత్వము (బోయతనము) తొలగిపోవును. ఇచ్చట అధిష్ఠానమైన కేవల వ్యక్తిస్వరూపమునుపదేశించినంతమాత్రమున, భ్రాన్తికల్పితధర్మములు తొలగుట, పారమార్థిక ధర్మము భాసించుట యుండదుకదా! అట్లే వస్తురూపముగ 'త్రాడు' అధిష్ఠానముకాగా, దానియందుకల 'రజ్జుత్వము' పారమార్థికమైన ధర్మము. అది భ్రాన్తికల్పితమగు 'సర్పత్వ'ధర్మముచే కప్పుబడినప్పుడు, పారమార్థికమైన రజ్జుత్వధర్మమునుపదేశించినప్పుడే, సర్పత్వధర్మము బాధింపబడి రజ్జువుయొక్క పారమార్థికస్వరూపము గోచరించును.

అట్లే బ్రహ్మమందు అధిష్ఠానస్వరూపముకంటె వేరుగనున్న పారమార్థికములైన ధర్మములు. అవిద్యాకల్పిత ధర్మములచే తిరోహితములు కాగా (కప్పబడగా) బ్రహ్మస్వరూపము తిరోహితమైనది. ఇప్పుడు పారమార్థికములైన ధర్మములనుపదేశించినప్పుడే అవిద్యాకల్పిత ధర్మములు తొలగి బ్రహ్మస్వరూపము భాసించుట జరుగును. ఈ పైని పేర్కొనిన గ్రంథమునుబట్టి తేలినదేమనగా—అధిష్ఠానము—దానియందుగల పారమార్థిక ధర్మములు—అవిద్యచే కల్పింపబడిన ధర్మములు—అను నీ మూడంశములు వేరువేరుగానున్నవనియు, బ్రహ్మమందు విశేషము లున్నవనియు తెలిసికొనవలయును, అని. గోవను వస్తువుకంటె దానియందుగల గోత్వజాతి—నీలాదిగుణములు (నల్లదనము మున్నగునవి) వేరుగనేయున్నట్లే బ్రహ్మమునను, అని సంపిండితార్థము (సారాంశము). ఇట్లు బ్రహ్మమందుగల పారమార్థికధర్మములనే 'సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ' ఇత్యాది శ్రుతులు ప్రతిపాదించుచున్నవి. సత్యాదిశబ్దములు ధర్మబోధనముద్వారా ధర్మిని (ధర్మముకలదానిని) కూడ ప్రతిపాదించు

చున్నవి. ఈ అభిప్రాయమునే భగవద్రామానుజులు మూలమున 'అధి-ష్ఠానాతిరేకిరజ్జుత్వప్రకాశనేనహి సర్పత్వం బాధ్యతే' 'అధిష్ఠానముకంటె (ఆధారమైన వస్తువుకంటె) వేరైన రజ్జుత్వము మున్నగు పారమార్థిక ధర్మములు భాసించినప్పుడే సర్పత్వము మున్నగు అవిద్యాకల్పిత ధర్మములు బాధింపబడు'నని చెప్పిరి. ఒకవేళ, 'అవిద్యచే బ్రహ్మము తిరోహితమగుచున్నది' అను స్వమతమును కుదుర్చుకొనుటకు జ్ఞానమాత్ర స్వరూపమగు బ్రహ్మమందు ఒక విశేషముమాత్రము శబ్దముచే చెప్పబడునని అంగీకరింతుమందురా? అట్లయినచో–ఆ విశేషము–బ్రహ్మమునకు 'విశేషణ'మగును. ఒక విశేషముతో కూడినను, అనేకవిశేషములతో కూడినను—బ్రహ్మమునకు విశేషవిశిష్టత్వము (విశేషసహితమనుట) అంగీకరించినట్లే కనుక, సర్వశ్రుతివచనములచే బోధింపబడిన సత్యజ్ఞానాదిసర్వ విశేషములతో కూడినదే బ్రహ్మమని సిద్ధించుచున్నది కనుక—ప్రమాణముల నాశ్రయించినవారెవ్వరికి—'నిర్విశేషవస్తువు' ప్రమాణములచే తెలియబడదని స్పష్టమగుచున్నది.

## ॥ నిర్వికల్పక ప్రత్యక్షమునగూడ సవిశేషవస్తువే భాసించును ॥

మూ॥ నిర్వికల్పకప్రత్యక్షేఽపి సవిశేషమేవ వస్తుప్రతీయతే। అన్యథా, సవికల్పకే సోఽయమితిపూర్వావగత ప్రకారవిశిష్ట-ప్రతీత్యనుపపత్తేః। వస్తుసంస్థానరూపత్వాద్గోత్వాదేః, నిర్వి-కల్పకదశాయామపి స సంస్థానమేవ వస్తు "ఇత్థమ్" ఇతి ప్రతీయతే। ద్వితీయాదిప్రత్యయేషు తస్యైవ సంస్థాన విశేషస్య అనేకవస్తునిష్ఠతామాత్రం ప్రతీయతే। సంస్థాన రూపప్రకారాఖ్యస్య పదార్థస్య అనేకవస్తునిష్ఠతయా అనేక విశేషణత్వం ద్వితీయాదిప్రత్యయావగమ్యమితి, ద్వితీయాది ప్రత్యయాః సవికల్పకా ఇత్యుచ్యంతే।

అతఏవ, ఏకస్య పదార్థస్య భిన్నాభిన్నరూపేణ విరుద్ధం ద్వ్యాత్మకత్వం ప్రత్యుక్తమ్। సంస్థానస్య సంస్థానినః ప్రకారతయా పదార్థాన్తరత్వం, ప్రకారత్వాదేవ పృథక్సిద్ధ్యనర్హత్వం, పృథగనుపలంభశ్చ—ఇతి—నద్వ్యాత్మకత్వసిద్ధిః।

అనువాదము:— నిర్వికల్పకప్రత్యక్షమందు కూడ విశేషములతో కూడినవస్తువే భాసించుచున్నది. అట్లుకానిచో—సవికల్పకప్రత్యక్షమున—'వాడే-వీడు' అని పూర్వము తెలియబడినధర్మములతోకూడిన వస్తువు స్ఫురించుట కుదరకపోవలసివచ్చును. వస్తువులందలి సంస్థానవిశేషములే (అవయవసన్నివేశరూపములగు ఆకారవిశేషములే) గోత్వాదిధర్మములు కనుక, నిర్వికల్పకప్రత్యక్షదశలోకూడ సంస్థానవిశేషముతో (ఆకార విశేషముతో) కూడినవస్తువే 'ఇట్టిది' అని తెలియబడుచున్నది. రెండవదశలో కలిగెడి జ్ఞానములలో—ఆ సంస్థానవిశేషమే (పూర్వముచూపబడిన ఆకారమే) (అట్టివే అయిన) అనేకవస్తువులయందున్నట్లుమాత్రమే తెలియబడుచున్నది. సంస్థానవిశేషము (ఆకారవిశేషము) అని పిలువబడెడి విశేషణరూపమగు పదార్థము అనేకవస్తువులయందుండునదికనుక, రెండవదశలో కలిగెడి ప్రత్యక్షజ్ఞానములే 'సవికల్పము'లని చెప్పబడుచున్నవి. అందువలననే—ఒకే పదార్థమునకు 'భిన్నత్వము—అభిన్నత్వము' అను విధముగా విరుద్ధమైన స్వరూపద్వయము (రెండుస్వరూపములు) కలిగియుండుట యనునది తిరస్కరింపబడినది. సంస్థానము (ఆకారము) అనునది—సంస్థానముతోకూడిన వస్తువుయొక్క ప్రకారము (వేరుచేయరాని విశేషణము) కనుక, అది వేరొకపదార్థమని యెరుగవలయును. ఇది ప్రకారము అని యనుటచేతనే, వస్తువునాశ్రయించియుండి, దానినుండి వేరుచేయరానిదై (వేరుగనుండుటకు యోగ్యముకానిదై) యున్నది కనుక, (వస్తువుకంటె) వేరుగ తెలియబడదు. కావున, ఈ విధముగ, ఒకేవస్తువు రూపద్వయముతో (భిన్నత్వము-అభిన్నత్వము అను రెండు

రూపములతో) కూడియున్నట్లు చెప్పుట యుక్తముకాదు.

వివరణము:— ఇప్పుడు భగవద్రామానుజులు నిర్వికల్పమున నిర్విశేషవస్తువు అనగా నిర్విశేషచిన్మాత్రమగు బ్రహ్మము గ్రహింపబడునను శంకరభగవత్పాదమతమును నిరాకరించుచున్నారు.

ఇది వారియభిప్రాయము. ప్రత్యక్షము ద్వివిధము. సవికల్పము, నిర్వికల్పము అని. ఒకవస్తువునందుగల విశేషములన్నియు గ్రహింపబడుట సవికల్పము. వికల్పములనగా విశేషములు. ఎట్టి విశేషములు లేని అఖండాకారమగువస్తువును గ్రహించుట నిర్వికల్పకము. బ్రహ్మము నిర్విశేషచిన్మాత్రము (ఎట్టి విశేషములులేని జ్ఞానమాత్రస్వరూపము) కనుక, నిర్వికల్పముచేనది గ్రహింపబడును. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను మూడును (త్రిపుటి) లయమైనప్పుడుకలుగు జ్ఞానమే నిర్వికల్పము. సాధారణముగ నేదేనివస్తువును మనముచూచినప్పుడు కల్గిన జ్ఞానములో జ్ఞాత (తెలిసికొనువాడు); జ్ఞేయము (తెలియబడువస్తువు); జ్ఞానము (తెలియుట) అనుమూడును స్పష్టముగ భాసించును. నిర్వికల్పముననివి మూడును భాసింపవనియభిప్రాయము. ఈ యభిప్రాయమే శంకర భగవత్పాదుల 'వివేకచూడామణి'లో నిట్లు చెప్పబడినది.

జ్ఞాతృజ్ఞేయజ్ఞానశూన్యమనన్తం నిర్వికల్పమ్।
కేవలాఖండచిన్మాత్రం పరం తత్త్వం విదుర్బుధాః॥ (శ్లో. 239)

ఈ వాదము యుక్తముకాదని భగవద్రామానుజమతము. ఇక్కడ, ఈ క్రిందివిషయముకూడ విశేషముగ గ్రహింపదగియున్నది. సర్వ శూన్యవాదులైన బౌద్ధులు—'ఎట్టి విశేషములులేనిదే నిర్వికల్పమ'ని యందురు. ఇది యుక్తముకాదు. ప్రతివస్తువు ఏవైనకొన్ని వస్తువులకంటెనో, లేక, తనకంటె భిన్నములైన సర్వవస్తువులకంటెనో వ్యావృత్తమై (వేరు చేయబడినదై) గోచరించుచుండును గాని, సర్వవిశేషశూన్యమైనవస్తువు ఎంతమాత్రము గ్రహింపబడదు కదా! మరికొందరు, 'జాతి, గుణము,

ద్రవ్యము మున్నగునవి ఒకదానితోనొకటి సంబంధములేక వేరువేరుగ గ్రహింపబడుట నిర్వికల్పమనియందురు. ఒకదానితో ఒకటి కలసియున్నప్పుడు విశేషణవిశేష్యభావముతోకూడియే జాత్యాదులు గ్రహింపబడును తప్ప వేరువేరుగకాదు. ఇక, ఒకదానితోనొకటి సంబంధములేనిదశలో అట్లు వేరువేరుగ గ్రహింపబడినచో, అట్లు గ్రహింపబడుటకు సంబంధము లేకపోవుటయే కారణమగునుగాని, వేరుకాదు. కనుకనే 'దండీ-దేవదత్తః' 'దండముకలవాడు దేవదత్తుడు' అనుచోట; దండము-దేవదత్తుడు రెండును గ్రహింపబడినప్పటికిని, ఒకదానికొనొకటి కలసినసంబంధపడియే గ్రహింపబడుచున్నవితప్ప, విడివిడిగాకాదు. ఇచ్చట దండము—విశేషణముకాగా, దానితోకూడిన దేవదత్తుడు విశేష్యము (విశేషణముకలవాడు). కనుక నియతసంబంధముకల జాతి, గుణద్రవ్యము మున్నగువాటిలో ఒకదానితోనొకటి సంబంధింపక వేరువేరుగ గ్రహింపబడుటయుండదు. మరి, నియతసంబంధమున్నను గంధముతోకూడిన పృథివి వేరువేరు యింద్రియములచే విడివిడిగా అనగా, గంధము ఘ్రాణేంద్రియముచేతను, పృథివి (మట్టి) చక్షురింద్రియముచేతను గ్రహింపబడుచున్నవికదా! అనియన్నచో — ఇచ్చట నీరెండును భిన్నసాధనములచే గ్రహింపబడుచున్న వేతప్ప, విశేషణవిశేష్యభావమునుబట్టికాదు. ఇక జాత్యాది విశిష్టగవాదివస్తువులవిషయముననట్లుకాదు. కనుక నిర్వికల్పదశలోకూడ జాతిగుణాదులతోకూడినవస్తువే గ్రహింపబడుచున్నది. ఏలన-ఇవియన్నియు (జాతి-గుణ-ద్రవ్యము అన్నియు) ఒకే సాధనముచే గ్రహింపబడునవై నియతసంబంధము కలిగియున్నవికదా! కనుక-ప్రథమపిండగ్రహణము (మొదటిసారి గ్రహింపబడిన గోవు మున్నగు వస్తువు) విశేషములతో కూడియేయున్నది. ఇదియే నిర్వికల్పము. రెండవసారి గ్రహింపబడిన గవాదులకు సంబంధించిన ప్రత్యక్షమే సవికల్పము.

దీనినే 'నిర్వికల్పకప్రత్యక్షేఽపి సవిశేషమేవవస్తుప్రతీయతే' ఇత్యాదిగ నిరూపించుచున్నారు. ఎట్లన—నిర్వికల్పము ప్రథమదశలోకలుగు

ప్రత్యక్షము. సవికల్పము రెండవదశలోకలుగు ప్రత్యక్షము. మొదటి దశలో గ్రహింపబడినవస్తువే అనగా నిర్వికల్పమున గ్రహింపబడినవస్తువే సవికల్పమున 'అదియేయిది' అని గ్రహింపబడుచున్నది. నిర్వికల్పప్రత్యక్షముచే గ్రహింపబడినవస్తువు నిర్విశేషమైనచో, సవికల్పమున గూడ అదేవస్తువు ప్రత్యభిజ్ఞాతము (గుర్తింపబడునది) కావలయునుకనుక, సవికల్పముకూడ నిర్విశేషమేకావలసివచ్చును. కాని సవికల్పమున విశేషములు గ్రహింపబడుచున్నట్లే సర్వానుభవముకనుక, నిర్విశేషవాదమున నీవ్యవస్థ కుదరకపోవలసివచ్చును. మరియు ఎట్టి విశేషములులేని వస్తువును ప్రత్యక్షముచే గ్రహించుట కుదరదుకదా! మరి, ప్రథమపిండ గ్రహణమున — అనువృత్తి (ఈ జాతియే ఇతరత్రకూడకలదు అని) గ్రహింపబడుటలేదుకనుక, గోత్వాదులు ఎట్లు గ్రహింపబడును? అను శంకకు సమాధానముగనే భగవద్రామానుజులు — "వస్తుసంస్థానవిశేషరూపత్వాద్గోత్వాదేః, నిర్వికల్పకదశాయామపి స సంస్థానమేవ వస్తు 'ఇత్థమ్' ఇతి ప్రతీయతే; ద్వితీయాది ప్రత్యయేషు, తస్యైవ సంస్థాన విశేషస్య అనేకవస్తునిష్ఠతామాత్రం ప్రతీయతే" అని పేర్కొనినారు.

ఇది దీని భావము. 'అనువృత్తి' (ఇదియే ఇతరత్రకలదు అనుట) జాతికాదు. ఇట్టి అనువృత్తితోకూడినదే జాతి. అనగా వస్తువుయొక్క సంస్థానమే జాతి. సంస్థానమనగా అవయవసన్నివేశరూపమగు ఆకృతి. ఇట్టి సంస్థానముతోకూడినది 'సంస్థాని'. సంస్థానము-సంస్థానికి-అపృథక్సిద్ధవిశేషణము. కనుక ప్రకారము. ఇది నిర్వికల్పమున గ్రహింపబడుచున్నది. మొట్టమొదటిసారి గోవునుచూచినప్పుడు-'ఇదమిత్థమ్' 'ఇది ఇట్టిది' అనియే గ్రహింపబడుచున్నది. ఇచ్చట 'ఇదమ్' (ఇది) అనునది 'సంస్థాని'. అనగా సంస్థానముతో (అవయవసన్నివేశరూపమగు ఆకృతితో) కూడినవస్తువు. 'ఇత్థమ్' (ఇట్టిది) అను అంశముచే గ్రహింపబడునదే సంస్థానరూపమగు జాతి. అనగా గోత్వము మున్నగు ధర్మము. ప్రకరణపంజికాకారుడగు శాలికనాథుడు 'అనువృత్తాజాతిః, నానువృత్తిః';

'అనువృత్తితోకూడినదే జాతిత్వప్పు, అనువృత్తికాదు' అని పేర్కొనినాడు. మరియు 'అనువృత్తి' గ్రహింపబడుటెట్లు అను శంకకు సమాధానముగ – 'ద్వితీయాదిప్రత్యయేషు' ఇత్యాది చెప్పబడినది. సవికల్పమందు— గోత్వాదికము ఇతరత్ర సమానముగకలదని (అనువృత్తి) గ్రహింపబడు చున్నది.

మరి, సవికల్పక-నిర్వికల్పకములకు భేదమేమి? అను శంకకు సమాధానముగ — 'సంస్థానరూపప్రకారాఖ్యపదార్థస్య అనేకవస్తునిష్ఠ-తయా, అనేకవిశేషణత్వం ద్వితీయాదిప్రత్యయావగమ్యమితి, ద్వితీ-యాదిప్రత్యయాః సవికల్పకాః ఇత్యుచ్యంతే' అని చెప్పబడినది. పూర్వముచెప్పినట్లు సంస్థానమే (అవయవసన్నివేశమగు ఆకృతియే) మొదట నిర్వికల్పమున వస్తువుతోపాటు గ్రహింపబడి, ఈ సంస్థానరూప మగు ప్రకారము (విశేషణము) అనగా గోత్వాదిజాతి, అనేక గోవుల యందు సమానముగనున్నదనియు, అనేకవస్తువులకు గోత్వాదికము విశే షణమై యున్నదనియు-సవికల్పమున గ్రహింపబడుచున్నది. ఇట్లు గ్రహింపబడుటయే అనువృత్తిగ్రహణము. ఇది గ్రహింపబడుటచేతనే గోవు అశ్వాదులకంటె భిన్నమని తెలియుచున్నదికనుక, భేదరూపమగు 'విశేషము' యొక్క 'కల్పము' (వికల్పము) ఉన్నదికనుక 'సవికల్ప' మని వ్యవహరింపబడునని భావము.

భగవద్రామానుజులీవిషయమును, జిజ్ఞాసాసూత్రశ్రీభాష్యమున— "నిర్వికల్పకమపి సవిశేషవిషయమేవ నిర్వికల్పకే స్వస్మిన్ననుభూత పదార్థవిశిష్టప్రతిసంధానహేతుత్వాత్। నిర్వికల్పకంనామ, కేనచిద్విశేషేణ వియుక్తస్యగ్రహణమ్। న సర్వవిశేషరహితస్య। తథాభూతస్య కదాచి-దపి గ్రహణాదర్శనాత్। అనుపపత్తేశ్చ। కేనచిద్విశేషేణ 'ఇదమిత్థమి'తి హి సర్వా ప్రతీతిరుపజాయతే। త్రికోణసాస్నాదిసంస్థానవిశేషేణవినా కస్య చిదపిపదార్థస్య గ్రహణాయోగాత్। అతో నిర్వికల్పకమ్ — ఏకజాతీయ ద్రవ్యేషు ప్రథమపిండగ్రహణమ్। ద్వితీయాదిపిండగ్రహణం సవికల్పక-

మిత్యుచ్యతే। తత్ర ప్రథమపిండగ్రహణే గోత్వాదేరనువృత్తాకారతా న ప్రతీయతే। ద్వితీయాదిపిండగ్రహణేషు అనువృత్తి ప్రతీతిః" అని చెప్పి యున్నారు. వేదార్థసంగ్రహవచనములకీ వాక్యములు వివరణరూప ములు. వీటియభిప్రాయమిది.

"నిర్వికల్పకప్రత్యక్షమునగూడ విశేషములతోకూడినవస్తు వే గోచ రించుచున్నది. నిర్వికల్పమున-పూర్వము అనుభూతమైన జాత్యాది విశిష్టమగువస్తువే తరువాత, సవికల్పకప్రత్యక్షమున 'అదియే-ఇది' అని ప్రతిసంధానింపబడుచున్నదికదా! (గుర్తింపబడుచున్నదికదా!) నిర్వి కల్పకమనగా—ఏదియో ఒక విశేషముతో వియుక్తమైన వస్తువును గ్రహించుటతప్ప, ఎట్టి విశేషములులేని వస్తువును గ్రహించుటకాదు. అట్టి దానిని (ఎట్టి విశేషములులేని వస్తువును) గ్రహించుట (ఎచ్చటను) ఎప్పు డును కానరాదుకదా! అది కుదరదుకూడ. ఒకానొకవిశేషముతో 'ఇది యిట్టిది.' అనియే ప్రతిజ్ఞానము కలుగుచున్నది. త్రికోణము-గంగడోలు మున్నగు అవయవసన్ని వేశరూపమగు సంస్థానవిశేషములేనిదే ఏవస్తువు గ్రహింపబడదుకదా। కనుక—నిర్వికల్పకమనగా ఒకేజాతిగల వస్తువుల విషయమున మొట్టమొదటిగా ఆయాయి ఆకృతిగలవస్తువును గ్రహించుట. ఇదియే ప్రథమపిండగ్రహణము. ఇక రెండవవస్తుగ్రహణము (ద్వితీయ పిండగ్రహణము) సవికల్పకమని చెప్పబడుచున్నది. అక్కడ నిర్వి కల్పకదశలో మొట్టమొదటిగ వస్తువు గ్రహింపబడునవుడు—'ఈ గోత్వాది ధర్మమే ఇతరత్ర గోవులలోకూడ సమానముగకలదు' అనునట్టి 'అనువృ-త్తాకారత్వము' తెలియదు. రెండవదశలో (ద్వితీయపిండగ్రహణమున) 'అనువృత్తి' (ఈ ధర్మమే ఇతరత్రకూడకలదు) అనునది గ్రహింపబడును" అని. దీనినిబట్టి నిర్వికల్పకదశయందుకూడ సవిశేషవస్తు వే అనగా సామాన్యవిశేషములతోకూడినవస్తువే గ్రహింపబడునుతప్ప అద్వైతవేదా న్తులు, శూన్యవాదులగు బౌద్ధులు చెప్పినట్లు 'నిర్విశేషవస్తువు' కాదని స్పష్టమగుచున్నది.

భగవద్రామానుజులచే చెప్పబడిన యీ విషయమునే పూర్వ మీమాంసకులైన కుమారిలభట్టు ప్రభృతులు ఈషద్వైషమ్యముతో చెప్పియున్నారు. వారును — నిర్వికల్పకమున సామాన్యవిశేషములున్నవనియే నిరూపించియున్నారు. వారు తమ అభిప్రాయమును—ఈ క్రింది విధముగా స్పష్టపరచియున్నారు. శ్లోకవార్తికమున శ్రీ కుమారిలభట్టు—

'న హ్యాఖ్యాతు మశక్యత్వాద్ భేదోనాస్తీతి గమ్యతే,
నిర్వికల్పక బోధేఽపి ద్వ్యాత్మకస్యాపివస్తునః॥

గ్రహణమ్....(117)' అని పేర్కొనియున్నాడు. నిర్వికల్పకదశ యందు 'ఇట్టిది' అని ఇతరవస్తువులకంటె భిన్నరూపము చెప్పుటకు శక్యము కాదుకదా! మరి, ఆ విశేషరూపమెట్లు గ్రహింపబడును? అను ప్రశ్నమునకు సమాధానముగా 'నహ్యాఖ్యాతుమ్' ఇత్యాది చెప్పబడినది. నిర్వచించి, ఇట్టిదని ఇతరవస్తువులకంటె భిన్నమైన స్వరూపవిశేషము నిర్వికల్పముగ తెలియబడదనుట సత్యమే. కాని, ఇంతమాత్రముచేత (ఇట్టిదని చెప్పుట కలవికానంత మాత్రమున) అసలు భిన్నరూపము లేనే లేదని, స్ఫురింపదుకదా! ఎట్లనగా—ఈ విషయమునే, ఇట్లు చెప్పుచున్నాడు.

'అస్తిహ్యాలోచనాజ్ఞానం ప్రథమం నిర్వికల్పకమ్।
బాలమూకాదివిజ్ఞాన సదృశం శుద్ధవస్తుజమ్॥
న విశేషో, న సామాన్యం, తదానీమనుభూయతే।
తయోరాధార భూతాతు వ్యక్తిరేవావసీయతే॥'

ఈ శ్లోకముల యభిప్రాయమిది—

బాలురకువలెనే అవ్యుత్పన్నులైనవారికి, దృష్టిని వస్తువుపై ప్రసరింపజేసినవెంటనే, సవికల్పముకంటె ముందు, నిర్వికల్పమగు ఆలోచనా విజ్ఞానము ప్రతీతి సిద్ధమై (తెలియబడుచు) ఉన్నది. ఇది శుద్ధ వస్తువుయొక్క గ్రహణము మాత్రమే కలిగియున్నది. ఈ నిర్వికల్పక

జ్ఞానమున విశేషము-లేక-వ్యవచ్ఛేదము-లేక-వ్యావృత్తి, 'అనగా దీని కంటె నిది భిన్నమైయున్నది' అనిగాని; సామాన్యము లేక అనువృత్తి అనగా 'ఈ ధర్మమే సమానముగ ఇతరత్రకూడ కలదు' అనిగాని గ్రహింపబడదు. అనగా వస్తువునందుగల సామాన్యవిశేషములు రెండును గ్రహింపబడవని భావము. కాని ఈ అనువృత్తి-వ్యావృత్తులకు (సామాన్య విశేషములకు) ఆశ్రయమై జాతివ్యక్త్యాద్యనేకాకారములతో కూడినదేయగు వస్తువు, శుద్ధస్వభావముచే గ్రహింపబడుచున్నది. ఈ నిర్వికల్పక ప్రత్యక్షమందు గ్రహింపబడినవస్తువే-అనగా సామాన్యవిశేష ధర్మములతోకూడిన వస్తువే, సవికల్పక జ్ఞానమందు, సామాన్యవిశేషములతోపాటు గ్రహింపబడుచున్నది. దీనినిబట్టి-నిర్వికల్పకమున గ్రహింపబడిన వస్తువే సవికల్పకమున గ్రహింపబడుచున్నదని స్పష్టము. ఈ విషయమునే పార్థసారథిమిశ్రులు న్యాయరత్నాకర టీకలో ఈ క్రింది విధముగ పేర్కొనినారు.

'నహి నిర్వికల్పకేన అగృహీతస్య, సవికల్పకేనాపి గ్రహణం సంభవతి। నవా అగృహీతే సామాన్యే, వ్యక్త్యన్తరే ప్రత్యభిజ్ఞాభవతి। తస్మాత్ సామాన్యం విశేషశ్చ నిర్వికల్పకేఽపి ప్రకాశత ఏవ.' అని పేర్కొనినారు. ఇది దీనిభావము. 'నిర్వికల్పమునందు గ్రహింపబడని వస్తువునకు సవికల్పకముచేగూడ గ్రహణము సంభవింపదు. సామాన్యధర్మము (జాతి) గ్రహింపబడనిదే, ఇతర వ్యక్తులయందు (వస్తువులయందు) 'అదియే యిది' అను ప్రత్యభిజ్ఞానము (గుర్తింపు) కలుగకపోవలసివచ్చును. కనుక, నిర్వికల్పకమందుకూడ సామాన్యము-విశేషము అనురెండును ప్రకాశించుచునేయుండును'అని. (శ్లోకవార్తికము పుటలు 122, 123, 124)

ఈగ్రంథమునుబట్టి-నిర్వికల్పమునకు-సవికల్పమునకు సామాన్యవిశేష ధర్మములతో వస్తువే విషయమనియు, నిర్వికల్పమందు సామాన్యవిశేషముల గ్రహణములేని కేవలపిండగ్రహణము మాత్రమే ఉండుననియు, ఆపిండమే (ఆవస్తువే) అనంతరకాలమున సవికల్పకజ్ఞానమున

సామాన్యవిశేష ధర్మములతో కూడినదిగా గ్రహింపబడుననియు మీమాంస కుల యభిప్రాయమని తెలియుచున్నది. నిర్వికల్పకదశయందుకూడ సర్వవిశేష రహితముగ ఏ వస్తువు గ్రహింపబడదనియు, కనుకకొన్ని విశేషములతోకూడిన వస్తువే గ్రహింపబడుననియు, విశేషములులేని వస్తువు గ్రహింపబడజాలదనియు భగవద్రామానుజాశయము.

వైయాకరణులును ఇంచుమించుగ ఈ అభిప్రాయమునే వ్యక్త పరచియున్నారు. వాక్యపదీయమను గ్రంథమును రచించిన భర్తృహరి—'నహిగౌః, స్వరూపేణగౌః, నాప్యగౌః గోత్వాభి సంబంధాత్తు గౌరిత్యభిధీయతే' అని పేర్కొనినాడు. గోవు మున్నగు పదార్థములు దూరముగా నున్నప్పుడు ఇది ఈవస్తువు అని స్పష్టముగాకాక—అస్పష్టముగ ఏదియో ఒకవస్తువు అని మాత్రమే గ్రహింపబడును. ఆ గోవే దగ్గరకు వచ్చినప్పుడు గోత్వజాతి గ్రహింపబడి అశ్వాదులకంటె భిన్నధర్మములు కల వస్తువిదియని గ్రహింపబడును. దీనినిబట్టికూడ-ప్రతివస్తువునకు ప్రథమపిండగ్రహణము – ద్వితీయపిండగ్రహణము అనునవియుండునవియు-ప్రథమపిండగ్రహణము నిర్వికల్పముకాగా — అదే వస్తువు సవికల్పమున సవిశేషముగ గ్రహింపబడుననియు, ఇదియే ద్వితీయ పిండగ్రహణమనియు స్పష్టమగుచున్నది.

కనుక ప్రత్యక్షముచే ఎట్టి విశేషములెంతమాత్రములేని వస్తువు గ్రహింపబడుటలేదనియు-అట్టి వస్తువు గ్రహింపబడజాలదనియు, అనువృత్తాకారత్వము (ఈ ధర్మమే ఇతరవస్తువులయందుకూడ ఉన్నదనుట) మాత్రము ప్రథమపిండగ్రహణ దశలో (నిర్వికల్పకమున) నుండదని యెరుగవలయును.

ఈ సందర్భముగ భిన్నత్వాభిన్నత్వరూపముగ పదార్థము రెండు స్వరూపములు కలిగియున్నదని అంగీకరించిన భేదాభేదవాదులగు భాస్కరాదుల మతమును భగవద్రామానుజులు నిరాకరించినారు. ఈ

భేదాభేదవాదమును గురించి భాస్కర–యాదవ–మతముల ప్రదర్శించిన సందర్భమున పేర్కొనబడియేయున్నది. పూర్వము నిర్వికల్పాది విషయమున మీమాంసకుల శ్లోకముల ప్రమాణముగ చూపిన వాక్యముల లోకూడ భిన్నాభిన్నత్వరూపమగు 'ద్వ్యాత్మకత్వము'ను గురించి 'ద్వ్యాత్మకస్యాపివస్తునః గ్రహణమ్' అనుమాటచే ప్రతివస్తువు జాతిపరముగ నభిన్నము, వ్యక్తివిశేషముగ భిన్నమైయున్నదను వాదమునకు (భేదాభేదవాదమునకు) బీజములున్నవని స్ఫురించుచున్నది. "నిర్వికల్పక ప్రత్యక్షమునగూడ సామాన్య విశేష విశిష్టమగు వస్తువే భాసించును"ను విషయమున మాత్రమే మీమాంసకుల మతము భగవద్రామానుజమతము నకు ప్రోద్బలకమని నిరూపించుటకు పూర్వము శ్లోకవార్తికమునుండి యు–న్యాయరత్నాకరటీకనుండియు వాక్యములు చూపబడినవి. ఇచ్చట 'ద్వ్యాత్మకత్వ' మను విషయమున మాత్రము భగవద్రామానుజ సమ్మతి లేదని యెఱుగవలయును. నిర్వికల్పకదశలోకూడ కొన్ని విశేషములు తప్పక భాసించుననియే భగవద్రామానుజ సమ్మతము. ఈ భేదాభేద వాదము సరియైనదికాదని వారి యభిప్రాయము. ఏలన—సామాన్య విశేషములు వస్తువునుండి వేరుచేయరాని ధర్మములు (ప్రకారములు); వస్తువు ఈ ప్రకారములతోకూడినదికనుక 'ప్రకారి'. ఈవిధముగ ప్రకారి యగు వస్తువునకును—దానియందు ప్రకారములైయుండు సామాన్య విశేషధర్మములకును ప్రకారప్రకారిభావ సంబంధము. ఈ ప్రకారప్రకారి భావముతో కూడినదే వస్తువుకనుక దానికి ద్వ్యాత్మకత్వము (స్వరూప ద్వయముతోకూడియుండుట) అనునదిలేదని భగవద్రామానుజ గ్రంథ తాత్పర్యము.

ఇక్కడ నీవిషయముకూడ గుర్తింపదగియున్నది. భేదాభేదవాదు లచే ఈ వాదము నంగీకరించుటకు, ఏ హేతువులు చూపబడుచున్నవో, అవి, పూర్వోక్తమగు ప్రకారప్రకారిభావమునుబట్టి కుదురునవేకనుక, భేదాభేదములనింటుకొరకు అంగీకరింపనక్కరలేదను నభిప్రాయమునే–'సంస్థా

నస్య, సంస్థానినః ప్రకారతయా పదార్థాన్తరత్వమ్, ప్రకారత్వాదేవ పృథక్సిద్ధ్యనర్హత్వం, పృథగనుపలంభశ్చ ఇతి, నద్వ్యాత్మకత్వసిద్ధిః' అను వాక్యముచే పేర్కొనినారు. సంస్థానమనగా అవయవసన్నివేశ రూపమగు ఆకృతియని పూర్వమే చెప్పబడినది. ఇట్టి ఆకృతితోకూడిన వస్తువును సంస్థాని (సంస్థానముకలది) అనియందురు. ఆకృతిరూపమైన సంస్థానము సంస్థానినుండి (ఆకృతిగలవస్తువునుండి) వేరుచేయనలవి కానిదికనుక 'పృథక్సిద్ధ్యనర్హము' (వేరుగసిద్ధించుయోగ్యతలేనిది) అని యందురు. ఇదియే ప్రకారమనబడును. దీనితోకూడినవస్తువు ప్రకారి. ప్రకారము ప్రకారికంటె వేరుగ లభింపదు. కనుక ఇక్కడ వస్తువు ద్వ్యాత్మకము (రెండురూపములుకలది) కాదని తాత్పర్యము.

ఈ పూర్వోక్తవిషయమే భగవద్రామానుజుల శ్రీభాష్యమున జిజ్ఞాసాధికరణమందలి—మహాసిద్ధాన్తారంభమున నిరూపింపబడినది.

మూ॥ అపిచ నిర్విశేషవస్తువాదినా—"స్వయంప్రకాశే వస్తుని తదుపరాగవిశేషాః సర్వైర్వేశ్యబ్దైః నిషిధ్యన్తే'—ఇతివదతా, కేతే శబ్దా నిషేధకా ఇతివక్తవ్యమ్; 'వాచారంభణం, వికారో, నామధేయం, మృత్తికేత్యేవ సత్యమ్'– ఇతి, వికారనామధేయయోః వాచారంభణమాత్రత్వాత్, యత్తత్ర కారణతయా ఉపలక్ష్యతే వస్తుమాత్రమ్, తదేవ సత్యమ్ అన్యదసత్యమితి ఇయం శ్రుతిర్వదతి।" ఇతిచేత్,

నైతదుపపద్యతే। ఏకస్మిన్ విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి ఇతిప్రతిజ్ఞాతే, అన్యజ్ఞానేన, అన్యజ్ఞానాసంభవమన్వానస్య — ఏకమేవవస్తు, వికారాద్యవస్థావిశేషేణ, పారమార్థికేనైవ, నానారూపమవస్థితంచేత్, తత్ర, ఏకస్మిన్ విజ్ఞాతే తస్మాద్విలక్షణ సంస్థానాన్తరమపితదేవ; ఇతి తత్ర దృష్టాన్తోఽయం నిదర్శితః। న అత్రకస్యచిద్విశేషస్య-

నిషేధకః కోఽపిశబ్దః దృశ్యతే। వాచారంభణమితి. నానా-వ్యవహారేణ, ఆరభ్యత ఇత్యారంభణమ్। పిండరూపసంస్థితాయాః మృత్తికాయాః నామచ అన్యత్. వ్యవహారశ్చ అన్యః। ఘటశరావాదిరూపేణ అవస్థితాయాః తస్యాఏవ మృత్తికాయాః అన్యానినామాని, వ్యవహారశ్చ అన్యాదృశః, తథాఽపి సర్వత్రమృత్తికాద్రవ్యమ్. ఏకమేవ – నానాసంస్థాన–నానానామధేయాభ్యాం, నానావ్యవహారేణచ ఆరభ్యత ఇతి, ఏతదేవ సత్యమ్ ఇత్యనేన–అన్యజ్ఞానేన అన్యజ్ఞాన సంభవో నిదర్శితః। నాత్ర కించిద్వస్తు నిషిధ్యతఇతి. పూర్వమేవ అయమర్థః ప్రపంచితః।

అనువాదము:– మరియు, ఎట్టి విశేషములులేనిదే బ్రహ్మమని వాదించువానిచే స్వయంప్రకాశమైన (తనంతతానుగ ప్రకాశించునట్టి) వస్తువువిషయమున, దానియందారోపింపబడిన, ఏ ధర్మములుకలవో, అవి యన్నియు, శ్రుతివచనములందలి అన్ని శబ్దములచేతను నిషేధింపబడు చున్నవని చెప్పబడునప్పుడు, నిషేధమును బోధించినట్టి ఆశబ్దము లేవియో తెలుపబడవలసియున్నది. "వాచారంభణమ్—ఇత్యాది శ్రుతి వచనమునుబట్టి (ఘటశరావాది) వికారము, నామధేయము, అను నీ రెండును వాగ్వ్యవహారమాత్రమే కనుక, ఇచ్చట, ఆ వికారనామధేయ ములకు మూలమై–కారణముగ–ఏ కేవలవస్తువు కనుపించుచున్నదో అదియే సత్యమనియు, దానికంటె (కారణవస్తువుకంటె) వేరుగకన్పట్టు చున్నదంతయు అసత్యమనియు ఈ శ్రుతిబోధించుచున్నది" అని యన్నచో–ఇది యుక్తముకాదు.

"ఒక్కటి తెలియబడినప్పుడు సర్వము తెలియును" (ఏకస్మిన్ విజ్ఞాతే సర్వం విజ్ఞాతం భవతి) అని ప్రతిజ్ఞచేయబడగ "వేరొకటి తెలిసినప్పుడు–మరియొకటి తెలిసినట్లగుట, అసంభవమని భావించుచున్న వానికి (శ్వేతకేతువునకు) "ఒక్కటేవస్తువు వాస్తవమైన ఘటశరావాదివికార

రూపమగు అవస్థావిశేషముతోకూడి, అనేక నామరూపములు కలిగియున్న దనియన్నప్పుడు; ఒకటి తెలిసినచో (కారణము తెలిసినచో) దానికంటె వేరుగ వివిధాకారములతోకూడిన (కార్యరూపమగు) వస్తువుకూడ అదియే నని నిరూపించుటకు, (ఈ విషయమున) మృత్తికాదృష్టాన్తము చూపబడి నది. మృద్దృష్టాన్తమును ప్రతిపాదించు "వాచారంభణం వికారః" ఇత్యాది శ్రుతివాక్యమున విశేషములనిషేధించు శబ్దమొక్కటికూడలేదు. (మీదు మిక్కిలి) వాచారంభణమనుపదములచే—వాచా = వ్యవహారముచే, ఆర-భ్యతే = ఆరంభింపబడుచున్నది, కనుక, 'ఆరంభణమ్'. పిండరూపముగ (మట్టిముద్దగ) మున్నదానికి పేరు వేరుగనున్నది, వ్యవహారముకూడ వేరుగనేయున్నది, ఘటము, శరావము మున్నగు రూపముతోకూడి యున్న, అమృద్ద్రవ్యమునకే, పేర్లువేరుగను, వ్యవహారములువేరుగను ఉన్నవి, అయినప్పటికిని అంతట (కారణకార్యదశల రెంటను) మృత్తికా ద్రవ్యమొక్కటికనుక, ఆ మృద్ద్రవ్యమొక్కటియే (కార్యదశయందు) అనేకాకారవిశేషములతోడను, వివిధనామధేయములతోడను, అనేకవిధము లైన వ్యవహారములు పొందుచున్నదికనుక ఇదియే సత్యము. కనుక ఒకటి తెలిసినప్పుడు వేరొకటి తెలియుననుటకుదురునని దృష్టాన్తపురస్సర ముగా నిరూపింపబడినది. ఇచ్చట ఏయంశము లేశమాత్రమైన నిషేధింప బడుటలేదని పూర్వమే విస్తారముగ నిరూపింపబడినది.

వివరణము:- పూర్వము నిర్విశేషవస్తువును (ఎట్టి విశేషములులేని వస్తువును) ప్రతిపాదించుటకు శబ్దము సమర్థముకాదనియు, నిర్వికల్పక ప్రత్యక్షమునగూడ సవిశేషవస్తువేతప్ప ఎట్టి విశేషములులేని వస్తువు తెలియబడదనియు నిరూపింపబడినది. ప్రస్తుతము శ్రుతివచనము లెవ్వియు నిర్విశేషబ్రహ్మవాదమును ప్రమాణించునవి కావని చెప్పబడు చున్నది. నిర్విశేష బ్రహ్మవాదులు పూర్వము నిరూపింపబడిన శ్రుతి వచ నములు సజాతీయ-విజాతీయ-స్వగత విశేషముల నన్నింటిని నిషేధించు చున్నవని చెప్పుదురు. భగవద్రామానుజులిచ్చట నావాదమును ఖండించి,

శ్రుతి వచనములచే సర్వవిధవిశేష విశిష్టమగు బ్రహ్మమే ప్రతిపాదింపబడు చున్నదని నిరూపించుచున్నారు.

పూర్వపక్షాభిప్రాయమిది. 'వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవసత్యమ్' అనువాక్యమున వికారనామధేయములు వాగ్వ్యవహారమాత్రములే, కనుక, అసత్యమే. కావున వాగ్వ్యవహారము మాత్రమే అయిన వివిధనామధేయములు, వివిధాకార విశేషములు— 'వాచారంభణ' శబ్దముచే నిషేధింపబడగా, కారణమై ఆకార వికారనామధేయాదివిశేషములులేని కేవల మృద్ద్రవ్యమే సత్యమని తెలుచున్నది. ఈ దృష్టాన్తసామ్యమునుబట్టి ప్రకృతమగు బ్రహ్మమునగూడ నామరూపాదివికారములన్నియు అవిద్యాకల్పితములేకనుక, అవియన్నియు నిషేధింపబడగా—సర్వాకారవికారవినిర్ముక్తమైనట్టిదియు, ఎట్టివిశేషములు లేనిదియునగు బ్రహ్మము మాత్రమే సత్యమని పర్యవసించుచున్నదనియు, కనుక శ్రుతివచనములచే సర్వవిధ విశేషముల నిషేధించుటద్వారా, నిర్విశేషబ్రహ్మమే నిష్కర్షింపబడుచున్నది. కనుక 'వాచారంభణమ్' అను శబ్దమే సర్వవిధ నిషేధముల బోధించుచున్నది' అని.

ఇది యుక్తముకాదు. శ్రుతివాక్యమునందుగల 'వాచారంభణమ్' అను పదము విశేష నిషేధకమెంతమాత్రముకాదు. ఏలన—కారణమై పిండాకృతిలోనుండి, భిన్నమైన ఆకారవిశేషముగల మృద్ద్రవ్యమే— కార్యముగా (ఘటము, శరావము మున్నగు వస్తుజాతముగా) నేర్పడినది కనుక, కారణావస్థకంటె వేరైన, నామరూపవికారములుకల కార్యావస్థలోకూడ ఆ మృద్ద్రవ్యమే సమానముగా నున్నదికనుక, కారణావస్థాద్రవ్యమువలెనే, కార్యావస్థాద్రవ్యముకూడ సత్యమేననియు, వాచారంభణము, వికారము, నామధేయము ఇదియంతయు మృత్తికేకనుక సత్యమేనని మాత్రమే వాచారంభణాది పదములు బోధించుచున్నవితప్ప ఎట్టి

నిషేధమునుకాదని తాత్పర్యము.

భగవద్రామానుజులీ విషయమునే ఆరంభణాధికరణ శ్రీ భాష్యమున 'అత్ర కాణాదవాదేన కారణాత్ కార్యస్య ద్రవ్యాన్తరత్వమాశంక్య లోకప్రతీత్యైవ కారణాత్ కార్యస్య అనన్యత్వముపపాదయతి' అని యారంభించి 'కార్యవిశేషాశ్చదృశ్యంతే' అనునంతవరకు వివరించి యున్నారు. ఆ గ్రంథతాత్పర్యమిది. కాణాదమతానుయాయులగు వైశేషికులు, కారణముకంటె కార్యము భిన్నముకనుక—వేరొక ద్రవ్యమే నని చెప్పుచున్నారు. ఈవాదము సరికాదనియు, లోకవ్యవహారమును బట్టియే, కారణము—కార్యము ఈ రెండును ఒక్కటే (అనన్యములే) అని యుపపాదించుటకే 'వాచారంభణమ్' ఇత్యాది శ్రుతివచనము. ఆరభ్యతే = ఆలభ్యతే, స్పృశ్యతే ఇత్యారంభణమ్' అను వ్యుత్పత్తినిబట్టి ఆరంభణశబ్దమునకు ఆలంబనము అనగా స్పృశించుటయని అర్థము. వాచా = వాక్పూర్వకమగు వ్యవహారమును హేతువుగజేసికొని; 'ఆరభ్యతే' = స్పృశింపబడునది కనుక. 'ఆరంభణమ్'. అదియేమి? వికారః, నామధేయమ్; అనగా ఘటశరావాది ఆకారవికారము; పేరు; ఈ రెండును వాగ్వ్యవహారపూర్వకముగనే స్పృశింపబడుచున్నవి. అనగా 'ఘటముచే నీరుదెమ్ము' ఇత్యాదివాక్పూర్వకముగ జలమునుదెచ్చుట మున్నగు వ్యవహారము; ఇది సిద్ధించుటకే మృద్ద్రవ్యముచే—లావుగానున్న మధ్య భాగముగల ఘటము మున్నగు వికారము, అనగా ఆకారవిశేషము, దానినిబట్టియే 'ఘటము' మున్నగు నామధేయము, అనగా పేరు, అని (యీవిధముగా) వికార-నామధేయములు స్పృశింపబడుచున్నవి. దీనిని బట్టి జలాదుల దెచ్చుటకొరకు, మట్టియే—ఆకారాన్తరము (మట్టిముద్దకంటె వేరగురూపము); నామధేయము; ఈ రెండిటిని పొందుచున్నది. కనుక, వికారములైన ఘటాదులు మట్టియేకనుక, ఇవి నిర్మింపబడుటకు కారణము మట్టిముద్దయేననుట సత్యము. అనగా ప్రత్యక్షప్రమాణముచే తెలియుచున్నదని తాత్పర్యము. కావున వేరు ద్రవ్యముకాదు. ఎట్లుగా—

దేవదత్తునకే అవస్థావిశేషములనుబట్టి బాలుడు, యువకుడు, వృద్ధుడు ఇత్యాది భిన్న భిన్న జ్ఞానము, శబ్దవ్యవహారము కుదురుచున్నవో-అట్లే, ఒకే మృద్ద్రవ్యమునకు అవస్థావిశేషములనుబట్టి వేరువేరుపేర్లు అని స్పష్టమగుచున్నది. ఈ విషయమే 'పటవచ్చ' (బ్ర.సూ. 2-1-19) యథాచ ప్రాణాది (2-1-20) అను సూత్రములచే గూడ సాధింపబడినది. ఎట్లుగ-కారణములైన తంతువులే (దారములే) నేయబడి పటముగా (వస్త్రముగా) నామరూప కార్యాంతరాదికమును పొందుచున్నదో; ఎట్లుగ-ఒకే వాయువు శరీరమున వేరువేరువృత్తులనుపొంది, ప్రాణాపానాది నామరూప కార్యాంతరముల పొందినదో అట్లే, ఒకేబ్రహ్మను, విచిత్రమైన జగత్తుగ నగుచున్నదికనుక, కారణమువలె కార్యము సత్యమేననియు, ఈ రెండును ఒక్కటేననియు నిరూపింపబడినది.

పైని పేర్కొనబడిన శ్రీభాష్యగ్రంథ తాత్పర్యమునుబట్టి కారణ కార్యములు రెండును విభిన్నావస్థలగలిగియున్నను-ఒకే ద్రవ్యము కనుక, ఒకటి తెలిసినచో-రెండవది తెలియుట సంభవమేనని స్పష్టపరుపబడినది. కనుక శ్రుతివచనములోని ఏ శబ్దములు నిషేధబోధకములు కావని పర్యవసించుచున్నది. ఈ యభిప్రాయమే ప్రస్తుత వేదార్థసంగ్రహ వాక్యములచే స్పష్టపరుపబడినది.

మూ॥ అపిచ 'యేనాశ్రుతం శ్రుతమ్' ఇత్యాదినా బ్రహ్మ వ్యతిరిక్తస్య సర్వస్యమిథ్యాత్వం ప్రతిజ్ఞాతంచేత్, 'యథాసోమ్యైకేనమృత్పిండేన' ఇత్యాది దృష్టాన్తః సాధ్యవికలఃస్యాత్। రజ్జుసర్పాదివత్, మృత్తికావికారస్య ఘటశరావాదేరసత్యత్వమ్, శ్వేతకేతోః శుశ్రూషోః ప్రమాణాన్తరేణ యుక్త్యాచ అసిద్ధమితి, ఏతదపి నిసాధయిషితమ్ ఇతిచేత్, యథా ఇతి దృష్టాన్తతయోపాదానమ్ నఘటతే।

అనువాదము: మరియు, 'యేనాశ్రుతం శ్రుతం భవతి' (ఏనివలన

వినబడనిదికూడ వినబడినట్లగుచున్నదో) ఇత్యాది శ్రుతివచనముచే, బ్రహ్మముకంటె వేరైన సమస్తము, మిథ్యయేనని ప్రతిజ్ఞ సేయబడు చున్నదనియందురేని, 'యథాసోమ్య! ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం భవతి (ఎట్లుగ, సోమ్యుడా! మట్టిముద్ద తెలిసినంత నే సమస్త మృణ్మయము తెలిసినట్లగును) అని ప్రదర్శింపబడిన దృష్టాంతము (ఉదాహరణము) సాధ్యవికలము కావలసివచ్చును. (సాధింప దగినవస్తువు లేకపోవలసివచ్చును) రజ్జుసర్పాదికమువలె మృద్వికారమైన ఘటశరావాది వస్తుజాతము అసత్యమను విషయము శుశ్రూషువైన శ్వేత కేతువునకు ప్రత్యక్షాదిప్రమాణముచేగాని, యుక్తిచేగాని, సిద్ధింపలేదు. ఇదికూడ సాధింపదలచినదేయని యందురా? అట్లైన 'యథా' (ఎట్లుగ) అని దృష్టాంతముగ (మృత్తు-తద్వికారముఅనువాటిని) గ్రహించుట కుద రదు కదా!

వివరణము: ఇక్కడ భగవద్రామానుజులు బ్రహ్మసత్యత్వమును జగన్మిథ్యాత్వమును సాధించుటకు మాయావాదులచే ప్రమాణముగ చూప బడిన శ్రుతి దృష్టాన్తములో సాధ్యాంశమగు 'మిథ్యాత్వము' ప్రమాణ సిద్ధము కాలేదను దోషము నుద్ఘాటించుచున్నారు.

ఏదేనియొక విషయమును దృష్టాన్తము చూపి సాధింపదలచినప్పుడు ఆ సాధింపదగిన విషయము ముందు దృష్టాన్తమున నన్వయించి యుండ వలయును. అప్పుడు మాత్రమే దృష్టాన్తసామ్యమునుబట్టి, ఇతరత్ర తాము సాధింపదలచిన విషయమును సాధించుట కుదురును. సాధారణ ముగ తాము సాధింపదలచిన ప్రస్తుత విషయము-ఏ దృష్టాన్తమున పూర్వమే ప్రమాణప్రతిపన్నమైయున్నదో అట్టి దృష్టాన్తమునే చూపవల యును. ఉదాహరణమునకు 'ఈ కొండపై నిప్పుకలదు, పొగకలదు కనుక, ఎచ్చట పొగయుండునో అచ్చట నిప్పుండును. మహానసమున (వంట యింటిలో) పొగయున్నది. నిప్పున్నది. అట్లే, కొండపై పొగ యున్నది కనుక నిప్పుండును అని యూహించుట లోకప్రసిద్ధమే.

ఇచ్చట పొగను హేతువుగజేసి నిప్పు సాధింపబడినది. అద్వైతవేదాన్తులు జగన్మిథ్యాత్వమును సాధించుటకు ఔపనిషదముకాని (ఉపనిషత్తులలో లేని) రజ్జుసర్ప దృష్టాన్తమును చూపుదురు. ఈ దృష్టాన్తము శూన్యవాదు లగు బౌద్ధులచే ప్రతిపాదింపబడగా గౌడపాదకారికలలో పరిగ్రహింపబడిన దనియు, దీనినే భగవత్పాద శంకరాదులు పరిగ్రహించిరనియు తత్త్వా లోచనాపరులగు పెద్దలు చెప్పుదురు. ఇచ్చట రజ్జువును చూచి భ్రాన్తిచే పామని భ్రమసి భయకంపాదులు పొందినవానికి, తత్త్వమెరిగినవాడగు నాప్తుడు వేరొకడు 'ఇది సర్పముకాదు-రజ్జువు' అని ప్రతిబోధించినప్పుడు, వానికి భ్రాన్తి తొలగి, తాత్త్వికమగు రజ్జువు భాసించును. అట్లే అనాద్య విద్యచే కల్గిన దోషము వలన బ్రహ్మమందు భాసించుచున్న యీ సమస్త జగత్తు-విద్యచే తొలగి బ్రహ్మము భాసించును. కనుక రజ్జువునందు కల్పింపబడిన సర్పము తరువాత రజ్జుజ్ఞానముచే బాధింపబడుచున్నట్లు, బ్రహ్మమందు అవిద్యచే కల్పింపబడిన జగత్తు తరువాత విద్యచే బాధింప బడును కనుక మిథ్యయని వారియభిప్రాయము.

ఔపనిషదమగు మృద్దృష్టాన్తమునుబట్టి జగత్తు బ్రహ్మమునుండి యావి ర్భవించి, కార్యమని తెలియుచున్నదికనుక, కారణమైన బ్రహ్మము మాత్రమే సత్యము, జగత్తు (కార్యము) ఘటశరావాదులవలె అసత్యమని వీరి తాత్పర్యము.

ఈ యౌపనిషదమైన మృద్దృష్టాన్తమున ఘటము, శరావము (చట్టి) మున్నగు వికారములు 'అసత్యము' అనువిషయము ప్రమాణముచే సిద్ధిం పలేదని భగవద్రామానుజ గ్రంథతాత్పర్యము.

ఇది వీరియభిప్రాయము.

'రజ్జుసర్పదృష్టాన్తమున రజ్జువునందు భ్రాన్తిచే కల్పింపబడిన 'ఇది సర్పము' అనుజ్ఞానము, కొలదికాలము తరువాత, ఎవ్వడైన యాప్తుడు చెప్పినందువల్లనో, లేక తానే రజ్జుస్వరూపమును తెలిసికొన

గలిగినందుననో తొలగిపోవుచున్నది. కనుక రజ్జువునందు కల్గిన సర్పజ్ఞానము భ్రాన్తికల్పితమై అసత్యము లేక మిథ్యయని అనవచ్చును. కాని ఈ సామ్యమునుబట్టి బ్రహ్మమందు చేతనాచేతనాత్మకమగు సమస్తజగత్తు భ్రాన్తిచే కల్పింపబడినదనిగాని, అది మిథ్యయనిగాని అనుటకెట్టి యవకాశములేదు. ప్రత్యక్షముగ అందరికి అనుభవగోచరమగుచున్న జగత్తు ఎంతమాత్రము తరువాత సర్పజ్ఞానమువలె బాధింపబడలేదుకదా! కనుక జగత్తు మిథ్యయనుటలో నెట్టి ప్రమాణము లేదు. 'మరి, ఉపనిషత్తులో గల మృద్దృష్టాన్తముచే ఘటశరావాదులు వికారములై (పరిణామశీలములై) నశించుచున్నవికనుక, అవి యసత్యములైనట్లును, గాజులు మున్నగు ఆభరణములు తరువాత నశించినను, వాటికి మూలమైన బంగారమొక్కటియే సత్యమై మిగిలినట్లును, జగత్తుమిథ్య-బ్రహ్మము మాత్రము సత్యమని తెలియుచున్నదికదా!' అన్నచో ఇదిసరికాదు. నశించినంతమాత్రమున లేదా పరిణామమును (వికారమును) పొందినంత మాత్రమున ఘటాశరావాదులుగాని, కటకకుండలాదులుగాని అసత్యమనుటకు వీలులేదు. కాని అనిత్యములనవచ్చును. ఇవియును ఒకరూపము పోయి మరియొకరూపము కల్గుచున్నది కనుక ప్రవాహనిత్యములేతప్ప, సర్వాత్మనా అనిత్యములనుటకు వీలులేదు. కనుకనే, శ్రీవైకుంఠము మున్నగునవి స్వరూపనిత్యములనియు, ఈ జగత్తు ఇందలి దేవనర తిర్యక్స్థావరములను చతుర్విధ వస్తుజాతము ప్రవాహనిత్యమనియు తెలియవలయును. మరియు రజ్జుసర్పమువలె జగత్తు తరువాత కాలమున బాధింపబడునదికాదు కనుక, ఇది అసత్యము, లేక మిథ్యయనుటలో నెట్టి ప్రమాణము లేదు. ఈవిధముగ మృద్దృష్టాన్తమున 'మిథ్యాత్వము' సిద్ధింపలేదుకనుక, ఈ దృష్టాన్తము 'సాధ్యవికల'మగుచున్నది. దీనినే భగవద్రామానుజులు-'అపిచ యేనాశ్రుతం శ్రుతమ్' ఇత్యాది నా మిథ్యాత్వం ప్రతిజ్ఞాతంచేత్, 'యథాసోమ్యైకేనమృత్పిండేన' ఇత్యాది దృష్టాన్తః సాధ్యవికలః స్యాత్' 'మరియు 'ఏది తెలియబడిన తెలియబడనిది కూడ తెలిసినట్లగునో' ఇత్యాది వాక్యముచే జగత్తుమిథ్యయని ప్రతిజ్ఞ

చేయబడుచున్నదన్నచో—'యథావికేన మృత్పిండేన' 'ఒక మట్టిముద్ద తెలిసిన, నంతయు తెలియు'నని చూపిన దృష్టాంతము (ఉదాహరణము) సాధ్యవికలము కావలసివచ్చును.' అని పేర్కొనినారు. సాధ్యవికలమనగా —సాధ్యము (సాధింపదగినయంశము) లేనిది అనియర్థము. ఇచ్చట 'మిథ్యాత్వము' సాధింపదలచినది. అది సిద్ధింపలేదు. కనుక సాధింపదగినది, దృష్టాన్తమున సిద్ధింపలేదుకనుక, దృష్టాన్తము సాధ్యవికలమైనదని యభిప్రాయము.

ఇక, రజ్జుసర్పదృష్టాన్తమునగూడ రజ్జువుచూచి పామనియో, నేలనెఱ్ఱి అనియో, నీటిధారయనియో భ్రాన్తి చెందినప్పుడు ఆ కాలమున వాస్తవముగ నున్నది రజ్జువే కనుక, తదితరములు అదే కాలమున నుండుట కుదరదు కనుక, అసత్యములు. కాని ఆ సర్పాదులే ఇతర కాలములయందు అసలు లేనేలేవని యెవ్వరు అనజాలరు కదా! అనగా ఒకప్పుడు వాస్తవముగ చూచిన సర్పాదులనే, పోలికనుబట్టి యిప్పుడు రజ్జువను చూచిన క్షణమున స్మరించి భయకంపాదుల పొందుచున్నాము. ఇది భ్రాన్తి. ఇది వెంటనే దిలగిపోయినది. ప్రపంచమట్లు భ్రాన్తిచే కనుపించి, వెంటనే తొలగిపోవునది కాదుకదా! మరి, బ్రహ్మాత్మైక్య జ్ఞానము కలిగినవానికి—ఈ జగత్తు లేనట్లే భాసించును కనుక మిథ్యయే నన్నచో, ఇదియు సరికాదు. ఎవ్వడు బ్రహ్మమును తానుగా చూచునో, వాడే ప్రపంచమునుగూడ బ్రహ్మాత్మకముగనే చూచునుతప్ప, ప్రపంచమును మిథ్యగాకాదు. కనుక యుక్తిచేగూడ ప్రపంచము మిథ్యయనుట కెంతమాత్రము అవకాశములేదని భగవద్రామానుజ తాత్పర్యము. దీనినే 'యుక్త్యాచ అసిద్ధమ్' 'యుక్తిచేగూడ సిద్ధింపలేదని' పేర్కొనినారు.

మూ॥ 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్' 'ఏకమేవాద్వితీయమ్' ఇత్యత్ర—'సదేవ' 'ఏకమేవ' ఇత్యవధారణద్వయేన, 'అద్వితీయమ్' ఇత్యనేనచ, సన్మాత్రాతిరేకి సజాతీయ-విజాతీయాః సర్వేవిశేషా నిషిధ్యన్త ఇతి ప్రతీయతే' ఇతిచేత్—నైత

దేవమ్; కార్యకారణభావావస్థాద్వయావస్థితస్య ఏకస్య వస్తునః, ఏకావస్థావస్థిస్య జ్ఞానేన అవస్థాన్తరావస్థితస్యాపి వస్త్వైక్యేన జ్ఞాతతామ్–దృష్టాన్తేన దర్శయిత్వా, శ్వేతకేతో రప్రజ్ఞాతం సర్వస్యబ్రహ్మకారణత్వంవక్తుం 'సదేవ సోమ్యేదమ్' ఇత్యారబ్ధమ్, ఇదమగ్రే సదేవ ఆసీత్ ఇతి। 'అగ్రే' ఇతి కాలవిశేషః–ఇదం–శబ్దవాచ్యస్య జగతః సహాపత్తి క్రియాం. సద్ద్రవ్యతాం చ వదతి। 'ఏకమేవ' ఇతిచ అస్య నానానామరూపవికారప్రహాణమ్। ఏతస్మిన్ ప్రతిపాదితే, అస్యజగతః సదుపాదానతా, ప్రతిపాదితాభవతి। అన్యత్ర ఉపాదానకారణస్య స్వవ్యతిరిక్తాధిష్ఠాత్రపేక్షాదర్శనేఽపి సర్వవిలక్షణత్వాత్ అస్య సర్వజ్ఞస్యబ్రహ్మణః సర్వశక్తి యోగో న విరుద్ధఇతి, 'అద్వితీయ' పదమ్ అధిష్ఠాత్రన్తరం నివారయతి। సర్వశక్తియుక్తత్వాదేవ బ్రహ్మణః, కాశ్చన శ్రుతయః ప్రథమ ముపాదానకారణత్వం ప్రతిపాద్య, నిమిత్తకారణమపి తదేవ ఇతి ప్రతిపాదయన్తి। యథాఇయం శ్రుతిః।

అనువాదము:– "సదేవ సోమ్యేదమగ్రఆసీత్, ఏకమేవా ద్వితీయమ్" అనుచోటున 'సదేవ', 'ఏకమేవ' అను అవధారణార్థకమగు (ఇదియే అను నిశ్చయమును బోధించు) 'ఏవ' అను పదమును రెండు సారులు ప్రయోగించుటనుబట్టియు; 'అద్వితీయమ్' (దీనితో సమానమైనది రెండవది లేదు) అని యనుటచేతను; సత్పదార్థమైన బ్రహ్మముకంటె వేరైన సజాతీయములు, విజాతీయములునైన సమస్త విశేషములు నిషేధింపబడుచున్నవని తెలియుచున్నది"–అని యన్నచో–ఇది యిట్లుకాదు. కారణము–కార్యము అను రెండవస్థలతో కూడియున్న ఒకే వస్తువునకు సంబంధించి, ఒక అవస్థలో నున్నదానిని తెలిసికొన్నంతనే రెండవ యవస్థతో కూడియున్న వస్తువుకూడ అదే కనుక, తెలియబడుననుటను

దృష్టాంతముఖమున ప్రదర్శించి, ఈ మర్మమెరుగ జాలని శ్వేతకేతువు నుద్దేశించి, సమస్తము-బ్రహ్మమును కారణముగా జేసికొని యేర్పడినదే నని చెప్పుటకై-'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్' అని యారంభింపబడినది. 'ఇదమగ్రే సదేవ ఆసీత్' (ఇదం = ఈ ముందు కనుపించుచున జగత్తు, అగ్రే = సృష్టికి పూర్వము, సదేవ = సత్పదార్థమే అయి, ఆసీత్ = ఉండెను) అని; 'అగ్రే' పూర్వము అనుభూతకాలవిశేషము, ఇదం (ఇది) అను శబ్దముచే బోధింపడు ప్రపంచమునకు 'సత్వమును పొందుట' యను క్రియను, సద్రూపమగు ద్రవ్యమై (పదార్థమై) యుండుటను బోధించు చున్నది. 'ఏకమేవ' (ఒక్కటి) అనునది ఈ సద్రూపమగు ద్రవ్యము నకు (సృష్టికి పూర్వమున) వివిధములైన నామరూప వికారములు లేవని బోధించుచున్నది. ఇది ప్రతిపాదింపబడినప్పుడు, ఈ ప్రపంచమునకు సత్పదార్థమే ఉపాదానకారణమని (అపృథక్సిద్ధ కారణమని) యనుట కూడ ప్రతిపాదింపబడినట్లగుచున్నది. ఇతరత్ర (లోకమున) ఉపాదాన కారణమునకు-తనకంటె వేరైన అధిష్ఠాతయొక్క అపేక్ష యున్నప్పటికిని, ఈ సత్పదార్థమగు బ్రహ్మము, అన్నిటికంటె విలక్షణము, సర్వజ్ఞము, కనుక ఆ బ్రహ్మమునకు సర్వవిధశక్తులయొక్క సంబంధముండుట విరుద్ధ మెంతమాత్రము కాదని, 'అద్వితీయమ్' అను పదము బ్రహ్మముకంటె వేరైన అధిష్ఠాతను నివారించుచున్నది. సర్వశక్తిసంపన్నమగుటచేతనే ఆ పరబ్రహ్మమునకు, కొన్ని శ్రుతివచనములు, మొదట ఉపాదానకార ణత్వమును ప్రతిపాదించి నిమిత్తకారణముకూడ, ఆ పరబ్రహ్మమేనని ప్రతిపాదించుచున్నవి. ప్రస్తుతము ఉదాహరింపబడిన 'సదేవ సోమ్యే దమగ్ర ఆసీత్' 'ఏకమేవాద్వితీయమ్' అను శ్రుతివచనముకూడ ఈ యర్థమునే బోధించుచున్నది.

వివరణము:- సదేవ, ఏకమేవ అనుచోటునగల 'ఏవ' అను అవ ధారణార్థమును (నిశ్చయార్థమును) బోధించు శబ్దములు సత్పదార్థము కంటె వేరైన విజాతీయ వస్తువులును, సజాతీయ వస్తువులును ఎంత

మాత్రము లేవని నిషేధించుచున్నవనియు, 'అద్వితీయమ్' అను పదము పరబ్రహ్మమందు గుణములుకూడ లేవని నిషేధించుచున్నదనియు భగవత్పాద శంకరుల అభిప్రాయము. కార్య-కారణభావరూపములగు రెండు అవస్థలతో కూడినది ఒకే బ్రహ్మము కనుక, కారణావస్థలోనున్న బ్రహ్మము తెలిసినచో, కార్యావస్థలో (అనగా జగత్తుగా) నున్న బ్రహ్మము తెలిసినట్లగునని మాత్రమే చెప్పబడుచున్నదితప్ప, ఎట్టి అంశములు నిషేధింపబడుటలేదని భగవద్రామానుజాభిప్రాయము.

ఒకే బ్రహ్మము రెండవస్థలతో కూడినదైయున్నప్పుడు ఒకటి (కారణమైన బ్రహ్మము) తెలిసినచో రెండవది (ప్రపంచముగనైన బ్రహ్మము) తెలియుననుటలోని మర్మమును తెలియజాలని శ్వేతకేతువునకు తత్త్వము నెరిగించుటకై 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ ఏకమేవా ద్వితీయమ్' అను వాక్యము నారంభించి నిరూపింపబడినది. ఈ వాక్యమున 'సత్' పదము కారణమైన బ్రహ్మమును బోధించుచున్నది. 'ఇదమ్' అను పదము ఎదురుగా కన్పట్టుచున్న కార్యమైన ప్రపంచమును తెలియజేయుచున్నది. ఆ కారణము—ఈ కార్యము ఒకే బ్రహ్మముయొక్క రెండు అవస్థలని చెప్పుటకై ఇదం = ఇది, అగ్రే = సృష్టికి పూర్వము, సదేవ = సత్పదార్థమగు బ్రహ్మమే, ఆసీత్ = అయినది అని చెప్పబడినది. అది ఎట్టిది? అను ప్రశ్నమునకు సమాధానముగ ఏకమేవ, అద్వితీయమ్ అను శబ్దములు. ఆ కారణరూపమైన బ్రహ్మావస్థలోను నున్న జగత్తునకు నామరూపములేవియు లేవనియు, అట్టి నామరూప వికారరహితమైన కారణావస్థలోనున్న బ్రహ్మమే సృష్ట్యనన్తరము స్థూలరూపమును పొంది, ఈ ముందు కనుపించుచున్న విధముగా కార్యావస్థలో నామరూప వికారముల పొందినదనియు చెప్పబడినది: ఈ విధముగ 'సదేవ' 'ఏకమేవ' అను చోటులందుగల ఏవ శబ్దములు, నామరూపవికారాస్పదమై కన్పట్టుచున్న జగత్తు కార్యావస్థలోనున్న బ్రహ్మముకాగా, సృష్టికి పూర్వము ఈ జగత్తే నామరూపవికారవిరహితమై సచ్ఛబ్దవాచ్యమై కారణావస్థలోనున్న బ్రహ్మ

మైయున్నదనియు; కనుక అదియు-ఇదియు ఒక్కటే కనుక, ఒకటి తెలిసిన మరియొకటి తెలియుటలో అసంగతమేమియు లేదని బోధించు చున్నవి. 'అద్వితీయమ్' అని (న విద్యతే ద్వితీయం యస్మాత్తత్-దీని కంటె వేరుగ నిమిత్త కారణమేమియులేదు అనియు) ఆ బ్రహ్మమే తానే జగత్తునకు ఉపాదాన-నిమిత్త కారణములు రెండును అయినదని కార ణాంతరమును (వేరొక కారణమును) మాత్రమే నిషేధించినది. ఇట్లనుట చేత లోకమున ఘటపటాది వస్తువులకు ఉపాదాన-నిమిత్త కారణములు వేరుగనున్నట్లు ఇచ్చట లేవని స్పష్టమగుచున్నది. మరి, ఒకే బ్రహ్మ వస్తువు ఉపాదాన నిమిత్త కారణములు రెండును ఎట్లు కాగలదు? అను శంకకు సమాధానముగ బ్రహ్మము సర్వజ్ఞాన సంపన్నము, సర్వ విలక్ష ణము, సర్వశక్తిసంపన్నమునై యుండుటయేనని చెప్పబడినది.

ఈ విధముగ సదేవ ఇత్యాది శ్రుతివాక్యములోని-'సదేవ-ఇదమ్-అగ్రే-ఏకమేవ-ఆసీత్' అను పదములు అనేక విశేషములనే బోధించు చున్నవి. సత్ పదము సద్రూపమగు ద్రవ్యమును, ఇదమ్ పదము ముందు కనుపించుచున్న ప్రపంచమును, అగ్రే అను పదము పూర్వకాల విశేషమును, 'ఆసీత్' (అయియుండెను) అను పదము 'సదాపత్తి' రూప మగు క్రియను ఇట్లు అనేక విశేషములు బోధింపబడుచున్నవి. కనుక ఇచ్చట విశేషముల నిషేధించు పదములేమియు లేవని పర్యవసితార్థము.

మూ॥ అన్యాశ్చ శ్రుతయః బ్రహ్మణో నిమిత్తకారణతామనుజ్ఞాయ, తస్య ఉపాదానతాది కథమితి పరిచోద్య సర్వశక్తియుక్త-త్వాత్, ఉపాదానకారణమ్, తదితరాశేషోపకరణంచ, బ్రహ్మైవ ఇతి పరిహరన్తి।

"కింస్విద్ వనం? కఉసవృక్షఆసీత్?
యతోద్యావా పృథివీ నిష్టతక్షుః।
మనీషిణో మనసాపృచ్ఛతేదుతత్
యదధ్యతిష్ఠద్భువనాని ధారయన్॥

"బ్రహ్మవనం బ్రహ్మసవృక్షఆసీత్
యతోద్యావా పృథివీనిష్టతక్షుః।
మనీషిణో మనసా బ్రవీమివః
బ్రహ్మాధ్యతిష్ఠద్భువనాని ధారయన్॥

ఇతి, సామాన్యతో దృష్టేన విరోధమాశంక్య, బ్రహ్మణః సర్వవిలక్షణత్వేన పరిహార ఉక్తః॥

అనువాదము: మరి కొన్ని ఇతర శ్రుతులు పరబ్రహ్మమునకు నిమిత్తకారణత్వమును అంగీకరించి, ఆ పరబ్రహ్మమునకు ఉపాదానత్వము మున్నగునవియెట్లు కుదురునని యాశంకించి, ఆపరబ్రహ్మము సర్వశక్తిసంపన్నము కనుక ఉపాదానకారణము, మరియు ఇతరములైన సమస్త నిమిత్తకారణాది సాధనములుకూడనగుచున్నదని పరిహారమును నొడువుచున్నవి. ఆ శ్రుతులు—

'కింస్విద్వనమ్' 'బ్రహ్మవనమ్' అనునవి. సామాన్యముగ కన్పించుచున్న విరోధమును (అనగా ఒకటే వస్తువు ఉపాదాన నిమిత్త కారణములు రెండుగను అగుటను) శంకించి, పరబ్రహ్మము సర్వవస్తువులకంటె విలక్షణమైనది కనుక దోషములేదని పరిహారమునుట్టంకించుచున్నవి.

వివరణము: పూర్వము 'సదేవసోమ్య' ఇత్యాది శ్రుతులు పరబ్రహ్మమునకు ఉపాదానకారణత్వమును మొదట ప్రతిపాదించి, పిమ్మట నిమిత్తకారణముకూడ నా పరబ్రహ్మమేనని 'అద్వితీయమ్' ఇత్యాదిగ నిరూపించియున్నవి. ఇక మరికొన్ని శ్రుతులు పరబ్రహ్మము నిమిత్త కారణమని అంగీకరించి, లోకదృష్టమగు కార్యకారణవ్యవస్థనుబట్టి ఒక వస్తువునకు ఉపాదానకారణము వేరుగను, దానికంటె భిన్నముగనే నిమిత్తకారణములుండుట అనుభవసిద్ధముకనుక, ఒకేబ్రహ్మము-జగత్తునకు నిమిత్తకారణము-ఉపాదానకారణముకూడ నగుటయెట్లని శంకించి,

పరబ్రహ్మము సర్వశక్తిసంపన్నముకనుక తానే రెండును (నిమిత్తోపాదానకారణములు) అగుట కుదురునని శంకాపరిహారమొనర్చుచున్నవి. లోకమున ఘటనిర్మాణమునకు మృత్తు ఉపాదానకారణముకాగా, దండ చక్రసలిలాదులు నిమిత్తకారణమగుటయున్నను, జగత్తు విషయమున సర్వశక్తిసంపన్నుడైన పరమాత్మయే నిమిత్తోపాదాన కారణములగుట ఉపపన్నమేనని శ్రుతులు కొన్ని నిరూపించుచున్నవని తాత్పర్యము. ఆ శ్రుతులు—'కింస్విద్వనమ్' ఇత్యాదులు–వీటియర్థమిది.

కింస్విద్వనం = ఏమియావనము?; క ఉసవృక్షఆసీత్ = ఏమా వృక్షమైయున్నది?; యతః = దేనినుండి; ద్యావాపృథివీ = అంతరాళము, భూమియనువాటిని; నిష్టతక్షుః = చెక్కినారో; మనీషిణః = ఓ మననశీలురైన విద్వాంసులారా!; యత్ = ఏవస్తువు; భువనాని = సమస్తలోకములను; ధారయన్ = ధరించుచున్నదై; అధ్యతిష్ఠత్ = అధిష్ఠించి (ఆధారమై) యున్నదో; తద్దు = దానినే; మనసా = మనస్సుతో (మనఃపూర్వకముగ); పృచ్ఛతే = ప్రశ్నించుచున్నారో; తత్ = అట్టివస్తువునుగురించి; మనీషిణః = మననశీలులారా!; మనసా = మనఃపూర్వకముగ; విబ్రవీమి = విశేషముగ చెప్పుదును; (ఏమనగా) బ్రహ్మ = ఆ పరబ్రహ్మమే; వనమ్ = వనమైయున్నది (ఆధారమైయున్నదని యభిప్రాయము); సవృక్షః = ఆచెట్టు; బ్రహ్మఆసీత్ = బ్రహ్మమే ఆయెను; యతః = దేనినుండి; ద్యావాపృథివీ = అంతరాళము, భూమిఅనువాటిని; నిష్టతక్షుః = చెక్కిరో; బ్రహ్మం = ఆ పరబ్రహ్మమే; భువనాని = సమస్తలోకములను; ధారయన్ = ధరించుచు; అధ్యతిష్ఠత్ = ఆధారమైయుండెను.

'మననశీలురైన విద్వాంసులారా! ఏమియావనము? ఏమియా వృక్షము? దేనినుండి ఈ సమస్త పృథివ్యంతరాళములు చెక్కబడినవో, అనియు, సమస్తభువనములకాధారమై యధిష్ఠించియున్న తత్త్వమేది-యో? అని మనస్సుతో పరిప్రశ్నమొనర్చుచున్నారుకదా! దానిని గురించి మనఃపూర్వకముగా చెప్పుచుంటిని. బ్రహ్మమే వనము, బ్రహ్మమే వృక్షము,

దానినుండియే యీ సమస్త పృథివ్యంతరాళములు చెక్కబడినవి (నిర్మింపబడినవి) ఆ పరబ్రహ్మమే ఈ భువనములకధిష్ఠాతయై (ఆధారముగ) నున్నది' ఇచ్చట 'కింస్విద్వనమ్' అను ప్రశ్నమునకు 'బ్రహ్మ వనమ్' అని సమాధానము—దీనిచే అధికరణము (ఆధారము) బ్రహ్మమని చెప్పబడినది. 'కఉస వృక్షఆసీత్?' అను ప్రశ్నమునకు 'బహ్మసవృక్ష ఆసీత్' అని సమాధానము. దీనిచే ఒకవస్తువును చెక్కుటకు దారువు(చెక్క) ఉపాదానకారణమైనట్లు, భూమికి, అంతరాళములకు అనగా సమస్త జగత్తుకు బ్రహ్మముపాదానకారణమని చెప్పబడినది. 'అధ్యతిష్ఠత్' (అధిష్ఠించియుండెను.) అను పదముచే బ్రహ్మమే అధిష్ఠాతయనిచెప్పుటద్వారా వేరొక యధిష్ఠాత లేడని చెప్పబడి, బ్రహ్మమే నిమిత్తకారణమని యుట్టంకింపబడినది. నిష్టతక్షుః = చెక్కినారు అనుచోట బహువచనము వివక్షితము కాదు. బ్రహ్మముతానే ఉపాదాన నిమిత్తకారణములై సమస్తజగత్తును నిర్మించినదని తాత్పర్యము.

ఇచ్చట, పూర్వము ఘటాదిస్థలములందు మృత్తు మున్నగు ఉపాదాన కారణములు, దానికంటె వేరుగ దండము, చక్రము, నీరు మున్నగు నిమిత్త కారణములున్నట్లుకాక, ... విషయమున బ్రహ్మమే సర్వజ్ఞము, సర్వశక్తిసంపన్నమై తానే ఒక్కటే ఉపాదాన నిమిత్తములగుట విప్రతిషిద్ధము కాదని నిరూపింపబడినది.

మూ॥ అతః సదేవసోమ్యేదమగ్రఆసీత్ ఇత్యత్రాపి "అగ్రే" ఇత్యనేకవిశేషాః బ్రహ్మణః ప్రతిపాదితాః। భవదభిమత విశేష నిషేధవాచీకోఽపిశబ్దో నదృశ్యతే। ప్రత్యుత జగద్బ్రహ్మణోః కార్యకారణభావజ్ఞాపనాయ, "అగ్రే" ఇతి కాలవిశేష సద్భావః; "ఆసీత్" ఇతి క్రియావిశేషః, జగదుపాధానతా, జగన్నిమిత్తతాచ, నిమిత్తోపాదానయోః భేదనిరసనేన తస్యైవబ్రహ్మణః సర్వశక్తియోగశ్చేతి అప్రిజ్ఞాతాః సహస్రశోవిశేషాః ప్రతిపాదితాః

అనువాదము:- 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్' అను చోటునగూడ 'అగ్రే' (పూర్వము) ఇత్యాదిగ అనేక విశేషములు బ్రహ్మమునకు కలవని ప్రతిపాదింపబడినవి. కనుక, మీ కిష్టమైన నిషేధమునకు బోధకమైన శబ్దము ఒక్కటికూడ లేదు. మీదుమిక్కిలి, జగత్తునకు-బ్రహ్మమునకు కార్య-కారణ భావమును (జగత్తు-కార్యము అనగా పుట్టునది; బ్రహ్మము కారణము - అను నీ సంబంధమును) తెలియజేయుటకొరకే - 'అగ్రే' (పూర్వము) అని కాలవిశేషముండుట; ఆసీత్ (ఉండెను) అని క్రియా విశేషము, జగత్తున కుపాదానకారణమైయుండుట, జగత్తునకు నిమిత్త కారణమైయుండుట, మరియు, ఉపాదాన కారణము-నిమిత్త కారణము అను నీ రెండింటికిని భేదమును నిరాకరించుటద్వారా, ఆ బ్రహ్మమునకే సర్వవిధశక్తి సంపన్నత-ఇత్యాదిగ తెలియబడని, వేలకొలది విశేషములే ప్రతిపాదింపబడినవి.

వివరణము:- ఈ గ్రంథముచే పూర్వప్రదర్శిత శ్రుతివచనముల వలన సహస్రాధికములైన విశేషములే చెప్పబడుచున్నవితప్ప, బ్రహ్మమందలి విశేషములేవియు నిషేధింపబడుటలేదని నిష్కర్షింపబడుచున్నది. 'సదేవ' ఇత్యాది శ్రుతివచనమునగల 'అగ్రే' అను శబ్దము సృష్టికి పూర్వమగు కాలమును బోధించుచున్నది. 'ఆసీత్' అను క్రియాపదముచే భూతకాల విశిష్టమగు సత్తారూపక్రియ (ఉండుటయను క్రియ) బోధింపబడుచున్నది, అంతియేగాక, పూర్వము చెప్పబడినట్లు 'ఏకమేవ 'అద్వితీయమ్' అను వాటిచే బ్రహ్మమున కుపాదానకారణత్వము, నిమిత్తకారణత్వములు బోధింపబడుచున్నవి. ఉపాదాన-నిమిత్తములకు అత్యన్త భేదమే కలదను తార్కికాదుల వాదమును నిరాకరించుటకై, రెండిటికిని భేదములేదని 'అనన్యత్వమును' (ఐక్యమును) బోధించుటద్వారా, బ్రహ్మమునకు సర్వజ్ఞత్వము, సర్వశక్తిసంపన్నత మున్నగు గుణములుకూడ సూచింపబడినవి. ఈ విధముగ ఈ ప్రదర్శించిన శ్రుతివచనములు అసంఖ్యాకములైన విశేషములనే బోధించుచున్నవితప్ప విశేష నిషేధము

నెంతమాత్రము కాదని స్పష్టపరుపబడినది.

## ॥ అసత్కార్యవాదనిరాకరణము ॥

మూ॥ యతో వాస్తవకార్యకారణభావాదిజ్ఞాపనే ప్రవృత్తమ్. అత ఏవ "అసదేవేదమగ్రఆసీత్" ఇత్యారభ్య అసత్కార్యవాద నిషేధశ్చక్రియతే; "కుతస్తుఖలు సోమ్యైవంస్యాత్", ప్రాగ సతః ఉత్పత్తిః అహేతుకా ఇత్యర్థః। తదేవఉపపాదయతి, "కథమసతః సజ్జాయేత" ఇతి, "అసతః ఉత్పన్నమ్ అసదాత్మకమేవభవతి" ఇత్యర్థః। యథామృద ఉత్పన్నం ఘటాదికం మృదాత్మకమ్। సత ఉత్పత్తిర్నామ వ్యవహార విశేష హేతుభూతః అవస్థావిశేషయోగః॥

అనువాదము:- ఏ కారణముగ నీ శ్రుతివచనము, యథార్థమైన కార్యకారణభావము మున్నగు విషయములను బోధించుటయందు ప్రవర్తించుచున్నదో, ఆ కారణముగనే - 'అసదేవ ఇదమగ్ర ఆసీత్' అని యారంభించి 'అసత్కార్యవాదము'నుకూడ నిషేధించుచున్నది. 'కుతః ఖలు సోమ్యైవంస్యాత్' (సోమ్యుడా! ఎట్లీవిధముగ నైనది?) అని, పూర్వము లేనివానికి-పుట్టుక-నిర్నిమిత్తము కదాయని (ప్రశ్నింపబడినది); ఈ ప్రశ్ననునే 'కథమసతః సజ్జాయేత' (ఎట్లుగ అసత్తునుండి (లేనివానినుండి) సత్తు (ఉనికిగల వస్తువు) పుట్టును?); అసత్తునుండి పుట్టినదికూడ అసత్తే యగునుగాని 'సత్తు'కాదు, అని యుపదేశించుట జరిగినది. మట్టినుండి పుట్టిన ఘటము మున్నగు వస్తుజాతము మృదాత్మకమే (మృద్వికారమే-మట్టియే) కదా! (అట్లే ఇదియు); సత్తునుండి పుట్టుటయనగా, విశేష వ్యవహారమునకు కారణమైన ఒకానొక అవస్థతో సంబంధించియుండుట. (జలాదులదెచ్చుట కుపయోగించు ఘటాదికముగా నుండుటయని తాత్పర్యము)

వివరణము: ప్రస్తుత శ్రుతివచనములు (అసద్వాఇదమగ్రఆసీద్

ఇత్యాది వచనములు) అసత్కార్యవాద నిరసనపురస్సరముగ సత్కార్య వాదమును సమర్థించుచున్నవని భగవద్రామానుజగ్రంథ తాత్పర్యము.

ఈ క్రిందివిషయములీ సందర్భమున గ్రహింపవలసియున్నవి. దర్శనకారులు కార్యకారణభావ విషయమున నాలుగురకములగు వాదములనేయుచున్నారు. ఈ వాదములు సర్వదర్శన సంగ్రహమున నీక్రిందివిధముగ సంక్షేపింపబడినవి. "కొందరు 'అసత్తు'నుండి 'సత్తు' పుట్టుచున్నదని చెప్పుచున్నారు. వీరు శూన్యవాదులైన బౌద్ధులు. నైయాయికులు మున్నగువారు సత్తునుండి అసత్తు పుట్టుచున్నదని చెప్పుదురు. అద్వైత వేదాన్తులు సత్పదార్థమునుండి 'వివర్త'రూపముగ కార్యజాతమేర్పడుచున్నదనియు, వాస్తవమునకు సత్తుకాని, మిథ్యారూపమైన వస్తువే పుట్టుచున్నదని చెప్పుదురు. సాంఖ్యులు సత్పదార్థము నుండి సత్పదార్థమే పుట్టుచున్నదని చెప్పుదురు."

ఈ నాలుగువాదముల సారము ప్రస్తుతమున గ్రహించుట అత్యవసరము కనుక ఇచ్చట సంగ్రహముగ నిర్దేశింపబడుచున్నది.

1. శూన్యవాదుల యసత్కార్యవాదము:

బౌద్ధులమతము ననుసరించి కారణము నశించిన తరువాత మాత్రమే కార్యముత్పన్నమగును. బీజము (విత్తనము) నశించిన తరువాతనేకదా అంకురము (మొలక) ఉత్పన్నమగునది! మృత్పిండము నశించిన తరువాతనేకదా ఘటాద్యుత్పత్తి! వీరిమతమున భావాత్మకములైన వస్తువులు క్షణికములు. కార్యమున్న క్షణమున కారణము, కారణమున్న క్షణమున కార్యము నుండవు. పూర్వక్షణమునకు చెందిన వస్తువు నశించిన తరువాతనే యుత్తర క్షణమునకు చెందిన వస్తువు పుట్టును. కనుక వినష్టమైన దానినుండి అనగా 'అసత్తు' నుండి విద్యమాన వస్తువు 'సత్తు' ఉత్పన్నమగుచున్నది. 'సత్' అను శబ్దమునకు సత్యము

నిత్యమునని యర్థముకాదు. క్షణమాత్రావస్థాయియని మాత్రమే అర్థము.

2. నైయాయికాదుల అసత్కార్యవాదము:

మట్టినుండి ఘటము పుట్టినదన్నప్పుడు పూర్వములేని ఘటమే యిప్పుడు పుట్టుచున్నది తప్ప, పూర్వమున్నదికాదు. కనుక పూర్వము లేని (అసత్) ఘటాదికము (కార్యము) పుట్టుచున్నది కావున నీ వాదము అసత్కార్యవాదము. దీనికి సంబంధించిన ఎనిమిది యుక్తులను చూపి, కారణముకంటె కార్యము అత్యన్త భిన్నమను వీరి వాదమును ప్రతిపాదించి భగవద్రామానుజులు శ్రీ భాష్యమున ఖండించియున్నారు.

3. సాంఖ్యుల సత్కార్యవాదము:

బౌద్ధులు చెప్పినట్లు అసత్తునుండి సత్తు పుట్టుచున్నదనుట కాని, నైయాయికులు చెప్పినట్లు పూర్వములేని ఘటాదులే పుట్టుచున్నవనుటగాని కుదరదు కనుక, సత్తునుండి సత్పదార్థమే పుట్టుచున్నదని సాంఖ్యులందురు. కారణరూపముగ ముందుండిన ఘటాదులే, మట్టినుండి కార్యరూపముగ ఆవిష్కరింపబడుచున్నవి. పాలలో–పెరుగు పూర్వమే ఉండి తరువాత వ్యక్తమగుచున్నది. కనుక సత్తే–కార్యమని చెప్పుదురు.

4. అద్వైత వేదాన్తిమతము:

వీరును సత్కార్యవాదమునే అంగీకరింతురు. కాని వీరి మతమున కారణముకంటె కార్యము వేరుకాదు. ఏలన–కారణముకంటె వేరైన కార్యము అవిద్యాకల్పితముకావున మిథ్య. బ్రహ్మముయొక్క వివర్తమై కార్యమైన జగత్తు మిథ్య. బ్రహ్మము (కారణము) మాత్రమే సత్యము.

వీరందరును 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' అను శ్రుతివచనమును వారివారి వాదముల కనుకూలముగ వ్యాఖ్యానింతురు. భగవద్రామానుజులు బౌద్ధ నైయాయికాదుల అసత్కార్యవాదమును నిరాకరించి సత్కార్యవాదమునే ఈ గ్రంథముచే నిరూపించుచున్నారు.

**మూ॥ ఏతదుక్తం భవతి। 'ఏకమేవ కారణభూతద్రవ్యమ్ అవస్థాం-**

తథ యోగేన కార్యమ్' ఇత్యుచ్యతే ఇతి, ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం ప్రతిపిపాదయిషితమ్। తత్ అసత్కార్యవాదేన సేత్స్యతి। తథాహి—నిమిత్త—సమవాయ్యసమవాయి—ప్రభృతిభిః కారణైః అవయవ్యాఖ్యం కార్యం ద్రవ్యాన్తరమేవ ఆరభ్యతే ఇతి, కారణభూతాద్వస్తునః కార్యస్య వస్త్వంతరత్వాత్, నతజ్జ్ఞానేన అస్య జ్ఞాతతా కథమపి సంభవతి ఇతి; కథమ్ అవయవి ద్రవ్యాన్తరం నిరస్యతే ఇతిచేత్

కారణగతావస్థాన్తర యోగస్యద్రవ్యాన్తరోత్పత్తివాదినః సంప్రతిపన్నస్యైవ ఏకత్వ—నామాన్తర—వ్యవహారాదేరుపపాదకత్వాత్, ద్రవ్యాన్తరాదర్శనాచ్చ ఇతి కారణమేవ అవస్థాన్తరాపన్నం కార్యమిత్యుచ్యతే ఇత్యుక్తమ్।

అనువాదము: ఇది (యిచ్చట) చెప్పబడినట్లగుచున్నది. ఒకే కారణరూపమగు వస్తువు, వేరొక యవస్థతోకూడి కార్యమగుచున్నదనియు (వాటిలో) ఒకటి తెలిసినప్పుడు-అన్నియు తెలిసినట్లగునని కదా ప్రతిపాదించదలచినది! అది (ఇట్లు ప్రతిపాదించుట) అసత్కార్యవాదము నంగీకరించినచో సాధింపబడదు. ఎట్లనగా—'నిమిత్త కారణములు, సమవాయికారణములు, అసమవాయికారణములు మున్నగువాటిచే అవయవములతోకూడిన వస్తువు పుట్టుచున్నది. కనుక అది (కారణముకంటె) వేరొక వస్తువేయగుచున్నది. కనుక కారణమైన వస్తువుకంటె, కార్యవస్తువు (కారణమునుండిపుట్టిన వస్తువు) వేరుగనేయుండును. కాన—(పరస్పరభిన్నములైన కారణ-కార్యములలో) కారణమును తెలిసినంత మాత్రమున కార్యము తెలిసినట్లగుననుట ఎంతమాత్రము కుదరదు. అవయవములతోకూడి కారణముకంటె వేరుగ కన్పట్టుచున్న వస్తువును (కారణముకంటె) వేరుకాదనుట ఎట్లుకుదురును?' అనికదా అసత్కార్యవాదము ఇట్లన్నచో—(ఇది సమాధానము) కారణముకంటె వేరుగ కార్యము పుట్టుచున్నదని వాదించు (వైశేషికులుమున్నగు) వారికి సమ్మతమైన

కారణమునకే—అవస్థాంతరసంబంధము (కారణముకంటె వేరైన అవస్థతో కూడియుండుట అనునది) కలదు కనుక, యిదియే (అవస్థాంతరముతో కూడియుండుటయే) కారణ కార్యములొక్కటేననియు, నామములు వేరుగ నున్నవనియు, వ్యవహారములుకూడ వేరుగనున్నవనియు నిరూపించుచున్నదికదా! కారణద్రవ్యమే (మృత్తు, దారములు మున్నగునవియే) కార్యముగ (ఘటము, వస్త్రము మున్నగునదిగ) అయినది కనుక వేరొకవస్తువు కనుపించుటలేదు. కనుక, కారణమే వేరొక అవస్థతోకూడి కార్యమైనదని చెప్పబడుచున్నది.

వివరణము: ఇచ్చట కారణకార్యములు రెండును అత్యన్త భిన్నములని నిరూపించు అసత్కార్యవాదులైన నైయాయికులమతము నిరాకరింపబడుచున్నది. 'తదనన్యత్వమ్ ఆరంభణ శబ్దాదిభ్యః' అను బ్రహ్మసూత్రభాష్యములలో భగవత్పాద శంకరులును, భగవద్రామానుజులును, కారణకార్యములొక్కటే [అనన్యములు] అని వారివారి మతములననుసరించి వ్యాఖ్యానించియున్నారు. నైయాయికులు, వైశేషికులు కారణము-కార్యము అను రెండును భిన్న భిన్నముగనున్నవికనుక అవి యొక్కటేనని యనుట కుదరదనియందురు. ఏదేనియొక వస్తువు పుట్టుటకు సమవాయికారణములు, అసమవాయి కారణములు, నిమిత్తకారణములునని మూడుండవలయునని వారు చెప్పుదురు. ఈ మూడిటివలన పుట్టిన వస్తువు, కారణముకంటె వేరుగనేయుండును (మట్టికంటె—కుండమున్నగునవి భిన్నములేకద్దా!) కనుక, కారణముకంటె కార్యము వేరుకాదను వేదాన్తులవాదము సరికాదని వారి యభిప్రాయము. ఈ అభిప్రాయమునే మూలమున 'తథాహి' అనియారంభించి 'ఇతిచేత్' అనునంతవరకు పూర్వపక్షముగ చూపించి భగవద్రామానుజులు 'కారణగతావస్థాంతర యోగస్య' ఇత్యాది వాక్యముచే ఖండించినారు. కారణమే—అవస్థాంతరమునుపొంది కార్యమైనదికనుక, మట్టికంటె వేరుగ ఘటాదులున్నను—అవియు, మట్టియే కనుక వేరుకావనియు, నైయాయికుల అసత్కార్యవాదము సంగీకరించి

కారణకార్యములు భిన్నములే అనియన్నచో 'ఏకవిజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి' (ఒకటి తెలిసిన అన్నియు తెలియునను) ఉపనిషద్వచనము కుదరకపోవలసివచ్చునని భగవద్రామానుజ తాత్పర్యము. అసత్కార్య వాదము ఉపక్రమవచనములకు విరుద్ధమని సారము.

మూ॥ నను నిరధిష్ఠాన భ్రమాసంభవజ్ఞాపనాయ అసత్ కార్యవాద నిరాసః క్రియతే। తథాహి—ఏకం చిద్రూపం సత్యమేవ అవిద్యాశబలం జగద్రూపేణ వివర్తతే ఇతి. అవిద్యాశ్రయ మూలకారణం సత్యమిత్యభ్యుపగన్తవ్యమ్ ఇతి అసత్ కార్య వాద నిరాసః॥

నైతదేవమ్। ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞా దృష్టాన్త ముఖేన సత్కార్యవాదస్యైవ ప్రసక్తత్వాత్ ఇత్యుక్తమ్। భవత్ పక్షే నిరధిష్ఠానభ్రమాసంభవస్య దురుపపాదత్వాచ్చ। యస్యహి చేతనగతోదోషః పారమార్థికః, దోషాశ్రయత్వంచ పారమార్థికం, పారమార్థికదోషేణయుక్తస్య, అపారమార్థిక -గంధర్వనగరాది దర్శన ముపపన్నమ్। యస్యతు దోషశ్చ అపారమార్థికః, దోషాశ్రయత్వంచ అపారమార్థికం, తస్య అపారమార్థికేనాపి ఆశ్రయేణ తదుపపన్నమితి భవత్పక్షే ననిరధిష్ఠాన భ్రమాసంభవః॥

అనువాదము:— "మరి, అధిష్ఠానము (ఆధారము) లేకుండగ 'భ్రమ' యెంతమాత్రము సంభవముకాదని తెలియజేయుటకే అసత్ కార్య వాదము నిరాకరింపబడుచున్నది. ఎట్లనగా—సత్యమైనదియు, ఒక్కటియునగు చైతన్యాత్మకబ్రహ్మమే అవిద్యచే (అజ్ఞానముచే) చుట్టువారినదై జగత్తుగా 'వివర్తము'ను పొందుచున్నది. ఈ అవిద్యకు ఆశ్రయమును కల్పించుటకై మూలకారణమైన బ్రహ్మము సత్యమేనని యంగీకరింపవలసియున్నది. కావున, 'అసత్తునుండి సత్తు పుట్టుచున్నదను' (బౌద్ధుల) అసత్కార్యవాదము నిరాకరింపబడుచున్నది." అని యన్న

చో, ఇది యుక్తముకాదు.

'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్' (ఒకటి తెలిసినచో అన్నియు తెలియును) అని ప్రతిజ్ఞచేయుట, మృద్దృష్టాన్తమును చూపుట అను వీటి ద్వారమున 'సత్కార్యవాదమే' ప్రసక్తమైనదని (కనుక అసత్ కార్యవాదము నిరాకరింపబడినదని) పూర్వమే చెప్పబడినది. (కావున నిరధిష్ఠానభ్రమమును నివారించుటకొరకు అసత్కార్యవాదనిరాకరణము కాదని తేలుచున్నది.)

మీ పక్షమున (శాంకరపక్షమున) 'అధిష్ఠానములేక భ్రమము కలుగదని నిరూపించుట సాధ్యముకాదుకదా! ఎవ్వని మతమున, చేతను డగు జీవునియందుగల దోషము (అవిద్య) వాస్తవమో, ఆ దోషమున కాతడు ఆశ్రయమైయుండుటకూడ వాస్తవమో, అట్టి వాస్తవమైన దోషముతో (అవిద్యతో) కూడినవానికి—అవాస్తవములైన గంధర్వనగరము మున్నగు (లేనివస్తువులు) కనుపించుట కుదురును. (కాని) ఎవ్వని మతమున దోషమగు 'అవిద్య' వాస్తవముకాదో, ఆ దోషమున కాశ్రయమై యుండుటకూడ వాస్తవముకాదో, అట్టివానికి అవాస్తవమైన ఆశ్రయముచే గూడ అవాస్తవమైన గంధర్వనగరాది వస్తువుల దర్శనము కుదురుటలో అనుపపత్తి (ఇబ్బంది) ఏమియులేదు. (అనగా ఎట్టి అధిష్ఠానము లేకయే 'భ్రమము' కలుగుటలో ఇబ్బందియేమియులేదు) కనుక మీమతము న 'నిరధిష్ఠాన భ్రమము' (ఎట్టి అధిష్ఠానము లేకయే భ్రమము) కుదరదను మాట చెల్లదు.

వివరణము:- 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' అను ఉపనిషద్వచనము బౌద్ధుల యసత్కార్యవాదమును నిరాకరించుచున్నదనియు, వారి మతమున అసత్తునుండి భ్రాన్తిరూపమైన జగత్తు పుట్టికన్పట్టుచున్నదని అంగీకరింపబడినదికనుక, ఎట్టి ఆశ్రయములేక శూన్యమును పురస్కరించుకొని భ్రాన్తికలుగుట సంభవముకాదని, పైయుపనిషద్వచనమువలన సిద్ధించు

చున్నదని భగవత్పాదశంకరులపక్షము. సర్వము మాయయనియు, మిథ్య యనియు వాదించు అద్వైతులమతమున అవిద్య, దానికాశ్రయమై యున్న వస్తువు, ఇవియన్నియు మిథ్యయేకనుక, వారిమతమున 'నిర ధిష్ఠానభ్రమము' కుదరదనువాదము చెల్లదనియు, ఇక జీవునకు వాస్తవ మైన అవిద్యాదోషమున్నదనియు, అదోషమునకాతడాశ్రయమైయుండుట కూడ సత్యమే అని అంగీకరించు భగవద్రామానుజులమతమున మాత్రమే నిరధిష్ఠానభ్రమము సంభవముకాదనియనుట కుదురుననియు ఈ గ్రంథ తాత్పర్యము. ఈ సందర్భమున మూలమున 'వివర్త'పదము ప్రయో గింపబడినది.

ఒకవస్తువునుండి వాస్తవముగ వేరొకవస్తువు ఆవిర్భవించుట (మృత్తునుండి ఘటాదులవలె) పరిణామమనబడును. ఒకవస్తువునుండి ఎంతమాత్రములేని వేరొకవస్తువు భాసించుట వివర్తము. రజ్జువునందు వాస్తవముగా లేని సర్పము భాసించుట వివర్తము.

యస్తాత్త్వికోఽన్యథాభావః పరిణామ ఉదీరితః।
అతాత్త్వికోఽన్యథాభావో వివర్తః స ఉదీరితః॥

అని వీటి లక్షణము. బ్రహ్మమందు జగత్తు వివర్తమని భగవత్పాద శంకరమతము. ఈ జగత్తు పరమాత్మయొక్క శక్తిపరిణామమని భగవద్రామానుజమతము.

మూ॥ శోధకవాక్యేష్వపి 'సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ' 'ఆనందో- బ్రహ్మ' ఇత్యాదిషు సామానాధికరణ్య వ్యుత్పత్తి సిద్ధానేక- గుణవిశిష్టైకార్థాభిధానమవిరుద్ధమితి, సర్వగుణ విశిష్టంబ్రహ్మ అభిధీయత ఇతి పూర్వమేవోక్తమ్। 'అథాత ఆదేశో నేతినేతి' ఇతి బహుధా నిషేధో దృశ్యత ఇతిచేత్, కిమత్ర నిషిధ్యత ఇతి వక్తవ్యమ్। 'ద్వేవావ బ్రహ్మణోరూపే మూర్తంచామూర్త- మేవచ' ఇతి మూర్తామూర్తాత్మకః ప్రపంచః సర్వోఽపి నిషి-

ధ్యత ఇతి చేత్, బ్రహ్మణో రూపతయా అప్రజ్ఞాతం సర్వం రూపతయా ఉపదిశ్య పునస్తదేవ నిషేద్ధుమయుక్తమ్। 'ప్రక్షాలనాద్ధి పంకస్య దూరాదస్పర్శనం వరమ్' ఇతి న్యాయాత్।

అనువాదము:- 'సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ' 'ఆనందో బ్రహ్మ' (ఆనందమే బ్రహ్మము) ఇత్యాద్యుపనిషద్వాక్యములందు (బ్రహ్మము జగత్కారణమనియన్నప్పుడు శంకింపబడుదోషమును నిరాకరించు 'శోధక' వాక్యములందు) ఆయాయిపదములకుగల సామానాధికరణ్యప్రక్రియ వలన సిద్ధించుచున్న అనేకగుణవిశిష్టమగు బ్రహ్మాత్మకమగు ఒకేవస్తువు చెప్పబడుట యెంతమాత్రము విరుద్ధముకాదు. కనుక సర్వవిధగుణముల తోకూడినదేయగు పరబ్రహ్మము బోధింపబడుచున్నదని పూర్వమే చెప్ప బడినది.

"మరి, 'అథాత ఆదేశో నేతినేతి' (ఇక, ఈకారణముచేతనే ఇది కాదు ఇదికాదు అని) (బృ. 4-3-6) ఈవిధముగా అనేకవిధముల నిషే ధము కన్పట్టుచున్నదికదా!" అన్నచో ఇక్కడనేమి నిషేధింపబడుచున్నదో చెప్పవలయును. "ద్వేవావబ్రహ్మణోరూపే మూర్తంచామూర్తమేవచ' (బ్రహ్మణః = పరమాత్మకు; మూర్తం = కంటికగుపించునదియు, అమూ ర్తమేవచ = కంటికగుపింపనిదియును, ద్వేవావ = రెండే; రూపే = రూప ములున్నవి.) 'పరబ్రహ్మమునకు కంటికగుపించెడిది, అగుపింపనిది యనిరెండే రూపములున్నవి' అనుచోటున నిర్దేశింపబడిన మూర్తము, అమూర్తముసైన ప్రపంచమంతయు నిషేధింపబడుచున్నది"—అని యన్నచో, బ్రహ్మమునకు రూపముగా పూర్వము తెలియని సమస్త ప్రపంచమును, రూపముగా నుపదేశించి, మరల దానినే నిషేధించుట యుక్తము కాదు. 'అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల'యనికదా లోక న్యాయము.

వివరణము:- ఇంతకుముందు ఏ శ్రుతివాక్యములు ఇతరులచే నిర్వి శేష వస్తుబోధకములని చెప్పబడినవో, ఆ వాక్యములు విశేషముల నిషే ధించునవి కావని నిరూపించిన తరువాత, ఈ వాక్యములు భేదమును నిర సించునవికూడ కావని నిరూపింపవలసియున్నది. మృద్ఘటాద్యాది ప్రతి పాదకములగు ఛాందోగ్యోపనిషత్తులోని సద్విద్యా ప్రకరణమందుగల వాక్యములెవ్వియు బ్రహ్మమందుగల విశేషముల (గుణాదుల) నిషేధించు నవికావని విస్తారముగ నిరూపింపబడినది. ఇప్పుడు శోధకవాక్యములలో కూడ (సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ, ఆనందో బ్రహ్మ ఇత్యాది వాక్యములలో కూడ) బ్రహ్మమందుగల విశేషముల నిషేధించు పదములేవియులేవని భగ వద్రామానుజులు నిరూపించినారు. సత్యం, జ్ఞానమ్, అనన్తం, ఆనందః ఇత్యాది తైత్తిరీయోపనిషద్వాక్యములలోని పదములు బ్రహ్మమందుగల విశేషములనిషేధించుట లేదనియు, సత్యజ్ఞానాది ధర్మములతోకూడిన పర బ్రహ్మమే బోధింపబడుచున్నదని భగవద్రామానుజుల యభిప్రాయము.

మూ॥ కస్తర్హి నిషేధవాక్యార్థః? సూత్రకారః స్వయమేవ వదతి। 'ప్రకృతైతావత్త్వంహి ప్రతిషేధతి, తతో బ్రవీతిచ భూయః' (బ్ర. 3-2-22) ఇతి। ఉత్తరత్ర-'అథనామధేయం, సత్యస్య సత్యమితి. ప్రాణావై సత్యమ్, తేషామేష సత్యమ్' (బృహ. 4-3-6) ఇత్యాదినా గుణగణస్య ప్రతిపాదితత్వాత్ పూర్వప్రకృతైతావన్మాత్రం న భవతి బ్రహ్మేతి, బ్రహ్మణ ఏతావన్మాత్రతా ప్రతిషిధ్యతే ఇతిసూత్రార్థః॥

'నేహనానాస్తి కించన' ఇత్యాదినా నానాత్వ ప్రతిషేధ ఏవదృశ్యత ఇతిచేత్, అత్రాపి ఉత్తరత్ర 'సర్వస్యవశీ సర్వస్యేశానః' ఇతి సత్యసంకల్పత్వ-సర్వేశ్వరత్వ ప్రతి- పాదనాత్. చేతనాచేతనవస్తు శరీరః ఈశ్వరఇతి. సర్వప్రకార సంస్థితః సర్వేశ్వరః సఏకఏవేతి, తత్ప్రత్యనీకా బ్రహ్మాత్మక

నానాత్వం ప్రతిషిద్ధం, న భవదభిమతమ్। సర్వాసు ఏవం ప్రకారాసు శ్రుతిషు ఇయమేవ స్థితిఃఇతి, న క్వచిదపి బ్రహ్మణః సవిశేషత్వ నిషేధవాచీ కోఽపిశబ్దో దృశ్యతే।

అనువాదము:- మరి, 'నేతి నేతి' (కాదు, కాదు) అను నిషేధమును బోధించు వాక్యముయొక్క అర్థమేమి? అన్నచో సూత్రకారుడగు బాదరాయణుడే స్వయముగ నిట్లుచెప్పుచున్నాడు. 'ప్రకృతైతావత్త్వం హి ప్రతిషేధతి, తతోబ్రవీతిచ భూయః' (బ్ర. సూ. 3-2-22) ముందుముందు (ఉపనిషత్తున) 'అథనామధేయం, సత్యస్యసత్యమితి, ప్రాణావై సత్యమ్, తేషామేషసత్యమ్' (బృ. 4-3-6) ఇత్యాది గ్రంథముచే గుణసముదాయమే ప్రతిపాదింపబడినదికదా! 'పూర్వము ప్రకృతములైన యింత మాత్రమే బ్రహ్మముకాద'ని బ్రహ్మమునకు ఏతావన్మాత్రత్వము (ఇంత మాత్రమే బ్రహ్మము అను పరిచ్ఛిన్నత్వము) నిషేధింపబడుచున్నదని సూత్రమున కర్థము. మరి, 'నేహనానాస్తి కించన' (ఇక్కడ భేదమెంత మాత్రములేదు) ఇత్యాది వచనములచే అనేకత్వరూపమైన భేదమే నిషేధింపబడుచున్నట్లు కన్పించుచున్నదికదా! అన్నచో (ఈ యుపనిషత్తునందే) ముందుముందు 'సర్వస్యవశీ సర్వస్యేశానః' (అంతటిని తన వశమందుంచుకొన్నవాడై సమస్తమునకు నియామకుడు) మున్నగు వాక్యములచే సత్యసంకల్పత్వము (మొక్కవోని సంకల్పము కలిగియుండుట) సర్వేశ్వరత్వము (అంతటికి నియామకుడైయుండుట) అనునవే ప్రతిపాదింపబడుచున్నవికదా! సమస్తమైన చేతనాచేతనాత్మకమైన (జీవజడాత్మకమైన) పదార్థజాతము శరీరముగా కలవాడు ఈశ్వరుడనియు, సమస్తప్రపంచము ప్రకారముగ (వేరుచేయరాని అంగముగ) కలిగియున్నవాడై సర్వేశ్వరుడు ఒక్కడేననియు, బ్రహ్మముకంటె వేరుగ బ్రహ్మాత్మకముకాని వివిధవస్తుజాతమేదియు లేదనిమాత్రమే నిషేధింపబడినదేకాని, మీకు సమ్మతమైన (నిర్విశేషబ్రహ్మవాదులకు సమ్మతమైన) భేదనిషేధమేదియు లేదు. ఇటువంటి శ్రుతులన్నిటియందును ఇదియేస్థితి.

కనుక ఎచ్చటను బ్రహ్మమునకుగల సవిశేషత్వమును (విశేషములతో కూడినది బ్రహ్మమనుటను) నిషేధించు శబ్దమొక్కటియు కన్పట్టుటలేదు.

వివరణము:- పైని పేర్కొనబడిన గ్రంథములోనుదాహరించిన వాక్యముల యర్థమిది.

1. 'ప్రకృతైతావత్త్వంహిప్రతిషేధతి, తతోబ్రవీతిచ భూయః' ఇది ఉభయలింగాధికరణములో (బ్రహ్మసూత్రములలో) గల సూత్రము. దీనిచే బ్రహ్మమునకు, మూర్తామూర్త రూపములులేవని నిషేధింపబడుచున్నవని భగవత్పాదశంకరుల వ్యాఖ్యానము. 'అథనేతినేతి' ఇత్యాది శ్రుతివాక్యమున రెండు నిషేధవాచకములు (న, న) అమనవికలవుకనుక వీటిచే బ్రహ్మము నిషేధింపబడుచున్నదా? లేక బ్రహ్మమునగల మూర్తామూర్త రూపములా? అని వికల్పించి, బ్రహ్మమును నిషేధించినచో శాస్త్రము వ్యర్థమగునుకనుక, బ్రహ్మమున మూర్తామూర్త రూపములు లేవనియే నిషేధింపబడుచున్నదని సూత్రార్థమును వారు వర్ణించిరి. బ్రహ్మమునకు ప్రకృతమున చెప్పబడిన ఏ గుణములున్నవో యింతమాత్రమే స్వరూపమనునది నిషేధించి, ఇంకను అధికముగగుణములున్నవని యీ సూత్రము ప్రతిపాదించుచున్నదనియు, బృహదారణ్యకమునగల 'నేతి నేతి' అనువాక్యముతరువాతగల 'నహ్యేతస్మాదితినేత్యన్యత్పరమస్తి, అథనామధేయం, సత్యస్యసత్యమితి, ప్రాణావైసత్యం తేషామేవ సత్యమ్' అనువాక్యము అధికగుణజాతమును ప్రతిపాదించుచున్నదనియు భగవద్రామానుజులు పైసూత్రమును వ్యాఖ్యానించిరి. సూత్రార్థమిది. బ్రహ్మణః = పరబ్రహ్మమునకు; ప్రకృతైతావత్త్వం = ప్రకృతములైన యేవిశేషములు చెప్పబడినవో వాటితోకూడి యింతమాత్రమే బ్రహ్మము అనుట; ప్రతిషేధతి = నేతినేతి ఇత్యాది శ్రుతివచనము నిషేధించుచున్నది; తతః = అటుపిమ్మట; భూయః = అధికముగా; బ్రవీతిచ = గుణజాతమును నొడువుచున్నది.

2. ఉపనిషద్వాక్యార్థమిది—ఇతినా = 'నేతినేత్యాత్మా' అనుచోటున గల 'ఇతి' అను శబ్దముచే నిర్దేశింపబడిన యేపరబ్రహ్మము కలదో, ఏత స్మాత్ = దానికంటె; అన్యత్ = ఇతరము; పరం = ఉత్కృష్టము; నహ్యస్తి = లేదుకదా। బ్రహ్మముకంటె గుణములబట్టి గొప్పదేదియులేదని తాత్పర్యము. ఇట్టి బ్రహ్మమునకు; సత్యస్య సత్యమ్ = సత్యమునకు కూడ సత్యమైనది (అని); నామధేయం = పేరు (నిర్వచనము); ప్రాణావై = జీవులే; సత్యమ్ = స్వరూపపరిణామములేక సత్యస్వరూపులే। తేషాం = వారందరిలో (వారికంటె); ఏషః = ఈ పరమాత్మ; సత్యమ్ = సత్యము.

3. నేహనానాస్తి కించన—ఇహ = ఇక్కడ, నానా = బ్రహ్మాత్మ కముకాని, వేరైనవస్తుజాతము, కించన = ఇసుమంతయైనను, నాస్తి = లేదు.

## ॥అవిద్యావిషయమున సప్తవిధానుపపత్తుల నిరూపించుట॥

మూ॥ అపిచ "నిర్విశేషజ్ఞానమాత్రంబ్రహ్మ; తచ్చ ఆచ్ఛాదికా- విద్యాతిరోహితస్వరూపం, స్వగతనానాత్వం పశ్యతి" ఇత్య- యమర్థోనఘటతే।

తిరోధానంనామ ప్రకాశనివారణమ్। స్వరూపాతిరేకి- ప్రకాశధర్మానభ్యుపగమేన, ప్రకాశస్యైవ స్వరూపత్వాత్ స్వరూపనాశఏవస్యాత్। ప్రకాశపర్యాయం జ్ఞానం నిత్యం, నచప్రకాశః అవిద్యాతిరోహితఇతి బాలిశభాషితమిదమ్। అవిద్యయా ప్రకాశస్తిరోహితఇతి ప్రకాశస్య అనుత్పాద్య- త్వాత్ స్వరూపనాశఏవస్యాత్। ప్రకాశః నిత్యోనిర్వికార- స్తిష్ఠతి ఇతిచేత్, సత్యామప్యవిద్యాయాం బ్రహ్మణిన కించిత్ తిరోహితమితి, నానాత్వంపశ్యతి ఇతి భవతామయం వ్యవ-

హారః సత్సు అనిర్వచనీయః ఏవ।

అనువాదము:- మరియు, 'ఎట్టి విశేషములులేని జ్ఞానముమాత్రమే స్వరూపముగాగల బ్రహ్మము, తనను ఆవరించిన అవిద్యచే కప్పబడి తెలియరాని స్వరూపము కలదియై, తనయందే తాను భేదమును దర్శించు చున్నది' అనునీవిషయము కుదరదు. తిరోధానము (కప్పబడి తెలియ రాకుండుట) అనగా ప్రకాశము నివారింపబడుటయే. బ్రహ్మమునకు స్వరూపముకంటె వేరుగ 'ప్రకాశము'ను ధర్మమేదియు అంగీకరింపబడ లేదు కనుక, ప్రకాశమే బ్రహ్మమునకు స్వరూపము. కావున (ప్రకాశము తిరోహితమైనది అన్నప్పుడు) స్వరూపనాశమే కలుగవలసివచ్చును. ప్రకాశమనగా జ్ఞానమేకనుక, జ్ఞానరూపమైన ప్రకాశము అవిద్యచే కప్పబడిన దన్నచో, ఇది అజ్ఞుడు పలికిన మాటయగును. అవిద్యచే 'ప్రకాశము' తిరోహితమైనది (కప్పబడినది) అన్నచో, ప్రకాశము (జ్ఞానము) పుట్టునది కాదు కావున దానికి స్వరూపనాశమేర్పడినదనియే అనవలసివచ్చును. మరి, ప్రకాశము—నిత్యము, నిర్వికారము నై యుండునని యందురా? అట్లైనచో, అవిద్యయున్నప్పటికిని, నిత్యప్రకాశమగు బ్రహ్మమందు కప్పబడినయంశమేదియులేదు కనుక, అట్టి బ్రహ్మము నానాత్వమును (ప్రపంచరూపమగు భేదమును) చూచుచున్నదను మీ వ్యవహారము సజ్జనులలో 'అనిర్వచనీయమే' (నిర్వచింపరానిదే) యగునుకదా! (ఇట్టిదని వివరించుటకు కుదరనిదే యగునని తాత్పర్యము)

వివరణము:- ఇచ్చటినుండి ప్రారంభించి భగవద్రామానుజులు భగవత్పాదశంకరులచే నిరూపింపబడిన 'అవిద్య'యను విషయమున ఏడు విధములగు అనుపపత్తులను (దోషములను) చూపుచున్నారు. ఈ ఘట్టము వారి శ్రీభాష్యమునగల జిజ్ఞాసాధికరణమున చాల విస్తారముగ బహువిధ యుక్తులతో నిరూపింపబడినది. ఈ ముందు నిరూపింపబోవు మూల గ్రంథము స్పష్టపడుటకై ఆయేడు అనుపపత్తులనిచ్చట సంగ్రహించి చూపుట జరుగుచున్నది.

'ఆశ్రయోఽస్యాస్తిరోధిః, స్వరూపం, సదసదన్యతా।
మానం, నివర్తకంచైవ, నివృత్తిర్నోపపద్యతే॥

(1) ఆశ్రయానుపపత్తి:- అవిద్య జీవు నాశ్రయించియున్నదా? లేక బ్రహ్మమునా? అని వికల్పించి 'ఆశ్రయము' కుదరదనుట.

(2) తిరోధానానానుపపత్తి:- అవిద్య, ప్రకాశస్వరూపమగు పర బ్రహ్మమును కప్పిపుచ్చుననునది కుదరదనుట.

(3) స్వరూపానుపపత్తి:- అవిద్యయను దోషము, పరమార్థమా? (వాస్తవమా?) అపరమార్థమా? పరమార్థమన్నచో బ్రహ్మముకంటె భిన్నమా? బ్రహ్మ స్వరూపమా? బ్రహ్మముకంటె భిన్నమన్నచో-దృగ్రూపమా? ద్రష్టయా? లేక దృశ్యమా? ఇవియేవియు కుదరవనుట.

(4) అవిద్య-సత్తుకాదు-అసత్తుకాదు ఈ రెండింటికంటె భిన్నమై అనిర్వచనీయము. ఇట్లనుట కుదరదని నిరూపించుట 'అనిర్వచనీయాను పపత్తి.'

(5) ప్రమాణానుపపత్తి:- అవిద్య - ప్రత్యక్షాది ప్రమాణములచే సిద్ధింపదనుట.

(6) ఇట్టి అవిద్యను నిర్విశేషచిన్మాత్రమగు బ్రహ్మముయొక్క జ్ఞానమే పోగొట్టును అనునది కుదరదనుట 'నివర్తకానుపపత్తి.'

(7) బ్రహ్మాత్మైకత్వ జ్ఞానముచేతనే (బ్రహ్మము-ఆత్మ ఒక్కటేనను జ్ఞానముచేతనే) అవిద్యానివృత్తి (అవిద్య తొలగుట) అనునది కుదరదనుట నివృత్త్యనుపపత్తి. ఈ సప్తవిధ దోషములే ఇప్పటినుండి ముందుముందు గ్రంథమున భగవద్రామానుజులచే నిరూపింపబడుచున్నవి.

ఇచ్చట అవిద్యచే బ్రహ్మము తిరోహితమైనదనుట కుదరదని చెప్పుటచే బ్రహ్మము అవిద్య కాశ్రయము కాదని చెప్పినట్లైనది కనుక 'ఆశ్రయానుపపత్తి' అను మొదటి దోషము సూచింపబడినది.

మూ॥ నను చ భవతోఽపి విజ్ఞానస్వరూప ఆత్మా అభ్యుపగంతవ్యః. సచ స్వయంప్రకాశః। తస్య దేవాది స్వరూపాత్మాభిమానే స్వరూపప్రకాశతిరోధానమవశ్యాశ్రయణీయమ్। స్వరూపప్రకాశేసతి స్వాత్మని ఆకారాన్తరాధ్యాసాఽయోగాత్। అతో భవతశ్చ సమానోఽయందోషః। కించ అస్మాకమేకస్మిన్నేవ ఆత్మని భవదుదీరితం దుర్ఘటమ్, భవతామ్ ఆత్మానన్త్యాఽభ్యుపగమాత్ సర్వేష్వయం దోషః పరిహరణీయః।

అత్రోచ్యతే।

స్వభావతః మలప్రత్యనీకానన్తజ్ఞానానందైకస్వరూపం. స్వాభావికానతిశయాపరిమితోదారగుణసాగరం. నిమేష-కాష్ఠా-కలా-ముహూర్తాది-పరార్థపర్యన్తాపరిమితవ్యవచ్ఛేద-స్వరూప-సర్వోత్పత్తిస్థితివినాశాది-సర్వపరిణామనిమిత్తభూత కాలకృతపరిణామాస్పృష్ట-"అనంతమహావిభూతి", స్వలీలా పరికరస్వాంశభూతానన్త-బద్ధ-ముక్త-నానావిధచేతన-తద్భోగ్యానన్తవిచిత్రపరిణామశక్తిచేతనేతరవస్తుజాతాన్తర్యామిత్వ-కృత-సర్వశరీరత్వ-సర్వప్రకారావస్థానావస్థితమ్, పరం-బ్రహ్మ చ వేద్యం, తత్సాక్షాత్కారక్షమ-భగవద్ద్వైపాయన-పరాశర-వాల్మీకి-మను-యాజ్ఞవల్క్య-గౌతమాపస్తంబ ప్రభృతి-మునిగణప్రణీత-విధ్యర్థవాదమంత్రరూప-వేదమూలేతిహాసపురాణ-ధర్మశాస్త్రోపబృంహిత-పరమార్థభూతానాది నిధనావిచ్ఛిన్నసంప్రదాయ-ఋగ్యజుస్సామాథర్వ-రూపానన్తశాఖం వేదం చ అభ్యుపగచ్ఛతామస్మాకం కిం న సేత్స్యతి?

అనువాదము:- ఓయీ! మీ మతమునకూడ (భగవద్రామానుజ మతమునకూడ) ఆత్మ-విజ్ఞానమే స్వరూపముగా కలదని యంగీకరింప వలసియున్నది. ఆ విజ్ఞాన స్వరూపమగు ఆత్మ-స్వయంప్రకాశము.

(తనంత తాను, తనకొరకు ప్రకాశించునది.) దానికి దేవతలు మున్నగు ( దేవతలు, మనుష్యులు, పశుపక్షులు, వృక్షములు, పర్వతములు మున్నగు) దేహములయందు, ఆత్మాభిమానము కలిగినప్పుడు (ఈ దేహమే ఆత్మ అను తాదాత్మ్యబుద్ధి కలిగినప్పుడు) (ఆత్మయొక్క) విజ్ఞాన స్వరూపమునకు 'తిరోధానము' (కప్పబడుట అనునది) ఏర్పడినదని తప్పక ఆశ్రయింపవలసినదే కదా! తనంత తాను స్వయముగా తన ఆత్మ స్వరూపము ప్రకాశించుచుండగా, వేరొక ఆకారమును ఆరోపించుట కుదరదు కదా! కావున మీ మతమునకూడ (భగవద్రామానుజమతమునకూడ) 'ప్రకాశ తిరోధానము' (ఆత్మకు స్వరూపమైన జ్ఞానముయొక్క ప్రకాశము కప్పబడుట) అను దోషము సమానముగనే ఉన్నదికదా! మరియు, మా మతమున (ఆత్మ ఒక్కటేనని అంగీకరించిన శాంకరమతమున) ఆత్మ ఒక్కటే కనుక, ఒక ఆత్మయందు మాత్రమే మీరు చెప్పిన దోషము ఉండును. మరి, మీకో-ఆత్మలు అనంతములని కదా అభిమతము! అప్పుడు-ఆత్మలన్నింటియందును – ఆత్మలకు స్వరూపమైన జ్ఞానముల యొక్క ప్రకాశము (ప్రసారము) తిరోహితమగుట (కప్పబడుట) అను దోషము కలుగుచున్నదికదా! (కనుక) ఈ దోషమును, మీరుకూడ తొల గించుకొనవలసినదే! (ఇది పూర్వపక్షము)

దీనికి ఇక్కడ సమాధానము చెప్పబడుచున్నది. 'మాకు పర మాత్మ (పరబ్రహ్మము) వేద్యుడు (తెలియదగినవాడు) ఆయన ఎట్టివాడు? అన్నచో—స్వభావముచేతనే సకల దోషములకు విరుద్ధములై అపరిచ్ఛిన్నములైన (ఇంత అని కొలుచుటకు వీలుకాని) జ్ఞానానందములే స్వరూపముగా కలవాడు. సహజముగనే అంతులేని అతిశయముతో (మహత్త్వముతో) కూడిన లెక్కింప వీలుకాని ఉదారములైన గుణములకు సముద్రమువలె స్థానమైనవాడు. నిమేషము (రెప్పపాటు కాలము) కాష్ఠ (పదిహేను నిమేషములు) కళ (ముప్పది కాష్ఠములు) ముహూర్తము (ముప్పది కళలు) మొదలు, పరార్థము (చిట్టచివరి సంఖ్య) వరకుగల అనంతము

లైన విభాగములు స్వరూపముగా కలిగి, ప్రపంచముయొక్క పుట్టుక-ఉనికి-లయము మున్నగు సమస్త పరిణామములకు (మార్పులకు) కారణమైన, యే కాలమున్నదో—అట్టి కాలముచే కల్పింపబడిన పరిణామము తింతమాత్రము అంటక—'మహావిభూతి'యని వ్యవహరింపబడువాడు. తన లీలకు సాధనములుగా, తనకు అంశములుగా అమరియున్న అసంఖ్యాకులగు (లెక్కకుమించిన) బద్ధులు (సంసారబంధము కలవారు) ముక్తులు (మోక్షమును పొందినవారు) మున్నగు చేతనులగు జీవులలో అంతర్యామిగా ప్రవేశించియున్నవాడు. మరియు, ఈ జీవులందరికి భోగస్థానముగా అపారమైన పరిణామశక్తితోకూడిన యే వస్తుసముదాయమున్నదో దానిలోకూడ 'అంతర్యామి'గా ప్రవేశించియున్నవాడు. (ఈ కారణముగ) ఇవియన్నియు (అనంతసంఖ్యగల జీవులు—వారికి భోగస్థానమైన వస్తుసముదాయములును) 'శరీరము'గా కల్గినవాడై-విభిన్న స్వరూప-స్వభావములుకల ఆకృతులతో కూడినవాడు. ఇట్టి యీ పరబ్రహ్మమును ప్రతిపాదించునది ఋక్-యజుస్-సామ-అధర్వణములను పేరులతో అనంతములైనశాఖలుగల వేదము. ఈ వేదము, ఆద్యంతములులేని అవిచ్ఛిన్న సంప్రదాయము (తెగిపోని సంప్రదాయము)కలది. మరియు, పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొన్న భగవంతులగు-కృష్ణద్వైపాయనుడు, పరాశరుడు (వ్యాసుని తండ్రి), వాల్మీకి, మనువు, యాజ్ఞవల్క్యుడు, గౌతముడు, ఆపస్తంబుడు మున్నగు ఋషులయొక్క బృందములచే రచింపబడి, విధులు, అర్థవాదములు, మంత్రములు అనువాటిని (వేదభాగములను) మూలముగాజేసికొని ఆవిర్భవించిన ఇతిహాసములచేతను (రామాయణ-భారతములచేతను) పురాణములచేతను (విష్ణుపురాణము మున్నగువాటిచేతను) ధర్మశాస్త్రములచేతను ఉపబృంహితమై (వివరింపబడి) యథార్థమైనది. (సత్యమైనది). ఇట్టి పరబ్రహ్మ

మును—ఇట్టి సత్యమగు వేదమును (ప్రమాణముగ) అంగీకరించిన మాకు సిద్ధింపనిదేముండును?

వివరణము:- 'విధి' అనగా ఇది చేయవలయునని నియమించు వేదవాక్యము. మంత్రములనగా యాగాది ప్రయోగములందలి యర్థములను స్మరింపజేయు వేదవాక్యములు.

'అర్థవాదము' అనగా-స్తుతిని, లేక నిందను బోధించు వేదవాక్యము. 'ఉపబృంహణ'మనగా తాము అధ్యయనముచేసిన వేదశాఖల యందలి అర్థములచే, అధ్యయనముచేసియుండని శాఖలలోని అర్థములను వివరించుట. ఇతిహాసపురాణాదులచే వేదార్థమును వివరింపవలయునని సంప్రదాయము. 'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్' అని ప్రమాణము. ఇతిహాస పురాణ ధర్మశాస్త్రములను రచించినవారు మహర్షులు కనుక—వేదములవలె వారి అనుభవముకూడ సత్యమే తప్ప 'మిథ్య' కాదని అభిప్రాయము. కనుక మాకు సత్యమైన వేదాత్మక ప్రమాణమున్నదని తాత్పర్యము.

మూ॥ యథోక్తం—భగవతాద్వైపాయనేన మహాభారతే—

[శ్రీగీత 10-3]

శ్లో॥ 'యో మామజ మనాదించ, సర్వలోకమహేశ్వరమ్।'
'ద్వావిమౌ పురుషౌలోకే క్షరశ్చాక్షర ఏవచ।
క్షరఃసర్వాణి భూతాని కూట స్థోఽక్షర ఉచ్యతే॥
ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః।
యోలోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః॥'

[శ్రీగీత 15-16]

"కాలం స పచతే తత్ర నకాలస్తత్రవైప్రభుః।
ఏతే వై నిరయాస్తాత! స్థానస్య పరమాత్మనః॥

అవ్యక్తాదివిశేషాన్తం పరిణామర్ధి సంయుతమ్।
క్రీడా హరేరిదం సర్వం క్షర ఇత్యవధార్యతామ్॥"
[భార. మోక్షధర్మ. 25-9]

"కృష్ణ ఏవహిలోకానా ముత్పత్తిరపిచాప్యయః।
కృష్ణస్యహికృతే భూతమిదం విశ్వం చరాచరమ్॥" ఇతి।
[భా. సభా. 38-23]

కృష్ణస్య హికృతే ఇతి। కృష్ణస్య శేషభూతమిత్యర్థః॥

అనువాదము:- భగవానుడగు కృష్ణద్వైపాయనుడు—మహాభారతమున నిట్లు చెప్పినాడు.

'అజుడును (పుట్టుక లేనివాడును, వికారాస్పదమైన అచేతనమగు జడప్రపంచముకంటెను, దానియందున్న చేతనుడగు జీవునికంటెను భిన్నుడును); అనాదియు (ఆది కలిగిన ముక్తులైన జీవులకంటె భిన్నుడును) సర్వలోకములకు మహేశ్వరుడును అయిన నన్ను, ఎవ్వడు మోహములేనివాడై తెలిసికొనునో, వాడు సర్వపాపములనుండి విముక్తుడగును' (శ్రీగీత-10-3)

'క్షరుడును-అక్షరుడును అని ఇద్దరు పురుషులు లోకమున ప్రసిద్ధులు. చతుర్ముఖబ్రహ్మ మొదలు—స్తంబము (దుబ్బు)వరకుగల నశించు స్వభావముగల జడప్రకృతితోకూడిన సర్వభూతములును క్షరశబ్దముచే చెప్పబడును. అక్షరుడనగా జడమైన ప్రకృతితో సంబంధములేని వికారరహితుడగు ముక్తజీవుడు.'

'ఈ క్షరాక్షర పురుషులకంటె (బద్ధ-ముక్తజీవులకంటె) భిన్నుడును, సర్వోత్తముడును అయిన ఏ పురుషుడుకలడో ఆతడే పరమాత్మయని చెప్పబడుచున్నాడు. ఈ పురుషోత్తముడగు పరమాత్మయే లోకత్రయమును (జడప్రకృతి-బద్ధజీవులు, ముక్తజీవులు అను మూడిటిని) అంత

ర్యామిగా ప్రవేశించి, భరించుచు, నాశసంబంధమెంత మాత్రము లేని వాడును, సర్వనియామకుడును అయి ఉన్నాడు'. (శ్రీగీత 15-17)

(ఇంతవరకు చిత్-అచిత్ అను రెండిటికంటెను వేరైన పరమాత్మ-వాటిలో ప్రవేశించియుండి భరించుచు, స్వామియైయున్నాడని చెప్పబడినది.)

'ఆ భగవానుడు కాలమును పరిణమింపజేయుచున్నాడు. కాని ఆ కాలము ఆయనకు అధీనమైయుండి ఆయనను స్పృశింపజాలదు. నాయనా! ఈలోకములన్నియు పరమాత్మయొక్క పరమపదస్థానమును బట్టి (పోల్చి) చూచినప్పుడు దుఃఖభాజనములగు నరకములే యగుచున్నవి.' (నిత్యమగు సుఖముతోకూడి, కాలపరిణామములకు లొంగనిది-పరమపదము లేదా శ్రీవైకుంఠమని భావము) (మహాభారతము-మోక్షధర్మము—25-9)

'అవ్యక్తము మొదలు (మూలప్రకృతి మొదలు) సృష్టిలోని ప్రతి విశేషవస్తువు వరకునుగల 'సమస్తము' పరిణామము చెందుట, వృద్ధి చెందుట అను వికారములకులోనై ఉన్నది. ఇదియంతయు శ్రీమన్నారాయణుని క్రీడాపరికరము (ఆటవస్తువు), క్షరము (నాశనశీలము) అని తెలియదగియున్నది. (మోక్షధర్మము—25-10)

'భగవానుడగు కృష్ణుడే సమస్తలోకముల పుట్టుకకు, లయమునకు కారణము. కృష్ణునికొరకే ఈ సమస్త చరాచరప్రపంచము ఏర్పడినది.' (భార. సభా. 38-23)

ఇక్కడ 'కృష్ణస్యకృతే' 'కృష్ణునికొరకు' అనియనుటచే కృష్ణునకు (పరమాత్మకు) 'శేషము' (ఆయనకు పరతంత్రమై-ఆయనకే అతిశయమును తెచ్చునది) అనియర్థము.

**మూ॥ భగవతా పరాశరేణాప్యుక్తమ్—**

"శుద్ధే మహావిభూత్యాఖ్యే పరే బ్రహ్మణి శబ్ద్యతే।
మైత్రేయ! భగవచ్ఛబ్దః సర్వకారణ కారణే॥

జ్ఞానశక్తిబలైశ్వర్య వీర్యతేజాంస్యశేషతః।
భగవచ్ఛబ్దవాచ్యాని వినా హేయైర్గుణాదిభిః॥

ఏవమేష మహాశబ్దో మైత్రేయ భగవానితి।
పరమబ్రహ్మభూతస్య వాసుదేవస్య నాన్యగః॥

తత్ర పూజ్య పదార్థోక్తి పరిభాషా సమన్వితః।
శబ్దోఽయం నోపచారేణ త్వన్యత్ర హ్యుపచారతః॥

ఏవం ప్రకారమమలం నిత్యంవ్యాపకమక్షయం
సమస్త హేయరహితం విష్ణ్వాఖ్యం పరమంపదమ్॥

కలాముహూర్తాదిమయశ్చ కాలో
న యద్విభూతేః పరిణామ హేతుః।
క్రీడతో బాలకస్యేవ చేష్టాం తస్య నిశామయ॥ ఇత్యాది।

అనువాదము:- భగవానుడగు పరాశరునిచేగూడ నిట్లుచెప్పబడినది. 'ఓ మైత్రేయుడా! సర్వకారణములకు కారణమైనవాడును, విశుద్ధమగు 'మహావిభూతి'యని పిలువదగిన పరబ్రహ్మస్వరూపుడగు శ్రీమన్నారాయణునియందే 'భగవాన్'అనుశబ్దము వ్యవహరింపబడుచున్నది.'

'జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజస్సు, అను-ఈ యారుగుణములును-నింద్యములగు గుణములను విడచి భగవచ్ఛబ్దముచే పేర్కొనదగియున్నవి.'

'ఈవిధముగ, ఓ మైత్రేయుడా! భగవానుడను నీ మహాశబ్దము పరబ్రహ్మస్వరూపుడగు 'వాసుదేవు'నియందుతప్ప వేరొకనియందు ప్రవర్తించునది కాదు' (వేరొకరిని బోధించునదికాదని యభిప్రాయము)

'వాసుదేవుని యందుమాత్రమే-'పూజింపదగినవాడు' అనువ్యుత్పత్తి (నిర్వచనము)కల భగవచ్ఛబ్దము ముఖ్యముగ ప్రయోగింపబడుచున్నది. ఇతరత్ర (వేరువ్యక్తులయందు) ఔపచారికముగ (కొన్ని ధర్మముల నారోపించుటద్వారా) భగవచ్ఛబ్దము వ్యవహరింపబడుచున్నది.' [భగవచ్ఛబ్దముయొక్క నిర్వచనమును, 31, 32వ పేజీలలో చూడుడు]

'ఇట్టి నిర్మలమును, నిత్యమును [కాలపరిచ్ఛేదము లేనిదియును] అంతట వ్యాపించియున్నదియును, నాశరహితమును, సమస్త హేయ గుణములు [నిందింపదగు గుణములు] లేనిదియు అగునది విష్ణువని పిలువబడు పరమపదము.'

'కళ-ముహూర్తము-మున్నగు స్వరూపములుకల కాలము, ఏ భగవానుని మహావిభూతికి పరిణామమును కలిగింపలేదో, అట్టి పరిణామ శీలమగు [మార్పుచెందునట్టి స్వభావముకల] కాలము ఆడుకొను బాలునకువలె ఆ భగవానునకొక చేష్టామాత్రమేనని యెరుగుము.' [విష్ణు.పు.]

మూ॥ మనునాఽపి-"ప్రశాసితారం సర్వేషామణీయాంస మణీయసామ్" ఇత్యాద్యుక్తమ్. యాజ్ఞవల్క్యేనాపి "క్షేత్రజ్ఞస్యేశ్వరజ్ఞానా ద్విశుద్ధిః పరమామతా" ఇత్యాది। ఆపస్తంబేనాఽపి — "పూఃప్రాణినస్సర్వగుహాశయస్య।" ఇతి। సర్వే ప్రాణినః, గుహాశయస్య పరమాత్మనః, పూః=పురం=శరీర మిత్యర్థః। ప్రాణిన ఇతి జీవాత్మకభూతసంఘాతాః॥

అనువాదము:- మనువుచేగూడ-

'సమస్తమైన జీవ-జడాత్మక ప్రపంచమునకును, నియామకుడైన వాడును, అణువులకంటెగూడ అణువైనవాడును, అయిన పరమాత్మను....' ఇత్యాదిగ చెప్పబడినది.

యాజ్ఞవల్క్యునిచే—'ఈ జీవునకు పరమాత్మయొక్క జ్ఞానముచేతనే సర్వోత్కృష్టమగు పరిశుద్ధి ఏర్పడుచున్నది' అని చెప్పబడినది.

ఆపస్తంబునిచేకూడ—'ఆపరమాత్మకు ఈ జీవవిశిష్టమగు భూత సముదాయములు పురము.'

సర్వేప్రాణినః = ప్రాణులందరును, గుహాశయస్య—పరమాత్మనః = హృదయమను గుహలో నివసించియుండెడు పరమాత్మకు, పూః = పురము [అనగా] శరీరమని యర్థము. ప్రాణినఃఇతి = ప్రాణులనగా, జీవుడు ఆత్మగా కలిగిన [పృథివి–జలము మున్నగు] భూతములయొక్క సముదాయములు. [జీవతత్త్వముతోకూడిన పృథివ్యాది వికారములన్నియు అనగా పదార్థములన్నియు పరమాత్మకు శరీరమని యభిప్రాయము]

మూ॥ "ననుచ కిమనేన ఆడంబరేణ? చోద్యం తు నపరిహృతమ్।" ఉచ్యతే—"ఏవమభ్యుపగచ్ఛతా మస్మాకమ్, ఆత్మధర్మభూతస్య చైతన్యస్య స్వాభావికస్యాఽపి కర్మణా, పారమార్థికం సంకోచం వికాసంచ బ్రువతాం, సర్వమిదం పరిహృతమ్। భవతస్తు ప్రకాశ ఏవ స్వరూపమితి ప్రకాశో న ధర్మభూతః, తస్య సంకోచో వికాసోవా నాభ్యుప గమ్యతే। ప్రకాశప్రసారానుత్పత్తి మేవ తిరోధానభూతాః, కర్మాదయః కుర్వన్తి। అవిద్యాచేత్ తిరోధానం. తిరోధానభూతయా తయా, స్వరూపభూతప్రకాశనాశః పూర్వమేవోక్తః. అస్మాకం తు అవిద్యారూపేణ కర్మణా స్వరూప నిత్యధర్మభూతజ్ఞానప్రకాశః సంకుచితః, తేన దేవాదిరూపాత్మాభిమానో భవతీతి విశేషః

యథోక్తమ్ —

అవిద్యాకర్మసంజ్ఞాన్యా తృతీయాశక్తిరిష్యతే।
యయాక్షేత్రజ్ఞశక్తిస్సా వేష్టితానృపసర్వగా।
సంసారతాపానఖిలాన్ అవాప్నోత్యతి సంతతాన్॥

తయాతిరోహితత్వాచ్చశక్తిః క్షేత్రజ్ఞసంజ్ఞితా।
సర్వభూతేషుభూపాల। తారతమ్యేనవర్తతే॥

క్షేత్రజ్ఞానాం స్వధర్మభూతజ్ఞానస్య కర్మసంజ్ఞయా అవిద్యయా సంకోచం వికాసం చ దర్శయతి।

అనువాదము:- 'ఈ మాటల యాటోపముచే ప్రయోజనమేమున్నది? మేముచూపిన శంక—పరిహరింపబడలేదుకదా!' అన్నచో చెప్పుచున్నాము. పూర్వము చెప్పబడినట్లు [పరమాత్మను, తత్ప్రతిపాదకమైన పురాణేతిహాసాదులచే ఉపబృంహితమై [నిర్వచింపబడినదై] యథార్థమైన వేదమును ప్రమాణముగా] అంగీకరించుచు, ఆత్మకు ధర్మమైన చైతన్యము [జ్ఞానము] స్వభావసిద్ధమైనదైనప్పటికిని, దానికి [చైతన్యమునకు] కర్మముచే వాస్తవముగనే సంకోచము, వికాసము కలుగుచున్నదని నొడువుచున్న మాకు, మీరు చూపినదంతయు [దోషమంతయు] పరిహరింపబడినది. [సమాధానింపబడినది] [ఇక] మీకు మాత్రము 'ప్రకాశమే' [జ్ఞానమే] ఆత్మకు స్వరూపము కనుక, 'ప్రకాశము' ధర్మముకాదు కనుక దానికి సంకోచముకాని, వికాసముగాని అంగీకరింపబడుటలేదుకదా! తిరోధానముగా [పైని కప్పుగా] నున్న కర్మము మున్నగునవి [ఆత్మస్వరూపమైన] ప్రకాశముయొక్క ప్రసారమును కలుగకుండగ మాత్రమే చేయుచున్నవి. అవిద్యయే 'ప్రకాశము'ను కప్పిపుచ్చుచున్నదని అంగీకరించినప్పుడు, తిరోధానమును [కప్పిపుచ్చుటను] కల్గించునట్టి ఆ యవిద్యచే, ఆత్మకుస్వరూపమైన ప్రకాశము [జ్ఞానము]నకు నాశనమే కల్గుచున్నదని పూర్వమే చెప్పియుంటిమి. మా మతమున అవిద్యారూపమగు కర్మముచే, ఆత్మస్వరూపమునాశ్రయించియుండి నిత్యమైయున్న జ్ఞానమను ధర్మముయొక్క ప్రకాశము [ప్రసారము] మాత్రమే సంకోచమును, వికాసమును పొందినది, దానిచే [ఇట్టి జ్ఞానధర్మముయొక్క సంకోచవికాసములచే] దేవతలు, నరులు మున్నగు దేహములయందు ఆత్మకు అభిమానము [తాదాత్మ్యబుద్ధి]

కలుగుచున్నది.

ఈ విషయమే ఇట్లు చెప్పబడినది.

'కర్మమనిపేరుగల అవిద్యారూపమగు మూడవశక్తి కలదు. దానిచే అంతటగల క్షేత్రజ్ఞశక్తి [జీవశక్తి] చుట్టువారియున్నది. ఈ క్షేత్రజ్ఞశక్తి—కర్మాత్మకమగు అవిద్యాశక్తిచే చుట్టువారియున్నందువలననే నిరంతరములగు సంసారదుఃఖములను పొందుచున్నది. [జీవశక్తులనగా జీవాత్మలని యభిప్రాయము]' అని.

ఈ సందర్భము—క్షేత్రజ్ఞులగు జీవులకు ధర్మముగానున్న [ఆత్మకు గుణముగానున్న] జ్ఞానమునకు, అవిద్యచే సంకోచ వికాసములు కలుగుచున్నవని స్పష్టపరచుచున్నది.

వివరణము:—ఆత్మ—జ్ఞానస్వరూపమని భగవత్పాదశంకర సిద్ధాన్తము. దానికి అవిద్యచే తిరోధానము కల్గినదని యంగీకరించినచో స్వరూపమే కప్పబడి నశించినదని చెప్పవలసివచ్చును. ఇక భగవద్రామానుజమతమున ఆత్మకు—జ్ఞానమనునది స్వరూపమేకాక—గుణముకూడ అగుచున్నది. ఇక్కడ ఆత్మస్వరూపమైన జ్ఞానమునకు ఎట్టి వికారములు లేకున్నను, ఆత్మకు ధర్మమైన [గుణమైన] జ్ఞానమునకుమాత్రము అవిద్యయని పిలువబడు కర్మముచే సంకోచవికాసములేర్పడి—ఆత్మకు దేవమనుష్యాది దేహములయందు తాదాత్మ్యబుద్ధి కలుగుచున్నదని అంగీకరింపబడినది. కనుక 'అవిద్యాతిరోధానము' అను దోషము ఆత్మకు అంటదని యభిప్రాయము. ఈ విషయమున 120, 121, 122 పేజీలలోని వివరణము చూడదగియున్నది.

ఈ క్రింది విషయము విశేషముగ గమనింపదగియున్నది.

'విష్ణుశక్తిః పరాప్రోక్తా క్షేత్రజ్ఞాఖ్యాతథాపరా।
అవిద్యా కర్మ సంజ్ఞాన్యా తృతీయాశక్తిరిష్యతే॥

ఏతత్ సర్వమిదం విశ్వం జగదేతచ్చరాచ్చరమ్
పరబ్రహ్మ స్వరూపస్య విష్ణోః శక్తి సమన్వితమ్॥' అను విష్ణుపురాణ వచనమునుబట్టి–'ఈ సమస్త చరాచరప్రపంచము విష్ణుశక్తితో కూడి యున్నది. ఈ విష్ణుశక్తికంటె వేరుగ క్షేత్రజ్ఞశక్తి–అవిద్యాశక్తి అని మరి రెండు శక్తులుకలవు. మూడవదియగు అవిద్యాశక్తి–కర్మస్వరూపము. దీనిచే రెండవశక్తియైన క్షేత్రజ్ఞశక్తి అనగా జీవశక్తి కప్పబడుచున్నది. దీనివలననే చతుర్ముఖబ్రహ్మ మొదలు అతిసూక్ష్మమైన వస్తువు వరకు క్షేత్రజ్ఞశక్తి తారతమ్యమును పొందియున్నది' అని తెలియుచున్నది. ఈ విషయమున 98వ పేజీలోని వివరణము చూడనగును. 22, 23 పుటలలోని వివరణము కూడ చూడనగును.

మూ॥ అపిచ ఆచ్ఛాదికా అవిద్యా, శ్రుతిభిశ్చ ఐక్యోపదేశ బలాచ్చ బ్రహ్మస్వరూపతిరోధానహేతు దోషరూపా ఆశ్రీయతే। తస్యాశ్చ మిథ్యారూపత్వేన ప్రపంచవత్ స్వదర్శనమూల దోషాపేక్షత్వాత్, న సా మిథ్యాదర్శనమూలదోషఃస్యాత్, ఇతి–బ్రహ్మైవ మిథ్యాదర్శనమూలం స్యాత్। తస్యాశ్చ అనాదిత్వేపి మిథ్యారూపత్వాదేవ బ్రహ్మ దృశ్యత్వేనైవ అనాదిత్వాత్, తద్దర్శనమూల పరమార్థదోషానభ్యుపగమాచ్చ, బ్రహ్మైవ తద్దర్శనమూలం స్యాత్; తస్య నిత్యత్వాత్ అనిర్మోక్ష ఏవ।

అనువాదము:– మరియు, [మీమతమున] ఆత్మయొక్క స్వరూపమును కప్పియుంచునట్టి అవిద్య, [తత్త్వమసి–అహంబ్రహ్మాస్మి మున్నగు] వేదవాక్యములచే ఆత్మ–బ్రహ్మములొక్కటేనని చెప్పబడినందున, బ్రహ్మముయొక్క స్వరూపమును కప్పిపుచ్చుటకుకారణమైన ఒక దోషమనియే ఆశ్రయింపబడుచున్నది. ఇది [అవిద్య] ప్రపంచమువలె మిథ్య. [వాస్తవమైనదికాదు] కనుక, ఇది–దీనిని దర్శించుటకు

మూలమైన వేరొకదోషమునపేక్షించి యుండును. కావున, ఇదియే [అవిద్యయే] మిథ్యాదర్శనరూపమగు దోషమునకు మూలమనియనుట కుదరదు. ఈ విధముగ పరబ్రహ్మమే మిథ్యాదృష్టికి మూలముకావల యును. ఈ అవిద్య—అనాది [మొదలులేనిది] అని అంగీకరింపబడి నప్పటికిని, ఇది మిథ్యారూపమేకనుక, బ్రహ్మముచే దర్శింపబడినదగుట చేతనే దీనిని 'అనాది' అనియనవలయును. ఈ అవిద్యను దర్శించుటకు కారణమైన పరమార్థమగు దోషమును వేరొకదానిని అంగీకరింపలేదు కనుక, పరబ్రహ్మమే—ఈ అవిద్యాదర్శనమునకు [అవిద్యనుచూచుటకు] మూలమగును. బ్రహ్మము నిత్యముకనుక [అవిద్య నాబ్రహ్మము దర్శిం చుటకూడ నిత్యమేకావున] ఇక బ్రహ్మమునకు సంసారమునుండి మోక్షమే లేకపోవలసివచ్చునుకదా!

వివరణము:- ఈ వాక్యముల యభిప్రాయమిది. భగవత్పాద శంకరులు—"బ్రహ్మముకంటెభిన్నముగ వివిధభేదవిశిష్టముగ కన్పట్టు జగత్తు మిథ్యయనియు, ఈ మిథ్యాభూతమగు జగత్తు అనాదియగు 'అవిద్య'చే కల్పింపబడుచున్నద"ని చెప్పుదురు. దీనినిబట్టితేలినదేమ నగా—మిథ్యయైన సమస్తభేదమును దర్శించుటకు అవిద్యయేమూలము అని. ఇక్కడనిది ప్రశ్నింపవలయును. మిథ్యాదర్శనమునకు మూల మైన అవిద్య—వాస్తవమా? అవాస్తవమా? వాస్తవమనుటకుదరదు. బ్రహ్మముకంటె వేరుగ వేరొకవస్తువులేదుకదా! ఇక 'అవిద్య'కూడ అవాస్త వమే, అనగా మిథ్యయేనని స్పష్టమగుచున్నది. ఈవిధముగ వాస్తవ ముగలేని, అనగా మిథ్యయైన అవిద్యయే మిథ్యయైన ప్రపంచము యొక్క దర్శనమునకు మూలమని అవగతమగుచున్నది. ఇదికుదరదు. అసలు వాస్తవముగలేని అవిద్య–మిథ్యయై–తానును ఒక దోషమే కావల యును. కనుక మిథ్యయై దోషమైన ఈ అవిద్యనుకూడ దర్శించునదేదో వేరొకటి యుండవలయును. అట్టిదానిని దేనిని అంగీకరింపలేదుకనుక బ్రహ్మమే—అవిద్యను దర్శించుననియనవలయును. అవిద్య అనాది.

బ్రహ్మము నిత్యము. నిత్యమైన బ్రహ్మముచే దర్శింపబడుటచేతనేకదా అవిద్య అనాదియైనదని చెప్పవలయును; కావున నిరంతరము, బ్రహ్మము, అవిద్యను దర్శించుచుండును. కనుక బ్రహ్మమునకు అవిద్యా దర్శనరూపమగు సంసారము నిత్యము కావలయును. మరి ఇక బ్రహ్మమునకు మోక్షమే లేదు. ఒకవేళ 'బ్రహ్మాత్మైకత్వజ్ఞానము' కల్గినవెంటనే అవిద్యాదర్శనము పోయి ముక్తి కలుగునన్నచో— బ్రహ్మాత్మైకత్వజ్ఞానము కల్గించు శాస్త్రముకూడ మిథ్యయనియే అంగీకరింపబడినదికదా! అట్టియెడ, మిథ్యయైన శాస్త్రముచే తాత్త్వికజ్ఞానమెట్లు కలుగును? కనుక ఈ అవిద్యాదర్శనము బ్రహ్మమునకంగీకరింపరాదని భగవద్రామానుజ మతము. జీవునకు అవిద్యా సంబంధమంగీకరింపబడినది. భగవద్రామానుజమతమున అవిద్య మిథ్యకాదు, వాస్తవము. ఇది బ్రహ్మముకంటె భిన్నము. కర్మస్వరూపము. ఈ కర్మాత్మకమగు అవిద్యచే జీవతత్త్వమే ఆవరింపబడి దేహాత్మాభిమానమును పొందుచున్నది. కనుక పూర్వము చూపబడినదోషములేవియు యిచ్చట అంటవు. అవిద్యకు ఆశ్రయము కుదరదు, అవిద్యాస్వరూపము కుదరదని భగవత్పాదశాంకరమతమున చూపబడిన 'ఆశ్రయానుపపత్తి', 'స్వరూపానుపపత్తి' అను దోషములు భగవద్రామానుజమతమున నంటవని తాత్పర్యము.

మూ॥ అత ఏవ ఇదమపి నిరస్తమ్, ఏకమేవ శరీరం జీవవత్, నిర్జీవాని ఇతరాణి శరీరాణి। యథా స్వప్నదృష్టనానావిధశరీరాణాం నిర్జీవత్వమ్। తత్ర హి స్వప్నే ద్రష్టుః శరీరమేకమేవ జీవవత్, తస్య స్వప్నవేలాయాం దృశ్యభూతనానావిధానన్త శరీరాణాం నిర్జీవత్వమేవ। అనేన ఏకేనైవ పరికల్పితత్వాత్ జీవాః మిథ్యాభూతాః ఇతి।

అనువాదము:- కనుకనే—[బ్రహ్మముకంటె వేరైన సమస్తము మిథ్యయని శాంకరమతము కావున] "ఒక్క శరీరమే జీవునితో కూడినది, ఎట్లుగ స్వప్నమున చూడబడిన అనేక విధములగు శరీరములు జీవరహిత

ములో, అట్టి ఇతర దేహములన్నియు జీవరహితములే. స్వప్నమున- ఆ స్వప్నమును దర్శించు వాడెవ్వడు కలడో, వాని దేహమొక్కటి మాత్రమే జీవునితో కూడియున్నది. ఆతడు, స్వప్నదశలో దర్శించు అనేక విధములైన శరీరములన్నియు నిర్జీవములే. ఈ స్వప్నము దర్శించుచున్నవాడు కల్పించినవారే ఆ జీవులు కనుక, మిథ్యాభూతులే [అసత్యమైనవారే]" అను-వాదముకూడ తిరస్కరింపబడినది.

వివరణము:- ఈ ఏక జీవవాదమును గురించి శాంకరమత నిరూపణావసరమున నిరూపింపబడినది. ఈ ఏకజీవ వాదమును కుదుర్చుటకు స్వప్నదృష్టాన్తము పై వాక్యములలో సమన్వయింపబడినది. బ్రహ్మాతిరిక్తమైనదంతయు మిథ్యయని శాంకరమతము కనుక- జీవతత్త్వమే అవిద్యాకల్పితమైనప్పుడు-ఏకజీవవాదమైనను, అనేక జీవవాదమైనను విశేషమేమియులేదుకనుక ఈవాదము సరియైనదికాదని భగవద్రామానుజులు నిరాకరించుచున్నారు.

మూ॥ బ్రహ్మణా స్వరూపవ్యతిరిక్తస్య జీవభావస్య సర్వశరీరాణాం చ కల్పితత్వాత్, ఏకస్మిన్నపిశరీరే-శరీరవత్, జీవసద్భా-వస్య మిథ్యారూపత్వాత్, సర్వాణి శరీరాణి మిథ్యారూపాణి। తత్ర జీవభావశ్చమిథ్యారూప ఇతి। ఏకస్య శరీరస్య తత్ర జీవసద్భావస్యచ న కశ్చిద్విశేషః। అస్మాకంతు స్వప్నే ద్రష్టుః శరీరస్య తస్మిన్నాత్మసద్భావస్యచ ప్రబోధవేలా-యామ్ అబాధితత్వాత్, అన్యేషాం శరీరాణాం, తద్గతజీవా-నాం చ బాధితత్వాత్ తేసర్వే మిథ్యాభూతాః। స్వశరీర మేకంతస్మిన్ జీవభావశ్చ పరమార్థఇతి విశేషః।

అనువాదము:- పరబ్రహ్మముచే-తనస్వరూపముకంటె వేరుగ జీవతత్త్వము, సర్వశరీరములును కల్పింపబడినవి. ఒక శరీరమునందైనను శరీరమువలెనే జీవుని ఉనికి [అవిద్యచే కల్పింపబడినదై] మిథ్యయే

కనుక, శరీరములన్నియు మిథ్యారూపములే. ఆ శరీరములలో జీవుడున్నాడనుటకూడ మిథ్యయే. ఈవిధముగ ఒక శరీరమునకు, దాని యందు జీవుని ఉనికికిని విశేషమేమియులేదు. [ఏకజీవవాదమున విశేష మేమియులేదని యభిప్రాయము] ఇక మా మతమున–స్వప్నమున–కలగను వ్యక్తియొక్క శరీరము, దానియందు ఆత్మయొక్క ఉనికి మెలకువ కలిగిన తరువాతకూడ బాధింపబడలేదు కావున, [సత్యము]. [కలలో కనుపించిన] ఇతర శరీరములును, వాటియందుగల జీవతత్త్వ ములును [మెలకువ కల్గిన తరువాత కనుపించుటలేదు కనుక] బాధింప బడుచున్నవి. కావున అవియన్నియు వాస్తవముగ లేనివే. [మిథ్యా రూపములే.] తన శరీరమొక్కటిమాత్రమే, దానియందుగల జీవసత్తతో పాటు వాస్తవము అనునది విశేషము.

వివరణము:– స్వప్నములలో జీవసద్భావము–వాస్తవమా? కాదా? అను విషయమును భగవద్రామానుజులు 'వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్' [బ్ర. సూ. 2-2-28] అను సూత్ర శ్రీభాష్యమున విచారించినారు. స్వప్న సామ్యమునుబట్టి, జాగ్రద్దశలో అనుభవగోచరమైన ప్రపంచము మిథ్య యనుట యుక్తముకాదని వారి అభిప్రాయము. మరి స్వప్నమున గోచ రించిన వస్తువులు మెలకువ కలిగిన తరువాత కనిపించుటలేదుకదా? అన్నచో నిజమే. ఇంతమాత్రముచే అవి అసత్యములు కాజాలవు. భగ వానుడు స్వప్నమున వివిధపదార్థముల సృజించునని–'న తత్ర రథాః, న రథ యోగాః, న పంథానో భవన్తి, అథరథాన్ రథయోగాన్, పథః సృజతే....సహికర్తా' [బృహదా. 6–10] 'అచ్చట రథములు లేవు. గుఱ్ఱములు లేవు, త్రోవలులేవు, కాని భగవానుడు రథములను, గుఱ్ఱ ములను, మార్గములను సృజించుచున్నాడు' అను శ్రుతివచనమునుబట్టి–స్వప్నద్రష్టకు [కలగనువానికి] స్వాప్నిక పదార్థములన్నియు ఉన్నవ నియు, కాని అవి జాగ్రద్దశలో బాధితములుకనుక తాత్కాలికములై అని త్యములుమాత్రమేనని స్పష్టమగుచున్నది. సత్యసంకల్పుడు, ఆశ్చర్య

కరమైన శక్తి కల భగవానుడట్టి తాత్కాలికవస్తువుల సృజించుట కుదురు ననిచెప్పి, అవి మిథ్యకాదని భగవద్రామానుజులు జిజ్ఞాసాసూత్రభాష్యమున నిరూపించియున్నారు. మిథ్యాత్వవాదులకీ శ్రుతివచనములు విరోధించు నని తాత్పర్యము. స్వప్నసామ్యము–జాగ్రద్దశలోని ప్రపంచమునకెంత మాత్రము లేదని యభిప్రాయము. కలగనునప్పుడు కలలో తాను, తన శరీరమును, దానియందుగల ఆత్మయొక్క సద్భావమును దర్శించినప్పుడు అదియే మెలకువకల్గిన తరువాత కనుపించుచున్నదికనుక మిథ్య కాదని స్పష్టమగుచున్నది. ఇంతవరకు ఆశ్రయానుపపత్తి, స్వరూపానుపపత్తి అను రెండు దోషములు చెప్పబడినవి.

మూ॥ అపిచ కేనవా అవిద్యానివృత్తిః? సాచ కీదృశీ? ఇతి వివేచనీయమ్, "ఐక్యజ్ఞానం నివర్తకం, నివృత్తిశ్చ అనిర్వచనీయ ప్రత్యనీకాకారా" – ఇతిచేత్, అనిర్వచనీయ ప్రత్యనీకం నిర్వచనీయమ్, తచ్చ సద్వా? అసద్వా? ద్విరూపం వా? కోట్యంతరం నవిద్యతే। బ్రహ్మవ్యతిరేకేణ ఏతదభ్యుపగమే, పునరప్యవిద్యా ననివృత్తాస్యాత్। బ్రహ్మైవ చేన్నివృత్తిః, తత్ ప్రాగప్యవిశిష్టమితి వేదాన్తజ్ఞానాత్ పూర్వమేవ నివృత్తిః స్యాత్। ఐక్యజ్ఞానం నివర్తకం, తదభావాత్ సంసార ఇతి భవద్దర్శనం విహన్యతే।

అనువాదము:– మరియు, 'అవిద్య' తొలగుట దేనిచేతనో చెప్పవలసి యున్నది. మరియు, ఆ'యవిద్యానివృత్తి' [అవిద్య తొలగుట అనునది] ఎట్టిది? అని వివేచింపదగియున్నది. "జీవబ్రహ్మైక్యజ్ఞానమువలననే అవిద్య తొలగిపోవును. ఆ'యవిద్య'తొలగుట [అవిద్యానివృత్తి] 'అనిర్వచనీయము'కంటె విరుద్ధమైన స్వరూపముకలది" అనియందురా? అట్లన్నచో —[అనిర్వచనీయమనగా ఇట్టిదని నిర్వచించి చెప్పుటకు వీలుకానిది.] అనిర్వచనీయముకంటె విరుద్ధమైనది 'నిర్వచనీయము' [అనగా ఇట్టిదని వివరింపదగినది] అగును. ఆ–'నిర్వచనీయమగు' 'అవిద్యానివృత్తి'

[అవిద్యతొలగుట అనునది] సత్ [ఉన్నది]; లేదా 'అసత్ [లేనిది]; లేదా 'సత్-అసత్' [ఉన్నది-లేనిది] అను రెండురూపములు కలది; కావలసియుండును. [సత్-అసత్-సదసత్] అను నీమూడిటికంటె వేరొక పక్షములేదుకదా! బ్రహ్మముకంటె వేరుగ ఈ 'అవిద్యానివృత్తి' అనుదానినంగీకరించినచో [ఇదియు అవిద్యారూపమేకనుక] మరల అవిద్య తొలగకపోవలసివచ్చునుకదా!

"ఇట్లుకాదు—బ్రహ్మమే అవిద్యానివృత్తిరూపము. [అనగా బ్రహ్మముకంటె అవిద్యానివృత్తియనునది వేరుగలేదు. బ్రహ్మమే అవిద్యానివృత్తి]" అనియందురా? అట్లన్నచో—బ్రహ్మము పూర్వమున్నదేకదా! అట్టియెడ బ్రహ్మము-జీవాత్మ ఒక్కటేనను జ్ఞానముకలుగుటకుపూర్వమే [బ్రహ్మమున్నదికనుక—అవిద్యానివృత్తియు ఉన్నట్లే కనుక] అవిద్య ఏల తొలగిపోలేదు? అట్లైనచో 'బ్రహ్మాత్మైకత్వవిజ్ఞానము అవిద్యను పోగొట్టుననియు, అదిలేనందువలన [ఐక్యజ్ఞానము లేనందువలన] సంసారమేర్పడినది' అను మీసిద్ధాన్తము పాడైపోవునుకదా!

మూ॥ కించ నివర్తక జ్ఞానస్యాపి అవిద్యారూపత్వాత్, తన్నివర్తనం కేనేతి వక్తవ్యమ్। "నివర్తకజ్ఞానం-స్వేతర సమస్త భేదం నివర్త్య, క్షణికత్వాదేవ స్వయమేవ వినశ్యతి। దావానల-విషనాశన విషాన్తరవత్" ఇతిచేత్, న। నివర్తక-జ్ఞానస్య బ్రహ్మవ్యతిరిక్తత్వేన, తత్ స్వరూప-తదుత్పత్తి-వినాశానాం మిథ్యారూపత్వాత్, తద్వినాశరూపా-అవిద్యాతిష్ఠత్యేవేతి, తద్వినాశదర్శనస్య నివర్తకం వక్తవ్యమేవ। దావాగ్న్యాదీనామపి పూర్వావస్థావిరోధి పరిణామపరంపరా అవర్జనీయైవ।

అనువాదము:- మరియు, అవిద్యను తొలగించునట్టి 'నివర్తక జ్ఞానము', (బ్రహ్మము-ఆత్మ ఒక్కటేనను ఐక్యజ్ఞానము) కూడ 'అవిద్యా

రూపమే' కనుక, ఈ అవిద్య తొలగుట దేనిచేతనో? చెప్పవలయును. "నివర్తకజ్ఞానము" (అవిద్యను పోగొట్టు బ్రహ్మాత్మైకత్వజ్ఞానము) తన కంటె వేరుగనున్న సమస్త భేదమును పోగొట్టి, తాను క్షణికము కనుక (క్షణకాలము మాత్రమే యుండునది కనుక) స్వయముగనే నశించుచున్నది. 'ఎట్లన, దావాగ్ని (అడవినిప్పు); విషదోషమును నివారించుటకు మందుగా పుచ్చుకున్న వేరొక విషము; తమ పనిని ముగించిన తరువాత ఎట్లుగ తమంత తాము నశించినవో, అట్లే అవిద్యను నివర్తింపజేయు జ్ఞానముకూడ అవిద్యను పోగొట్టి తానును నశించును" - అని యందురా? ఇది సరికాదు. నివర్తకజ్ఞానము - బ్రహ్మముకంటె వేరైనది కనుక—నివర్తకజ్ఞానముయొక్క స్వరూపము, అది పుట్టుట, నశించుట అనునవికూడ మిథ్యయేకదా! అట్టియెడ—అవిద్యానాశనరూపమగు అవిద్య మిగిలియేయుండును. కనుక అవిద్యానాశనరూపమగు అవిద్యను దర్శించుటను నివారించునదేదో చెప్పవలసియుండును.

ఇక దావాగ్ని మున్నగు స్థలములందుకూడ ముందుగల అవస్థ కంటె విరుద్ధమైన వేరొక యవస్థ కలుగుచున్నది కనుక, ఇట్టి పరిణామములయొక్క పరంపర (వరుస) తొలగింప వీలుకానిదేకదా!

వివరణము:- పూర్వ సందర్భము, ప్రస్తుత సందర్భము, ఈ రెండిటిచేతను పూర్వము సూచింపబడిన సప్తవిధములగు అనుపపత్తులలో (దోషములలో) నివర్తకానుపపత్తి, నివృత్త్యనుపపత్తి అను రెండు దోషములు చూపబడినవి. అవిద్యను తొలగించునదేదో కుదరదనుట 'నివర్తకానుపపత్తి'. అవిద్య తొలగుట అనునది కుదరదని నిరూపించుట 'నివృత్త్యనుపపత్తి'.

అవిద్యను నివర్తింపజేయునదేది? అది బ్రహ్మముకంటె భిన్నమా?

అభిన్నమా? భిన్నమన్నచో సద్రూపమా? అసద్రూపమా? సదసదుభయాత్మకమా? 'అవిద్యానివృత్తి' అనునది జ్ఞానరూపమై బ్రహ్మముకంటె వేరైనదని యన్నచో ఇదికూడ అవిద్యయే యగునుకనుక దీని 'నివృత్తి' ఎట్టిది? ఇత్యాది శంకలను ఉత్థాపనమొనర్చుటద్వారా పైని పేర్కొనిన రెండు దోషములు అనగా అవిద్యానివర్తకము కుదరదు, అవిద్యానివృత్తి కుదరదు అనునవి నిరూపింపబడినవి.

మూ॥ అపిచ చిన్మాత్రబ్రహ్మవ్యతిరిక్తకృత్స్ననిషేధవిషయజ్ఞానస్య కోఽయం జ్ఞాతా? 'అధ్యాసరూప'-ఇతిచేత్, న। తస్య నిషేధ్యతయా నివర్తకజ్ఞానకర్మత్వాత్, తత్కర్తృత్వానుపపత్తేః। 'బ్రహ్మస్వరూపమేవ'-ఇతిచేత్, న। బ్రహ్మణః నివర్తకజ్ఞానంప్రతి జ్ఞాతృత్వం కిం? 'స్వరూపమ్', ఉత-'అధ్యస్తమ్'? 'అధ్యస్తమ్'-చేత్, అయమధ్యాసః, తన్మూలావిద్యాన్తరంచ నివర్తకజ్ఞానావిషయతయా తిష్ఠత్యేవ। తన్నివర్తకాన్తరాభ్యుపగమే, తదపి త్రిరూపతయా అనవస్థైవ। సర్వస్యహి జ్ఞానస్య త్రిరూపత్వవిరహే జ్ఞానత్వమేవ హీయతే। కస్యచిత్ కంచన అర్థవిశేషంప్రతిసిద్ధరూపత్వాత్। జ్ఞానస్య త్రిరూపత్వవిరహే, భవతాం స్వరూపభూతజ్ఞానవత్ నివర్తకజ్ఞానమపి అనివర్తకంస్యాత్। బ్రహ్మస్వరూపస్యైవ జ్ఞాతృత్వాభ్యుపగమే, అస్మదీయపక్ష ఏవ పరిగృహీతః స్యాత్। నివర్తకజ్ఞానస్వరూపజ్ఞాతృత్వం స్వనివర్త్యాన్తర్గతమ్ ఇతివచనం, "భూతలవ్యతిరిక్తం కృత్స్నం ఛిన్నం దేవదత్తేన" ఇతి అస్యామేవ ఛేదనక్రియాయాం, అస్యాః ఛేదనక్రియాయాః ఛేత్తృత్వస్యచ ఛేద్యాన్తర్భావవచనవత్ ఉపహాస్యమ్।

అనువాదము:- మరియు, చైతన్యము మాత్రమే స్వరూపముగా

గల బ్రహ్మముకంటె వేరైన సమస్త వస్తువుయొక్క నిషేధజ్ఞానమును తెలిసికొనువాడెవ్వడు? ఆ తెలిసికొనువాడు (జ్ఞాత) 'అధ్యాసరూపుడు' (మిథ్యారూపుడు) అన్నచో, ఇట్టి అధ్యాసరూపుడగు (మిథ్యారూపుడగు) జ్ఞాత నిషేధింపదగియున్నాడు కనుక, నివర్తకజ్ఞానమునకు కర్మమే యగునుగాని 'కర్త' కాడు. (నిషేధింపబడువాడేకాని – నిషేధజ్ఞానమును పొందువాడుకాడు). ఇక 'బ్రహ్మస్వరూపమే నిషేధజ్ఞానమును గ్రహించునట్టి జ్ఞాత'–అన్నచో, ఇది కుదరదు. ఏలన–బ్రహ్మము నివర్తకజ్ఞానమునకు (అవిద్యను తొలగించునట్టి బ్రహ్మాత్మైక్య జ్ఞానమునకు) 'జ్ఞాత' (గ్రహించువాడు) అన్నచో–బ్రహ్మమునకుగల జ్ఞాతృత్వము ఎట్టిది? (దాని స్వరూపమేమి?) ఇది (జ్ఞాతృత్వము–తెలిసికొనువాడై యుండుట అను ధర్మము) బ్రహ్మస్వరూపమా? లేక బ్రహ్మమందు అధ్యస్తమైనదా? (ఆరోపింపబడినదా?). ఒకవేళ, 'అధ్యస్తము' (ఆరోపింపబడినది) అని యన్నచో–ఈ అధ్యాసము (ఆరోపము); దానికి మూలమైన వేరొక 'అవిద్య' – నివర్తకజ్ఞానమునకు విషయముకాకయే మిగిలియుండును. దీనిని తొలగించుటకు వేరొక నివర్తకమును (తొలగించు జ్ఞానమును) అంగీకరింతుమన్నచో — అదికూడ (ఆ నివర్తకజ్ఞానముకూడ) జ్ఞాత–జ్ఞేయము–జ్ఞానము అను మూడు రూపములు కలిగియుండును కనుక, మరల దీనికి 'జ్ఞాత' ఎవ్వడు? ఇత్యాది ప్రశ్న కలుగును. ఈ విధముగ అనేకములైన నివర్తకజ్ఞానముల కల్పించుచుండవలసివచ్చును కనుక 'అనవస్థ' యను దోషమేర్పడును. (అప్రమాణములైన అసంఖ్యాకములగు పదార్థముల నవిచ్ఛిన్నముగా కల్పింపవలసియుండుటయే – అనవస్థ) ప్రతిజ్ఞానము, జ్ఞాత (తెలిసికొనువాడు) జ్ఞేయము (తెలియబడు విషయము) జ్ఞానము అను మూడు రూపములతో కూడియుండనిచో అది జ్ఞానమే కాజాలదు కదా! జ్ఞానమనగా ఒకానొక వ్యక్తికి – ఒకానొక విషయమును (వస్తువును) ఉద్దేశించి ఏర్పడినదేకదా! (కావున) జ్ఞానమునకు జ్ఞాత–జ్ఞేయము–జ్ఞానము అను మూడు రూపములు లేకున్నచో,

(బ్రహ్మముయొక్క) స్వరూపమైన జ్ఞానమువలె, నివర్తకజ్ఞానముకూడ (అవిద్యను) తొలగించునది కాకపోవలసివచ్చును.

ఇక బ్రహ్మస్వరూపమే 'జ్ఞాత'యని యంగీకరించినచో, మా పక్షమే స్వీకరింపబడినట్లైనది. ఒకవేళ, 'నివర్తకజ్ఞానముయొక్క స్వరూపమునకు సంబంధించిన 'జ్ఞాతృత్వము' అనునదికూడ తొలగింపజేయదగిన అంశములలోనే చేరియున్నది' (కనుక దానిని తొలగించుటకు వేరుగ దేనిని అంగీకరింపనక్కరలేదు) అని యన్నచో—'భూతలముకంటె భిన్నమైన సమస్తము దేవదత్తునిచే ఛేదింపబడినది. ఈ ఛేదన క్రియలోనే ఛేత్తృత్వము (ఛేదించువాని ధర్మము) ఛేదింపదగిన యంశము, అంతర్భవించియున్నదను మాట ఎంత అపహాస్యముగ నుండునో ఇదియును (నివర్తింపజేయదగిన జ్ఞానములోనే జ్ఞాతృత్వము చేరియున్నదనుట) అపహాస్యాస్పదమే యగును.

మూ॥ అపిచ నిఖిలభేదనివర్తకమిదమైక్యజ్ఞానం కేనజాతమితి వివేచనీయమ్। శ్రుత్యైవ ఇతిచేత్, న। తస్యాః బ్రహ్మవ్యతిరిక్తాయాః అవిద్యాపరికల్పితత్వాత్, ప్రపంచబాధకజ్ఞానోత్పాదకత్వం నసంభవతి। తథాహి—దుష్టకారణజన్యమపి రజ్జుసర్పజ్ఞానం, దుష్టకారణజన్యేన 'రజ్జురియంనసర్పః' ఇతి జ్ఞానేననబాధ్యతే। రజ్జుసర్పజ్ఞానభయే వర్తమానే, కేనచిద్భ్రాన్తేన పురుషేణ-'రజ్జురియంనసర్పః' ఇత్యుక్తేఽపి—'అయంభ్రాన్తః' ఇతిజ్ఞానేసతి తద్వచనం రజ్జుసర్పజ్ఞానస్య—బాధకం నభవతి। భయంచన నివర్తతే। ప్రయోజకజ్ఞానవతః శ్రవణవేలాయామేవహి బ్రహ్మవ్యతిరిక్తత్వేన శ్రుతేరపి భ్రాన్తిమూలత్వం జ్ఞాతమ్ ఇతి।

కించ నివర్తకజ్ఞానస్య జ్ఞాతుః, తత్సామగ్రీభూతశాస్త్రస్య చ బ్రహ్మవ్యతిరిక్తతయా యదిబాధ్యత్వముచ్యతే, హన్త! తర్హి ప్రపంచనివృత్తేః మిథ్యాత్వమాపతతీతి ప్రపంచస్య

సత్యతాస్యాత్। స్వప్నదృష్టపురుషవాక్యావగతపుత్రాదిమర-
ణస్య మిథ్యాత్వేన పుత్రాదిసత్యతావత్। కించ తత్త్వమ-
స్యాదివాక్యం న ప్రపంచస్య బాధకం, భ్రాన్తిమూలత్వాత్,
భ్రాన్తప్రయుక్తరజ్జుసర్పబాధకవాక్యవత్।

అనువాదము:- మరియు, (ప్రపంచాత్మకమగు) సమస్త భేదము ను (తెలిసికొనువాడు, తెలియబడునది మున్నగు భేదమును) తొలగింప జేయునట్టి "ఐక్యజ్ఞానము" (బ్రహ్మము-ఆత్మ ఒక్కటేనను జ్ఞానము) దేని వలన (ఏ ప్రమాణముచే) కల్గినదో వివేచింపవలసియున్నది. 'వేద వాక్యము చేతనే (తత్త్వమసి ఇత్యాది వాక్యముచే) అన్నచో-ఇది కుద రదు. ఈ శ్రుతివాక్యము బ్రహ్మముకంటె వేరుగ నున్నదై, అవిద్యచే కల్పింపబడినదేకనుక, ప్రపంచమును బాధించునట్టి (ప్రపంచము-'మిథ్య యే' అని నిరూపించునట్టి) జ్ఞానమును పుట్టింపజాలదు. ఎట్లనగా—దోష ముతో కూడిన కారణమువలన (నేత్రతిమిరాది దోషములవలన) త్రాటిని చూచి పాముని భ్రాన్తిని చెందినప్పుడు, వేరొక దుష్టకారణమువలన-'ఇది త్రాడే-పాముకాదు' అను జ్ఞానము కల్గినను, ముందు కల్గిన 'రజ్జుసర్ప భ్రాన్తి'-ఈ రెండవ జ్ఞానముచే బాధింపబడదుకదా! రజ్జువునుచూచి సర్ప మని భ్రాన్తిపడినప్పుడు, కల్గిన భయము అనుభవింపబడుచుండగా, వీనివలెనే భ్రాన్తిని పొందిన మరొకడు 'ఇది రజ్జువే (త్రాడే) సర్పము కాదు' అని పల్కినను, ఈ రెండవ వ్యక్తికూడ మొదటివానివలెనే భ్రాన్తిని పొందినాడని తెలిసినప్పుడు, వీడు పలికిన మాట-మొదట కల్గిన రజ్జు సర్పభ్రాన్తిని పోగొట్టునదికాదుకదా! కనుకనే భయముకూడ తొలగదు.

బ్రహ్మముకంటె భిన్నమైన జగత్తు మిథ్యయనియు, బ్రహ్మము కంటె భిన్నమైయుండుటయే 'మిథ్య' యనుటలో కారణమనియు తెలిసిన వానికి (ప్రయోజక జ్ఞానవతః) వేదాన్తవాక్యముల శ్రవణమొనర్చునపుడే, ఈ వేదాన్తవాక్యజాతముకూడ బ్రహ్మముకంటె వేరు కనుక, ఇదికూడ భ్రాన్తిమూలమై మిథ్యయని తెలిసినది. (కనుక 'మిథ్య'యని తెలియు

బడిన వేదాన్తవాక్యజాతము అవిద్యను పోగొట్టునదికాదు).

మరియు, అవిద్యను తొలగించునట్టి జ్ఞానము (బ్రహ్మాత్మైక్య జ్ఞానము); దానితో కూడిన 'జ్ఞాత'; అతనికి సాధనమైన శాస్త్రము అను నీ మూడును, బ్రహ్మముకంటె భిన్నములు కనుక బాధింపబడినవని యన్నచో, అయ్యో! ప్రపంచము తొలగుటయనునదీ మిథ్య కావలసి వచ్చును. కావున, ప్రపంచము సత్యమేయగును. (ఎట్లన) కలలో కనుపించిన ఒక వ్యక్తి – 'నీ పుత్రుడు మరణించినాడు' అని చెప్పినప్పుడు, ఆ వ్యక్తివలెనే–ఆ వాక్యముకూడ మిథ్యయే కనుక, పుత్రుడు బ్రతికియే యుండుట ఎట్లు సత్యమో ఇదియునట్లే! మరియు, 'తత్త్వమసి' (నీవు బ్రహ్మమైయున్నావు) అను ఉపనిషద్వాక్యము ప్రపంచమును బాధించునది (ప్రపంచము మిథ్యయని నిరూపించునది) కాదు, ఈ వాక్యమే భ్రాన్తిమూలముకదా! భ్రాన్తిని పొందినవాడు పల్కిన 'ఇది రజ్జువే సర్పముకాదు' అను వాక్యము ఎట్టిదో ఇదియు అట్టిదేకదా!

వివరణము:– బ్రహ్మము–ఆత్మ ఒక్కటేనని ఆత్మైక్యజ్ఞానము కల్గినప్పుడు, భేదరూపమైన ఈ సమస్త ప్రపంచము మిథ్య కనుక తొలగిపోవునని భగవత్పాదశాంకరమతము. "ఈ సమస్త ప్రపంచము జ్ఞాత, జ్ఞేయము మున్నగు భేదములతోకూడినదై బ్రహ్మముకంటె వేరుగ కనప్పట్టుచున్నది కనుకనే యిది మిథ్య. ఈ మిథ్యాజ్ఞానము అనాదిగ నున్నది కనుక, దీనిని బ్రహ్మాత్మైకత్వమును బోధించు వేదవాక్యమే అనగా 'తత్త్వమసి'–'నేహనానాస్తి కించన', 'మృత్యోఃసమృత్యుమాప్నోతియ ఇహనానేవ పశ్యతి' (ఎవ్వడిచ్చట భేదమున్నట్లు దర్శించుచున్నాడో వాడు అవిద్యచే మృత్యువును పొందుచున్నాడు) ఇత్యాది వాక్యసమూహము– పోద్రోలుచున్నది" అని శాంకరమత సారము. ఈ వేదవాక్యముకూడ బ్రహ్మముకంటె భిన్నమై మిథ్యయేయగుచున్నది కనుక, ఐక్యజ్ఞానమును కలిగించుటద్వారా ప్రపంచమును పోద్రోలునదికాదు. అనగా ప్రపంచము మిథ్యయని నిరూపింపగల్గునదికాదు. ఒక మిథ్య–వేరొక మిథ్యను సాధింప

జాలదు కదా। దానిని నిరూపించుటకే భగవద్రామానుజులచే స్వప్న దృష్టాన్తము సమన్వయింపబడినది. ఇక్కడ పూర్వపక్షిదర్శితమగు గ్రంథముచే అవిద్యా విషయమున 'ప్రమాణానుపపత్తి' (ప్రమాణము కుదరదను దోషము) చూపబడినది. శాస్త్రము 'మిథ్య' యను శాంకరవాదమును 56, 57, 58 పుటలలో చూడనగును.

మూ॥ "ననుచ స్వప్నే కస్మింశ్చిద్భయే వర్తమానే స్వప్నదశాయామేవ 'అయం స్వప్నః' ఇతి జ్ఞాతే సతి, పూర్వభయనివృత్తిః దృష్టా, తద్వత్-అత్రాపి సంభవతి" ఇతిచేత్, నైవమ్— స్వప్నవేలాయామేవ "సోఽపిస్వప్నః" ఇతిజ్ఞాతేసతి, పునర్భయానివృత్తి రేవదృష్టేతి నకశ్చిద్విశేషః। శ్రవణ—వేలాయామేవ "సోఽపిస్వప్నః" ఇతిజ్ఞాతమేవ—ఇత్యుక్తమ్.

యదపిచ ఇదముక్తమ్ — "భ్రాన్తిపరికల్పితత్వేన మిథ్యారూపమపి శాస్త్రం—"సద్-అద్వితీయంబ్రహ్మ" ఇతి బోధయతి। తస్య సతోబ్రహ్మణోవిషయస్య పశ్చాత్తనబాధాదర్శనాత్, బ్రహ్మానుస్థితమేవ।"— తదయుక్తమ్। "శూన్యమేవతత్త్వమ్", ఇతివాక్యేన తస్యాఽపిబాధితత్వాత్। "ఇదం భ్రాన్తిమూలం వాక్య"మితిచేత్, "సద్ అద్వితీయం బ్రహ్మ" ఇతి వాక్యమపి భ్రాన్తిమూలమితిత్వయైవ ఉక్తమ్। పశ్చాత్తనబాధాదర్శనంతు సర్వశూన్యవాక్యస్యైవ ఇతివిశేషః। సర్వశూన్యవాదినః, బాహ్యవ్యతిరిక్తవస్తుమిథ్యాత్వవాదినశ్చ స్వపక్షసాధకప్రమాణపారమార్థ్యానభ్యుపగమేన అభియుక్తైః వాదానధికారఏవ ప్రతిపాదితః—"అధికారోఽనుపాయత్వాత్ నవాదేశూన్యవాదినః" ఇతి.

అనువాదము:— "మరి, కలలో ఏదేనియొక భయము కలిగినప్పుడు ఆ కలలోనే 'ఇది కల' అని తెలిసినచో, పూర్వము కల్గిన భయము తొల

గుట అనుభవసిద్ధమై కనుపించుచున్నదికదా! అట్లే ఇచ్చటను (మిథ్యయైన శాస్త్రము విషయమునను) కుదురును"–అన్నచో–అట్లుకాదు. కలగనుచున్నప్పుడే 'ఇదికూడ కలయే' అని తెలియబడినప్పుడు, పూర్వము కల్గిన భయము యథాతథముగనే యుండుట అనుభవగోచరము కనుక విశేషమేమియులేదు. శ్రవణము చేయుచున్నప్పుడే వేదాన్తవాక్యములు కలవలె మిథ్యయని తెలియబడినవని పూర్వమే చెప్పితిమి.

"భ్రాన్తిచే కల్పింపబడినందున శాస్త్రము మిథ్యారూపమే అయినప్పటికిని 'సద్రూపము–అద్వితీయము' అయిన బ్రహ్మమును బోధించుచున్నది. (ఈ శాస్త్రముచే బోధింపబడిన) సద్రూపమగు బ్రహ్మాత్మక విషయము, తరువాత బాధింపబడినట్లు అనుభవములేదు కనుక, బ్రహ్మము అబాధితమై అనుభవగోచరమగుచున్నది" – అని యన్నచో–ఇదియును యుక్తముకాదు. 'శూన్యమే తత్త్వము' అను (వేరొక) వాక్యముచే ఇది బాధింపబడినదికదా! 'ఈ వాక్యము (శూన్యమే తత్త్వము అను వాక్యము) భ్రాన్తిచే పలుకబడినదనియన్నచో– 'సద్.... అద్వితీయం బ్రహ్మ' అను వేదాన్తవాక్యముకూడ భ్రాన్తిమూలమని నీవే చెప్పితివికదా! తరువాత కాలమున బాధ కనుపింపకపోవుట సర్వశూన్య వాక్యమునకే ననుట విశేషము.

సర్వశూన్యవాదియగు బౌద్ధునకు, బ్రహ్మముకంటె భిన్నమైన వస్తువు మిథ్యయని వాదించు మాయావాదికిని తమ పక్షమును సాధించు ప్రమాణము వాస్తవమని (సత్యమని) యంగీకరింపని కారణమున, విద్వాంసులచే వాదమున నధికారము లేదనియే ప్రతిపాదింపబడినది.

'అధికారోఽనుపాయత్వాత్ నవాదీ శూన్యవాదినః' అని.

వివరణము:– మాయావాదులచేత, శూన్యవాదులైన బౌద్ధులవలెనే శాస్త్ర ప్రామాణ్యమంగీకరింపబడలేదు కనుక, వారికి వేదాన్తవాక్య విచారణాత్మకమగు వాదమునందు అధికారము లేదని ఈ క్రింది కుమారిలభట

వచనము నొడువుచున్నది.

సర్వదా సదుపాయానాం వాదమార్గః ప్రవర్తతే।
అధికారోఽనుపాయత్వాత్ నవాదేశూన్యవాదినః॥

సదా = ఎల్లప్పుడు, సదుపాయానాం = ఉత్తమములైన ప్రమాణములు సాధనములుగా కలవారికే, వాదమార్గఃప్రవర్తతే = వాదవిధానము వర్తించుచుండును. శూన్యవాదినః = వేదప్రామాణ్యము నంగీకరింపక స్వబుద్ధిచే సర్వము శూన్యమని వాదించు బౌద్ధునకు, అనుపాయత్వాత్ = ప్రమాణసిద్ధిలేదు కనుక, వాదే = ప్రామాణికులతో వాదించుటయందు, న అధికారః = అధికారము (యోగ్యత) లేదు.

నిరంతరము ఉత్తమములైన వేదాది ప్రమాణముల నంగీకరించిన వారికే వాదము కుదురును కాని, ప్రమాణము నంగీకరింపని వారికి కాదు. శూన్యవాదులవలెనే మాయావాదులుకూడ శాస్త్రము వ్యావహారిక సత్యమే తప్ప, పారమార్థిక సత్యము కాదని చెప్పుదురు కనుక వారికి వాదాధికారములేదని తాత్పర్యము.

మూ॥ అపిచ ప్రత్యక్షదృష్టస్య ప్రపంచస్య మిథ్యాత్వం కేన ప్రమాణేన సాధ్యతే: "ప్రత్యక్షస్య దోషమూలత్వేన అన్యథాసిద్ధిసంభవాత్, నిర్దోషం శాస్త్రమనన్యథాసిద్ధం ప్రత్యక్షస్య బాధకమ్"—ఇతిచేత్—కేనదోషేణ జాతం ప్రత్యక్షమనన్తభేద విషయమితివక్తవ్యమ్। "అనాదిభేదవాసనాఖ్యదోషజాతం ప్రత్యక్షమ్"—ఇతిచేత్, హన్త! తర్హి అనేనైవదోషేణజాతం శాస్త్రమపీతి. ఏకదోషమూలత్వాత్ శాస్త్రప్రత్యక్షయోః న బాధ్యబాధకభావసిద్ధిః।

ఆకాశవాయ్వాదిభూత—తదారబ్ధశబ్దస్పర్శాదియుక్త—మనుష్యత్వాది సంస్థాన సంస్థిత పదార్థగ్రాహి ప్రత్యక్షమ్। శాస్త్రంతు ప్రత్యక్షాద్యపరిచ్ఛేద్య-సర్వాన్తరాత్మత్వాద్యనన్త—విశేషవిశిష్టబ్రహ్మస్వరూప—తదుపాసనాద్యారాధనప్రకార—

తత్ప్రాప్తిపూర్వక-తత్ప్రసాదలభ్యఫలవిశేష-తదనిష్టకరణ-మూలనిగ్రహవిశేషవిషయమ్ ఇతి శాస్త్రప్రత్యక్షయోః న విరోధః।

అనాదినిధనావిచ్ఛిన్నపాఠసంప్రదాయతాద్యనేకగుణ-విశిష్టస్య శాస్త్రస్యబలీయస్త్వం వదతా ప్రత్యక్షపారమార్థ్య-మభ్యుపగంతవ్యమ్-ఇతి అలమనేనశ్రుతిశతవితతివాతవేగ-పరాహతకుదృష్టిదుష్టయుక్తిజాలతూలనిరసనేన ఇత్యుపర-మ్యతే।

అనువాదము:- మరియు, ప్రత్యక్షముగా కనుపించుచున్న ప్రపంచము మిథ్యయని ఏ ప్రమాణముచే సాధింపబడుచున్నది? "ప్రత్యక్షజ్ఞానము దోషమూలము కనుక దీనికి 'అన్యథాసిద్ధి' ఉండవచ్చును. (దేనియందుగల కారణత్వమును పురస్కరించుకొనకయే కార్యము పుట్టునో అది అన్యథాసిద్ధము. లేదా—ఏది కారణము కాకపోయినను కార్యము పుట్టునో అది అన్యథాసిద్ధము. అనగా 'కారణము కానిది' అని యభిప్రాయము) కాని శాస్త్రము ఎట్టి దోషము లేనిది కనుక 'అన్యథాసిద్ధము కాదు (అనగా యథార్థజ్ఞానమును కలిగించుటకు కారణమేయగును). కావున శాస్త్రమే-ప్రత్యక్షమునకు బాధకమగును"—అన్నచో అనన్తములైన భేదములే విషయముగాగల యీ ప్రత్యక్షము ఏ దోషముచే కల్గినదో చెప్పవలయును. 'అనాదియైన భేదసంస్కార రూపమగు దోషమువలననే ఈ ప్రత్యక్షము కలుగుచున్నది' అన్నచో—అయ్యో! ఇదే దోషముచే (అనాది భేదవాసనా రూపమగు దోషముచే) నేర్పడినదే శాస్త్రముకూడ, కనుక—ఒకే దోషమును పురస్కరించుకొని యేర్పడిన ప్రత్యక్షము—శాస్త్రము అను రెండిటిలో—ఒకటి మరియొకదానికి బాధకము (బాధించునది) కాజాలదు.

ఆకాశము, వాయువు మున్నగు భూతములచేతను, వాటివలన కల్గిన శబ్దము, స్పర్శ మున్నగు గుణములతోకూడిన మనుష్యత్వము

మొదలగు అవయవ సన్నివేశములు (ఆకారములు)కల పదార్థములను గ్రహించునదే ప్రత్యక్షప్రమాణము.

ఇక శాస్త్రము—ప్రత్యక్షప్రమాణముచే తెలియరానివగు—'సర్వాంతర్యామిత్వము' (అన్నిటికిని లోనుండి నియమించువాడై యుండుట) మున్నగు అనన్తములైన గుణములతో కూడిన పరబ్రహ్మముయొక్క స్వరూపము, ఆ పరబ్రహ్మముయొక్క ఉపాసనము మొదలగు ఆరాధనా విధానము, మోక్షప్రాప్తి పూర్వకముగ నా పరబ్రహ్మముయొక్క అనుగ్రహముచే కల్గెడు వివిధములైన ఫలములు, ఆ పరబ్రహ్మమునకు అనిష్టమైన (ప్రీతిని కల్గింపని) పాపాదుల నొనర్చుటవలన కలిగెడి 'నిగ్రహణము' (శిక్షింపబడుట) మొదలగు విశేషములు—ఇవియన్నియు విషయముగా కలిగియున్నది. (బ్రహ్మస్వరూప—తదుపాసనాది అలౌకిక విషయములన్నియు శాస్త్రముచే మాత్రమే తెలియదగినవితప్ప ప్రత్యక్షముచే కాదని యభిప్రాయము)

(ఈవిధముగ ప్రత్యక్షమునకు విషయము వేరు—శాస్త్రమునకు విషయము వేరు) కనుక శాస్త్రము—ప్రత్యక్షము అను నీ రెండు ప్రమాణములకును పరస్పర విరోధమెంతమాత్రము లేదు.

అద్యన్తములేని ఎడతెగని (ఎట్టి మార్పులేక ఒకే విధముగ నిరంతరము సాగుచున్న) పాత సంప్రదాయము కలిగియుండుట మొదలగు అనేక విశేషములతో కూడిన శాస్త్రము బలవత్తరమని యంగీకరించినవానిచే, ప్రత్యక్షప్రమాణముయొక్క యథార్థత (వాస్తవత్వము—సత్యత్వము) తప్పక అంగీకరింపవలసియేయున్నది.

ఇంక నీ విచారము చాలును. శతాధిక వేదవచన బృందరూపమగు వాయువుయొక్క వేగముచే దూరముగ చెదరగొట్టబడిన, కుదృష్టులైన వారి దుష్టయుక్తుల సముదాయమగు దూదిని—(మరల) నిరసించుట ఏలయని విరమించుచుంటిమి.

వివరణము:- ఇంతటితో భగవత్పాదశంకరులవాదము ఖండింప బడినది. పూర్వగ్రంథముచే శాస్త్రము—ప్రత్యక్షము అను రెండుప్రమాణములే ననియు, శాస్త్రమును మాత్రమే ప్రమాణమని పరిగ్రహించి, ప్రత్యక్ష ప్రమాణమును తిరస్కరించినచో శాస్త్రము బలవత్తరమని నిరూపించుట సాధ్యము కాదనియు, శాస్త్రమునకుకూడ ప్రత్యక్షప్రమాణముచే పరిపుష్టికలదనియు భగవద్రామానుజుల యభిప్రాయము స్పష్టపరుపబడినది. ప్రత్యక్షప్రమాణముచే శబ్దముయొక్క స్వరూపము గ్రహింపబడవలయును. ఆ శబ్దములు ఏయర్థమును బోధించుచున్నవి అను 'వ్యుత్పత్తిని' (నిర్వచన ప్రక్రియను), 'ఈ శబ్దమున కీయర్థమున తాత్పర్యమున్నది' అను తాత్పర్యలింగముల గ్రహింపవలయును. (తాత్పర్య లింగము లనగానేమో 116, 117 పుటలలో చూడనగును) అనగా వేద వాక్యరూపమగు శాస్త్రమునకు ప్రామాణ్యము సిద్ధింపవలయుననచో ఆ వాక్యముల యర్థము తెలియవలయును. వాక్యములు శ్రవణేంద్రియము చే వినబడవలయును. ఈ విధముగ ఇంద్రియరూపమగు ప్రత్యక్షప్రమాణముయొక్క ఆవశ్యకత తప్పనిసరిగా నున్నది. కనుక ప్రత్యక్షప్రమాణము యథార్థమనియు, దీనిచే పోషింపబడిన శాస్త్రముకూడ యథార్థమై పారమార్థికమగు ప్రమాణమనియు అంగీకరించి తీరవలయును. అట్లంగీకరించినచో ప్రపంచము ప్రత్యక్షప్రమాణముచే సిద్ధించుచున్నది కనుక ప్రత్యక్షావిరుద్ధముగనే [ప్రత్యక్షప్రమాణమునకు విరోధము లేకుండగనే] వేదాన్తవాక్యరూపమగు శాస్త్రముకూడ ప్రపంచ సత్యత్వమునే నిరూపించుచున్న"దని అభిప్రాయము.

## భాస్కరమత నిరాకరణము

మూ॥ ద్వితీయేతుపక్షే ఉపాధిబ్రహ్మవ్యతిరిక్తవస్త్వంతరానభ్యుపగమాత్, బ్రహ్మణ్యేవ ఉపాధిసంసర్గాత్, ఔపాధికాః పర్వేదోషాః బ్రహ్మణ్యేవభవేయుః। తతశ్చ అపహత-

పాప్మత్వాది నిర్దోషశ్రుతయః విహన్యన్తే।

"యథా, ఘటాకాశాదేః పరిచ్ఛిన్నతయా మహాకాశాద్వై లక్షణ్యం, పరస్పరభేదశ్చదృశ్యతే. తత్రస్థాః దోషాః గుణావా అనవచ్ఛిన్నే మహాకాశే నసంబధ్యన్తే, ఏవమ్ ఉపా-ధికృతభేదవ్యవస్థితాః జీవగతాః దోషాః అనుపహితే పరే-బ్రహ్మణి నసంబధ్యన్తే" ఇతిచేత్ నైతదుపపద్యతే। నిరవ-యవస్య ఆకాశస్య అనవచ్ఛేద్యస్య ఘటాదిభిః ఛేదాసంభ-వాత్, తేనైవాకాశేన ఘటాదయః సంయుక్తా ఇతి, బ్రహ్మ ణో౽వ్యచ్ఛేద్యత్వాత్ బ్రహ్మైవ ఉపాధిసంయుక్తంస్యాత్।

అనువాదము:- ఇక రెండవపక్షమున (భాస్కరమతమున) ఉపాధి, దానితోకూడిన బ్రహ్మము అను వీటికంటెవేరైన వస్తువును దేనిని అంగీకరింపలేదు కనుక, పరబ్రహ్మమందే ఉపాధియొక్క (శరీరము మున్నగు జడవస్తువుయొక్క) సంబంధముండునుకనుక, ఉపాధియందు గల దోషములన్నియు పరబ్రహ్మమందే సంక్రమింపవలసియుండును. అప్పుడు—'అపహతపాప్మా' (ఛాందోగ్యము) మున్నగు, పరబ్రహ్మము నందెట్టి దోషములులేవని నిరూపించు శ్రుతివచనములు నిరర్థకములు కావలసివచ్చును.

'ఏవిధముగ, ఘటము మున్నగు ప్రదేశములందు పరిమితమై యున్న ఆకాశమునకు, ఇట్టి ప్రదేశ పరిమితిలేని 'మహాకాశము' కంటె విలక్షణత్వము ఒకదానికంటె మరియొకటి (ఘటాకాశముకంటె మహాకాశము—మహాకాశముకంటె ఘటాకాశము) భిన్నములై యుండుట కనుపించుచున్నదో, ఘటాదిప్రదేశములచే పరిమితముగానున్న ఆకాశమునందుగల దోషములుగాని, గుణములుగాని, ఎట్టి పరిమితిలేని మహాకాశమునందు సంబద్ధములగుటలేదో, అట్లే (బ్రహ్మమందు) ఉపాధులయొక్క (శరీరాది జడవస్తువులయొక్క) సంబంధముచే నేర్పడిన భేదములనుబట్టి వేరువేరుగ

నున్న–జీవులయందలి దోషములెవ్వియు, ఉపాధిసంబంధమెంతమాత్రము లేని పరబ్రహ్మమందు తగులుకొనవు.'—అనియన్నచో—ఇది కుదరదు. ఎట్టి అవయవములు లేనిదై ముక్కలుగా పరిమితత్వమును (అంశములను) కల్పించుటకు వీలుకాని, ఆకాశమునకు ఘటము మున్నగు వస్తువులచే భాగముల కల్పించుట కుదరదుకదా! కనుక, అట్టి ఆకాశముతోడనే ఘటము మున్నగు వస్తువులు దగ్గరగా చేరియున్నవని చెప్పవలసియున్నది, కనుక పరబ్రహ్మముకూడ (ఆకాశము వలెనే) ఉపాధులచే విభజించుట కవకాశములేనిదికనుక, బ్రహ్మమునకే (దేహాది) ఉపాధులయొక్క సంసర్గము ఏర్పడవలసియుండును.

వివరణము:– ఇక్కడ ఘటాది వస్తు ప్రదేశములచే పరిచ్ఛిన్నము లైన (పరిమితత్వమును పొందిన) ఆకాశముల వంటివారు జీవులుకాగా, ఉపాధుల సంబంధమెంతమాత్రము లేని 'మహాకాశము' వంటిది పరబ్రహ్మము. పరిచ్ఛిన్న ప్రదేశములందలి ఆకాశములందుగల గుణదోషములు మహాకాశమునకు అంటనట్లే, బ్రహ్మమందు దేహాద్యుపాధుల సంబంధముచే నేర్పడిన విభిన్న జీవులందుగల దోషగుణములు, ఉపాధి సంబంధములేని బ్రహ్మమందు అంటవని పూర్వపక్షతాత్పర్యము. ఈ ఘటాకాశ దృష్టాన్త సమన్వయమును శాంకరమత వివేచన సందర్భమున 'అవచ్ఛేద'వాదమును వివరించునప్పుడు చూపించుట జరిగినది. 50, 51 పుటలు చూడనగును.

మూ॥ "ఘటసంయుక్తాకాశప్రదేశః అన్యస్మాదాకాశప్రదేశాద్ భిద్యతే"–ఇతిచేత్, ఆకాశస్యైకస్యైవప్రదేశభేదేన ఘటాది సంయోగాత్, ఘటాదౌగచ్ఛతి, తస్యచప్రదేశస్య అనియమ ఇతి, తద్వద్–బ్రహ్మణ్యేవప్రదేశభేదానియమేన ఉపాధి సంసర్గాత్. ఉపాధౌగచ్ఛతి సంయుక్తవియుక్తబ్రహ్మప్రదేశ భేదాచ్చ బ్రహ్మణ్యేవఉపాధిసంసర్గః క్షణేక్షణేబన్ధోమోక్షశ్చ భవతి ఇతి సన్తః పరిహసన్తి।

అనువాదము:— "మరి, ఘటముతో సంయోగమును (సంబంధమును) పొందిన ఆకాశప్రదేశము, తదితరమగు ఆకాశప్రదేశముకంటె భేదమును పొందుచున్నదికదా!" అన్నచో—ఒకే ఆకాశమునకు భిన్నభిన్న ప్రదేశములనుబట్టి ఘటము మున్నగు ఉపాధులయొక్క (వస్తువులయొక్క) సంబంధమున్నచో, ఘటాదులు కదలుచున్నప్పుడు ఘటాదులతో సంయుక్తములైన ఆకాశప్రదేశములకు నియమము ఎట్లుగలేదో, అట్లే పరబ్రహ్మమందుకూడ ఈ ప్రదేశమున ఉపాధిసంబంధమున్నది, ఇక్కడ లేదు అను నియమములేకయే ఉపాధుల (దేహాదుల) సంబంధము కలిగినప్పుడు, దేహాదులు కదలుచున్నప్పుడు ఆ యుపాధులతోకూడిన బ్రహ్మమందలి ప్రదేశములుకూడ మారుచుండుమకనుక, క్షణక్షణము ఉపాధి సంబంధమున్నచోట 'బంధము', ఉపాధి సంబంధములేనిచోట 'మోక్షము' కలుగుచున్నదని సజ్జనులు పరిహాసమొనర్చుచున్నారు.

మూ॥ "నిరవయవస్య ఆకాశస్యైవ శ్రోత్రేంద్రియత్వేఽపి ఇంద్రియ వ్యవస్థావత్ బ్రహ్మణ్యపి వ్యవస్థా ఉపపద్యతే" ఇతి చేత్, న। వాయువిశేషసంస్కృత కర్ణప్రదేశసంయుక్తస్యైవ ఆకాశప్రదేశస్య ఇంద్రియత్వాత్। తస్యచ ప్రదేశాన్తరాత్ భేదానియమేఽపి ఇంద్రియవ్యవస్థా ఉపపద్యతే। ఆకాశస్య తు సర్వేషాం శరీరేషు-గచ్ఛత్సు, అనియమేన సర్వప్రదేశ సంయోగః ఇతి బ్రహ్మణ్యపి ఉపాధి సంయోగప్రదేశానియమఏవ।

అనువాదము:— "ఎట్టి అవయవములులేని ఆకాశమే శ్రోత్రేంద్రియమని అంగీకరింపబడినను—ఇంద్రియవ్యవస్థ ఎట్లు కుదురుచున్నదో అట్లే బ్రహ్మమందుకూడ వ్యవస్థ కుదురును" [ఎట్టి అవయవములు (అంశములు) లేని ఆకాశమే శ్రోత్రేంద్రియమని యన్నప్పటికిని ఒక వ్యక్తికిగల శ్రోత్రేంద్రియముకంటె వేరొక వ్యక్తియొక్క శ్రోత్రేంద్రియము వేరు అనియు, ఇట్లే ఇది యింద్రియ ప్రదేశము, ఇది యింద్రియముకాని

ప్రదేశము అను వ్యవస్థ ఎట్లు కుదురుచున్నదో అట్లే ఎట్టి అంశములులేని పరబ్రహ్మము-ఉపాధుల సంబంధముచే భిన్నభిన్న జీవులుగా ఏర్పడి నను—వీడు జీవుడు-ఇది బ్రహ్మము అను వ్యవస్థయు, జీవులలో వీని కంటె వీడు భిన్నుడు అను వ్యవస్థయు కుదురుటలో అభ్యన్తరము లేదని పూర్వపక్షాభిప్రాయము.]

అనియన్నచో-ఇది యుక్తముకాదు. (ఏలన) శ్రవణేంద్రియ మనగా ఒకానొక వాయువుచే సంస్కరింపబడిన 'కర్ణము' (చెవి) అని వ్యవహరింపబడు దేహ ప్రదేశముతోకూడిన అకాశము. (కేవలముగు-'అకా శము' కాదు) ఇట్టి 'కర్ణ ప్రదేశము' నందుగల ఆకాశము శరీరమునందు గల యితర ప్రదేశములకంటె భిన్నమని అనుటలో ఎట్టి నియమము లేకున్నను (శబ్దమును గ్రహించుటనుబట్టి) ఇదియే శ్రోత్రేంద్రియము అను వ్యవస్థ కుదురుట తగును. మరి ఆకాశమునకో! శరీరములన్నియు కదులుచున్నప్పుడు ఎట్టి నియమము లేకయే సర్వ ప్రదేశములతోడను సంయోగము (కలయిక) ఏర్పడుచున్నది. కనుక (ఇట్లే) పరబ్రహ్మము నందుకూడ ఉపాధులయొక్క (దేహాదులయొక్క) సంబంధము ఏ ప్రదేశ మున ఉండును, ఏ ప్రదేశమున ఉండదు అనుటలో నియమమేమియు లేదనియే చెప్పవలయును.

వివరణము:- భాస్కరమతము ననుసరించి బ్రహ్మమే దేహాది ఉపాధులయొక్క సంబంధముచే తానే వివిధ జీవభేదమును పొందుచున్న దనియు, ఇట్లు పొందినను, బ్రహ్మమునకెట్టి దోషమంటదనియు తెలియు చున్నది. దీనిని కుదుర్చుటకు భాస్కరుడు ఘటాదివస్తువులతోకూడిన ఆకాశముయొక్క దృష్టాన్తము నిచ్చినాడు. అకాశము తాను స్వయముగ అపరిచ్ఛిన్నమైనను ఘటము మున్నగు వస్తువుల (ఉపాధుల) సంబంధ ముచే పరిచ్ఛేదమును (పరిమితిని) పొందుచున్నదనియు, ఇట్లైనను, ఇట్టి పరిచ్ఛేదములులేని మహాకాశము, పరిచ్ఛిన్నములైన ఆకాశములకంటె వేరుగ, ఎట్టి దోషములంటకయే యున్నదనియు పేర్కొనినాడు. ఈ

దృష్టాంతమే భగవత్పాదుల మతము ననుసరించిన వాచస్పతి మిశ్రులచే అవచ్ఛేదవాదముగ నిరూపింపబడినది. (50, 51 పుటలు చూడవలయును) ఇది సరికాదని భగవద్రామానుజ మతము. ఎట్టి అవయవములులేని ఆకాశమునకు ఘటాదిపరిచ్ఛేదము (పరిమితి) కుదరనట్లే బ్రహ్మమునకు ఉపాధిపరిచ్ఛేదము (దేహాదులచే పరిమితి) కుదరదని వారి యభిప్రాయము. దీనిపై మరల, శ్రవణేంద్రియ దృష్టాంతముద్వారా ఆకాశమునకు పరిమితి యున్నట్లే, బ్రహ్మమునకు పరిచ్ఛేదము కుదురునని పూర్వపక్షము చేయబడినది. 'కర్ణశష్కుల్యవచ్ఛిన్నః ఆకాశప్రదేశః శ్రోత్రేంద్రియమ్' 'చక్కిలమువంటి చెవియొక్క ప్రదేశముచే పరిమితమైన ఆకాశమే (అవకాశమే) శ్రవణేంద్రియము' అని శాస్త్రకారులచే నంగీకరింపబడుటచే శ్రవణేంద్రియరూపముగా ఆకాశమునకు పరిమితి కలదుకదా అని పూర్వపక్షాభిప్రాయము. ఇదికూడ సరికాదని భగవద్రామానుజ మతము. ఆకాశమే శ్రోత్రేంద్రియమను మతము నంగీకరించినను వేరొక విధముగ (శబ్దమును గ్రహించుట – గ్రహింపకపోవుటలనుబట్టి) శ్రవణేంద్రియ వ్యవస్థను కుదర్పవచ్చుననియు, దీనివలన ఆకాశమునకు ఉపాధి సంబంధముచే దోషములంటవను మాట కుదరదని భగవద్రామానుజుల ఆశయము.

భగవద్రామానుజుల మతమున శ్రోత్రేంద్రియము భౌతికముకాదు. అనగా ఆకాశముకాదు. ఈ విషయమును ముందు నిరూపించుచున్నారు. ఆకాశమునకు అవయవములు లేవు కనుక అది ఉపాధులచే పరిచ్ఛిన్నము కానట్లే, బ్రహ్మముకూడ ఉపాధులచే పరిచ్ఛిన్నము కాదనియు, బ్రహ్మముకంటె వేరుగనే జీవతత్త్వమున్నదనియు, ఈ కారణముచేతనే (బ్రహ్మముకంటె జీవులు స్వరూప స్వభావములబట్టి భిన్నులు కనుకనే) జీవగత దోషములు బ్రహ్మమునకంటవని భగవద్రామానుజ మతము.

## ॥ ఆకాశము శ్రోత్రేంద్రియముకాదని నిరూపించుట ॥

మూ॥ ఆకాశస్య స్వరూపేణైవ శ్రోత్రేంద్రియత్వమభ్యుపగమ్యాపి ఇంద్రియవ్యవస్థా ఉక్తా, పరమార్థతస్తు ఆకాశో న శ్రోత్రేంద్రియమ్।

'వైకారికాదహంకారాదేకాదశేంద్రియాణిజాయన్తే'

ఇతిహి వైదికాః। యథోక్తం భగవతా పరాశరేణ—

'తైజసానీంద్రియాణ్యాహుః, దేవావైకారికాదశ।
ఏకాదశమ్మనశ్చాత్ర దేవావైకారికాః స్మృతాః॥' ఇతి।

అయమర్థః—వైకారికః, తైజసః, భూతాదిః ఇతి త్రివిధోఽహంకారః। సచక్రమాత్ సాత్త్వికో, రాజసః, తామసశ్చ। తత్ర—తామసాద్ భూతాదేః ఆకాశాదీని భూతాని జాయన్తే' ఇతి సృష్టిక్రమముక్త్వా, 'తైజసాత్—రాజసాహంకారాత్ ఏకాదశేంద్రియాణిజాయన్తే' ఇతి పరమతముపన్యస్య, 'సాత్త్వికాహంకారాద్ వైకారికాణి ఇంద్రియాణి జాయన్తే' ఇతి స్వమతముచ్యతే—'దేవావైకారికాఃస్మృతాః' ఇతి। దేవాః=ఇంద్రియాణి; ఏవమ్ అహంకారికాణామ్ భూతైశ్చ ఆప్యాయనం మహాభారతే ఉచ్యతే।

అనువాదము:- (ఇంతవరకు) ఆకాశము - స్వస్వరూపము చేతనే శ్రోత్రేంద్రియమగునను మతము నంగీకరించి ఇంద్రియముల వ్యవస్థ కుదర్చబడినది. వాస్తవముగ ఆకాశము - శ్రోత్రేంద్రియము కాదు. 'వైకారికమగు అహంకారమునుండి పదకొండు ఇంద్రియములు ఏర్పడు చున్నవి' అని వేదవేత్తలు చెప్పుచున్నారు. ఇదియే భగవానుడగు పరాశరునిచే నీ క్రింది విధముగ చెప్పబడినది.

'కొందరు ఇంద్రియములను తైజసములని యనిరి. (కాని) పది

ఇంద్రియములు వైకారికములు. పదకొండవదియగు మనస్సుకూడ నిట్టిదే (వైకారికమే) (కనుక) ఇంద్రియములన్నియు వైకారికము లనియే చెప్పబడినవి.'

ఇది దీని యర్థము. వైకారికము-తైజసము-భూతాది అని అహంకారము మూడు విధములు. వైకారికమగు అహంకారమే సాత్త్విక మనియు, తైజసమగు అహంకారము రాజసమనియు, భూతాదియగు అహంకారము - తామసమనియు క్రమముగ వ్యవహారము. వీటిలో 'భూతాదియని పిలువబడు తామసాహంకారము నుండియే ఆకాశము మున్నగు భూతములు పుట్టుచున్నవి. (పంచభూతముల పుట్టుకకు మూలము కనుక దీనికి 'భూతాది' అని పేరు)' అని సృష్టిక్రమమును చెప్పి, 'తైజసమైన రాజసాహంకారమునుండి పదకొండు ఇంద్రియములు పుట్టుచున్నవని' ఇతరుల పక్షమును (ఇతరుల అభిప్రాయమును) పేర్కొని; 'సాత్త్వికాహంకారమునుండి (వైకారికాహంకారమునుండి) వైకారికము లగు ఇంద్రియములు పుట్టుచున్నవని' తన మతము 'దేవావైకారికాః స్మృతాః' అను మాటచే చెప్పబడుచున్నది. దేవాః = అనగా ఇంద్రియములని యర్థము. ఈ విధముగ (వైకారికమగు) అహంకారమునుండి పుట్టిన ఇంద్రియములు భూతములచే (ఆకాశము మున్నగు పంచభూతములచే) పోషింపబడుచున్నవని మహాభారతమున చెప్పబడుచున్నది.

వివరణము:- ఈ గ్రంథమునుబట్టి తామసాహంకారమునుండి ఆకాశాదిభూతములు పుట్టగా, వైకారికమని పిలువబడు సాత్త్వికాహంకారము నుండి మనస్సుతోపాటు పదకొండు యింద్రియములు పుట్టినవని విష్ణుపురాణము నొడువుచున్నది కనుక, ఇంద్రియమేదియు, భూతములనుండి (పృథివ్యాదుల నుండి) పుట్టినదికాదని స్పష్టమగుచుండగా - 'శ్రోత్రేంద్రియము ఆకాశమే' నని యనుట కుదరదని భగవద్రామానుజుల యభిప్రాయము. మరి, ఇంద్రియములకు పంచభూతములతో సంబంధము లేదా? అన్నచో-ఉన్నది. పంచభూతములు ఇంద్రియములను పోషించు

చున్నవని మహాభారతము స్పష్టపరచుచున్నది. కనుక శ్రోత్రేంద్రియ రూపముగకూడ ఆకాశమునకు పరిచ్ఛిన్నత (పరిమితి) లేనట్లే బ్రహ్మము నకుకూడ ఉపాధి పరిచ్ఛేదము కుదరదని యభిప్రాయము.

మూ॥ భౌతికత్వేఽపి ఇంద్రియాణామ్ ఆకాశాదిభూతవికారత్వా-
దేవ ఆకాశాదిభూతపరిణామవిశేషాః వ్యవస్థితా ఏవ। శరీరవత్
పురుషాణామింద్రియాణిభవన్తి ఇతి; బ్రహ్మణి అచ్ఛేద్యే
నిరవయవే నిర్వికారేతు అనియమేన అనన్తహేయోపాధి
సంసర్గదోషో దుష్పరిహరఏవ ఇతి; శ్రద్దధానామేవ అయం
పక్షఇతి, శాస్త్రవిదోనబహుమన్యన్తే।

అనువాదము:- ఇంద్రియములు (ఆకాశాది) భూతముల వలన పుట్టినవని యంగీకరించినను, ఆకాశము మున్నగు భూతములయొక్క వికారములేకనుక ఆకాశాది భూతములయొక్క పరిణామములే యగుచు, శరీరములవలెనే పురుషుల (ప్రాణుల) ఇంద్రియములును వ్యవస్థను పొందుచున్నవి. (భౌతికములైన శరీరములు ఒకదానికంటెనొకటి వేరుగ ఎట్లుగ వ్యవస్థను పొందియున్నవో అట్లే ఇంద్రియములుకూడ భౌతికము లని అంగీకరించినను వాటికిగల ప్రత్యేక విషయగ్రహణాదులబట్టి వ్యవస్థ ను కుదర్పవచ్చునని యభిప్రాయము) [కాని] అంశములుగా విభజించు టకు వీలులేనిదియు, ఎట్టి అవయవములు లేనిదియు, నిర్వికారమునగు పరబ్రహ్మమందు, ఎట్టి నియమములేకయే అనన్తములు, నింద్యములును అయిన ఉపాధులయొక్క సంబంధము కల్గుటయను దోషము ఎంత మాత్రము తొలగింపరానిదే యగుచున్నది. కావున ఈ సిద్ధాన్తము, శ్రద్ధతో మారుమాటాడక స్వీకరించువారికి మాత్రమేగాని, శాస్త్రవేత్తలగు విద్వాంసులు [వివేచనపరులు] దీనిని గౌరవింపరు.

మూ॥ స్వరూపపరిణామాభ్యుపగమాత్ అవికారశ్రుతిః బాధ్యతే
నిరవద్యతాచ బ్రహ్మణః। "శక్తిపరిణామఇతిచేత్" కేయం

శక్తిరిత్యుచ్యతే? కిం బ్రహ్మపరిణామరూపా? ఉత బ్రహ్మణోఽనన్యాకాఽపి? ఇతి। ఉభయపక్షేఽపి స్వరూపపరిణామః అవర్జనీయ ఏవ।

అనువాదము:- [భాస్కరమతమున] బ్రహ్మముయొక్క స్వరూపమే జగదాదిరూపముగ పరిణామమును పొందినదని యంగీకరింపబడినది కనుక, [ఈ పక్షమున] బ్రహ్మమునకెట్టి వికారములులేవని చెప్పుచున్న వేదవాక్యములు బాధింపబడుచున్నవి. అట్లే బ్రహ్మము 'ఎట్టి దోషములు లేనిది' [నిరవద్యము] అనుటకూడ బాధింపబడుచున్నది. 'మరి, బ్రహ్మముయొక్క శక్తికే పరిణామ మంగీకరింపబడినది కాని—స్వరూపమునకు కాదు' అని యన్నచో—ఆ శక్తి యెట్టిదో చెప్పవలయును, ఆ శక్తి—బ్రహ్మముయొక్క పరిణామ స్వరూపమా? లేక బ్రహ్మముకంటె వేరుకాని ఏదేని శక్తియా? అని. ఈ రెండుపక్షములలోను [బ్రహ్మముయొక్క పరిణామము—లేదా—బ్రహ్మముకంటె వేరుకానిది అను పక్షములలో] బ్రహ్మమునకు స్వరూప పరిణామము అంగీకరింపక తప్పదుకదా!

వివరణము:- భాస్కరమతమున చూపబడిన రెండుప్రధానములైన దోషములలో ఒకటి బ్రహ్మమునకు ఉపాధిసంబంధమంగీకరించుట, రెండవది స్వరూప పరిణామమంగీకరించుట. మొదటిదోషముపూర్వము నిరూపింపబడినది. ఇక్కడ స్వరూప పరిణామ దోషము చూపబడినది. ఈవిధముగ భాస్కరమతము నిరాకరింపబడినది.

## ॥ యాదవప్రకాశమతఖండనము ॥

మూ॥ తృతీయపక్షే జీవబ్రహ్మణోః భేదవత్ అభేదస్య చ అభ్యుపగమాత్, తస్యచ తద్భావాత్, సౌభరిభేదవత్ స్వావతారభేదవచ్చ, సర్వస్య-ఈశ్వరభేదత్వాత్ సర్వే జీవగతా దోషాః తస్యైవస్యుః। ఏతదుక్తం భవతి—ఈశ్వరః స్వరూపే-

త్మైవ సుర-నర-తిర్యక్-స్థావరాదిభేదేన అవస్థిత ఇతి తదా-త్మకత్వవర్ణనం క్రియతే। తథాసతి ఏకమృత్పిండారబ్ధఘట-శరావాదిగతాని ఉదకాద్యాహరణాదీని సర్వకార్యాణి యథాతస్యైవభవన్తి, ఏవం సర్వజీవగతసుఖదుఃఖాది సర్వమ్ ఈశ్వరగతమేవస్యాత్ ఇతి।

అనువాదము:- ఇక మూడవపక్షమున [యాదవప్రకాశమతమున] కూడ జీవుడు—బ్రహ్మము అను నీ రెండిటికిని భేదమువలె అభేదముకూడ అంగీకరింపబడినందున, బ్రహ్మమునకు జీవభావము [కూడ] ఉన్నందున సౌభరియనువానికిగల దేహభేదమువలెను, పరమాత్మకుగల అవతారముల యొక్క భేదమువలెను, సమస్త జీవరాశియు బ్రహ్మముయొక్క భేదమే కనుక, జీవులందుగల దోషములన్నియు, పరమాత్మకే సంక్రమింపవలసి వచ్చును.

ఇది యిట్లు చెప్పబడివట్లగుచున్నది. ఈశ్వరుడు స్వస్వరూపము చేతనే నరులు, పశుపక్ష్యాదులు, వృక్షపర్వతాది స్థావరములు మున్నగు [శరీర] భేదముతో కూడియున్నాడు కనుక, 'తదాత్మకుడు' [జీవాది స్వరూపము కలవాడు] అని చెప్పబడుచున్నది. అట్టియెడ—ఒకే మట్టి ముద్దచే నిర్మింపబడిన కుండ, చట్టి మున్నగు వస్తువులకు సంబంధించి, 'నీటినిదెచ్చుట' మొదలగు పనులన్నియు ఆ మట్టిముద్దకే చెందినవియొట్లగుచున్నవో, అట్లే, సర్వజీవులందుగల సుఖము, దుఃఖము మున్నగు సమస్తము ఈశ్వరునియందే సంక్రమించినది కావలసివచ్చును.

మూ॥ ఘటకరకాదిసంస్థానానుపయుక్తమృద్ద్రవ్యం యథాకార్యాన్త-రాసన్వితమ్, ఏవమేవ సుర-పశు-మనుజాది-జీవత్వానుప-యుక్తేశ్వరః-సర్వజ్ఞః-సత్యసంకల్పత్వాదిగుణాకర ఇతిచేత్, సత్యమ్। సఏవ ఈశ్వరః ఏకేన అంశేన కల్యాణగుణాకరః, సఏవచ అన్యేన అంశేన హేయగుణాకరః ఇత్యుక్తం,

ద్వయోరంశయోః ఈశ్వరత్వావిశేషాత్।

అనువాదము:- "మరి, కుండ, ముంత మున్నగు వస్తువులకు ఉపయోగింపబడని మట్టియందు—'నీటిని దెచ్చుట' మున్నగు పనులెట్లు లేవో అట్లే దేవతలు, మనుష్యులు మున్నగు జీవులుగా ఉపయోగింపబడని ఈశ్వరుడు-సర్వజ్ఞుడు, సత్యసంకల్పత్వము మున్నగు గుణములకు స్థానమైనవాడు—" అనియన్నచో, సత్యము! ఆ ఈశ్వరుడే ఒక అంశమును పురస్కరించుకొని కల్యాణగుణములకు ఆశ్రయమైనవాడు, ఆయనే వేరొక అంశమును పురస్కరించుకొని నింద్యములైన గుణములకు ఆశ్రయమైయున్నాడు అని చెప్పినట్లైనది. రెండు అంశములును (జీవాదులుగా ఉపయోగింపబడిన ఈశ్వరాంశము-అట్లుగ ఉపయోగింపబడని ఈశ్వరాంశము అను రెండును) సమానముగ ఈశ్వరత్వముతో కూడినవే కదా!

మూ॥ "ద్వావంశౌ వ్యవస్థితౌ" ఇతిచేత్, కస్తేనలాభః? ఏకస్యైవ ఏకాంశేన—నిత్యదుఃఖిత్వాత్ అంశాంతరేణ సుఖిత్వమపి న ఈశ్వరత్వాయ కల్పతే। యథా దేవదత్తస్య ఏకస్మిన్ హస్తే చందనపంకానులేపః—కేయూరకటకాంగులీయకాలం—కారః, ఏతస్యైవ అన్యస్మిన్ హస్తే ముద్గరాభిఘాతః కాలా—నలజ్వాలానుప్రవేశశ్చ, తద్వదేవ ఈశ్వరస్యస్యాత్, ఇతి-బ్రహ్మాజ్ఞానపక్షాదపి పాపీయాన్ అయం భేదాభేదపక్షః, అపరిమితదుఃఖస్య పారమార్థికత్వాత్, సంసారిణామనన్త—త్వేన దుస్తరత్వాచ్చ।

"తస్మాద్విలక్షణోఽయం జీవాంశః" ఇతిచేత్, ఆగ—తోఽసి తర్హి మత్పంథానమ్। ఈశ్వరస్యస్వరూపేణ తాదా—త్మ్యేపర్ణనేస్యాదయందోషః, ఆత్మశరీరభావేనతు తాదాత్మ్యే ప్రతిపాదనే నకశ్చిద్దోషః। ప్రత్యుత నిఖిలభువననియమ—

నాదిః మహాన్ గుణగణః ప్రతిపాదితో భవతి। సామానాధి- కరణ్యంచ ముఖ్యవృత్తమ్।

అనువాదము:- 'ఈ రెండు అంశములు వేరువేరు వ్యవస్థ కలవై పరస్పరభిన్నములు' అనియన్నచో-దానివలన ప్రయోజనమేమున్నది? ఒకే ఈశ్వరతత్త్వము ఒక అంశమునుబట్టి నిత్యము దుఃఖభాజనమై యున్నప్పుడు, వేరొక యంశమునుబట్టి సుఖభాజనమైయున్నను ఈశ్వ రత్వము నంగీకరించుటకు సమర్థము కాదుకదా! దేవదత్తుని ఒక చేతిపై చందనపుపూత, కేయూరములు, కంకణములు, అంగుళీయకములు మున్నగు భూషణముల యలంకారము; అతనికే చెందిన రెండవ చేతిపై ముద్గరముతో (ఇనుప గుదియతో) మోదుట, భయంకర వ్రజయాగ్ని జ్వాలలలో కాల్చుట అనునది యెట్లుండునో, అట్లే ఈశ్వరునకుకూడ కల్గును. కనుక 'పరబ్రహ్మము అజ్ఞానముతో కూడినదను' వాదముకంటె (మాయా వాదముకంటె) చాల పాపభూయిష్ఠమైనదీ భేదాభేదపక్షము. అపారమగు దుఃఖము వాస్తవము కనుక, సంసారులగు జీవులు అసంఖ్యాకులు కనుక దుఃఖము (ఈశ్వరునకు) దాటరానిదేయగును.

'దుఃఖము ననుభవించు జీవాంశముకంటె - ఈశ్వరాంశము చాల విలక్షణమైనది (భిన్నమైనది)' అని యన్నచో, అట్టైన మా త్రోవలోనికే వచ్చితివి. ఈశ్వరునకు జీవునితోపాటు 'స్వరూప తాదాత్మ్యము' (స్వరూ పములోనే ఐక్యము) కలదని యంగీకరించి (చెప్పి) నప్పుడే దోషమేర్ప డును. 'ఆత్మ-శరీరభావ' సంబంధము తాదాత్మ్యను నిరూపించి నప్పుడు దోషమెంతమాత్రము లేదు. పైగా, సమస్త భువనములను నియమించుట మున్నగు అత్యధిక గుణసముదాయమున్నది. మరియు, 'సామానాధికరణ్యము' కూడ ( తత్త్వమసి ఇత్యాది స్థలములందు ) ముఖ్యముగనే కుదురుచున్నది.

వివరణము:- ఈ వాక్యములచే భగవద్రామానుజులు, యాదవ

ప్రకాశునిచే అంగీకరింపబడిన భేదాభేదపక్షమును, దానికి మూలమైన "స్వరూప తాదాత్మ్యమ"ను పక్షమును నిరాకరించి, తమకు ఇష్టమైన 'శరీర-శరీరిభావమూలమగు తాదాత్మ్యమే ఈశ్వరునకును-జీవజడాత్మక ప్రపంచమునకును యుక్తమని నిరూపించినారు. యాదవప్రకాశుని బ్రహ్మ పరిణామవాదమును (భేదాభేదవాదమును) 67, 68, 69 పుటలలో చూడ నగును. జీవశరీరభావమును గురించి 87, 88 పుటలలోను 95, 96, 97 పుటలలోను చూడనగును. సామానాధికరణ్యమననేమో పూర్వమే 36, 37 పుటలలో వివరింపబడినది.

## ॥ భేదాభేదనిరాకరణము ॥

మూ॥ అపిచ ఏకస్యవస్తునో హి భిన్నాభిన్నత్వం విరుద్ధత్వాత్ న సంభవతీతి ఉక్తమ్। ఘటస్య పటాద్భిన్నత్వేసతి తస్యతస్మిన్నభావః, అభిన్నత్వేసతి తస్య చ భావః ఇతి, ఏకస్మిన్ కాలేచ, ఏకస్మిన్ దేశేచ ఏకస్యహి పదార్థస్య యుగపత్ సద్భావః అసద్భావశ్చ విరుద్ధః। "జాత్యాత్మనా భావః, వ్యక్త్యాత్మనాచ అభావః" ఇతిచేత్, జాతేః ముండేనవ్యక్త్యైచ అభేదేసతి, ఖండేముండస్యాపి సద్భావః, ఖండేనచ-జాతేరభిన్నత్వే సద్భావః, భిన్నత్వే అసద్భావః, అశ్వే-మహిషత్వస్యేవ ఇతివిరోధో దుష్పరిహర ఏవ।

జాత్యాదేః వస్తుసంస్థానతయా వస్తునః ప్రకారత్వాత్ ప్రకారప్రకారిణోశ్చపదార్థాన్తరత్వం, ప్రకారస్యపృథక్-సిద్ధ్యనర్హత్వం, పృథగనుపలంభశ్చ, తస్యచ సంస్థానస్య చ అనేకవస్తుషు ప్రకారతయా అవస్థితిశ్చ ఇత్యాది పూర్వమే-వోక్తమ్। "సోఽయమితిబుద్ధిః" ప్రకారైక్యాత్, "అయమపి దండీ" ఇతి బుద్ధివత్। అయమేవచ జాత్యాదిః ప్రకారో

వస్తునో భేద ఇత్యుచ్యతే. తద్యోగేఏవ "వస్తుభిన్నమ్" ఇతి వ్యవహార హేతురిత్యర్థః॥ నచవస్తునో భేదవ్యవహార హేతుః, స్వస్యచ, సంవేదనవత్। యథాసంవేదనం వస్తునో వ్యవ-హార హేతుః, స్వస్యవ్యవహార హేతుశ్చభవతి। అతఏవ సన్మాత్రగ్రాహి ప్రత్యక్షం—న భేదగ్రాహి"—ఇత్యాదివాదానిరస్తాః॥ జాత్యాదిసంస్థితస్యైవ వస్తునః ప్రత్యక్షేణగృహీతత్వాత్, తస్యైవ సంస్థానరూపజాత్యాదేః ప్రతియోగ్యపేక్షయా భేద-వ్యవహార హేతుత్వాచ్చ।

స్వరూపపరిణామదోషశ్చ పూర్వమేవోక్తః॥

అనువాదము:- మరియు, ఒకే వస్తువునకు భిన్నత్వము-అభిన్నత్వము అనునది పరస్పర విరుద్ధము కనుక, కుదరదని చెప్పబడినది. కుండ వస్త్రముకంటె భిన్నమైనప్పుడు అది (కుండ) అచ్చట (వస్త్రము యొక్క స్థానమున) లేకపోవుటయు, అభిన్నమైనప్పుడు కుండ-వస్త్రము యొక్క స్థానమున నుండుటయు, ఈ విధముగ, ఒకే కాలమున, ఒకే ప్రదేశమున ఒకే వస్తువునకు ఒక్కసారిగ సద్భావము (ఉనికి) – అసద్భావము (లేమి) – విరుద్ధముకదా! (అనగా ఒకే వస్తువు ఒకే ప్రదేశమున ఉండవచ్చును లేదా లేకపోవచ్చును-కాని 'ఉండుట' 'ఉండకపోవుట' అనునవి ఒక్కసారిగ ఏర్పడవుకదా!) "మరి, అన్ని వస్తువులందును సమానముగ నుండునట్టి 'సామాన్యము' లేక 'జాతి' అను ధర్మమునుబట్టి 'ఉనికి'; వ్యక్తినిబట్టి (ఆ వస్తువుయొక్క విశేషాకారమునుబట్టి) 'లేమి' ఉండవచ్చునుకదా!"-అన్నచో-(గోత్వమను) జాతినిబట్టి 'బోడియావు' (ఖండగోవు) 'కొమ్ములుతెగినయావు' [ముండగోవు] ఈ రెండును ఒక్కటే అయినప్పుడు, కొమ్ములుతెగినయావులోనే బోడియావుకూడ ఉన్నట్లే కావలసివచ్చును. అట్లే కొమ్ములు తెగినయావుకూడ జాతినిబట్టి బోడియావు కంటె అభిన్నమని యన్నప్పుడు ఇక్కడనే దానికి ఉనికి, భిన్నమని యన్నప్పుడు 'లేమి' [లేకపోవుట] ఏర్పడవలసివచ్చును. అశ్వమందు

మహిషత్వము ఎట్లో అట్లే ఇదియు. అని, ఈ విధముగ 'విరోధము' (ఉనికి–లేమి ఒక్కచోట, ఒక్కసారి కుదరకపోవుటయను దోషము) పరిహరించుటకు వీలుకానిదేకదా! (ఇక మా మతమున) "జాతియనునది వస్తువు యొక్క 'సంస్థానమే' (ఆకృతియని పిలువబడు అవయవముల పొందికయే.) కనుక, వస్తువుకంటె వేరుచేయరాని ధర్మము (ప్రకారము). ప్రకారము (వస్తువుకంటె వేరుగ సిద్ధింపని ధర్మము) – 'ప్రకారి' (అట్టి ధర్మముతోకూడిన వస్తువు) అను నీ రెండును విభిన్న పదార్థములు. ప్రకారమనునది వస్తువుకంటె వేరుగ సిద్ధించుటకు యోగ్యతలేనిది. కను కనే వేరుగ లభింపదు. (గోవుకంటె గోత్వధర్మమును వేరుచేయుట కుదరదుకదా!) ఇట్టి అవయవ సన్నివేశము, లేక పొందిక అయిన 'సంస్థానము' (అనగా జాతి) అనేక వస్తువులయందు 'ప్రకారము'గా (వేరుగ సిద్ధింపని ధర్మముగా) ఉండును.' అని యీ విషయము పూర్వమే (మాచే) చెప్పబడినది. (95, 96, 97, 156, 157 పుటలు చూడనగును). ఒక వ్యక్తిని చూచి 'వాడే–వీడు' అని పూర్వము చూచినవానినిగా గుర్తించినప్పుడు 'వాడు' 'వీడు', అను రెండు శబ్దములచే గ్రహింపబడిన వ్యక్తులందుగల 'ప్రకారములు' ఒక్కటే. 'ఈతడుకూడ దండము కలవాడే' అను జ్ఞానము ఎట్టిదో ఇదియు అట్టిదే. (వేరొక వ్యక్తి యందును–ఈ వ్యక్తియందును దండిత్వము (కర్రను ధరించియుండుట) అను ధర్మము (ప్రకారము) ఒక్కటేకదా! దీనివంటిదే 'వాడే–వీడు' అనునదికూడ). ఈ జాతి మున్నగు 'ప్రకారమే' [ధర్మమే] వస్తువుయొక్క 'భేద'మని చెప్పబడుచున్నది. ఇట్టి 'ప్రకారము'తో కూడియున్న వస్తువే 'దీనికంటె ఇది వేరు' అను వ్యవహారమునకు కారణమగుచున్నది. ఈ ప్రకారమనునది వస్తువుయొక్క భేద వ్యవహారమునకును [ఈ వస్తువు–దీనికంటె భిన్నము అను వ్యవహారమునకును], తన వ్యవహారమునకును కారణమగుచున్నది. జ్ఞానమెట్లో ఇదియునట్లే. జ్ఞానము (సంవేదనము) అనునది వస్తువుయొక్క వ్యవహారమునకు కారణమగుచు, తన వ్యవహార

మునకుకూడ కారణమగుచున్నది. కనుకనే 'సత్పదార్థమగు బ్రహ్మమును మాత్రమే గ్రహించు ప్రత్యక్షము, భేదమును గ్రహించునదికాదు' ఇత్యాది వాదములు నిరాకరింపబడినవి. (ప్రత్యక్షము భేదమును తప్పక గ్రహించునని తాత్పర్యము) (ఏలన) జాత్యాదులతో కూడియున్న వస్తువే ప్రత్యక్షముచే గ్రహింపబడుచున్నదికదా! అట్టి సంస్థానరూపమగు (అవయవముల పొందికయగు) జాతి మున్నగు ధర్మమే స్వాశ్రయమును (తనకు ఆశ్రయమైన వస్తువును) పురస్కరించుకొని భేదవ్యవహారమునకు కారణమగుచున్నదికదా!

[ఇక] బ్రహ్మమునకు స్వరూపపరిణామ మంగీకరించినందున కలుగు దోషము పూర్వమే నిరూపింపబడినది [ఇంతటితో యాదవప్రకాశ మత ఖండనము ముగిసినది. స్వరూపపరిణామ ఖండనము భాస్కర మత ఖండనమున చూడుడు] [ఇంతవరకు ఆరంభమునగల రెండవ శ్లోకముయొక్క అర్థము వివరింపబడినది.]

## ॥ స్వసిద్ధాన్త ప్రతిష్ఠాపనము ॥

మూ॥ **1.** యః పృథివ్యాంతిష్ఠన్ పృథివ్యాఅంతరో యం పృథివీ న వేద, యస్య పృథివీ శరీరం, యః పృథివీమంతరో యమయతి ఏషత ఆత్మా అంతర్యామ్యమృతః" (బృ 5-7-3).

**2.** "య ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మాన వేద, యస్యాత్మా శరీరం, య ఆత్మానమంతరో యమయతి స త ఆత్మా అంతర్యామ్యమృతః" (మాధ్యందిన 5-7-22)

**3.** "యః పృథివీమన్తరే సంచరన్ యస్య పృథివీ శరీరం, యం పృథివీ న వేద"--ఇత్యాది;

**4.** "యోఽక్షరమంతరే సంచరన్ యస్యాక్షరం శరీ-

రం, యమక్షరం న వేద"

5. "యోమృత్యుమంతరే సంచరన్, యస్యమృత్యుః శరీరం, యంమృత్యుః నవేద" "ఏష సర్వభూతాన్తరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః"

6. 'ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతేః
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యోఽభిచాకశీతి॥' (ముండక 3-1-1)

7. 'అంతఃప్రవిష్టఃశాస్తాజనానాం సర్వాత్మా'

8. 'తత్ సృష్ట్వాతదేవానుప్రావిశత్, తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చ అభవత్'—ఇత్యాది;

9. 'సత్యంచ అనృతంచ సత్యమభవత్'

10. 'అనేనజీవేన ఆత్మనా'—ఇత్యాది;

11. 'పృథగాత్మానంప్రేరితారంచమత్వా, జుష్ట-స్తతస్తేనామృతత్వమేతి'

12. 'భోక్తాభోగ్యంప్రేరితారంచమత్వా, సర్వం ప్రోక్తంత్రివిధంబ్రహ్మఏతత్'

13. "నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానామ్, ఏకో-బహూనాంయోవిదధాతికామాన్"

14. "ప్రధానక్షేత్రజ్ఞపతిర్గుణేశః" "జ్ఞాజ్ఞౌ ద్వావజా వీశానీశా"—ఇత్యాది శ్రుతిశతైః; తదుపబృంహణైః—

15. "జగత్సర్వం శరీరంతే స్థైర్యంతేవసుధాతలమ్"

16. "యత్కించిత్సృజ్యతే యేన సత్త్వజాతేన వై ద్విజ।
తస్య సృజ్యస్య సంభూతౌ తత్సర్వం వై హరేస్తనుః॥"

17. "అహమాత్మా గుడాకేశ। సర్వభూతాశయస్థితః॥"

18. "సర్వస్య చాహం హృది సన్నివిష్టః మత్తః స్మృతిర్జ్ఞానమపోహనంచ"-ఇత్యాది వేదవిదగ్రేసర-వాల్మీకి-పరాశర-ద్వైపాయన-వచోభిశ్చ, పరస్య బ్రహ్మణః సర్వస్య ఆత్మత్వావగమాత్, చిదచిదాత్మకస్య వస్తునః తచ్ఛరీరత్వావగమాచ్చ, శరీరస్య చ శరీరిణం ప్రతి ప్రకారతయైవ పదార్థత్వాత్, శరీరశరీరిణోశ్చ ధర్మభేదేఽపి తయోరసంకరాత్, సర్వశరీరం బ్రహ్మేతి బ్రహ్మణో వైభవం ప్రతిపాదయద్భిః-సామానాధికరణ్యాదిభిః ముఖ్యవృత్తైః సర్వచేతనాచేతన ప్రకారం బ్రహ్మైవ అభిధీయతే॥

అనువాదము:- 1. 'ఎవ్వడు పృథివిని అధిష్ఠానముగ జేసికొని దానికి లోపలనున్నను, ఎవ్వనిని పృథివి యెరుగజాలదో; ఎవ్వనికి పృథివి శరీరమో, ఎవ్వడు పృథివిని లోనుండి నియమించుచున్నాడో, అతడే నీకు అంతర్యామియు అమృతస్వరూపుడును అగు ఆత్మ' [ఇది కాణ్వశాఖలోని వాక్యము].

2. 'ఎవ్వడు జీవాత్మను అధిష్ఠానముగ జేసికొని దానికి లోపల నున్నను, ఎవ్వనిని జీవాత్మ తెలిసికొనలేడో, ఎవ్వనికి జీవాత్మ శరీరమో, ఎవ్వడు జీవాత్మను లోనుండి నియమించుచున్నాడో అతడే నీకు అంతర్యామియు అమృతస్వరూపుడును అగు ఆత్మ [ఇది మాధ్యందినశాఖలోని వాక్యము-చూ. 18 పు]

3. 'ఎవ్వడు పృథివిలో సంచరించుచున్నవాడో, ఎవ్వనికి పృథివి శరీరమో, ఎవ్వని పృథివి తెలిసికొనుటలేదో' [ఇది సుబాలోపనిషద్

వాక్యము] మున్నగునవియు;

4. 'ఎవ్వడు అక్షరమందు [నాశరహితమగు జీవతత్త్వమందు] సంచరించుచున్నవాడో, ఎవ్వనికి అక్షరము శరీరమో, ఎవ్వనిని అక్షరము ఎరుగజాలదో' [సుబాలోపనిషద్]

5. 'ఎవ్వడు మృత్యువునకు లోపల సంచరించువాడో, ఎవ్వనికి మృత్యువు శరీరమో, ఎవ్వనిని మృత్యువెరుగదో' [సుబాల]

'ఈతడు సర్వభూతములకు [జీవ-జడములకు] అంతరాత్మయు, ఎట్టి దోషములు లేనివాడును, శ్రీవైకుంఠవాసియు, నిత్యప్రకాశశీలుడునగు ఒక్క శ్రీమన్నారాయణుడే' [సుబాల 7-19వ పుట చూడుము.]

[ఇంతవరకు ప్రదర్శింపబడిన వాక్యములను 'ఘటక శ్రుతు'లని యందురు. పరమాత్మకు-తద్భిన్నమగు చిదచిదాత్మక ప్రపంచమునకు గల సంబంధమును బోధించు వేదవచనములు]

6. 'మంచి రెక్కలు కలిగి [సుపర్ణా] సమానరూపాది గుణములు కలిగి [సయుజా], సన్నిహితములైన రెండు పక్షులు ఒకే వృక్షము నాశ్రయించియున్నవి. వాటిలో ఒక పక్షి పరిపక్వమైన పిప్పల ఫలమును తినుచున్నది. రెండవ పక్షి ఫలమును తినకయే ఒప్పుచున్నది' [ముండకోపనిషద్ 3-1-1]

[ఇక్కడ పక్షులనగా జీవాత్మ-పరమాత్మలు. అవి 'అపహతపాప్మత్వము' మున్నగు గుణములు సమానముగ కలిగియున్నవి. అందు జీవుడు కర్మఫలము ననుభవించుచున్నాడు. పరమాత్మ కర్మఫలానుభవము లేకయే అసంగుడై ప్రకాశించుచున్నాడు. వీరిరువురకు ఆశ్రయమైన వృక్షము-దేహము].

7. 'జీవులలో అంతర్యామిగా ప్రవేశించియుండి జనులను శాసించుచున్నాడు' [తైత్తిరీయారణ్యకము 3-21]

8. 'సమస్త చిదచిదాత్మక ప్రపంచమును సృజించి అందు ప్రవేశించినాడు. ప్రవేశించి, నిర్వికారమగు చేతనతత్త్వము [సచ్చ]; వికారాస్పదమగు అచేతన [జడ] తత్త్వము [త్యచ్చ] అయ్యెను.

9. వికార రహితమగు చేతనతత్త్వము [సత్యం]; అచేతన తత్త్వము [అనృతమ్] తానే అయినప్పటికి–సత్యస్వభావుడే [నిర్వికార స్వభావుడే] పరమాత్మ అయెను'. [ఈ రెండు వాక్యములు తై. ఆనంద వల్లీ. 6 అ.]

10. 'ఈ జీవునిద్వారా స్వయముగ ప్రవేశించి నామ రూపముల కల్పింతును' మున్నగునవియు; [ఛాం. 6-3-2-3]

11. 'జీవుని ప్రేరకుడగు పరమాత్మను వేరుగ తెలిసికొన్నవాడై బ్రహ్మముచే ననుగ్రహింపబడినవాడై [తేనజుష్టః], అమృతత్వమును పొందుచున్నాడు'. [శ్వేతాశ్వతరోపనిషద్ 1-12]

12. 'పరమాత్మయే భోక్త, భోగ్యము, నియామకుడు అని యెరిగి, ఈ మూడు విధములుగమన్న బ్రహ్మము నాచే చెప్పబడినది.' [శ్వేత. 1-15]

13. 'నిత్యులైన జీవులలో తాను నిత్యుడై, చేతనులలో చేతనుడై తానొక్కడే, అనేకులుగానున్న జీవుల కోరికలను తీర్చుచున్నాడు.' [శ్వే. 5-13]

14. 'ప్రకృతి–పురుషుల నియమించువాడును, త్రిగుణముల కతీతుడై వాటిని వశపరచుకున్నవాడును [పరమాత్మ] [శ్వే. 6-26]

'పుట్టుకలేని వారిరువురు కలరు. ఒకడు సర్వస్వతంత్రుడగు పరమాత్మ. రెండవవాడు ఆతనిచే నియమింపబడు జీవుడు.' [శ్వే. 1-17] ఇత్యాది పందలాది శ్రుతివచనములచేతను; వాటిని పోషించునట్టి–

15. 'ఈ జగత్తు అంతయు నీకు శరీరము. ఈ భూతలమే నీకు

స్థైర్యము' [రామాయణము. యుద్ధ. 20-26] [భూమియొక్క స్థిరస్వభావము నీకు అధీనమై యున్నదని భావము.]

16. 'ఈ సృష్టిలో భగవంతుని సత్త్వగుణ స్వభావముచే నేయే వస్తువు సృజింపబడుచున్నదో అదియెల్లను సృజింపబడుటకు కారణమైనది శ్రీహరి దేహమే!' [విష్ణు. పు. 1-22-38]

17. 'ఇంద్రియనిగ్రహము కలవాడా! అర్జునా! నేను సర్వభూతములయొక్క హృదయములందు నివసించియుండు ఆత్మనే!' [శ్రీ. గీ. 10-20]

18. 'నేను సమస్త ప్రాణికోటియొక్క హృదయమందు కొలువున్నాను. నావల్లనే, స్మృతి, జ్ఞానము, జ్ఞాననివృత్తి [జ్ఞానము తొలగిపోవుట] అనునవి కలుగుచున్నవి.' [శ్రీగీత. 15-15] ఇత్యాదిగ-వేదవేత్తలలో శ్రేష్ఠులగు వాల్మీకి, పరాశరుడు, కృష్ణద్వైపాయనుడు మున్నగు మహర్షులయొక్క వాక్కులచే పరబ్రహ్మము సర్వమునకు ఆత్మయని తెలియుచున్నది. [అట్లే] చిద్ [జీవ] అచిద్ [జడ] రూపమగు ప్రపంచము ఆ పరబ్రహ్మమునకు శరీరమని తెలియుచున్నది. శరీరమనునది శరీరమును ధరించిన వానికంటె వేరు చేయరాని విశేషముగా నుండును కనుకనే తాను పదార్థమగుచున్నది. శరీరము-దానిని ధరించినవాడు అనగా 'శరీరి' అను నీ రెండింటికిని లక్షణములు [గుణాదులు] భిన్నములుగానున్నను పరస్పర సాంకర్యము లేదు కనుక, సమస్త ప్రపంచము శరీరముగా కలదే - పరబ్రహ్మమని, బ్రహ్మముయొక్క వైభవమునే-ముఖ్యముగ ప్రవర్తించిన [లక్షణ అక్కరలేకయే కుదిరిన] 'సామానాధికరణ్యము' మున్నగునవి ప్రతిపాదించుచున్నవి. కావున వీటిచే సమస్త చేతనా-చేతనాత్మకమగు ప్రపంచము విడదీయరాని

అవయవముగా కల బ్రహ్మమే-చెప్పబడుచున్నది.

వివరణము:- పైని నిర్దేశించిన మహర్షి వచనములు పరబ్రహ్మమునకును ఈ కంటి కగుపించు సమస్త ప్రపంచమునకునుగల సంబంధము శరీర-శరీరిభావమని స్పష్టపరచుచున్నవి. అనగా ఈ భౌతికదేహమునకు-దానిలోగల జీవునకు ఎట్లు విడదీయరాని సంబంధమున్నదో, అట్లే ఈ జీవజడాత్మక ప్రపంచము బ్రహ్మమునకు శరీరమనియు, అందువలననే విడదీయరాని యంశమైయున్నదియు స్పష్టపరచుచున్నవి. పూర్వము సద్విద్యా ప్రకరణాది వాక్యముల సమన్వయించునప్పుడు చూపిన శ్రుతులుకూడ ఈ శరీర-శరీరి భావమునే సూచించుచున్నవి. దీనినిబట్టియే శ్రుతివాక్యములలోను, ఇతరత్రకూడ 'సామానాధికరణ్యము' లక్షణ అక్కరలేకయే కుదురుచున్నదని పూర్వమే నిరూపింపబడినది. దీనినిబట్టి శాంకరాది మతములకంటె నిది విలక్షణమని స్పష్టము. [పుటలు 107, 108, 109 చూడనగును.]

మూ॥ సామానాధికరణ్యంహిద్వయోః పదయోః ప్రకారద్వయ-ముఖేనైకార్థ నిష్ఠత్వమ్। తస్యచ ఏతస్మిన్ పక్షేముఖ్యతా। తథాహి - 'తత్-త్వమ్' ఇతి సామానాధికరణ్యే 'తత్' ఇత్యనేన జగత్కారణం సర్వకల్యాణగుణాకరం నిరవద్యం బ్రహ్మ ఉచ్యతే। 'త్వమ్' ఇతిచ చేతన సమానాధికరణ-వృత్తేన జీవాన్తర్యామిరూపి, తచ్ఛరీరం, తదాత్మతయా అవస్థితం, తత్ప్రకారం బ్రహ్మ ఉచ్యతే। ఇతరేషు పక్షేషు సామానాధికరణ్యహానిః బ్రహ్మణః సదోషతాచస్యాత్।

అనువాదము:- 'సామానాధికరణ్యము' అనగా రెండు పదములు భిన్నములగు రెండు ప్రకారములను (విశేష ధర్మములను) పురస్కరించుకొని ఒకే యర్థమును బోధించుట. ఈ సామానాధికరణ్యము ఈ పక్షమున (జీవ-బ్రహ్మములకు ఆత్మ-శరీరభావ మూలమగు తాదాత్మ్యము నంగీకరించిన పక్షమున) ముఖ్యము. (సహజము). ఎట్లనగా - 'తత్-త్వమ్'

(అది–నీవు) అను పదములకుగల సామానాధికరణ్యమున (ఒకే విభక్తిగల శబ్దములచే నిర్దేశించిన చోటున) 'తత్' పదముచే నిఖిలజగత్తుకు కారణమైనవాడును, సమస్త కల్యాణగుణములు కలవాడును, ఎట్టి దోషములు లేనివాడును అగు పరమాత్మ చెప్పబడుచున్నాడు. 'త్వమ్' అను జీవుని బోధించునదిగానున్న శబ్దముచే, జీవుని యందంతర్యామియై, జీవుడు శరీరముగా కలిగి, జీవునికి ఆత్మగా నున్నవాడును, జీవుని వేరుచేయరాని విశేషణముగ (అవయవముగ) కల్గినవాడును అయిన పరమాత్మ బోధింపబడుచున్నాడు. ఇక ఇతర పక్షములలో (శాంకర–భాస్కర–యాదవాది పక్షములలో) 'సామానాధికరణ్యము' అనునది కుదరకపోవుట, పరబ్రహ్మమునకు దోషములంటుట కలుగును. (శాంకరమతమున సామానాధికరణ్యము కుదరదను విషయమునకు పుటలు 104, 105, 132 చూడనగును.)

## :: పరమాత్మకును – చిదచిత్ప్రపంచమునకును శరీరశరీరిభావమును సమర్థించుట ::

మూ॥ ఏతదుక్తం భవతి — 'బ్రహ్మైవ ఏవమవస్థితమ్' ఇత్యత్ర 'ఏవమ్' శబ్దార్థభూతప్రకారతయైవ విచిత్రచేతనాచేతనాత్మక ప్రపంచస్య స్థూలస్య సూక్ష్మస్య చ సద్భావః। తథాచ 'బహుస్యాం ప్రజాయేయ' ఇతి అయమర్థః సంపన్నో భవతి, తస్యైవ ఈశ్వరస్య కార్యతయా కారణతయాచ నానాసంస్థాన సంస్థితస్య సంస్థానతయా చిదచిద్వస్తుజాతమవస్థితమితి।

అనువాదము:– (ఇక్కడ) ఇది చెప్పబడినట్లగుచున్నది. "పరబ్రహ్మమే ఇట్లున్నది" అన్నప్పుడు, "ఇట్లు" (ఏవం) అనుశబ్దమునకు అర్థమైన "ప్రకారము"గా స్థూలస్వరూపముకలదియు, సూక్ష్మమైన (కంటికి అగుపింపని అవ్యక్తమైన) రూపముకలదియునగు విచిత్రమగు జీవ–జడాత్మక ప్రపంచము ఉన్నది. ఈ విధముగ "బహుస్యాం ప్రజాయేయ" (అనేక విధములుగా పుట్టుదునుగాక) అను శ్రుతివాక్యముయొక్క అర్థము

కుదురుచున్నది. కార్యముగను [ప్రపంచముగను], కారణముగను [మూలద్రవ్యముగను] అనేక సంస్థానములతో [అవయవములపొందిక లతో అనగా ఆకృతులతో] కూడిన ఆ పరమేశ్వరునకే చేతనా-చేతనాత్మక మగు (జీవ-జడప్రపంచరూపమగు) వస్తుసముదాయము అమరి యున్నది, అని.

వివరణము:- "పరబ్రహ్మమే ఇట్లున్నాడు" అన్నచో "ఇట్లు" అనగా ఈ ప్రకారముగా అనగా ఈ విధముగానని యర్థము. ఏ విధ ముగా అన్నచో—స్థూలసూక్ష్మప్రపంచముగానని సమాధానము. దీనిని బట్టి పరబ్రహ్మమే కారణము. ఆయనే ప్రపంచముగా కార్యము. కనుక ఈ సమస్త ప్రపంచను ఆయనకు శరీరమై వేరుచేయరానియంగముగా (ప్రకారముగా) నున్నదని తాత్పర్యము. "బహుస్యాం ప్రజాయేయ" అను శ్రుతికి ఇదియే యర్థము. 87, 88, 89 పుటలు చూడుడు.

మూ॥ "ననుచ సంస్థానరూపేణ ప్రకారతయా "ఏవం" శబ్దార్థత్వం జాతిగుణయో రేవదృష్టం, న ద్రవ్యస్య। స్వతంత్రసిద్ధియో-గ్యస్య పదార్థస్య ఏవంశబ్దార్థతయా ఈశ్వరస్య ప్రకారమా-త్రత్వమయుక్తమ్" — ఇతిచేత్—ఉచ్యతే। ద్రవ్యస్యాఽపి దండకుండలాదేః ద్రవ్యాన్తరప్రకారత్వం దృష్టమేవ।

అనువాదము:- "మరి, సంస్థానమైయుండుటచే (ఆకారము లేక అవయవసన్నివేశము అయిఉండుటచే) "ఏవం" (ఇట్లు) అను శబ్దమునకు అర్థమైన "ప్రకారము"గా (వేరుచేయరాని యంగముగా) జాతి, గుణము అను రెండుమాత్రమే ఉండుట వ్యవహారసిద్ధమై కనుపించుచున్నది. ద్రవ్యమునకు (వస్తువునకు) ఈ విధముగ ప్రకారత్వము (వేరుచేయరాని యంశమై యుండుట) అనునది లేదుకదా! స్వతంత్రమైన ఉనికికి తగిన యోగ్యతగల పదార్థము-'ఏవం' అను శబ్దమునకు అర్థముగా పరమేశ్వరు నకు ప్రకారము మాత్రమే అయిఉండుట అనునది యుక్తముకాదుకదా!" (జాతిగుణములు ధర్మములు కనుక, ఒక ధర్మము, ఆ ధర్మముతో కూడిన

వస్తువునకు (గోత్వము, నల్లదనము, గోవుకు విడదీయరాని విశేషణమైనట్లు) ప్రకారము (విడదీయరాని విశేషణము లేక అంగము) కావచ్చును. కాని ఒక స్వతంత్రమైన ద్రవ్యము వేరొక దానికి ప్రకారమెట్లగును? అనగా ప్రపంచము బ్రహ్మమునకు ప్రకారమెట్లగును? అని పూర్వపక్షాశయము)—అన్నచో సమాధానము చెప్పబడుచున్నది. ద్రవ్యమైన (స్వతంత్ర పదార్థమైన) దండము (కర్ర) కుండలము (చెవిపోగు) మున్నగునవికూడ వేరొక వస్తువునకు (వ్యక్తికి) ప్రకారమగుట లోకమున చూచుచున్నదే కదా!

మూ॥ ననుచ దండాదేః స్వతంత్రస్య ద్రవ్యాన్తరప్రకారత్వే మత్వర్థీయప్రత్యయోదృష్టః. యథా—దండీ, కుండలీ ఇతి। అతః గోత్వాదితుల్యతయా చేతనాచేతనస్య ద్రవ్యభూతస్య వస్తునః ఈశ్వర ప్రకారతయా సామానాధికరణ్యేన ప్రతిపాదనం నయుజ్యతే। అతోచ్యతే। గౌరశ్వోమనుష్యో దేవ ఇతి. భూతసంఘాతరూపాణాం ద్రవ్యాణామేవ — 'దేవదత్తో మనుష్యోజాతః పుణ్యవిశేషేణ'; 'యజ్ఞదత్తో గౌర్జాతఃపాపేన కర్మణా', 'అన్యశ్చేతనః పుణ్యాతిరేకేణదేవోజాతః' ఇత్యాది దేవాదిశరీరాణాం, చేతనప్రకారతయా, లోకవేదయోః సామానాధికరణ్యేన ప్రతిపాదనందృష్టమ్,

అనువాదము:- "మరి, దండము (కర్ర) మున్నగు స్వతంత్రమైన వస్తువు వేరొక ద్రవ్యమునకు 'ప్రకారము' (వేరుచేయరాని విశేషణము) అయినప్పుడు, దానిని బోధించు దండాది శబ్దముకంటె 'మత్వర్థీయప్రత్యయము' (దీనితోకూడినవాడు అను అర్థమున 'మతుప్' మున్నగు ప్రత్యయము) కన్పట్టుచున్నది. ఎట్లనగా—దండీ, కుండలీ ఇత్యాది. (ఇక్కడ దండము కలవాడు—కుండలము కలవాడు అను అర్థమున దండ, కుండల శబ్దములకంటె 'ఇని' ప్రత్యయము చేర్చగా దండ + ఇన్ = దండీ, కుండల + ఇన్ = కుండలీ అను రూపములైనవి) కనుక, గోత్వము

మున్నగు (ధర్మములతో) సమానముగా ద్రవ్యమైన చేతనము, అచేతనము (మున్నగు) వస్తువును, ఈశ్వరునకు ప్రకారముగా (వేరుచేయరాని విశేషణముగా) సామానాధికరణ్యముతో (ఒకే విభక్తి ప్రత్యయములుగల పదములతో) నిర్దేశించి ప్రతిపాదించుట యుక్తముకాదు." (అన్నచో) సమాధానము చెప్పబడుచున్నది. గోవు, అశ్వము, మనుష్యుడు, దేవత అని ప్రాణులయొక్క సముదాయరూపములైన ద్రవ్యములను (అనగా వస్తువులను) చేతనుడైన జీవునకు 'ప్రకారము'గా సామానాధికరణ్య ప్రయోగము ద్వారమున ప్రతిపాదించుట కన్పట్టుచున్నది. (ఎట్లన)-

'దేవదత్తుడు పుణ్యవిశేషముచే మనుష్యుడైనాడు'
'యజ్ఞదత్తుడు పాపకర్మచే గోవైనాడు', 'వేరొక
జీవుడు పుణ్యాతిశయముచే దేవతయైనాడు' ఇత్యాది—
స్థలములలో దేవాది శరీరములు—జీవులకు ప్రకారములగుట-లోకమునందును వేదమునందును కలదు.

వివరణము:- యజ్ఞదత్తుడు అనగా జీవాత్మయనియు, మనుష్యుడు అనగా భౌతికమగు దేహమనియు తాత్పర్యము. అట్లే యజ్ఞదత్తుడనగా జీవాత్మ-గోవు అనగా శరీరము. ఇచ్చట ఆత్మ-శరీరమగుట కుదరదు. కాని ఒకదానినుండి మరియొకటి వేరుచేయ వీలుకానిదని తెలుపుటకే ఇట్లు సామానాధికరణ్యప్రయోగము (అనగా దేవదత్తుడు-మనుష్యుడు; యజ్ఞదత్తుడు-గోవు, జీవుడు-దేవత అను నీవిధముగా ఒకే విభక్తితో నిర్దేశించుట) చేయబడినది. ఇచ్చట మనుష్య శరీరము 'ప్రకారము' అనగా విడదీయరాని విశేషణము అనగా అంగము. యజ్ఞదత్తుడు అనగా జీవుడు 'ప్రకారి'. (విడదీయరాని అంశముతో కూడినవాడు) ఇట్లే ఇతరత్రకూడ తెలిసికొనవలయును. ఇచ్చట 'లక్షణ' (పుటలు 107, 108 చూడుడు.) అక్కరలేకయే ముఖ్యముగనే ఉన్న యర్థమునకు ఎట్టి మార్పులేకయే సామానాధికరణ్యము కుదురుచున్నదని తాత్పర్యము. దీనినిబట్టి కేవలము -జాతిగుణములను ధర్మములు మాత్రమే వేరొక వస్తువుకు ప్రకారములు

కానక్కరలేదనియు, ఒక ద్రవ్యము (మనుష్య-గో-దేవతాది దేహములు) వేరొక ద్రవ్యమునకు (జీవాత్మకు) ప్రకారములు కావచ్చునని నిరూపింప బడినది.

మూ॥ అయమర్థః, జాతిర్వాగుణోవా నతత్ర ఆదరః। కంచన ద్రవ్యవిశేషంప్రతి విశేషణతయైవ యస్యసద్భావః, తస్య తదపృథక్‌సిద్ధేః ప్రకారతయా తత్సామానాధికరణ్యేన ప్రతిపాదనం యుక్తమ్। యస్యపునః ద్రవ్యస్య పృథక్‌సిద్ధస్యైవ కదాచిత్ క్వచిత్ ద్రవ్యాన్తర ప్రకారత్వమిష్యతే, తత్ర మత్వర్థీయ ప్రత్యయః ఇతివిశేషః. ఏవమేవ స్థావరజంగమా-త్మకస్య సర్వస్యవస్తునః ఈశ్వరశరీరత్వేన తత్ప్రకారత-యైవ రూపసద్భావఇతి, తత్ప్రకారీఈశ్వరఏవ తత్తచ్ఛబ్దేన అభిధీయత ఇతి, తత్సామానాధికరణ్యేన ప్రతిపాదనం యుక్తమ్। తదేతత్ పూర్వమేవ నామరూపవ్యాకరణ శ్రుతి-వివరణే ప్రపంచితమ్।

అతః ప్రకృతి – పురుష – మహద్ – అహంకార – తన్మాత్ర – భూతేంద్రియ – తదారబ్ధచతుర్దశభువనాత్మక బ్రహ్మాండ – తదన్తర్వర్తి దేవతిర్యఙ్మనుష్యస్థావరాదిసర్వ ప్రకార సంస్థాన–సంస్థితం. కార్యమపి సర్వం బ్రహ్మైవఇతి, కారణభూత బ్రహ్మవిజ్ఞానాదేవ సర్వం విజ్ఞాతంభవతి ఇతి, ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్, ఉపపన్నతరమ్। తదేవం కార్య-కారణభావాదిముఖేన కృత్స్నస్య చిదచిద్వస్తునః పరబ్రహ్మ-ప్రకారతయా తదాత్మకత్వమ్ ఉక్తమ్।

అనువాదము:- ఇది దీనియర్థము: జాతిగాని, ద్రవ్యము (వస్తువు) గాని, గుణముగాని ఏదియైనను విశేషమేమియులేదు. ఏది, ఏ వస్తువునకు విశేషణముగనే (అవయవముగనే) ఉనికిని పొందుచున్నదో, అది, ఆ వస్తువుకంటె వేరుగ సిద్ధింపదుకనుక, దానిని ప్రకారముగా (వేరుచేయ

రాని విశేషణముగా) 'సామానాధికరణ్యము'చే (ఒకే విభక్తిగల శబ్దముల యొక్క నిర్దేశముచే) ప్రతిపాదించుటయే తగును. ఏ వస్తువు, తాను వేరుగ సిద్ధిని కలిగియుండునో, అద్దిది ఒక్కొక్కప్పుడు ఒకానొక స్థలము న వేరొక ద్రవ్యమునకు (వస్తువునకు) ప్రకారముగ నుండుట అభిమత మైనప్పుడు, అక్కడ (ఆ వస్తువును బోధించు శబ్దముకంటె) మత్వర్థీయ ప్రత్యయము (దీనితో కూడినది అను అర్థమున 'మతుప్', 'ఇనిః' మున్నగు ప్రత్యయము) వచ్చును అనుటయే విశేషము. ఈవిధముగనే స్థావరము (స్థిరముగ కదలిక లేకయుండునదియగు చెట్టు, పుట్ట, కొండ మున్నగునదియు); జంగమము (కదలాడు స్వభావము కలదియు)అగు సమస్త వస్తుజాతము ఈశ్వరునకు శరీరమై, విడదీయరాని విశేషణముగ (ప్రకారముగ) నమరి యున్నందువల్లనే దానికి స్వరూపస్థితి కలుగు చున్నదనియు, ఈ సమస్త చరాచరప్రపంచమునకు 'ప్రకారి' (అనగా ప్రపంచమును తననుండి విడదీయరాని యంశముగా నమర్చుకొన్న) ఈశ్వరుడే ఆయాయి శబ్దములచే చెప్పబడుచున్నాడు కనుక, ఆయనను బోధించు శబ్దములతో సమాన విభక్తులుకల శబ్దముల ద్వారమున (తత్-త్వమ్ ఇత్యాది శబ్దనిర్దేశము ద్వారమున) 'సామానాధికరణ్య' ప్రయోగ ముచే ప్రతిపాదించుట తగును. ఈ విషయమంతయు పూర్వమే 'నామ రూపే వ్యాకరవాణి' ఇత్యాది ఛాందోగ్య సద్విద్యాప్రకరణ వాక్యముల వివరించునప్పుడే విస్తారముగ చెప్పబడినది. (సద్విద్యాప్రకరణ-వివర ణము-మూలము చూడనగును)

కనుక (ఈవిధముగ) ప్రకృతి, పురుషుడు (జీవుడు) మహత్తత్త్వ ము (బుద్ధి), అహంకారము, పంచతన్మాత్రలు (అనగా పంచభూతముల సూక్ష్మాంశములు); పంచభూతములు (పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము అనునవి); కన్ను మొదలగు పదకొండు ఇంద్రియ ములు, వీటిచే నిర్మింపబడిన పదునాలుగు భువనములు, వీటి అన్నిటి సముదాయ రూపముగనున్న బ్రహ్మాండములు వాటిలోనున్న దేవతలు,

పశుపక్ష్యాదులు, మనుష్యులు, స్థావరములు మున్నగు అనేకవిధములగు ఆకారములతోకూడిన ప్రపంచరూపమగు కార్యమంతయు (పుట్టుట స్వభావముకల వస్తుజాతమంతయు)—పరబ్రహ్మమేనను విషయము, కారణమైన పరబ్రహ్మమునెరిగినందువలననే సమస్తము అవగతమగుచున్నది కనుక—ఒకటి తెలిసినచో అంతయు తెలియుననుటయు బాగుగ కుదురుచున్నది ఈవిధముగ పరబ్రహ్మమే కార్యము—పరబ్రహ్మమే కారణము అని బ్రహ్మమునకే కార్యకారణభావమును నిరూపించుటద్వారా సమస్త జీవ—జడాత్మక వస్తుజాతము—పరబ్రహ్మమునకు 'ప్రకార'మగుటచే పరబ్రహ్మాత్మకమని చెప్పబడినది.

మూ॥ "నను చ పరస్యబ్రహ్మణః స్వరూపేణ పరిణామాస్పదత్వం నిర్వికారనిరవద్య శ్రుతివ్యాకోప ప్రసంగేన నివారితమ్। 'ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్' (బ్ర.సూ.1-4-24)

ఇతి ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానప్రతిజ్ఞా — మృత్ తత్-కార్యదృష్టాన్తాభ్యాం, పరమపురుషస్య జగదుపాదానకారణ-త్వం చ ప్రతిపాదితమ్। ఉపాదాన కారణత్వం చ పరిణా-మాస్పదత్వమేవ। కథమిదముపపద్యతే?"

అతోచ్యతే। సజీవస్య ప్రపంచస్య అవిశేషేణ కారణముక్తమ్। తత్ర ఈశ్వరస్య జీవరూపపరిణామాభ్యు-పగమే, 'నాత్మాశ్రుతేర్నిత్యత్వాచ్చతాభ్యః' ఇతి విరుధ్యతే। వైషమ్యనైర్ఘృణ్య పరిహారశ్చ, జీవానామనాదిత్వాభ్యుపగ-మేన తత్కర్మ నిమిత్తతయా ప్రతిపాదితః. 'వైషమ్యనై-ర్ఘృణ్యే న సాపేక్షత్వాత్', 'న కర్మావిభాగాదితిచేన్న, అనాదిత్వాదుపపద్యతే చాప్యుపలభ్యతేచ' ఇతి, అకృతా-భ్యాగమ—కృత—విప్రణాశ ప్రసంగశ్చ అనిత్యత్వే అభి-హితః॥

అనువాదము:- "మరి, పరబ్రహ్మము స్వస్వరూపముచేతనే పరిణామములకు ఆశ్రయమగుచున్న దనుట-'బ్రహ్మమందెట్టి వికారములు లేవు, బ్రహ్మము నిర్దుష్టము' అని ప్రతిపాదించు 'నిర్వికారం' 'నిరవద్యమ్' ఇత్యాది శ్రుతివాక్యములకు వైరుధ్యము ఏర్పడునను కారణముచే నివారింపబడినది. 'ప్రకృతిశ్చ, ప్రతిజ్ఞా దృష్టాన్తానుపరోధాత్' (పరబ్రహ్మము ఉపాదానకారణము, ప్రతిజ్ఞా-దృష్టాన్తములకు విరోధము లేదుకనుక)అను బ్రహ్మసూత్రముచే-'ఒకటి తెలిసినచో సర్వము తెలియును-అను ప్రతిజ్ఞా వచనము'-'మట్టి, దానివలన పుట్టిన ఘటాదుల దృష్టాంతము'-అను నీ రెండిటిద్వారమున పరమపురుషుడగు పరమాత్మ-జగత్తుకు ఉపాదాన కారణమని ప్రతిపాదింపబడినది. 'ఉపాదాన కారణము' అనగా పరిణామమునకు (మార్పుకు) ఆశ్రయమగుటయేకదా! ఇది యెట్లు కుదురును?'

(ఒకవంక శ్రుతులకు విరోధము కల్గునను భావముతో బ్రహ్మమునకు పరిణామమును నివారించుచు, మరియొకవంక అదే పరబ్రహ్మమునకు జగదుపాదాన కారణత్వము నంగీకరించినచో మరల పరిణామమున కాశ్రయమని యంగీకరించుటేకదా! ఇదియెట్లు కుదురును? అని పూర్వపక్షాశయము)

ఇక్కడ సమాధానము చెప్పబడుచున్నది. జీవునితోకూడిన ప్రపంచమునకు సమానముగ (పరబ్రహ్మము) కారణమని చెప్పబడినది. ఈశ్వరుడు జీవరూపముగ పరిణమించునని యంగీకరించినచో—'నాత్మా శ్రుతేః, నిత్యత్వాచ్చతాభ్యః' అను సూత్రమునకు విరోధము కల్గును. (మరియు) 'వైషమ్య నైర్ఘృణ్యేన సాపేక్షత్వాత్' 'నకర్మ విభాగాదితిచేన్న అనాదిత్వాదుపపద్యతే చాప్యుపలభ్యతేచ' అను సూత్రములచే జీవులు అనాదియనియు, వారి కర్మములను పురస్కరించుకొనియే జీవులలో తారతమ్యమేర్పడుచున్నదని యంగీకరించి, పరమాత్మకు-జీవులపట్ల వైషమ్యము (తరతమ భావము)గాని, నైర్ఘృణ్యము (నిర్దయ)గాని లేవని నిరూపింపబడినది. (ఇట్లుకాక) జీవులు అనిత్యులు అని అంగీకరించినచో-'వారు

చేయని కర్మముల ఫలముల వారనుభవించుట' (అకృతాభ్యాగమము); 'వారుచేసిన కర్మములకు ఫలము లేకపోవుట' (కృతవిప్రణాశము) అను దోషములు కలుగునని చెప్పబడినది.

వివరణము:- పైని నిర్దేశింపబడిన సూత్రముల యర్థమిది.

1. నాత్మా శ్రుతేః నిత్యత్వాచ్చతాభ్యః (బ్ర. సూ. 2-3-19)

ఆత్మా న = ఆత్మ పుట్టునది కాదు; (ఎందువలన?)

శ్రుతేః = 'నజాయతే మ్రియతేవా విపశ్చిత్' (కఠో. 2-18)

ఇత్యాది శ్రుతివచనములచే జీవునకు ఉత్పత్తి నిషేధింపబడినది కనుక; తాభ్యః నిత్యత్వాచ్చ = ఈ శ్రుతులవలన 'ఆత్మ' నిత్యమని తెలియుచున్నది కనుకను. ఆత్మ నిత్యమని శ్రుతులు ప్రతిపాదించు చున్నవి కనుక ఆత్మ పుట్టదని తాత్పర్యము.

2. వైషమ్య నైర్ఘృణ్యే, న, సాపేక్షత్వాత్ తథాహిదర్శయతి (బ్ర. సూ. 2-1-34) వైషమ్య నైర్ఘృణ్యే = పరమాత్మకు జీవులపట్ల తరతమ భావముకాని, దయలేకపోవుటగాని; న = లేదు. (ఎందువలన?) సాపేక్ష త్వాత్ = జీవులలోగల తరతమ భేదములకు వారివారి కర్మములయొక్క అపేక్ష ఉన్నది కనుక. అనగా జీవుల కర్మ తారతమ్యమునుబట్టియే వారి లోని సుఖదుఃఖాది తారతమ్యముండునని తాత్పర్యము; తథాహి దర్శ యతి = 'సాధకారీ సాధుర్భవతి, పాపకారీ పాపోభవతి' 'మంచిపని చేసిన వాడు సజ్జనుడగును, పాపకర్మమొనర్చినవాడు పాపాత్ముడగును' అని శ్రుతి - వారి కర్మములనుబట్టియే భేదమును చూపుచున్నది కనుక, అని తాత్పర్యము.

3. న కర్మావిభాగాదితిచేన్న, అనాదిత్వాదుపపద్యతే చాప్యుప లభ్యతేచ' (బ్ర. సూ. 2-1-35) న కర్మ, అవిభాగాత్ ఇతిచేత్ = 'సృష్టికి పూర్వము కర్మములబట్టి జీవులలో వైషమ్యమున్నదనుట కుదరదు, కర్మ విభాగము, జీవ విభాగము కూడ లేదు కదా!' అన్నచో; న = అట్లుకాదు.

అనాదిత్వాత్ = జీవుడు, కర్మ పరంపర కూడ అనాది కనుక, ఉపపద్యతే చాపి = వైషమ్యము (తరతమభావము) కుదురుచున్నది కనుక; ఉపలభ్యతేచ = అట్లే శ్రుతులవలన తెలియుచున్నది కనుక - అని తాత్పర్యము.

మూ॥ తథా ప్రకృతేరప్యనాదితా శ్రుతిభిః ప్రతిపాదితా। "అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీం ప్రజాం జనయన్తీం సరూపామ్। అజో హ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః॥" ఇతి ప్రకృతి పురుషయోరజత్వం దర్శయతి। "అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్, తస్మింశ్చాన్యో మాయయా సంనిరుద్ధః॥ మాయాంతు ప్రకృతిం విద్యాత్, మాయినంతు మహేశ్వరమ్" ఇతి ప్రకృతిరేవ స్వరూపేణ వికారాస్పదమితిచ దర్శయతి। "గౌరనాద్యనన్తవతీ సాజనిత్రీ భూతభావినీ" - ఇతిచ।

అనువాదము:- అట్లే - ప్రకృతికూడ అనాదియని శ్రుతివచనములచే ప్రతిపాదింపబడినది. 'ఎరుపు, తెలుపు, నలుపు రంగులుకలదియు (రజస్సు-సత్త్వము-తమస్సు అనుగుణములు కలదియు) తనతో సమానములైన రూపములుకల అనేకములైన సంతానములను కనుచున్న [సృజించుచున్న] పుట్టువులేని ప్రకృతిని, జన్మరహితుడగు జీవుడనుభవించుచుండగా, మరియొకడు [పరమాత్మ] అనుభవింపబడిన భోగము [ఆస్వాదము] కల ప్రకృతిని విడచుచున్నాడు.' అని ప్రకృతి-పురుషుడు అను నీ యిరువురు పుట్టువు లేనివారని ఈ శ్రుతి నొడువుచున్నది. [శ్వే.4-5] 'ఈ కారణమువలననే, మాయతో కూడినవాడగు పరమాత్మ సమస్త ప్రపంచమును సృజించుచున్నాడు. ఈ ప్రపంచమున మరియొకడు [అనగా జీవుడు] మాయతో బంధింపబడినాడు.' 'మాయయనగా ప్రకృతియని యెరుగవలయును. మాయతోకూడినవాడు మహేశ్వరుడు [అనగా పరమాత్మ] అని తెలియవలయును', అని ప్రకృతియే స్వస్వరూపముచే వికారమునకు [వివిధ పరిణామములకు] ఆశ్రయమని శ్రుతిచూపుచున్నది.

'ఆది-అంతములేని ప్రకృతి [గౌః] యే భూతములను, సమస్త ప్రపంచమును పుట్టించుచున్నది' అనునదికూడ [ఇట్లే].

మూ॥ స్మృతిశ్చ—"ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి"; "భూమి-రాపో೭నలో, వాయుః, ఖం, మనో, బుద్ధిరేవచ। అహంకార ఇతీయం భిన్నా ప్రకృతిరష్టధా॥ అపరేయమిత-స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్। జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్॥" "ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునఃపునః" "మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్" ఇత్యాదికా।

అనువాదము:- ఈవిషయమును స్మృతులుకూడ ప్రతిపాదించుచున్నవి. [ఎట్లన]—[శ్రీగీత] 'ప్రకృతి-పురుషుడు అను నీ రెండును అనాదియని యెరుగుము.' 'భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అను నీ ఎనిమిది విధములైనది నాప్రకృతి. ఇదియే అపరాప్రకృతియని వ్యవహరింపబడును. ఇక నా పరాప్రకృతిని గురించి యెరుగుము. ఓ మహాబాహూ! ఈ సమస్త జగత్తును ధరించు జీవస్వరూపమైనదదియే!' 'నాప్రకృతిని ఆశ్రయించి [అనగా ఎనిమిది విధములుగా పరిణమింపజేసి] ఈ దేవ-తిర్యఙ్మనుష్య-స్థావరాత్మకమగు భూతసముదాయమును మాటిమాటికి విడచుచున్నాను.' [శ్రీగీత. 9-8] 'నేను జీవుని కర్మములననుసరించి వీక్షించుచుండగా నా ప్రకృతి సమస్త చరాచర ప్రపంచమును ఆవిష్కరించుచున్నది.' [శ్రీగీత. 9-10] మున్నగునవి.

మూ॥ ఏవంచ ప్రకృతేరపి ఈశ్వరశరీరత్వాత్, ప్రకృతిశబ్దో೭పి తదాత్మభూతస్య ఈశ్వరస్య తత్ప్రకార సంస్థితస్య వాచకః। పురుషశబ్దో೭పి తదాత్మభూతస్య ఈశ్వరస్య పురుషప్రకార సంస్థితస్య వాచకః। అతః తద్వికారాణామపి తథైవఈశ్వరః

ఆత్మా। తదాహ—"వ్యక్తం విష్ణుస్తథా వ్యక్తం పురుషః కాల-ఏవచ", "సఏవక్షోభకో బ్రహ్మన్ క్షోభ్యశ్చ పరమేశ్వరః"—ఇతి। అతః ప్రకృతిప్రకారసంస్థితే పరమాత్మని ప్రకార-భూత ప్రకృత్యంశే వికారః, ప్రకార్యంశే చ అవికారః। ఏవమేవ జీవప్రకారసంస్థితే పరమాత్మని చ ప్రకారభూత జీవాంశే సర్వేచ అపురుషార్థాః. ప్రకార్యంశః నియన్తా, నిరవద్యః సర్వకల్యాణగుణాశ్రయః, సత్యసంకల్ప ఏవ, తథాచ సతి కారణావస్థ ఈశ్వర ఏవేతి, తదుపాదానక-జగత్ కార్యస్థోఽపి స ఏవేతి, కార్యకారణయోరనన్యత్వం, సర్వశ్రుత్యవిరోధశ్చ భవతి।

తదేవం నామరూపవిభాగానర్హ సూక్ష్మదశాపన్న-ప్రకృతిపురుషశరీరం బ్రహ్మకారణావస్థమ్। జగతః తదా-పత్తిరేవప్రలయః। నామరూపవిభాగవిభక్త స్థూలచిదచిద్వస్తు-శరీరంబ్రహ్మకార్యావస్థమ్। బ్రహ్మణః తథావిధ స్థూలభావ-ఏవసృష్టిః ఇత్యుచ్యతే। యథోక్తం భగవతా పరాశరేణ—"ప్రధానపుంసోరజయోః కారణం కార్యభూతయోః।

అనువాదము:- ఈవిధముగ ప్రకృతికూడ పరమాత్మకు శరీరము కనుక, 'ప్రకృతి' అను శబ్దముకూడ ప్రకృతిని ప్రకారముగాకలిగి, దాని యందు ఆత్మగానున్న పరమాత్మనే బోధించుచున్నది. పురుషశబ్దముకూడ, పురుషుడు [జీవుడు] ప్రకారముగా కలిగి పురుషునిలోనున్న పరమాత్మనే బోధించుచున్నది. కనుక వీటి పరిణామమువలన నేర్పడిన వస్తువులకు కూడ పరమాత్మయే 'ఆత్మ'. ఇదియే—'వ్యక్తము, అవ్యక్తము, పురుషుడు, కాలము అంతయు విష్ణువే.' 'ఓమహర్షీ! ఆ పరమాత్మయే సుఖదుఃఖ వికారముల కల్గించువాడును, స్వయముగ పొందువాడును అయి ఉన్నాడు.' [వి. పు. 1-2-18/30] అనిచెప్పుచున్నాడు. [పరాశరుడు]. కనుక 'ప్రకృతిని' ప్రకారముగా [తననుండి విడదీయరాని యంశముగా]

కలిగిన పరమాత్మయందు ప్రకారముగానమరిన ప్రకృతికిచెందిన అంశ మందు [భాగమున] వికారముకలదు పరమాత్మాంశమందు వికారము లేదు. ఇట్లే జీవునిప్రకారముగాకలిగియున్న పరమాత్మయందు జీవాంశ మున [ప్రకారాంశమున] సుఖదుఃఖాది దోషములున్నవి. పరమాత్మాం శము [ప్రకార్యంశము] సర్వనియామకము, ఎట్టి దోషములు లేనిది, సమస్త కల్యాణగుణములతో కూడినది, సత్యసంకల్పముసై యున్నది. ఈ విధముగ కారణావస్థతోకూడినవాడు పరమాత్మయేననియు, అట్టి పర మాత్మను ఉపాదాన కారణముగా కలిగియున్న జగత్తు అనగా కార్యావస్థ కూడ ఆ పరమాత్మయేననియు, ఈ కారణముగ, కార్యము [జగత్తుగా నున్న బ్రహ్మను] కారణము [మూలమైన బ్రహ్మము] ఈ రెండును అభిన్నములు [ఒక్కటే] అనియు ఈ విధముగ శ్రుతివచనములకు వేటికి విరోధము లేదనియు పర్యవసించుచున్నది.

కనుక ఈ విధముగ నామము[పేరు]రూపము మున్నగు విభాగము నకు యోగ్యముకాని సూక్ష్మదశతోకూడిన ప్రకృతిని పురుషుని శరీరముగా జేసికొన్న బ్రహ్మము కారణావస్థతో కూడినది. జగత్తు అట్లు సూక్ష్మదశను పొందుటే 'ప్రళయ' మనబడును. నామ-రూప విభాగముచే వేరువేరుగ స్థూలముగనున్న జీవ-జడాత్మకవస్తుజాతము శరీరముగా కలిగిన పర బ్రహ్మము కార్యావస్థతో కూడియున్నది. పరబ్రహ్మమున కిట్టి స్థూలస్థితి యేర్పడుటయే 'సృష్టి'యని చెప్పబడుచున్నది. ఇదియే భగవానుడగు పరాశరునిచే నిట్లు చెప్పబడినది. 'పుట్టువులేని ప్రకృతి పురుషులు కార్యమై నప్పుడు పరమాత్మ కారణము' అని.

మూ॥ తస్మాత్ ఈశ్వరప్రకారభూత సర్వావస్థప్రకృతిపురుషవా- చినః శబ్దాః తత్ప్రకారవిశిష్టతయా అవస్థితే పరమాత్మని ముఖ్యతయావర్తన్తే। జీవాత్మవాచిదేవమనుష్యాదిశబ్దవత్। యథాదేవ మనుష్యాదిశబ్దాః దేవమనుష్యాదిప్రకృతిపరిణా- మవిశేషాణాం జీవాత్మప్రకారతయైవ పదార్థత్వాత్, ప్రకా-

రిణి జీవాత్మని ముఖ్యతయావర్తంతే। తస్మాత్ సర్వస్యచిద-
చిద్వస్తునః పరమాత్మశరీరతయా తత్ప్రకారత్వాత్ పర-
మాత్మని ముఖ్యతయావర్తంతే సర్వే తద్వాచకాః శబ్దాః॥

అనువాదము:- కావున, పరమాత్మకు 'ప్రకారము'గా నమరి యుండి అనేకావస్థలతో కూడియున్న ప్రకృతి-పురుషుడు [జీవుడు] అను నీ రెండింటిని బోధించు శబ్దములు, వీటిని ప్రకారములుగా కలిగియున్న పరమాత్మను బోధించుటలో సహజముగనే [ముఖ్యముగనే] ప్రవర్తించు చున్నవి. జీవాత్మను బోధించు దేవత, మనుష్యుడు ఇత్యాది శబ్దము లెట్లో అవియునట్లే. ఎట్లనగా-దేవత మనుష్యుడు మున్నగు దేహములు ప్రకృతియొక్క పరిణామములు కనుక, జీవునకు ప్రకారములై యున్నవి. కనుక దేవమనుష్యాది శబ్దములుకూడ ఈ దేహములను ప్రకారములుగా కలిగియున్న జీవాత్మనే బోధించుచున్నవి. కనుక, సమస్తమైన చిద చిదాత్మక పదార్థము పరమాత్మకు శరీరముగా నుండి ఆయనకు 'ప్రకారము'. [విడదీయరాని యంశము.] కావున అట్టి పదార్థములను బోధించు శబ్దములన్నియు పరమాత్మనే ముఖ్యముగా బోధించుచున్నవి. [ఈ విషయమున పుటలు 95, 96, 97 చూడవలయును.]

## :: శేష శేషిభావమూలకముగ సర్వశబ్దములు పరమాత్మబోధకములే ::

మూ॥ అయమేవచ ఆత్మశరీరభావః- పృథక్సిద్ధ్యనర్హాధారాధేయ-
భావః, నియన్తృనియామ్యభావము, శేషశేషి భావశ్చ।
సర్వాత్మనా ఆధారతయా, నియన్తృతయా, శేషితయాచ
"ఆప్నోతి ఇతి ఆత్మా". సర్వాత్మనా ఆధేయతయా నియా-
మ్యతయా, శేషతయాచ "అపృథక్ సిద్ధం ప్రకారభూత"-
మితి ఆకారఃశరీరమ్ ఇతిచ ఉచ్యతే। ఏవమేవ జీవాత్మనః

స్వశరీరసంబంధః। ఏవమేవ పరమాత్మనః సర్వశరీరత్వేన సర్వశబ్దవాచ్యత్వమ్।

తదాహుశ్శ్రుతిగణః। "సర్వే వేదాయత్పదమామనన్తి" "సర్వే వేదాయత్రైకం భవన్తి"–ఇతి। తస్య ఏకస్యవాచ్యత్వాత్ ఏకార్థవాచినోభవన్తీత్యర్థః। "ఏకోదేవో బహుధా సన్నివిష్టః" "సహైవ సన్తం నవిజానన్తి దేవాః" ఇత్యాది। దేవాః= ఇంద్రియాణి। దేవమనుష్యాదీనామన్తర్యామితయా ఆత్మత్వేననివిశ్య, "సహైవసన్తం" తేషామింద్రియాణి మనః పర్యన్తాని న "విజానన్తి" ఇత్యర్థః।

అనువాదము:– ఇదియే [ప్రపంచము పరమాత్మకు శరీరమై ప్రకారమగుట–పరమాత్మ దానిలో ఆత్మగా 'ప్రకారి' [ప్రకారము కలవాడు] అగుట] 'ఆత్మశరీరభావము' [ఆత్మకు–శరీరమునకుగల సంబంధము]; వేరుగ సిద్ధించుటకు యోగ్యతలేని 'ఆధారాధేయభావము' [ఆశ్రయాశ్రయిభావమని యర్థము]; 'నియంతృ నియామ్యభావము' [నియమించువానికి–నియమింపబడు వస్తువునకుగల సంబంధము]; 'శేషశేషి భావము' [దాసునకు–స్వామికి [యజమానునకు] గల సంబంధము] కూడ. అన్ని విధముల, ఆధారము, నియమించువాడు, స్వామియైన వాడును అయి లోపల వ్యాపించియుండువాడు కనుక పరమాత్మయే 'ఆత్మ'. అన్ని విధముల వేరొకదానిపై ఆధారపడియుండునది, నియమింపబడునది, అంగముగా స్వతంత్రముకానిదియునై పరమాత్మకంటె వేరుగ సిద్ధింపజాలదు కనుక ఈ చిదచిదాత్మక ప్రపంచము 'ఆకారము' 'శరీరము' అని చెప్పబడుచున్నది. ఇట్లే జీవాత్మకు–తన శరీరముతో గల సంబంధమని యెరుగవలయును. ఈ ప్రకారముగ పరమాత్మ సమస్తము శరీరముగా కలవాడగుటచేతనే సమస్త శబ్దములచేతను చెప్పబడు

చున్నాడు.

దీనినే శ్రుతివచన సముదాయమిట్లు చెప్పుచున్నది. 'సమస్త వేదములును ఏ పరమాత్మయను ప్రాప్యమును చెప్పుచున్నవో' 'అన్ని వేదములును ఏ పరమాత్మయను అర్థమందు ఏకమగుచున్నవో' అని. ఆ పరమాత్మ ఒక్కడే బోధింపదగినవాడు కనుక, వేదవచనములన్నియు ఒక్క పరమాత్మనే బోధించుచున్నవని యర్థము. 'ఒక పరమాత్మయే అన్నిటియందును అనేక విధములుగా ప్రవేశించియున్నాడు' 'తమతో పాటుగనే కలసియున్న పరమాత్మను ఇంద్రియములు తెలియజాలకున్నవి' మున్నగునవి. దేవశబ్దమునకు ఇంద్రియములని యర్థము. దేవతలు–మనుష్యులు మున్నగు దేహములలో అంతర్యామియై ఆత్మగా ప్రవేశించియున్న పరమాత్మను, ఆ దేహములనే అంటిపెట్టుకొనియున్న ఇంద్రియములు మనస్సుతోసహ, ఏవియు పరమాత్మను తెలియజాలకున్నవని యర్థము.

మూ॥ తథాచ పౌరాణికానివచాంసి। 'నతాఃస్మ సర్వవచసాంప్రతిష్ఠా యత్రశాశ్వతీ'–వాచ్యేహి వచసఃప్రతిష్ఠా। కార్యాణాంకారణం పూర్వం వచసాంవాచ్యముత్తమమ్'; 'వేదైశ్చసర్వైరహమేవ వేద్యః' ఇత్యాదీని–సర్వాణిహి–వచాంసి–సశరీరాత్మవిశిష్టమన్తర్యామిణమేవ ఆచక్షతే। 'తిస్రోదేవతా అనేనజీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపేవ్యాకరవాణి' ఇతిహిశ్రుతిః।

అనువాదము:– ఇట్లే పురాణవచనములుకూడ—'సర్వవాక్కులకు ఏ పరమాత్మయందు శాశ్వతమగు ప్రతిష్ఠకలదో [స్థానముకలదో] అట్టి పరమాత్మకు నమస్కరింతుము.'—అర్థమందే శబ్దమునకు స్థానముండును. 'కార్యములన్నిటికి ముందుండు కారణము, శబ్దముల కుత్కృష్టమైన యర్థము' 'వేదములన్నింటిచే నేనే తెలియదగియున్నాను' – మున్నగు వచనములన్నియు శరీరముతో కూడిన జీవాత్మయందు అంతర్యామిగ

నున్న పరమాత్మనే బోధించుచున్నవి. 'పృథివి-జలము-తేజస్సు అను మూడు దేవతలను ఈ జీవాత్మద్వారమున ప్రవేశించి నామరూపముల విస్తరింపజేతును' అనికదా శ్రుతివచనము [ఛాందోగ్యోపనిషద్వచనము.]

మూ॥ తథాచ మానవంవచః—'ప్రశాసితారం సర్వేషామణీయాంస మణీయసామ్। రుక్మాభం స్వప్నధీగమ్యం విద్యాత్తుపురుషం-పరమ్॥' అంతఃప్రవిశ్యఅంతర్యామితయా సర్వేషాం ప్రశా-సితారం నియంతారమ్, అణీయాంసః ఆత్మానః, కృత్స్నస్య అచేతనస్య వ్యాపకతయా సూక్ష్మభూతాః। తేషామపివ్యాప-కత్వాత్ తేభ్యోఽపి సూక్ష్మతర ఇత్యర్థః। రుక్మాభః=ఆది-త్యవర్ణః। స్వప్నధీగమ్యః=స్వప్నకల్పబుద్ధిప్రాప్యః। విశద-తమప్రత్యక్షతాపన్నాను ధ్యానైకలభ్య ఇత్యర్థః। 'ఏనమేకే వదన్త్యగ్నిం, మరుతోఽన్యే ప్రజాపతిమ్। ఇంద్రమేకే, పరేప్రాణమ్, అపరే బ్రహ్మశాశ్వతమ్॥' ఇతి। ఏకే=వేదాః ఇత్యర్థః। ఉక్తరీత్యా పరస్యైవబ్రహ్మణః సర్వస్యప్రశాసి-తృత్వేన సర్వాన్తరాత్మతయా ప్రవిశ్య అవస్థితత్వాత్ అగ్న్యాదయోఽపిశబ్దాః శాశ్వతబ్రహ్మశబ్దవత్, తస్యైవ-వాచకా భవన్తి ఇత్యర్థః॥ తథాచ స్మృత్యన్తరమ్ — 'యేయ-జన్తి పితౄన్ దేవాన్ బ్రాహ్మణాన్ సహుతాశనాన్। సర్వ-భూతాన్తరాత్మానం విష్ణుమేవయజన్తి తే॥' ఇతి। పితృ-దేవ-బ్రాహ్మణ-హుతాశనాదిశబ్దాః తన్ముఖేన తదన్తరాత్మభూ-తస్య విష్ణోరేవ వాచకాః ఇత్యుక్తం భవతి।

అనువాదము:— ఇట్లే మనువచనముకూడ—'సమస్త ప్రపంచమును నియమించువాడును, అణువులకంటె సూక్ష్మమైనవాడును, బంగారురంగు గల దేహకాంతి కలవాడును, స్వప్నముతో సమానమైన బుద్ధిచే పొంద దగినవాడును, అయిన పరమపురుషుని యెరుగవలయును.' (మను. 12-122) లోన ప్రవేశించి అంతర్యామిగా నుండి సమస్త చేతనాచేతనకోటిని

నియమించువాడును, సమస్తమగు జడవస్తువునందు ప్రవేశించి వ్యాపించి యుండుటచే సూక్ష్మములైన ఏ యాత్మతత్త్వములు కలవో వాటిలోకూడ ప్రవేశించి వ్యాపించువాడగుటచే వాటికంటెగూడ మిక్కిలి సూక్ష్మ స్వరూపము కలవాడును అని యర్థము. రుక్మాభః = సూర్యునివంటి స్వర్ణమయ దేహకాంతి కలవాడు. స్వప్నధీగమ్యః = స్వప్నముతో సమానమైన బుద్ధిచే పొందదగినవాడు. స్వచ్ఛమైన ప్రత్యక్షముగా నేర్పడిన ధ్యానముచే మాత్రమే పొందదగినవాడని యర్థము. 'ఈ పరమాత్మను కొన్ని (వచనములు) అగ్నియనుచున్నవి. మరికొన్ని వాయువు, కొన్ని చతుర్ముఖబ్రహ్మ, మరికొన్ని ఇంద్రుడు, మరికొన్ని ప్రాణము, ఇతరములు శాశ్వతబ్రహ్మము అని పేర్కొనుచున్నవి.' (మను. 12-123) 'కొన్ని' (ఏకే) అనగా వేదములు. ఈ చెప్పబడిన విధముగా, పరబ్రహ్మమే అంతట ప్రశాసకునిగా, అంతర్యామిగా ప్రవేశించి ఉన్నదికనుక, 'అగ్ని' మున్నగు శబ్దములుకూడ-'శాశ్వతబ్రహ్మ' శబ్దమువలెనే పరబ్రహ్మమునే బోధించుచున్నవని యర్థము. ఇట్లే వేరొక స్మృతికూడ కలదు. 'ఎవ్వరు పితృదేవతల నారాధింతురో, ఎవ్వరు బ్రాహ్మణులను, అగ్నులతోపాటుగ నారాధింతురో వారు, సర్వభూతముల యందంతరాత్మగానున్న విష్ణువునే ఆరాధించుచున్నారు' అని. పితృశబ్దము-దేవ-బ్రాహ్మణ-హుతాశన శబ్దములును ఆయాయి శబ్దములచే బోధింపబడు సామాన్యార్థములతోపాటు వాటియందు అంతర్యామిగానున్న పరమాత్మయగు శ్రీమన్నారాయణునే బోధించునవియని చెప్పబడినట్లగుచున్నది.

వివరణము:- ఇంతవరకు సమస్త చిదచిదాత్మక ప్రపంచమును శరీరముగ, ప్రకారముగ (విడదీయరాని యంశముగ) కల్గినవాడు 'ప్రకారి' శ్రీమన్నారాయణుడేనని శ్రుతి, స్మృతి పురాణ వచనములు ప్రతిపాదించుచున్నవి కనుక-అన్ని శబ్దములచేతను ఆ పరమాత్మయే బోధింపబడుచున్నాడని స్పష్టపరుపబడినది. 95, 96, 97 పుటలలోని మూలము, వివరణము, ఈ విషయమును విశదపరచుచున్నది.

## ॥ సర్వశాస్త్రముల ప్రధాన తాత్పర్యము ॥

మూ॥ అతేదం సర్వశాస్త్రహృదయమ్।

జీవాత్మానః స్వయమసంకుచితాపరిచ్ఛిన్న నిర్మలజ్ఞాన స్వరూపాః సన్తః, కర్మరూపావిద్యావేష్టితాః, తత్తత్కర్మాను- రూప జ్ఞానసంకోచమాపన్నాః బ్రహ్మాదిస్తంబపర్యన్త వివిధ విచిత్రదేహేషు ప్రవిష్టాః, తత్తద్దేహోచితలబ్ధజ్ఞానప్రసరాః, తత్తద్దేహాత్మాభిమానినః, తదుచితకర్మాణి కుర్వాణాః, తద- నుగుణ సుఖదుఃఖోపభోగరూపసంసారప్రవాహం ప్రతిపద్య- న్తే। ఏతేషాం సంసారమోచనం భగవత్ప్రపత్తిమంతరేణ నోపపద్యతే ఇతి, తదర్థం ప్రథమమేషాం దేవాదిభేదరహిత- జ్ఞానైకాకారతయా సర్వేషాంసామ్యంప్రతిపాద్య, తస్యాఽపి స్వరూపస్య భగవచ్ఛేషతైకస్వరూపైకరసతయా భగవదా- త్మకతామపిప్రతిపాద్య, భగవత్స్వరూపం చ హేయప్రత్య- నీకకల్యాణైకతానతయా సకలేతరవిసజాతీయమ్, అనవధి- కాతిశయాసంఖ్యేయ కల్యాణగుణగణాశ్రయం, స్వసంకల్ప- ప్రవృత్త సమస్త చిదచిద్వస్తుజాతతయా సర్వస్య ఆత్మ- భూతం ప్రతిపాద్య, తదుపాసనం సాంగం, తత్ప్రాపకం- ప్రతిపాదయన్తి శాస్త్రాణీతి।

అనువాదము:- సమస్త శాస్త్రములయొక్క హృదయము (ప్రధా నాభిప్రాయము) ఇది. 'జీవాత్మలు స్వయముగ (సహజముగ) ఎట్టి కుదింపునుగాని, పరిమితినిగాని పొందని నిర్మలమైన జ్ఞానమే స్వరూప ముగ కలవారయ్యును, కర్మమనెడియవిద్యచే చుట్టబడినవారై, ఆయాయి కర్మములకు తగిన విధముగ జ్ఞానముయొక్క (తమయందు గుణముగా గల జ్ఞానముయొక్క) కుదింపును పొందుచున్నారు. అందువలననే బ్రహ్మ మొదలు-దుబ్బు వరకు అనేక విధములైన విచిత్రములగు దేహ

ములయందు ప్రవేశించుచున్నారు. ఇట్లు ప్రవేశించి ఆయాయి శరీరము లకు తగిన జ్ఞానప్రసారము కలవారై, ఆయాయి దేహములయందు 'ఈ దేహమే ఆత్మ' అను తాదాత్మ్యబుద్ధిని పొంది దానికి తగిన (దేహమున కనుగుణములైన) కర్మములనే చేయుచు, తదనుగుణమగు సుఖము, దుఃఖము మున్నగు భోగానుభవరూపమగు సంసారచక్రమున బడు చున్నారు. ఇట్టి ఈ జీవులకు సంసారమునుండి విముక్తి యనునది భగ వంతునియొక్క 'ప్రపత్తి' (శరణాగతి) లేనిదే కుదరదు. కనుక దీని కొరకు మొట్టమొదట దేవాదిదేహభేదము లెంతమాత్రములేని కేవలజ్ఞానమే స్వరూపముగా కల్గిన వారగుటచే జీవులందరు సమానులే అని శాస్త్రములు ప్రతిపాదించుచున్నవి. పిమ్మట ఇట్టి జీవస్వరూపముకూడ భగవంతునకు శేషమై (దాసత్వమును పొంది) యుండుటే స్వాభావికమనియు, ఆ విధ ముగ పరమాత్మయే 'ఆత్మ'గాకలిగియున్నదని ప్రతిపాదించుచున్నవి. ఇక భగవంతుని స్వరూపము నింద్యములైన దోషములకు విరుద్ధమైన శుభమే (కల్యాణమే) సంపూర్ణముగ కలిగియున్నదనియు, ఇందువలననే తనకంటె వేరైన చిదచిదాత్మక వస్తుజాతముకంటె విలక్షణమైనది, అంతు లేని అతిశయము (గొప్పతనము) తో కూడిన లెక్కింపనలవికాని కల్యాణ గుణములయొక్క సమూహములకు ఆశ్రయమైనది, తన సంకల్పము (ఇచ్ఛ) చేతనే ప్రవర్తించుచున్న నిఖిలమగు జీవ-జడవస్తుసముదాయ ముకలిగి సర్వమునకు 'ఆత్మ'గా లోన ప్రవేశించియున్నది-అని ప్రతి పాదించుచున్నవి. ఇట్టి పరమాత్మను పొందించునది శ్రవణకీర్తనాద్య నేకాంగములతో కూడిన భగవదుపాసనమని (కూడ) ప్రతిపాదించు చున్నవి.

వివరణము:- పైని నిర్దేశించిన విషయముల వివరణమును-స్వ మత సంక్షేపము పుట: 10; వేదాన్తవాక్య ప్రయోజనము పుట: 13; జీవాత్మస్వరూపము పుట: 21; పరమాత్మ స్వరూపము పుట: 26; అను శీర్షికల క్రింద నీయబడిన అనువాద-వివరణములలో చూడనగును.

మూ॥ యథోక్తం — 'నిర్వాణమయ ఏవాయమాత్మా జ్ఞానమయో౽మలః॥ దుఃఖాజ్ఞానమలా ధర్మాః ప్రకృతేస్తే న చాత్మనః॥' ప్రకృతి సంసర్గకృతకర్మమూలత్వాత్ న ఆత్మస్వరూపప్రయుక్తాః ధర్మాః ఇత్యర్థః। ప్రాప్తాప్రాప్తవివేకేన 'ప్రకృతేరేవ ధర్మాః' ఇత్యుక్తమ్।

'విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని। శుని చైవ శ్వపాకే చ పండితాస్సమదర్శినః॥' ఇతి – దేవ – తిర్యక్ – మనుష్య – స్థావర – రూపప్రకృతిసంసృష్టస్య ఆత్మనః స్వరూప వివేచనీ బుద్ధిః యేషాం తే పండితాః, తత్తత్ప్రకృతివిశేష-వియుక్తాత్మయాథాత్మ్యజ్ఞానవన్తః, తత్ర తత్ర అత్యన్తవిష-మాకారే వర్తమానమ్ ఆత్మానం సమానాకారం పశ్యన్తి ఇతి 'సమదర్శినః' ఇత్యుక్తమ్।

అనువాదము:– ఇట్లు చెప్పబడినది–'జ్ఞానానందమయుడై నిర్మల స్వభావుడైన ఈ జీవునకు దుఃఖము, అజ్ఞానము మున్నగు ధర్మములు ప్రకృతి (దేహము) యొక్క సంబంధముచే నేర్పడినవేకాని ఆత్మకు సహజములుకావు' (పుట 23 చూ.) ప్రకృతియొక్క సంబంధముచే కల్గిన కర్మమునుబట్టి ఏర్పడినవగుటచే (సుఖ దుఃఖాదులు) ఆత్మస్వరూప మూలము లగు ధర్మములు కావని యర్థము. ప్రకృతి సంబంధమున్నప్పుడే దుఃఖాదిప్రాప్తి, ప్రకృతి సంబంధము లేనప్పుడు దుఖాఃదుల అప్రాప్తి (అనగా దుఃఖాదులు లేకపోవుట) అను జ్ఞానమునుబట్టి 'దుఃఖాది ధర్మములు ప్రకృతికి చెందినవే' అని చెప్పబడినది. (వి.పు. 7-8-22)

('ప్రాప్తాప్రాప్త వివేకేన' అనుమాటకు శాస్త్రీయపరిభాషలో అన్వయ వ్యతిరేకములని యర్థము. ప్రకృతియున్నచో దుఃఖాదులుండుట, అది లేనిచో దుఃఖాదులు లేకపోవుట. దీనినిబట్టి దుఃఖాదులు ప్రకృతివేతప్ప ఆత్మకు చెందినవి కావని యభిప్రాయము) 'విద్యా వినయములతోకూడిన వానిని, సామాన్య బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, కుక్కను, నీచజాతి

వానిని సమానముగ చూడగలవారే పండితులు.' అని–దేవత–పశుపక్ష్యాదులు, మనుష్యుడు, చెట్టుపుట్ట మున్నగు ప్రకృతితో కలసియున్న ఆత్మ యొక్క స్వరూపమిదియని తెలియగల బుద్ధి ఎవ్వరికి కలదో వారే పండితులు. వారు, ఆయాయి ప్రకృతితో (దేహముతో) విడివడిన ఆత్మ యొక్క యథార్థస్వరూపము నెరిగినవారై, ఆయాయి దేహములయందు విషమములైన (ఒకదానితో నొకటి పొంతన లేక వేరువేరుగనున్న) ఆకృతులతో కూడియున్న ఆత్మను 'అదియు ఇదియు ఒక్కటే' అని సమాన రూపముగ చూచుదురుకనుక 'సమదర్శినః' (సమానముగ చూచువారు) అని చెప్పబడినది. (శ్రీగీత. 5-18)

మూ॥ తదిదమాహ – 'ఇహైవతైర్జితఃస్వర్గో యేషాంసామ్యే స్థితం మనః। నిర్దోషం హి సమం బ్రహ్మ, తస్మాద్బ్రహ్మణితేస్థితాః॥' ఇతి। నిర్దోషం = దేవాదిప్రకృతివిశేషసంసర్గరూపదోషరహితమ్। స్వరూపేణావస్థితం సర్వమ్ ఆత్మవస్తు నిర్వాణరూపజ్ఞానైకాకారతయా 'సమమ్' ఇత్యర్థః॥ (శ్రీగీతా: 5–19)

అనువాదము:– కనుకనే ఇది (గూడ) చెప్పుచున్నాడు – 'ఎవ్వరి మనసు సామ్యస్థితిని పొందియున్నదో (అంతటగల యాత్మలు సమానములేనని తెలిసికొనుచున్నదో) వారిచ్చటనే మోక్షమును స్వాధీనపరచుకొనుచున్నారు. ప్రకృతిసంబంధము మున్నగు దోషములు లేనిధగు ఆత్మ–బ్రహ్మమే కనుక, వారి మనస్సు బ్రహ్మమందున్నట్లే' అని. 'నిర్దోషమ్' అనగా దేవతలు, మనుష్యులు మున్నగు ప్రకృతి (దేహాదికము) యొక్క సంబంధము కలిగియుండుటయను దోషము లేనట్టిది. [ఈ కారణముచేతనే] స్వస్వరూపముతో ఎట్టి వికారములేకయేయున్న ఆత్మవస్తువులన్నియు జ్ఞానానందములే స్వరూపముగాకలవి కనుక 'సమానమ'ని యర్థము.

వివరణము:– ఇంతవరకుగల గ్రంథముచే జీవాత్మస్వరూపము

ప్రకృతి సంబంధముచే భిన్నముగనున్నను స్వస్వరూపమునుబట్టి (జ్ఞానానంద స్వరూపములనుబట్టి) సమానమేననియు స్పష్టపరుపబడినది. ఈ విషయమే గ్రంథారంభమున—'తచ్చ సర్వేషాం సమానమ్' అను గ్రంథముచే నిర్దేశింపబడినది. (పుటలు 22, 23, 24 చూడనగును.)

మూ॥ తస్యైవంభూతస్యఆత్మనః భగవచ్ఛేషతైకరసతా, తన్నియామ్యతా, తదేకాధారతాచ, తచ్ఛరీర—తత్తనుప్రభృతిభిః శబ్దైః సామానాధికరణ్యేనచ శ్రుతిస్మృతీతిహాస పురాణాదిషు ప్రతిపాద్యతే ఇతిపూర్వమేవోక్తమ్।

అనువాదము:— ఇట్టి ఈ జీవాత్మ—భగవంతునకు శేషమై (ఆయనకే పరతంత్రుడై, ఆయనకే అతిశయమును కల్గించువాడై) యుండుటే స్వభావముగ కలిగియున్నాడనియు, ఆయనచే నియమింపబడుచున్నాడనియు, పరమాత్మనే ఆధారముగా (ఆశ్రయముగా) కలిగియున్నాడనియు, 'తచ్ఛరీరము' (ఆయనయొక్క శరీరము) 'తత్తనువు' (ఆయనయొక్క దేహము) ఇత్యాది శబ్దములచే 'సామానాధికరణ్య నిర్దేశము' ద్వారమున శ్రుతులు (తత్త్వమసి ఇత్యాదులు) స్మృతులు, రామాయణ భారతేతిహాసములు, పురాణములు మున్నగు వాటియందు ప్రతిపాదింపబడుచున్నాడని పూర్వమే చెప్పబడినది. (పుటలు—35, 36 చూడనగును)

మూ॥ 'దైవీహ్యేషాగుణమయీ మమమాయాదురత్యయా।
మామేవయేప్రపద్యంతే మాయామేతాం తరన్తితే॥' ఇతి,

తస్యైతస్యఆత్మనః కర్మకృతవిచిత్రగుణమయప్రకృతి సంసర్గరూపాత్ సంసారాత్ మోక్షః భగవత్ప్రపత్తిమన్తరేణ నోపపద్యతే ఇత్యుక్తం భవతి;

"నాన్యః పంథా అయనాయవిద్యతే" ఇత్యాదిభిఃశ్రుతిభిశ్చ।
"మయాతతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా।

మత్స్థాని సర్వభూతాని నచాహం తేష్వవస్థితః॥
నచమత్స్థానిభూతానిపశ్యమేయోగమైశ్వరమ్।" ఇతి,

సర్వశక్తియోగాత్ స్వైశ్వర్య వైచిత్ర్యముక్తమ్। తదాహ–"విష్టభ్యాహమిదంకృత్స్నమేకాంశేన స్థితోజగత్।" ఇతి। అనన్తవిచిత్రమహాశ్చర్యరూపం జగత్ మమఅయుతా-యుతాంశాంశేన ఆత్మతయాప్రవిశ్య, సర్వం మత్ సంక-ల్పేన విష్టభ్య, అనేనరూపేణ అనన్తమహావిభూతిః అపరిమి-తోదారగుణసాగరః నిరతిశయాశ్చర్యభూతః స్థితః అహమ్ ఇత్యర్థః॥

అనువాదము:– 'సత్త్వము–రజస్సు–తమస్సు అను మూడుగుణములతో కూడినదై లీలకై (క్రీడార్థమై) ప్రవర్తించిన నాచే నిర్మింపబడినదై (దైవీ) నా మాయ (ఆశ్చర్యకరములగు కృత్యముల చేయునది కనుక మాయ) దాటరానిదే! ఎవ్వరు నన్నే ఉపాయముగా ఆశ్రయించి సేవింతురో వారు నామాయను దాటగల్గుదురు.' (శ్రీగీత. 7-14) అని—ఈ జీవాత్మకు కర్మసంబంధము వలన నేర్పడినవిచిత్రములగు గుణములుకల ప్రకృతియొక్క సంగమే సాంసారము కనుక, ఇట్టి సంసారమునుండి మోక్షము–భగవంతునియొక్క 'ప్రపత్తి' లేనిచో కుదరదని చెప్పబడినది. 'భగవత్ప్రాప్తికి వేరు మార్గములేదు' ఇత్యాది శ్రుతివచనములచేగూడ నిదియే చెప్పబడినది.

'ఈ చేతనాచేతనాత్మకమగు సమస్తజగత్తు కంటికగుపింపని యంతర్యామిరూపుడనగు నాచే వ్యాపింపబడియున్నది. ఈ కారణముచే సమస్త భూతములు అంతర్యామినగు నాయందే ఉన్నవి. నేనుమాత్రము ఆ భూతములపై ఆధారపడిలేను. ఘటాదులు జలము మున్నగువాటికి ఆధారమైనట్లు నేను వాటికి ఆధారమును కాను. (కాని నా సంకల్పముచేతనే ఆధారమైయున్నానని భావము) ఇతరత్ర ఎచ్చట ఊహింపవీలు కాని నాయొక్క అసాధారణమగు ఐశ్వర్యయోగమని దర్శింపుము."

(శ్రీగీత. 9. 4/5) అని సర్వవిధములగు శక్తులు కలిగియుండుటచే తన యొక్క ఐశ్వర్య విచిత్రత చెప్పబడినది. దీనినే యిట్లు చెప్పుచున్నాడు- ఈ చిదచిదాత్మకమైన (జీవ-జడాత్మకమైన) ఈ సమస్తజగత్తును నా స్వరూపముయొక్క ఒకభాగముతో ప్రవేశించియున్నాను.' (శ్రీగీత. 11-42) అని. అపారమై అత్యంతాశ్చర్యకరమైన ఈ ప్రపంచమును అతి సూక్ష్మాంశముతో ఆత్మగా లోపల ప్రవేశించి, అంతటిని నాసంకల్పముచే ఆవరించి ఉన్నవాడనై, ఈ కారణముచే అపారమగు మహావిభూతి (పరమైశ్వర్యము) కలవాడను, అంతులేని ఉదారగుణములకు సముద్రమువలె ఏకాశ్రయమును, మిక్కిలి ఆశ్చర్యమును కలిగించు స్వభావము కలవాడనుఅయి నేనే ఉన్నాను' అనిఅర్థము.

వివరణము:- మూలమున 'అంశేన' అనుపదమునకు 'అయుతాయుతాంశేన' అనియర్థము వ్రాయబడినది. అయుతాంశమనగా పది వేలవభాగము. దానిలో పదివేలవ భాగము-అయుతాయుతాంశము. అత్యంత సూక్ష్మాంశ స్వరూపముచే ప్రవేశించియున్నాడని తాత్పర్యము.

భగవత్ప్రపత్తియే మోక్షసాధనమని మూలమున పేర్కొనబడినది. ఈ క్రింది శ్లోకములలో ప్రపత్తియననేమో స్పష్టపరుపబడినది.

'సాధనం భగవత్ప్రాప్తౌ సఏవేతి స్థిరామతిః।
సాధ్యభక్తిస్తథాసైవ ప్రపత్తిరితి గీయతే॥
ఉపాయో భక్తిరేవేతి తత్ప్రాప్త్యాయాతుసామతిః।
ఉపాయభక్తిరేతస్యా పూర్వోక్తైవ గరీయసీ॥
ఉపాయభక్తిః ప్రారబ్ధవ్యతిరిక్తాఘనాశినీ।
సాధ్యభక్తిస్తుసా హన్త్రీ ప్రారబ్ధస్యాఽపి భూయసీ॥'

భక్తి రెండువిధములు. సాధన భక్తి-సాధ్యభక్తి అని. భగవత్ప్రాప్తికి భక్తియే సాధనమను భావనయే ఉపాయభక్తియనబడును. అట్లుకాక- భగవత్ప్రాప్తికి భగవానుడే ఉపాయమని దృఢమైన నిశ్చయమే సాధ్యభక్తి. ఇదియే ప్రపత్తియని వ్యవహరింపబడును. ఇదియే గొప్పది.

వలన—సాధనభక్తి—ప్రారబ్ధకర్మముకంటె వేరైన పాపములమాత్రమే నశింపజేయును. ప్రపత్తి (సాధ్యభక్తి) ప్రారబ్ధకర్మమునుగూడ పో గ్రోల్చును. ఈ రెండిటిలో సాధనభక్తి లేక ఉపాయభక్తి అనునది శాస్త్ర ప్రతిపాదితములైన వివేకము, విమోకము, అభ్యాసము, క్రియ, కల్యాణములు, అనవసాదము, అనుద్ధర్షము అను ఏడు సాధనములవలన పుట్టును. ఇక సాధ్యభక్తి (ప్రపత్తి) అనునది కేవలము భగవంతుని కృపచేమాత్రమే లభించును.

'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' ఇత్యాది శ్రుతివచనము ఈ భక్తినే నిర్దేశించుచున్నది. శ్రీ విష్వక్సేనసంహిత ప్రపత్తియే మోక్షసాధన మని నొడువుచున్నది. 'ఆత్మనోదుర్దశాపత్తిం విమృశ్యచగుణాన్ మమ। మదేకోపాయసంవిత్తిఃమాంప్రపన్నో విముచ్యతే॥' 'తనయొక్క దుర్దశను (ఎట్టి సాధనమును ఆశ్రయింపలేని అశక్తతను); భగవానుని కల్యాణగుణములను లెస్సగ విమర్శించి భగవానుడు మాత్రమే ఉపాయ మను బుద్ధితో భగవానుని ఆశ్రయించినవాడే ముక్తిని పొందగలడ'ని తాత్పర్యము. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ' అను శ్రీ గీతావచనముకూడ ప్రపత్తియే మోక్షోపాయమని చెప్పుచున్నది. ఇక 'మాయా'శబ్దమునకు ఆశ్చర్యకరమగు శక్తి అనియే అర్థముకాని మిథ్య యని కాదు. భగవత్పాదమతమున 'మాయ' తుచ్ఛమైనది. భగవ ద్రామానుజమతమున అది తుచ్ఛము కాదు. ఆశ్చర్యకరమగు భగవ చ్ఛక్తి.

మూ॥ తదిదమాహ — "ఏకత్వే సతి నానాత్వం, నానాత్వే సతి చైకతా। అచిన్త్యం బ్రహ్మణోరూపం కస్తద్వేదితుమర్హతి॥" ఇతి, ప్రశాసితృత్వేన ఏకఏవసన్ విచిత్రచిదచిద్వస్తుషు అంతరాత్మతయా ప్రవిశ్య, తత్తద్రూపేణ విచిత్రప్రకారః, విచిత్రకర్మకారయన్ నానారూపతాంభజతే। ఏవం స్వల్పాల్పాంశేన తు సర్వాశ్చర్యమయం నానారూపంజగత్ తదం-

తరాత్మతయాప్రవిశ్య విష్టభ్య నానాత్వేన అవస్థితోఽపిసన్ అనవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణః సర్వేశ్వరేశ్వరః పరబ్రహ్మభూతః పురుషోత్తమః నారాయణః నిరతిశయాశ్చర్యభూతః నీలతోయదసంకాశః పుండరీకదలామలాయతేక్షణః సహస్రాంశుః సహస్రకిరణః, పరమేవ్యోమ్ని "యో-వేదనిహితం గుహాయాం పరమేవ్యోమన్" "తదక్షరే పరమే వ్యోమన్" ఇత్యాదిశ్రుతిసిద్ధే, ఏకఏవఅవతిష్ఠతే।

బ్రహ్మవ్యతిరిక్తస్యైకస్య చిదపివస్తునః, ఏకస్వభావస్య ఏకకార్యశక్తియుక్తస్య ఏకరూపస్య రూపాంతరయోగః స్వభావాన్తరయోగః శక్త్యన్తరయోగశ్చ నఘటతే। తస్యఏకస్య పరస్యబ్రహ్మణః సర్వవస్తువిసజాతీయతయా సర్వస్వభావత్వం సర్వశక్తియోగశ్చేతి, ఏకస్యైవ విచిత్రానన్తనానారూపతా చ. పునరపి అనన్తాపరిమితాశ్చర్యయోగేన ఏకరూపతాచ నవిరుద్ధా ఇతి వస్తుమాత్రసామ్యాత్ విరోధచిన్తానయుక్తా ఇత్యర్థః।

అనువాదము:- దీనినే యిట్లు చెప్పుచున్నాడు. 'ఏకత్వము (అభేదము) ఉన్నప్పటికిని అనేకత్వము (భేదము) కలదియు, అనేక రూపములు కలదైనప్పటికిని ఒక్కటిగనే ఉన్నట్టిదియునైన పరబ్రహ్మము యొక్క రూపము మనస్సుచే భావింపనలవికానిది. దానినెవ్వడు తెలిసికొన సమర్థుడు?'అని. ప్రశాసకునిగా (నియామకునిగా) ఒక్కడే అయి ఉన్నను, ఆశ్చర్యకరములైన చిదచిద్వస్తువులయందు (జీవ-జడపదార్థములయందు) అంతరాత్మగా ప్రవేశించి, ఆయాయి వస్తువులయొక్క రూపముతో విచిత్రమైన స్వభావముకలవాడై, విచిత్రములైన కర్మముల చేయించుచు అనేకరూపముల ధరించుచున్నాడు. ఇట్లే అత్యల్పమైన అంశముతో అత్యంతాశ్చర్యయుతమై అనేక రూపములతోకూడిన జగత్తులోపల అంతరాత్మగా ప్రవేశించి నియమించుచు అనేకవిధములుగా

నున్నప్పటికిని, తానొక్కడే ఉన్నాడు. (ఎట్లనగా) అంతులేని అతిశయముతో కూడిన లెక్కింపనలవికాని కల్యాణ గుణసముదాయము కలవాడును, నియామకులైనవారినందరిని నియమించువాడును, పరబ్రహ్మ స్వరూపుడును, పురుషోత్తముడును, శ్రీమన్నారాయణుడును, అపరిమితమైన ఆశ్చర్యమునకు కారణమైనవాడును, నీలమేఘసమానకాంతియు, పద్మపత్రవిశాలనయనుడును, సూర్య సహస్ర సమానకాంతిని నలువైపుల వెదజల్లుచున్నవాడై 'యోవేదనిహితం గుహాయాం పరమే వ్యోమన్' (తై. 1-1) 'ఎవ్వడు హృదయమను గుహయందును, శ్రీవైకుంఠము నందును ఉన్నపరమాత్మను తెలిసికొనునో' (వాడు సర్వకామములను పొందును.) 'తదక్షరే పరమేవ్యోమన్' [తై. 1-1-2] 'అక్షరమగు [నిత్యమగు] పరమపదమునందున' ఇత్యాది శ్రుతివచనములచే సిద్ధించిన పరమవ్యోమమని పిలువబడు పరమపదమున అనగా శ్రీవైకుంఠమున [ఒక్కడుగనే] ఉన్నాడు.

పరబ్రహ్మముకంటె వేరైన ఏ వస్తువునకును అనగా ఒకేవిధమగు స్వభావము, ఒకే పనినిచేయగల శక్తి కలిగినదియు, ఒకే రూపముకల వస్తువునకు వేరొకరూపముయొక్కయు, వేరొక స్వభావముయొక్కయు, వేరొక శక్తియొక్కయు సంబంధమెంతమాత్రము కుదరదు. [ఒకే అగ్ని-కాల్చుశక్తి కలది, ఎర్రగా నుండునది, వేడితనము కలదియై-అదియే చల్లదనము కల్గించుశక్తి కలిగి, వేరొకరూపముతో, గంధాది విశిష్టమును కాజాలదుకదా!] కేవలమాపరబ్రహ్మమునకు మాత్రమే అది సమస్త వస్తువులకంటె అత్యంత విలక్షణమైనది కనుక, అన్ని స్వభావముల తోడను, అన్ని శక్తులతోడను, విచిత్రములైన అనన్తరూపముల తోడను కూడియుండుట కుదురును. మరియు, అనంతములును, అపరిమితములును [పరిమితి లేనివియు] అత్యన్తాశ్చర్యకరములగు శక్తులయొక్క సంబంధముచే 'ఒక్కటే' అయియుండుటకూడ విరుద్ధమెంతమాత్రము కాదు. కనుక లౌకికములైన సామాన్యవస్తువులయొక్క పోలికనుబట్టి పరబ్రహ్మ

విషయమున విరోధము శంకింపతగదని యర్థము.

మూ॥ యథోక్తమ్ — "శక్తయః సర్వభావానామచింత్యజ్ఞానగోచరాః। యతోఽతో బ్రహ్మణస్తాస్తు సర్గాద్యా భావశక్తయః॥ భవన్తి — తపతాం శ్రేష్ఠ। పావకస్య యథోష్ణతా।" ఏతదుక్తం భవతి — సర్వేషామ్ అగ్నిజలాదీనాం భావానాం ఏకస్మిన్నపి భావే దృష్టైవ శక్తిః, తద్విసజాతీయ భావాన్తరేఽపి ఇతి న చింతయితుం యుక్తా। జలాదౌ అదృష్టాఽపి, తద్విసజాతీయే పావకే భాసకత్వోష్ణత్వాదిశక్తిః యథా దృశ్యతే, ఏవమేవ సర్వవస్తువిసజాతీయే బ్రహ్మణి సర్వసామ్యం నానుమాతుం యుక్తమ్ ఇతి। అతః విచిత్రానన్తశక్తియుక్తం బ్రహ్మ ఇత్యర్థః। తదాహ —

జగదేతన్మహాశ్చర్యం రూపం యస్య మహాత్మనః।
తేనాశ్చర్యవరేణాహం భవతా కృష్ణసంగతః॥ ఇతి।

తదేతత్, నానావిధానన్తశ్రుతినికర-శిష్టపరిగృహీత-తద్వ్యాఖ్యాన పరిశ్రమాత్-అవధారితమ్।

అనువాదము:- ఈ విషయమే ఇట్లు చెప్పబడినది—'ఓ తాపసోత్తమా! ఎట్లుగ-ఈ సృష్టిలోగల సమస్త పదార్థములయొక్క శక్తులు తర్కముచే చింతింపరానివై, స్వప్రమాణగోచరములగుచున్నవో, ఆ కారణముచేతనే పరబ్రహ్మమునకు సంబంధించిన జగత్సృష్టి మున్నగు స్వాభావిక శక్తులును అట్టివే! [అనగా తర్కముచే భావింపరానివని యభిప్రాయము] అగ్నికి ఉష్ణత్వము [వెచ్చదనము] ఎట్లు స్వాభావికమో అట్లే పరబ్రహ్మముయొక్క శక్తులును.' [వి. పు. 1-3-1,2]

ఇది ఇచ్చట చెప్పబడుచున్నది—'అగ్ని, జలము మున్నగు పదార్థములలో ఏదియో ఒక పదార్థమందు అగుపించుచున్న శక్తియే, దాని కంటె వేరైన వస్తువునందు కలదనుటయెట్లు ఆలోచించుటకే యుక్తము కాదో, జలము మున్నగువాటియందు లేని ప్రకాశకత్వము [వెలుగు

నిచ్చుట] ఉష్ణత్వము [వేడినిచ్చుట] మున్నగు శక్తి ఎట్లుగ అగ్ని యందు కనబట్టుచున్నదో, ఈవిధముగనే సమస్త పదార్థములకంటె విలక్షణమైన పరబ్రహ్మమందు ఇతరములైన సమస్త వస్తువుల పోలిక భావింపతగదని యభిప్రాయము.

దీనినే చెప్పుచున్నాడు—'ఓ శ్రీకృష్ణా! ఏ మహాత్మునికి ఈ అత్యాశ్చర్యకరమగు జగత్తు రూపమైయున్నదో, అట్టి ఆశ్చర్యకరవస్తువులలో శ్రేష్ఠతమమైన నీతో నేను కూడితిని' [వి. పు. 5-19-7]

ఈ విషయమంతయు అనేకప్రకారములుగానున్న అనన్తములైన వేదవాక్య సముదాయములయొక్కయు, ఆచార్యవర్యులచే గ్రహింపబడినవాటి వ్యాఖ్యానములయొక్కయు అధ్యయనముచే నిశ్చయింపబడినది.

## ॥ అన్ని శ్రుతివచనములును ప్రమాణములే ॥

మూ॥ తథాహి — ప్రమాణాంతరాపరిదృష్టా పరిమితపరిణామానేక— తత్త్వనియతక్రమవిశిష్టా సృష్టిప్రలయౌ అనేకవిధాఃశ్రుత— యోవదన్తి।

అనువాదము:- [వేదముకంటె] ఇతరములైన ప్రమాణములచే తెలియనివియు, అపారములైన పరిణామములకు ఆస్పదములైన అనేక స్వభావములతోకూడిన క్రమముకలవియగు సృష్టి-ప్రలయములు, పరబ్రహ్మమునకు సంబంధించినవిగా అనేక శ్రుతులు నొడువుచున్నవి. [పరబ్రహ్మముచే కల్పింపబడినవే సృష్టిప్రలయములని యభిప్రాయము]

మూ॥ "నిరవద్యమ్" "నిరంజనమ్" విజ్ఞానమానందం నిర్వికారం నిష్కలం. నిష్క్రియం. శాన్తం. నిర్గుణ"మిత్యాదికాః నిర్గుణం జ్ఞానస్వరూపం బ్రహ్మేతి కాశ్చనశ్రుతయోఽభిదధతి।

"నేహనానాస్తి కించన" "మృత్యోస్సమృత్యుమా-ప్నోతియఇహ నానేవ పశ్యతి" "యత్రత్వస్యసర్వమాత్మై-వాభూత్, తత్ కేనకం పశ్యేత్, కేనకం విజానీయాత్" ఇత్యాదికాః, నానాత్వ నిషేధవాదిన్యః సంతి కాశ్చన-శ్రుతయః।

అనువాదము:- 'ఎట్టి దోషములు లేనిది' 'ఆరోపిత ధర్మములు లేనిది' 'జ్ఞానస్వరూపము' 'ఆనందస్వరూపము' 'వికారము లేనిది' 'అంశములు లేనిది' 'క్రియలులేనిది' 'శాన్తస్వభావమైనది' 'ఎట్టిగుణములు లేనిది' మున్నగు కొన్ని శ్రుతులు గుణరహితమై జ్ఞానమే స్వరూపముగా గలది బ్రహ్మమని చెప్పుచున్నవి. [ఇవి నిర్గుణశ్రుతులు] 'ఇక్కడ భేదమెంతమాత్రము లేదు' 'ఎవ్వడిక్కడ భేదమును చూచునోవాడు జననమరణాత్మక సంసారమును పొందుచున్నాడు' 'అంతయు ఆత్మయే అయినప్పుడు దేనిచే దేనిని చూడవలయును? దేనితో దేనిని తెలిసికొనవలయును?' మున్నగు కొన్ని శ్రుతులు భేదమును నిషేధించునవైయున్నవి. [ఇవి భేదమును నిషేధించు శ్రుతులు]

మూ॥ 'యఃసర్వజ్ఞః సర్వవిత్' 'యస్యజ్ఞానమయం తపః' 'సర్వాణి రూపాణివిచిత్యధీరః నామానికృత్వా అభివదన్యదాస్తే।' 'సర్వే నిమేషాజజ్ఞిరే విద్యుతః పురుషాదధి' 'అపహతపాప్మా. విజరో, విమృత్యుః, విశోకో, విజిఘత్సో, అపిపాసః, సత్యకామః, సత్యసంకల్పః' ఇతి, సర్వస్మిన్ జగతి హేయతయా అవగతం సర్వంగుణం ప్రతిషిధ్య, నిరతిశయకల్యాణగుణా-నన్త్యం సర్వజ్ఞతాం, సర్వశక్తియోగం, సర్వనామరూప-వ్యాకరణం, సర్వస్య ఆధారతాం చ కాశ్చనశ్రుతయః బ్రువతే।

'సర్వం ఖల్విదంబ్రహ్మతజ్జలానితి' 'ఐతదాత్మ్యమిదం సర్వమ్' 'ఏకస్సన్ బహుధావిచారః' ఇత్యాదికాః—బ్రహ్మ-సృష్టిం జగత్—నానాకారం ప్రతిపాద్య తదైక్యం చ ప్రతి-పాదయన్తి కాశ్చనశ్రుతయః।

అనువాదము:– 'ఎవ్వడు సర్వజ్ఞుడో, సర్వవేత్తయో' [వస్తువు లందలి విశేషము లెరిగినవాడో] 'ఎవ్వని సంకల్పము జ్ఞానముతో కూడినదో' 'సమస్త వస్తువులయొక్క రూపములను సృజించి ధీరస్వభావము గల ఆ పరమాత్మ వ్యవహారమును కల్గించుచున్నాడు.' [పురుష.సూ.16] 'ఈ పరమపురుషునినుండియే సమస్త నిమేషములు [కాలవిభాగములు] పుట్టినవి' [మహానారాయణము–తై. 6-1-8] 'ఏట్టి పాపస్పర్శలేనివాడు, ముదుసలితనము లేనివాడు, మృత్యువు లేనివాడు, శోకము లేనివాడు, ఆకలి లేనివాడు, దప్పిక లేనివాడు, అప్రతిహతమైన కామములు కలవాడు, సత్యమైన సంకల్పము కలవాడు' [ఛాం. 8-7-1] ఇత్యాది శ్రుతి వచనములు—నింద్యములుగా తెలియబడిన సమస్తగుణములను నిషేధించి, నిరతిశయములైన కల్యాణగుణములయొక్క అపరిమితత్వమును, సర్వజ్ఞత్వమును, సర్వవిధశక్తులయొక్క సంబంధమును, సమస్త పదార్థముల నామరూప విభాగ కర్తృత్వమును, సమస్తమునకు ఆధారమైయుండుటను నొడువుచున్నవి. [ఇవి సగుణశ్రుతులు]

మరికొన్ని శ్రుతులు—'ఈ సమస్త ప్రపంచము పరబ్రహ్మమే, ఆ పరబ్రహ్మమునుండి సృష్టి, స్థితిలయముల పొందుచున్నది' [ఛాం. 3-14-1] 'ఈ పరబ్రహ్మమే ఆత్మగా కలదీ సమస్తము' [ఛాం. 6-8-7] 'ఒక్కడే అయినప్పటికిని అనేకప్రకారములుగా సంచరించుచున్నాడు' [తై. అరణ్యకము–6-3] ఇత్యాదులు పరబ్రహ్మముచే సృజింపబడిన ఈ జగత్తు అనేక ఆకృతులతోకూడినదని [భేదమును] ప్రతిపాదించి, ఈ ప్రపంచము ఒక్కటే అని ఏకత్వమునుగూడ ప్రతిపా

దించుచున్నవి. [ఇవి అభేదశ్రుతులు]

మూ॥ 'పృథగాత్మానంప్రేరితారంచమత్వా' 'భోక్తాభోగ్యంప్రేరితారంచమత్వా' 'ప్రజాపతిరకామయత ప్రజాః సృజేయేతి' 'పతిం విశ్వస్యాత్మేశ్వరం శాశ్వతం శివమచ్యుతమ్' 'తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తందేవతానాం పరమంచదైవతమ్' "సర్వస్య వశీ-సర్వస్యేశానః" – ఇత్యాదికాః, బ్రహ్మణః సర్వస్మాదన్యత్వం, సర్వస్య ఈశితవ్యత్వమ్ ఈశ్వరత్వంచ బ్రహ్మణః, సర్వస్య శేషతాం, పతిత్వం చ ఈశ్వరస్య కాశ్చన।

"అంతఃప్రవిష్టఃశాస్తాజనానాంసర్వాత్మా" "ఏషత ఆత్మా అంతర్యామ్యమృతః" "యస్యపృథివీశరీరం, యస్యాపఃశరీరం యస్యతేజశ్శరీరమ్" ఇత్యాది, "యస్యావ్యక్తం శరీరం యస్యాక్షరం శరీరం యస్యమృత్యుశ్శరీరం యస్యాత్మాశరీరమ్" ఇతి, బ్రహ్మవ్యతిరిక్తస్య సర్వస్యవస్తునః, బ్రహ్మణశ్చ శరీరాత్మభావం దర్శయన్తి కాశ్చన, ఇతి నానారూపాణాం వాక్యానామవిరోధః, ముఖ్యార్థాపరిత్యాగశ్చయథానంభవతి తథైవ వర్ణనీయం వర్ణితం చ।

అనువాదము:- 'జీవాత్మను-తత్ప్రేరకుడగు పరమాత్మను వేరుగ తెలిసికొని' [శ్వే. 1-12] 'భోక్తను [భోగమునను భవించు జీవాత్మను] భోగ్యమును [జీవాత్మకు భోగాస్పదమైన ప్రకృతిని] ప్రేరకుడైన పరమాత్మను భావించి' [శ్వే. 1-25] 'చతుర్ముఖ బ్రహ్మకు అంతర్యామిగా నున్న పరమాత్మ ప్రజాసృష్టి నొనర్తునుగాకయని సంకల్పించెను' 'సమస్త విశ్వమునకు పాలకుడైనవాడును, జీవులందరకు నియామకుడైన వాడును, నిత్యుడును, మంగళస్వభావుడును, నాశరహితుడును అయిన పరమాత్మను' (నారాయణము. 11) 'శాసకులైన వారందరికిని పరమ

శాసకుడైనవాడును, దేవతలందరకు దైవమైనవాడును అయిన పరమాత్మను' (శ్వే. 6-13) 'సమస్తమును తన వశమున నుంచుకొన్నవాడును, సమస్తమును శాసించువాడును' (బృ. 6-4-22) మున్నగు శ్రుతులు–పరబ్రహ్మము అన్నిటికంటె భిన్నమైనదనియు, సమస్త ప్రపంచము పరమాత్మచే నియమింపబడునదనియు, ఆ పరమాత్మయే ఈశ్వరుడనియు, సమస్త ప్రపంచము ఆయనకు పరతంత్రమై ఆయనకే అతిశయమును కలిగించునట్టిది (శేషము) అనియు, పరమాత్మయే దానికి పరిపాలకుడనియు ప్రతిపాదించుచున్నవి. (ఇవియన్నియు భేదమును ప్రతిపాదించు శ్రుతులు) 'సర్వజీవులలోను అంతర్యామిగా ప్రవేశించి నియమించువాడు' (తై. అరణ్యక. 3-29) 'ఈ అమృతస్వరూపుడగు పరమాత్మయే నీకు ఆత్మగా అంతర్యామియై యున్నాడు.' (బృ. 5-7-3) 'ఎవ్వనికి ఈ పృథివి–శరీరమో, ఎవ్వనికి జలము శరీరమో, ఎవ్వనికి తేజస్సు శరీరమో' మున్నగునవియు, 'ఎవ్వనికి మూలప్రకృతి శరీరమో, ఎవ్వనికి అక్షరము శరీరమో, ఎవ్వనికి మృత్యువు శరీరమో, ఎవ్వనికి ఆత్మ (జీవుడు) శరీరమో, అని–బ్రహ్మముకంటె వేరైన సమస్త పదార్థమునకును— పరబ్రహ్మమునకు శరీరాత్మభావ సంబంధము (శరీరమునకును–దానిలో గల జీవునకునుగల సంబంధమే) కలదని కొన్ని శ్రుతులు చెప్పుచున్నవి. (ఇవి శరీరాత్మభావమును చెప్పుశ్రుతులు) (ఈవిధముగ) అనేకరూపములతో (భేదము, అభేదము, సగుణము, నిర్గుణము ఇత్యాది విధముగ అనేకవిధములుగా) నున్న శ్రుతివాక్యములకు విరోధమెంతమాత్రము లేకుండుటయు, ఇచ్చట ఆయాయి వాక్యములకుగల వాస్తవమగు నర్థము (ముఖ్యార్థము) విడువబడకుండుటయు ఎట్లు ఏర్పడునో అట్లే యర్థము చెప్పవలసియున్నది, అట్లే చెప్పబడినది.

వివరణము:– పై నిర్దేశింపబడిన శ్రుతివాక్యములలో కొందరు భేదవాక్యములు ముఖ్యములని, అభేదవాక్యముల కర్థముల మార్చుటయు, లేదా నిర్గుణశ్రుతులను ముఖ్యముగా దీసికొని సగుణశ్రుతులకు వేరు అర్థ

మును కల్పించుటయు లేదా కొంత కొంత యర్థమును విడచుటయు జరిగినది. దీనికి కారణము—ఆయాయి శ్రుతివాక్యములు అనగా నిర్గుణశ్రుతులు-సగుణశ్రుతులు, భేదశ్రుతులు-అభేదశ్రుతులు పరస్పర విరుద్ధములైన యర్థముల బోధించుచున్నట్లు కన్పట్టుటచే నిర్గుణసగుణములలో ఒక్కటి మాత్రమే సత్యము-రెండవది తదనుగుణముగ సమన్వయింపవలయుననియు, అట్లే భేద-అభేదశ్రుతుల విషయముననును-అని వారి అభిప్రాయము. కాని భగవద్రామానుజులు, పై విధానమున కొన్ని శ్రుతులకుమాత్రమే ప్రామాణ్యముకలిగి కొన్ని అన్యార్థకములై ప్రామాణ్యమును కోల్పోవునని భావించి-సర్వశ్రుతులకు విరోధము లేకుండునట్లు అపూర్వమైన సమన్వయమును ప్రదర్శించినారు. వీరి మతమున శ్రుతులకు వేటికి విరోధము ఎంతమాత్రము లేదు. అన్నియు తమ తమ వాస్తవార్థములనే అనగా ఏ యర్థమును విడచిపెట్టకయే బోధించుచున్నవని వారి తాత్పర్యము ముందు ముందు గ్రంథమున విశదపరుపబడుచున్నది.

మూ॥ అవికారశ్రుతయః స్వరూపపరిణామ పరిహారా దేవముఖ్యార్థాః। నిర్గుణవాదాశ్చ ప్రాకృతహేయగుణనిషేధవిషయతయా వ్యవస్థితాః। నానాత్వనిషేధవాదాశ్చ ఏకస్యైవ బ్రహ్మణః శరీరతయా ప్రకారభూతం సర్వం చేతనాచేతనం వస్త్వితి సర్వస్యఆత్మతయా సర్వప్రకారంబ్రహ్మైవ అవస్థితమితి సురక్షితాః। సర్వవిలక్షణత్వ — పతిత్వేశ్వరత్వ — కల్యాణగుణాకరత్వ — సత్యకామత్వ — సత్యసంకల్పత్వాదివాక్యం తదభ్యుపగమాదేవ సురక్షితమ్। జ్ఞానానందమాత్రవాది చ సర్వస్మాద్ అన్యస్య సర్వకల్యాణగుణాశ్రయస్య సర్వేశ్వరస్య సర్వశేషిణః సర్వాధారస్య సర్వోత్పత్తిస్థితి ప్రలయహేతుభూతస్య నిరవద్యస్య నిర్వికారస్య సర్వాత్మభూతస్య పరస్యబ్రహ్మణః స్వరూపనిరూపకధర్మః మలప్రత్యనీకానందరూపజ్ఞానమేవేతి, స్వప్రకాశతయా స్వరూపమపి జ్ఞాన-

**మేవేతి చ ప్రతిపాదనాత్ అనుపాలితమ్। ఐక్యవాదాశ్చ శరీరాత్మభావేన సమానాధికరణ–ముఖ్యార్థతోపపాదనాదేవ సుస్థితాః।**

అనువాదము:– పరమాత్మకు ఎట్టి వికారము లేదని బోధించు శ్రుతి వాక్యములు (నిరంజనం, నిర్వికారమ్ మున్నగునవి) పరమాత్మకు స్వరూపమందు ఎట్టి పరిణామము లేదని (శక్తిపరిణామము మాత్రమే కలదని) చెప్పి పరిణామదోషమును తొలగించుటద్వారా వాస్తవమగు నర్థమునే (ముఖ్యార్థమునే) బోధించుచున్నవి.

ఇక నిర్గుణవాదములు (అనగా పరమాత్మ యందెట్టి గుణములు లేవని నిషేధించు 'నిర్గుణమ్' మున్నగు వాక్యములు) పరమాత్మయందు ప్రకృతికి సంబంధించి రజస్సు మున్నగు నింద్యములైన గుణములేవియు లేవని నిషేధించునవిగా వ్యవస్థను (కుదురుబాటును) పొందినవి.

భేదవాదములు (ఈ ప్రపంచమున కన్పట్టు జ్ఞాత-జ్ఞేయము-జ్ఞానము మున్నగు భేదములేదని నిషేధించు 'నేహనానాస్తి కించన' ఇత్యాది వాక్యములు) ఒకే బ్రహ్మమునకు శరీరముగా విడదీయరాని యంశమై (ప్రకారమై) ఈ సమస్త జీవ–జడాత్మక పదార్థజాతమున్నదను కారణముచే— సమస్తమునకు 'ఆత్మగా', సమస్తము ప్రకారముగా కల్గిన బ్రహ్మమే (అనగా ఈ సమస్త ప్రపంచమును తననుండి వేరుచేయరాని యంశముగా కల్గిన బ్రహ్మమొక్కటే) కలదని చెప్పుటద్వారా రక్షింపబడినవి. (కుదురుబాటును పొందినవి)

పరమాత్మ సమస్త చిదచిదాత్మక ప్రపంచముకంటె విలక్షణమైనవాడనియు, సర్వ పరిపాలకుడనియు, ఈశ్వరుడనియు, అసంఖ్యేయములైన (లెక్కింపనలవికాని) కల్యాణగుణములకు స్థానమైనవాడనియు, సత్యకాముడనియు, సత్యసంకల్పుడనియు ఈవిధములగు గుణగణముల బోధించిన వాక్యజాతము (అనగా ఏష సర్వ భూతాన్తరాత్మా, అపహత

పాప్మా, విజరో విమృత్యుః ఇత్యాది సగుణవాక్య సముదాయము) యథా తథముగ (ఎట్టిమార్పును లేకయే) అంగీకరింపబడినందున లెస్సగ రక్షింప బడినది. (కుదర్పబడినది.)

ఇక (సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' 'ఆనందో బ్రహ్మ' ఇత్యాదిగ) జ్ఞానానందములు మాత్రమే బ్రహ్మస్వరూపమని చెప్పునట్టి వాక్యసము దాయము—సమస్త ప్రపంచముకంటె వేరుగనున్న పరబ్రహ్మము సమస్త కల్యాణగుణములకు ఆశ్రయమనియు, సమస్తమును నియమించు నదనియు, సర్వమునకు శేషి (స్వామి) అయినదనియు, సమస్తమునకు ఆధారమనియు, ప్రపంచముయొక్క పుట్టుక-ఉనికి-లయము అనువాటికి కారణమనియు, ఎట్టి దోషములంటనిదనియు, ఎట్టి ప్రాకృతవికారములు లేనిదనియు, సమస్తమునకు 'ఆత్మయై' అంతర్యామిగా లోనున్నదని యు, అట్టి పరబ్రహ్మముయొక్క స్వరూపమును నిరూపించునట్టి 'ధర్మము' సమస్త దోషములకు విరుద్ధమైన ఆనందరూపమగు జ్ఞానమేననియు, తనంతతానుగ ప్రకాశించునదగుటచే నాజ్ఞానమే స్వరూపముకూడనని యు ప్రతిపాదించినందున-రక్షింపబడినది (కుదర్పబడినది)

బ్రహ్మము-ఈ సమస్త జీవజడాత్మకప్రపంచము ఒక్కటేనని ఐక్య మును బోధించు వాక్యములు (ఐక్యవాదములు) 'శరీరాత్మభావముద్వారా (అనగా బ్రహ్మము ఆత్మ-ఈ సమస్త ప్రపంచము శరీరము అని శరీర-శరీరి (ఆత్మ) భావము నంగీకరించుటద్వారా) 'సామానాధికరణ్యము'— 'ముఖ్యార్థత్వము' (లక్షణ అక్కరలేకయే యథాతథముగ సహజమగు వాచ్యార్థమే కుదురునని నిరూపించుట) అనునవి ఉపపాదించుట వలననే కుదర్పబడినవి.

వివరణము:- ఇంతవరకు—సగుణశ్రుతులతో నిర్గుణశ్రుతులకుగాని, భేదవాదములతో ఐక్యవాదములకుగాని, నిర్వికారశ్రుతులకును-బ్రహ్మమే జగత్తుకు ఉపాదాన కారణమని బోధించు శ్రుతులకుగాని-పరస్పరమెంత

మాత్రము విరోధము లేదనియు, అన్ని శ్రుతులును పరస్పర సమన్వయముతో ఒకే తాత్పర్యమును నిరూపించుచున్నవనియు-దీనివలన కొన్నింటిని ముఖ్యములని యంగీకరించి మరికొన్నింటిని అముఖ్యములని అన్యార్థముల కల్పింపనక్కరలేదనియు, ఈ విధముగా ఔపనిషదమగు దర్శనము నిరాబాధము, ప్రమాణమునని భగవద్రామానుజుల యాశయము స్పష్టపరుపబడినది.

మూ॥ "ఏవంచ సతి అభేదోవా, భేదోవా, ద్వ్యాత్మకతావా వేదాన్త వేద్యః? కోఽయమర్థః సమర్థితో భవతి?" సర్వస్య వేదవేద్యత్వాత్ సర్వం సమర్థితమ్।

సర్వశరీరతయా సర్వప్రకారం బ్రహ్మైవ అవస్థితమితి అభేదః సమర్థితః। ఏకమేవ బ్రహ్మ నానాభూత చిదచిద్వస్తుప్రకారం నానాత్వేన అవస్థితమితి భేదాభేదౌ। అచిద్వస్తునశ్చ - చిద్వస్తునశ్చ - ఈశ్వరస్యచ స్వరూపస్వభావ వైలక్షణ్యాత్, అసంకరాచ్చ భేదః సమర్థితః॥

అనువాదము:- "మరి ఈ విధముగ నంగీకరించినప్పుడు 'అభేదము' వేదాన్తవాక్యములచే తెలియదగినదా? 'భేదము' తెలియదగినదా? 'భేదాభేదము'లు తెలియదగినవా? ఏది సమర్థింపబడినట్లైనది?" అన్నచో అంతయు (అనగా అభేదము, భేదము, భేదాభేదములు - అను మూడును) వేదాన్తవాక్యములచే తెలియబడుచున్నది కనుక సర్వము సమర్థింపబడినది. సమస్తప్రపంచమును శరీరముగను, ప్రకారముగను కలిగి ఒక్క పరబ్రహ్మమే ఉన్నదికనుక 'అభేదము' సమర్థింపబడినది. ఒక్క బ్రహ్మమే అనేక విధములుగానున్న జీవులు-జడవస్తువులు ప్రకారములుగా కలిగి అనేక ప్రకారములుగా (అనేకరూపములతో) నున్నది కనుక 'భేదాభేదములు' సమర్థింపబడినవి. ఇక అచిద్వస్తువునకు (జడమైన ప్రపంచమునకు) - చిద్వస్తువునకు (జీవాత్మకు) - ఈశ్వరునకు (పరమా

త్మకు) స్వరూపము-స్వభావము వేరువేరుగనున్నవికనుకను, వాటి లక్ష ణములలో సాంకర్యము (ఒకదాని లక్షణము వేరొకదానికి పట్టుట అను నది) లేదు కనుకను, (అనగా వాటివాటి స్వరూపస్వభావములలో భేదము స్పష్టముగ గోచరించుచున్నది కనుకను) 'భేదము' సమర్థింపబడినది.

వివరణము:- పై వాక్యములనుబట్టి యుపనిషత్తులు కేవలము అభేద మునే బోధించుచున్నవని వాదించువారి మతముకాని, కేవలము భేదమునే బోధించుచున్నవని వాదించువారి మతముకాని, అట్లే భేదాభేదవాదుల మతముకాని సరియైనదికాదనియు వీటియన్నిటికిని సమన్వయము ప్రద ర్శించు 'విశిష్టాద్వైతమే' ఔపనిషదదర్శనమని స్పష్టమగుచున్నది. సద్విద్యాప్రకరణాదులు విశిష్టాద్వైతమునే నిరూపించుచున్నవని పూర్వమే నిరూపింపబడినది. 116, 117 పుటలు చూడనగును.

## ॥ బ్రహ్మాత్మైక్యజ్ఞానమే మోక్షసాధనమనుట కుదరదు ॥

మూ॥ "ననుచ-"తత్త్వమసి శ్వేతకేతో"; "తస్యతావదేవచిరమ్"- ఇతి ఐక్యజ్ఞానమేవ పరమపురుషార్థలక్షణమోక్షసాధనమితి- గమ్యతే"-నైతదేవమ్। "పృథగాత్మానం ప్రేరితారంచమత్వా" ఇతి, ఆత్మానం, ప్రేరితారంచ అంతర్యామిణంపృథక్ మత్వా, తతః పృథక్త్వజ్ఞానాద్ధేతోః, తేనపరమాత్మనా జుష్టః అమృతత్వమేతి ఇతి. సాక్షాత్ అమృతత్వప్రాప్తిసాధనమ్ ఆత్మనః-నియన్తుశ్చ పృథగ్భావజ్ఞానమిత్యవగమ్యతే।

అనువాదము:- "మరి, 'ఓ శ్వేతకేతో నీవు బ్రహ్మమైయున్నావు' 'గురూపదేశముచే బ్రహ్మాత్మకత్వజ్ఞానమునుపొంది యనుసంధానమొన ర్చినవానికి-ప్రారబ్ధకర్మమువలన కలిగిన శరీరమెంతవరకుండునో అంత మాత్రమే మోక్షమునకు వ్యవధానము (విలంబము) ఉన్నది.' (ఛాం. 6-14-2) ఇత్యాదిగ-బ్రహ్మాత్మైక్యజ్ఞానమే పరమపురుషార్థమైన మోక్షము ను సాధించుటకుపాయమని తెలియుచున్నదికదా!" (భేదజ్ఞానము మోక్ష

సాధనము కాజాలదని తాత్పర్యము) అని యన్నచో—

ఇది యిట్లు కాదు. "జీవాత్మను, దానికి ప్రేరకుడైన పరమాత్మను తెలిసికొని, ఆ కారణముచేతనే పరమాత్మతోకూడినవాడై అమృతత్వమును (మోక్షమును) పొందుచున్నాడు" (శ్వేతా. 1-12) అని — జీవాత్మను (ఆత్మానం)-దానికి అంతర్యామిగా ప్రేరకుడైన పరమాత్మను (ప్రేరి-తారంచ) వేరువేరుగ తెలిసికొని (పృథక్ మత్వా); (తతః) ఆ విధముగ జీవాత్మ-పరమాత్మల పృథక్త్వజ్ఞానమువలననే (అనగా వారిరువురు వేరని తెలిసికొనుటవలననే) ఆ పరమాత్మతో కూడినవాడై (తేనజుష్టః); అమృతత్వమును పొందుచున్నాడు (అమృతత్వమ్-ఏతి) అని-సాక్షాత్తుగ ఆత్మయొక్కయు-దానిని నియమించు పరమాత్మయొక్కయు 'వేరుతనమును' తెలిసికొనుటయే మోక్షమునకుపాయమని తెలియబడుచున్నది కదా!

మూ॥ "ఐక్యవాక్యవిరోధాత్ ఏతత్ అపరమార్థసగుణబ్రహ్మవిషయమితి అభ్యుపగన్తవ్యమ్"-ఇతిచేత్; పృథక్త్వజ్ఞానస్యైవ సాక్షాత్ అమృతత్వప్రాప్తిసాధనత్వశ్రవణాత్ విపరీతం కస్మాత్ నభవతి?

అనువాదము:- "పరబ్రహ్మమునకు-జీవ-జడప్రపంచమునకు ఐక్యమును బోధించు 'తత్త్వమసి' 'ఐతదాత్మ్య మిదంసర్వం' 'అహం బ్రహ్మాస్మి' ఇత్యాది వాక్యముకు విరోధము కల్గును కనుక—ఈ వాక్యము (అనగా 'పృథగాత్మానమ్'-ఇత్యాది భేదబోధక వాక్యము) అవాస్తవమైన సగుణబ్రహ్మమును బోధించునదియని అంగీకరింపవలసియున్నది (అనగా ఈ వాక్యము యథార్థతత్త్వమును బోధించునది కాదు కనుక—ఐక్య బోధక వాక్యమునకు విరోధము కలుగకుండగనే దీనిని సమన్వయింపవలయును)"-అనియన్నచో-'జీవాత్మ-పరమాత్మలు వేరని బోధించు వాక్యములయొక్క జ్ఞానమే (అనగా భేదజ్ఞానమే) సాక్షాత్తుగ అమృతత్వమును సాధించుటకుపాయమని శ్రుతివలన తెలియుచున్నదికనుక-విపరీతముగనే

ఏల చెప్పరాదు? (అనగా ఈ భేదబోధకవాక్యమునకు విరోధము కలుగకుండగ—అభేదబోధకవాక్యమునే అవాస్తవార్థబోధకమని యేల సమన్వయింపరాదు?) (అనగా ఇదియే వాస్తవము-ఇదియే అవాస్తవము అని నిర్ణయించు 'వినిగమకము' (ఒకేపక్షమును సాధించు ప్రమాణము) లేదు కనుక రెండిటిని ముఖ్యముగనే గ్రహింపవలసియుండునని తాత్పర్యము)

మూ॥ ఏతదుక్తం భవతి। ద్వయోః తుల్యయోః విరోధేసతి అవిరోధేనతయోః విషయః వివేచనీయః ఇతి। కథమవిరోధః ఇతిచేత్, అంతర్యామిరూపేణ అవస్థితస్య పరస్య బ్రహ్మణః శరీరతయా ప్రకారత్వాత్ జీవాత్మనః, తత్ప్రకారం బ్రహ్మైవ "త్వమ్" ఇతి శబ్దేన అభిధీయతే; తచ్చైవజ్ఞాతవ్యమ్ ఇతి తస్య వాక్యస్య అర్థః। ఏవం భూతాత్ జీవాత్ తదాత్మతయా అవస్థితస్య పరమాత్మనః నిఖిలదోషరహితతయా సత్యసంకల్పత్వాద్యనవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణాకరత్వేనచ యః పృథగ్భావః సోఽనుసంధేయ ఇతి, అస్య వాక్యస్య విషయః ఇత్యయమర్థః పూర్వమేవ అసకృదుక్తః॥

అనువాదము:- ఇది చెప్పబడినట్లగుచున్నది. సమాన బలముకల రెండిటికి విరోధము కల్గినప్పుడు, విరోధము లేకుండునట్లుగ వాటియొక్క విషయము పర్యాలోచన మొనర్పబడవలసియుండును అని. విరోధము లేకుండుటయెట్లు? అన్నచో—'అంతర్యామి స్వరూపుడుగానున్న పరమాత్మకు శరీరమై ప్రకారముగా జీవాత్మ అమరియున్నాడుకనుక, జీవాత్మ ప్రకారముగా (విడదీయరాని విశేషణముగా) కలిగిన పరబ్రహ్మమే 'త్వమ్' (నీవు) అను శబ్దముచే చెప్పబడుచున్నది. అట్లే అది తెలియదగియున్నదని ఆ వాక్యమునకర్థము. జీవాత్మకు అంతర్యామిగా ఆత్మయైయున్నవాడై సమస్త దోషములు లేనివాడును, 'సత్యసంకల్పత్వము' మున్నగు లెక్కలేని అతిశయముకల కల్యాణగుణములకు స్థానమైనవాడును అయియున్నాడు కనుక పరమాత్మకు—ఇట్టి జీవాత్మకంటె (శరీరమై

ప్రకారముగనమరియున్న జీవాత్మకంటె) 'వేరుతనము' (ఉపనిషద్వాక్యములచే తెలియబడిన యే భేదముకలదో అది) అనుసంధింపదగియున్నది' అని ఈవాక్యమునకు విషయము—అని యీ యర్థము పూర్వమే పలుమారులు చెప్పబడినది.

వివరణము:– 'తత్త్వమసి' ఇత్యాది వాక్యములచే సిద్ధించిన జీవాత్మ పరమాత్మల అభేదము ఎంత ముఖ్యమో, 'పృథగాత్మానం ప్రేరితారంచ మత్వా' ఇత్యాది భేదశ్రుతులవలన సిద్ధించిన పృథగ్భావము (జీవాత్మ–పరమాత్మల భేదభావము) కూడ ముఖ్యమేకనుక ఈభేదాభేదశ్రుతుల రెండిటికిని కనుపించుచున్న విరోధమును పరిహరించి రెండిటి యర్థమును అనుసంధింపవలయునేతప్ప—ఒక్కటే ముఖ్యమని రెండవదానిని నిరాకరింపతగదని తాత్పర్యము.

మూ॥ "భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వా" ఇతి. భోగ్యభూతస్య వస్తునః అచేతనత్వం, పరమార్థత్వం, సతతవికారాస్పద–త్వమ్, ఇత్యాదయః స్వభావాః, భోక్తుః జీవాత్మనశ్చ అమలాపరిచ్ఛిన్నజ్ఞానానందస్వభావస్యైవ అనాదికర్మరూపావిద్యాకృతనానావిధజ్ఞానసంకోచవికాసౌ, భోగ్యభూతా–చిద్వస్తుసంసర్గశ్చ పరమాత్మోపాసనాత్ మోక్షశ్చ ఇత్యా–దయః స్వభావాః, ఏవంభూతభోక్తృభోగ్యయోః అంతర్యామిరూపేణ అవస్థానం, స్వరూపేణ చ అపరిమితగుణౌఘాశ్రయత్వేన అవస్థానమితి, పరస్యబ్రహ్మణః త్రివిధావస్థానమ్ జ్ఞాతవ్యమిత్యర్థః॥

అనువాదము:– 'భోక్తాభోగ్యం ప్రేరితారంచమత్వా' (భోక్తయగు జీవుడు, భోగ్యమగు జడవస్తువును, ప్రేరకుడగు పరమాత్మను భావించి) అను శ్రుతివచనమునుబట్టి–భోగ్యమగు వస్తువు అచేతనమనియు, వాస్తవమనియు (మిథ్యకాదనియు) నిరంతరము వికారములకు (మార్పులకు)

ఆస్పదమగుచున్నదనియు, ఇవియే (అచేతనమైయుండుట, యథార్థమై యుండుట, వికారములకాస్పదమగుట మున్నగునవియే) దాని స్వభావములు. భోక్తయగు (భోగించువాడగు) జీవాత్మ నిర్మలములును, పరిచ్ఛిన్నము (పరిమితములు) లు కానివియునగు జ్ఞానము, ఆనందము అనునవియే స్వభావముగా (సహజసిద్ధ స్వరూపములు ధర్మములుగను) కలిగినవాడైనప్పటికిని, వానికే అనాదియైన అవిద్యయని పిలువబడు కర్మముయొక్క సంబంధమువలన కలిగిన యనేకవిధములగు జ్ఞానముల సంకోచము-వికాసము అనునవియును, భోగ్యమైన అచిత్తు (అచేతనమగు ప్రకృతి) యొక్క సంబంధము, పరమాత్మయొక్క ఉపాసనముచే మోక్షము మున్నగునవి స్వభావములు. ఇట్టి భోక్తయగు జీవునకు అంతర్యామియై యుండుట, అచిత్తునకు [జడవస్తువునకు] అంతర్యామియైయుండుట, తన స్వరూపముచేతనే అపరిమితములైన గుణముల బృందములకు ఆశ్రయమైయుండుట అని, పరబ్రహ్మమునకు మూడు విధములగు ఉనికి తెలియదగియున్నదని యర్థము.

## ॥ సద్విద్యయందుపాసింపబడు బ్రహ్మము సగుణమే ॥

మూ॥ "తత్త్వమసి" ఇతి సద్విద్యాయామ్ ఉపాస్యం బ్రహ్మసగుణం, సగుణబ్రహ్మప్రాప్తిశ్చ ఫలమ్—ఇత్యభియుక్తైః పూర్వా-చార్యైః వ్యాఖ్యాతమ్।

యథోక్తవాక్యకారేణ "యుక్తం తద్గుణకోపాసనాత్" ఇతి। వ్యాఖ్యాతంచ ద్రమిడాచార్యేణ విద్యావికల్పం వదతా "యద్యపి సచ్చిత్తః న నిర్భుగ్నదైవతం గుణగణం మనసా అనుధావేత్। తథాపి అంతర్గుణామేవ దేవతాం భజతే ఇతి, తత్రాపి సగుణైవ దేవతా ప్రాప్యతే" ఇతి। సచిత్తః=సద్వి-ద్యానిష్ఠః। ననిర్భుగ్నదైవతం గుణగణం మనసా అనుధా-వేత్=అపహతపాప్మత్వాది కల్యాణగుణగణం దైవతా—

ద్విభక్తం దహరవిద్యానిష్ఠ ఇవ సచ్చిత్తోన స్మరేత్। తథాపి అంతర్గుణామేవ దేవతాం భజతే—దేవస్వరూపానుబంధిత్వాత్ సకలకల్యాణగుణస్య, కేనచిత్ పరదేవతా సాధారణేన నిఖిల జగత్కారణత్వాదినా గుణేన ఉపాస్యమానాపి దేవతా, వస్తుతః స్వరూపానుబంధి సర్వకల్యాణగుణగణవిశిష్టైవ ఉపాస్యతే। అతః సగుణమేవబ్రహ్మతత్రాపి ప్రాప్యమితి సద్విద్యాదహరవిద్యయోః వికల్పః॥

అనువాదము:- 'తత్త్వమసి' అని ఛాందోగ్యసద్విద్యాప్రకరణ మందలి ఉపాసనయందు ఉపాసింపబడునది సగుణబ్రహ్మమే. సగుణ బ్రహ్మముయొక్క ప్రాప్తియే అచ్చట ఫలము—అని అనుభవ పరిణతుల గు ప్రాచీనాచార్యులచే వ్యాఖ్యానింపబడినది. వాక్యకారుడగు బ్రహ్మ నందిచే నిట్లుచెప్పబడినది. 'ఇది యుక్తమే. గుణవిశిష్టమగు బ్రహ్మమే ఉపాసింపబడినదికనుక' అని. (సగుణబ్రహ్మముయొక్క ఉపాసనము యుక్తమే. సద్విద్యాదులందట్లే ఉపాసింపబడినదికదా! అని తాత్ప ర్యము). సద్విద్యా-దహర విద్యలకు వికల్పము [ఈ రెండిటిలో దేని నైనను పరిగ్రహింపవచ్చుననుట] ను చెప్పుచున్న ద్రమిడాచార్యునిచే నిట్లు వ్యాఖ్యానింపబడినది. "వాస్తవమునకు—సద్విద్యానిష్ఠుడైన యుపా సకుడు [సచ్చిత్తః] ఉపాసింపదగిన దైవముకంటె వేరుగనున్న [నిర్భుగ్నదైవతం] గుణవృందమును [అనగా కేవలములగు భగవద్గుణ ములను] మనస్సుతో [మనసా] నఅనుధావేత్ = అనుసరింపరాదు [అనగా ధ్యానింపరాదు] అయినప్పటికిని [తథాపి] గుణములను తనలో నిమిడ్చికొనియున్న దైవతమునే [అంతర్గుణామేవదేవతాం] సేవించును [భజతే] కనుక [ఇతి] గుణములతోకూడిన దేవతయే [అనగా సగుణ మగు బ్రహ్మమే] [సగుణైవ దేవతా] పొందబడుచున్నది [ప్రాప్యతే]" —అని.

సచ్చిత్తుడు అనగా సద్విద్యానిష్ఠుడు. దేవతకంటె వేరుగనున్న

గుణగణమును ధ్యానింపరాదు [అనగా] ఉపాసింపబడు పరమాత్మకంటె వేరుచేయబడిన 'అపహతపాప్మత్వము' మున్నగు గుణముల సముదాయములను, దహరవిద్యానిష్ఠునివలె సద్విద్యానిష్ఠుడు స్మరింపరాదు. అయినప్పటికిని గుణగణములతో కూడియున్న పరమాత్మనే సేవించుచున్నాడు. [ఉపాసించుచున్నాడు.] [ఇది ద్రమిడాచార్యవచనములకు భగవద్రామానుజ వివరణము]

'సమస్తములగు కల్యాణగుణముల వృందములును ఉపాసింపబడు దేవతయొక్క [పరమాత్మయొక్క] స్వరూపముతో అనుబంధించియే యుండును కనుక, పరదేవతకు [పరమాత్మకు] సామాన్యమైన 'సమస్త జగత్తులకు కారణమైయుండుట' మున్నగు గుణముతోడనే దేవతయుపాసింపబడినను, వాస్తవముగ దేవతాస్వరూపమునకు అనుబంధించియున్న సమస్తములైన కల్యాణగుణములతో కూడియే ఉపాసింపబడుచున్నది. కనుక, సగుణమగు బ్రహ్మమే అక్కడకూడ [సద్విద్యయందుకూడ] పొందదగియున్నదికనుక, సద్విద్య-దహర విద్య అను నీ రెండిటికి వికల్పము అనియర్థము.

వివరణము:- ఛాందోగ్యోపనిషత్తులోని విభిన్న ప్రకరణములలో ఉపాసకుల తారతమ్యమునుబట్టి అనేక విద్యలు (ఉపాసనా ప్రక్రియలు) చెప్పబడినవి. ఎనిమిదవ అధ్యాయమున దహరవిద్య నిరూపింపబడినది. "అథయ ఇహాత్మానమనువిద్య వ్రజన్తి ఏతాంశ్చసత్యాన్ కామాన్, తేషాం సర్వేషులోకేషు కామచారో భవతి" (ఇక ఎవరిచ్చట (దహరవిద్యయందు) ఆత్మను, ఈ అపహతపాప్మత్వాది కల్యాణగుణములను (సత్యకామములను) ఉపాసింతురో వారు పరలోకములను (అనగా పరమాత్మయొక్క విభూతులైన వికారలోకములననుభవించి పరితృప్తులై పారతంత్ర్యమును పొందరు)-ఇత్యాదిగ బ్రహ్మోపాసనము, దానికంటె వేరుగ గుణోపాసనము రెండును చెప్పబడినవి. కావున దహరవిద్యోపాసకుడు పరమాత్మకంటె వేరుగ తదీయ కల్యాణగుణములనుపాసించును. కాని సద్విద్య

యందు (సద్విద్యాప్రకరణ తాత్పర్యము పూర్వమే నిరూపింపబడినది. చూ. పు. ) సర్వప్రకరణసాధారణముగ చెప్పబడిన జగత్కారణత్వాదిగుణముతో కూడిన బ్రహ్మమునే ఉపాసించినను, ఇతరములైన జ్ఞానానందాది సర్వగుణములు ఆ పరమాత్మలోనే అంతర్గతములై యున్నవి కనుక, సర్వగుణవిశిష్టమగు బ్రహ్మమునే ఉపాసించుచున్నాడు. కాని గుణములనే దహరవిద్యయందువలె పరమాత్మకంటె వేరుగనుపాసింపడు. ఇదియే ఈ రెండువిద్యలకుగల భేదము. కావున ఈ రెండిటిలో దేనినైనను ఉపాసింపవచ్చునని దహరవిద్యకు–సద్విద్యకు–వికల్పమును ద్రమిడాచార్యులు పేర్కొనినారు. కావున సద్విద్యాప్రకరణమునకూడ సగుణబ్రహ్మమే ఉపాసింపబడుచున్నదని స్పష్టమగుచున్నది.

## :: సర్వజీవులకు పరమాత్మయే ప్రేరకుడు – ఆయనకెట్టి దోషములంటవు ::

మూ॥ "ననుచ సర్వస్యజన్తోః పరమాత్మా అంతర్యామీ, తన్నియామ్యంచ సర్వమ్"–ఇత్యుక్తమ్; ఏవంచసతి విధినిషేధశాస్త్రాణామ్ అధికారీ నదృశ్యతే; యఃస్వబుద్ధ్యైవ ప్రవృత్తినివృత్తిశక్తః, స ఏవం కుర్యాత్, న కుర్యాదితి విధినిషేధయోగ్యః। నచైషదృశ్యతే। సర్వస్మిన్ప్రవృత్తిజాతే సర్వస్యప్రేరకః–పరమాత్మా–కారయితా ఇతి తస్యసర్వ నియమనం ప్రతిపాదితమ్। శ్రూయతేచ "ఏషఏవ సాధుకర్మకారయతి–తం–యమేభ్యోలోకేభ్యఉన్నినీషతి; ఏష ఏవా సాధుకర్మకారయతి–తం–యమధోనినీషతి" (కౌషత–3-9) ఇతి సాధ్వసాధుకర్మకారయితృత్వాత్ నైర్ఘృణ్యం చ।

అతోచ్యతే।

సర్వేషామేవచేతనానాం చిచ్ఛక్తియోగః, ప్రవృత్తి-

> శక్తియోగః ఇత్యాది సర్వం ప్రవృత్తినివృత్తి పరికరం సామాన్యేన సంవిధాయ, తన్నిర్వహణాయ తదాధారో-భూత్వా అంతఃప్రవిశ్య, అనుమన్తృతయా చ నియమనం కుర్వన్ శేషిత్వేన అవస్థితః పరమాత్మా। ఏతదాహిత శక్తి-స్సన్ ప్రవృత్తినివృత్త్యాది. స్వయమేవ కురుతే। ఏవం కుర్వాణమీక్షమాణః పరమాత్మా ఉదాసీన ఆస్తే; అతః సర్వ-ముపపన్నమ్। సాధ్వసాధుకర్మకారయితృత్వం తు వ్యవస్థిత విషయం నసర్వసాధారణమ్। యస్తుపూర్వం స్వయమేవ అతిమాత్రమానుకూల్యే ప్రవృత్తః తం ప్రతిప్రీతః స్వయమేవ భగవాన్ కల్యాణబుద్ధియోగదానం కుర్వన్ కల్యాణే ప్రవ-ర్తయతి। యః పునః అతిమాత్రం ప్రాతికూల్యేప్రవృత్తః తస్యతు క్రూరాంబుద్ధిందదన్ స్వయమేవ క్రూరేష్వేవ కర్మసు ప్రేరయతి భగవాన్।

అనువాదము:- "మరి, 'సమస్త ప్రాణికి పరమాత్మలోపల అంత ర్యామిగా ప్రవేశించియున్నాడు. ఆయనచే నియమింపబడునదే ఈ సమ స్తము" అని చెప్పబడినది. ఇట్లైనప్పుడు (ప్రాణులన్నియు పరమాత్మ చేతనే నియమింపబడుచున్నప్పుడు) "ఇది చేయుము" అను విధాయక శాస్త్రములకును, "ఇది చేయవలదు" అను నిషేధకశాస్త్రములకును అధికారి కనుపింపడుకదా! ఎవ్వడు తన బుద్ధితోడనే ప్రవర్తించుటకును, నివర్తించు టకును (చేయకుండుటకును) సమర్థుడో-అట్టివాడే-"ఇట్లుచేయవలయును" "ఇట్లుచేయురాదు" అను విధి-నిషేధములకు అర్హుడగును. మరి యిట్టివాడు కనుపించుటలేదు. సర్వవిధములగు ప్రవృత్తులయందును అందరికి ప్రేర కుడై పరమాత్మయే చేయించువాడుకనుక ఆ పరమాత్మ సర్వమును నియ మించుననీ ప్రతిపాదింపబడినది. శ్రుతియు నిట్లు చెప్పుచున్నది. "ఈ

పరమాత్మయే ఎవ్వనిని ఈ లోకములనుండి యుద్ధరింపదలచునో వానిచే మంచి పనిని చేయించుచున్నాడు. ఈ పరమాత్మయే ఎవ్వనిని క్రిందికి పడద్రోయనెంచునో వానిచే చెడ్డపనిని [పాపము] చేయించుచున్నాడు" అని [ఈ విధముగా] చెడ్డపనులను, మంచిపనులను చేయించువాడగుటచే ఆ పరమాత్మకు "నైర్ఘృణ్యము" [దయలేకపోవుట] అను దోషము కల్గుచున్నదికదా!"

అన్నచో-[సమాధానము] చెప్పబడుచున్నది. సర్వజీవులకును చిచ్ఛక్తి [ఆలోచించునట్టిశక్తి] ప్రవృత్తిశక్తి [పనిచేయుటకువలయు శక్తి] మున్నగు ప్రవర్తించుటకు, నివర్తించుటకు కావలసిన సమస్తమగు సాధనసంపత్తిని సమానముగనే కల్పించి, వీటిని [ప్రవృత్తి-నివృత్తులను] నిర్వహించుటకు తానా జీవులకాధారమై లోపల [హృదయమున] ప్రవేశించియుండి, వాని ప్రవృత్తి-నివృత్తులనామోదించువానిగా నియమనమును కల్పించుచున్నవాడై "స్వామిగా" [శేషిగా] పరమాత్మ యున్నాడు. పరమాత్మచే కల్పింపబడిన శక్తితోకూడినవాడై జీవుడు స్వయముగనే [తనయంత తానుగనే] ప్రవర్తించుట, నివర్తించుట మున్నగునది చేయుచున్నాడు. ఇట్లు ప్రవృత్తి-నివృత్తులనొనర్చుచున్న జీవుని చూచుచున్నవాడై పరమాత్మ పట్టించుకొనక తటస్థునిగనే యుండును, కనుక అంతయు కుదురుచున్నది ఇక మంచిపనులను, చెడ్డపనులను చేయించుట అనునది కొన్ని విషయములకు చెందినదేతప్ప- సర్వసాధారణముకాదు. ఎవ్వడు పూర్వము స్వయముగనే అత్యంతము పరమాత్మయందు అనుకూలముగ ప్రవర్తించెనో వానిపట్ల ప్రీతిగొన్న భగవానుడు, శుభప్రదమగు బుద్ధియోగమును అనుగ్రహించుచున్నవాడై [వానిని] శుభకర్మమునందు ప్రవర్తింపజేయును. ఎవ్వడు అత్యంతము [పరమాత్మయందు] ప్రతికూలభావముతో ప్రవర్తించెనో, వానికి క్రూర బుద్ధినిచ్చి స్వయముగనే భగవానుడు క్రూరకర్మములందు ప్రవర్తింపజేయును.

వివరణము:- పై వాక్యములబట్టి జీవుల మొట్టమొదటి ప్రవృత్తి ఎట్లుండునో దానినిబట్టియే వారిగతి యాధారపడియుండునుతప్ప భగవంతుని ప్రేరణ విశేషముగ నెంతమాత్రముండదనియు, సత్ప్రవృత్తిగల జీవులను సాధుకర్మములందు ప్రవర్తింపజేసి వారినుద్ధరించినట్లుగనే, దుష్ప్రవృత్తిగల జీవులను తపింపజేసి వారికి మనఃపరిణతి కలుగునట్లొనరించుటకే వారిని అసాధుకర్మములయందు ప్రవర్తింపజేయుటయు వారినుద్ధరించుటయేతప్ప వేరుకాదనియు, దీనివలన భగవానునకెట్టి వైషమ్యముకాని, నైర్ఘృణ్యము (నిర్దయ) గాని లేవని స్పష్టమగుచున్నది. "సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ పాపోభవతి" (బృహ. 6-4-5) "మంచిపని చేసినవాడు సజ్జనుడగును, పాపకర్మమొనర్చినవాడు పాపాత్ముడగును" ఇత్యాది శ్రుతివచనములీవిషయమునే స్పష్టపరచుచున్నవి. ఈ విషయమునే భగవద్రామానుజులు-"వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్ తథాహి దర్శయతి" (బ్ర సూ. 2-1-34) అను సూత్రశ్రీభాష్యమున స్పష్టపరచినారు.

మూ॥ యథోక్తం భగవతా-

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేనమాముపయాన్తి తే॥
తేషామేవానుకంపార్థమహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥
తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్।
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు॥ ఇతి

అనువాదము:- భగవానునిచేనిట్లు చెప్పబడినది-

"నిరంతరము నాయందే యోగమును (చేరికను) కోరుచున్నవారై నన్ను భజించుచున్నవారికి, నన్ను పొందుటకువలయు బుద్ధియోగమును ప్రేమపూర్వకముగ నేననుగ్రహింతును" (భగవ. 10-10).

"వారిననుగ్రహించుటకే వారిమనోవృత్తులయందున్నవాడనై నేను,

నాకల్యాణగుణములనావిష్కరించుచు నన్ను గురించిన జ్ఞానమనెడి ప్రకాశించు దీపముచే వారి ప్రాచీనకర్మరూపమగు అజ్ఞానమువలన కల్గిన మోహమును నశింపజేయుదును" (భగవ. 10-11).

"నన్నెవరు ద్వేషించుచుందురో అట్టి యమంగళస్వభావులగు నరాధములను జన్మ-జరా-మరణాది రూపములగు సంసారములలో అసుర జన్మములందు పడద్రోయుదును" (భగవ. 16-19). అని.

## -: పరమాత్మ - భక్తిమాత్రలభ్యుడు :-

మూ॥ సో౽యం పరబ్రహ్మభూతః పురుషోత్తమః నిరతిశయపుణ్య సంచయక్షీణాశేషజన్మోపచితపాపరాశేః, పరమపురుషచరణారవిందశరణాగతిజనితతదాభిముఖ్యస్య, సదాచార్యోపదేశోపబృంహితశాస్త్రాధిగత తత్త్వయాథాత్మ్యావబోధపూర్వకాహరహరుపచీయమాన-శమ-దమ-తపః-శౌచ-క్షమార్జవ-భయాభయస్థానవివేక - దయాహింసాద్యాత్మగుణోపేతస్య, వర్ణాశ్రమోచిత-పరమపురుషారాధన-వేష - నిత్యనైమిత్తిక కర్మోపసంహృతి-నిషిద్ధపరిహారనిష్ఠస్య, పరమపురుషచరణారవిందయుగలన్యస్తాత్మాత్మీయస్య, తద్భక్తికారితానవరత స్తుతి స్మృతి-నమస్కృతి--యతన - కీర్తన - గుణశ్రవణ-వచన-ధ్యానార్చన - ప్రణామాదిప్రీత - పరమకారుణిక - పురుషోత్తమ - ప్రసాదవిధ్వస్తస్వాంతధ్వాన్తస్య. అనన్యప్రయోజనానవరతనిరతిశయ-ప్రియ విశదతమప్రత్యక్షతాపన్నానుధ్యానరూపభక్త్యేకలభ్యః॥

అనువాదము:- అత్యధికమగు పుణ్యసముదాయముచే బహుజన్మ సముపార్జితమైన పాపరాశిని నశింపజేసికొన్నవాడును, పరమపురుషుడగు శ్రీమన్నారాయణుని పాదపద్మములందు శరణుజొచ్చుటచే కల్గిన భగవదనుకూలప్రవృత్తి కలవాడును,

ఉత్తములైన ఆచార్యపురుషుల ఉపదేశముచే పరిపుష్టమైన శాస్త్రము కలిగి–దానివలన యథార్థమగు తత్త్వజ్ఞానమునుపొంది–తత్పూర్వకముగ ప్రతిదినము వృద్ధినొందుచున్న శమము (మనోనియమనము) – దమము (బాహ్యేంద్రియనిగ్రహము) – తపస్సు – శౌచము (మనస్సు-వాక్కు-శరీరము అనునీమూడిటి పరిశుద్ధి)–క్షమ (దుఃఖమునోర్వగల్గుట)–ఆర్జవము (ఋజుబుద్ధి)–భయాభయస్థానవివేకము (ఎచ్చట భయపడవలయునో, ఎచ్చట భయపడరాదో తెలిసికొనుట) (అనగా భగవంతునకపచారమొనర్చుట భయకారణమనియు, భగవచ్ఛరణాగతి అభయకారణమనియు ఎరుగుట)–దయ–అహింస మున్నగు ఆత్మగుణములతో కూడినవాడును,

వర్ణాశ్రమధర్మములకు ఉచితమైన భగవదారాధనము – వేషము (వస్త్రతిలకాదిధారణము)–నిత్యకర్మముల యొక్కయు, నైమిత్తిక కర్మముల యొక్కయు అనుష్ఠానము–శాస్త్రములచే నిషేధింపబడినవాటిని విడచుట–అను సదాచారవిషయములందు నిష్ఠకలవాడును,

పరమపురుషుడగు పరమాత్మయొక్క పాదపద్మద్వంద్వమునందే సమర్పింపబడిన ఆత్మయు, ఆత్మీయములగు (సమస్త) వస్తువులు కలవాడును,

పరమాత్మయందుగల భక్తిచే ప్రేరితుడై నిరంతరము భగవత్ స్తుతి–భగవత్స్మరణము–నమస్కారము–భగవంతునికొరకు ఉద్యానాది నిర్మాణము–భగవద్గుణకీర్తనము–భగవద్గుణశ్రవణము – భగవద్గుణనిరూపణము (ఇతరులకు వర్ణించిచెప్పుట)–ధ్యానము–ఆరాధనము–ప్రణామము–మున్నగునవి యాచరించినందున పరితుష్టుడైన పరమకృపాళుడగు శ్రీమన్నారాయణుని యనుగ్రహముచే మనస్సునంటియున్న పాపమూలములగు రజస్తమస్సుల నశింపజేసికొన్నవాడును,

అయిన జీవునకు—

అట్టి యీ పరబ్రహ్మమగు పురుషోత్తముడు (శ్రీమన్నారాయణుడు) ఇతరములగు ఎట్టి ప్రయోజనములులేక నిరంతరము ప్రీతిపాత్రమై స్వచ్ఛమగు ప్రత్యక్షమువలె (కంటికగుపించుచున్నట్లు) ఏర్పడిన–'అనుధ్యాన'రూపమగు భక్తిచేమాత్రమే పొందదగియున్నాడు.

వివరణము:– అనుధ్యానమనుశబ్దము భక్తికి పర్యాయపదము. దీనికే 'ధ్రువానుస్మృతి' అనికూడ వ్యవహారము. తైలధారవలె ఎడతెగక యున్న స్మృతిపరంపరయే అనుధ్యానము. ఇది 'దర్శనము' (ప్రత్యక్షము) తో సమానమైనది. "ఆత్మావా అరే; ద్రష్టవ్యః" "ఓరీ! ఆత్మ దర్శింపదగియున్నది" (బృహ. 6-5-6) ఇత్యాదిగ చెప్పబడిన దర్శనముతో సమానమగు 'నిదిధ్యాసనము' స్మృతిరూపమే. స్మృతి అనునది ప్రకర్షను (అతిశయమును) బట్టి దర్శనమువంటిదే (సాక్షాత్కారము వంటిదే) అగును. కనుకనే "విశదతమప్రత్యక్షతాపన్నానుధ్యాన" అని చెప్పబడినది. "భక్త్యాత్వనన్యయాలభ్యః" అను గీతావచనము ఇట్టి భక్తినే భగవత్ప్రాప్తికి ఉపాయముగా నొడువుచున్నది. విశేషములకు శ్రీభాష్యములోని జిజ్ఞాసాధికరణము చూడనగును.

మూ॥ తదుక్తం పరమగురుభిః భగవద్యామునాచార్యపాదైః— "ఉభయపరికర్మితస్వాంతస్య ఐకాన్తికాత్యన్తికభక్తియోగలభ్యః" ఇతి। జ్ఞానయోగకర్మయోగసంస్కృతాన్తఃకరణస్య ఇత్యర్థః। తథాచ శ్రుతిః—"విద్యాంచావిద్యాంచ యస్తద్వేదోభయంసహ, అవిద్యయామృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే" ఇతి। అత్ర అవిద్యాశబ్దేన విద్యేతరత్ వర్ణాశ్రమాచారాది పూర్వోక్తం కర్మ ఉచ్యతే। విద్యాశబ్దేన భక్తిరూపాపన్నధ్యానముచ్యతే। యథోక్తం—

ఇయాజ, సోఽపి సుబహూన్ యజ్ఞాన్ జ్ఞానవ్యపాశ్రయః।
బ్రహ్మవిద్యామధిష్ఠాయ తర్తుం మృత్యుమవిద్యయా॥

**"తమేవం విద్వాన్ అమృత ఇహభవతి నాన్యః పంథా అయనాయ విద్యతే।" "య ఏవం విదురమృతాస్తే భవన్తి" "బ్రహ్మవిదాప్నోతిపరమ్" "బ్రహ్మ వేద బ్రహ్మైవభవతి" ఇత్యాది। వేదనశబ్దేన ధ్యానమేవాభిహితం "నిదిధ్యాసితవ్యః" ఇత్యాదినా ఐకార్థ్యాత్।**

అనువాదము:– పరమగురువులగు శ్రీమద్యామునాచార్య శ్రీచరణులచే ఇదియే యిట్లు చెప్పబడినది. "ఉభయపరికర్మితస్వాంతస్య ఐకాన్తికాత్యన్తికభక్తియోగలభ్యః" (సిద్ధిత్రయములోని ఆత్మసిద్ధియందు) అని. (ఉభయ = జ్ఞాన-కర్మయోగములచే, పరికర్మిత = సంస్కరింపబడిన, స్వాంతస్య = మనస్సుకల జీవునకు) "జ్ఞానయోగ కర్మయోగములచే సంస్కరింపబడిన అంతఃకరణము కలవానికి" (ఐకాన్తికాత్యన్తిక = అనన్యము నిరతిశయమునైన, భక్తియోగ = సాధ్యభక్తిచే, లభ్యః = పరమాత్మ పొందదగియున్నాడు) అని యర్థము. శ్రుతిగూడ యిట్లు చెప్పుచున్నది–"విద్యను, అవిద్యను ఈ రెండిటిని ఎవ్వడుపాసించుచున్నాడో వాడు అవిద్యచే మృత్యువునతిక్రమించి (సంసారమునుదాటి) విద్యచే అమృతత్వమును (భగవత్ప్రాప్తిని) పొందుచున్నాడు" అని (ఈశా.11). ఇక్కడ 'అవిద్యా' శబ్దముచే విద్యకంటె భిన్నమైన వర్ణాశ్రమాచారాదిరూపమగు పూర్వము చెప్పబడిన కర్మము బోధింపబడుచున్నది. 'విద్యా' శబ్దముచే భక్తిరూపముగ నేర్పడిన 'ధ్యానము' బోధింపబడుచున్నది. ఇదియే యిట్లు చెప్పబడినది– "శాస్త్రమువలన కల్గిన జ్ఞానముకలయాతడు బ్రహ్మవిద్యనుద్దేశించియు (వివేకమువలన పుట్టిన జ్ఞానము నాలంబించియు) వర్ణాశ్రమాచారాది కర్మరూపమగు అవిద్యచే మృత్యువును (సంసారము) దాటగోరి అనేకములగు యజ్ఞములచేసెను" అని (వి.పు 6-6-12). "ఆ పరమాత్మనీప్రకారముగా నుపాసించువాడు ఇక్కడే అమృతత్వమును పొందును. (పరమాత్మను పొందుటకు) వేరు మార్గములేదు." (తై.పు. 18-4). "ఎవ్వరీ పరమాత్మనుపాసింతురో వారమృతత్వమును పొందు

దురు" (తై.ఉ.నా. 1-10). "బ్రహ్మముసుపాసించినవాడు బ్రహ్మమును పొందును" (తై.ఉ.ఆ. 1-1). "బ్రహ్మమునుపాసించినవాడు బ్రహ్మాత్మకుడే యగును" (ము.ఉ. 3-2-9) మున్నగునవి. (ఇచ్చట) 'వేదనము' అను శబ్దముచే ధ్యానమే బోధింపబడుచున్నది. 'నిదిధ్యాసితవ్యః' (బృ. ఉ. 6-5-6) "నిదిధ్యాసింపవలయును" అను దానితోపాటుగ ఒకే యర్థమును బోధించునుకదా!

వివరణము:- ఇంతవరకు ఉపనిషద్వాక్యములలో నెచ్చటెచ్చట 'వేద' 'విత్' 'విదుః' 'విద్వాన్' ఇత్యాదిపదములు ప్రయోగింపబడినవో అవియన్నియు జ్ఞానమును బోధించునవని భగవత్పాదశంకరమతము. అనగా బ్రహ్మజ్ఞానముచేతనే (బ్రహ్మమును తెలిసికొన్నంతనే) బ్రహ్మభావమును పొందుననని వారి తాత్పర్యము. కాని భగవద్రామానుజుల మతమున పై శబ్దములన్నియు ఉపాసనమును బోధించునవేతప్ప కేవల జ్ఞానమునుకాదు. కనుక వీరి మతమున కేవలజ్ఞానముచేగాక, ఉపాసనముచే మాత్రమే బ్రహ్మప్రాప్తియని స్పష్టము. మరియు, ఈ యుపాసనమే ధ్యానము, నిదిధ్యాసనము, భక్తి, ధ్రువానుస్మృతి, అను ధ్యానము ఇత్యాది పదములచే అచ్చటచ్చట చెప్పబడుచున్నది.

మూ॥ తదేవధ్యానం పునర్విశినష్టి।

"నాయమాత్మా ప్రవచనేనలభ్యః నమేధయా బహుధావా శ్రుతేన। యమేవైషవృణుతే తేనలభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్" ఇతి (ముం. 3-2-3) భక్తిరూపాపన్నానుధ్యానేనైవ లభ్యతే, న కేవలవేదనమాత్రేణ, "నమేధయా" ఇతి కేవలస్య నిషిద్ధత్వాత్। ఏతదుక్తం భవతి—

యోఽయం ముముక్షుః వేదాన్తవిహితవేదనరూపానుధ్యానాదినిష్ఠః, తదాతస్య తస్మిన్నేవ అనుధ్యానే నిరవధికాతిశయాప్రీతిః జాయతే, తదైవ తేనలభ్యతే పరఃపురుష

ఇతి। యథోక్తం భగవతా—

పురుషస్సపరః పార్థ। భక్త్యాలభ్యస్త్వనన్యయా॥
భక్త్యాత్వనన్యయాశక్య అహమేవం విధోర్జున।
జ్ఞాతుం ద్రష్టుంచతత్త్వేన ప్రవేష్టుంచ పరంతప॥
భక్త్యామామభిజానాతి యావాన్యశ్చాస్మితత్త్వతః॥
తతోమాం తత్త్వతో జ్ఞాత్వావిశతే తదనన్తరమ్॥
(శ్రీగీత 8/22, 11/54, 18/53)

తదనన్తరం మాం తతఏవభక్తేః విశతే ఇత్యర్థః। భక్తిరపి నిరతిశయప్రియానన్యప్రయోజన స్వేతరవైతృష్ణ్యావహజ్ఞాన విశేష ఏవేతి, తద్యుక్త ఏవ తేనపరేణ ఆత్మనావరణీయో భవతీతి. తేనలభ్యతే ఇతిశ్రుత్యర్థః।

ఏవం విధభక్తిరూపజ్ఞానవిశేషస్య ఉత్పాదకః పూర్వోక్తాహరహరుపచీయమానజ్ఞానపూర్వక కర్మానుగృహీత భక్తి యోగఏవ। యథోక్తం భగవతా పరాశరేణ (శ్రీవిష్ణు. 2-8-9)

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరఃపుమాన్।
విష్ణురారాధ్యతే పంథా నాన్యస్తత్తోషకారకః॥

ఇతి। నిఖిలజగదుద్ధరణాయ అవనితలే అవతీర్ణః పరబ్రహ్మభూతః పురుషోత్తమః స్వయమేవ ఏతదుక్తవాన్

స్వకర్మనిరతస్సిద్ధిం యథావిన్దతి తచ్ఛృణు॥
యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్।
స్వకర్మణాతమభ్యర్చ్యసిద్ధిం విందతి మానవః॥ ఇతి
యథోదితక్రమపరిణత భక్త్యేకలభ్యః। ఏవ
(శ్రీగీత. 18-45/46)

అనువాదము:- ఈ ధ్యానమును గురించియే విశేషించి నిరూపించు

చున్నది. 'ఈ పరమాత్మ ప్రవచనముచేత (కేవల మననముచేత) పొంద బడడు. మేధచేగూడ (కేవలధ్యానముచేగూడ) పొందబడడు. బహువిధ మగు శ్రవణముచేగూడ పొందబడడు. ఎవ్వని ఈ పరమాత్మ స్వయముగ వరించునో వానిచే మాత్రమే పొందబడును. అట్టి భగవదనుగ్రహమును పొందినవానికి ఈ పరమాత్మ స్వస్వరూపమును ఆవిష్కరించును' (ముండక 3-2-3) అని.

భక్తిరూపముగనేర్పడిన 'అనుధ్యానము' (నిరంతరస్మృతి)చే మాత్రమే (భగవానుడు) పొందబడుచున్నాడు. కేవలము తెలిసికొనుటచే మాత్రమేకాదు. 'నమేధయా' (మేధచేకాదు) అని కేవల జ్ఞానము నిషేధింపబడినదికదా! ఇది చెప్పబడినట్లగుచున్నది—'ఏ ముముక్షువు వేదాన్తములచే విధింపబడిన జ్ఞానరూపమగు (వేదనరూపమగు) ధ్యానమందు నిష్ఠ (ఏకాగ్రత) కలవాడై యుండునో, ఎప్పుడాతనికి ఆ యనుధ్యానమందే (నిరంతర భగవత్స్మృతియందే) అపారమగు ప్రేమముదయించునో, అప్పుడే వానిచే నా పరమపురుషుడగు పరమాత్మ పొందబడును' అని. భగవానునిచే నిదియే యిట్లు చెప్పబడినది. 'ఓ పార్థుడా! ఆ పరమపురుషుడగు పరమాత్మ అనన్యభక్తిచేమాత్రమే లభించును' (అనన్యభక్తియనగా పరమాత్మయందుమాత్రమే ఏకాగ్రమైన ధ్యానము లేక ప్రీతి) (శ్రీగీత. 8-22) 'ఓ పరంతపా! అర్జునా! ఇప్పుడు నీచే చూడబడిన యీ స్వరూపముగల నేను, కేవలము అనన్యమగు భక్తిచేమాత్రమే—తాత్త్వికముగ (యథార్థముగ) శాస్త్రముఖముగ తెలిసికొనుటకును, సాక్షాత్కరించుకొనుటకును, ప్రవేశించుటకును (పొందుటకును) వీలగుచున్నాను' (శ్రీగీత. 11-54) 'స్వరూపముచేతను, స్వభావముచేతను నేనెట్టివాడను, గుణములచేతను, విభూతిచేతను ఎట్టివాడను అనునీవిధముగ అనన్యభక్తిచే తాత్త్వికముగ [యథార్థముగ] తెలిసికొని, తదనంతరము [తత్త్వజ్ఞానము కల్గిన తరువాత] అట్టి యనన్యభక్తిచేతనే నాలో ప్రవేశించుచున్నాడు [అనగా నన్ను పొందుచున్నాడు] [శ్రీగీత. 18-54] అని.

'అటుపిమ్మట [నన్ను తాత్త్వికముగ తెలిసికొన్న తరువాత] ఆ భక్తి వలననే నన్ను ప్రవేశించుచున్నాడ'ని యర్థము. భక్తికూడ అత్యంత ప్రేమాస్పదమై ఇతరప్రయోజనము లెంతమాత్రములేక, భగవంతుని కంటె వేరైన విషయములయందు కోరికల పోగొట్టునట్టి ఒక జ్ఞానవిశేషమే కనుక, ఇట్టి భక్తిరూపమగు జ్ఞానవిశేషముతోకూడినవాడే ఆ పరమాత్మచే వరింపదగినవాడగునుకనుక, అట్టివానిచే [పరమాత్మ] పొందబడునని [పై] శ్రుతివచనముయొక్క అర్థము.

ఇట్టి 'పరభక్తి'స్వరూపమగు జ్ఞానమును పుట్టించునది—పూర్వము చెప్పబడినదియు, ప్రతిదినము వృద్ధిచెందుచున్న జ్ఞానపూర్వకమగు కర్మానుష్ఠానమువలన అనుగ్రహింపబడిన భక్తియోగమే. ఇదియే భగవంతుడగు పరాశరునిచే నిట్లుచెప్పబడినది. 'వర్ణాశ్రమాచార సంపన్నుడగు జనునిచే పరమపురుషుడగు విష్ణువారాధింపబడును. శ్రీమన్నారాయణునికి ప్రీతిని కల్గించు వేరొకమార్గమేదియు లేదు. [భగవద్భక్తికంటె వేరుమార్గములెవ్వియు విష్ణుప్రీతికరములు కావు]' అని. [విష్ణు. పు. 2-8-9] సమస్తజగత్తును ఉద్ధరించుటకై పుడమిపై యవతరించిన పరబ్రహ్మమగు పురుషోత్తముడు [వాసుదేవుడు] స్వయముగనే దీనిని చెప్పినాడు. 'తనకు స్వభావసిద్ధమైన కర్మమందు అభినివేశము కలవాడై మానవుడెట్లు సిద్ధినిపొందునో దానిని వినుము'—'ఏ పరమాత్మవలన సమస్త భూతముల ప్రవృత్తి యేర్పడుచున్నదో, ఎవ్వనిచే నీ సమస్తము వ్యాపింపబడినదో—అట్టి పరమాత్మను, తనకు స్వభావసిద్ధమైన కర్మము నాచరించుటచేతనే, ఆరాధించి మానవుడు సిద్ధినిపొందును.' అని. [శ్రీగీత. 18-45/46] ఈ చెప్పబడిన క్రమములో పరిణతిచెందిన భక్తిచే మాత్రమే [పరమాత్మ] పొందబడుచున్నాడు.

మూ॥ భగవద్బోధాయన—టంక—ద్రమిడ—గుహదేవ—కపర్ది—భారుచి ప్రభృత్యవిగీతశిష్టపరిగృహీత — పురాతనవేదాన్తవ్యాఖ్యాన సువ్యక్తార్థ—శ్రుతినికరనిదర్శితోఽయం పంథాః॥

**అనేన చార్వాక-శాక్యౌలూక్య (శాక్య + ఔలూక్య)-అక్షపాద-క్షపణక-కపిల-పతంజలి మతానుసారిణో వేద-బాహ్యాః, వేదావలంబి కుదృష్టిభిస్సహ నిరస్తాః।**

అనువాదము:- భగవానుడగు బోధాయనర్షి—టంకాచార్యుడు [ఈతడే వాక్యకారుడగు బ్రహ్మనంది] ద్రమిడాచార్యుడు [టంకాచార్యుని వాక్యములకు వివరణము వ్రాసిన ఆచార్యుడు]—గుహదేవుడు—కపర్ది—భారుచి—మున్నగు స్తుతింపదగు సదాచారసంపత్తి గల పెద్దలచే స్వీకరింపబడిన ప్రాచీనములగు వేదాన్త వ్యాఖ్యానములచే స్పష్టపరుపబడిన యర్థముకల వేదవాక్య సముదాయములచే ప్రదర్శింపబడిన మార్గమియ్యది.

దీనిచే చార్వాకుడు, బౌద్ధుడు, గౌతముడు, అక్షపాదుడు, జినుడు, కపిలముని, పతంజలి అను వారిమతముల ననుసరించిన వేదబాహ్యులు [వేదసమ్మతమగు మతమునకు దూరమైనవారు] వేదములనాశ్రయించియు కుత్సితదృష్టి కలవారితోపాటు నిరాకరింపబడినారు.

వివరణము:- చారు = అందమైన [ఇంపైన] వాక్ = వాక్కుకలవాడు చార్వాకుడు. నాస్తికదర్శనమునకు మూలకర్త. శాక్యుడనగా బుద్ధుడు. వీరిరువురును వేదప్రామాణ్యమును పూర్తిగా నిరాకరించినవారు కనుక 'వేదబాహ్యులు'. గౌతముడు–అక్షపాదుడు–కపిలుడు–పతంజలి అనువారు క్రమముగ న్యాయ–వైశేషిక–సాంఖ్య–యోగదర్శనములకు ప్రవర్తకులు. వీరు వేదప్రామాణ్యము నంగీకరించినను–వేదములు పౌరుషేయములని అంగీకరించినవారు కనుకను వేదవిరుద్ధమగు తర్కము నాశ్రయించినవారు కనుకను, వేదబాహ్యులు. జినముని జైనమత వ్యవస్థాపకుడు. వేదప్రామాణ్యమునంగీకరింపమి వేదబాహ్యుడు. ఇక–వేదముల ప్రామాణ్యమును, వాటి అపౌరుషేయత్వమును అంగీకరించినవారయ్యును వేదవాక్యతాత్పర్యమును స్వకపోల కల్పనములచే తల

క్రిందులు చేసినవారు కనుక భగవత్పాదశంకర-భాస్కర-యాదవాదులు కూడ నిరాకరింపబడినారని తాత్పర్యము.

॥ విష్ణుమాహాత్మ్య ప్రతిపాదకములగు
సాత్త్వికపురాణములే ప్రమాణము ॥

మూ॥ వేదావలంబినామపి యథావస్థితవస్తువిపర్యస్తదృశాం బాహ్యసామ్యం మనునైవోక్తమ్—

యా వేదబాహ్యాః స్మృతయః యాశ్చకాశ్చకుదృష్టయః।
సర్వాస్తా నిష్ఫలాః ప్రేత్య తమోనిష్ఠాహితాః స్మృతాః॥

ఇతి। రజస్తమోభ్యామస్పృష్టమ్ ఉత్తమం సత్త్వమేవ యేషాం స్వాభావికో గుణః తేషామేవ వైదికీరుచిః వేదార్థయాథాత్మ్యావబోధశ్చ ఇత్యర్థః। యథోక్తం మాత్స్యే—

సంకీర్ణాః సాత్త్వికాంశ్చైవరాజసాః తామసాస్తథాః ఇతి। కేచిద్బ్రహ్మకల్పాః సంకీర్ణాః, కేచిత్ సత్త్వప్రాయాః, కేచిత్ రజఃప్రాయాః, కేచిత్ తమఃప్రాయాః ఇతి కల్పవిభాగముక్త్వా, సత్త్వరజస్తమోమయానాం తత్త్వానాం మాహాత్మ్యవర్ణనంచ తత్తత్ కల్పోక్తపురాణేషు సత్త్వాదిగుణమయేన బ్రహ్మణాక్రియతే ఇతిచ ఉక్తమ్।

యస్మిన్ కల్పేచయత్ ప్రోక్తం పురాణంబ్రహ్మణాపురా।
తస్యతస్యతు మాహాత్మ్యం తత్ స్వరూపేణవర్ణ్యతే॥ ఇతి।

విశేషతశ్చ ఉక్తమ్ —

"అగ్నేః శివస్యమాహాత్మ్యం తామసేషుప్రకీర్త్యతే।
రాజసేషుచ మాహాత్మ్యమధికం బ్రహ్మణోవిదుః॥
సాత్త్వికేష్వథకల్పేషు మహాత్మ్యమధికం హరేః।

తేష్వేవయోగసంసిద్ధాః గమిష్యన్తి పరాంగతిమ్॥
సంకీర్ణేషు సరస్వత్యాః, పితౄణామ్..." ఇత్యాది॥

అనువాదము:- వేదముల నాశ్రయించినవారైనప్పటికిని యథార్థమైన వస్తువును విపరీతముగ దర్శించువారు-వేదబాహ్యులతో [వేద ప్రామాణ్యము నంగీకరింపనివారితో] సమానమని మనువుచేతనే చెప్పబడినది. 'వేదప్రామాణ్యమునకు దూరమైన ఏ స్మృతులు [ధర్మశాస్త్రములు] కలవో, ఏ తత్త్వవిపరీత దర్శనములు కలవో, అనియన్నియు నిష్ప్రయోజనములై తమోగుణమును మాత్రమే పెంచునవియని భావింపబడుచున్నవి.' [మను. 12-96] అని. రజస్సు తమస్సు అను రెండు గుణములతోడను ఎంతమాత్రము స్పృశింపబడని ఉత్తమమైన సత్త్వగుణమే ఎవ్వరికి సహజగుణమైయుండునో వారికే వేదప్రీతియు, వేదార్థము యొక్క యథార్థజ్ఞానము కలుగునని యర్థము. ఇదియే మత్స్యపురాణమున—'సంకీర్ణములు, సాత్త్వికములు, రాజసములు, తామసములు' అని చెప్పబడినది. కొన్ని బ్రహ్మకల్పములు సంకీర్ణములును [సత్త్వరజస్తమస్సు మూడిటితో సమానముగ కూడినవి], కొన్ని సత్త్వగుణ ప్రధానములు, కొన్ని రజోగుణమధికముగా కలవి, కొన్ని తమోగుణప్రధానములు అని [నాల్గువిధములుగ] కల్పవిభాగమునుచెప్పి; సత్త్వము, రజస్సు, తమస్సు అనునీగుణములతో నిండిన వస్తువుల మాహాత్మ్యముయొక్క వర్ణనముకూడ ఆయాయి కల్పములందు చెప్పబడిన పురాణములలో సత్త్వాది గుణములతోకూడిన బ్రహ్మచే [చతుర్ముఖునిచే] చేయబడుచున్నదనికూడ చెప్పబడినది.

"ఏయే కల్పమున ఏయే పురాణము చతుర్ముఖ బ్రహ్మచే పూర్వము చెప్పబడినదో ఆయాయి పురాణముయొక్క గొప్పతనము ఆయా పురాణము యొక్క స్వరూపముతోపాటు వర్ణింపబడుచున్నది". అని. విశేషముగ [నిట్లు] చెప్పబడినది.

'అగ్నియొక్కయు, శివునియొక్కయు గొప్పతనము తమోగుణ

ప్రధానములైన కల్పములందలి పురాణములందు కీర్తింపబడుచున్నది. రజోగుణప్రధానమ్ములైన కల్పములందలిపురాణములందు చతుర్ముఖబ్రహ్మ యొక్క మాహాత్మ్యము మిక్కుటముగానుండునని తెలిసికొందురు. సత్త్వ గుణము ప్రధానముగాగల కల్పములందు శ్రీహరియొక్క మాహాత్మ్యము ఎక్కువగానుండును. ఈ సాత్త్విక కల్పములందే యోగసిద్ధినిపొందిన మహానుభావులు పరమపదమును పొందుదురు. సంకీర్ణములైన [సత్త్వ రజస్తమస్సులు సమానముగా కలసియున్న] కల్పములందలి పురాణము లలో సరస్వతియొక్కయు, పితృదేవతలయొక్కయు [గొప్పదనము వర్ణింపబడును]' మున్నగునది.

మూ॥ ఏతదుక్తంభవతి ఆదిక్షేత్రజ్ఞత్వాత్ బ్రహ్మణః తస్యాపి కేషుచిదహస్సుసత్త్వముద్రిక్తమ్, కేషుచిద్రజః, కేషు చిత్తమః। యథోక్తం భగవతా (శ్రీగీత. 18-40)

నతదస్తి పృథివ్యాంవా, దివిదేవేషువాపునః।
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిఃస్యాత్త్రిభిర్గుణైః॥ ఇతి।

"యోబ్రహ్మాణం విదధాతిపూర్వం యోవైవేదాంశ్చ ప్రహి- ణోతి తస్మై" (శ్వేతా. 6-35) ఇతిశ్రుతేః బ్రహ్మణోఽపి సృజ్యత్వేన శాస్త్రవశ్యత్వేనచ క్షేత్రజ్ఞత్వం గమ్యతే। సత్త్వ- ప్రాయేషు అహస్సు తదితరేషుచ యాని పురాణాని బ్రహ్మణా ప్రోక్తాని, తేషాం పరస్పరవిరోధేసతి, సాత్త్వికాహఃప్రోక్తం పురాణమేవ యథార్థం, తద్విరోధి అన్యత్ అయథార్థమితి పురాణనిర్ణయాయైవ ఇదం సత్త్వనిష్ఠేన బ్రహ్మణా అభి- హితమితి విజ్ఞాయతే ఇతి। సత్త్వాదీనాం కార్యంచ భగవతైవ ఉక్తమ్—

సత్త్వాత్ సంజాయతేజ్ఞానం, రజసోలోభఏవచ।
ప్రమాదమోహౌతమసఃభవతోఽజ్ఞానమేవచ॥
ప్రవృత్తించ నివృత్తించ కార్యాకార్యే భయాభయే।

బంధంమోక్షంచయా వేత్తి బుద్ధిస్సాపార్థ! సాత్త్వికీ॥
యయాధర్మమధర్మంచ కార్యంచాకార్యమేవచ।
అయథావత్ ప్రజానాతి బుద్ధిస్సాపార్థ! రాజసీ॥
అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా।
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ! తామసీ॥ ఇతి।

సర్వాన్ పురాణార్థాన్ బ్రహ్మణస్సకాశాత్ అధిగమ్యైవ సర్వాణి పురాణాని పురాణకారాశ్చక్రుః।

యథోక్తమ్—

కథయామి యథాపూర్వం దక్షాద్యైః మునిసత్తమైః।
పృష్టఃప్రోవాచ భగవాన్ అబ్జయోనిః పితామహః॥ ఇతి।

అపౌరుషేయేషు వేదవాక్యేషు పరస్పరవిరుద్ధేషు కథమితి చేత్, తాత్పర్యనిశ్చయాత్ అవిరోధః పూర్వమేవ ఉక్తః।

అనువాదము:- ఇది చెప్పబడినట్లగుచున్నది—

చతుర్ముఖబ్రహ్మ మొట్టమొదటి 'క్షేత్రజ్ఞుడు' [జీవుడు] కనుక, ఆయనకుకూడ కొన్నిపగళ్ళలో సత్త్వగుణము ఉద్బుద్ధమగును. కొన్నిటియందు రజోగుణము, కొన్నిటియందు తమోగుణము ఉద్బుద్ధమగును. [బహిర్గతమగును] భగవానునిచే నిట్లు చెప్పబడినది—[శ్రీగీత. 18-40]

'ఈ భూమిపైగాని, దేవలోకమునగాని, దేవతలయందుగాని స్వభావ సిద్ధములైన సత్త్వరజస్తమస్సులను మూడుగుణములచే విడివడిన కేవల సత్త్వగుణము ఎచ్చటను లేదు.' అని. 'ఎవ్వడు [ఏ పరమాత్మ] బ్రహ్మను పూర్వము సృజించునో, ఎవ్వడాతనికి వేదముల ననుగ్రహించునో' [శ్వేతా. 6-35] అను శ్రుతివచనమువలన, చతుర్ముఖబ్రహ్మకూడ సృజింపబడువాడేకనుక, శాస్త్రమునకు వశపడి క్షేత్రజ్ఞుడేనని [జీవుడేనని] తెలియుచున్నది. సత్త్వగుణ ప్రధానములైన పగళ్ళయందును, తద్భి

న్నములైన వాటియందును యే పురాణములు చతుర్ముఖబ్రహ్మచే చెప్పబడినవో, వాటిలో పరస్పరము విరోధము కల్గినప్పుడు [ఒక పురాణమందలి విషయమునకు వేరొక పురాణమందలి విషయముతో విరోధము కల్గినప్పుడు] సత్త్వగుణమధికముగాగల పగళ్ళయందే పురాణము చెప్పబడినదో అదియే తత్త్వార్థబోధకమై ప్రమాణము. దానికి విరుద్ధమైన ఇతర పురాణము అయథార్థము [తత్త్వబోధకముకాదు కనుక అప్రమాణము] అని పురాణముల [స్వరూపమును] నిర్ణయించుటకే సత్త్వగుణనిష్ఠుడగు చతుర్ముఖబ్రహ్మచే యీ విషయము చెప్పబడినద'ని తెలియుచున్నది.

సత్త్వాదిగుణములవలన కల్గునదేమో భగవానునిచేతనే చెప్పబడినది—

'సత్త్వగుణమువలన జ్ఞానము [యథార్థమగు తత్త్వజ్ఞానము] కలుగును. రజోగుణమువలన లోభము [స్వర్గాదులయందు కోరిక] కల్గును. తమోగుణమువలన ప్రమాదము [అనవధానముచే అసత్కర్మములందు ప్రవృత్తి]—మోహము [విపరీతజ్ఞానము] అజ్ఞానము [జ్ఞానము లేకపోవుట] అనునవి కలుగుచున్నవి'. [శ్రీగీత. 14-17]

'ప్రవృత్తిని [లౌకికములగు అభ్యుదయముల సాధించు ధర్మమును]-నివృత్తిని [మోక్షసాధనమగు ధర్మమును] కార్యాకార్యములను [దేశకాలావస్థలనుబట్టి యిది చేయనగును, ఇది చేయరాదు అనుదానిని]-భయాభయములను [శాస్త్రముల నతిక్రమించుట భయము-అనుసరించుట అభయము అనుదానిని] బంధమును (సంసారమును) మోక్షమును యే బుద్ధి తెలిసికొనుచున్నదో ఓ పార్థా! అదియే సాత్త్వికబుద్ధి.' (శ్రీగీత. 18-30)

'యే బుద్ధిచే ఏది ధర్మమో, ఏది అధర్మమో, ఏది చేయదగునో,

ఏది చేయదగదో వీటిని వాస్తవముగ తెలియజాలదో అదియే ఓ పార్థా! రాజసబుద్ధి' (శ్రీగీత. 18-31)

'అధర్మమును ధర్మముగను (ఉన్నదానిని లేనట్లు – లేనిదానిని ఉన్నట్లును) తమోగుణముతో చుట్టువారి యేబుద్ధి తెలిసికొనుచున్నదో యథార్థములగు విషయములనన్నిటిని విపరీతముగ నేబుద్ధి తెలిసికొను చున్నదో ఓ పార్థా! అదియే తామసబుద్ధి.' (శ్రీగీత. 18-32)అని. సమస్తములైన పురాణసంబద్ధములగు విషయములను చతుర్ముఖబ్రహ్మనుండి (ఉపదేశముఖమున) పొందియే పురాణముల నన్నిటిని పురాణనిర్మాతలగు పరాశర-కృష్ణద్వైపాయనాదులు నిర్మించిరి. ఇదియే యిట్లుచెప్పబడినది– 'పద్మసంభవుడై భగవానుడగు పితామహబ్రహ్మ-దక్షుడు మున్నగు మునిశ్రేష్ఠులచే నడుగబడినవాడై పూర్వము ఏమి చెప్పినాడో దానిని చెప్పుచున్నాను' (విష్ణు. 1-2-8) అని.

'మరి అపౌరుషేయములై (పురుష నిర్మితములుకాని) పరస్పరవిరుద్ధములుగానున్న వేదవాక్యములందు విరోధమెట్లు పరిహరింపబడును?' వాటి యొక్క తాత్పర్యమును నిశ్చయించుటవలననేనని ముందే చెప్పబడినది.

వివరణము:- ఇంతవరకుగల గ్రంథముచే పురాణముల పరస్పర వైరుద్ధ్యమునకుగల కారణము–కల్పభేదముచే ఆయాయి గుణముల యుద్రేకముచే బ్రహ్మ, సత్త్వగుణప్రధానముగ కొన్ని పురాణములను రజోగుణప్రధానముగ కొన్ని పురాణములను తమోగుణప్రధానముగ మరికొన్ని పురాణములను చెప్పుటయేనని పేర్కొనబడినది. ఈ క్రింది ప్రమాణము కూడ కల్పభేదమునుబట్టియే పురాణములకుగల పరస్పర వైరుద్ధ్యమును నివారించుచున్నది.

'క్వచిత్ క్వచిత్ పురాణేషు విరోధోయదిలక్ష్యతే।
కల్పభేదాదిభిస్తత్ర వ్యవస్థా సద్భిరిష్యతే॥'

'పురాణములలో నచ్చటచ్చట విరోధము కనప్పట్టినచో కల్పభేదము

మున్నగు హేతువులచే అచ్చట వ్యవస్థను సజ్జనులంగీకరింతురు.' అని శ్లోకాభిప్రాయము. కల్పభేదమునుబట్టియే పురాణస్వభావభేదము, దానిని బట్టియే వాటి ప్రామాణ్యమున తారతమ్యము స్పష్టమగుచున్నది. కను కనే సత్త్వగుణప్రధానములైన కల్పములందు సత్త్వోద్రేకముకల్గిన బ్రహ్మ నిర్మించిన సాత్త్వికపురాణములే తత్త్వనిర్ణయమున ప్రమాణము లని అంగీకరింపవలయును. దీనినిబట్టి వైష్ణవములును, సాత్త్వికము లును అగు విష్ణుపురాణము, నారదీయపురాణము, భాగవతము, గరుడ పురాణము, పద్మపురాణము, వారాహపురాణము అనునారుపురాణములు మాత్రమే ప్రమాణములనియు, వీటిలోకూడ వైష్ణవపురాణము (పరాశర ప్రోక్తము) ప్రమాణమూర్ధన్యమని భగవద్రామానుజుల యభిప్రాయము.

పూర్వమే శ్రుతివచనములలో కనప్పట్టుచున్న పరస్పరవైరుధ్య మును సమాధానించినారు. ఈ విధముగ అవిరుద్ధములగు శ్రుతిస్మృతి పురాణముల ప్రామాణ్యమునాలంబించిన తమవాదము సప్రమాణమని నిరూపించినారు.

## ॥ శ్రీమన్నారాయణుడే పరతత్త్వము ॥

మూ॥ యదపిచేదం విరుద్ధమివదృశ్యతే—"ప్రాణంమనసి సహ కరణైః నాదాన్తే పరాత్మని। సంప్రతిష్ఠాప్యధ్యాయీత ఈశా నం ప్రధ్యాయీత ఏవం సర్వమిదం. బ్రహ్మావిష్ణురుద్రేం- ద్రాస్తే సర్వే సంప్రసూయన్తే। న కారణం...కారణంతు ధ్యేయః॥ సర్వైశ్వర్య సంపన్నః సర్వేశ్వరః శంభుః ఆకాశ- మధ్యేధ్యేయః॥" (అధర్వ-శిఖోపనిషత్తు); "యస్మాత్ పరం నాపరమస్తి కించిత్ యస్మాన్నాణీయో నజ్యాయోఽస్తి కశ్చిత్। వృక్షఇవస్తబ్ధోదివితిష్ఠత్యేకః తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్। తతోయదుత్తరతరం తదరూపమనామయమ్। య ఏతద్విదురమృతాస్తే భవన్తి। అథేతరే దుఃఖమేవాపియన్తి॥

**సర్వాననశిరోగ్రీవః సర్వభూతగుహాశయః। సర్వవ్యాపీచ భగవాన్ తస్మాత్ సర్వగతశ్శివః॥" (శ్వే. 3-18) యదా తమస్తన్నదివానరాత్రిః, నసన్నచాసన్ శివఏవకేవలః। తదక్షరం తత్సవితుర్వరేణ్యం, ప్రజ్ఞాచతస్మాత్ ప్రసృతా పురాణీ॥ (శ్వే. 4-35) ఇత్యాది। "నారాయణః పరం–బ్రహ్మ" ఇతిచ పూర్వమేవ ప్రతిపాదితమ్, తేనాస్యశబ్ద–మవిరోధః?**

అనువాదము:– "వాస్తవమునకిది విరుద్ధముగనున్నట్లు కన్పట్టుచున్నది. (ఏమన) 'ప్రాణము మనస్సునందును ఇంద్రియములతోపాటు నాదాన్తమున పరమాత్మునియందు నిలిపి ధ్యానింపవలయును. ఈశానుని (శివుని) తెప్పగ ధ్యానింపవలయును. ఇదియంతయు, బ్రహ్మ విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు వీరందరును పుట్టింపబడుచున్నారు. (కావున) కారణము కాదు....కారణమే ధ్యానింపదగియున్నది. సర్వవిధములగు నైశ్వర్యములతో (అణిమాది శక్తులతో) కూడినవాడును, సమస్తమును నియమించువాడును అయిన శంభుడు ఆకాశమధ్యమున (హృదయాకాశమందు) ధ్యానింపదగియున్నాడు.' (అథర్వ) 'ఎవ్వనికంటె వేరుగ ఉత్కృష్టమైనదిలేదో, ఎవ్వనికంటె అణువువలె సూక్ష్మతరమైనది, మహత్తరమైనదిలేదో, ఎవ్వడు వృక్షమువలె స్థిరముగ ఆకాశమున ప్రకాశించుచు అసమానముగనుండునో, అట్టి పురుషునిచే ఈ సమస్తము నిండియున్నది. వానికంటె ఏది ఉత్తమమో ఆ తత్త్వము రూపరహితము, దోషరహితము. దానినెరిగినవారు అమృతత్వమును పొందుదురు. ఇక ఇతరులు దుఃఖమునే పొందుదురు. కనుక, అంతట వ్యాపించినవాడై సమస్తమైన వదనములు, శిరస్సులు, మెడలు తనవిగా కలవాడై, సర్వప్రాణుల హృదయములందు నివసించుచున్న భగవానుడు శివుడు.' ( శ్వేతా. 3-9/10 ) 'ఎప్పుడు అజ్ఞానాంధకారము తొలగిపోయినదో అప్పుడు పగలు, రాత్రి, సత్తు, అసత్తు అనునవేవియు లేవు. కేవలము

"శివుడు" మాత్రమే కలడు. అక్షర స్వరూపమగు (నాశరహిత స్వరూపము కల) ఆ శివాత్మకతత్త్వమే సూర్యునికంటెకూడ శ్రేష్ఠమైనది. దానినుండి యే ప్రాచీనమగు విజ్ఞానమావిర్భవించినది.' మున్నగునవి.

'నారాయణుడు పరంబ్రహ్మము' అని పూర్వమే ప్రతిపాదింపబడినది. దానితో దీనికి విరోధము లేకుండుట ఎట్లు?

వివరణము:– నారాయణుడే పరతత్త్వమని భగవద్రామానుజ సిద్ధాంతము. ఇప్పుడు కొన్ని మంత్రములు శివబ్రహ్మాదులయందు పరత్వమును ప్రదర్శించుచున్నవి కనుక, వాటికిని వీటికిని పరస్పర వైరుధ్యము కలుగదా? నారాయణుడో లేక శివుడో ఒక్కడే పరతత్త్వముకాని, విరుద్ధముగ ఇరువురును పరతత్త్వమగుట ఎట్లు? అని పూర్వపక్షము. నారాయణుడే పరతత్త్వమని ముందు నిరూపింతురు.

'యదాతమః' అను మంత్రమున కొందరు—యదా=ఎప్పుడు, తమః=చీకటికలదో అనియు, కొందరు—యదా=ఎప్పుడు, అతమః=చీకటి లేదో అనియు వ్యాఖ్యానించియున్నారు. భగవద్రామానుజులు వీటి తాత్పర్యమును ముందుగ్రంథమున వివరింతురు.

మూ॥ అత్యల్పమేతత్—

వేదవిత్ప్రవరప్రోక్తవాక్యన్యాయోపబృంహితాః।
వేదాస్సాంగా హరింప్రాహుః, జగజ్జన్మాదికారణమ్॥

'జన్మాద్యస్యయతః' 'యతోవా ఇమాని భూతానిజాయన్తే, యేనజాతాని జీవన్తి, యత్ప్రయన్త్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వతద్బ్రహ్మ' ఇతి జగజ్జన్మాదికారణం బ్రహ్మేత్యవగమ్యతే। తచ్చ జగత్సృష్టిప్రలయప్రకరణేష్వేవ అవగన్తవ్యమ్। 'సదేవ సోమ్యేదమగ్రఆసీత్, ఏకమేవాద్వితీయమ్' ఇతి జగదుపాదానతా జగన్నిమిత్తతా జగదన్తర్యామితాది

ముఖేన పరమకారణం సచ్ఛబ్దేన ప్రతిపాదితమ్। అయమే- వార్థః - 'బ్రహ్మవా ఇదమేకమగ్ర ఆసీత్' ఇతి శాఖాన్తరే బ్రహ్మశబ్దేన ప్రతిపాదితః। అనేన సచ్ఛబ్దాభిహితం బ్రహ్మే- త్యవగతమ్। అయమేవార్థః శాఖాంతరే-'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్' 'నాన్యత్ కించనమిషత్' ఇతి। తథా సద్- బ్రహ్మశబ్దాభ్యామాత్మైవ అభిహిత ఇత్యవగమ్యతే। తథాచ శాఖాన్తరే-'ఏకో హ వై నారాయణ ఆసీత్, న బ్రహ్మా, నేశానో, నేమేద్యావాపృథివీ, ఇత్యాదినా సద్ బ్రహ్మాత్మాది పరమ- కారణవాచిభిః శబ్దైః నారాయణ ఏవాభిధీయతే ఇతి నిశ్చీయతే।

అనువాదము:- ఇది చాల చిన్నవిషయము. (ఇది పూర్వపక్ష నిరాకరణము) 'వేదజ్ఞాన సంపన్నులలో పరమశ్రేష్ఠులైనవారి వచనముల చేతను, యుక్తులచేతను పరిపుష్టములగు సాంగములైన వేదములు, నిఖిలజగత్తులయొక్క పుట్టుక, ఉనికి, లయము మున్నగువాటికి కారణ మగు శ్రీహరినే ప్రతిపాదించినవి.'

'జన్మ స్థితి లయములు ఈ జగత్తుకు దేనివలన కల్గుచున్నవో' (బ్రహ్మ. సూ. 1-1-2) 'దేనివలన ఈ సమస్త భూతములు పుట్టు చున్నవో, ఈ పుట్టినవి దేనివలన బ్రతుకుచున్నవో, మరణించి (ప్రయన్తి) దేనియందు లయమును పొందుచున్నవో (అభిసంవిశన్తి) అదియే బ్రహ్మమనియెరిగి విచారింపుము.' (తై. భృగు. 2) అని జగత్తులయొక్క పుట్టుక మున్నగు వాటికి కారణము బ్రహ్మమేనని తెలియుచున్నది. ఈవిషయము జగత్తులయొక్క సృష్టి-ప్రలయముల తెలియజేయు ప్రకరణములయందే తెలిసికొనవలయును. 'ఓ సోమ్యుడా! ఈ కనుపించు ప్రపంచము సృష్టికిపూర్వము సద్రూపమే (సదాత్మకమై) యుండెను. సద్రూపమగు బ్రహ్మమొక్కటియే కలదు. రెండవదిలేదు.' (ఛాం. 6-2-1) అని జగత్తునకు ఉపాదానకారణమైయుండుట జగత్తునకు

నిమిత్తకారణమైయుండుట, జగత్తునకు అంతర్యామియైయుండుట మున్నగువాటిద్వారమున - 'సత్' అను శబ్దముచే 'పరమకారణమే' (సర్వమూలకారణమే) చెప్పబడినది. ఈ అర్థమే (అనగా పరమకారణమే) 'ఇది (జగత్తు) సృష్టికిముందు బ్రహ్మాత్మకమే అయి ఉండెను' అని (బృహ. 3-4-10) వేరొక వేదశాఖలో బ్రహ్మశబ్దముచే ప్రతిపాదింపబడినది. దీనిచే 'సత్' అను శబ్దముచే బోధింపబడినది బ్రహ్మమని తెలిసెను. ఈ అర్థమే (విషయమే) 'ఇది సృష్టికిముందు ఆత్మయే అయి ఉండెను. ఆత్మకంటె వేరుగనేమియు లేదు.' (ఐ. 1) అని చెప్పబడినది. ఇట్లు- 'సత్'-'బ్రహ్మ'మను రెండు శబ్దములచేతను 'ఆత్మయే' బోధింపబడినదని తెలియుచున్నది. ఇట్లే వేరొక వేదశాఖలో (మహానారాయణోపనిషత్ 1-1) 'ఒక్క నారాయణుడే ఉండెను. బ్రహ్మ లేడు. ఈశానుడు (శివుడు) లేడు. ఈ అంతరాళము, భూమి అనునవి లేవు.' మున్నగు వాక్యముచే సత్-బ్రహ్మ-ఆత్మ-మున్నగు 'పరమకారణమును' (మూలకారణమును) బోధించు శబ్దములచే 'నారాయణుడే' బోధింపబడుచున్నాడని నిశ్చయింపబడుచున్నది.

వివరణము:- ఇంతవరకు చూపబడిన విభిన్న శ్రుతివచనములలో సత్-బ్రహ్మ-ఆత్మ మున్నగు జగత్కారణమును బోధించుటకు ప్రయోగింపబడిన శబ్దములు శ్రీమన్నారాయణునే పరతత్త్వముగ నిష్కర్షించుచున్నవని అభిప్రాయము.

మూ॥ "యమన్తః సముద్రే కవయోవయన్తి"-ఇత్యాది, "నైనమూర్ధ్వం నతిర్యంచం, నమధ్యే పరిజగ్రభత్। నతస్యేశే కశ్చన తస్యనామ మహద్యశః॥ నసందృశే తిష్ఠతిరూపమస్య, నచక్షుషా పశ్యతి కశ్చనైనమ్। హృదామనీషా మనసాఽభిక్లృప్తో, యఏనం విదురమృతాస్తేభవన్తి" ఇతి సర్వస్మాత్ పరత్వమ్ అస్య ప్రతిపాద్య, "నతస్యేశేకశ్చన" ఇతి, తస్మాత్ పరం కిమపినవిద్యతే ఇతిచ ప్రతిషిధ్య, "అద్భ్యః

సంభూతో హిరణ్యగర్భఇత్యష్టౌ" ఇతి, తేన ఏకవాక్యతాం గమయతి; తచ్చ మహాపురుషప్రకరణమ్—"హ్రీశ్చతేలక్ష్మీశ్చ పత్న్యౌ" ఇతి నారాయణ ఏవేతిద్యోతయతి।

అయమర్థః--నారాయణానువాకే ప్రపంచితః—"సహస్రశీర్షం దేవమ్" ఇత్యారభ్య, "సబ్రహ్మ సశివః సేంద్రః సోఽక్షరః పరమః స్వరాట్" ఇతి సర్వశాఖాసు పరతత్త్వప్రతిపాదనపరాన్ అక్షర-శివ-శంభు-పరబ్రహ్మ-పరజ్యోతిః-పరతత్త్వ-పరాయణ-పరమాత్మాది సర్వశబ్దాన్ తత్తద్గుణయోగేన నారాయణేఏవ ప్రయుజ్య, తద్వ్యతిరిక్తస్య సమస్తస్య తదాయత్తతాం తద్వ్యాప్యతాం తదాధారతాం తన్నియామ్యతాం తచ్ఛేషతాం చప్రతిపాద్య, బ్రహ్మశివయోరపి ఇంద్రాదిసమానాకారతయా తద్విభూతిత్వంచ ప్రతిపాదితమ్। ఇదంచ వాక్యం కేవలపరతత్త్వప్రతిపాదనపరమ్। అన్యత్ కించిదపి అత్రనవిధీయతే। అస్మిన్ వాక్యే ప్రతిపాదితస్య సర్వస్మాత్ పరత్వేన అవస్థితస్య బ్రహ్మణః వాక్యాన్తరేషు—"బ్రహ్మవిదాప్నోతిపరమ్" ఇత్యాదిషు ఉపాసనాది విధీయతే।

అనువాదము:- 'ఏ పరమాత్మను సముద్రమధ్యమున (ఉన్నవానిగ) ఋషులు ధ్యానించుచున్నారో' (మహానారా. 1-3) 'ఈ పరమాత్మను ఊర్ధ్వమందునను, అడ్డముగను, మధ్యభాగమునను ఎవ్వడు పట్టుకొనలేదు. (అనగా పరిచ్ఛిన్న స్వరూపునిగా గ్రహింపలేడని భావము) ఆతనిని ఎవ్వడును నియమింపజాలడు. కనుకనే ఆతని 'యశస్సు' (మహద్యశః) గొప్పదికదా!' (మహానా. 1-10) 'ఆ పరమాత్మయొక్క రూపము ప్రత్యక్షసిద్ధముకాదు. కనుకనే ఎవ్వడును కంటితో పరమాత్మను చూడజాలడు. ఏ పరమాత్మ హృదయమందు స్థిరముగ నిలుపబడిన బుద్ధిచే (హృదా, మనీషా) కల్పింపబడినాడో, అట్టి (ధ్యానకల్పితుడగు) పర

మాత్మనుపాసించినవారు అమృతత్వమును పొందుదురు. (ముక్తులగు దురు)' (మహా. నా. 10) అని. అంతటికంటెను ఆ పరబ్రహ్మమే గొప్పదని ప్రతిపాదించి, 'అతని నెవ్వడు నియమింపజాలడు' (నతస్యేశే కశ్చన) అని ఆ పరమాత్మకంటె గొప్పది వేరేమియులేదని నిషేధించి, 'అద్భ్యః సంభూతః హిరణ్యగర్భ ఇత్యష్టౌ' అని ఆరంభించి చెప్పబడిన ఎనిమిది ఋక్కులకును పూర్వముచెప్పబడిన ఋక్కులతో ఏకవాక్యతను (ఒకే అర్థమును అనగా శ్రీమన్నారాయణుని బోధించుటనే) సూచించు చున్నది. ఇది మహాపురుషుని బోధించు ప్రకరణము-'నీకు హ్రీఅను పేరుగల భూదేవియు, శ్రీదేవియు పత్నులు' (హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ) అనువాక్యము నారాయణుడేనని స్ఫురింపజేయుచున్నది.

ఈ విషయము నారాయణానువాకమున విస్తరించి చెప్పబడినది. 'సహస్ర శీర్షం దేవమ్' (అనంతములగు శిరస్సులుగల దేవుని) అని ఆరంభించి, అతడే బ్రహ్మ, అతడే శివుడు, అతడే ఇంద్రుడు, అతడే కూటస్థుడగు అంతర్యామి (అక్షరుడు) ఉత్కృష్టుడును (పరమః) కర్మము నకు వశపడక స్వయముగ ప్రకాశించువాడు (స్వరాట్) (మహా. నా. 11) అని అన్నిశాఖలయందును పరతత్త్వమును ప్రతిపాదించునట్టి అక్షర-శివ-శంభు-పరబ్రహ్మ-పరంజ్యోతి-పరతత్త్వ-పరాయణ-పరమాత్మ-మున్నగు సమస్త శబ్దములను ఆయాయి గుణముల సంబంధమునుబట్టి శ్రీమన్నారా యణునియందే ప్రయోగించి; అతనికంటె వేరైన సమస్తము (అంతయు) ఆయనకు వశమైయున్నదనియు, అతనిచే వ్యాపింపబడినదనియు, ఆయనే ఆధారముగా కల్గియున్నదనియు, ఆయనచే నియమింప దగియున్న దనియు, ఆయనకు 'శేష'మై యున్నదనియు, ఆయననే 'ఆత్మ'గా కలిగి యున్నదనియు ప్రతిపాదించి; చతుర్ముఖబ్రహ్మ, శివుడు అను నీయిరు వురును ఇంద్రాదిదేవతలతో సమానమైన స్వరూపముకలవారేకనుక ఆ శ్రీమన్నారాయణునకు విభూతులేనని (అంశములేనని) ప్రతిపాదింపబడి నది.

ఈ వాక్యము కేవలము పరమాత్మస్వరూపమును (పరతత్త్వమును) ప్రతిపాదించినదేకాని, ఇతరమైన అంశమేదియు ఇచ్చట విధింపబడుటలేదు. ఈ వాక్యమందు ప్రతిపాదింపబడి అందరికంటె ఉత్కృష్టమైయుండిన పరబ్రహ్మమునకు సంబంధించిన ఉపాసనము మున్నగునది 'బ్రహ్మవిదాప్నోతిపరమ్' (బ్రహ్మమునుపాసించినవాడు బ్రహ్మమును పొందును) ఇత్యాది వాక్యములందు విధింపబడుచున్నది.

వివరణము:– శ్రుతివచనములలో కొన్నిచోటులందు నారాయణుడు, మరికొన్నిచోటులందు శివుడు, కొన్నిచోటులందు బ్రహ్మ పరతత్త్వములుగా ప్రతిపాదింపబడుచున్నట్లు కనబడుచున్నదికనుక నారాయణుడే పరతత్త్వమని నిశ్చయించుట ఎట్లు కుదురును? అని పూర్వపక్షాశయము. దీనికి సమాధానముగ భిన్నభిన్న వేదశాఖలకుచెందిన వాక్యముల నుదాహరించి వాటియన్నిటిచేతను ప్రతిపాదింపబడు పరతత్త్వము శ్రీమన్నారాయణుడేనని భగవద్రామానుజులు నిరూపించినారు.

'సదేవసోమ్య!' ఇత్యాది సామవేదశాఖకుచెందిన ఛాందోగ్య ఉపనిషద్వచనముచే సచ్ఛబ్దవాచ్యముగా చెప్పబడినదియును, 'బ్రహ్మవా ఇదమగ్ర ఆసీత్' ఇత్యాది శుక్లయజుర్వేదీయ బృహదారణ్యకోపనిషద్వచనముచే బ్రహ్మశబ్దముచే నిర్దేశింపబడినదియు, 'ఆత్మా వా ఇదమగ్ర ఆసీత్' ఇత్యాది అథర్వశాఖీయమగు ఐతరేయోపనిషద్వాక్యముచే 'ఆత్మ' శబ్దముచే బోధింపబడినదియు, 'ఏకోహవై నారాయణ ఆసీత్' ఇత్యాది మహోపనిషద్వచనముచే నిర్దేశింపబడినదియు శ్రీమన్నారాయణాత్మకమగు ఒకేతత్త్వమనియు, ఈ తత్త్వమే తైత్తిరీయ నారాయణానువాకముచే పరబ్రహ్మముగను, బ్రహ్మ శివాది దేవతాన్తరముల యందంతర్యామిగను నున్నదనియు 'యమన్తః సముద్రే' ఇత్యాది మన్త్రముతో ప్రారంభింపబడిన మూలగ్రంథమున భగవద్రామానుజులు నిరూపించిరి. మహానారాయణోపనిషత్తు నందలి—'యమన్తః సముద్రే' ఇత్యాది ఋక్కు సముద్రశాయియగు శ్రీమన్నారాయణుని అసాధారణ అవస్థానమును

నిరూపించుచున్నదనియు—'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ' అను వచనమున శ్రీమన్నారాయణునియందు మాత్రమేకల లక్ష్మీపతిత్వాది అసాధారణ లక్షణముల బోధించుచున్నదనియు మహానారాయణోపనిషద్వ్యాఖ్యాతలు కూడ ఉట్టంకించిరి. మహానారాయణమున హిరణ్యగర్భ, శివరుద్రాది శబ్దములచే నిర్దేశింపబడిన పరమాత్మ శ్రీమన్నారాయణుడేనని వారు నిష్కర్షించిరి. శ్రీనారాయణుడను భాష్యకర్త—ఈ క్రిందివిధముగా నీవిషయమునే స్పష్టపరచినాడు. 'ఆదిదేవస్య నారాయణస్య వైకుంఠపతేః, క్షీరాబ్ధిశాయినో జగదంతర్యామిణోఽన్తర్యామి బ్రాహ్మణప్రతిపాద్యస్య.... ఉపనిషదమాహ' 'ఆదిదేవుడును వైకుంఠపతియు, క్షీరసాగరమందు శయనించినవాడును, అంతర్యామిబ్రాహ్మణమందు అంతర్యామిగా ప్రతిపాదింపబడినవాడును అగు శ్రీమన్నారాయణుని యుపనిషత్తును చెప్పెను' (మహానారాయణోపనిషద్దీపికా. పుట 28)

నారాయణ పరా వేదాః, దేవానారాయణాంగజాః।
నారాయణ పరాలోకాః, నారాయణ పరామఖాః॥
నారాయణ పరాయోగాః, నారాయణ పరంతపః।
నారాయణ పరంజ్ఞానం, నారాయణ పరాగతిః॥

ఇత్యాది శిష్టవచనములు—వేదములు, దేవతలు, లోకములు, యజ్ఞములు, యోగములు, తపస్సు, జ్ఞానము, సర్వగతులు నారాయణపరములని స్పష్టపరచుచున్నవి. మహానారాయణమునందలి 'సహస్రశీర్షం దేవమ్' ఇత్యాది ఏకాదశానువాక భాష్యమున సాయణాచార్యులు శ్రీమన్నారాయణుడే పరమాత్మయనియు, పూర్వానువాకమున హృదయ పుండరీకమందుపాసింపబడు పరమాత్మ స్వరూపమే ఉపాస్యగుణవిశేష పురస్సరముగ నిచ్చట నిర్దేశింపబడుచున్నదనియు వ్యాఖ్యానించినారు. ఈక్రింది వాక్యములీవిషయమును స్పష్టపరచుచున్నవి. 'పురా దేష నారాయణ శబ్దేన వ్యవహ్రియమాణః యఃపరమేశ్వరః సఏవ పరముత్కృష్టం సత్యజ్ఞానానందాది వాక్యైః ప్రతిపాద్యస్య బ్రహ్మణస్తత్త్వమ్। అతోనారాయణః

పరఏ వాత్మా నత్వపరోమూర్తి విశేషః। తథాపరోజ్యోతిః యదేతదుత్కృష్టం జ్యోతిః ఛాందోగ్యైః పరంజ్యోతిరుపసంపద్య, ఇత్యామ్నాతం తదపి నారాయణ ఏవ। తస్మాన్నారాయణః పరమాత్మా' 'పురాణములయందు నారాయణ శబ్దముచే వ్యవహరింపబడు ఏ పరమేశ్వరుడు కలడో అతడే (నారాయణుడే) 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' ఇత్యాది వాక్యములచే ప్రతిపాదింపదగు సర్వోత్కృష్టమగు బ్రహ్మతత్త్వము. కనుక పరుడగు నారాయణుడే ఆత్మ. వేరగు మూర్తి విశేషమేమియు ఇట్టిదికాదు. అట్లే ఛాందోగ్యమున 'పరంజ్యోతిరుపసంపద్య' ఇత్యాదిగ చెప్పబడిన యుత్కృష్టమగు జ్యోతిస్సుకూడ శ్రీమన్నారాయణుడే. కనుక నారాయణుడు పరమాత్మ.' (మహా. నా. సాయణభాష్యము) నారాయణపరత్వమే యీ అనువాకమున లెస్సగ ప్రతిపాదింపబడినది. ఈ పరమాత్మయే (నారాయణుడే ఇంద్రసూర్యాది రూపముగ నున్నాడుకనుక 'దేవ'శబ్దముచే వ్యవహరింపబడుచున్నాడనిగూడ చెప్పబడినది.

మరియు, వేదవిదగ్రేసరుడగు భగవాన్ ఆపస్తంబర్షి-కల్పసూత్రములందు 'సహస్రశీర్షాపురుషః ఇత్యుపహితాం పురుషేన నారాయణేన యజమానఉపతిష్ఠతే' 'నారాయణాఖ్యముపస్థానమ్.' 'ఉత్తరనారాయణేన ఆదిత్యముపతిష్ఠతే' ఇత్యాది సూత్రములచే నారాయణానువాకము నారాయణపరమని పేర్కొనినాడు.

'వేదాహమేతం పురుషం మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసస్తు పారే' అను తైత్తిరీయ పురుషసూక్త వచనముకూడ పరమపురుషుడగు శ్రీమన్నారాయణుని అసాధారణలక్షణమగు 'విద్యుద్వర్ణముతోకూడిన పురుషుడై యుండుట' అనుదానిని ప్రతిపాదించుచున్నది.

కఠవల్లి కూడ-'సర్వే వేదాయత్ పదమామనన్తి' (అన్ని వేదములు ఏ స్థానమ్మును గురించి చెప్పుచున్నవో) ఇత్యాదిగ ప్రారంభించి, 'సోఽధ్వనః పరమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్' 'అతడు మార్గముయొక్క

తుదిని పొందుచున్నాడు. అది విష్ణువుయొక్క పరమపదము' అని విష్ణు పారమ్యమును చెప్పుచున్నది. ఇట్లే మైత్రావరణీయోపనిషత్తుకూడ– 'ఏవం సవితుర్వరేణ్యం ధ్రువ మచలమమృతం విష్ణుసంజ్ఞం సర్వాధారం ధామ' 'ఇట్లు సూర్యునియొక్క వరణీయము, నిశ్చయము, అచంచలము, అమృతము–విష్ణువను పేరుగలదియు సర్వులకు ఆధారమైన స్థానము' ఇత్యాదిగ వైష్ణవపదమే సర్వులకు ప్రాప్యమని ప్రతిపాదించుచున్నది.

ఈవిధముగ వివిధములగు నుపనిషత్తులు–తద్వ్యాఖ్యాతల యభిప్రాయములు శ్రీమన్నారాయణపరత్వమునే నొడువుచున్నవని తాత్పర్యము.

మూ॥ అతః "ప్రాణం మనసి సహకరణైః" ఇత్యాదివాక్యం సర్వకారణే పరమాత్మనికరణప్రాణాదిసర్వం వికారజాతముప–సంహృత్య. తమేవ పరమాత్మానం సర్వస్య ఈశానం ధ్యాయీత ఇతి, పరబ్రహ్మభూతనారాయణస్యైవధ్యానం విదధాతి। "పతింవిశ్వస్య" "నతస్యేశేకశ్చన" ఇతి తస్యైవ సర్వేశానతా ప్రతిపాదితా। అతఏవ–"సర్వైశ్వర్యసంపన్నః సర్వేశ్వరః శంభుః ఆకాశమధ్యే ధ్యేయః" ఇతి నారాయణస్యైవ పరమకారణస్య శంభుశబ్దవాచ్యస్య ధ్యానంవిధీయతే; "కశ్చధ్యేయః" ఇత్యారభ్య "కారణంతుధ్యేయః" ఇతి కార్యస్య అధ్యేయతాపూర్వకం కారణైకధ్యేయతాపరత్వాత్ వాక్యస్య। తస్యైవ నారాయణస్య పరమకారణతా శంభుశబ్దవాచ్యతాచ పరమకారణప్రతిపాదనైకపరే నారాయణాను–వాకే ఏవ ప్రతిపన్నా ఇతి, తద్విరోధ్యర్థాన్తరపరికల్పనం కారణస్యైవధ్యేయత్వ విధివాక్యే న యుజ్యతే।

అనువాదము:– కనుక, 'ప్రాణమ్మనసిసహకరణైః' మున్నగు వాక్యము సమస్తమునకు కారణమైన పరమాత్మయందు ఇంద్రియములు, ప్రాణము మొదలగు వికారసముదాయమంతయు, లయింపజేసి (ప్రవర్తింపజేసి) సర్వమునకు నియామకుడగు ఆ పరమాత్మనే ధ్యానింపవల

యును అని, పరబ్రహ్మమగు శ్రీమన్నారాయణుని ధ్యానమునే విధించు చున్నది. 'పతిం విశ్వస్య' (లోకమునకు పాలకుడైనవానిని) 'నతస్యేశే కశ్చన' (ఎవ్వడును ఆతనికి నియామకుడుకాడు) అని ఆ పరమాత్మకే (శ్రీమన్నారాయణునకే) సర్వేశ్వరత్వము ప్రతిపాదింపబడినది. కనుకనే, 'సర్వైశ్వర్యసంపన్నః సర్వేశ్వరశ్శంభుః ఆకాశమధ్యేధ్యేయః' (సర్వ విధములగు అణిమాద్యైశ్వర్యములతోకూడినవాడును, సమస్తమును నియమించువాడును, అయిన శంభుడు ఆకాశమధ్యమున (హృదయమున) ధ్యానింపదగియున్నాడు) అని పరమకారణమైనవాడును, శంభుశబ్దముచే బోధింపదగినవాడును అగు శ్రీమన్నారాయణునిధ్యానమే విధింపబడు చున్నది. 'కశ్చధ్యేయః' (ఎవ్వడు ధ్యానింపదగియున్నాడు?) అని యారంభించి-'కారణంతుధ్యేయః' (కారణమైన పరమాత్మయే ధ్యానింప దగియున్నాడు) అని 'కార్యము' (జగత్తు మున్నగునది) ధ్యానింప రాదని చెప్పుటద్వారా కారణముమాత్రమే ధ్యానింపదగియున్నదని చెప్పు టయే వాక్యముయొక్క తాత్పర్యముకనుక, ఆ శ్రీమన్నారాయణుడే పరమకారణమగుటయు, 'శంభు' శబ్దముచే బోధింపదగియున్నాడను టయు, పరమకారణమును మాత్రమే ప్రతిపాదించుట లక్ష్యముగా కల్గిన నారాయణానువాకమునందే (నారాయణోపనిషత్తునందే) తెలియబడినది. కనుక-కారణమే ధ్యానింపదగినదని విధించువాక్యమున దానికి విరుద్ధ మైన యర్థమును కల్పించుటయనునది యుక్తముకాదు.

మూ॥ యదపి-"తతోయదుత్తరమ్" ఇత్యత్ర "పురుషాదన్యస్య పరతరత్వం ప్రతీయతే" ఇత్యభ్యధాయి; తదపి-"యస్మా-న్నాపరమస్తి కించిద్యస్మాన్నాణీయో నజ్యాయోఽస్తి కశ్చిత్" "యస్మాదపరం, యస్మాదన్యత్ కించిదపిపరం నాస్తి, తేనాపి ప్రకారేణపురుషవ్యతిరిక్తస్య పరత్వంనాస్తి ఇత్యర్థః, అణీయస్త్వం సూక్ష్మత్వం జ్యాయస్త్వం సర్వేశ్వ రత్వం, సర్వవ్యాపిత్వాత్ సర్వేశ్వరత్వాత్ అస్య, ఏతద్-

వ్యతిరిక్తస్యకస్యాపి అణీయస్త్వం జ్యాయస్త్వం చ నాస్తి ఇత్యర్థః। "యస్మాన్నాణీయోనజ్యాయోఽస్తి కశ్చిత్" ఇతి పురుషాదన్యస్యకస్యాపి జ్యాయస్త్వం నిషిద్ధమితి. తస్మా-దస్యాన్యపరత్వం నయుజ్యతే ఇతి ప్రత్యుక్తమ్।

అనువాదము:- (మరియు) 'తతోయదుత్తరమ్' అనుచోటున పురుషునికంటె వేరైనవానికి సర్వశ్రేష్ఠత్వము స్ఫురించుచున్నదనుటకూడ [ఈ క్రిందివిధముగ] నిరాకరింపబడినది. [ఎట్లన] 'యస్మాత్పరం.... ...........' యస్మాత్-అపరం = ఏ కారణమువలన వేరైనదేదియు ఉత్కృష్టమైనది [పరం] లేదో; ఏ విధముగను పురుషునికంటె వేరైన దానికి శ్రేష్ఠత్వములేదని యర్థము; అణీయస్త్వమనగా సూక్ష్మమైన స్వరూపము కల్గియుండుట, 'జ్యాయస్త్వమ్' [గొప్పతనము] అనగా సమస్తమునకు ఈశ్వరుడై [నియామకుడై] యుండుట. అంతట వ్యాపించినవాడు కనుకను, సమస్తమునకు నియామకుడు కనుకను, ఈతనికంటె వేరైన దేనికిని సూక్ష్మస్వరూపము కలిగియుండుట, గొప్ప తనము కలిగియుండుట అనునవి లేవని యర్థము. 'యస్మాన్నాణీనజ్యాయోఽస్తి కశ్చిత్' [ఎవ్వనికంటె సూక్ష్మమైనది, గొప్పది వేరేమియు లేదో] అను వాక్యముచే పురుషునికంటె వేరైనదానికి దేనికిని గొప్ప తనము లేదని నిషేధింపబడినది. [శ్రేష్ఠత్వము నిషేధింపబడినది] దాని కంటె ఇతరమైనదానికి శ్రేష్ఠత్వము యుక్తముకాదు-అని [అభిప్రాయము].

మూ॥ కస్తర్హి అస్యవాక్యస్య అర్థః? అస్యప్రకరణస్య ఉపక్రమే "తమేవంవిదిత్వా అతిమృత్యుమేతి, నాన్యః పంథా విద్యతే అయనాయ" ఇతి పురుషవేదనస్య అమృతత్వహేతుతాం, తద్వ్యతిరిక్తస్య అపథతాంచ ప్రతిజ్ఞాయ, "యస్మాత్ నాపర మస్తి కించిత్ ... తేనేదం పూర్ణం పురుషేణసర్వమ్" ఇత్యే-తదన్తేన పురుషస్య సర్వస్మాత్పరత్వం ప్రతిపాదితమ్।

యతః పురుషతత్త్వమేవ ఉత్తరతరం "తతో యదుత్తరతరం" పురుష తత్త్వం, తదేవ 'అరూపమ్' 'అనామయమ్', 'య. ఏతద్విదురమృతాస్తే భవన్తి। అథేతరే దుఃఖమేవాపియన్తి ఇతి పురుషవేదనస్య అమృతత్వహేతుత్వం తదితరస్యచ అపథత్వం ప్రతిజ్ఞాతం సహేతుకముపసంహృతమ్। అన్యథా ఉపక్రమ గతప్రతిజ్ఞాభ్యాం విరుధ్యతే। పురుషస్యైవ శుద్ధి-గుణయోగేన శివశబ్దాభిధేయత్వం 'శాశ్వతం శివమచ్యుతమ్' ఇత్యాదినాజ్ఞాతమేవ। పురుషఏవశివశబ్దాభిహితః ఇతి అనన్తరమేవ వదతి। 'మహాన్ ప్రభుర్వై పురుషః సత్త్వస్యైష ప్రవర్తకః' ఇతి। ఉక్తేనైవన్యాయేన "నసన్నచాసచ్ఛివఏవ కేవలః" ఇత్యాది సర్వంనేయమ్।

అనువాదము:- మరి, ఈవాక్యమునకర్థమేమి? (చెప్పబడుచున్నది) ఈ ప్రకరణముయొక్క ప్రారంభమున 'ఆ పరమాత్మనీవిధముగ నుపాసించినవాడు మృత్యువు నతిక్రమించును' 'దీనికంటె వేరుగ పరమాత్మను పొందుటకు మార్గమేమియులేదు.' అని పురుషునిగురించి తెలిసికొనుటయే అమృతత్వమునకు కారణమనియు, దానికంటె వేరైనది మార్గముకాదని ప్రతినబూని--'ఎవ్వనికంటె వేరైన పరతత్వములేదో, ....అట్టి పురుషునిచే నిదియంతయు నిండియున్నది'-అనునంతవరకు పురుషుడే అన్నిటికంటె శ్రేష్ఠుడని ప్రతిపాదింపబడినది. ఏ కారణమున-పురుషతత్త్వము శ్రేష్ఠతరమైనదో ఆ కారణమువలననే [తతో] ఏది శ్రేష్ఠతమమైన [యదుత్తరతరం] పురుషతత్త్వమో అదియే రూపములేనిది, దోషములేనిది, 'ఎవ్వరిది యెరుగుదురో వారమృతత్వము పొందుదురు'. ఇక ఇతరులు దుఃఖమునే [దుఃఖభాజనమగు సంసారమునే] పొందుదురు' అని పురుషుని తెలిసికొనుట [ఉపాసించుట] అమృతత్వమును పొందుటకు కారణమనియు, దానికంటె వేరైనది మార్గముకాదని ప్రతినబూనబడినదియే యుక్తిపురస్సరముగ నిరూపింపబడి ముగింపబడినది. అట్లుకానిచో

ప్రారంభమునచేసిన ప్రతినలతో స్థైర్యమేర్పడును. పురుషుడే పరిశుద్ధతాగుణముకలవాడు కనుక 'శివ' శబ్దముచే బోధింపబడినాడని— 'నిత్యుడు, మంగళస్వభావుడు, అచ్యుతుడైన శ్రీమన్నారాయణుడు' [శాశ్వతం శివమచ్యుతం] మున్నగు వచనముచే తెలియబడినదే. పురుషుడే 'శివ' శబ్దముచే బోధింపబడినాడని తరువాతనే 'శ్రేష్ఠుడును ప్రభువునైన పురుషుడు సత్త్వగుణమునకు ప్రవర్తకుడు [ప్రవర్తింపజేయువాడు] అని చెప్పుచున్నది. ఈ చెప్పబడిన న్యాయముననుసరించియే [యుక్తిననుసరించియే] 'సత్తుకాదు, అసత్తుకాదు, కేవలము శివుడే' మున్నగునదికూడ సమన్వయింపదగియున్నది.

మూ॥ కించ, 'న తస్యేశే కశ్చన'–ఇతి నిరస్తసమాభ్యధిక సంభావనస్య పురుషస్య 'అణోరణీయాన్' ఇత్యస్మిన్ననువాకే, వేదాద్యన్తరూపతయా వేదబీజభూతప్రణవస్య ప్రకృతిభూతాకారవాచ్యతయా మహేశ్వరత్వం ప్రతిపాద్య దహరపుండరీకమధ్యస్థాకాశవర్తితయా ఉపాస్యత్వముక్తమ్।

అనువాదము:– మరియు, 'ఆతనికి నియామకుడెవ్వడులేడు' అని–తిరస్కరింపబడిన సమానుడు అధికుడు కలవాడగు పురుషుడు–'అణోరణీయాన్' [అణువుకంటె అణువు] అని ఈ అనువాకమున– వేదమునకు ఆది–అంతమునై, వేదమునకు బీజమైన [మూలమైన] 'ఓమ్' అను ప్రణవమునకు మూలమైన 'అకారమున'కు వాచ్యార్థమైయున్నాడు కనుక, మహేశ్వరుడు–అని ప్రతిపాదించి, హృదయాకాశమధ్యమున [దహరపుండరీకమధ్యమున] నున్నవానిగా ఉపాసింపదగియున్నాడని చెప్పబడినది.

## ॥ ప్రణవమూలమగు అకారమునకర్థము శ్రీమన్నారాయణుడే ॥

మూ॥ అయమర్థః, సర్వస్య వేదజాతస్య ప్రకృతిః ప్రణవ ఉక్తః॥ ప్రణవస్య చ ప్రకృతిః అకారః॥ ప్రణవవికారో వేదః స్వ-ప్రకృతిభూతే ప్రణవే లీనః॥ తస్య ప్రణవప్రకృతిభూతస్య అకారస్య యః పరః=వాచ్యః, స ఏవ మహేశ్వర ఇతి। సర్వ వాచకజాతప్రకృతిభూతాకారవాచ్యః సర్వ వాచ్యజాతప్రకృతి భూతనారాయణో యః, సః మహేశ్వర ఇత్యర్థః॥

అనువాదము:- ఇది దీని యర్థము. సమస్త వేదసముదాయమునకును ప్రకృతి [మూలమైనది] ప్రణవమని [ఓంకారమని] చెప్పబడినది. [అట్టి] ప్రణవమునకు [ఓంకారమునకు] ప్రకృతి [మూలము] అకారము. ప్రణవముయొక్క పరిణామమైన వేదము-తనకు మూలమైన ప్రణవమునందు లీనమైనది [అయించినది]. ప్రణవమునకు మూలమైన అకారమునకు ఎవ్వడు 'పరుడో' [యఃపరః] [అనగా] బోధింపదగిన యర్థమో, ఆతడే మహేశ్వరుడు అని. సమస్త శబ్దసముదాయమునకు మూలమైన 'అకారము'నకర్థము-సమస్తార్థసముదాయమునకు మూలమైన [మూలకారణమైన] నారాయణుడెవ్వడుకలడో, అతడే మహేశ్వరుడు అనియర్థము.

వివరణము:- తైత్తిరీయోపనిషత్తులోని నారాయణప్రశ్నమందలి- 'అంభస్యపారే భువనస్య మధ్యే' అని యారంభించియున్న మంత్రములన్నింటికి ప్రధానముగ ప్రతిపాదింపదగు తత్త్వము శ్రీమన్నారాయణుడేననియు, ఆయనే 'పురుష'శబ్దముచేకూడ నిర్దేశింపబడినాడనియు, ఆయనకంటె వేరగు పరతత్త్వమేదియు లేదనియు, శివ-శంభు-హిరణ్యగర్భాది శబ్దములన్నియు ఆ నారాయణునే ముఖ్యముగ బోధించుచున్నవనియు, ఆయనే సర్వకారణమనియు-ఆయననుండి పుట్టి ఆయనకు 'విభూతులైన'

బ్రహ్మరుద్రాదులు 'కార్యమైనవారు' (పుట్టినవారు) కనుక వారినికాక, కారణమైన శ్రీమన్నారాయణతత్త్వమే ధ్యానింపదగియున్నదని సవిస్తరముగ నారాయణానువాక తాత్పర్యమును నిరూపించి, ఇప్పుడు భగవద్రామానుజులు—ఇదేయనువాకమునగల—'యో వేదాదౌ స్వరః ప్రోక్తః వేదాన్తేషు ప్రతిష్ఠితః, తస్య ప్రకృతిలీనస్యయః పరస్స మహేశ్వరః॥' అను మంత్రముచే ప్రతిపాదింపబడు మహేశ్వరుడుకూడ శ్రీమన్నారాయణుడే నని నిరూపించుచున్నారు. వేదాదియందును—చివరను ప్రణవమని పిలువబడు 'ఓంకార' స్వరము సంపుటీకరింపబడును. వేదాన్తముల యందీ ప్రణవమే బ్రహ్మస్వరూపముగను, బ్రహ్మమునకు బోధకముగను నిరూపింపబడినది. ఈ ప్రణవమున అ-ఉ-మ్ అను మూడక్షరములున్నవి. ధ్యానదశయందు సమస్త వేదము ప్రణవమందులీనమగును. అ + ఉ + మ్ అను మూడక్షరములలోని చివరిదగు మకారము ఉకారములోను, ఉకారము అకారములోను లయమైపోవును. ఇక మిగిలినది 'అకారము'. ఇదియే వేదమూలమగు ప్రణవమునకుకూడ మూలము. దీనికంటె పరుడై వాచ్యుడుగా (అనగా బోధింపదగియర్థముగా) నున్నవాడే శ్రీమన్నారాయణుడు. అయునకే పరమేశ్వరుడనికూడ వ్యవహారము అని పైమంత్ర తాత్పర్యమునే భగవద్రామానుజులు పూర్వముచూపబడిన మూలగ్రంథమున నిరూపించినారు. ఇప్పుడు—అకారబోధ్యుడు శ్రీమన్నారాయణుడను విషయమును, అకారమే అన్నిటికి మూలమను విషయమును సప్రమాణముగ నిరూపించుచున్నారు.

మూ॥ యథోక్తం భగవతా—

'అహం కృత్స్నస్య జగతః ప్రభవప్రలయస్తథా।
మత్తః పరతరంనాన్యత్ కించిదస్తి ధనంజయ॥'
(శ్రీగీత. 7-6)

'అక్షరాణామకారోస్మి' ఇతి. 'అ ఇతి బ్రహ్మ' ఇతిచ శ్రుతేః।

'అకారోవై సర్వావాక్' ఇతిచ వాచకజాతస్య అకారప్రకృతి- త్వం, వాచ్యజాతస్య బ్రహ్మప్రకృతిత్వంచ సుస్పష్టమ్। అతః బ్రహ్మణః అకారవాచ్యతాప్రతిపాదనాత్ అకారవాచ్యో నారాయణఏవ మహేశ్వర ఇతి సిద్ధమ్।

అనువాదము:- భగవానుడగు శ్రీకృష్ణునిచే నిట్లుచెప్పబడినది. 'ఓ ధనంజయా! నే నీసమస్తజగత్తునకు పుట్టుక మరియు లయము. నా కంటె శ్రేష్ఠమైనది వేఱొకటిలేదు.' 'అక్షరములలో అకారము నైయున్నాను' (శ్రీగీత. 10-33). 'అకారమనగా బ్రహ్మము' అని వేదముకూడ నొడువు చున్నది. 'అకారమే సమస్త వాక్కు (శబ్దము)' అనియును శబ్దసముదాయము అకారమే ప్రకృతిగా (మూలముగా) కలదనియు, అర్థసముదాయ మంతయు పరబ్రహ్మమే ప్రకృతిగా కలదనియు విశదమగుచున్నది. కనుక బ్రహ్మము అకారముచే ప్రతిపాదింపదగినయర్థమని ప్రతిపాదించుట వలన నారాయణుడే మహేశ్వరుడని సిద్ధించుచున్నది.

మూ॥ తస్యైవ 'సహస్రశీర్షం దేవమ్' ఇతి కేవలపరతత్త్వవిశేషప్రతి పాదనపరేణ నారాయణానువాకేన సర్వస్మాత్ పరత్వం ప్రపంచితమ్। అనేన అనన్యపరేణ ప్రతిపాదితమేవ పర- తత్త్వమ్ అన్యపరేషు సర్వేషు వాక్యేషు కేనాపిశబ్దేన ప్రదీయ మానం తదేవేతి అవగమ్యతే ఇతి- 'శాస్త్రదృష్ట్యాతూపదేశో వామదేవవత్' ఇతి సూత్రకారేణ నిర్ణీతమ్।

అనువాదము:- ఆ శ్రీమన్నారాయణునకే 'సహస్రశీర్షం దేవమ్' 'అనన్త శిరస్సులుగల దేవుని' అని—కేవలము విశిష్టమగు పరతత్త్వ మును మాత్రమే ప్రతిపాదించులక్ష్యముగల నారాయణానువాకముచే, అందరికంటె శ్రేష్ఠత్వమే విస్తరింపబడినది. ఇతరమును బోధింపని యీ నారాయణానువాకముచే ప్రతిపాదింపబడినదే పరతత్త్వము, ఇతరముల బోధించు వాక్యములన్నిటియందును ఏశబ్దముచేతనైనను స్ఫురించున దదియేనని (నారాయణుడను పరతత్త్వమేనని) తెలియుచున్నది అని—

'శాస్త్రదృష్ట్యాతు ఉపదేశో వామదేవవత్' అనుసూత్రముచే బాదరాయణుడు నిర్ణయించుచున్నాడు.

వివరణము:- 'శాస్త్రదృష్ట్యాతూపదేశో వామదేవవత్' (బ్ర. సూ. 1-1-31) అనుసూత్రమునకిది సంగ్రహతాత్పర్యము. కౌషీతకీ బ్రాహ్మణమున 'ప్రతర్దనవిద్య'యందు—'ప్రతర్దనోహవై దైవోదాసి రింద్రస్య ప్రియంధామోపజగామ, యుద్ధేన చపౌరుషేణచ' (దివోదాసుని కుమారుడగు ప్రతర్దనుడనువాడు 'పౌరుషవంతమగు యుద్ధమును నిమిత్తముగ చేసికొని ఇంద్రుని ప్రేమాస్పదమగు నివాసమునకు వెళ్ళెను) అని యారంభించి—'వరం వృణీష్వ' (వరము కోరికొమ్ము) అని యింద్రుడు పలికిన మాటకు ప్రతర్దనుడు—'త్వమేవమేవరం వృణీష్వ, యంత్వంమనుష్యాయ హితతమం మన్యసే' (నీవే మనుష్యునకు ఏది మేలును చేకూర్చునో ఆ వరమును కొరుకొమ్ము) అని బదులు పల్కెను. అంత ఇంద్రుడు 'మాము పాస్వ' (నన్నే ఉపాసింపుము) అని పల్కెను. ఇచ్చట ఇంద్రుడు తనను పాసింపుమనియుపదేశించుట శాస్త్రదృష్టిని హేతువుగ చేసికొనియేకాని కేవలము ఇతర ప్రమాణములవలన కల్గిన ఆత్మావలోకనముచే కాదు. ఇచ్చట శాస్త్రదృష్టియనగా శాస్త్రమూలమగు యోగదృష్టియని అర్థము. అనగా 'ఏష సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః' ఇత్యాది శాస్త్రముచే శ్రీమన్నారాయణుడే సర్వాంతర్యామియని యెరిగినవాడు కనుక ఇంద్రుడు 'శాస్త్రదృష్ట్యా = శాస్త్రమూలమగు యోగదృష్టితో; ఉపదేశః = ఉపదేశించినాడు. అనగా నన్నుపాసింపుము (నాలోని శ్రీమన్నారాయణునుపాసింపుము) అనిచెప్పినాడు. ఎట్లనగా—వామదేవవత్ = వామదేవుడెట్లుగ—పర బహ్మము సర్వాంతర్యామియనియెరిగి తనయందును శ్రీమన్నారాయణుడు (పరబ్రహ్మము) న్నాడని గుర్తించి 'అహంమనురభవమ్ సూర్యశ్చ' (నేను మనువు, సూర్యుడు అయితిని) అని పలికినాడు. అట్లే నన్నుపాసింపుమని యింద్రుడనుట తనయందు పరబ్రహ్మమాత్మగా నున్నదను శాస్త్రదృష్టితోనే అని సూత్రతాత్పర్యము.

దీనినిబట్టి ఇంద్రాదిపదములన్నియు నారాయణ బోధకములేనని స్పష్ట మగుచున్నది. ఈయభిప్రాయమే మూలగ్రంథమున స్పష్టపరుపబడినది.

మూ॥ తదేతత్ పరంబ్రహ్మ క్వచిత్ బ్రహ్మశివాదిశబ్దావగతమితి కేవలబ్రహ్మశివయోః న పరత్వప్రసంగః॥ అస్మిన్ అనన్య-పరే అనువాకే తయోరింద్రాదితుల్యతయా తద్విభూతిత్వ-ప్రతిపాదనాత్। క్వచిత్ ఆకాశప్రాణాదిశబ్దేన పరంబ్రహ్మాభి-హితమ్ ఇతి భూతాకాశప్రాణాదేః యథానపరత్వమ్।

అనువాదము:- అట్టి యీ పరబ్రహ్మము కొన్నిచోటులందు బ్రహ్మ-శివుడు మున్నగు శబ్దములచే తెలియబడినది కనుక, కేవలము బ్రహ్మ, శివుడు అను వీరిరువురకు పరత్వమెంతమాత్రము కలుగదు. కేవల నారాయణతత్త్వమునుమాత్రమే ప్రతిపాదించు యీ నారాయణానువాకమున వారిరువురును (బ్రహ్మ-శివులు) ఇంద్రాదులతో సమానముగ భగవద్విభూతులుగా ప్రతిపాదింపబడినారు. కొన్నిచోటులందు ఆకాశము—ప్రాణము మున్నగు శబ్దముచే పరంబ్రహ్మము బోధింపబడినదికదాయని పంచభూతములలోని ఆకాశమునకు ప్రాణము మున్నగువాటిని బోధించు శబ్దముచే పరబ్రహ్మము చెప్పబడినప్పటికిని భూతాకాశమమున్నగునవి పరత్వమును పొందనట్లే (బ్రహ్మ-శివాదులును) అనియెరుగవలయును.

మూ॥ యత్పునరిదమాశంకితమ్—'అథయదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ, దహరోఽస్మిన్ అంతరాకాశః, తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్, తద్వావవిజిజ్ఞాసితవ్యమ్' (ఛాం. 8-12) ఇత్యత్ర ఆకాశశబ్దేనజగదుపాదానకారణం ప్రతిపాద్య. తదన్తర్వర్తినః కస్యచిత్ తత్త్వవిశేషస్య అన్వే-ష్టవ్యతా ప్రతిపాద్యతే। అస్య ఆకాశస్యనామరూపయోః నిర్వా హకత్వశ్రవణాత్, పురుషసూక్తే పురుషస్యనామరూపయోః కర్తృత్వదర్శనాత్, ఆకాశపర్యాయభూతాత్ పురుషాత్

అన్యస్య అన్వేష్టవ్యతయా ఉపాస్యత్వం ప్రతీయతే। ఇతి।

అనువాదము:– మరియు ఈ క్రిందివిధముగ సందేహము లేకెత్తించ బడినది. (ఎట్లన) 'ఇక ఈ బ్రహ్మపురమున (శరీరమునందు) ఏ దహర పుండరీకమను ప్రదేశమున్నదో (సూక్ష్మమగు హృదయపద్మస్థానమున్న దో) దాని నడుమ ఏ సూక్ష్మమైన (దహర) ఆకాశమున్నదో, దాని నడుమ నన్వేషింపవలయును (వెదుకవలయును) దానినే విచారింపవలయును' అనుచోటున ఆకాశశబ్దముచే జగత్తునకు సంబంధించిన ఉపాదానకారణ మును ప్రతిపాదించి, దానిలోపలనున్న ఒకానొక తత్త్వమేదో అదియే అన్వేషింపదగినదని ప్రతిపాదింపబడినది. ఈ ఆకాశము–నామము (పేరు) రూపము (ఆకారము) అనువాటిని నిర్వహించునదగుటవలనను, పురుష సూక్తమున ప్రతిపాదింపబడిన పురుషుడు నామరూపములకు కర్తగా కన్పట్టుచున్నాడు కనుకను, ఆకాశశబ్దమునకు పర్యాయశబ్దమైన పురుషశబ్ద ముచే బోధింపబడు పురుషునికంటె వేరొకదానికే—'అన్వేషింప'దగుటను బట్టి 'ఉపాసింపదగియుండుట' అనునది స్ఫురించుచున్నది అని. (ఇది పూర్వపక్షము)

మూ॥ అనధీతవేదానామ్, అదృష్టశాస్త్రవిదామ్ ఇదంచోద్యం. యతః తత్ర్శుతిరేవ అన్యపరిహారమాహ, వాక్యశేషశ్చ. 'దహ–రోఽస్మిన్నంతరాకాశః కింతదత్రవిద్యతే యదన్వేష్టవ్యం యద్వావ విజిజ్ఞాసితవ్యమ్' ఇతిచోదితే. 'యావానా్వ అయ మాకాశః తావానేషోన్తర్హృదయ ఆకాశః' ఇత్యాదినా అస్య ఆకాశశబ్దవాచ్యస్య పరమపురుషస్య అనవధికమహత్త్వం. సకలజగత్కారణతయా సకలజగదాధారత్వం ప్రతిపాద్య 'తస్మిన్ కామాః సమాహితాః' ఇతి, అపహతపాప్మత్వాది సత్యకామశబ్దేన సత్యసంకల్పత్వపర్యన్తగుణాష్టకం నిహిత మితి. పరమపురుషవత్ పరమపురుషగుణాష్టకస్యాపి పృథగ్వి జిజ్ఞాసితవ్యతా ప్రతిపిపాదయిషయా 'తస్మిన్ యదన్తస్త ద–

న్వేష్టవ్యమ్' ఇత్యుక్తమ్ ఇతి శ్రుత్యైవ సర్వంపరిహృతమ్।

అనువాదము:- వేదాధ్యయనమొనర్పనివారికిని, శాస్త్రవేత్త లగు విద్వాంసుల నుపాసించనివారికిని ఇట్టి శంక పుట్టును. ఏలన—ఇక్కడ శ్రుతియే (వేదమే) దీనికి పరిహారమును చెప్పినది. వాక్యకారుడుకూడ పరిహారమును చెప్పినాడు. 'సూక్ష్మమైన (దహరమైన) ఈ ఆకాశమధ్యమున ఏది అన్వేషింపదగియున్నదో, ఏది విచారింపదగియున్నదో అట్టి విశేషమేమున్నది?' అని యాశంకింపబడగా-'ఎంత యీ ఆకాశమున్నదో అంతయే ఈ హృదయమందుగల ఆకాశము.' మున్నగువాక్యములచే ఆకాశశబ్దముచే బోధింపదగిన పరమపురుషుడు—అంతులేని మహిమ కల వాడనియు, సమస్త జగత్తులకు కారణమైయున్నాడు కనుక, సకల జగత్తులకాధారమని ప్రతిపాదించి, 'అస్మిన్ కామాః సమాహితాః' (ఈ ఆకాశ శబ్దబోధ్యమైన పరబ్రహ్మమందు కామములు(కల్యాణగుణములు) ఉన్నవి.' అని. అపహతపాప్మత్వము మొదలు సత్యకామశబ్దముచే సత్యసంకల్పత్వమువరకుగల ఎనిమిదిగుణములు ఉన్నవనియు, పరమపురుషునివలెనే ఆ పరమపురుషుని ఎనిమిది గుణములును వేరుగ జిజ్ఞాస చేయదగినవని ప్రతిపాదింపదలచి 'తస్మిన్ యదన్తస్తదన్వేష్టవ్యమ్' 'దానిలోపలనేదికలదో అది అన్వేషింపదగున'ని శ్రుతియే సమస్తమును సమాధానించినది.

వివరణము:- ఇచ్చట ఆకాశశబ్దమునకు 'ఆసమన్తాత్ కాశతే ఇతి ఆకాశః' అంతట ప్రకాశించునది అను వ్యుత్పత్తినిబట్టి పరమాత్మయని అర్థము, బ్రహ్మపురమనగా—పరబ్రహ్మమునకు స్థానమైన శరీరము. దహరమనగా సూక్ష్మమని యర్థము. శరీరమునగల హృదయమను పుండరీకపు నడుమ ఆకాశశబ్దముచే చెప్పదగు ఏ పరబ్రహ్మముకలదో, దానిలోగల ఎనిమిది గుణములనుకూడ, విడిగా ఉపాసింపవలయునని తాత్పర్యము. ఆ ఎనిమిదిగుణములనే ఉపనిషత్తు ఈక్రింది విధముగా ఛాందోగ్యమున నిర్దేశించినది—'ఏష ఆత్మా అపహతపాప్మా, విజరో, విమృత్యుః, విశోకః, విజిఘత్సః, అపిపాసః, సత్యకామః, సత్యసంకల్పః'

అని. అపహతపాప్మత్వము = నశించిన పాపముకలవాడు (పాపసంబంధ మెంతమాత్రము లేకపోవుట) విజరత్వము (ముదుసలితనము లేకపోవుట) విమృత్యుత్వము (మరణము లేకపోవుట) విశోకత్వము (దుఃఖము లేక పోవుట) విజిఘత్సత్వము (ఆకలిలేకపోవుట) అపిపాసత్వము (దప్పికలేక పోవుట) సత్యకామత్వము (భోగ్య-భోగోపకరణ-భోగ్యస్థానరూపములగు నిత్యకామములు కలిగియుండుట) సత్యసంకల్పత్వము (అమోఘమైన సంకల్పము కలిగియుండుట) అనునీయెనిమిది గుణములు వేరుగ బ్రహ్మముతోపాటు ఉపాసింపదగునను భావమునే—'తస్మిన్యదన్తస్త దన్వేష్టవ్యమ్' ఆ దహరాకాశమధ్యముననేదికలదో అది అన్వేషింపదగునని చెప్పబడినది.

మూ॥ ఏతదుక్తం భవతి - 'కింతదత్రవిద్యతే యదన్వేష్టవ్యమ్' ఇత్యస్యచోద్యస్యతస్మిన్ సర్వస్యజగతః స్రష్టృత్వమ్, ఆధారత్వం, నియన్తృత్వం శేషిత్వమ్, అపహతపాప్మత్వాదయో గుణాశ్చవిద్యన్తే ఇతి పరిహారః ఇతి। తథాచ వాక్యకారవచనమ్—"తస్మిన్ యదన్తః' ఇతి కామవ్యపదేశః"—ఇతి। కామ్యన్తే ఇతికామాః అపహతపాప్మత్వాదయోగుణాఇత్యర్థః॥

అనువాదము:- ఇది చెప్పబడినట్టినది. 'ఏది వెదుకదగునో అట్టిదచ్చట ఏమున్నది?' అను శంకకు—'దానియందీ సమస్తజగత్తునకు సంబంధించి సృష్టినొనర్చుట, ఆధారమైయుండుట, నియమించుట, స్వామియైయుండుట, అపహతపాప్మత్వము మున్నగు గుణములును కలవ'ని పరిహారము (సమాధానము) అని. (కనుక) అట్లే వాక్యకారుని వచనముకూడ—'తస్మిన్యదన్తః' (దానిలోపలనేమున్నదో) అనుమాటచే 'కామములు' నిర్దేశింపబడుచున్నవి. కామ్యన్తే = కామింపబడుచున్నవి (కోరబడుచున్నవి) కనుక, కామాః = అపహతపాప్మత్వము మున్నగు గుణములు—అనియర్థము.

వివరణము:- కామశబ్దమునకు భిన్నభిన్నస్థలములలో భిన్నభిన్నా

ర్థములు చెప్పబడినవి. ప్రస్తుతమున కామశబ్దమునకు కోరబడునట్టి గుణములనియర్థము. సత్యకామఃఇత్యాదిస్థలమునందు కామశబ్దమునకు భోగ్య భోగోపకరణ–భోగ్యస్థానములని యర్థము. అకామహతస్యఇత్యాది తైత్తిరీయవచనమునందలి కామశబ్దమునకు వాంఛలు లేక కోరికలనియర్థము.

మూ॥ ఏతదుక్తం భవతి—యదేతత్ దహరాకాశశబ్దాభిధేయమ్, నిఖిలజగదుదయవిభవలయలీలం పరంబ్రహ్మ। తస్మిన్యదన్తర్హితమ్ అనవధికాతిశయమ్ అపహతపాప్మత్వాదిగుణాష్టకమ్, తదుభయమపి అన్వేష్టవ్యం. విజిజ్ఞాసితవ్యమ్–ఇతి। యథాహ—'అథయ ఇహాత్మానమనువిద్య వ్రజన్త్యేతాంశ్చ సత్యాన్ కామాంస్తేషాం సర్వేషులోకేషు కామచారోభవతి।' (ఛాం.8-1-6)

అనువాదము:– ఈ క్రింది విధముగ చెప్పబడినట్లగుచున్నది—'దహరాకాశము'ను శబ్దముచే బోధింపదగినదియు, సమస్తజగత్తుల పుట్టుక, ఉనికి, లయము అనువాటిని 'లీల'గా కల్గినదియునైన యేపరబ్రహ్మముకలదో అదియు; ఆ పరబ్రహ్మమందు పైకి కానరాక అంతర్గతమైయున్న—అపారమగు నతిశయముతోకూడిన అపహతపాప్మత్వము మున్నగు గుణాష్టకము; (ఎనిమిదిగుణములవృందము) అను నీరెండును (అనగా పరబ్రహ్మము–దానియందుగల గుణాష్టకము అనునీ రెండును) అన్వేషింపదగియున్నది, విచారింపదగియున్నది'—అని. దీనినే యిట్లుచెప్పినాడు—'ఇక ఇక్కడ నెవ్వరు ఆత్మను, సత్యములైన గుణములను ఉపాసించి వెడలుదురో వారికి లోకములన్నింటియందును స్వేచ్ఛాసంచారముండును.' అని. (ఛాం. 8-1-6)

మూ॥ యః పునః కారణస్యైవధ్యేయతాప్రతిపాదనపరేవాక్యేవిష్ణోః అనన్యపరవాక్యప్రతిపాదితపరతత్త్వభూతస్య కార్యమధ్యేనివేశః, సః స్వకార్యభూతతత్త్వసంఖ్యాపూరణం కుర్వతః,

**స్వలీలయా జగదుపకారాయ స్వేచ్ఛావతారః, ఇత్యవగన్తవ్యః। యథాలీలయా దేవసంఖ్యాపూరణంకుర్వతః ఉపేంద్రత్వం పరస్యైవ; యథాచ సూర్యవంశోద్భవ రాజసంఖ్యాపూరణం కుర్వతః పరస్యైవబ్రహ్మణః దాశరథిరూపేణ స్వేచ్ఛావతారః, యథాచసోమవంశసంఖ్యాపూరణం కుర్వతో భగవతః భూభారావతరణాయ స్వేచ్ఛయా వసుదేవగృహేఽవతారః, సృష్టిప్రలయప్రకరణేషు నారాయణ ఏవ పరమకారణతయా ప్రతిపాద్యతే ఇతి పూర్వమేవోక్తమ్।**

అనువాదము:- కారణమే ధ్యానింపదగునని ప్రతిపాదించిన ('ప్రాణం మనసిసహ కరణైః' అను పూర్వప్రదర్శితమగు) అథర్వశిరో వాక్యమున, నారాయణునిమాత్రమే పరతత్త్వముగా నిశ్చయించిన నారాయణానువాకాది వాక్యములచే పరతత్త్వముగా నిశ్చయింపబడిన శ్రీ మహావిష్ణువునకు (బ్రహ్మవిష్ణురుద్రేంద్రాఃతే సర్వేసంప్రసూయన్తే-బ్రహ్మ విష్ణువు రుద్రుడు-ఇంద్రుడు వీరందరు పుట్టింపబడుచున్నారని) పుట్టెడు వారగు బ్రహ్మరుద్రాదుల నడుమ నిర్దేశము చేయబడినది. అది తన వలన పుట్టిన తత్త్వముల (వస్తువుల) సంఖ్యను పూరించుచున్న ఆ భగ వానునకు లోకోపకారార్థమై తనలీలచే తాను కల్పించుకొన్న స్వతంత్రావ తారమేనని తెలియదగియున్నది. ఎట్లుగ లీలచే దేవతలసంఖ్యను పూరించుచున్న పరమాత్మకే 'ఉపేంద్రు'నిగా (వామనునిగా) అవతార ము. ఎట్లుగ—సూర్యవంశమున పుట్టిన రాజులసంఖ్యను పూరించుచున్న ఆ పరబ్రహ్మమునకే శ్రీరామచంద్రునిగా స్వేచ్ఛావతారము (తనయిచ్ఛ చే కల్పించుకొన్న అవతారము). ఎట్లుగ—సోమవంశమున (చంద్ర వంశమున) పుట్టిన రాజులసంఖ్యను పూరించుచున్న ఆ భగవానునకే భూ భారమును తొలగించుటకై స్వసంకల్పమాత్రముచే వసుదేవునియింట కృష్ణునిగా అవతారము. సృష్టిని, ప్రలయమును బోధించునట్టి ప్రకరణ ములందు శ్రీమన్నారాయణుడే పరమకారణమని (మూలకారణమని) ప్రతి

పాదింపబడినట్లు పూర్వమే చెప్పబడినది.

వివరణము:- ఈ పై గ్రంథమునుబట్టి బ్రహ్మరుద్రేంద్రాదిదేవతల యందెట్టి పుట్టుకకలదో అట్టిదే శ్రీమన్నారాయణునియందు కలదనుట కుదరదనియు, ఆయాయి యుగములయందు, లోకోద్ధరణమునకై లీల గా భగవానుని స్వసంకల్పముచే కల్పించుకొన్న అవతారములే అవి కనుక వాటిని బ్రహ్మాదులపుట్టుకవంటివిగా పరిగణింపరాదనియు కనుక 'కారణంతు ధ్యేయః' ఇత్యాది అధర్వశిరోవాక్యమున పుట్టుకగల బ్రహ్మ రుద్రాదుల నడుమ విష్ణునిర్దేశము విరుద్ధమెంతమాత్రము కాదని భగవ ద్రామానుజుల తాత్పర్యము స్పష్టమగుచున్నది.

మూ॥ యత్పునః అథర్వశిరసి రుద్రేణ స్వ సర్వైశ్వర్యం ప్రపంచితం, తత్ 'సోఽన్తరాదన్తరంప్రావిశత్' ఇతి పరమాత్మ ప్రవేశాదుక్తమ్ ఇతి శ్రుత్యైవ వ్యక్తమ్।

'శాస్త్రదృష్ట్యాతూపదేశో వామదేవవత్' (బ్ర. సూ. 1-1-31) ఇతి సూత్రకారేణ ఏవమాదీనామర్థః ప్రతిపాదితః॥

అనువాదము:- అథర్వశిర ఉపనిషత్తునందు రుద్రునిచే, తన సర్వేశ్వరత్వము విస్తరించి చెప్పబడినదనుటయేదికలదో అది—'సోఽన్తరాదన్తరం ప్రావిశత్' (పరమాత్మతోకూడిన వాడగుటచేతనే శరీరముకంటె లోనున్న ప్రాణాదులకుగూడ లోనున్న జీవుని ప్రవేశించెను) అని పరమాత్మ ప్రవేశించియుండుటను బట్టియే చెప్పబడినదని శ్రుతిచేతనే స్పష్ట పరుపబడినది. 'శాస్త్రదృష్టిచేతనే ఉపదేశము. వామదేవునివలె'—నని బ్రహ్మసూత్రకర్తచే (బాదరాయణునిచేతనే) ఇటువంటి వాక్యములయర్థ ము ప్రతిపాదింపబడినది.

వివరణము:- అథర్వశిర ఉపనిషత్తునందు ఈక్రింది రుద్ర-దేవ సంవాదమున్నది.

'దేవాహ వై స్వర్గలోకమగమం, స్తే దేవారుద్రమపృచ్ఛన్, 'కో భవాన్' ఇతి, సోఽబ్రవీత్ 'అహమేకః ప్రథమమాసం, వర్తామి, భవిష్యామి చ, నాన్యఃకశ్చిన్మత్తో వ్యతిరిక్తః' ఇతి–సోఽన్తరాదన్తరం ప్రావిశత్, దిశశ్చాన్తరం ప్రావిశత్, "సోహం నిత్యానిత్యోబ్రహ్మ అహంబ్రహ్మ" అని.

'దేవతలు స్వర్గలోకమున రుద్రుని దరిచేరి ప్రశ్నించిరి. 'నీవెవ్వడవు' అని. ఆతడనెను—'నే నొక్కడనే ముందుంటిని, ఉన్నాను, ఉండగలను. నాకంటె వేరెవ్వరులేరు.' అని. పరమాత్మతో కూడినవాడగుటచే (సోఽన్తరాత్) శరీరమున లోనగల ప్రాణాదులకుగూడ లోపలనున్న జీవుని (అన్తరం) ప్రవేశించెను (ప్రావిశత్) దిక్కులకు లోనప్రవేశించెను. నేనే నిత్యానిత్యుడనగు బ్రహ్మను. నేనే బ్రహ్మమును' అని పై వాక్య తాత్పర్యము. ఇక్కడ రుద్రుడు జీవాదులలో ప్రవేశించి తన సర్వేశ్వరత్వమును చాటినాడు కనుక రుద్రుడే సర్వేశ్వరుడు ఏల కారాదని పూర్వపక్షాభిప్రాయము. 'సోఽన్తరాత్' అనుచోటునగల 'సః' అనుపదమునకు పరమాత్మయనియర్థము. సోన్తరాద్ = పరమాత్మతోకూడినవాడుకనుక; అన్తరం = లోన; ప్రావిశత్ = ప్రవేశించెను. అనియర్థము. దీనినిబట్టి రుద్రునకుగల సర్వేశ్వరత్వము—పరమాత్మతోకూడియుండుటవలన కల్గినదేతప్ప స్వతంత్రమైనదికాదనియు, పరమాత్మ శ్రీమన్నారాయణుడే కనుక సర్వేశ్వరత్వము వాస్తవముగ నాయనదేననియు పై శ్రుతి స్పష్టపరచుచున్నదని యభిప్రాయము.

మూ॥ యథోక్తం పరాశరేణాపి–'సర్వగత్వాదనన్తస్య స ఏవాహమవస్థితః। మత్తః సర్వ, మహం సర్వం, మయిసర్వం సనాతనే।' ఇత్యాది. (వి. 1–19–85) అత్ర–'సర్వగత్వాదనన్తస్య' ఇతి హేతురుక్తః। స్వశరీరభూతస్య సర్వస్య చిదచిద్వస్తునః ఆత్మత్వేన సర్వగతః పరమాత్మా ఇతి, సర్వేశబ్దాః సర్వశరీరం పరమాత్మానమేవ అభిదధతీత్యుక్తమ్।

అతః 'అహమ్' ఇతిశబ్దః స్వాత్మప్రకారిణం పరమాత్మాన-మేవ అచష్టే।

అతఇదముచ్యతే–'ఆత్మేత్యేవతుగృహ్ణీయాత్ సర్వస్య తన్నిష్పత్తేః' ఇత్యాదినా అహంగ్రహణోపాసనం వాక్య కారేణ; కార్యావస్థః కారణావస్థశ్చ స్థూల-సూక్ష్మ–చిదచిద్వస్తు శరీరః పరమాత్మైవ ఇతి–'సర్వస్య తన్నిష్పత్తేః' ఇత్యుక్తమ్। 'ఆత్మేతితూప గచ్ఛన్తిగ్రాహయన్తిచ' ఇతి సూత్రకారేణచ।

అనువాదము:– ప్రహ్లాదునిచేగూడ నిట్లే చెప్పబడినది—'అనన్తుడగు శ్రీమన్నారాయణుడంతట నున్నాడుకనుక, అతడే నేనై యున్నాను. నా నుండియే అంతయు, నేనే అంతయు, సనాతనుడనగు నాయందే అంత యు (కలదు)' మున్నగునది. ఇక్కడ 'అనన్తుడంతట కలడుకనుక' అని హేతువుచెప్పబడినది. తనకు శరీరముగా నమరిన సమస్త జీవజడా త్మక పదార్థమునకు ఆత్మగా పరమాత్మ అంతట కలడుకావున అన్నిశబ్ద ములను సమస్తము శరీరముగా కల్గిన పరమాత్మనే చెప్పుచున్నవని చెప్పబడినది. కనుక "నేను" (అహం) అను శబ్దము తనకు "ప్రకారి"గా (తనను విడదీయరాని విశేషణముగాకలిగి) ఉన్న పరమాత్మనే బోధించు చున్నది.

కనుక, "సర్వము పరమాత్మనుండియే పుట్టినదికనుక సమస్తము ను ఆత్మగనే (తానుగనే) గ్రహింపవలయును" అని "సర్వము తానుగా గ్రహించి యుపాసించుట" వాక్యకారునిచే (టంకాచార్యుడని పిలువబడు బ్రహ్మనందిచే) చెప్పబడినది. కార్యమగు ప్రపంచమును అవస్థగా కల వాడును—కారణావస్థలోనున్నవాడును అయి స్థూలదశలోను–సూక్ష్మదశ లోను ఉన్న జీవజడాత్మక వస్తువులు శరీరముగా కల్గినవాడు పరమాత్మ యేనని—"సర్వస్యతన్నిష్పత్తేః" "అంతయు ఆయననుండియే పుట్టినది

కనుక" అనిచెప్పబడినది. "ఆత్మయని పొందుచున్నారు. (అట్లుగనే) గ్రహింపజేయుబడుచున్నారు" అని సూత్రకారునిచేగూడ చెప్పబడినది.

వివరణము:- "ఆత్మేతి తూపచగచ్ఛన్తి గ్రాహయన్తిచ" (బ్ర.సూ. 4-1-3) అను సూత్రమునకిది తాత్పర్యము. ఉపాసింపదగిన బ్రహ్మము ను ఉపాసించువానికంటె వేరుగనే ఉపాసింపవలయునా? లేక ఉపాసకుని ఆత్మగనే యుపాసింపవలయునా? అని వికల్పము కలుగగా—ఆత్మకంటె-బ్రహ్మము వేరుగనే ఉపదేశింపబడినదికనుకనే బ్రహ్మము- వేరుగనే ఉపాసింపతగునని పూర్వపక్షము. ఆత్మగనే బ్రహ్మమునుపాసింపవలయునని సిద్ధాన్తము.

ఆత్మేతితు = ఆత్మయని నిశ్చయించియే, ఉపగచ్ఛంతి = ప్రాచీనులగు నుపాసకులు బ్రహ్మమును పొందుచున్నారు. దీనినే శ్రుతి "త్వం వా అహమస్మి భగవో దేవతే! అహం వై త్వమసి" "ఓ పరమాత్మా! నీవే నేనైయున్నాను. నేను నీవైయున్నావు" అనిచెప్పుచున్నది. గ్రాహయన్తిచ = శాస్త్రములుకూడ-బ్రహ్మమును ఉపాసకులు ఆత్మగనే గ్రహించునట్లుపదేశించుచున్నవి. "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి" "ఈ సమస్తము బ్రహ్మమే. దానినుండి పుట్టుట, దానియందు లయించుట, దానివలన బ్రతుకుట కలది" ఇత్యాదిగ, శ్రుతి—సర్వశరీరకుడగు పరమాత్మయే అంతటికి ఆత్మకనుక, పరమాత్మనే ఆత్మగా ఉపాసింపవలయునని నొడువుచున్నదని తాత్పర్యము.

మూ॥ మహాభారతేచ బ్రహ్మరుద్ర సంవాదే బ్రహ్మరుద్రం ప్రత్యాహ—'తవాంతరాత్మా మమచ. యేచాన్యే దేహి సంజ్ఞితాః' ఇతి. రుద్రస్య. బ్రహ్మణశ్చ అన్యేషాం చ దేహినాం పరమేశ్వరో నారాయణః అంతరాత్మతయా అవస్థితః ఇతి। తథా తత్రైవ-'విష్ణురాత్మా భగవతో భవస్యామితతేజసః। తస్మాద్ధనుర్జ్యా స్పర్శం సవిషేషే మహేశ్వరః॥ ఇతి। తత్రైవ-'ఏతౌ ద్వౌవిబుధశ్రేష్ఠౌ ప్రసాదక్రోధజౌస్మృతౌ।

తదాదర్శితపథౌ సృష్టిసంహారకారకౌ॥ అంతరా-
త్మతయా అవస్థిత నారాయణదర్శితపథౌ బ్రహ్మరుద్రౌ
సృష్టిసంహారకార్యకరౌ ఇత్యర్థః॥

అనువాదము:- మహాభారతమున బ్రహ్మరుద్రుల సంవాదము నందు బ్రహ్మ-రుద్రునితో నిట్లనెను—

"నీకును, నాకును, దేహధారులైన ఇతరులెవ్వరుకలరో వారికిని అంతరాత్మ (శ్రీమన్నారాయణుడు)" అని (భార. మో. ధర్మ-179) "రుద్రునకు, బ్రహ్మకును, ఇతరులగు దేహధారులగు జీవులకును పరమేశ్వరుడగు శ్రీమన్నారాయణుడే అంతరాత్మగా నున్నాడు" అని (అర్థము).

ఇట్లే అక్కడనే (మహా. భార. కర్ణ. ప. 35-50) అత్యన్త తేజశ్శాలియు, భగవానుడునగు రుద్రునకు విష్ణువే "ఆత్మ." కనుకనే—ఆ వింటి నారియొక్క స్పర్శను మహేశ్వరుడు (రుద్రుడు) సహింపగల్గెను" అని. (చెప్పబడినది). అక్కడనే (మహాభారతము. మోక్ష. 169-19) "ఆ పరమాత్మయొక్క ప్రసాదగుణమునుండియు, క్రోధమునుండియు పుట్టిన దేవశ్రేష్ఠులు వీరిరువురే. ఆ పరమాత్మచే చూపబడిన మార్గముకలవారై—సమస్త సృష్టికి-ప్రలయమునకు కారకులగుచున్నారు." అంతరాత్మగా లోన నివసించియున్న శ్రీమన్నారాయణునిచే చూపబడిన మార్గముకలవారై బ్రహ్మ-రుద్రుడు అను వీరిరువురును జగత్సృష్టి-జగత్సంహారము అను కృత్యముల నిర్వహించుచున్నారనియర్థము.

మూ॥ నిమిత్తోపాదానయోస్తు భేదం వదన్తః వేదబాహ్యా ఏవస్యుః॥ 'జన్మాద్యస్యయతః'; 'ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్'—ఇత్యాది వేదవిత్ప్రణీతసూత్రవిరోధాత్॥ 'సదేవసోమ్యేదమగ్రఆసీత్ ఏకమేవాద్వితీయమ్' 'బ్రహ్మవనం బ్రహ్మ సవృక్ష ఆసీత్, యతోద్యావా పృథివీ నిష్టతక్షుః, బ్రహ్మాధ్యతిష్ఠద్భువనానిధారయన్' 'సర్వేనిమేషా జజ్ఞిరే

విద్యుతః పురుషాదధి' 'న తస్యేశే కశ్చనతస్యనామ మహ-ద్యశః' 'నేహనానాస్తి కించన' 'సర్వస్యవశీ సర్వస్యేశానః' 'పురుషఏవేదం యద్భూతం యచ్చభవ్యం' 'ఉతామృతత్వ-స్యేశానః' 'నాన్యః పంథాః అయనాయవిద్యతే' ఇత్యాదిసర్వ శ్రుతిగణ విరోధాచ్చ।

అనువాదము:- నిమిత్తము వేరు, ఉపాదానము వేరు అనిచెప్పు వారు వేదబాహ్యులే (అవైదికులే) అగుదురు. (కొందరు "ఉపాదానంతు భగవాన్-నిమిత్తంతు మహేశ్వరః" ఉపాదానము శ్రీమన్నారాయణుడు-నిమిత్తము పరమ శివుడు అని ఉపాదాన నిమిత్తములు వేరనిచెప్పుదురు. అట్టివారు వేదవిరుద్ధముగ చెప్పుచున్నారుకనుక వేదబాహ్యులని యభి ప్రాయము). "ఈ జగత్తుయొక్క పుట్టుక, స్థితి, లయము అనునవి యెవ్వనివలన కలుగుచున్నవో" (బ్ర. సూ. 1-1-2) "ఉపాదానముకూడ పరబ్రహ్మమే ప్రతిజ్ఞాదృష్టాంతములకు వైరుద్ధ్యములేదుకనుక" (బ్ర.సూ. 1-4-23) ఇత్యాది-వేదవేత్తయగు బాదరాయణునిచే వ్రాయబడిన సూత్ర ములకు వైరుద్ధ్యము కలుగుచున్నదికనుక. (ఇట్లే ఈక్రింది) శ్రుతివచన సముదాయమునకుగూడ వైరుద్ధ్యము కల్గుచున్నదికనుక—(ఆ శ్రుతివచ నములేవియన)

1. "ఓ సోమ్యుడా! ఇదియంతయు సృష్టికిపూర్వము సత్పదార్థమే అయి ఉండెను. ఒక్కటే. రెండవదిలేదు." (ఇది బ్రహ్మమునకు ఉపా దానత్వము-నిమిత్తత్వములను చెప్పునట్టి ఛాందోగ్యవచనము).

2. 'బ్రహ్మమేవనము, బ్రహ్మమే ఆ వృక్షమైయుండెను. దీని నుండి అంతరాళమును, భూమిని చెక్కిరో' 'బ్రహ్మము ఈ భువనసుల ధరించుచు ఆధారమై (నిమిత్తమై) యుండెను.' (ఇదికూడ ఉపాదాన నిమిత్తకారణములు బ్రహ్మమేననిచెప్పు తైత్తిరీయబ్రాహ్మణవచనము).

3. 'విద్యుద్వర్ణముగల పురుషునినుండి రెప్పపాటులకు పరిమితము లైన సూక్ష్మకాలవిశేషములు (నిమేషములు) పుట్టినవి.' (మహానారాయణ వచనము. ఇది కాలమును గురించి పరమాత్మ ఉపాదానమని చెప్పు వాక్యము.)

4. 'అతనికి నియామకుడెవ్వడు లేడు. అతనికే గొప్పకీర్తి కలదు.' (ఈ మహానారాయణవచనము నిమిత్తత్వమును చెప్పునది.)

5. 'ఇక్కడ అనేకత్వమేదియులేదు' (ఈ బృహదారణ్యకవచనము ఉపాదానత్వమును బోధించును)

6. 'అంతటిని తనవశమున నుంచుకొని నియమించువాడు' (ఈ బృహదారణ్యకవచనము నిమిత్తత్వమును బోధించును)

7. 'ఏది జరిగినదో, ఏదిజరుగనున్నదో అదియంతయు పురుషుడే' (ఈ తైత్తిరీయపురుషసూక్తవచనము నిమిత్తత్వమును-ఉపాదానత్వ మును బోధించును)

8. 'మోక్షరూపమగు అమృతత్వమునకాతడే నియామకుడు' (ఈ తై. పురుషసూక్తవచనము అతడే ముక్తిప్రదుడని చెప్పుచున్నది.)

9. 'మోక్షప్రాప్తికి వేరుమార్గము లేదు' (ఈ తై. పురుషసూక్త వచనము వేరగు ఉపాయమును నిషేధించుచున్నది)

వివరణము:- ఈ పైని పేర్కొన్న విధముగా శ్రుతులు బ్రహ్మమే ఉపాదాననిమిత్తములని చెప్పుచుండగా-వాటికి భేదమును కల్పించువారు వేదతాత్పర్యము నెరుగజాలని, వేదబాహ్యులేనని తాత్పర్యము.

## ॥ ఇతిహాస పురాణములయందు ప్రతిపాదింపబడు పరతత్త్వము శ్రీమన్నారాయణుడే ॥

మూ॥ ఇతిహాస పురాణేషుచ సృష్టిప్రలయప్రకరణయోః

ఇదమేవ పరతత్త్వమితి అవగమ్యతే। యథా మహాభారతే—
"కేనసృష్టమిదంసర్వం జగత్ స్థావరజంగమమ్।
ప్రలయేచ కమభ్యేతి తన్మే బ్రూహిపితామహ॥' ఇతిపృష్టః,
'నారాయణో జగన్మూర్తిః అనంతాత్మా సనాతనః।' ఇత్యాదిచ
వదన్; 'ఋషయః పితరో దేవామహాభూతానిధాతవః।
జంగమాజంగమంచేదం జగన్నారాయణోద్భవమ్॥' ఇతిచ।

అనువాదము:- ఇతిహాసములయందును సృష్టిని, ప్రళయమును నిరూపించునట్టి ప్రకరణములందు (భాగములందు) ఇదియే [నారాయణాత్మకమగు తత్త్వమే] పరతత్త్వమని తెలియుచున్నది. మహాభారతమున నిట్లున్నది— 'ఎవ్వనిచే నీ స్థావరజంగమాత్మకమగు (కదలికలేని-కదలిక కల వస్తుసముదాయరూపమగు) ప్రపంచమంతయు సృజింపబడినది? ప్రలయకాలమున నెవ్వనిని పొందుచున్నది? దానిని, ఓ పితామహా! (బ్రహ్మ!) నాకెరిగింపుము' (మోక్ష.ధ. 171-1) అని యడుగబడినవాడై— 'నిఖిలజగత్తును ఆకారముగా కల్గిన శ్రీమన్నారాయణుడే అప్రమేయమగు స్వరూపముకల్గిన సనాతనుడు' మున్నగునది చెప్పి – 'ఋషులు, పితృదేవతలు, దేవతలు, పృథివ్యాదిమహాభూతములు, లోకాదిధాతువులు, కదలిక కల్గిన, కదలికలేని సమస్తమగు ప్రపంచము నారాయణుని నుండియే పుట్టినది' అనియు ను (బ్రహ్మ) (చెప్పెను) (భా.మో. 171-12; అను.శా.223).

మూ॥ ప్రాచ్యోదీచ్యదాక్షిణాత్య పాశ్చాత్యసర్వశిష్టైః సర్వధర్మ సర్వతత్త్వ వ్యవస్థాయామ్ ఇదమేవ పర్యాప్తమిత్యవిగాన పరిగృహీతం వైష్ణవం చ పురాణమ్। 'జన్మాద్యస్యయతః' ఇతిజగజ్జన్మాదికారణం బ్రహ్మేత్యవగమ్యతే। తత్ జన్మాది కారణం కిమితి ప్రశ్నపూర్వకం—'విష్ణోఃసకాశాదుద్భూతమ్' ఇత్యాదినా బ్రహ్మస్వరూపవిశేష ప్రతిపాదనైకపరతయా

ఫ్రివృత్త మితి సర్వసమ్మతమ్। తథాతత్రైవ-

ప్రకృతిర్యామయాఖ్యాతావ్యక్తావ్యక్త స్వరూపిణీ
పురుషశ్చాప్యుభావేతౌ లీయేతేపరమాత్మని॥
పరమాత్మాచసర్వేషామ్ ఆధారః పరమేశ్వరః।
విష్ణునామా సవేదేషువేదాన్తేషుచగీయతే॥ ఇతి।

సర్వవేదవేదాన్తేషు సర్వైః శబ్దైః పరమకారణతయా అయమేవ గీయతే ఇత్యర్థః॥

అనువాదము:- తూర్పునకు, ఉత్తరమునకు, దక్షిణమునకు, పడమరకు చెందిన దేశములందలి సమస్త శిష్టజనులచేతను, సర్వధర్మములయొక్కయు, సర్వతత్త్వములయొక్కయు స్వరూపమును నిర్ణయించుటయందు ఇదియే చాలునని స్తుతిపురస్సరముగ స్వీకరింపబడినది -వైష్ణవపురాణము. (పరాశరప్రోక్తము) 'ఈ జగత్తునకు సంబంధించిన జన్మ-స్థితి-లయము లెవ్వనినుండి కలుగుచున్నవో' (బ్ర. 1-1-2) అను సూత్రముచే పరబ్రహ్మమే జగత్తుయొక్క పుట్టుక మున్నగువాటికి కారణమని తెలియుచున్నది. ఆ కారణమేదియని ప్రశ్నించి-'విష్ణువునుండి పుట్టినది' ఇత్యాదిగ పరబ్రహ్మముయొక్క విశిష్టస్వరూపమును ప్రతిపాదించుట మాత్రమే లక్ష్యముగాకలిగి ఈ పురాణము ప్రవర్తించుచున్నదని అందరంగీకరించినదే! అట్లే అచ్చట-

'వ్యక్తము (కంటికగుపించునట్టిదియు) అవ్యక్తము (అగుపింపనిదియు) నైన స్వరూపము కలదగు ప్రకృతియు, పురుషుడును అను నీ ఇరువురును పరమాత్మయందు లయించుచున్నారు. సమస్తమునకాధారమైన పరమేశ్వరుడగు నా పరమాత్మ విష్ణువని పేరుకలిగి వేదములందును, వేదాన్తములయందును కీర్తింపబడుచున్నాడు.' (వి.పు.1-1-31) అని (చెప్పబడినది.)

సమస్తవేదములయందును, ఉపనిషత్తులయందును అన్ని శబ్ద

ములచేతను పరమకారణముగా (సర్వమూలకారణముగ) అయనే (శ్రీ విష్ణువే) స్తుతింపబడుచున్నాడని యర్థము.

మూ॥ యథా సర్వాసు శ్రుతిషు కేవల పరబ్రహ్మస్వరూపవిశేషప్రతిపాదనాయైవ ప్రవృత్తో నారాయణానువాకః, తథా ఇదం వైష్ణవం చ పురాణమ్।

'సోఽహమిచ్ఛామి ధర్మజ్ఞ! శ్రోతుం త్వత్తో యథా జగత్।
బభూవ భూయశ్చ యథా మహాభాగ! భవిష్యతి॥

యన్మయం చ జగద్ బ్రహ్మన్ యతశ్చైతచ్చరాచరమ్।
లీనమాసీద్యథా యత్ర, లయమేష్యతి యత్ర చ॥' ఇతి।

పరం బ్రహ్మ కిమితి ప్రక్రమ్య—

'విష్ణోః సకాశాదుద్భూతం జగత్తత్రైవ చ స్థితమ్।
స్థితిసంయమకర్తాసౌ జగతోఽస్య జగచ్చ సః॥

పరః పరాణాం పరమః పరమాత్మాత్మసంస్థితః।
రూపవర్ణాదినిర్దేశ విశేషణవివర్జితః॥

అపక్షయవినాశాభ్యాం పరిణామర్ధిజన్మభిః।
వర్జితః శక్యతే వక్తుం యః సదాస్తీతి కేవలమ్॥

సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతి వై యతః।
తతస్స వాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే॥

తద్ బ్రహ్మ పరమం నిత్యమ్, అజమక్షయమవ్యయమ్।
ఏకస్వరూపం చ సదా హేయాభావాచ్చ నిర్మలమ్॥

తదేవ సర్వమేవైతత్ వ్యక్తావ్యక్తస్వరూపవత్।
తథా పురుషరూపేణ కాలరూపేణ చ స్థితమ్॥

ససర్వభూతప్రకృతిం వికారాన్, గుణాదిదోషాంశ్చమునే వ్యతీతః॥
అతీతసర్వావరణోఽఖిలాత్మా, తేనాస్తృతంయద్ భువనాన్తరాలే॥

సమస్తకల్యాణగుణాత్మకోఽసౌ, స్వశక్తిలేశోద్ధృత భూతవర్గః॥
ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహః, సంసాధితాశేష జగద్ధితోఽసౌ॥

తేజోబలైశ్వర్యమహావబోధస్వవీర్యశక్త్యాదిగుణైకరాశిః।
పరఃపరాణాం సకలానయత్ర, క్లేశాదయస్సంతిపరావరేశే॥

సఈశ్వరోవ్యష్టిసమష్టిరూపః, వ్యక్తస్వరూపోఽప్రకట స్వరూపః।
సర్వేశ్వరః సర్వదృక్సర్వవేత్తా సమస్తశక్తిః పరమేశ్వరాఖ్యః॥

సంజ్ఞాయతేయేన తదస్తదోషంశుద్ధపరంనిర్మలమేకరూపమ్।
సందృశ్యతేవాప్యధిగమ్యతేవాతద్జ్ఞానమజ్ఞానమతోఽన్య దుక్తమ్॥

ఇతి, పరబ్రహ్మస్వరూపనిర్ణయాయైవప్రవృత్తమ్।

అనువాదము:- ఎట్లుగ-సమస్త వేదములయందును కేవలము పర బ్రహ్మముయొక్క విశిష్టమగు స్వరూపమును ప్రతిపాదించుటకే 'నారాయ ణానువాకము' ప్రవర్తించినదో, అట్లే ఈ 'వైష్ణవపురాణము'-'ఓ ధర్మ జ్ఞుడా! అట్టినేను-'ఎట్టి జగత్తు ఏర్పడెనో, మరల ఏర్పడగలదో, ఈ జగత్తు ఎవ్వనితోనిండియున్నదో, ఎవ్వనివలన ఈ స్థావరజంగమాత్మక ప్రపంచము లీనమై యుండెనో (పైకి అగుపింపక లోపల యిమిడియుం

డెనో) ఎవ్వనియందు లయమును పొందునో', ఓ మహాభాగా! ఓ ఋషి పుంగవా! (ఇదియంతయు) నీనుండి వినగోరుచున్నాను.' అని పర బ్రహ్మమనేమియని ప్రారంభించి-(వి.పు. 1-1-4/5)

'ఈ జగత్తు విష్ణువునుండియే పుట్టినది. అక్కడనే లీనమైయున్నది. దీనియొక్క ఉనికిని, నియమునకును ఆయనే కర్త (వి.పు 1-1-31). ఈ సమస్త జగత్తు ఆయనే! శ్రేష్ఠులందరికంటెను పరమశ్రేష్ఠుడును, సర్వ జీవులయందున్నవాడును అయిన (విష్ణువు) రూపము, రంగు మున్నగు ప్రాకృతలక్షణములచే విరహితుడు. (అప్రాకృతములు, అప్రమేయ ములునైన రూపాదుల కలవాడని తాత్పర్యము). క్షీణించుట, నశించుట, మార్పుచెందుట, పెరుగుట, పుట్టుట, అను వికారములు లేనివాడై కేవ లము ఎల్లప్పుడును ఉండువాడు (నిత్యసత్తకలవాడు) అని మాత్రమే చెప్పదగినవాడు. అంతట ఆయన ఉండును, ఆయనయందే అంతయు నుండును కనుక విద్వాంసులచే వాసుదేవుడని కీర్తింపబడుచున్నాడు. అట్టి వాసుదేవాత్మకమగు పరబ్రహ్మము నిత్యము, పుట్టుకలేనిది, నాశన ములేనిది, ఎట్టి వికారములులేనిది (హ్రాసాదులులేనిది) ఒకే విధమగు ఆకా రముకలది, నిరంతరము దోషములు లేనిదగుటచే నిర్మలమైనది. ఈ కనుపించు సమస్తమగు వ్యక్తావ్యక్తస్వరూపములుకల జగత్తు ఆ పర బ్రహ్మమే. అట్లే పురుషునిగను, కాలముగను అదియే ఉన్నది. (వి.పు. 1-2-10/14)

ఆ పరబ్రహ్మభూతుడగు వాసుదేవుడు పృథివ్యాది సమస్తభూతము లకు మూలమైన ప్రకృతిని, వికారములగు పదార్థములను, గుణము లను (సత్త్వ-రజస్తమస్సులను) దోషములను అతిక్రమించినవాడై, సమస్త ములైన ఆవరణములను (ప్రకృత్యాదులను) దాటి సర్వమునకు ఆత్మ యైయున్నాడు. ఆ పరబ్రహ్మముచేతనే ఈ జగత్తుయొక్క మధ్య భాగము ఆవరింపబడియున్నది. నిఖిలములైన కల్యాణగుణములు కల వాడును, తన శక్తియొక్క అంశముచేతనే సమస్త ప్రాణికోటిని ఉద్ధరించి

నవాడును, స్వసంకల్పముచేతనే పరిగ్రహింపబడిన అప్రాకృత దివ్య విగ్రహముకలవాడును, సమస్త జగత్తునకును హితమును సాధించిన వాడును, తేజస్సు, బలము, ఐశ్వర్యము, మహాజ్ఞానము, వీర్యము, శక్తి అను షడ్గుణములకేకరాశియైనవాడు. శ్రేష్ఠులగు వారందరిలోను పరమశ్రేష్ఠుడగు ఆ పరాత్పరునియందు సమస్తములైన క్లేశములెవ్వియు లేవు. (క్లేశములనగా యోగశాస్త్రప్రసిద్ధములగు అవిద్యాస్మితకర్మవిపాకాశయాదులు) అట్టి యా పరమాత్మ వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను నాల్గువ్యూహరూపములచేతను, రామకృష్ణాద్యవతారముల చేతను వ్యష్టిసమష్టి స్వరూపుడు. పరవాసుదేవరూపముచే అవ్యక్త స్వరూపుడు, వ్యూహరూపములచే వ్యక్తుడు. స్పష్టమగుస్వరూపము కల వాడు. ఆయన అంతటికి నియామకుడు. సమస్తమును దర్శించువాడు. సమస్తమునెరిగినవాడు. సకలములగు శక్తులు కలవాడు. పరమేశ్వరుడను పేరుకలవాడు. ఇట్టి పూర్వోక్తములగు లక్షణములుకల పురుషోత్తముడు ఏ జ్ఞానముచే (ఆగమములవలనకల్గిన విద్యచే) తెలియబడుచున్నాడో, దర్శనముతో సమానముగనేర్పడిన యేభక్తిరూపమగు జ్ఞానముచే దర్శింపబడుచున్నాడో—అట్టి జ్ఞానమే వాస్తవమైన జ్ఞానము. దాని కంటె వేరైనది అజ్ఞానమేనని చెప్పబడినది' (వి.పు. 6-5-83/87).

అని పరబ్రహ్మముయొక్క విశిష్టమైన స్వరూపమును నిర్ణయించుటకే విష్ణుపురాణము ప్రవర్తించుచున్నది.

మూ॥ అన్యాని సర్వపురాణాని అన్యపరాణి ఏతదవిరోధేన నేయాని। అన్యపరత్వంచ తత్తదారంభప్రకారైః అవగమ్యతే। సర్వాత్మనా విరుద్ధాంశః తామసత్వాత్ అనాదరణీయః।

అనువాదము:- ఇతరములైన పురాణములన్నియు ఇతరదేవతా ప్రాధాన్యమును బోధించునవి (కనుక) అవి ఈ వైష్ణవపురాణమునకు విరుద్ధములు కాకుండునట్లు సమన్వయింపదగియున్నవి. ఆ పురాణములు

ఇతరదేవతాపరములని ఆయాయి పురాణముల ప్రారంభమునుబట్టి తెలియుచున్నది. సర్వథా తమోగుణపూర్ణమగు విరుద్ధాంశము ఆదరింప తగదు.

మూ॥ నన్వస్మిన్నపి—'సృష్టిస్థిత్యన్తకరిణీం బ్రహ్మవిష్ణుశివాత్మికామ్। ససంజ్ఞాంయాతిభగవాన్ ఏకఏవజనార్దనః॥' ఇతి త్రిమూర్తిసామ్యం ప్రతీయతే।

నైతదేవమ్, 'ఏకఏవజనార్దనః' ఇతి జనార్దనస్యైవ బ్రహ్మశివాది కృత్స్నప్రపంచ తాదాత్మ్యం విధీయతే।

'జగచ్చసః' ఇతి పూర్వోక్తమేవ వివృణోతి—

'స్రష్టాసృజతిచాత్మానం విష్ణుః, పాల్యంచ పాతిచ।
ఉపసంహ్రియతే చాంతే సంహర్తాచ స్వయంప్రభుః॥' ఇతి

స్రష్టృత్వేన అవస్థితం బ్రహ్మాణం సృజ్యంచ, సంహర్తారం సంహార్యం చ, యుగపన్నిర్దిశ్య, సర్వస్య విష్ణుతాదాత్మ్యోపదేశాత్, సృజ్యసంహార్యభూతాద్వస్తునః స్రష్టృసంహర్త్రోః జనార్దనవిభూతిత్వేన విశేషోదృశ్యతే। జనార్దన విష్ణుశబ్దయోః పర్యాయత్వేన 'బ్రహ్మ-విష్ణు-శివాత్మికామ్' ఇతి విభూతిమత ఏవస్వేచ్ఛయాలీలార్థం విభూత్యన్తర్భావ ఉచ్యతే।

అనువాదము:—మరి, ఈ విష్ణుపురాణమునకూడ—'సృష్టి-స్థితి-లయముల కల్గించునట్టి బ్రహ్మ-విష్ణువు-శివుడు అను సంజ్ఞను (పేరును) భగవానుడగు జనార్దనుడొక్కడే పొందుచున్నాడు' (వి. పు. 1-2-66) అని త్రిమూర్తులతో సమానత్వమే నారాయణునకు స్ఫురించుచున్నది కదా! (అన్నచో) ఇదియిట్లుకాదు. 'ఒక్క జనార్దనుడే' అనుమాటచే జనార్దనునకే బ్రహ్మ శివుడు మున్నగు సమస్త జగత్తుయొక్క తాదాత్మ్యము విధింపబడుచున్నది. 'జగత్తును అతడు' అని పూర్వము చెప్పినదానినే

వివరించుచున్నాడు—'స్రష్టయగు విష్ణువు తనను తాను సృజించుకొనును. రక్షింపదగినదానిని రక్షించును. అతడే స్వయముగ సంహర్తయై ప్రలయ కాలమున (చివరకు) ఉపసంహరించుకొనును.' స్రష్టగా (సృజించువానిగా) నున్న బ్రహ్మను, సృజింపదగినదానిని, సంహరించువానిని, సంహరింపదగినదానిని వీటియన్నిటిని ఒక్కసారిగా నిర్దేశించి అంతటికిని విష్ణువు యొక్క తాదాత్మ్యము ఉపదేశింపబడినది కనుక, సృజింపదగినది, సంహరింపదగినదియునైన వస్తువుకంటె, సృజించువానికిని, సంహరించువానికిని జనార్దనుని విభూతియైయుండుటనుబట్టి విశేషము (వైలక్షణ్యము) కనిపించుచున్నది. జనార్దనుడు-విష్ణువు అను రెండుశబ్దములును పర్యాయములు (ఒకే అర్థమును బోధించు వేరువేరు శబ్దములు) కనుక, 'బ్రహ్మ-విష్ణువు-శివుడు అను త్రిరూపమైన' అని-విభూతులతో కూడిన భగవానుడే స్వేచ్ఛగా లీలకొరకై విభూతులలో చేరినాడని చెప్పబడినది.

మూ॥ యథేదమనన్తరమేవోచ్యతే—

పృథివ్యాపస్తథాతేజః వాయురాకాశఏవచ।
సర్వేంద్రియాంతఃకరణం పురుషాఖ్యంహియజ్జగత్॥

సఏవసర్వభూతాత్మా విశ్వరూపో యతోఽవ్యయః।
సర్గాదికం తతోఽస్యైవ భూతస్థముపకారకమ్॥

సఏవసృజ్యఃసచ సర్వకర్తా. సఏవపాత్యత్తి చ పాల్యతేచ।
బ్రహ్మాద్యవస్థాభిరశేషమూర్తి విష్ణుర్వరిష్ఠో వరదో వరేణ్యః॥
ఇతి।

అనువాదము:- ఇదియేట్లో—తరువాత చెప్పబడుచున్నది—

'పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, సమస్తేంద్రియములు, మనస్సు, జీవుడు సమస్తజగత్తును ఆ శ్రీమన్నారాయణుడే, సర్వభూతములయందంతరాత్మయు, విశ్వమంతయు రూపముగాకల

వాడును, అయిన ఆ పరమాత్మ ఏకారణమువలన నాశరహితుడో అందు వలననే ఈ భూతములకు (పృథివి, జలము మున్నగువాటికి) సంబంధించిన సృష్టి కేవలమాయనకే ఉపకరించునదై యున్నది. ఆయనే సృజింప బడువాడు, ఆయనే సృజించువాడు, ఆతడే రక్షించుచున్నాడు, తిను చున్నాడు (అయమః నాశనర్చుచున్నాడు.) పాలింపబడుచున్నాడు. బ్రహ్మ మున్నగు అవస్థలతో కూడినవాడై, సమస్తమును తన దేహముగా కలిగి యున్న పరమశ్రేష్ఠుడును, కోరికలదీర్చువాడునైన శ్రీమన్నారాయణుడే అందరిచే కోరదగియున్నాడు. (వరణీయుడై యున్నాడు)

వివరణము:- వరేణ్యశబ్దమునకు శ్రేష్ఠమనియర్థమున్నను, ప్రస్తుత మున వరణీయము (కోరదగుట)యను నర్థమే చెప్పికొనవలయును. లేనిచో వరిష్ఠశబ్దముతో పునరుక్తి కలుగును.

మూ॥ అత్ర సామానాధికరణ్యనిర్దిష్టం హేయమిశ్రప్రపంచ తాదాత్మ్యం నిరవద్యస్య నిర్వికారస్య సమస్తకల్యాణగుణా-కరస్య బ్రహ్మణః కథముపపద్యతే ఇత్యాశంక్య — 'సఏవ సర్వభూతాత్మా విశ్వరూపోయతోఽవ్యయః' ఇతి స్వయమేవ ఉపపాదయతి। 'సఏవ' సర్వేశ్వరేశ్వరః పరబ్రహ్మభూతో-విష్ణురేవ 'జగత్' ఇతిప్రతిజ్ఞాయ, 'సర్వభూతాత్మా విశ్వ-రూపోయతోఽవ్యయః' ఇతి హేతురుక్తః। సర్వభూతానామ-యమాత్మా విశ్వశరీరో 'యతోఽవ్యయః' ఇత్యర్థః। వక్ష్యతి చ-'తత్సర్వం వైహరేస్తనుః' ఇతి। ఏతదుక్తంభవతి-అస్య అవ్యయస్యాపి పరస్య బ్రహ్మణః విష్ణోః విశ్వశరీరతయా తాదాత్మ్యమవిరుద్ధమ్ ఇతి। ఆత్మశరీరయోశ్చ స్వభావాః వ్యవస్థితాః ఏవ।

ఏవంభూతస్య సర్వేశ్వరస్య విష్ణోః ప్రపంచాంత-ర్భూత నియామ్యకోటినివిష్ట బ్రహ్మాది దేవతిర్యఙ్మనుష్యేషు

తత్ర తన్నామాశ్రియణీయత్వాయ స్వేచ్ఛావతారః పూర్వోక్తః॥ తదేతత్ బ్రహ్మాదీనాం భావనాత్రియాన్వయేన కర్మవశ్య-త్వమ్. భగవతః పరబ్రహ్మభూతస్య వాసుదేవస్య నిఖిల-జగదుపకారాయ స్వేచ్ఛయా స్వేనైవరూపేణ దేవాదిషు అవతార ఇతిచ షష్ఠేంశే శుభాశ్రియప్రికరణే సువ్యక్త ము-క్తమ్। అస్యదేవాదిరూపేణ అవతారేష్వపి న ప్రాకృతో దేహః ఇతి మహాభారతే—'నభూతసంఘసంస్థానో దేహోఽస్య పర-మాత్మనః' ఇతి ప్రితిపాదితః॥

అనువాదము:- ఇక్కడ (విష్ణుపురాణశ్లోకమున) ఒకే విభక్తితో కూడిన పదములతో (జగచ్ఛ-సః ఇత్యాదిగ సామానాధికరణ్యముతో) నిర్దే శింపబడిన నింద్యములైన దోషములతో కలసియున్న ప్రపంచముయొక్క తాదాత్మ్యము (అభేదము)—ఎట్టి దోషములు లేనివాడును, ఎట్టి వికారము లు (పరిణామములు) లేనివాడును, నిఖిలములగు కల్యాణగుణములకు గనియైనవాడును అయిన పరమాత్మకు (చెప్పుట) ఎట్లుకుదురును? అని శంకించి, 'అతడే సర్వభూతములకు ఆత్మయై, విశ్వరూపుడు, నాశరహితుడు' అని స్వయముగనే (విష్ణుపురాణము) ఉపపాదించుచున్నది. (శంకను నివారించుచున్నది). 'అతడే' (అనగా) నియామకులైనవారందరిని నియమించువాడగు పరబ్రహ్మమైన శ్రీమహావిష్ణువే, 'జగత్తు' అని ప్రతిన బూని, 'ఏకారణముచే నాశరహితుడో అందువలననే సర్వభూతములకు (ప్రాణులకు) అంతరాత్మయు, సమస్తము రూపముగా (ఆకారముగా) కలవాడు' అని హేతువు (కారణము) చెప్పబడినది. సర్వభూతములకు ఈతడే ఆత్మ. విశ్వమంతయు శరీరముగా కలవాడు 'నాశరహితుడు కనుకనే' అనియర్థము. ముందుకూడ చెప్పను—'ఇదియంతయు శ్రీహరి శరీరమే' అని. ఇది చెప్పబడినట్లైనది—ఈ పరబ్రహ్మమగు విష్ణువు అవ్యయుడైనప్పటికిని (నాశాది వికారములు లేనివాడైనప్పటికిని) సమస్త ప్రపంచము దేహముగా కలవాడు కనుక తాదాత్మ్యము (అభేదము)

ఎంతమాత్రము విరుద్ధముకాదు అని. ఆత్మ-శరీరము అనునీరెండిటి యొక్క స్వభావములు నియతములుగనే ఉన్నవి.

ఇట్టి సర్వేశ్వరుడగు విష్ణువునకు ప్రపంచమందున్న నియమింపదగు వస్తువులలో చేరియున్న బ్రహ్మ మున్నగు దేవతలు, పశుపక్ష్యాదులు, మనుష్యులు అనువీటియందు వారివారికి ఆశ్రయింపదగియుండుటకై స్వేచ్ఛగా (రామకృష్ణాది రూపముగ) నవతారము పూర్వమే చెప్పబడినది. ఇదియంతయు (అనగా) 'బ్రహ్మ మున్నగువారికి భావనాత్రయముతో (బ్రహ్మభావన, కర్మభావన, ఉభయాత్మక భావనలతో) కూడియుండుట అనునదికలదుకనుక, కర్మమునకు వశవడియుండుట, భగవంతుడును పరబ్రహ్మమునైన వాసుదేవునకు సమస్త జగత్తులకుపకారము కల్గుటకై స్వేచ్ఛగా స్వయముగ స్వస్వరూపముచేతనే దేవాదులయందవతారము అని విష్ణుపురాణముయొక్క ఆరవయంశమగు 'శుభాశ్రయ ప్రకరణము'న స్పష్టముగా చెప్పబడినది. ఈ భగవానునకు దేవతలు మున్నగు రూపముచే అవతారములున్నప్పటికిని ప్రకృతిసంబంధముగల శరీరము లేదని మహాభారతము—'ఈ పరమాత్మకు పృథివ్యాదిభూతముల సముదాయముచేకల్గిన ఆకారముకల శరీరము లేదు' అని ప్రతిపాదింపబడినది.

వివరణము:- 'కర్మభావాత్మికాహ్యేకా బ్రహ్మభావాత్మికాపరా। ఉభయాత్మికా తథైవాన్యా త్రివిధా భావభావనా' అను విష్ణుపురాణవచనమును బట్టి త్రివిధమైన భావనకలదనియు, అందు సనకసనందనాది మహర్షులు బ్రహ్మభావన కలవారనియు, దేవతలు మొదలు స్థావరములవరకు కర్మభావన కలవనియు, హిరణ్యగర్భాదులకు ఈ రెండువిధముల భావన (ఉభయాత్మక భావన) కలదనియు తెలియుచున్నది. (వి. పు. 6-7-48 నుండి 51వ శ్లో. వరకు).

మూ॥ శ్రుతిశ్చ—'అజాయమానో బహుధా విజాయతే. తస్య ధీరా పరిజానన్తి యోనిమ్' ఇతి. కర్మవశ్యానాం బ్రహ్మాదీనామ్.

**అనిచ్ఛతామపి తత్తత్కర్మానుగుణ ప్రకృతిపరిణామభూత సంఘాతసంస్థానవిశేషదేవాదిశరీరప్రవేశరూపం జన్మ అవర్జనీయమ్; అయంతు సర్వేశ్వరః సత్యసంకల్పః భగవాన్ ఏవంభూతశుభేతరజన్మ అకుర్వన్నపి, స్వేచ్ఛయా తేనైవ నిరతిశయకల్యాణరూపేణ దేవాదిషు జగదుపకారాయ బహుధా జాయతే; తస్యైతస్య శుభేతరజన్మ అకుర్వతోఽపి సర్వకల్యాణగుణానంత్యేన—'బహుధాయోనిమ్' = బహువిధ జన్మ, ధీరాః=ధీమతామగ్రేసరాః, జానన్తి ఇత్యర్థః।**

అనువాదము:— వేదముకూడ (ఇట్లు చెప్పుచున్నది)—'పుట్టుకలేనివాడగు పరమాత్మ అనేకవిధములుగా పుట్టుచున్నాడు. ధీరులగువారు ఆయనయొక్క పుట్టుకను తెలిసికొనుచున్నారు' (పురు 21). కర్మమునకు వశపడియున్న బ్రహ్మ మున్నగు వారికి—వారి యిష్టములేకున్నను ఆయాయికర్మమునకుతగిన ప్రకృతిపరిణామమగు (పృథివ్యాది) భూత సముదాయముచే కల్గిన ఆకారవిశేషముగల దేవతలు మొదలగు దేహములయందు ప్రవేశించుటయను 'పుట్టుక' పరిహరింపరానిదే! కాని సర్వేశ్వరుడును, సత్యసంకల్పుడును అగు భగవానుడు ఇటువంటి అశుభమగు (ప్రకృతి సంబంధముకల్గి కర్మమూలమైన) పుట్టుకను పొందకున్నను, తన సంకల్పమునను సరించి తనంత తానుగనే తనదగు అపారకల్యాణాస్పదమైన రూపముతో దేవతలు మున్నగువారియందు లోకోపకారమునకై అనేక విధములుగా పుట్టుచున్నాడు. అట్టి ఈ పరమాత్మకు, అశుభజన్మమును పొందకున్నను సమస్తములగు కల్యాణగుణములు అపారముగనున్నవి కనుక—'బహుధాయోనిమ్' = అనేక విధములగు జన్మమును, ధీరాః = ధీశాలులలో అగ్రగణ్యులగు విద్వాంసులు తెలిసికొనుచున్నారు అని యర్థము.

వివరణము:— ఇంతవరకు పరమాత్మకుగల జన్మము ప్రాకృతము కాదని శ్రుతి ప్రామాణ్యమును చూపి ఇప్పుడు బ్రహ్మసూత్రకారుడగు బాద

రాయణుని తాత్పర్యమును ఇదియేనని సూత్ర నిర్దేశపురస్సరముగా నొడువుచున్నారు.

మూ॥ తదేతన్నిఖిల జగన్నిమిత్తోపాదానభూతాత్ 'జన్మాద్యస్య యతః' 'ప్రకృతిశ్చప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్' ఇత్యాది సూత్రైః ప్రతిపాదితాత్ పరస్మాత్ బ్రహ్మణః పరమపురుషాత్ అన్యస్యకస్యచిత్ పరత్వమ్ — 'పరమతస్సేతూన్మాన సంబంధ భేదవ్యపదేశేభ్యః' (బ్ర. సూ. 3-2-30) ఇత్యాశంక్య, 'సామాన్యాత్తు' (బ్ర. సూ. 3-2-31) 'బుద్ధ్యర్థః పాదవత్' (బ్ర. సూ. 3-2-32) 'స్థానవిశేషాత్ ప్రకాశాదివత్' (బ్ర. సూ. 3-2-33) 'ఉపపత్తేశ్చ' (బ్ర. సూ. 3-2-34) 'తథాన్యప్రతిషేధాత్' (బ్ర. సూ. 3-2-35) 'అనేనసర్వగతత్వమ్ ఆయామశబ్దాదిభ్యః' (బ్ర. సూ. 3-2-36)—ఇతి సూత్రకారః స్వయమేవ నిరాకరోతి।

అనువాదము:- సమస్త జగత్తుకు నిమిత్తకారణము ఉపాదానకారణమునైనవాడును; 'జన్మాద్యస్యయతః' (ఈ జగత్తుయొక్క జన్మస్థితి భంగము లేకారణమువలన కలుగుచున్నవో) 'ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్' (పరబ్రహ్మమే ఉపాదానకారణము. ప్రతిజ్ఞకును, దృష్టాన్తమునకును విరోధములేదుకనుక) మున్నగు సూత్రములచే ప్రతిపాదింపబడినవాడును, పరమపురుషుడునైన పరమాత్మకంటె ఇతరమైన దానికి దేనికో పరత్వమున్నదని- 'పరమతస్సేతూన్మాన సంబంధభేదవ్యపదేశేభ్యః' (బ్రహ్మముకంటె పరమైనదికలదు (ఏలన) సేతువ్యపదేశము' ఉన్మానవ్యపదేశము, సంబంధవ్యపదేశము, భేదవ్యపదేశములున్నవి కనుక) అను (3-2-30) సూత్రముచే-పూర్వపక్షమునాశంకించి—ఈ క్రిందిసూత్రములచే సూత్రకర్తయగు బాదరాయణుడు స్వయముగ ఆ శంకను నివారించుచున్నాడు. ఆ సూత్రములేవన – 'సామాన్యాత్తు' ఇత్యాదులు.

వివరణము:- 'జన్మాద్యస్యయతః' (1-1-2) అను సూత్రము చేతను, 'ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తనుపరోధాత్' (1-4-23) అను సూత్రముచేతను పరబ్రహ్మముపాదానకారణమని చెప్పబడినది. అట్టి పర బ్రహ్మముకంటె పరమైనది వేరొకటికలదని 'పరమతస్సేతూన్మాన సం బంధభేదవ్యపదేశేభ్యః' అను సూత్రముచే పూర్వపక్షముచేసి - 'సామా న్యాత్తు' ఇత్యాది సూత్రములచే బాదరాయణుడు సమాధానించియు న్నాడు. పూర్వపక్షసూత్ర తాత్పర్యమిది-'అథయ ఆత్మా స సేతుర్వి ధృతిః' (ఛాం. 8-4-1) ఇత్యాదిగ బ్రహ్మము సేతువని వ్యవహరింపబడి నది. సేతువనగా లోకమున వేరొక ఒడ్డునకుచేర్చునట్టి వంతెనవంటి సాధనమని యర్థము. బ్రహ్మమును సేతువని చెప్పుటచే - బ్రహ్మము కంటె పొందదగినది వేరుగకలదనియు దానిని పొందించునది పరబ్రహ్మ మనియు తెలియుచున్నది. అట్లే 'చతుష్పాద్బ్రహ్మ' షోడశకలమ్ (ఛాం. 4-4) అని బ్రహ్మమునకు ఉన్మానము అనగా, పరిమితి నిర్దేశింప బడినది. దీనివలన పరిమితిలేనిదేదో బ్రహ్మముకంటె వేరుగ కలదని తెలియుచున్నది. మరియు- 'అమృతస్య పరం సేతుం దగ్ధేంధనమివా నలమ్' (శ్వే. 6-29) ఇత్యాదిగ సేతువునకును, సేతువుచే పొందదగిన దానికినిగల ప్రాప్యప్రాపకత్వమను సంబంధము (పొందబడునది, పొం దించునది అను సంబంధము) కూడ నిర్దేశింపబడినది. అట్లే 'పరాత్ పరంపురుషముపైతి' (తై.నారా. 1-5) ఇత్యాదిగ పరతత్త్వమైన బ్రహ్మ ముకంటె పరముకలదని తెలియుచున్నది. ఈ విధముగ-సేతువుగ నిర్దే శము, పరిమితికలదని నిర్దేశము, సంబంధ నిర్దేశము, భేదనిర్దేశములుండుట బట్టి బ్రహ్మముకంటె వేరైన పరతత్త్వము కలదని పూర్వపక్షాశయము. దీనికి 'సామాన్యాత్తు' అని యారంభించి-ఆరు సూత్రములచే సమా ధానముచెప్పబడినది. వాటి భావమిది.

1. సామాన్యాత్తు (3-2-31) సినోతి బధ్నాతిస్వస్మిన్సర్వమ్ చిద చిద్వస్తుజాతమ్-సమస్తమగు జీవజడాత్మకమగు వస్తుసముదాయమును

తనయందు బంధించును అను వ్యుత్పత్తిని (నిర్వచనమును) బట్టి సేతు వనగా అందరిచే సమానముగా పొందబడునది. పరబ్రహ్మముకూడ అట్టిదే కనుక, తాను పొందబడునదేతప్ప వేరొక ప్రాప్యమును పొందించునది కాదని భావము.

2. బుద్ధ్యర్థః పాదవత్ (3-2-32) పాదవత్ = పాదోఽస్యావిశ్వా భూతాని (పు.సూ.) 'సమస్త ప్రాణులు ఆయనకు పాదము' అనుచోటున పాదమెట్లు పరిమితముగ ఉపాసనార్థమై నిర్దేశింపబడినదో, అట్లే, 'చతుష్పాత్ బ్రహ్మ షోడశకలమ్' ఇత్యాదిగ పరిమితత్వము (ఉన్మానము) ఉపాసనార్థము. (బుద్ధ్యర్థః) వస్తుతః పరమాత్మకు పరిమితిలేదు.

3. స్థానవిశేషాత్ ప్రకాశాదివత్ (3-2-33) ప్రకాశాదివత్ = వెలుగు పరిచ్ఛిన్నముకాకున్నను–వాతాయనము (కిటికీ) మున్నగు ప్రదేశము లచే పరిచ్ఛిన్నముగా తోచినట్లు, స్థానవిశేషాత్ = వాక్ పాదాది స్థానవిశేష రూపమగు నుపాధివిశేషమును పురస్కరించుకొని ఉపాసనార్థమై బ్రహ్మ మును పరిమితముగ అనుసంధానమొనర్చుట కుదురును.

4. ఉపపత్తేశ్చ (3-2-34) ప్రాప్యప్రాపక సంబంధ వ్యపదేశమును బట్టి బ్రహ్మముకంటె, పరము, వేరుగనున్నదనుట కుదరదు. 'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' ఇత్యాదిగ ప్రాప్యమైన పరబ్రహ్మము, స్వప్రాప్తికి తానే ప్రాపకము (పొందించునది) అగుట (ఉపపత్తేః) కుదురును కనుక ఇది యుక్తమే.

5. తథా అన్యప్రతిషేధాత్ (3-2-35) 'పరాత్ పరం పురుషమ్' ఇత్యాదిగ బ్రహ్మముకంటె భిన్నముగ పరతత్త్వము నిర్దేశింపబడినదనుట కుదరదు. అన్యప్రతిషేధాత్ = పరమాత్మకంటె వేరుగ పరతత్త్వములేదని —యస్మాత్పరం నాపరమస్తి కించిత్ యస్మాన్నాణీయో నజ్యాయోఽస్తి

కశ్చిత్ (ఎవ్వనికంటె పరముగాని, అపరముగాని, సూక్ష్మముగాని, గొప్పదిగానిలేదో) అని-బ్రహ్మముకంటె పరములేదని నిషేధింపబడినది కనుక.

అనేన సర్వగతత్వమ్, ఆయామశబ్దాదిభ్యః (3-2-36) అనేన = పరబ్రహ్మముచే, సర్వగతత్వమ్ = అంతట వ్యాపించియుండుట అనునది, ఆయామశబ్దాదిభ్యః = సర్వవ్యాప్తిని బోధించు శబ్దములవలన తెలియుచున్నదికనుక. ఆయామశబ్దములనగా సర్వవ్యాప్తిని బోధించు శబ్దములు. 'తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్' (తై. నారా. 13) అనుచోటున పూర్ణమ్ అనియు, 'అంతర్బహిశ్చ తత్సర్వంవ్యాప్య నారాయణఃస్థితః' (లోపల, వెలుపల దానినంతటిని వ్యాపించి నారాయణుడుండెను) అనుచోటున 'వ్యాప్య' (వ్యాపించి) అనునది. ఈవిధముగ సర్వవ్యాపకమని స్పష్టముగ తెలియుచున్నదికనుక బ్రహ్మమే అన్నిటికంటె పరమని తాత్పర్యము.

ఈవిధముగ సూత్రకారుడగు బాదరాయణుడుకూడ పరమాత్మయగు శ్రీమన్నారాయణుని పరత్వమును వ్యక్తపరచినాడనికూడ తాత్పర్యము.

మూ॥ మానవేచశాస్త్రే-'ప్రాగాసీత్తమోనుదః' 'సిసృక్షుః వివిధాః ప్రజాః' 'అపఏవససర్జాదౌ తాసువీర్యమపాసృజత్' 'తస్మిన్ జజ్ఞేస్వయం బ్రహ్మా' ఇతి బ్రహ్మణో జన్మశ్రవణాత్ క్షేత్రజ్ఞత్వమేవ అవగమ్యతే; తథాచ స్రష్టుః పరమపురుషస్య, తద్విసృష్టస్యచబ్రహ్మణః — 'అయనం తస్యతాః పూర్వం తేన నారాయణః స్మృతః', 'తద్విసృష్టః స పురుషః లోకే బ్రహ్మేతి కీర్త్యతే' ఇతి నామనిర్దేశాచ్చ।

తథావైష్ణవే పురాణే హిరణ్యగర్భాదీనాం భావనాత్రయాన్వయాత్ అశుద్ధత్వేన శుభాశ్రయత్వానర్హత్వోపపాదనాత్ క్షేత్రజ్ఞత్వం నిశ్చయతే।

అనువాదము:- మనుధర్మశాస్త్రమున (కూడ)-'తమస్సును (అజ్ఞానాంధకారమును) పోద్రోలువాడు పుట్టెను' 'అనేకవిధములగు ప్రజలను సృజింపదలచినవాడై' 'ముందు జలమునే సృజించెను. దానియందు తన వీర్యమును సృజించెను.' 'దానిలో బ్రహ్మ స్వయముగ నావిర్భవించెను.' అని చతుర్ముఖబ్రహ్మకు జన్మమున్నట్లు తెలియుచున్నది కనుక, జీవత్వమే అవగతమగుచున్నది. కనుకనే, సృజించువాడగు పురుషోత్తమునకును, సృజింపబడునట్టివాడగు చతుర్ముఖబ్రహ్మకును—'ఆ పరమాత్మకు ఆ జలములే స్థానముకనుక ఆయన నారాయణుడని స్మరింపబడినాడు' 'ఆ పరమాత్మచే సృజింపబడిన పురుషుడే లోకమున చతుర్ముఖ బ్రహ్మయని కీర్తింపబడుచున్నాడు' అని పేరులు నిర్దేశింపబడినవి. కనుక అట్లే విష్ణుపురాణమున చతుర్ముఖబ్రహ్మ మున్నగువారు, భావనా త్రయముతోకూడిన వారగుటచే శుభమున కాశ్రయమగు నర్హత లేనివారని ప్రతిపాదింపబడుటవలన జీవులేనని నిర్ణయింపబడుచున్నది.

వివరణము:- ఇంతవరకు భగవద్రామానుజులు శ్రుతి, పురాణేతిహాసములు, స్మృతులు శ్రీమన్నారాయణుడే నిఖిలజగత్తునకు ఉపాదాన కారణము, నిమిత్త కారణముననియు ప్రతిపాదించుచున్నవనియు, శ్రీమన్నారాయణుడే సర్వాంతర్యామియగు పరతత్త్వము, పరబ్రహ్మముననియు సప్రమాణముగ నిరూపించియున్నారు. వైదికవచనములందుగల హిరణ్యగర్భ-శంభు-శివ-ఇంద్రాగ్ని ప్రభృతి శబ్దములన్నియు జీవత్వముగల ఆయాయిదేవతలయందంతరాత్మగానున్న శ్రీమన్నారాయణునే బోధించుచున్నవనియు, కేవలపరతత్త్వ నిర్ణయమునకే ప్రవర్తించిన నారాయణానువాకాదులు నారాయణపారమ్యమునే ప్రతిపాదించుచున్నవనియు, భారతాదీతిహాసములును, సర్వపురాణమూర్ధన్యమగు వైష్ణవపురాణము, మనుస్మృత్యాదులు అన్నియు, బ్రహ్మాదులు జీవకోటికి చెందినవారని ప్రతిపాదించుచున్నవని స్పష్టపరుపబడినది. పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుడే రామకృష్ణాద్యవతారముఖమున దేవమనుష్యాది జన్మముల పొంది-

దేవమనుష్యాది సంఖ్యాపూరణ మొనర్చినాడనికూడ స్పష్టపరుపబడినది.

## :: కార్యవాక్యార్థవాదుల మతము – తత్ఖండనము ::

మూ॥ యదపికైశ్చిదుక్తమ్ – సర్వస్యశబ్దజాతస్య విధ్యర్థవాద-మంత్రరూపస్య కార్యాభిధాయిత్వేనైవప్రామాణ్యం వర్ణనీ-యమ్। వ్యవహారాదన్యత్ర శబ్దస్య బోధకత్వశక్త్యవధారణా సంభవాత్ వ్యవహారస్యచ కార్యబుద్ధిమూలత్వాత్ కార్యరూప ఏవ శబ్దార్థః। నపరినిష్పన్నేవస్తుని శబ్దః ప్రమాణమ్।

అనువాదము:- కొందరిచేనిట్లు చెప్పబడినది. ఏమన–"విధి, అర్థవాదము, మంత్రము అను రూపముతోనున్న సమస్త శబ్దసముదాయమునకును, అది 'కార్య'రూపమగునర్థమును బోధించుటచేతనే ప్రామాణ్యము చెప్పదగియున్నది. 'వ్యవహారము' కంటె వేరైన విషయమున శబ్దమునకు'బోధకత్వశక్తిని' నిశ్చయించుటకుదరదుకనుక, వ్యవహారమనునది కార్యజ్ఞానమునే మూలముగాచేసికొని యున్నదికనుక, శబ్దముయొక్క అర్థము కార్యరూపమేతప్ప, సిద్ధించియున్నవస్తువును బోధించుటలో శబ్దము ప్రమాణముకాదు" అని.

వివరణము:- ఇక్కడనుండి ప్రారంభించి భగవద్రామానుజులు మీమాంసకుల మతమును ఖండించుటకుపక్రమించుచున్నారు. మీమాంసకులనువారు వేదమందలి కర్మకాండ ప్రధానమైనభాగముయొక్క తాత్పర్యమును నిరూపించునట్టి పూర్వమీమాంసాశాస్త్రమును ఆశ్రయించినవారు. ఈ శాస్త్రమునకు జైమినిఋషిచే నిర్మింపబడి 'షోడశలక్షణి' యను పేరుగల పదునారు అధ్యాయములతోకూడిన పూర్వమీమాంసాశాస్త్రముగ ప్రసిద్ధమైన సూత్రములు మూలము. దానిపై శబరస్వామి భాష్యమును రచించెను. ఈ సూత్రముల సమన్వయములోను, కొన్ని ప్రధానములైన సిద్ధాన్తములలోనుగల భేదమునుబట్టి ఈ శాస్త్రమున భాట్టులు, ప్రాభాకరులని రెండు పక్షములవారు కలరు. కుమారిలభట్టుయొక్క సమన్వయ

శైలిననుసరించినవారు భాట్టులుకాగా, ప్రభాకరమిశ్రుని మతము నాశ్రయించినవారు ప్రాభాకరులు. వాక్యార్థనిర్ణయవిషయమున వీరికి మతభేదముకలదు. భాట్టులను అభిహితాన్వయవాదులనియు, ప్రాభాకరులను అన్వితాభిధానవాదులు అనియు వ్యవహరింతురు. శంకరభగవత్పాదులు బ్రహ్మమీమాంసకును, జైమినిప్రోక్తమగు ధర్మమీమాంసకును (కర్మమీమాంసకును) ఎంతమాత్రము సంబంధములేదని ఈ రెండుశాస్త్రములను వేరుచేసిరి. బ్రహ్మమీమాంసకు కర్మమీమాంస అక్కరలేదని వారి తాత్పర్యము. ఇక భగవద్రామానుజులట్లుకాక – 'స్వాధ్యాయోఽధ్యేతవ్యః' అని వేదమంతయు అధ్యయనముచేయవలయునని చెప్పబడుటచే కర్మప్రతిపాదకవేదభాగమునకుకూడ, బ్రహ్మప్రతిపాదకమగు నుపనిషద్భాగముతోపాటు అధ్యయనము, అంగములతో వాటి అవగాహనము అవసరమనియు, అందుకొరకు బ్రహ్మమీమాంసకు ముందు కర్మమీమాంసకూడ చేయవలయుననియు, కర్మమీమాంస చేసినవాడుమాత్రమే కర్మముల అల్పాస్థిరఫలత్వమును (అనగా కర్మములు అల్పము, అస్థిరమునైన స్వర్గాది ప్రయోజనమును, అభ్యుదయమును మాత్రమే కల్గించునవని) యెరిగి, వేదాధ్యయన సమయమున అధ్యయనముచేయబడిన యుపనిషద్వాక్యములవలన బ్రహ్మజ్ఞానము అనన్తస్థిరఫలము నిచ్చునదియని సామాన్యముగ తెలిసికొని బ్రహ్మజిజ్ఞాసయందు ప్రవర్తించునని పేర్కొనిరి. కనుకనే – 'వృత్తాత్ కర్మాధిగమాదనన్తరం బ్రహ్మవివిదిషా' 'ముందు కర్మవిచారమును చేసినతరువాత బ్రహ్మజిజ్ఞాసచేయవలయును' అను వృత్తికారవచనమునుబట్టియు, 'సంహితమేతచ్ఛారీరకం జైమినీయేన షోడశలక్షణేన ఇతి శాస్త్రైకత్వసిద్ధిః' 'ఈ శారీరకశాస్త్రము (వేదాన్తశాస్త్రము) జైమినిప్రోక్తమగు కర్మమీమాంసతో (పదునారు అధ్యాయములు కల ధర్మమీమాంసతో) కలసి ఒకే శాస్త్రమగుచున్నది' అను వచనమును బట్టియు – కర్మమీమాంసా-బ్రహ్మమీమాంసలు కలిసి మొత్తము 20 అధ్యాయముల మీమాంసాశాస్త్రమని భగవద్రామానుజుల సిద్ధాన్తము.

పూర్వము చెప్పబడిన మీమాంసకులలోని ప్రభాకరమిశ్రమతాను యాయులైన ప్రాభాకరమీమాంసకులు లోకవ్యవహారమునుబట్టి క్రియయే కార్యముగా తెలియుచున్నదికనుక—వ్యవహారదశలో ప్రయోగించు పద సముదాయరూపమగు వాక్యమునకు—క్రియాత్మకమగు కార్యమే అర్థము, అనగా క్రియారూపమగు కార్యమే వాక్యార్థము అని చెప్పుదురు. లోక మున ఒక వ్యక్తి—వేరొకనితో 'గోవును తెమ్ము' అనియన్నప్పుడు—ఈ వాక్యముయొక్క అర్థముతెలియని తటస్థుడగు వ్యక్తి—రెండవవాడుచేసిన చేష్టలనుబట్టి, మొదటివాడు పల్కిన పదముల యర్థమును తెలిసికొనియే, వాడాపనిని చేయుచున్నాడని ఊహించి, వానిచేష్టలకును—మొదటివాడు పల్కిన మాటలకును సంబంధమున్నదని తెలిసికొనును. ఇట్లే 'గుర్ర మును తెమ్ము' 'గోవును తోడ్కొనిపొమ్ము' ఇత్యాది వాక్యప్రయోగముల ను, వాటినిబట్టి రెండవవాడుచేసిన చేష్టలను లెస్సగాగమనించి—ఆయాయి వాక్యములకును, చేష్టారూపములగు క్రియలకునుగల సంబంధమునుగూడ తెలిసికొని, క్రియలతో అన్వయించిన ఆయాయి వస్తువులను అనగా గోవు, గుర్రము మున్నగువాటినికూడ తెలిసికొనును. ఈవిధముగ క్రియ తో అన్వయించిన వస్తుబోధకములగు పదములకుతప్ప కేవలవస్తుబోధకము లగు పదములకు అనగా కొండ, చెట్టు, పుట్ట ఇత్యాది సిద్ధవస్తువులను బోధించుపదములకు అర్థములేదని చెప్పుదురు. దీనికి కారణమేమనగా శబ్దవ్యవహారమనునది ఎదుటివారికి ప్రవృత్తినో, లేక నివృత్తినో కలిగిం చుటకేతప్ప తటస్థబుద్ధిని కలిగించుటకుకాదు. 'ఇదికొండ' అనిఅన్నచో దానిని విన్నవానికి ప్రవృత్తిగాని, నివృత్తిగాని కలుగదు. కనుక ఇట్టి సిద్ధవస్తువులను అనగా క్రియాసంబంధములేని కేవలవస్తువులను బోధించు శబ్దములకు వ్యవహారయోగ్యత లేదుకనుక, వాటికి బోధకత్వములేదు. లోకసామ్యమునుబట్టి వైదికవాక్యములలోకూడ విధిబోధకములైన లిఙ్, లోట్, తవ్యప్రత్యయములతో కూడిన శబ్దములును వాటిచే బోధింపబడిన 'కార్యము'తో అన్వయించి వాక్యములుగానేర్పడిన శబ్దములకే బోధకత్వ

ముండును. కనుక వేదవాక్యములుకూడ కార్యార్థమునే బోధించును. కాని వేదవాక్యములచే ప్రతిపాదింపబడు 'కార్యము' క్రియారూపముకాదు. అది యాగాది క్రియలకును—స్వర్గాదిఫలములకును నడుమకల్పింపబడిన 'అపూర్వము' అనునర్థము. ఇది యాగాదులకు సంబంధించిన ఉత్తరకాలికమగు సూక్ష్మదశయని మీమాంసకులు చెప్పుదురు. యాగాదిక్రియలు వెంటనే నశించునవికనుక, అవి స్వర్గాదిఫలము సిద్ధించువరకు స్థిరముగ నుండునవికావు. కనుక యాగాదిక్రియలు 'అపూర్వము' లేక 'అదృష్టము' అనుదానిని పుట్టించి తాము నశించును. ఈ అపూర్వము లేక అదృష్టము అనునదియే కార్యము. దీనిని పురస్కరించుకొనియే లోకమున పురుషునకు యాగాదివైదికక్రియలపట్ల ప్రవృత్తి కల్గునుకనుక ఇదియే 'ప్రవర్తకము' (ప్రవర్తింపచేయునది) అనికూడ వ్యవహరింపబడును. లోకమున దానాదుల చేయుదుము. వాటివలన ఫలమేదియు వెంటనే కనుపింపదు. చేసినకర్మము అప్పుడే నశించినది. చేసినదానికి ఫలములేనిదే ఎవ్వడు ఆకర్మమును చేయడుకదా! కనుక చేసిన ఆ కర్మము ఒక అపూర్వమును లేదా అదృష్టమును పుట్టించుననియు, అదియే కాలాన్తరమున ప్రధాన ఫలమును అనగా స్వర్గాదికమును కల్గించి తానును తొలగిపోవుననియు వారి అభిప్రాయము. కనుక సర్వవాక్యములు అపూర్వమను కార్యరూపమగు అర్థమునే వాక్యార్థముగా బోధించుననియు, విధిప్రత్యయములు ఆ కార్యమునే బోధించుననియు ప్రాభాకరమీమాంసకులు తెల్పుదురు. ఇక వేదాన్త వాక్యములు సిద్ధవస్తువగు బ్రహ్మమును బోధించునవే కనుక వాటికి వ్యుత్పత్తి (అర్థబోధకత్వము) లేదని వారియభిప్రాయము. ప్రస్తుతమగు నీ కార్యవాక్యార్థవాదమును-ఈక్రింది శ్లోకములు విశదపరచుచున్నవి.

లిఙాదిష్వత్ర కార్యంచేత్ క్రియామేవావబోధయేత్।
నసమన్వయో నియోజ్యేన తదానీమేవ హీయతే॥

క్రియాహి క్షణికత్వేన లోకాన్తర విభావినః।
స్వర్గాదేః సాధ్యమానస్య అసమర్థాజననం ప్రతి॥

న కార్యత్వేన సంబంధమర్హతి క్షణభంగతః।
తస్మాన్నియోజ్య సంబంధ సమర్థవిధివాచిభిః
కార్యం కాలాన్తరస్థాయి క్రియాతో భిన్నముచ్యతే॥'

('నయద్యుమణి'లో మేఘనాదారిసూరిచే వాక్యార్థదీపమున నుట్టంకింపబడిన శ్లోకములు పుట. 46, 47) ఈశ్లోకముల భావమిది—

'యజేత స్వర్గకామః' ఇత్యాది వైదికవాక్యములయందు 'యజేత' (యాగము నొనర్పవలయును) అనుచోటునగల 'లిఙ్' మున్నగు విధి ప్రత్యయములు లోకమునందువలె క్రియనే కార్యముగా బోధించినచో, కార్యమందు ప్రవర్తింపజేయబడు పురుషునకు (నియోజ్యునకు) ఆ క్రియతో సంబంధము అప్పుడే (క్రియపూర్తియైన వెంటనే) పోవును. క్రియయనునది క్షణకాలముండి నశించునదికనుక వేరొక లోకమున సంపాదింపదగిన స్వర్గాదిఫలమును పుట్టింప సమర్థముకాదు. క్షణకాలమున నశించునది కనుకనే యాగాదిక్రియ 'కార్యము'గా సంబంధింపతగదు. కనుక నియోజ్యుడగు (కార్యమందు ప్రవర్తింపజేయబడు) పురుషునితో సంబంధించుటకు సమర్థమైన విధిని బోధించు లిఙాది ప్రత్యయములచే కాలాంతరమున కూడ (యాగాదులు నశించిన తరువాతకూడ) ప్రధానఫలము లభించునంతవరకు స్థిరముగా నుండునట్టి 'కార్యము అనగా అపూర్వము యగాది క్రియకంటె వేరుగ చెప్పబడుచున్నది' అని. ఇప్పుడు కార్యమే వాక్యార్థమను వాదమును, అపూర్వమే ఫలమునిచ్చునను వాదమును భగవద్రామానుజులు ఖండించుచున్నారు.

మూ॥ అతోఽభిధీయతే — ప్రవర్తకవాక్యవ్యవహారప్రవశబ్దానామర్థబోధకత్వశక్త్యవధారణం కర్తవ్యమితికిమియం రాజాజ్ఞా? సిద్ధవస్తుషు శబ్దస్యబోధకత్వశక్తిగ్రహణమ్ అత్యన్త సుకరమ్। తథాహి—కేనచిత్ హస్తచేష్టాదినా — 'అపవరకేదండః స్థితః' ఇతి దేవదత్తాయ జ్ఞాపయేతి ప్రేషితః కశ్చిత్ తద్జ్ఞాపనే

ప్రవృత్తః. 'అపవరకే దండః స్థితః' ఇతి శబ్దంప్రయుఙ్క్తే। మూకవత్ హస్తచేష్టామిమాం జానన్ పార్శ్వస్థోఽన్యః ప్రాగవ్యుత్పన్నోఽపి ఏతస్యార్థస్య బోధనాయ-'అపవరకే దండఃస్థితః' ఇత్యస్య శబ్దస్య ప్రయోగదర్శనాత్ 'అస్య అర్థస్య అయంశబ్దో బోధకః' ఇతి జానాతి – ఇతి కిమత్ర దుష్కరమ్।

తథా–బాలః 'తాతోఽయమ్' 'ఇయమంబా' 'అయం మాతులః' 'అయం మనుష్యః' 'అయం మృగః' 'చంద్రోఽయమ్' 'అయం సర్పః' ఇతి మాతాపితృప్రభృతిభిః శబ్దైః శనైః శనైః అంగుల్యానిర్దేశేన తత్ర తత్ర బహుశః శిక్షితః, తైరేవశబ్దైః తేష్వర్థేషు స్వాత్మనశ్చ బుద్ధ్యుత్పత్తిందృష్ట్వా, తేష్వర్థేషు తేషాంశబ్దానామ్ అంగుల్యా నిర్దేశపూర్వకప్రయోగః సంబంధాన్తరాభావాత్ సంకేతయితృ పురుషాజ్ఞానాచ్చబోధకత్వనిబంధనః ఇతిక్రమేణనిశ్చిత్య, పునరపి – 'అస్యశబ్దస్య అయమర్థః' ఇతి పూర్వవృద్ధైః శిక్షితః, సర్వశబ్దానా మర్థమవగమ్య స్వయమపి సర్వవాక్యజాతం ప్రయుఙ్క్తే। ఏవమేవ సర్వపదానాం స్వార్థాభిధాయిత్వం, సంఘాత విశేషాణాంచ యథావస్థితసంసర్గవిశేషబోధకత్వం చ జానాతి – ఇతి 'కార్యార్థే ఏవ వ్యుత్పత్తిః' ఇత్యాది – నిర్బంధో నిర్నిబంధనః॥

అనువాదము:- ఇచ్చట (సమాధానము) చెప్పబడుచున్నది–పురుషులను ప్రవర్తింపజేయు వాక్యములయొక్క వ్యవహారమందే (క్రియా రూపమగు కార్యమందే) శబ్దములకు అర్థబోధకత్వశక్తిని నిశ్చయింపవలయుననునది రాజాజ్ఞయా? (క్రియకంటె వేరైన) సిద్ధవస్తువులయందు శబ్దమునకు బోధకత్వశక్తిని (అర్థమును బోధించుటకువలసిన శక్తిని)

గ్రహించుట మిక్కిలి సులభము. ఎట్లనగా—ఒకానొకవ్యక్తిచే చేతిని కదుపుట మున్నగు చేష్టాదులచే—'గదిలో కర్రకలదు' అని దేవదత్తునికి తెలియజేయుము – అని పంపబడినవాడై వేరొకడు – ఈ విషయమును తెలియజేయుటకుద్యమించినవాడై, 'గదిలో కర్రకలదు' అను శబ్దమును ప్రయోగించును. మూగవానివలె ఈ చేతినికదుపుట మున్నగు హస్త చేష్టను తెలిసికొని ప్రక్కనున్న మరియొకవ్యక్తి (మూఢవవాడు) పూర్వ మీవిషయమెఱుగనివాడైనప్పటికిని (ఈ శబ్దముల యర్థమునెరుగనివాడై నప్పటికిని)—ఈ విషయమును తెలియజేయుటకు – 'గదిలో కర్రకలదు' అను శబ్దముయొక్క ప్రయోగమును చూచినవాడగుటచే—'ఈ అర్థమునకు ఈ శబ్దము బోధకము (అనగా ఈ యర్థమును ఈ శబ్దము బోధించును) అని తెలిసికొనుచున్నాడు. కనుక ఇక్కడ కష్టమేమున్నది?

అట్లే (పూర్వము ప్రదర్శింపబడిన మూఢవవ్యక్తివలెనే) (ఒక) బాలుడు 'ఈయన తండ్రి' 'ఈమె అమ్మ' 'ఈయన మేనమామ' 'వీడు మనుష్యుడు' 'ఇది మృగము' 'ఇది చంద్రబింబము' 'ఇది పాము' అని తల్లి, తండ్రి మున్నగువారిచే శబ్దముల ప్రయోగించుటద్వారా మెల్లమెల్లగా వ్రేలితో చూపించుటచే ఆయాయి అర్థములందు చాల సారులు శిక్షింపబడినవాడై (నేర్పబడినవాడై), ఆ శబ్దములచేతనే (తల్లి దండ్రులచే పలుకబడిన శబ్దములచేతనే) ఆ యర్థములయందే (తల్లిదండ్రు లచే వ్రేళ్ళతో చూపబడిన అర్థములయందే) తనకును అర్థము తెలియు టను కనుగొని, ఆయాయి అర్థములందు ఆయాయి శబ్దముల వ్రేళ్ళతో నిర్దేశించుటద్వారా ప్రయోగించుట అనునది, వేరొక సంబంధము లేదు కనుకను, ఈ శబ్దమునకిది యర్థమని బోధకత్వశక్తిని నిర్ణయించిన పురుషు డెవ్వడో తెలియదు కనుకను, (ఇది కేవలము) ఆయాయి శబ్దముల కాయాయి అర్థములబోధించు శక్తియుండుటవలన కలిగినదని, క్రమ ముగా నిర్ణయించి, మరల 'ఈ శబ్దమునకిది యర్థము' అని వెనుకటి పెద్ద లచే నేర్పబడినవాడై, అన్ని శబ్దముల యర్థములను తెలిసికొని, తనంత

తానుగ సమస్త వాక్యసముదాయమును ప్రయోగించును. ఇట్లే అన్ని పదములు తమతమయర్థముల బోధించు లక్షణము కలవనియు, పద సముదాయములు అక్కడ వాస్తవముగనున్న పరస్పరసమన్వయ విశేషమును బోధించుట లక్షణముగా కలవనియు తెలిసికొనుచున్నాడు. కనుక, 'కార్యరూపమైన (క్రియారూపమైన) అర్థమందే వ్యుత్పత్తి (శబ్దములకు బోధకత్వము) కలదని' నిర్బంధించుట నిర్హేతుకమేయగును.

వివరణము:- పై గ్రంథమునుబట్టి క్రియతో లేక కార్యముతోకూడిన అర్థమునే శబ్దములు బోధింపవలయునను ప్రాభాకర మీమాంసకుల మతము సరికాదనియు, క్రియతో సంబంధములేని కేవలార్థములుకూడ అనగా, అమ్మ, నాన్న, మేనమామ, చంద్రుడు మున్నగు విడివిడి అర్థములుకూడ బోధింపబడవచ్చుననియు భగవద్రామానుజులు స్పష్టపరిచినారు.

మూ॥ అతః, పరినిష్పన్నే వస్తుని శబ్దస్య బోధకత్వశక్త్యవధారణాత్ సర్వాణి వేదాన్తవాక్యాని సకలజగత్కారణం సర్వకల్యాణ-గుణాకరమ్, ఉక్తలక్షణం బ్రహ్మ బోధయన్త్యేవ.

అనువాదము:- కనుక, ఇదివరకే సిద్ధించియున్న వస్తువును బోధించుటలో శబ్దమునకు శక్తి కలదని నిశ్చయింపబడినందున, సమస్తములైన వేదాన్తవాక్యములు (సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ ఇత్యాది శ్రుతి వచనములు) సమస్త జగత్తులకు కారణమైనదియు, సకలకల్యాణగుణములకు ఖనియైనదియునగు పూర్వము చెప్పబడిన లక్షణములుకల పరబ్రహ్మమును తప్పక బోధించుచున్నవి.

## -: కార్యార్థమందే శబ్దములకు శక్తినంగీకరించినను బ్రహ్మప్రతిపాదనము కుదురునని నిరూపించుట :-

మూ॥ అపిచ-కార్యార్థే ఏవవ్యుత్పత్తిరస్తు. వేదాన్తవాక్యాని-

బ్రహ్మోపాసన విషయ కార్యాధికృత విశేషణభూతఫలత్వేన, దుఃఖాసంభిన్న దేశవిశేషరూప స్వర్గాదివత్, రాత్రిసత్ర- ప్రతిష్ఠావత్, అపగోరణశతయాతనా సాధ్యసాధనభావవచ్చ, కార్యోపయోగితయైవ సర్వం బోధయన్తి।

తథాహి। 'బ్రహ్మవిదాప్నోతిపరమ్' ఇత్యత్ర బ్రహ్మోపాసనవిషయకార్యాధికృత విశేషణభూతఫలత్వేన బ్రహ్మప్రాప్తిః శ్రూయతే। పరప్రాప్తికామో బ్రహ్మవిద్యాత్ ఇతి। అత్రప్రాప్యతయా ప్రతీయమానం బ్రహ్మస్వరూపం తద్విశేషణం చ, సర్వం కార్యోపయోగితయైవ సిద్ధం భవతి। తదన్తర్గతమేవ జగతః సృష్టృత్వం, సంహర్తృత్వమ్, ఆధా- రత్వమ్, అంతరాత్మత్వమ్ ఇత్యాద్యుక్తమ్, అనుక్తం చ సర్వమితి, న కించిదనుపపన్నమ్। ఏవంచసతి మంత్రార్థ- వాదగతా హ్యవిరుద్ధాః అపూర్వాశ్చ అర్థాః సర్వే విధిశేష- తయైవ సిద్ధాభవన్తి।

అనువాదము:- మరియు, 'కార్యరూప'మగు నర్థమందే శబ్దమునకు బోధకత్వశక్తి కలదని యంగీకరింపవచ్చును. (అయినను) వేదాన్త వాక్యములు (బ్రహ్మవిదాప్నోతిపరమ్ ఇత్యాదులు) బ్రహ్మోపాసనమునకు విషయమైన కార్యరూపమగు నే అపూర్వమున్నదో దానియందు అధికృతుడైన (నియోగింపబడినవాడగు-నియోజ్యుడగు) పురుషుడు ఎవ్వడు కలడో వానికి విశేషణముగానున్న ఫలముగా అంతయు కార్యార్థమందుపయోగించునదిగనే సిద్ధించుచున్నది. ఎట్లనగా—ఎట్టి దుఃఖముతోను కూడియుండని దేశవిశేషమైన స్వర్గాదికమువలె, రాత్రిసత్రయాగమునకు ఫలమైన ప్రతిష్ఠవలె, బ్రాహ్మణుని చంపనుద్యమించుట-దానికి ఫలమైన నూరుసంవత్సరములు యమునిచే కల్పింపబడిన బాధననుభవింపవలసియుండుట అను నీ రెంటిటికిగల సాధ్యసాధనభావమువలెను (అని యెరుగవలయును).

ఎట్లన్నచో — 'బ్రహ్మవిదాప్నోతిపరమ్' (బ్రహ్మమునుపాసించినవాడు 'పరమును' (బ్రహ్మమును) పొందును) అనుచోటన-బ్రహ్మోపాసనమునకు విషయమైన ఏ కార్యము (అపూర్వము) కలదో దానికొరకు నియోగింపబడిన (అధికృతుడైన) పురుషునకు విశేషణమైన ఫలముగా 'బ్రహ్మప్రాప్తి' వినబడుచున్నది. 'పరమును పొందగోరువాడు బ్రహ్మమునుపాసింపవలయును' అని. ఇక్కడ పొందదగినదిగా అవగతమగుచున్న బ్రహ్మస్వరూపము దానికి విశేషణమైన అంశము ఇది అంతయు 'కార్యము'నకుపయోగించునదిగనే సిద్ధించుచున్నది. దానిలో చేరియున్నదే-జగత్తునకు స్రష్టయైయుండుట, సంహారకుడైయుండుట, ఆధారమైయుండుట, అంతరాత్మయైయుండుట, మున్నగునది చెప్పబడినది, చెప్పబడనిది అంతయు కలదుకనుక, ఇచ్చట దోషమేమియు (కుదరనిది ఏదియు) లేదు. ఈ ప్రకారముగ (ఇట్లంగీకరించినప్పుడు) మంత్రములయందును, అర్థవాదవాక్యములయందును చెప్పబడినవగు విరోధములేనివియు, (ప్రమాణాంతరముచే తెలియబడనివగుటచే) అపూర్వములునగు విషయములన్నియు విధికి అంగముగనే సిద్ధించుచున్నవి.

వివరణము:- ఈగ్రంథముచే ప్రాభాకరులంగీకరించిన అపూర్వమను కార్యమే వాక్యార్థమను వాదమునంగీకరించినను, విధింపబడు అపూర్వమను కార్యమునకంగములుగా (ఉపయోగపడునవిగా) సిద్ధవస్తువులు వేదవాక్యములచే ప్రతిపాదింపబడవలసినదేనని భగవద్రామానుజులు దృష్టాంతపురస్సరముగ నిరూపించినారు. ఈ అంశమును సమర్థించుటకై మూడుదృష్టాంతముల చూపినారు.

1. 'యజేతస్వర్గకామః' ఇత్యాది వాక్యములలో నిర్దేశింపబడిన స్వర్గమను ప్రదేశమెట్టిదో తెలియవలసియున్నది. లేనిచో స్వర్గమందు పురుషునకు ప్రవృత్తి కలుగదుకదా! దీనికొరకు స్వర్గవాక్యశేషమును పర్యాలోచింపవలయును. అదియేమనగా—

'యన్నదుఃఖేన సంభిన్నంనచగ్రస్త మనంతరమ్।
అభిలాషోపనీతంచ తత్ సుఖంస్వః పదాస్పదమ్॥

ఏ సుఖము దుఃఖముచే నెంతమాత్రము కూడియుండలేదో, తరువాతకూడ దుఃఖముతోకూడునదికాదో, కోరికచే పొందబడినదో అట్టి సుఖమే స్వర్గ స్థానమున కలదని భావము. ఇట్టి స్వర్గస్వరూపము తెలియనిదే ఎవ్వ డును దానికొరకు యాగాదుల నిర్వహింపయత్నింపడు కనుక స్వర్గస్వరూ పము, విధివాక్యమునగల (యజేత స్వర్గకామః ఇత్యాది చోటులందుగల) స్వర్గాది అర్థమునకు విశేషణముగా అన్వయించుచున్నది. ఇది సిద్ధరూప మైన అర్థమే.

2. 'విశ్వజితా యజేత.' (విశ్వజిత్తను యాగమునుచేసి అపూర్వ మును పొందవలయును) అనువాక్యముచే విశ్వజిత్తను పేరుగల యాగము విధింపబడినది. మరి యీయాగమునకు ఫలమేమి అని పర్యాలోచన మొనర్పగా యాగమును విధించిన వాక్యమున ఫలమేమియు వినబడ కున్నను—"సః స్వర్గఃస్యాత్ సర్వాన్ ప్రత్యవిశిష్టత్వాత్" 'అది స్వర్గమే యగును అందరకు అది సమానమేకనుక' అను న్యాయమునుబట్టి 'స్వర్గ కామః' అనుపదము అధ్యాహారముచేసికొన (తెచ్చిపెట్టుకొన) బడినది. దీనివలెనే రాత్రిసత్రమని పిలువబడు యాగములను విధించునట్టి 'త్రిసో రాత్రీరుపయన్తి' అను విధివాక్యమున రాత్రిసత్రమునకెట్టి ఫలము విన బడుటలేదుకనుక—పూర్వము నిర్దేశించిన విశ్వజిన్న్యాయమునుబట్టి ఇక్కడకూడ స్వర్గమునే ఫలముగా కల్పింపవలయునా? అనిశంకించి— పూర్వమీమాంసలోని నాల్గవ అధ్యాయము-మూడవపాదము-ఎనిమిదవ అధికరణమున—4-3-8—అర్థవాదవాక్యమునగల ఫలమే యిచ్చట సన్ని హితముకనుక అన్వయింపవలయునని చెప్పబడినది. 'ప్రతితిష్ఠతి హవా యఏతా రాత్రీరుపయన్తి' ఎవ్వరీ రాత్రిసత్రయాగముల నాచరింతురో వారు ప్రతిష్ఠనొందుదురు' అనునది అర్థవాదవాక్యము. ఇక్కడగల 'ప్రతిష్ఠ' అనునదే రాత్రిసత్రయాగఫలమని తాత్పర్యము. ఇక్కడ

కూడ సిద్ధార్థమైన ప్రతిష్ఠ అనునది విధివాక్యమునగల యాగముతో అన్వయించినది.

3. "తస్మాద్బ్రాహ్మణాయనాపగురేత' 'కనుక బ్రాహ్మణుని ఉద్దేశించి హననోద్యమము చేయరాదు' (చంపయత్నింపరాదు) అను నిషేధ వాక్యమున—ఇట్లు బ్రాహ్మణుని చంపుటకేల ఉద్యమింపరాదో చెప్పబడ లేదు. కాని—'యో బ్రాహ్మణాయ అపగురుతే తంశతేన యాతయాత్' (ఎవ్వడు బ్రాహ్మణు నుద్దేశించి చంపనుద్యమించునో (గురీ ఉద్యమనే అను ధాతువునకు చంపనుద్యమించుట యనియర్థము) వానిని శతసంవత్సరములు యమబాధననుభవింపజేయవలయును) అను అర్థవాద వాక్యమునగల "శత యాతన'యను ఫలము అన్వయించుచున్నది. యాతనా శబ్దమునకు యమబాధయని అర్థము—అధ్వరమీమాంసా కుతూహల వృత్తి లోను, పార్థసారథిమిశ్రుల శాస్త్రదీపికకుగల వ్యాఖ్యలోను యీఅర్థమే చెప్పబడినది. చూ. పుట. 'అధ్వరమీమాంసాకుతూహలవృత్తి' 367— 'యో బ్రాహ్మణ మవగురేత (హన్తు ముద్యుంజీత) స శతసంవత్సరైః అనుభవితవ్యాం యాతనాం ప్రాప్నుయాత్' (ఎవ్వడు బ్రాహ్మణుని చంపనుద్యమించునో వాడు నూరుసంవత్సరములు అనుభవింపదగు యాతనను పొందును)

'తం సంవత్సర శతేన నిస్తార్యాం యాతనామను భావయేదిత్యర్థః' (వానిని నూరు సంవత్సరములలో ననుభవింపదగు యాతనను పొందింపవలయునని భావము) (శాస్త్రదీపిక పై సోమనాథీయమయూఖమాలికా. పుట. 269)

కొందరిట్లుకాక నూరురూప్యముల దండనమని, నూరు బంగారు కాసుల దండనమనియు అర్థమును వ్రాసిరి. దానికి ప్రమాణమేమో తెలియదు.

పైని పేర్కొనబడిన స్థలములందిట్లు విధివాక్యములయందుగల

అర్థమునకు ఉపయోగిగా అర్థవాదాదులందుగల అర్థమన్వయింపబడినదో అట్లే 'బ్రహ్మవిదాప్నోతిపరమ్' అను బ్రహ్మోపాసనవిధియందు అధికారి యగు పురుషునకు ప్రాప్యమగు బ్రహ్మప్రాప్తిరూపమగు ఫలములోచేరిన బ్రహ్మముయొక్కయు, బ్రహ్మమునగల గుణగణాదులయొక్కయు బోధ నమును వేదాన్తవాక్యములగు 'సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ' ఇత్యాదులు చేయుచున్నవికనుక, కార్యార్థవాదులమతమందుకూడ బ్రహ్మస్వరూపము, తద్గుణాదులకన్వయము తప్పదని భగవద్రామానుజతాత్పర్యము.

మూ॥ యథోక్తం—ద్రమిడభాష్యే—"ఋణం హి వై జాయతే — ఇతి శ్రుతేః" ఇత్యుపక్రమ్య—"యద్యప్యవదానస్తుతిపరం వాక్యం, తథాపి నాసతాస్తుతిరుపపద్యతే" ఇతి। ఏతదుక్తం భవతి— సర్వోహ్యర్థవాదభాగః దేవతారాధనభూతయాగాదేః సాం— గస్య, ఆరాధ్యదేవతాయాశ్చ అదృష్టరూపాన్ గుణాన్ సహస్రశోవదన్ కర్మణి ప్రాశస్త్యబుద్ధిముత్పాదయతి। తేషామసద్భావే ప్రాశస్త్యబుద్ధిరేవ నస్యాత్ ఇతి కర్మణి ప్రాశస్త్యబుద్ధ్యర్థం గుణసద్భావమేవ బోధయతి ఇతి। అనయైవదిశా సర్వమంత్రార్థవాదగతాహ్యర్థాః సిద్ధాః॥

అనువాదము:— ద్రమిడాచార్యుని భాష్యమున నిట్లు చెప్పబడినది— 'ఋణమేర్పడుచున్నదికదా!' అని ప్రారంభించి—"వాస్తవమునకు అవదాన స్తుతిని (యాగములందు సమర్పింపబడుదానిని స్తుతించుటను)బోధించునదే యీవాక్యము, అయినప్పటికిని, లేనిదానితో స్తుతించుట కుదరదు" అని. ఇది చెప్పబడినట్లైనది—సమస్తమగు అర్థవాదభాగము (అర్థవాదమనగా స్తుతి- నిందాబోధకమైన వేదభాగము) దేవతారాధనమైన అంగములతోకూడిన యాగాదులయొక్కయు, ఆరాధింపబడు దేవతయొక్కయు, కంటికగుపింపని వేలాది గుణములను చెప్పునదై యాగాదికర్మమందు ప్రశస్తతా బుద్ధిని (ఇది ప్రశస్తమైనదియను జ్ఞానమును) కలిగించుచున్నది. ఈ యర్థ వాదభాగములు లేనిచో ఈ యాగము ప్రశస్తమైనది (గొప్పది) అను

బుద్ధియే కలుగదుకనుక, కర్మమందు (యాగాదికమందు) ప్రాశస్త్య జ్ఞానమును పుట్టించుటకై గుణములున్నవనుటను బోధించుచున్నది అని. ఈ రీతిగనే సమస్తమంత్రములయందును అర్థవాదవాక్యములందునుగల విషయములన్నియు సిద్ధించుచున్నవికదా!

మూ॥ అపిచ, కార్యార్థవాదిభిః 'కిమిదం కార్యత్వంనామ?' ఇతి వక్తవ్యమ్। 'కృతిభావభావితా-కృత్యుద్దేశ్యతాచ' ఇతిచేత్, కిమిదం కృత్యుద్దేశ్యత్వమ్? 'యదధికృత్యకృతిః వర్తతే, తత్కృత్యుద్దేశ్యత్వమ్' ఇతిచేత్, పురుషవ్యాపారరూపాయాః కృతేః కోఽయమధికారోనామ? యత్ప్రాప్తీచ్ఛయాకృతి-ముత్పాదయతి పురుషః, తత్కృత్యుద్దేశ్యత్వమ్' ఇతిచేత్, హన్త! తర్హి ఇష్టత్వమేవకృత్యుద్దేశ్యత్వమ్।

అనువాదము:- మరియు, కార్యార్థమందే శబ్దములకు బోధకత్వము కలదని వాదించు (ప్రాభాకర) మీమాంసకులచే కార్యత్వము (కార్యమై యుండుట) అనగానేమో చెప్పవలయును. 'కృతియొక్క (ప్రయత్నముయొక్క) ఉనికిచే పుట్టుట, కృతికి (ప్రయత్నమునకు) ఉద్దేశింపబడి (లక్ష్యముగాచేయబడి) యుండుటయే కార్యత్వము' అని యన్నచో, 'కృతికి ఉద్దేశింపబడియుండుట' (కృత్యుద్దేశ్యత్వమ్) అనగానేమి? 'దేనిని సాధ్యముగా (లక్ష్యముగా) ఆశ్రయించి పురుషుని ప్రయత్నము (కృతి) సాగుచున్నదో అదియే ఆ ప్రయత్నమునకు (కృతికి) ఉద్దేశింపబడి యుండుట' అనియన్నచో, పురుషునికి సంబంధించిన క్రియయైన కృతికి (ప్రయత్నమునకు) అధికారమనగా నెట్లుండును? (పురుషబుద్ధిరూపమైన అధికారము, పురుషవ్యాపారమునకు అనగా కృతికి సంభవముకాదని అభిప్రాయము) 'దేనిని పొందవలయునను కోరికచే పురుషుడు (వ్యక్తి) ప్రయత్నము చేయుచున్నాడో అదియే కృతికి ఉద్దేశ్యమైయుండుట

(కృత్యుద్దేశ్యత్వము) అనియన్నచో, అయ్యో! అప్పుడు 'ఇష్టమైయుండుటయే' (ఇష్టత్వమే) 'కృతికి (ప్రయత్నమునకు) ఉద్దేశ్యమైయుండుట' (కృత్యుద్దేశ్యత్వము) అని తేలినది.

వివరణము:- 'కృతిసాధ్యం ప్రధానంయత్ తత్కార్యమభిధీయతే' 'ప్రయత్నముచే సాధింపబడినదై యేది ప్రధానమైయున్నదో అదియే కార్యమని చెప్పబడుచున్నద'ను శాలికనాథుని ప్రకరణపంజికలోని వచనము. ఈ లక్షణము ఖండింపబడుచున్నది. ప్రాభాకరమీమాంసకులు 'కృత్యుద్దేశ్యత్వమ్' అనుదానిని కృతికర్మత్వము (ప్రయత్నముచే ప్రధానముగ సాధింపబడుట) కృతిమత్పురుషానుకూలత్వము (ప్రయత్నమొనర్చు పురుషునకు అనుకూలమైయుండుట) కృతిశేషిత్వము, కృతిప్రయోజనత్వము అని అనేక విధములుగా వ్యవహరించుచున్నారు. ఈ లక్షణములనన్నిటిని భగవద్రామానుజులు ఖండించుచున్నారు.

మూలమున అధికారః అని నిర్దేశింపబడినది. తనయొక్క ప్రయోజనమును సాధించునట్టి సాధనముకనుక, 'తనది' (స్వకీయము) అను బుద్ధియే అధికారము. ఇట్టి పురుషబుద్ధిరూపమగు నధికారము పురుషవ్యాపారమైన (క్రియయైన) కృతికి (ప్రయత్నమునకు) సంభవింపదని యభిప్రాయము. కృతియనగా ప్రయత్నమని యర్థము.

మూ॥ అథైవం మనుషే. 'ఇష్టస్యైవరూపద్వయమస్తి, ఇచ్ఛావిషయతయాస్థితిః. పురుషప్రేరకత్వంచ. తత్ప్రేరకత్వాకారః కృత్యుద్దేశ్యత్వమ్' ఇతి। సోఽయం స్వపక్షాభినివేశకారితః వృథాశ్రమః॥ తథాహి—ఇచ్ఛావిషయతయా ప్రతీతస్య స్వ-ప్రయత్నోత్పత్తిమంతరేణ అసిద్ధిరేవ, ప్రేరకత్వం, తత ఏవప్రవృత్తేః॥ ఇచ్ఛాయాం జాతాయామ్ ఇష్టస్య స్వప్రయ-త్నోత్పత్తిమంతరేణ అసిద్ధిః ప్రతీయతేచేత్, తతః చికీర్షా జాయతే, తతః ప్రవర్తతేపురుషః, ఇతితత్త్వవిదాంప్రక్రియా।

**తస్మాత్ ఇష్టస్య కృత్యధీనాత్మలాభత్వాతిరేకి కృత్యుద్దేశ్య-త్వం నామ కిమపి నదృశ్యతే।**

అనువాదము:- ఇక యిట్లు భావింతువా? (ఎట్లనగా) 'ఇష్టమను దానికి రెండు రూపములున్నవి. కోరికకు విషయమైయుండుట, పురుషుని ప్రేరించుట. ఇక్కడ పురుషుని ప్రేరించుట అను స్వరూపముకల 'ఇష్టమే' కృత్యుద్దేశ్యత్వము (ప్రయత్నమునకు సాధ్యమైయుండుట)' అని. ఇది నీ పక్షమందుకల విశేషప్రీతిచే కలిగిన వ్యర్థమగు శ్రమమే. ఎట్లనగా-ఇచ్ఛకు (కోరికకు) విషయముగా తెలియబడినదానికి, తన ప్రయత్నములేనిచో సిద్ధిలేకపోవుట అనునదియే ప్రేరకత్వమనబడును. దీనివల్లనేకదా (పురుషుడు) ప్రవర్తించుట. 'కోరిక పుట్టినతరువాత తన కభిమతమైనది (ఇష్టమైనది) తన ప్రయత్నములేనిదే సిద్ధింపదని తోచినప్పుడు, దానివలన-పనిచేయవలయునను కోరికకల్గును. ఆ కారణము వలననే పురుషుడు ప్రవర్తించును అని తత్త్వమునెరిగిన పెద్దల ప్రక్రియ (విధానము), కనుక, 'ఇష్టమైనదానికి (తాను కోరినదానికి) తన ప్రయత్నమువలననే సిద్ధించుట' అనుదానికంటె వేరుగా 'ప్రయత్నసాధ్యమగుట' (కృత్యుద్దేశ్యత్వము) అనునది ఏమియు కన్పట్టుటలేదు.

వివరణము:- ఇంతవరకు 'ఇష్టమే' 'కృతిసాధ్యము'ని చెప్పబడినది.

**మూ॥ అథోచ్యేత - ఇష్టతాహేతుశ్చ పురుషానుకూలతా। తత్ పురుషానుకూలత్వం కృత్యుద్దేశ్యత్వమితి। నైవం, పురుషానుకూలం సుఖమిత్యనర్థాంతరమ్। తథా పురుషప్రతికూలం దుఃఖపర్యాయమ్। అతః సుఖవ్యతిరిక్తస్య కస్యాఽపి పురుషానుకూలత్వం న సంభవతి। ననుచ దుఃఖనివృత్తేరపి, సుఖవ్యతిరిక్తాయాః పురుషానుకూలతాదృష్టా। నైతత్। 'ఆత్మానుకూలం సుఖమ్, ఆత్మప్రతికూలం దుఃఖమ్' ఇతిహి సుఖదుఃఖయోఃవివేకః। తత్రాత్మానుకూలం సుఖమ్ ఇష్టం**

భవతి. తత్ప్రతికూలం దుఃఖంచ అనిష్టమ్। అతః దుఃఖ సంయోగస్య అసహ్యతయా తన్నివృత్తిరపి ఇష్టాభవతి, తత ఏవ ఇష్టతాసామ్యాత్ అనుకూలతాభ్రమః।

తథాహి। ప్రకృతిసంసృష్టస్య సంసారిణః పురుషస్య అనుకూలసంయోగః, ప్రతికూలసంయోగః, స్వరూపేణావస్థితిః ఇతి తిస్రః అవస్థాః। తత్ర ప్రతికూలసంబంధనివృత్తిః, అనుకూలసంబంధనివృత్తిశ్చ స్వరూపేణ అవస్థితిరేవ। తస్మాత్ ప్రతికూలసంయోగే వర్తమానే తన్నివృత్తిరూపా స్వరూపేణావస్థితిరపి ఇష్టాభవతి, తత్ర ఇష్టతాసామ్యాత్ అనుకూలతాభ్రమః। అతః సుఖస్వరూపత్వాదనుకూలతయాః నియోగస్యఅనుకూలతాం వదన్తం ప్రామాణికాః పరిహసన్తి।

అనువాదము:- ఇక నిట్లుచెప్పవచ్చును (ఎట్లన్నచో) 'ఇదిఇష్టము అనుకొనుటలో, అది పురుషునకనుకూలమై యుండుటే కారణము. కనుక పురుషున కనుకూలమైయుండుటే కృత్యుద్దేశ్యత్వము (అనగా ప్రయత్న సాధ్యత్వము)' అని. ఇదియిట్లుకాదు. పురుషునకు అనుకూలమైనది-సుఖము-అనుట ఒక్కటే. (అనగా పురుషానుకూలమన్నను-సుఖము అన్నను ఒక్కటేనని తాత్పర్యము). ఇట్లే పురుషునకు ప్రతికూలమైనది (విరుద్ధమైనది) అనుట దుఃఖమునకు పర్యాయము (పురుష ప్రతికూలము-దుఃఖము రెండును ఒక్కటేనని భావము) కావున సుఖముకంటె వేరైన దేనియు పురుషానుకూలమనుట సంభవింపదు. 'మరి, సుఖముకంటె వేరైన-దుఃఖము తొలగుట (దుఃఖనివృత్తి) అనునదికూడ పురుషానుకూలముగనే కన్పట్టినదికదా!' ఇదికాదు. తనకు అనుకూలమైనది సుఖము, తనకు ప్రతికూలమైనది (విరుద్ధమైనది) దుఃఖము అనికదా సుఖదుఃఖము లనువాటికిగల స్వరూపభేదము। ఇక్కడ (వీటిలో) పురుషునకనుకూలమైన సుఖమే ఇష్టమగుచున్నది, దానికంటె ప్రతికూలమైన దుఃఖము అనిష్టమగుచున్నది. కనుక, దుఃఖముయొక్క సంబంధము సహింపరానిదగుటచే

అది తొలగిపోవుట అనునదికూడ ఇష్టమే యగుచున్నది. ఈ కారణము వలననే దుఃఖనివృత్తియందు ఇష్టముయొక్క సామ్యము (పోలిక) కలదు కనుక అనుకూలమను భ్రాంతిపుట్టుచున్నది.

ఎట్లన్నచో— ప్రకృతితో సంబంధమునుపొందిన సంసారియైన జీవునకు మూడు అవస్థలున్నవి. అవి ఏవన్నచో అనుకూలసంయోగము, ప్రతికూల సంయోగము, (అదియు, ఇదియు రెండును లేకపోవుటయను) స్వరూపావస్థితి (స్వస్వరూపముతో సుఖదుఃఖములు రెండును లేకయుండుట). ఇక్కడ ప్రతికూలసంబంధము తొలగిపోవుట, అనుకూలసంబంధము తొలగిపోవుట అనునది స్వరూపావస్థితియే. కావున ప్రతికూలమైనదాని సంబంధమున్నప్పుడు అది తొలగిపోవుటయను స్వరూపావస్థితియే ఇష్టమగుచున్నది. ఇక్కడ (సుఖమందువలెనే) ఇష్టత్వము సమానముగానున్నదికనుక ఇదియు అనుకూలమేనను భ్రాంతికలుగుచున్నది. కనుక, అనుకూలత యనునది సుఖస్వరూపముకనుక (దీనికంటె వేరైన) నియోగము (విధి లేక ప్రేరకత్వము) అనుదానికి అనుకూలత్వమును చెప్పువానిని, ప్రమాణము నాశ్రయించిన పెద్దలు పరిహాసమొనర్చుదురు.

వివరణము:— పూర్వము కృత్యుద్దేశ్యమనగా 'ఇష్టము' అనునర్థము ఏర్పడినదని భగవద్రామానుజులు చెప్పిరి. ఇప్పుడు దానికి 'సుఖము' అనునదియే పర్యవసితార్థమనియు, అదియే పురుషానుకూలమనియు భగవద్రామానుజులు నిరూపించినారు. కనుక సుఖము లేక ఇష్టము అనుదానికంటె కృత్యుద్దేశ్యమనునది వేరుగనేదియులేదు కనుక, 'నియోగమే' (విధి లేక ప్రేరకత్వమే) కృత్యుద్దేశ్యమనుట యుక్తముకాదని ఖండించినారు.

కార్యవాక్యార్థవాదులు కార్యమునే అనగా అపూర్వమునే వాక్యార్థమనిరనియు, ఈ అపూర్వమనుకార్యమే పురుషుని క్రియలో నియోగించునదికనుక, 'నియోగము' అని వ్యవహరింపబడుననియు, ఇదియే పురుషుని ప్రవర్తింపజేయునదికనుక 'ప్రవర్తకము' అనికూడ వ్యవహరింప

బడుననియు పూర్వమే చెప్పియుంటిని. ఇది సరికాదని భగవద్రామానుజుల యభిప్రాయము.

మూ॥ ఇష్టస్య అర్థవిశేషస్య నివర్తకతయైవ హి నియోగస్య నియోగత్వం, స్థిరత్వమ్, అపూర్వత్వంచ ప్రతీయతే। 'స్వర్గకామోయజేత' ఇత్యత్ర కార్యస్య క్రియాతిరిక్తతా స్వర్గకామపదసమభివ్యాహారేణ స్వర్గసాధనత్వనిశ్చయాదేవభవతి। నచవాచ్యం 'యజేత' ఇత్యత్ర ప్రథమం నియోగః స్వప్రధానతయైవ ప్రతీయతే। స్వర్గకామపదసమభివ్యాహారాత్ స్వసిద్ధయే స్వర్గసిద్ధ్యనుకూలతాచ నియోగస్య ఇతి। 'యజేత' ఇతిహి ధాత్వర్థస్య పురుషప్రయత్నసాధ్యతా ప్రతీయతే। స్వర్గకామపదసమభివ్యాహారాదేవధాత్వర్థాతిరేకిణో నియోగత్వం, స్థిరత్వమ్, అపూర్వత్వంచ ఇత్యాది అవగమ్యతే। తచ్చ స్వర్గసాధనత్వప్రతీతి నిబన్ధనమ్। సమభివ్యాహృత స్వర్గకామపదార్థాన్వయయోగ్యం స్వర్గసాధనమేవ కార్యం లిజాదయోఽభిదధతి ఇతిహిలోకవ్యుత్పత్తిరపి తిరస్కృతా।

అనువాదము:- 'ఇష్టమైన' అర్థమును నెరవేర్చుటద్వారముననే 'నియోగము' (కార్యము లేక అపూర్వము) అనుదానికి నియోగమను వ్యవహారమనియు, అది స్థిరమైనదనియు, అదియే అపూర్వమనియు తెలియుచున్నది. 'స్వర్గకాముడు' (స్వర్గఫలమును కోరువాడు) యాగమును చేయవలయును (స్వర్గకామోయజేత) అనుచోటున కార్యమనునది క్రియకంటె (యాగాదికముకంటె) వేరైనదనుట – 'స్వర్గకామ' అను పదముయొక్క సన్నిహితత్వముచేతను, స్వర్గమునకిది సాధనమని నిశ్చయించుటవలనను ఏర్పడుచున్నది. "మరి, 'యజేత' (యాగమును చేయవలయును) అనుచోటున, మొట్టమొదట 'నియోగమే' (ప్రేరకత్వమే) తనంతతాను ప్రధానముగా స్ఫురించుచున్నది. 'స్వర్గకామ' పదముయొక్క సాన్నిహిత్యముచే (అన్వయముచే) తాను సిద్ధించుటకే,

నియోగము (ప్రేరకత్వరూపమగు అపూర్వకార్యము) స్వర్గసిద్ధికి అనుకూలముకూడనగుచున్నదికదా!" అని యనుట కుదరదు. 'యజేత' అను చోటున 'యజ్' అను ధాతువుయొక్క అర్థమైన యాగక్రియ పురుషుని యొక్క ప్రయత్నముచేతనే సాధింపబడుననుట తెలియుచున్నదికదా! 'స్వర్గకామః' (స్వర్గమును కోరువాడు) అను పదముయొక్క సాన్నిహిత్యమువలననే ధాతువుయొక్క (యజ్ అనుదానియొక్క) అర్థమైన యాగాదిక్రియకంటె వేరైన అంశమునకే నియోగత్వము (ప్రేరించునదగుట) స్థిరత్వము (కాలాన్తరమునకలుగు స్వర్గాదుల సాధించునదగుట) అపూర్వత్వము (ఇతర ప్రమాణములచే తెలియరానిదై లౌకికక్రియలకంటె స్థిరసాధనమైయుండుట) మున్నగునది తెలియుచున్నది. అది 'స్వర్గమును సాధించుటకు సాధనము' అను జ్ఞానమునే కారణముగా చేసికొని యేర్పడినది. సన్నిహితముగా అన్వయించిన 'స్వర్గకామః' అనుపదము యొక్క అర్థముతో అన్వయించుటకు యోగ్యమైన స్వర్గసాధనరూపమగు 'కార్యము'నే, 'లిజ్' మొదలగు (యజేత అనుచోటునగల 'త' మున్నగు) విధిబోధక ప్రత్యయములు బోధించుచున్నవి. ఇట్టి లోకసిద్ధమగు అర్థబోధకత్వముకూడ (నియోగప్రాధాన్యవాదిచే) తిరస్కరింపబడినది.

వివరణము:- 'ఆత్మసిద్ధ్యనుకూలస్య నియోజ్యస్య ప్రసిద్ధయే।
కుర్వత్ స్వర్గాదికమపి ప్రధానం కార్యమేవనః॥' అను 'ప్రకరణ పంజికా' వచనమునుబట్టి ప్రాభాకరుల యభిప్రాయమిట్లు తెలియుచున్నది. 'నియోగమనగా అపూర్వమని పిలువబడు కార్యమే. ఆ నియోగము 'యజేత' ఇత్యాదిస్థలములలో విధిప్రత్యయమగు లిజ్ అనుదానిచే (యజ్ -ధాతువు; త = విధిప్రత్యయము) ప్రధానముగా బోధింపబడుచున్నది. ఈ నియోగమే సుఖరూపమనియు అందువలననే స్వతః ఇష్టమనియు అంగీకరింపబడుచున్నది. తన ప్రాధాన్యమును రక్షించుకొనుటకై తనను (నియోగమును) సాధించుచున్న పురుషునకు ఆ నియోగమే (అపూర్వమే) స్వర్గఫలము నిచ్చుచున్నది. ఎట్లుగ—తనయొక్క ప్రాధాన్యమును

నిర్వహించుకొనుటకై ప్రభువు తన భృత్యులకు వారికిష్టమైన వాటి నిచ్చునో, అట్లే ఇదియు. ఎట్లనగా–రాజకీయపురుషులు రాజునకు అతిశయమును కల్గించుటకై ఎట్లు సేవాదులనొనర్తురో అట్లే నియోగరూపమగు సుఖము సిద్ధించుటకై యాగాది క్రియ (పురుషునిద్వారా) ప్రవర్తించుచున్నదని 'నియోగమే సుఖరూపమగు అపూర్వము'ని వాదించువారి అభిప్రాయము.

ఇది సరికాదని భగవద్రామానుజసిద్ధాన్తము. నియోగము సుఖరూపము కాదనియు, లిఙాదులచే అది బోధింపబడదనియు, 'యజేత స్వర్గకామః' అను రెండుపదముల సమన్వయమునుబట్టి యాగాదిక్రియయందు గల స్వర్గసాధనత్వమే లిఙాదులచే బోధింపబడునని వారియభిప్రాయము. ఇది లోకవ్యుత్పత్తిసిద్ధమని వారి తాత్పర్యము. 'యజ్ దేవపూజాయామ్' (యజ్ అనగా దేవతలనారాధించుట యని అర్థము) అను పాణినీయానుశాసనమునుబట్టి దేవతాప్రీతికరమగు దేవతారాధనరూపమగు క్రియకే స్వర్గసాధనత్వము (స్వర్గముసాధించుటయనునది) కలదుకనుక, దేవతాప్రీతినే ద్వారముగాచేసికొని యాగాదిక్రియలు సాధనములని చెప్పుటకవకాశముండగా 'అపూర్వము లేక నియోగము అనుదానిని కల్పించి అదియే స్వర్గాదులనిచ్చుననుటగాని, నియోగమే లిఙ్ మున్నగు ప్రత్యయములనే ప్రధానముగా బోధింపబడుననుటకాని తగదని భగవద్రామానుజసిద్ధాంతము. ఇదియే ముందుముందు తెల్పగా విశదపరుపబడినది. (ఈ శ్లోకములకు అనంతార్యప్రణీతమైన వేదాన్తవాదావళిలోని శాస్త్రారంభసమర్థనమను ఘట్టము చూడనగును. పు 8-9. (పరిశిష్టము).

మూ॥ ఏతదుక్తం భవతి – సమభివ్యాహృతపదాన్తరవాచ్యాన్వయయోగ్యమేవ ఇతరపదప్రతిపాద్యమ్ ఇతి అన్వితాభిధాయిపదసంఘాతరూపవాక్యశ్రవణసమనన్తరమేవ ప్రతీయతే। తచ్చ స్వర్గసాధనరూపమ్. అతః క్రియావత్ అనన్యార్థతాఽపి విరోధాదేవ పరిత్యక్తా ఇతి। అతఏవ 'గంగాయాం

ఘోషః' ఇత్యాదౌ ఘోషప్రతివాసయోగ్యార్థోపస్థాపన-
పరత్వం గంగాపదస్య ఆశ్రీయతే। ప్రథమం గంగాపదేన
గంగార్థః స్మృతఇతి గంగాపదార్థస్యాపేయత్వం నవాక్యార్థా-
న్వయిభవతి। ఏవమత్రాపి 'యజేత' ఇత్యేతావన్మాత్రశ్రవణే
కార్యమనన్వార్థంస్మృతమితి వాక్యార్థాన్వయసమయే కార్య-
స్య అనన్వార్థతా నావతిష్ఠతే।

కార్యాభిధాయిపదశ్రవణవేలాయాం ప్రథమం కార్య-
మనన్వార్థం ప్రతీతమిత్యేతదపినసంగచ్ఛతే। వ్యుత్పత్తికాలే,
గృహానయనాదిక్రియాయాః దుఃఖరూపాయాః ఇష్టవిశేష
సాధనతయైవ కార్యతాప్రతీతేః। అతః నియోగస్య పురు-
షానుకూలత్వం సర్వలోకవిరుద్ధమ్, నియోగస్య సుఖరూప-
పురుషానుకూలతాం వదతః స్వానుభవవిరోధాచ్చ। 'కారీర్యా
వృష్టికామోయజేత' ఇత్యాదిషు సిద్ధేఽపినియోగే వృష్ట్యాదిసిద్ధి
నిమిత్తస్య వృష్టివ్యతిరేకేణ నియోగస్య అనుకూలతానాను-
భూయతే। యద్యపి అస్మిన్ జన్మని వృష్ట్యాదిసిద్ధేరనియమః
తథాపి అనియమాదేవనియోగసిద్ధిః అవశ్యాశ్రయణీయా।
తస్మిన్ అనుకూలతాపర్యాయసుఖానుభూతిః నవిద్యతే।
ఏవమ్ ఉక్తరీత్యా కృతిసాధ్యేష్టత్వాతిరేకి కృత్యుద్దేశ్యత్వమ్
నదృశ్యతే।

అనువాదము:- ఇది చెప్పబడినట్లగుచున్నది. 'సన్నిహితముగా ఉచ్చరించిన వేరొకపదముయొక్క వాచ్యార్థముతో (ముఖ్యార్థముతో) అన్వయించుటకు యోగ్యతకల అర్థమే వేరొకపదముచే ప్రతిపాదింపబడును.' అని-పరస్పరము అన్వయించిన పదములయొక్క సముదాయరూపమైన వాక్యమును విన్నవెంటనే స్ఫురించుచున్నది. (వాక్యములో గల పదములలో ప్రతిపదము తనతోకలిపి ఉచ్చరింపబడిన వేరొక పదముచే బోధింపబడిన అర్థముతో అన్వయించుటకు యోగ్యతగల యర్థ

మునే బోధించునని తాత్పర్యము). అది (యజేత స్వర్గకామః అను చోటున) స్వర్గమునకు సాధనమగుటయనునదే. కనుక కేవలక్రియను విడిచినట్లుగనే నియోగమునకుగల ప్రాధాన్యముకూడ విడువబడినది. కనుకనే 'గంగలో గొల్లపల్లి కలదు' ఇత్యాది స్థలములందు గొల్లపల్లి యుండుటకు యోగ్యమైన 'తీరము' అను అర్థముయొక్క ప్రతిపాదన మొనర్చుట అనునదియే, గంగాపదమునకు ఆశ్రయింపబడినది. మొదట గంగా పదముచే గంగాజలప్రవాహరూపమగు నర్థము స్మరింపబడినంత మాత్రమున, గంగాపదముయొక్క అర్థమైన జలముయొక్క పాన యోగ్యత్వము వాక్యార్థముతో అన్వయింపదుకదా! ఇట్లే ఇక్కడకూడ (యజేత స్వర్గకామః అనుచోటునకూడ) 'యజేత' అనుపదము వినబడినంత మాత్రమున నియోగరూపమగు అర్థము ప్రధానముగ స్ఫురించినంత మాత్రమున వాక్యార్థముతో అన్వయించు సమయమునకూడ (అనగా వాక్యములోని యితర పదములతో అన్వయించినప్పుడు కూడ) కార్యరూపమగు నియోగమునకు ప్రాధాన్యము ఎంతమాత్రము ఉండదు.

'కార్యమును బోధించు (నియోగమును లేక ప్రేరకత్వమును బోధించు) పదమును (యజేత ఇత్యాదిపదమును) విన్నసమయమున నియోగరూపమగు కార్యము ప్రధానముగ స్ఫురించు'ననుమాటకూడ కుదరదు. 'గోవునుతెమ్ము' ఇత్యాది నియోగవాక్యమును విని, పదముల యొక్క అర్థమును తెలిసికొనుసమయమున (వ్యుత్పత్తికాలమున), గోవును తెచ్చుట అను క్రియ దుఃఖరూపముకనుక అది ఇష్టమునకు సాధనమగుటవలననే కార్యమని వ్యవహరింపబడుచున్నదికదా! కనుక నియోగము (ప్రేరకత్వము—అనగా 'ఇదిచేయుము' అని నియోగించుట) అనునది పురుషునికి అనుకూలమనుట సర్వలోకవిరుద్ధము. నియోగమునునది సుఖాత్మకమై పురుషానుకూలమనుట తన యనుభవమునకుకూడ విరుద్ధమే. ('ఇదిచేయుము' అని విధించుటవలన ప్రవర్తించుటయనునది అందరకు దుఃఖకారణమేకాని సుఖకారణముకాదని తాత్పర్యము.) 'కారీర్యావృష్టి

కామోయజేత' (వర్షముకావలెనని కోరువాడు కారీరియను యాగమును చేయవలయును), ఇత్యాదిస్థలములందు నియోగము (ప్రేరకత్వము) సిద్ధించినప్పటికిని, వర్షము మున్నగునది సిద్ధించుటకు కారణమైన నియోగమునకు, వర్షముకంటె వేరుగ అనుకూలతయనునదేదియు అనుభవగోచరముకాదు. వాస్తవమునకు ఈ జన్మలోనే వర్షము కలుగుననుట కెట్టి నియమములేదు, అయినప్పటికిని ఎట్టి నియమము లేకయే నియోగము సిద్ధించినట్లు తప్పక ఆశ్రయింపవలసినదే. ఈ నియోగమందు సుఖమని పిలువబడు అనుకూలతయొక్క అనుభవమెంతమాత్రము లేదు. ఈ విధముగ పూర్వము చెప్పినట్లు కృతిచే (ప్రయత్నముచే) సాధింపదగు ఇష్టత్వము (ఇష్టమైయుండుట) అనుదానికంటె వేరుగ 'కృత్యుద్దేశ్యత్వము' (ప్రయత్నమున కుద్దేశింపబడుట) అనునది కన్పట్టుటలేదు.

వివరణము:- నియోగము లేక ప్రేరకత్వరూపమగు కార్యమే 'యజేత' ఇత్యాదులందు ప్రధానముగా బోధింపబడుచున్నదని ప్రాభాకర మతము. కాని వాక్యములో ఇతరపదములతో కలిపి అన్వయించి అర్థమును చెప్పుకొన్నప్పుడు నియోగమునకు ప్రాధాన్యములేదని భగవద్రామానుజాభిప్రాయము. ప్రాభాకరులను 'అన్వితాభిధానవాదు'లని యందురు. వారిమతమున పదములు విడివిడిగా కాక, ఒకదానితో ఒకటి కలసి సమన్వయించియే అర్థములను బోధించునుకనుక, వారిమతము ననుసరించిననూ, 'యజేత స్వర్గకామః' అనుచోటున, 'యజేత'అనునది స్వర్గకామపదముతో అన్వయించి యాగమనునది స్వర్గసాధనమనియు ఆ యాగము పురుషప్రయత్న సాధ్యమనియు బోధించునేతప్ప, కేవల నియోగమునకు ప్రాధాన్యమును బోధింపజాలదని భగవద్రామానుజాభిప్రాయము. మరియు నియోగము సుఖరూపమని ప్రాభాకరులమతము. కాని లోకమున కూడ 'ఇదిచేయుము' అని నియోగించినప్పుడు పని చేయుట దుఃఖకారణమేకాని సుఖరూపమెంత మాత్రము కాదు. అట్లే ఇక్కడను. అందువలన నియోగము సుఖరూపము కాదనియువారి యభి

ప్రాయము.

మూ॥ కృతిం ప్రతిశేషిత్వం కృత్యుద్దేశ్యత్వమితిచేత్. కిమిదం శేషిత్వం, కించశేషత్వమ్ ఇతివక్తవ్యమ్. 'కార్యం ప్రతి సంబంధీ శేషః, తత్ప్రతిసంబంధిత్వం శేషిత్వమ్' ఇతిచేత్, ఏవం తర్హి కార్యత్వమేవ శేషిత్వమిత్యుక్తం భవతి। కార్యత్వమేవహి విచార్యతే। 'పరోద్దేశప్రవృత్తకృతివ్యాప్త్యర్హత్వం శేషత్వ'మితిచేత్, కోఽయం పరోద్దేశో నామేతి అయమేవహి విచార్యతే। 'ఉద్దేశ్యత్వం నామ ఈప్సితసాధ్యత్వ'మితిచేత్, పురుషస్య కృత్యారంభప్రయోజనమేవహి కృతిప్రయోజనమ్; సచ ఇచ్ఛావిషయః కృత్యధీనాత్మలాభ ఇతి పూర్వోక్త ఏవ।

అనువాదము:— కృతిని ఉద్దేశించి 'శేషి' (ప్రధానము) అగుటయే 'కృత్యుద్దేశ్యత్వము' (కృతికి (ప్రయత్నమునకు) ప్రధానముగ లక్ష్యమగుట) అనియున్నచో, 'శేషిత్వ' మనగానేమి? 'శేషత్వ'మనగానేవియో చెప్పవలయును. (ఈ శేష-శేషిలక్షణముల నిరూపింపవలయునని తాత్పర్యము) 'కార్యమునకు సంబంధించినది శేషము (అపూర్వమునకు అంగమైనది శేషము) అట్టి శేషముతో (అంగముతో) సంబంధించియుండుట శేషిత్వము (ప్రధానత్వము) అనియున్నచో—అట్టియెడ కార్యత్వము— శేషిత్వము ఒక్కటేనని చెప్పబడినట్లైనది. కార్యత్వమననేమో అదియే ఇప్పుడు విచారింపబడుచున్నది. పరమును ఉద్దేశించి ప్రవర్తించిన యే కృతికలదో దానికి విషయమగుట శేషత్వమనియున్నచో, (ఇక్కడ) పరోద్దేశమనగానేదియో అదియే విచారింపబడుచున్నది. ఉద్దేశ్యత్వము అనగా కోరబడినదై సాధింపబడునదేదో అదియే అనియున్నచో, కోరబడునదేది? కృతికి (ప్రయత్నమునకు) ఏది ప్రయోజనమైయున్నదో అదియే కోరబడునది (ఈప్సితము) అనియున్నచో, కృతిని (ప్రయత్నమును) ఆరంభించుటకేది ప్రయోజనమో అదియొకదా కృతికి ప్రయోజనము. అది కోరికకు విషయమైనదై (కోరబడినదై) కృతికి స్వాధీనపడిన స్వస్వరూప

ప్రాప్తి కలది అని పూర్వము చెప్పబడినది।

వివరణము:- శేషత్వలక్షణము చెప్పుచు పూర్వపక్షి-'పరోద్దేశప్రవృత్తకృతి వ్యాప్త్యర్హత్వమ్ శేషత్వమ్' అని లక్షణమును చెప్పినాడు. దీని యర్థమేమనగా-'పరమ్' అనగా ఫలాదికము. దానినుద్దేశించి ప్రవర్తించిన అనగా పుట్టిన పురుషునియొక్క ప్రయత్నమే 'పరోద్దేశప్రవృత్తకృతి.' తద్వ్యాప్త్యర్హత్వమ్ = దానికి (అట్టి ప్రయత్నమునకు) విషయమగుట. అనగా స్వర్గాది పరమఫలముల నిచ్చునట్టి అపూర్వమనెడు కార్యమె 'పరము'. దానినుద్దేశించి పురుషుడు ఆంతరము, బాహ్యము నైన ప్రయత్నము చేసినాడు. ఆ ప్రయత్నమే కృతి. దానికి విషయమైన యాగాదికము-శేషము. ఇట్లనుటవలన కృతికి శేషత్వములేకపో వలసివచ్చును. అప్పుడు కృతిసాధ్యమైనది అనగా అపూర్వముకూడ శేషి కాకపోవలసివచ్చును. కనుక ఈ లక్షణము సరియైనదికాదని తాత్పర్యము.

మూ॥ అయమేవహి సర్వత్ర శేష శేషిభావః — పరగతాతిశయాధానేచ్ఛయా ఉపాదేయత్వమేవయస్యస్వరూపం సః శేషః, పరః శేషీ; ఫలోత్పత్తిచ్ఛయా యాగాదేః తత్ప్రయత్నస్యచ ఉపాదేయత్వమ్। యాగాది సిద్ధిచ్ఛయా అన్యత్ సర్వము-పాదేయమ్। ఏవం గర్భదాసాదీనామపి పురుషవిశేషాతిశయాధానేచ్ఛయా ఉపాదేయత్వమేవ స్వరూపమ్। ఏవమ్ ఈశ్వరగతాతిశయాధానేచ్ఛయా ఉపాదేయత్వమేవ చేతనాచేతనాత్మకస్య నిత్యస్య అనిత్యస్య చ సర్వస్య వస్తునః స్వరూపమితి, సర్వమ్ ఈశ్వరశేషభూతం, సర్వస్యచ ఈశ్వరః శేషీతి—'సర్వస్యవశీ సర్వస్యేశానః' 'పతిం విశ్వస్య' ఇత్యాద్యుక్తమ్—'కృతిసాధ్యం ప్రధానం యత్ తత్కార్య-మభిధీయతే ఇత్యయమర్థః శ్రద్ధధానేష్వేవ శోభతే।

అనువాదము:- శేషశేషిభావమనగా అన్నిచోటలందును ఇదియే (అనగా యీక్రింద నిరూపింపబడినదని తాత్పర్యము) పరమైన వస్తువు

నకు గొప్పతనమును కల్గింపవలయునను కోరికతో పరిగ్రహింపబడుట అనునదియే దేనికి స్వరూపమో అదియే శేషము. పరవస్తువు శేషి. ఫలమును పుట్టింపవలయునను కోరికచేతనే యాగాది క్రియయు, దాని గురించిన ప్రయత్నము పరిగ్రహింప దగినవగుచున్నవి. యాగాదిక్రియను సిద్ధింపచేయ వలయునను కోరికచే ఇతరమైన దంతయు (యాగమును సిద్ధింపజేయునదంతయు) పరిగ్రహింపదగిన దగును. ఈవిధముగా 'గర్భదాసుడు' (సేవకుడు) మున్నగువారు కూడ తమకు ఆశ్రయభూతుడైన (యజమానరూపుడగు) పురుషునకు గొప్పదనమును కల్గింపవలయుననియే గ్రహింపబడుచున్నారు. ఇట్లు గ్రహింపబడుటయే వారి స్వరూపము. ఈవిధముగ ఈశ్వరునియందు అతిశయమును (ఉత్కర్షను) కల్గింపవలయునను కోరికచే పరిగ్రహింప బడుటయే జీవ-జడాత్మకమగు సమస్త నిత్యానిత్యవస్తువుయొక్క స్వరూపము. కనుక సమస్తము (జీవజడాత్మక నిత్యానిత్య ప్రపంచమంతయు) ఈశ్వరునకు శేషమైనది. (ఈశ్వరునకతిశయమును కల్గించునది). సమస్తమునకు నియామకుడైన పరమాత్మ శేషి. 'సర్వమును తన వశమందుంచుకున్నవాడై అంతటికి ఈశ్వరుడైనవాడు' (బృహ. 6-4-22) 'విశ్వమునకంతటికిని పాలకుడైనవానిని' (మహా. నా.) మున్నగునది చెప్పబడినది. దీనివలన—'కృతిచే సాధింపబడునదై ఏది ప్రధానమో అదియే కార్యమని చెప్పబడుచున్నది' అనునీ విషయము (మీమాంసక విషయము) మారుమాటాడక శ్రద్ధాళువులై వినువారిలో మాత్రమే అందగించును. (యుక్తిపరులలో అందగింపదని తాత్పర్యము.)

వివరణము:- పూర్వము మీమాంసకులుచెప్పిన శేషశేషిలక్షణము సరియైనదికాదని ఖండించి ఇక్కడ స్వాభిమతమగు లక్షణమును భగవద్రామానుజులు చెప్పినారు.

మూ॥ అపిచ 'స్వర్గకామోయజేత' ఇత్యాదిషు లకారవాచ్య కర్తృవిశేష సమర్పణపరాణాం స్వర్గకామాది పదానాం నియోజ్య

విశేష సమర్పణ పరత్వం శబ్దానుశాసన విరుద్ధం కేనఅవ గమ్యతే? సాధ్య స్వర్గవిశిష్టస్య అస్వర్గసాధనే కర్తృత్వాన్వ యో నఘటతే ఇతిచేత్, నియోజ్యత్వా న్వయోఽపి నఘటతే ఇతిహి స్వర్గసాధనత్వనిశ్చయః, నతుశాస్త్రసిద్ధే కర్తృత్వా న్వయే స్వర్గసాధనత్వనిశ్చయః క్రియతే। యథా-'భోక్తు కామో దేవదత్తగృహం గచ్ఛేత్' ఇత్యుక్తే. భోజనకామస్య దేవదత్తగృహగమనే కర్తృత్వశ్రవణాదేవ ప్రాగజ్ఞాతమపి భోజన సాధనత్వం దేవదత్తగమనస్య అవగమ్యతే। ఏవ-మత్రాపి భవతి।

అనువాదము:- మరియు, "స్వర్గమును కోరువాడు యాగమొనర్ప వలయును" (స్వర్గకామోయజేత) ఇత్యాది స్థలములందు (విధ్యర్థముకల లిజ్‌అను) లకారముచేత బోధింపబడిన (ఒకానొక) కర్తను సమర్పించు నట్టి 'స్వర్గకాముడు' మున్నగు పదములు, వ్యాకరణశాస్త్ర విరుద్ధముగా నియోజ్యవిశేషముల సమర్పించుననుట దేనిచే తెలియుచున్నది? "సాధ్య మైన స్వర్గముతో కూడినవానికి స్వర్గమునకంటె భిన్నమైనదానిని (క్రియ ను) సాధించుటలో కర్తగా అన్వయించుట కుదరదని" యన్నచో— నియోజ్యముగా (నియోగింపబడుదానినిగా) అన్వయించుటకూడ కుదరదను కారణముచేతనే స్వర్గమునుమాత్రమే సాధించుటయుననది నిశ్చయింపబడి నది. శాస్త్రముచేతనే (యాగాదిక్రియలో) కర్తగా అన్వయము సిద్ధింపగా స్వర్గమును సాధించుటయుననదికూడ (వానికే) నిశ్చయింపబడుచున్నది. ఎట్లుగా-"భోజనమందిచ్ఛ కలవాడు దేవదత్తునియింటికి వెళ్లవలయును" అనియనగా—భోజనమందిచ్ఛకలవానికి - దేవదత్తగృహము గురించి "వెళ్లుట" అను క్రియలోనే అన్వయము శబ్దముచే వినబడినందువల్లనే, పూర్వము తెలియబడనిదైనప్పటికిని దేవదత్తునియింటికి వెళ్లుట అనునది భోజనమును సాధించునదేనని తెలియుచున్నదో ఇట్లే ఇచ్చటకూడ నగు చున్నది.

మూ॥ నహి క్రియాంతరం ప్రతికర్తృతయా శ్రుతస్య క్రియాంతరే కర్తృత్వకల్పనం యుక్తమ్। 'యజేత' ఇతిహి యాగకర్తృతయా శ్రుతస్య బుద్ధౌ కర్తృత్వకల్పనం క్రియతే। బుద్ధేః కర్తృత్వకల్పనమేవహి నియోజ్యత్వమ్। యథోక్తమ్-'నియోజ్యః సచ కార్యంయః స్వకీయత్వేనబుధ్యతే. ఇతి, యష్టృత్వానుగుణం తద్బోద్ధృత్వమ్ ఇతిచేత్, 'దేవదత్తః పచేత్' ఇతి పాకకర్తృతయాశ్రుతస్య దేవదత్తస్య, పాకార్థగమనం పాకానుగుణమితి గమనే కర్తృత్వకల్పనం నయుజ్యతే।

అనువాదము:- ఒక క్రియలో కర్తగా అన్వయించినవానికి వేరొక క్రియలో కర్తృత్వమును కల్పించుటయనునది తగినదికాదు. "యజేత" (యాగమును చేయవలయును) అని యాగకర్తగా తెలియబడిన (వినబడిన) వానికి బుద్ధియందు కర్తృత్వమును కల్పించుట జరుగుచున్నది. (పూర్వపక్షులమతమున) బుద్ధికి సంబంధించి కర్తృత్వమును కల్పించుటయే నియోజ్యత్వమనునది. ఇదియే యిట్లు చెప్పబడినది—"ఎవ్వడు కార్యమును (అనగా అపూర్వఫలమును) తనదిగా భావించునో అతడే నియోజ్యుడు" అని. "యాగక్రియా కర్తృత్వమునకు అనుగుణమే ఈ బుద్ధిలో కర్తయగుట" అనియన్నచో—"దేవదత్తుడు వండవలయును" అని పాకక్రియలో కర్తగా వినబడుచున్న దేవదత్తునకు, పాకముకొరకు వెళ్లుట అను క్రియకూడ పాకనిర్మాణమున కనుకూలమేనను కారణముచే—గమనక్రియలో (వెళ్లుట అను క్రియలో) కర్తృత్వమును కల్పించుట యుక్తముకాదుకదా!

వివరణము:- అపూర్వ కార్యవాదులు "యజేత స్వర్గకామః" అనుచోటున యాగకర్తకు అపూర్వసాధనమున కర్తృత్వము నంగీకరింతురు. ఇట్టి కర్తకే నియోజ్యుడు (నియోగమును సాధించు కర్త) అని వ్యవహారము. ఎవ్వడు అపూర్వమును తనదను బుద్ధినుంచునో వాడే నియోజ్యుడని ప్రాభాకరుల మతము. ఇది వ్యాకరణశాస్త్రవిరుద్ధము కనుక యుక్తము

కాదని భగవద్రామానుజాభిప్రాయము. "యజేత స్వర్గకామః" అనుచోటున ప్రకృతిప్రత్యయముల పరస్పర సమన్వయమును, పదముల పరస్పర సమన్వయమును పరిశీలించినప్పుడు "యజేత" అనుచోటునగల యజ్ ధాతువునకు యాగక్రియ అర్థముకాగా, 'త' అను లిఙ్ ప్రత్యయమునకు 'కర్తృ' (చేయువాడు) అర్థము. వీనికి విశేషణముగా 'స్వర్గకామః' అని చేయబడినది. స్వర్గమందిచ్ఛకలవాడు యాగక్రియను చేయవలయునని సమన్వయసిద్ధమగునర్థము. ఇచ్చట యాగక్రియలో కర్తయైనవానికి, యాగము స్వర్గసాధనముకనుక – స్వర్గసాధనమందుకూడ కర్తృత్వము సిద్ధించుచున్నది. కాని అపూర్వములో కర్తృత్వము (నియోజ్యత్వము) సిద్ధించుటలేదు. యాగకర్తృత్వము–స్వర్గసాధనత్వము అనువాటిని విడచి–అపూర్వమను కార్యమందు తత్సాధనమందు కర్తృత్వమును కల్పించుట యుక్తముకాదనియు, ఇది శాస్త్రవిరుద్ధమనియు భగవద్రామానుజాభిప్రాయము. మరి–విధిప్రత్యయమున్నదికదా! దానికేమియర్థమన్నచో–యాగాది క్రియలయందుగల స్వర్గసాధనత్వమేనని పూర్వమే వివరింపబడినది.

## ॥ స్వర్గాదిసాధనమున అపూర్వము ద్వారముకాదు ॥
## ॥ శ్రీమన్నారాయణుడే ఫలప్రదాత ॥

మూ॥ కించలిఙాదిశబ్దవాచ్యం స్థాయిరూపం కిమితి అపూర్వమాశ్రీయతే? 'స్వర్గకామపదసమభివ్యాహారానుపపత్తేః' ఇతిచేత్, కా అత్రానుపపత్తిః? సిషాధయిషితస్వర్గోహి స్వర్గకామః, తస్య స్వర్గకామస్య కాలాన్తరభావి స్వర్గసిద్ధౌ క్షణభంగినీ యాగాదిక్రియా నసమర్థా ఇతిచేత్, అనాఘ్రాత వేదసిద్ధాన్తానామ్ ఇయమనుపపత్తిః, సర్వైః కర్మభిః ఆరాధితః పర-

మేశ్వరః భగవాన్ నారాయణః తత్తదిష్టం ఫలం దదాతి ఇతి వేదవిదో వదన్తి।

యథాహుః వేదవిదగ్రేసరాః ద్రమిడాచార్యాః—"ఫల-సంబిభత్సయా కర్మభిరాత్మానం పిప్రీషన్తి, స ప్రీతోఽలం ఫలాయ ఇతిశాస్త్రమర్యాదా" ఇతి। ఫల సంబంధేచ్ఛయా కర్మభిః యాగదానహోమాదిభిః ఇంద్రాదిదేవతాముఖేన తదన్తర్యామిరూపేణ అవస్థితమ్ ఇంద్రాదిశబ్దవాచ్యమ్ పర-మాత్మానం భగవన్తం వాసుదేవమ్ ఆరిరాధయిషన్తి। సహి కర్మభిరారాధితః తేషామ్ ఇష్టాని ఫలాని ప్రయచ్ఛతి ఇత్యర్థః॥

అనువాదము:- లిఙ్ మొదలగు విధిప్రత్యయములచే బోధింపబడు నదిగా స్థిరమైన 'అపూర్వము'ను దానినేల స్వీకరింపవలయును? 'స్వర్గ కామః' 'స్వర్గమునుకోరువాడు' అనుపదముయొక్క సాన్నిహిత్యముచే నట్లు చెప్పవలయును. లేనిచో అది కుదరకపోవలసివచ్చునుకదా!' అని యన్నచో ఇక్కడ కుదరకపోవుట యేమున్నది? 'సాధింపదలచిన స్వర్గము కలవాడు స్వర్గకాముడు. అట్టి స్వర్గకామునికి తరువాతకాలమున కల్గునట్టి స్వర్గము సిద్ధింపజేయుటలో అస్థిరమైన యాగనుమున్నగు క్రియ-శక్తికలదికాదు.' అనియన్నచో వేదసిద్ధాన్తముల నవగాహన మొనర్చుకొననివారికే ఈ కుదురుబాటు లేకపోవుట అనునది. సమస్త కర్మములచేతను ఆరాధింపబడిన పరమేశ్వరుడగు భగవన్నారాయణుడు వారివారికి అభిమతమైన ఫలమునిచ్చుచున్నాడని వేదాభిజ్ఞులు చెప్పు చున్నారు.

వేదవేత్తలలో అగ్రగణ్యులగు ద్రమిడాచార్యులవారిట్లు చెప్పిరి. 'ఫలములపొందవలయునను కోరికతో పరమాత్మను ఆరాధింపదలచుచు న్నారు. భగవానుడు ప్రీతినొందినవాడై ఫలములనిచ్చును-అని శాస్త్ర

విధానము' అని. ఇది దీని యర్థము. 'ఫలసంబంధమందలి కోరికచే (ఫలసంబిభత్సయా) యాగములు, దానములు, హోమములు మున్నగు కర్మములచే (కర్మభిః) ఇంద్రుడు మున్నగు దేవతలద్వారమున అనగా వారియందంతర్యామిగానున్నట్టియు, 'ఇంద్రుడు' మున్నగు శబ్దములచే బోధింపదగిన పరమాత్మయు, భగవానుడునగు వాసుదేవుని (ఆత్మానం) ఆరాధింపదలచుచున్నారు (పిప్రీషన్తి), ఆతడు (సః) కర్మములచే నారాధింపబడినవాడై (ప్రీతః) వారికి అభిమతములగు ఫలములనిచ్చును.' (అలంఫలాయ) అనియర్థము.

మూ॥ తథాచ శ్రుతిః–'ఇష్టాపూర్తం బహుధాజాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య నాభిః' ఇతి। 'ఇష్టాపూర్తమ్' ఇతి సకలశ్రుతిస్మృతిచోదితం కర్మ ఉచ్యతే। తత్–'విశ్వమ్-బిభర్తి' ఇంద్రాగ్నివరుణాది సర్వదేవతా సంబంధితయా ప్రతీయమానం. తత్తదంతరాత్మతయా అవస్థితః పరమ పురుషః స్వయమేవ 'బిభర్తి'=స్వయమేవ స్వీకరోతి; 'భువ-నస్యనాభిః' బ్రహ్మక్షత్రాది సర్వవర్ణపూర్ణస్యభువనస్య ధారకః. తైస్తైః కర్మభిరారాధితః తత్తదిష్టఫలప్రదానేన భువనానాం ధారక ఇతి. 'నాభిః' ఇత్యుక్తః॥ అగ్నివాయు-ప్రభృతి దేవతాన్తరాత్మతయా తత్తచ్ఛబ్దాభిధేయః అయమే-వేత్యాహ–'తదేవాగ్నిః తద్వాయుః, తత్సూర్యః తదు చం-ద్రమాః' ఇతి।

అనువాదము:- వేదవచనముకూడ ఇట్లున్నది–'అనేక విధములుగా పుట్టినదియు, పుట్టుచున్నదియునగు ఇష్టాపూర్తము (శ్రౌతస్మార్త-కర్మము) ఆ పరమాత్మయే. ఈ సమస్తవిశ్వమును – లోకాధారుడైన (భువనస్యనాభిః) పరమాత్మ భరించుచున్నాడు.' (మహా. నా. 1–6) 'ఇష్టాపూర్తమ్' అని, సమస్తమైన వేదముచేతను, ధర్మశాస్త్రములచేతను విధింపబడిన శ్రౌతస్మార్తకర్మను చెప్పబడుచున్నది. (ఇష్టమనగా దర్శ

పూర్ణమాసాదియాగరూపమగు వైదికకర్మము-పూర్తమనగా ధర్మశాస్త్రముచే విధింపబడిన వాపీ-కూప-తటాకాది స్మార్తకర్మము) ఆ కర్మమే-'విశ్వంబిభర్తి' ఇంద్రుడు, అగ్ని, వరుణుడు మున్నగు దేవతలకు సంబంధించినదిగా అవగతమగుచున్నదై భువనమును ధరించుచున్నది. (అనగా) ఆయాయిదేవతలయందంతరాత్మగానున్న పరమపురుషుడగు శ్రీమన్నారాయణుడు 'స్వయమేవ'-'బిభర్తి' తనంతతానుగనే (కర్మముల) స్వీకరించుచున్నాడు. (బిభర్తి అనుపదమునకు భరించుచున్నాడనికాక, స్వీకరించుచున్నాడని ఇక్కడ అర్థము.) 'భువనస్యనాభిః'=బ్రాహ్మణక్షత్రియాదిసర్వవర్ణములతోడను నిండియున్న ప్రపంచమునకు ధారకుడు (ధరించువాడు). ఆయాయి కర్మములచే ఆరాధింపబడినవాడై వారివారికి అభిమతమైన ఫలములనిచ్చుటచే జగత్తులకు ధారకుడై యున్నాడు అనుకారణముచే 'నాభిః' (ఇరుసు) అని చెప్పబడినాడు. (ఇరుసు చక్రమును ధరించినట్లు పరమాత్మ భువనముల ధరించుచున్నాడని యభిప్రాయము.) అగ్ని-వాయువు మున్నగు దేవతలయందు అంతరాత్మగానున్న వాడగుటచే ఆయాయిశబ్దములచే బోధింపబడువాడు ఈయనే అని చెప్పబడినది-'ఆ పరబ్రహ్మమే అగ్ని, అదియే వాయువు, అదియే సూర్యుడు, అదియే చంద్రుడు అని. (మహా. 1-7)

మూ॥ యథోక్తం భగవతా-

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి।
తస్యతస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్॥

స తయా శ్రద్ధయాయుక్తః తస్యారాధనమీహతే।
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్॥

'యాం యాం తనుమ్' ఇంద్రాదిదేవతావిశేషాః, తత్తదంతర్యామితయా అవస్థితస్య భగవతః తనవః శరీరాణి ఇత్యర్థః। 'అహం హి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ'

ఇత్యాది; 'ప్రభురేవచ' ఇతి సర్వఫలానాం ప్రదాతా ఇత్యర్థః।

తథాచ—

'యజ్ఞైస్త్వమిజ్యసే నిత్యం సర్వదేవమయాచ్యుత।
యైస్త్వధర్మ పరైర్నాథ! నరైరారాధితో భవాన్।
తేతరన్త్యఖిలామేతాం మాయామాత్మ విముక్తయే॥' ఇతి॥

అనువాదము:— భగవానునిచేనిట్లు చెప్పబడినది—'ఏయేభక్తుడేయే శరీరమును శ్రద్ధతో నారాధించతలచునో ఆయాభక్తునకట్టి యచంచలమగు శ్రద్ధనే, నేననుగ్రహింతును. ఆతడా శ్రద్ధతోకూడినవాడై ఆ శరీరమును ఆరాధించతలచును. దానివలన నాచేతనే కల్పింపబడిన యా కోరికలను పొందుచున్నాడు.' (శ్రీగీత. 8-11)

"యాంయాంతనుమ్" (ఏయే శరీరమును) ఇంద్రాదిదేవతలు వారి వారి యందంతర్యామిగానున్న భగవానుని 'తనువులు' శరీరములని యర్థము. "నేనే సమస్త యజ్ఞములకును భోక్తను, ప్రభువునుకూడ" నున్నగునది. "ప్రభురేవచ (ప్రభువుడనుకూడ)" అని, సమస్తఫలములకు ప్రదాత (ఇచ్చువాడు) కూడనని యర్థము.

ఇట్లుగనే— "సర్వదేవాత్మకుడవైన ఓ అచ్యుతా! నీవు నిరంతరము యజ్ఞములచే నర్చింపబడుచున్నావు. స్వధర్మనిష్ఠులగు (తమకు సముచితములైన కర్మములనాచరించువారగు) ఏ జనులచే నీవు ఆరాధింపబడితివో, వారు సమస్తమగు నీమాయనుదాటి ముక్తులగుదురు." అని (చెప్పబడినది). (వి.పు 5-20-89/20-16)

మూ॥ సేతిహాస పురాణేషు సర్వేష్వేవవేదేషు, సర్వాణి కర్మాణి సర్వేశ్వరారాధనరూపాణి। తైస్తైఃకర్మభిరారాధితః పురుషోత్తమః తత్తదిష్టఫలం దదాతిఇతి తత్రతత్ర ప్రపంచితమ్।

ఏవమేవహి సర్వజ్ఞం, సర్వశక్తిం, సర్వేశ్వరం, భగవన్తమ్, ఇంద్రాది దేవతాన్తర్యామిరూపేణ యాగదాన

హోమాదివేదోదిత సర్వకర్మణాం భోక్తారం, సర్వఫలానాం ప్రదాతారం చ సర్వాః శ్రుతయోవదన్తి, 'చతుర్హోతారోయత్ర సంపదం గచ్ఛంతి దేవైః' ఇత్యాద్యాః॥ చతుర్హోతారః=యజ్ఞాః, యత్ర=పరమాత్మని దేవేష్వంతర్యామితయా అవస్థితే, దేవైః సంపదం గచ్ఛన్తి =సంబంధంగచ్ఛన్తి ఇత్యర్థః॥ అంతర్యామి-తయా అవస్థితస్య పరమాత్మనః శరీరతయా అవస్థితానామ్ ఇంద్రాదీనాం యాగాదిసంబంధః ఇత్యుక్తం భవతి। యథోక్తం భగవతా—'భోక్తారంయజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్' ఇతి। తస్మాత్ అగ్న్యాది దేవతాన్తర్యామి భూత పరమపురుషారాధన భూతాని సర్వాణి కర్మాణి। సఏవచ అభిలషితప్రదాయీ ఇతి, కిమత్ర అపూర్వేణ వ్యుత్పత్తిపథ దూరవర్తినా వాచ్యతయా అభ్యుపగతేన కల్పితేనవా ప్రయోజనమ్?

అనువాదము:- ఇతిహాసపురాణములతో కూడిన సమస్త వేదములందును అన్ని కర్మములు సర్వేశ్వరుని అర్చనారూపములే, ఆయాయి కర్మములచే ఆరాధింపబడిన పురుషోత్తముడగు శ్రీమన్నారాయణుడు వారి వారికి ఇష్టమైన ఫలమును అనుగ్రహించుచున్నాడని అచ్చటచ్చట విస్తరించి నిరూపింపబడినది.

ఇట్లే, సమస్త వేదములును సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడు, సర్వేశ్వరుడు, ఇంద్రాదిదేవతలయందంతర్యామిగా యాగములు, దానములు, హోమాదులగు వేదప్రతిపాదితములైన కర్మములకు భోక్తయు, అన్ని ఫలములనిచ్చువాడును (అయిన పరమాత్మను) వేదములన్నియు చెప్పుచున్నవి. (అవియేవనగా) "చతుర్హోతారో యత్రసంపదం గచ్ఛన్తి దేవైః" మున్నగునవి. "చతుర్హోతారః" (అనగా) యజ్ఞములు; "యత్ర" దేవతలయందంతర్యామిగానున్న పరమాత్మయందు; "దేవైః సంపదం గచ్ఛన్తి" దేవతలతో సంబంధమును పొందుచున్నవో అనియర్థము.

అంతర్యామిగానున్న పరమాత్మకు శరీరముగానున్న ఇంద్రాది దేవతలకు యాగాదిసంబంధముండునని చెప్పబడినట్లగుచున్నది. భగవానునిచే నిదియే ఇట్లు చెప్పబడినది–(శ్రీగీత. 5-29) "యజ్ఞములకు, తపస్సులకు భోక్తయైనవాడును, సమస్తలోకములకు నియామకుడైనవాడను అగు పరమాత్మను" అని. కనుక, అగ్ని మున్నగుదేవతలలో అంతర్యామిగా నున్న పరమపురుషునియొక్క ఆరాధనములే సర్వకర్మములును. ఆతడే (పరమాత్మయే) ఇష్టములనిచ్చువాడు కావుననిక్కడ శాస్త్రమర్యాదకు ఎడమైన అపూర్వమనుదానిని వాచ్యార్థముగా నంగీకరించుటచేతను, కల్పించుటచేతను ఏమి ప్రయోజనమున్నది?

మూ॥ ఏవంచ సతి లిఙాదేః కోఽయమర్థః పరిగృహీతో భవతి? 'యజ'=దేవపూజాయామ్ ఇతి దేవతారాధనభూత యాగాదేః ప్రకృత్యర్థస్య కర్తృవ్యాపారసాధ్యతాం వ్యుత్పత్తిసిద్ధాం లిఙాదయః అభిదధతి ఇతి న కించిదనుపపన్నమ్। కర్తృవాచినాం ప్రత్యయానాం ప్రకృత్యర్థస్య కర్తృవ్యాపారసంబంధ ప్రకారోహి వాచ్యః, భూతవర్తమానతాదికమ్ అన్యేవదన్తి. లిఙాదయస్తు కర్తృవ్యాపారసాధ్యతాం వదన్తి।

అనువాదము:– ఇట్లైనచో "లిఙ్" మున్నగు విధిప్రత్యయముల కేమియర్థము స్వీకరింపబడినట్లైనది? "యజ = దేవపూజాయామ్" అని దేవతారాధనమైన యాగమున్నగు ధాత్వర్థమైన క్రియ–కర్తయొక్క ప్రవృత్త్యాదికముచేతనే సాధింపబడునని (వ్యాకరణశాస్త్రమర్యాదాసిద్ధమగు) ప్రకృతిప్రత్యయాన్వయమును (వ్యుత్పత్తిని) బట్టి సిద్ధించినదానినే "లిఙ్" మున్నగు ప్రత్యయములు బోధించుచున్నవి కనుక, ఇచ్చట కుదరనిది ఏమియులేదు. కర్తను బోధించునట్టి ప్రత్యయములు–ప్రకృతియొక్క అర్థమైన (ధాత్వర్థమైన) యాగాదిక్రియకు కర్తయొక్క ప్రవృత్తిరూపమగు వ్యాపారమునకుగల సంబంధమేదియో దానినే బోధించుచున్నవి. జరిగిపోయినకాలము (భూతము) జరుగుచున్న కాలము

(వర్తమానము) మున్నగుదానిని ఇతర ప్రత్యయములు బోధించు చున్నవి. "లిఙ్" మొదలైన ప్రత్యయములు కర్తృవ్యాపారముచేతనే యాగాదులు సాధ్యములనుటను బోధించుచున్నవి.

మూ॥ అపిచ కామినః కర్తవ్యతయా కర్మవిధాయ, కర్మణో దేవతా-రాధనరూపతాం తద్ద్వారేణ ఫలసిద్ధిం చ తత్తత్కర్మవిధి-వాక్యాన్యేవ వదన్తి -'వాయవ్యం, శ్వేతమాలభేత భూతికామః, వాయుర్వై క్షేపిష్ఠా దేవతా, వాయుమేవస్వేన భాగధేయేన ఉపధావతి, స ఏవ ఏనం భూతిం గమయతి।' ఇత్యాదీని; నాత్రఫలసిద్ధ్యనుపపత్తిః కాపిదృశ్యతే ఇతి, ఫలసాధనత్వా-వగతిః ఔపాదానికీ ఇత్యపి న సంగచ్ఛతే। విధ్యపేక్షితం యాగాదేః ఫలసాధనత్వప్రకారంవాక్యశేషఏవ బోధయతి ఇత్యర్థః।

అనువాదము:- మరియు ఫలమును కోరునట్టి కర్తకు తప్పక చేయదగినదిగా కర్మమును (యాగాదికమును) విధించి, కర్మమనునది దేవతారాధనరూపమనియు, (దేవతారాధన రూపమగు) నీ కర్మముద్వార మునసే ఫలము సిద్ధించుట యనియు ఆయాయి కర్మముల విధించునట్టి వేదవాక్యములే చెప్పుచున్నవి. 'ఐశ్వర్యకాముడు-వాయుదేవత కలదగు తెల్లని పశువును ఆలంభనమొనర్పవలయును. వాయువు శీఘ్రగామి యగు దేవత. తన భాగధేయముచే (అదృష్టముచే) వాయువునే పొందుచున్నాడు. వాయువే ఈతనిని ఐశ్వర్యసంపన్నుని చేయుచున్నాడు' మున్నగునవి. ఇక్కడ ఫలము సిద్ధించుటలో అనుపపత్తి (కుదురుబాటు లేకుండుట) అనునది ఏదియు కన్పట్టుటలేదు. కావున-'(యాగాదికము) ఫలమును సాధించునని తెలియుట అనునది, విధియొక్క ఆక్షేపముచే నేర్పడుచున్నదనుట (ఔపాదానికీ) కూడ ఎంతమాత్రము కుదరదు. విధికి కావలసిన-యాగాదికమునకు సంబంధించిన ఫలసాధనత్వవిధానమును' వాక్యశేషమే (అనగా విధివాక్యముతో కలిసి ఏకవాక్యముగా నేర్పడిన అర్థ

వాద వాక్యమే) బోధించుచున్నదని యర్థము.

మూ॥ 'తస్మాత్ బ్రాహ్మణాయనాపగురేత' ఇత్యత్ర అపగోరణ నిషేధవిధి పరవాక్యశేషే శ్రూయమాణం నిషేధ్యస్యఅపగోరణస్య శతయాతనాసాధనత్వం నిషేధవిధ్యుపయోగి ఇతిహి స్వీక్రియతే। అత్రపునః కామినః కర్తవ్యతయా విహితస్య యాగాదేః కామ్య స్వర్గాదిసాధనత్వప్రకారం వాక్యశేషావగతమ్ అనాదృత్య కిమ్మితి ఉపాదానేన యాగాదేః ఫలసాధనత్వం పరికల్ప్యతే। 'హిరణ్యనిధిమపవారకే నిధాయయాచతే కోద్రవాదిలుబ్ధః కృపణంజనమ్' ఇతిశ్రూయతే. తదేతత్ యుష్మాసు దృశ్యతే।

అనువాదము:- 'కనుక బ్రాహ్మణునిగురించి హననోద్యమము (చంపుటకుద్యమము) చేయరాదు' అనుచోటున, హననోద్యమముయొక్క నిషేధమును విధించునట్టి వాక్యశేషమున (అర్థవాదవాక్యమున) వినబడుచున్నట్టి-'నిషేధింపదగు హననోద్యమము నూరుసంవత్సరములు యమపీడననుభవించుటకు సాధనము' అను అంశము నిషేధవిధికి ఉపయోగించునదియేకదా స్వీకరింపబడుచున్నది? ఇక్కడ మాత్రము-కోరికగలవాడు తప్పక ఆచరింపదగినదని విధింపబడిన యాగాదిక్రియ-కోరబడిన స్వర్గాది ఫలమునకు సాధనమనుట వాక్యశేషముచే తెలియబడగా, దానిని విడచిపెట్టి విధియొక్క ఆక్షేపముచే యాగాదికము ఫలసాధనమని కల్పింపబడుచున్నది. ఇంటిలో స్వర్ణనిధినుంచుకొని క్షుద్రములైన ధాన్యము మున్నగువాటియందు లోభముకలవాడై దీనుడగు జనుని యాచింపనెంచునని లోకోక్తి వినబడుచున్నది. ఇది మీపట్ల లెస్సగా కన్పట్టుచున్నది.

వివరణము:- యాగాదులు ఫలమును సాధించుననుట విధివలన ఆక్షిప్తమై (బలాత్కారముగ లాగుకొనిరాబడి) తెలియుచున్నదనియు, ఇది లిఙాదిప్రత్యయములచే తెలియరానిదనియు ప్రాభాకరులు చెప్పినది యుక్తముకాదనియు, విధివాక్యమునకుగాని, నిషేధవాక్యమునకుగాని

శేషముగా (అంగముగా) అన్వయించిన అర్థవాదవాక్యముల చేతనే పై యర్థము అవగతమగుచుండగా ఔపాదానికత్వమును (విధిచే అర్థతః ఆక్షిప్తమగుచున్నదనుటను) అంగీకరింపరాదనియు భగవద్రామానుజాభిప్రాయము.

మూ॥ శతయాతనాసాధనత్వమపి న అదృష్టద్వారేణ। చోదితాన్యనుతిష్ఠతః, విహితంకర్మ అకుర్వతః, నిందితానిచ కుర్వతః సర్వాణి సుఖాని దుఃఖానిచ పరమ పురుషానుగ్రహ–నిగ్రహాభ్యామేవ భవంతి। 'ఏషహ్యేవానన్దయాతి' 'అథసోఽభయంగతో భవతి' 'అథతస్యభయంభవతి' 'భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమః ఇతి'। 'ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః' 'ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి దదతో మనుష్యా ప్రశంసంతి యజమానం దేవాః దర్వీం పితరోఽన్వాయత్తాః' ఇత్యాద్యనేకవిధాః శ్రుతయఃసన్తి।

అనువాదము:– (బ్రాహ్మణుని చంపనుద్యమించుట) శతయాతనను (నూరు సంవత్సరము లనుభవింపదగిన యమపీడను) సాధించుననుట కూడ అదృష్టము (అపూర్వము) ద్వారమున కాదు. శాస్త్రముచే విధింపబడిన కర్తవ్యముల నెరవేర్చువానికిని, తనకు విధిసిద్ధమైన కర్మమునాచరింపక శాస్త్రనిషిద్ధములగు (నిందింపదగినవగు) కర్మముల నాచరించు వానికిని (క్రమముగ) సుఖములు దుఃఖములును పరమపురుషుడగు పరమాత్ముని అనుగ్రహము (ప్రసాదము) చేతను–నిగ్రహము (క్రోధము) చేతను కలుగును. 'ఈ పరమాత్మయే ఆనందింపజేయును' 'ఇక అతడు భయరాహిత్యమునే పొందును.' 'ఇక ఆతనికి భయమేర్పడుచున్నది' 'ఆ పరమాత్మయందలి భయముచేతనే వాయువు వీచుచున్నది. ఆ భయము చేతనే సూర్యుడుదయించుచున్నాడు. ఆ పరమాత్మయందలి భయము

చేతనే అగ్ని, చంద్రుడును (అనువర్తించుచున్నారు) ఐదవవాడగు మృత్యువు (యముడు) (కూడ) పరువెత్తుచున్నాడు' అని. 'ఓ గార్గీ! ఈ అక్షరస్వరూపుడగు పరమాత్ముని శాసనమునకు లోబడి సూర్యచంద్రులు నిలుపబడియున్నారు." 'ఓ గార్గీ! ఈ పరమాత్మయొక్క ఆజ్ఞనుబట్టి (కైంకర్యబుద్ధితో) దానమొనర్చువారిని – వారికి వశపడిన మనుష్యులు ప్రశంసింతురు. యాగమొనర్చువానిని దేవతలును, దర్వీహోమమొనర్చువానిని పితృదేవతలును ప్రశంసింతురు' (అన్వాయత్తాః = వశపడినవారై, ప్రశాసనే = భగవదాజ్ఞను నిమిత్తముగ జేసికొనియనియర్థము) ఇత్యాదిగ అనేకవిధములైన వేదములున్నవి.

మూ॥ యథోక్తం ద్రమిడభాష్యే–'తస్యాజ్ఞయాధావతి వాయుః, నద్యఃస్రవన్తి, తేనచ కృతసీమానో జలాశయాః సముదా ఇవ మేషవిసర్పితం కుర్వన్తి' ఇతి। తత్సంకల్ప నిబన్ధనా హి ఇమేలోకాః న చ్యవన్తే, న స్ఫుటన్తే, స్వశాసనాను వర్తినం జ్ఞాత్వా కారుణ్యాత్ సభగవాన్ వర్ధయేత విద్వాన్ కర్మదక్షః।' ఇతిచ।

అనువాదము:– ద్రమిడాచార్యుని భాష్యమునందిట్లు చెప్పబడినది– 'ఆ పరమాత్మయొక్క ఆజ్ఞచే వాయువు ప్రసరించుచున్నది. నదులు ప్రవహించుచున్నవి. ఆ పరమాత్మచే కల్పింపబడిన హద్దులుకలవై జలాశయములు (సముద్రాదులు) ఉప్పొంగుచున్నవి.' (మేషవిసర్పితమన గా నుప్పొంగుటయని యర్థము) అనియు; 'ఆ పరమాత్మయొక్క సంకల్పమును నిమిత్తముగా చేసికొని యీ లోకములన్నియు జారిపడుటలేదు, వ్రయ్యలగుటలేదు. తన శాసనము నెవ్వడనువర్తించునో (అనుసరించునో) అట్టివానిని విద్వాంసునిగను, కర్మాచరణనిపుణునిగను తెలిసికొని ఆ బగవానుడే కృపతో వృద్ధినొందించును.' అనియును (చెప్పబడినది).

వివరణము:– పూర్వము మనుష్యాదిప్రీతికై చేసెడి దానాదిక్రియలును, దేవప్రీతికై చేసెడి యాగాదులును, పితృదేవతలకు ప్రీతికల్గించుట

కై చేసెడి దర్విహోమోపలక్షితములైన పైతృకకర్మములను భగవత్ కైంకర్యబుద్ధితో—ఆయన ఆజ్ఞను అనుసరించి చేసినప్పుడే ఫలవంతము లగుననియు, ఈవిధముగ సర్వకర్మఫలప్రదాత పరమాత్మయగు నారాయణుడేననియు చెప్పబడినది. ఇక్కడ దేవమనుష్య నదీ సముద్రాది స్థావరజంగమాత్మక సమస్తజగత్తు భగవదాయత్తమై వర్తించుచున్నదని చెప్పబడినది.

మూ॥ పరమపురుష యాథాత్మ్యజ్ఞానపూర్వకం తదుపాసనాది విహిత కర్మానుష్ఠాయినః తత్ప్రాప్తిపర్యన్తాని సుఖాని అభయంచ యథాధికారం భవన్తి। తజ్జ్ఞానపూర్వకం తదుపాసనాది విహితం కర్మాకుర్వతః, నిందితానిచ కుర్వతః తన్నిగ్రహా దేవ తదప్రాప్తిపూర్వకాపరిమిత దుఃఖాని భయంచభవన్తి।

అనువాదము:- పరమాత్మయొక్క యథార్థ స్వరూపమునెరుగుట ద్వారా భగవదారాధనము మున్నగు శాస్త్రవిహితములైన కర్మములనాచరించువానికి భగవత్ప్రాప్తివరకుగల సుఖములును, అభయమును, వాని యోగ్యతనుబట్టి కలుగుచున్నవి. భగవజ్జ్ఞానపురస్సరమగు భగవదుపాసనము మున్నగు విహితకర్మము నాచరింపనివాడును, నిందింపదగు దుష్కర్మముల నాచరించువాడును అయినవానికి నిగ్రహము (దండనము) వలననే భగవంతుని పొందకపోవుటతోపాటు అపారములైన దుఃఖములు, భయమును కలుగుచున్నవి.

మూ॥ యథోక్తం భగవతా—

'నియతం కురు। కర్మత్వం కర్మజ్యాయోహ్యకర్మణః॥ ఇత్యాదినా కృత్స్నం కర్మ జ్ఞానపూర్వకమనుష్ఠేయం విధాయ, 'మయిసర్వాణికర్మాణి సంన్యస్య'—ఇతి సర్వస్యకర్మణః స్వారాధనతామ్, ఆత్మనాం స్వనియామ్యతాం చ ప్రతిపాద్య,

'యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః।
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యంతే తేఽపి కర్మభిః॥

యేత్వేతదభ్య సూయన్తో నానుతిష్ఠంతి మేమతమ్।
సర్వజ్ఞాన విమూఢాంస్తాన్ విద్ధి నష్టాన చేతసః॥'

ఇతి స్వాజ్ఞానువర్తినః ప్రశస్య, విపరీతాన్ వినింద్య పునరపి స్వాజ్ఞానుపాలనమ్ అకుర్వతామ్, ఆసురప్రకృత్యన్తర్భావమ్ అభిధాయ, అధమాగతిశ్చ ఉక్తా।

'తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషునరాధమాన్।
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు॥

ఆసురీం యోనిమాపన్నా మూఢాజన్మని జన్మని।
మామప్రాప్యైవ కౌన్తేయ! తతోయాన్త్యధమాం గతిమ్॥' ఇతి।

'సర్వకర్మాణ్యపిసదా కుర్వాణోమద్వ్యపాశ్రయః।
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్॥'

ఇతిచ స్వాజ్ఞాను వర్తినాం శాశ్వతం పదంచ ఉక్తమ్। అశ్రుత వేదాన్తానాం కర్మణి అశ్రద్ధా మాభూత్ ఇతి దేవతాధికరణే అతివాదాఃకృతాః కర్మమాత్రేయథాశ్రద్ధాస్యాత్ ఇతి, సర్వమ్ ఏకశాస్త్రమితి వేదవిత్ సిద్ధాన్తః।

అనువాదము:- భగవానునిచే (శ్రీగీతలో) నిట్లు చెప్పబడినది— "తప్పక నీవు కర్మమునాచరింపుము. అకర్మముకన్న కర్మము చాల గొప్పది" మున్నగు మాటచే సమస్త కర్మము జ్ఞానపూర్వకముగ (కర్మ స్వరూపమునెరుగుట ద్వారమున) తప్పక అచరింపదగినదని విధించి, "నాయందే కర్మములనన్నింటిని సన్యసించి (భగవదర్పణబుద్ధితో నుంచి)" అని సమస్త కర్మము తన ఆరాధనమేననియు (భగవదారాధన రూపమనియు) జీవులందరు తనచే నియమింపబడువారేననియు ప్రతి

పాదించి,

"ఎవ్వరు నాయీమతమును నిరంతరము ఆచరించుచుందురో, అట్టి మానవులు శ్రద్ధకలిగి అసూయలేనివారై వారికర్మములచే ముక్తులగుదురు. (కర్మబంధమును బోద్రోలుదురనిభావము.) ఎవ్వరు ఈ మతమును అసూయాగ్రస్తులై ఆచరింపరో సమస్తజ్ఞానవిరహితులై మూఢులైనవారిని నశించినమనస్సు కలవారిగనే తెలిసికొమ్ము" అని తన యాజ్ఞకు వశపడినవారిని ప్రశంసించి, దీనికి విరుద్ధముగ వర్తించువారిని నిందించి, మరల, తన ఆజ్ఞను పాలింపనివారు అసురులలో చేరియుందురని చెప్పి, వారికి నీచగతి కలుగునని చెప్పబడినది. "ద్వేషించుచున్న అమంగళస్వభావులును, క్రూరులునగు నరాధములను సంసారములయందు అసురయోనులందు పడద్రోయుదును. అసురజన్మమును పొందినవారై ఆ మూఢులు ప్రతిజన్మమునను నన్ను పొందకయే, ఓ అర్జునా! అందువలననే నీచగతిని పొందుచున్నారు" అనియు, "నన్నే ఆశ్రయించి, నిరంతరము సమస్తకర్మములనాచరించువాడై, నాయనుగ్రహముచే శాశ్వతము, నాశరహితమునగు పరమపదమును పొందుచున్నాడు" అనియును—తనయాజ్ఞను అనుసరించినవానికి శాశ్వతస్థానము (కలుగునని) చెప్పబడినది. వేదాన్తశ్రవణమొనర్పనివారికి కర్మాచరణమందు అశ్రద్ధ కలగకుండునుగాకయని "దేవతాధికరణము"న కర్మమందు మాత్రమే శ్రద్ధకలుగవలయునని కొన్ని అతివాదములు చేయబడినవి. అంతయు (పూర్వమీమాంసయు—ఉత్తరమీమాంసయు) ఒక్కటే శాస్త్రమని వేదవేత్తలగు విద్వాంసులసిద్ధాన్తము.

## ॥ నిత్య విభూతి సమర్థనము ॥

మూ॥ తస్యైతస్య పరస్య బ్రహ్మణః నారాయణస్య అపరిచ్ఛేద్య—జ్ఞానానందామలత్వ స్వరూపవత్, జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్య తేజః ప్రభృత్యనవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణవత్,

స్వసంకల్పప్రవర్త్యస్వేతర సమస్త చిదచిద్వస్తుజాతవత్, స్వాభిమత స్వానురూపైకరూపదివ్యరూప-తదుచితనిరతిశయ కల్యాణవివిధానన్తభూషణ — స్వశక్తిసదృశాపరిమితానంతా-శ్చర్య-నానావిధాయుధ-స్వాభిమత స్వానురూప స్వరూప-రూపగుణవిభవైశ్వర్య శీలాద్యనవధిక మహిమ మహిషీస్వాను రూప కల్యాణ జ్ఞానక్రియాద్యపరిమేయగుణానంత పరిజన పరిచ్ఛద—స్వోచిత నిఖిల భోగ్యభోగోపకరణాద్యనన్తమహా-విభవావాఙ్మనసగోచర స్వరూపస్వభావదివ్యస్థానాది-నిత్యతా నిరవద్యతాగోచరాశ్చ సహస్రశః శ్రుతయః సన్తి।

అనువాదము:- అట్టి ఈ పరబ్రహ్మమగు శ్రీమన్నారాయణునకు— కొలుచుటకు వీలుకాని (అపారమైన) జ్ఞానము, ఆనందము, అమలత్వము అనువీటితో కూడిన స్వరూపమువలెను; జ్ఞానము-శక్తి-బలము-ఐశ్వర్యము-వీర్యము-తేజస్సు మున్నగు అంతులేని గొప్పతనముగల లెక్కింపనలవి కాని మంగళగుణములవలెను; తనయొక్క సంకల్పముచే (ఇచ్ఛచే) ప్రవర్తింపజేయబడునట్టి తనకంటె భిన్నమైన జీవజడాత్మకవస్తుసము దాయమువలెను; తనకిష్టమై తనకు మాత్రమే ఉచితమైన అప్రాకృత దివ్యరూపము; దానికి సముచితములై అపారమంగళాస్పదములై అనేక విధములును అనంతములునైన ఆభరణములు; తనయొక్క శక్తికితగిన అత్యంత విస్మయకరములగు అనేకవిధములైన ఆయుధములు; తనకు ప్రీతిని కల్గించునట్టివియు తనకు తగినవియునగు ఆకారము, రూపము, గుణములు, వీటియొక్క వైభవముతోకూడిన ఐశ్వర్యము శీలము మున్న గు (స్వరూప) గుణములతోకూడి అపారమగు ఉత్కృష్టత కలిగిన దివ్య మహిషియగు లక్ష్మియు; తనకుతగిన మంగళప్రదములగు జ్ఞానము-క్రియ మున్నగు అపారములైన గుణములుకల (శేష విష్వక్సేనాది) అసంఖ్యాక పరిచారకులు, ఛత్రచామరాది పరికరములు తనకు-సముచిత ములైన సమస్త స్రక్చందనాది భోగ్యవస్తువులచేతను, భోగ్యవస్తువుల

భోగించుటకుపయోగించు సాధనము అచేతనము ఉద్యానాదులచేతను అనంత మైన మహావైభవముకలిగి మాటలకును–మనస్సునకును విషయముకాని స్వరూపము స్వభావము కలిగిన వైకుంఠాది దివ్యస్థానము, మున్నగువాటి యొక్క నిత్యత్వమును, నిర్దోషత్వమును బోధించునట్టి వేదాది శ్రుతివచన ములున్నవి.

మూ॥ 'వేదాహమేతం పురుషం మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' 'ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయఃపురుషః...తస్య–తథా కప్యాసం పుండరీకమేవమక్షిణీ' 'సయ ఏషోఽన్తర్హృ-దయ ఆకాశః తస్మిన్నయంపురుషో మనోమయః అమృతో హిరణ్మయః'। 'మనోమయః' ఇతి మనసైవవిశుద్ధేన గృహ్యతే ఇత్యర్థః। 'సర్వేనిమేషాజజ్ఞిరే విద్యుతఃపురుషాదధి'–విద్యు-ద్వర్ణాత్ పురుషాదిత్యర్థః।

'నీలతోయదమధ్యస్థావిద్యుల్లేఖేవభాస్వరా'–మధ్యస్థ–నీలతోయదా విద్యుల్లేఖేవ, సేయం దహరపుండరీకమధ్యస్థా-కాశవర్తినీవహ్నిశిఖా, స్వాన్తర్నిహితనీలతోయదాభ పర–మాత్మస్వరూపా స్వాన్తర్నిహిత నీలతోయదా విద్యుదివ అభాతి ఇత్యర్థః।

అనువాదము:– "సూర్యప్రభాభాసమానుడును, తమోరూపమగు ప్రకృతికి ఆవలనున్నవాడగు ఈ మహాపురుషుని నేనెరుగుదును" "ఆదిత్య మండలాంతర్భాగమున స్వర్ణమయదేహుడైన ఈ పురుషుడు (పరమాత్మ) కలడు. ఆయన కన్నులు సూర్యకిరణవికసితములగు పద్మములవంటివి" "హృదయమధ్యభాగమున నేయాకాశమున్నదో–దాని నడుమ మనస్సుచే గ్రహింపదగువాడును, అమృతస్వభావుడును, స్వర్ణమయదేహుడును అగు పురుషుడున్నాడు." "మనోమయః" అనగా నిర్మలమగు మనస్సు చేతనే (రజస్తమస్సులంటని సత్త్వసంపన్నమగు మనస్సుచేతనే) గ్రహింపబడుచున్నాడని యర్థము. "విద్యుద్వర్ణుడగు పురుషునినుండి

సమస్తములగు సూక్ష్మకాలవిశేషములు (నిమేషములు) పుట్టినవి." (మహా. 1-8) విద్యుద్వర్ణముకల [మెరుపుతీగవంటి కాంతిగల] పురుషుని నుండియని యర్థము.

"నల్లనిమేఘమును మధ్యభాగమందుకల్గిన విద్యుల్లేఖవలె ప్రకాశమానమగు" [మహా.నా. 4-11] మధ్యభాగమందు నల్లనిమేఘముకలది యగు మెరుపుతీగవలె సూక్ష్మమగు [దహర] హృదయపద్మ మధ్యభాగమునందలి ఆకాశముననున్న ఏయీ అగ్నిశిఖకలదో [అది] తనలోపల నిమిడ్చుకొన్న నీలమేఘమువంటి కాంతిగల పరమాత్మస్వరూపముకలదై —తనలో నిమిడ్చుకొన్న నల్లనిమేఘముకల మెరుపుతీగవలె ప్రకాశించుచున్నదనియర్థము.

వివరణము:— సాయణాదులు — 'నల్లనిమేఘముయొక్క మధ్యభాగమునగల మెరుపుతీగవంటి కాంతిరేఖ' (నీలతోయదమధ్యస్థావిద్యుల్లేఖేవ) అని యర్థమును వ్రాసినారు. కాని భగవద్రామానుజులు— నీలతోయదః మధ్యస్థః యస్యాః సా = నల్లనిమేఘము మధ్యభాగమందు కలదియగు విద్యుల్లేఖ అని యర్థమును వ్రాసి భగవద్దేహకాంతి నీలమేఘశ్యామలమనియు—విద్యుల్లేఖయొక్క కాంతిచే చుట్టువారిన నల్లనిమేఘమువలె హృదయపుండరీక మధ్యమునగల యాకాశమున ప్రకాశించు వహ్నిశిఖకలదని వ్యాఖ్యానించినారు.

మూ॥ 'మనోమయః ప్రాణశరీరః భారూపః సత్యకామః సత్యసంకల్పః ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః సర్వమిదమభ్యాత్తోఽవాక్యనాదరః' (ఛాం. 3-14-2) 'మహారజతంవాసః' ఇత్యాద్యాః॥

అనువాదము:— 'పరిశుద్ధమనోగ్రాహ్యుడును, సర్వప్రాణధారకు

డును, భాస్వరస్వరూపుడును, అప్రతిహతసంకల్పుడును, ఆకాశమువలె సూక్ష్మస్వచ్ఛస్వరూపుడును, సమస్త జగత్తును కర్మముగా కలవాడును. పరిశుద్ధములగు భోగ్యభోగోపకరణాదులు కలవాడును, అప్రాకృత గంధము-అప్రాకృతరసము కలవాడును, ఈ సమస్త కల్యాణగుణజాతమును పరిగ్రహించినవాడై, (పరిపూర్ణైశ్వర్యుడుకనుక) పలుకకుండువాడును, (సమస్త కామముల పొందినవాడుకనుక) కామములందు ఆదరములేనివాడును (అయినవాడు పరమాత్మ) (ఛాం. 3-14-2) 'కుసుంభ వర్ణయుతమగు వస్త్రము' (బృ. 4-3-6) మున్నగునవి.

వివరణము:- 'వేదాహమేతమ్' ఇత్యాదిశ్రుతులచే అప్రాకృత రూపము, 'నీలతోయద' ఇత్యాదిశ్రుతిచే నీలమేఘశ్యామలత్వము, 'మనోమయః' ఇత్యాదిశ్రుతిచే కల్యాణగుణములు, 'మహారజతమ్' ఇత్యాది శ్రుతిచే మహార్ఘ (అమూల్య) వస్త్రధారిత్వము అనునవి తెలియుచున్నవి.

మూ॥ 'అస్యేశానా జగతో విష్ణుపత్నీ' 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ' (పు. సూ.) 'తద్విష్ణోః పరమం పదం సదాపశ్యన్తి సూరయః' 'క్షయంత మస్య రజసః పరాకే' 'యదేకమవ్యక్త మనంతరూపం విశ్వం పురాణం తమసః పరస్తాత్' 'యో వేదనిహితంగుహాయాం పరమేవ్యోమన్' 'యో౽స్య అధ్యక్షః పరమేవ్యోమన్' ఇత్యాదిశ్రుతిశతనిశ్చితో౽యమర్థః॥

అనువాదము:- 'ఈ సమస్త జగత్తునకు నియామకురాలును విష్ణుపత్నియు' 'భూదేవియు లక్ష్మియు నీ పత్నులు' 'ఆవిష్ణువుయొక్క సర్వోత్కృష్టమగు స్థానమును విద్వాంసులెల్లప్పుడును దర్శించుచున్నారు.' 'ఈ రజోగుణమునకావల నివసించుచున్నవానిని' 'ఏది అద్వితీయము ఇంద్రియములకు గోచరింపనిదియు, అనేక రూపములుకల విశ్వమే శరీరముగా కలదియు, అనాదియు, తమస్సునకావలనున్నదియు (అగుపరబ్రహ్మము)' (మహా.నా. 5) 'అప్రాకృతాకాశమని పిలువ

బడు పరమపదమునయున్న పరమాత్మను ఎవ్వడెరుగునో' (తై. 2-1) 'ఎవ్వడీ సమస్తమునకు నియామకుడో ఆ పరమాత్మ పరమపదమున నున్నాడు' 'ఆ పరబ్రహ్మమే భూతభవిష్యత్ప్రపంచము శరీరముగా కలదై పరమవ్యోమమని పిలువబడు నాశరహితమగు పరమపదమున నున్నది' (మహా.నా. 2) మున్నగు వందలాది వేదవచనములచే నీ విషయము నిశ్చయింపబడినది.

వివరణము:- పైనిపేర్కొనబడిన శ్రుతులన్నియు 'పరమవ్యోమ' మని పిలువబడు భగవన్నివాసస్థానమగు పరమపదమును ప్రతిపాదించు చున్నవి.

మూ॥ 'తద్విష్ణోః పరమంపదమ్' ఇతి, విష్ణోః పరస్య బ్రహ్మణః పరమం పదం–'సదాపశ్యన్తి సూరయః' ఇతివచనాత్ సర్వకాలదర్శనవన్తః పరిపూర్ణజ్ఞానాః కేచనసంతి ఇతిజ్ఞాయతే యే సూరయః తే సదాపశ్యన్తి ఇతివచనవ్యక్తిః, యే సదా పశ్యంతి తే సూరయః ఇతివా।

అనువాదము:- 'అది విష్ణువుయొక్క పరమస్థానము' అని పరబ్రహ్మమగు విష్ణువుయొక్క పరమపదమును (అత్యుత్కృష్టస్థానమును) 'సూరులెప్పుడును చూచుచున్నారు' అనిచెప్పుటవలన ఎల్లవేళలయందును భగవద్దర్శనముకలవారును, పరిపూర్ణమైన జ్ఞానముకలవారును అగుకొందరు (అనంత-గరుడ-విష్వక్సేనాదులు) కలరని తెలియుచున్నది. ఎవ్వరు 'సూరు'లో (పరిపూర్ణమైన జ్ఞానముకలవారో) వారు ఎల్లప్పుడు దర్శించుచున్నారని శబ్దస్వరూపము. లేదా, ఎవ్వరు ఎల్లప్పుడు దర్శించుచున్నారో వారు 'సూరులు' (పరిపూర్ణజ్ఞానులు) అని కూడ.

వివరణము:- 'తద్విష్ణోః' ఇత్యాదిశ్రుతిచే పరమపదముతోపాటు, ఆ పరమపదమును నిరంతరము దర్శించు అనంత-గరుడ-విష్వక్సేనాది నిత్యాసంకుచిజ్ఞానులగు పరమపథవాసులు కలరనికూడ తెలియుచున్నది.

మూ॥ ఉభయపక్షేఽపి అనేక విధానం న సంభవతి ఇతిచేత్, న। అప్రాప్తత్వాత్ సర్వస్య, సర్వవిశిష్టం పరమం స్థానం విధీయతే। యథోక్తం-'తద్గుణాస్తువిధీయేరన్ అవిభాగాద్విధానార్థే నచేత్ అన్యేనశిష్టాః' (జై.సూ. 1-4-9) ఇతి. 'యథా ఆగ్నేయోఽష్టా కపాలః' ఇత్యాది కర్మవిధౌ కర్మణో గుణానాం చ అప్రాప్తత్వేన సర్వగుణవిశిష్టం కర్మ విధీయతే. తథా అత్రాపి సూరిభిః సదాదృశ్యత్వేన విష్ణోః పరం స్థానమప్రాప్తం ప్రతిపాదయతి ఇతిన కశ్చిద్విరోధః।

అనువాదము:- '(పూర్వము పేర్కొన్న) రెండు పక్షములలోను (ఎవ్వరు సూరులో వారు ఎల్లప్పుడు దర్శించుచున్నారు-ఎవ్వరెల్లప్పుడు దర్శించుచున్నారో వారు సూరులు అను రెండుపక్షములలోను) అనేకముల విధించుట (పరమపదము-సూరులు-దర్శించుట అను అనేకాంశముల విధించుట) కుదరదు'-అని అన్నచో-ప్రమాణాంతరములచే అంతయు తెలియబడనందున, సర్వవిధాంశములతోకూడిన 'పరమపదము' విధింపబడుచున్నది. (ఇదియే) ఇట్లు చెప్పబడినది- 'విధానముకొరకైన శబ్దమున, వేరుచేయకుండగ చెప్పబడినప్పుడు, ఇతర ప్రమాణములచే తెలియకున్నచో (ఉపదేశింపబడకున్నచో) గుణములును విధింపబడవచ్చును' (జై.సూ. 1-4-9) అని. ఎట్లుగ-'యదాగ్నేయోఽష్టాకపాలః' మున్నగు కర్మమును (యాగమును) విధించువాక్యమున, యాగమునకును, గుణములకును ప్రాప్తి లేదుకనుక, అన్నిగుణములతోడను కూడియున్న యాగము (కర్మము) విధింపబడుచున్నదో, అట్లే, ఇక్కడను, ఎల్లప్పుడు సూరులచే దర్శింపదగినదిగా విష్ణువుయొక్క అత్యుత్కృష్టమగుస్థానము వేరొక ప్రమాణముచే (లేదా వేరొక వాక్యముచే) తెలియబడలేదుకనుక, దానినే ప్రతిపాదించుచున్నది. కావున ఎట్టి విరోధము లేదు.

మూ॥ కరణమంత్రాః క్రియమాణానువాదినః స్తోత్రశస్త్రరూపాః

పాదిషువినియుక్తాశ్చ ప్రకరణ పఠితాశ్చ అప్రకరణపఠితాశ్చ స్వార్థం సర్వం యథావస్థితమేవ అప్రాప్తమవిరుద్ధం బ్రాహ్మణవత్ బోధయన్తి ఇతిహి వైదికాః। వినియుక్తార్థప్రకాశినాం చ దేవతాదిషు అప్రాప్తావిరుద్ధ గుణవిశేషప్రతిపాదనం వినియోగానుగుణమేవ।

[ప్రగీత మంత్రసాధ్య గుణినిష్ఠగుణాభిధానంస్తోత్రమ్ అప్రగీత మంత్రసాధ్య గుణినిష్ఠగుణాభిధానంశస్త్రమ్ – ఇతి క్వచిత్ అధికః పాఠః]

అనువాదము:- కరణమంత్రములు (హోమాదికర్మమునకు సాధనములైన మంత్రములు) చేయబడుచున్న యాగాదిక్రియను అనువదించుచున్నవై స్తోత్రరూపములుగను (గానవిశిష్టముగ మంత్రమునుచ్చరించుట-స్తోత్రము) శస్త్రరూపముగను (గానముతోకూడియుండని మంత్రోచ్చారణము శస్త్రము) జపము (అధ్యయనము) మున్నగు వాటియందు వినియోగింపబడినవై ఆ ప్రకరణములయందు పఠింపబడినవయ్యును ఆయా ప్రకరణములయందు పఠింపబడనివయ్యును బ్రాహ్మణవాక్యములకు వలెనే తమయొక్క అర్థమును ఉన్నదానిని ఉన్నట్లుగనే వేరొక ప్రమాణముచే సిద్ధింపక విరోధమెంతమాత్రము లేనిదానిని (అర్థమును) బోధించుచున్నవని వైదికులు చెప్పుదురు. వినియుక్తమగు (అనుష్ఠేయమగు) విషయమును తెలియజేయు శ్రుతివచనములకుకూడ (కర్మములకు విశేషములైన) దేవతాదులయందలి ప్రమాణాంతరముచే సిద్ధింపనివియు, విరుద్ధములు కానివియునగు, గుణవిశేషములను (అనగా ఆ దేవతలస్థానము, పత్నులు, పరిజనము మున్నగు అంశములను) ప్రతిపాదించుటయనునది వినియోగమునకు అనుకూలమేయగును.

(ప్రకృష్టమగు గానముతోకూడిన మంత్రములచే సాధింపబడు విషయమునందలి (వస్తువునందలి) గుణములను బోధించుట స్తోత్రను—

గితరహితములగు మంత్రములచే సాధింపబడు విషయమునందలి గుణ
ముల చెప్పుట శస్త్రము-అని కొన్ని గ్రంథములలో అధికపాఠముకలదు).

వివరణము:- పూర్వము 'తద్విష్ణోః పరమంపదమ్' ఇత్యాది
శ్రుతిచే-ప్రమాణాంతరసిద్ధముకాని సర్వవిశేషవిశిష్టమగు పరమపదము
విధింపబడుచున్నదని చెప్పబడినది. ఇట్లు విశిష్టవిధిని అంగీకరించినను,
మంత్రములు అనుష్ఠేయమగు నర్థమునేతప్ప ఇతరములైన అంశములు
బోధించుట కుదరదని పూర్వపక్షము. మంత్రములు అనుష్ఠేయవిషయము
తోపాటు, దానికి విశేషణములుగానున్న ఇతరాంశములనుకూడ బోధిం
చుట కుదురునని సమాధానము. ఒకవేళ కేవలము అనుష్ఠేయార్థమందు
మాత్రమే మంత్రములకు తాత్పర్యమనియన్నచో-'వేదమేవ జపే-
న్నిత్యం యథాకాలమతంద్రితః' ఇత్యాది వాక్యములచే వేదమంతయు
జపించుటమాత్రమే చేయదగియుండును కనుక - బ్రాహ్మణములందలి
వాక్యములుకూడ స్వార్థబోధకములు కాకపోవలపివచ్చును. కనుక వేద
మంత్రములు ప్రమాణాంతరముచే సిద్ధింపని అవిరుద్ధములైన అంశముల
నన్నిటిని యథాతథముగ బోధించునని తాత్పర్యము.

మూ॥ నేయంశ్రుతిః ముక్తజనమాత్రవిషయా, తేషాం సదాదర్శ-
నానుపపత్తేః, నాపిముక్తప్రవాహవిషయా, 'సదాపశ్యన్తి'
ఇత్యేకైక కర్తృవిషయతయాప్రతీతేః శ్రుతిభంగప్రసంగాత్।
మంత్రార్థవాదగతాహ్యర్థాః కార్యపరత్వేఽపి సిద్ధ్యంతి ఇత్యు-
క్తమ్, కింపునః సిద్ధవస్తున్యేవ తాత్పర్యే వ్యుత్పత్తిసిద్ధే-ఇతి
సర్వముపపన్నమ్।

అనువాదము:- ఈ శ్రుతివచనము (తద్విష్ణోః పరమంపదమ్-
ఇత్యాదికము) ముక్తులైన జీవులనుమాత్రమే ఉద్దేశించినదికాదు. వారు
నిరంతరము దర్శించుట కుదరదుకదా! లేదా ముక్తజనసముదాయము
నకు సంబంధించినదియనుటకూడా కుదరదు. 'సదా పశ్యంతి' (ఎల్లప్పు

డు చూచుచున్నారు) అని, ఒక్కొక్క కర్తకు (జీవునకు) సంబంధించి నదిగా తెలియుచున్నదికనుక, శ్రుతి భగ్నమైపోవును (అప్రమాణ మగును) కదా! మంత్రములందును అర్థవాక్యములందును గల విషయ ములు, ఆ మంత్రములు-'కార్య' బోధకములన్నప్పుడుకూడ సిద్ధించు చునే యున్నవని చెప్పబడినది. అట్టియెడ-సిద్ధవస్తువునందే వాక్యము లకు తాత్పర్యము వ్యుత్పత్తిచే (ప్రకృతిప్రత్యయాది నిర్వచన ప్రక్రి యచే) సిద్ధించుచున్నప్పుడు ఇక చెప్పవలసినదేముండును? అంతయు కుదురుచునేయున్నది.

మూ॥ ననుచ అత్ర 'తద్విష్ణోః పరమంపదమ్' ఇతి పరస్వరూపమేవ పరమపదశబ్దేన అభిధీయతే 'సమస్త హేయరహితం విష్ణ్వా- ఖ్యం పరమం పదమ్' ఇత్యాదిషు అవ్యతిరేకదర్శనాత్।

నైవమ్। 'క్షయన్తమస్య రజసః పరాకే' 'తదక్షరే పరమే వ్యోమన్' 'యో2స్యాధ్యక్షః పరమేవ్యోమన్' 'యో వేదనిహి- తం గుహాయామ్ పరమేవ్యోమన్' ఇత్యాదిషు పరస్థానస్యైవ- దర్శనాత్, 'విష్ణోః పరమం పదమ్' ఇతి వ్యతిరేక నిర్దేశాచ్చ విష్ణ్వాఖ్యం పరమం పదమ్' ఇతి విశేషణాత్ అన్యదపి పర- మం పదం విద్యతే ఇతి, తేనైవ జ్ఞాయతే, తదిదం పరస్థానం సూరిభిః సదాదృశ్యత్వేనప్రతిపాద్యతే।

అనువాదము:- "మరి, ఇక్కడ 'తద్విష్ణోః పరమంపదమ్' (ఇది విష్ణువుయొక్క పరమస్థానము) అని పరమాత్మస్వరూపమే పరమపద మను శబ్దముచే చెప్పబడుచున్నది. 'నిఖిలములైన నింద్యదోషములు లేనిది విష్ణువని పిలువబడు పరమపదము' (వి.పు.1-12-53) మున్నగు వాక్యములందు అభేదమే కన్పట్టుచున్నదికదా!"

ఇది యిట్లుకాదు. 'రజోగుణమునకావలనున్న స్థానమున నివసించు వానిని' 'నాశరహితమగు పరమవ్యోమమని పిలువబడు సర్వోత్కృష్ట

స్థానమందు' 'ఆ పరమపదమందాతడే అధ్యక్షుడు (పరిపాలకుడు)'. 'అప్రాకృతాకాశమని పిలువబడు పరమపదమందున్న పరమాత్మనెవ్వడెరుగునో' మున్నగు వాక్యములందు ఉత్కృష్టమగు స్థానమే కన్పట్టుచున్నదికనుక–'విష్ణువుయొక్క పరమపదము' అని భేదమే నిర్దేశింపబడినది కనుకను, 'విష్ణువని పేరుగల పరమపదము' అని విశేషణముండుటను బట్టి వేరొక పరమపదమున్నదని దానిచేతనే తెలియుచున్నది. అట్టి యీ పరస్థానమే విద్వాంసులచే దర్శనీయముగా ప్రతిపాదింపబడుచున్నది.

మూ॥ ఏతదుక్తం భవతి—క్వచిత్ పరస్థానంచ పరమపదశబ్దేన ప్రతిపాద్యతే। క్వచిత్ ప్రకృతివియుక్తమాత్మస్వరూపమ్। క్వచిత్ భగవత్స్వరూపమ్। 'తద్విష్ణోః పరమంపదం' ఇతి పరస్థానమ్। 'సర్గస్థిత్యన్తకాలేషు త్రిధైవం సంప్రవర్తతే, గుణప్రవృత్త్యా పరమం పదం తస్యాగుణం మహత్॥' ఇత్యత్ర ప్రకృతి వియుక్తాత్మస్వరూపమ్, 'సమస్త హేయరహితం విష్ణ్వాఖ్యం పరమం పదమ్' ఇత్యత్ర భగవత్ స్వరూపమ్। త్రీణ్యేతాని పరమప్రాప్యత్వేన పరమ పదశబ్దేన ప్రతిపాద్యంతే।

అనువాదము:– ఇది చెప్పబడినట్లైనది– కొన్ని చోటులందు 'పరస్థానమే' (శ్రీమన్నారాయణుని నివాసస్థానమే) పరమపదమను శబ్దముచే ప్రతిపాదింపబడుచున్నది. కొన్నిచోటులందు ప్రకృతినుండి విడివడిన ఆత్మయొక్క స్వరూపము, కొన్ని చోటులందు పరమాత్మయొక్క స్వరూపము (ప్రతిపాదింపబడుచున్నది). 'తద్విష్ణోః పరమంపదమ్' అని పరస్థానమే చెప్పబడుచున్నది. 'గుణాతీతమై మహత్త్వముగల ఆ పరమాత్మయొక్క పరమపదమే సత్త్వరజస్తమస్సులను గుణములయొక్క ప్రవృత్తిని బట్టి సృష్టిస్థితిలయకాలములలో మూడు విధములుగ ప్రవర్తించుచున్నది' (వి. 1-23-41) అనుచోటున ప్రకృతినుండి విడివడిన ఆత్మయొక్క స్వరూపము, 'నిఖిలములైన నింద్యదోషములులేనిది విష్ణువని

పిలువబడు పరమపదము' (వి.1-22-53) అనుచోటున భగవంతుని స్వరూపము ప్రతిపాదింపబడినది. ఈ మూడును (అనగా పరమప్రాప్యమైనస్థానము, ఆత్మయొక్క ప్రకృతివిముక్తస్వరూపము, భగవత్స్వరూపము అనునవి) పరమపదమనుశబ్దముచే ప్రతిపాదింపబడుచున్నవి.

మూ॥ కథం త్రియాణాం పరమప్రాప్యత్వమితిచేత్, భగవత్ స్వరూపం పరమప్రాప్యత్వాదేవ పరమం పదమ్। ఇతరయోరపి భగవత్ ప్రాప్తి గర్భత్వాదేవ పరమపదత్వమ్। సర్వకర్మవినిర్ముక్తాత్మస్వరూపావాప్తిః భగవత్ ప్రాప్తిగర్భా–'తఇమే సత్యాః కామాః అనృతాపిధానాః' ఇతి భగవతో గుణగణస్య తిరోధాయకత్వేన అనృతశబ్దేన స్వకర్మణః ప్రతిపాదనాత్।

అనృతరూపతిరోధానం క్షేత్రజ్ఞకర్మేతి కథమవగమ్యతే ఇతిచేత్,

అవిద్యాకర్మసంజ్ఞాఽన్యా తృతీయాశక్తిరిష్యతే।
యయాక్షేత్రజ్ఞశక్తిస్సా వేష్టితానృపసర్వగా॥
సంసారతాపానఖిలాన్ అవాప్నోత్యతిసంతతాన్।
తయాతిరోహితత్వాచ్చ (శక్తిః క్షేత్రజ్ఞసంజ్ఞితా॥)

ఇత్యాదివచనాత్, పరస్థానప్రాప్తిరపి భగవత్ప్రాప్తి గర్భైవ ఇతి సువ్యక్తమ్।

అనువాదము:- మరి, ఈ మూడును పరమప్రాప్యములనియనుట ఎట్లు కుదురును? అన్నచో–భగవంతుని స్వరూపము పరమప్రాప్యము కనుకనే (అది) 'పరమపదము'. ఇతరములైన రెండును భగవత్ప్రాప్తిలోనిమిడియున్నవి కనుకనే (వాటికి) 'పరమపదము' అని వ్యవహారము. సర్వవిధములైన కర్మములనుండి విడివడిన ఆత్మస్వరూపము యొక్క ప్రాప్తియనునది భగవత్ప్రాప్తిలో చేరియున్నది. 'సమస్తము

లైన కల్యాణగుణములు అనృతముచే (స్వకర్మముచే) కప్పబడినవి.' (ఛాం.8-3-1) అని భగవంతుని గుణబృందమును కప్పియుంచునట్టి తన యొక్క కర్మమే (జీవునియొక్క కర్మమే) అనృతశబ్దముచే ప్రతిపాదింప బడినదికదా! (తనకు లోపల ఆత్మగానున్న పరమాత్మయొక్క సత్య కామత్వాది కల్యాణగుణములు జీవునికి సంబంధించిన సాంసారిక కర్మఫల ముచే కప్పబడినవి — అనగా బ్రహ్మప్రాప్తికి జీవకర్మఫలములు ప్రతి బంధములని తాత్పర్యము).

'జీవునియొక్క కర్మమే అనృతమనిచెప్పబడు తిరోధానము' (కప్పి యుంచునట్టి ముసుగు) అని ఎట్లు తెలియుచున్నది?-అనియన్నచో-

'కర్మమను పేరుగల అవిద్యాత్మకమగు మూడవశక్తి కలదు. దాని చేతనే అంతటనున్న జీవశక్తి చుట్టువారినదై నిరంతరము సమస్తము లగు సాంసారిక దుఃఖములను పొందుచున్నది. దానిచే (అవిద్యాత్మక కర్మముచే) కప్పబడినదగుటచేతనే క్షేత్రజ్ఞశక్తి అంతట తారతమ్యతతో నున్నది' (వి.పు. 7-61-62).

మూ॥ 'క్షయన్తమస్యరజసః పరాకే' ఇతిరజశ్శబ్దేన త్రిగుణాత్మికా ప్రకృతిరుచ్యతే. కేవలస్యరజసోఽనవస్థానాత్. ఇమాం త్రిగుణాత్మికాం ప్రకృతిమతిక్రమ్య స్థితే స్థానే. క్షయన్తం= వసన్తమ్ ఇత్యర్థః। అనేన త్రిగుణాత్మకాత్ క్షేత్రజ్ఞస్య భోగ్యభూతాత్ వస్తునః పరస్తాత్ విష్ణోః వాసస్థానమితి గమ్యతే। 'వేదాహమేతం పురుషం మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' ఇత్యత్రాపి తమశ్శబ్దేన సైవ ప్రకృతిః ఉచ్యతే। కేవలస్యతమసః అనవస్థానాదేవ. 'రజసః పరాకే క్షయన్తమ్' ఇత్యనేన ఏకవాక్యత్వాత్, తమసః పరస్తాత్ వసన్తం మహాన్తమ్ ఆదిత్యవర్ణం పురుషమ్ అహం వేద ఇత్యయమర్థః అవగమ్యతే।

అనువాదము:- 'ప్రకృతికి అవలనున్న స్థానమున నివసించుచున్న' అని 'రజస్' అను శబ్దముచే సత్త్వరజస్తమస్సులను మూడుగుణములతోకూడిన ప్రకృతి బోధింపబడుచున్నది. కేవలమగు రజోగుణముండదు కనుక. ఈ త్రిగుణాత్మకమగు ప్రకృతినిదాటి అవలనున్న స్థానమున, 'క్షయన్తమ్' = నివసించుచున్నవానిని అని యర్థము. దీనిచే త్రిగుణాత్మకమై జీవునకు భోగాస్పదమైన వస్తువుకంటె పైన విష్ణువు యొక్క స్థానమని తెలియుచున్నది. 'సూర్యసమకాంతిగలై తమస్సునకావలనున్న మహాపురుషుని నేనెరుగుదును' అనుచోటునకూడ 'తమస్' అను శబ్దముచే ప్రకృతియే చెప్పబడుచున్నది. కేవలమగు తమస్సు ఉండదుకనుకనే 'రజసః పరాకేక్షయన్తమ్' అను వాక్యముతో ఏకవాక్యత (కలిసి ఒకే అర్థమును బోధించుట) కలదుకనుకను, తమస్సుకంటె (ప్రకృతికంటె) అవలనివసించుచున్న ఆదిత్యవర్ణుడగు మహాపురుషుని నేనెరుగుదును' అని యీ అర్థము తెలియుచున్నది.

మూ॥ 'సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ, యో వేదనిహితం గుహాయాం పరమేవ్యోమన్' (తై. 2-1) 'తదక్షరే పరమేవ్యోమన్' ఇతి తత్ స్థానమ్ అవికారరూపమ్ పరమవ్యోమశబ్దాభిధేయమితిచ అవగమ్యతే. 'అక్షరే పరమేవ్యోమన్' ఇత్యస్య స్థానస్య అక్షరత్వ శ్రవణాత్ క్షరరూపాదిత్య మండలాదయఃన పరమవ్యోమశబ్దాభిధేయాః॥

అనువాదము:- 'సత్యస్వరూపము (నిరుపాధికసత్తతోకూడినదియు) జ్ఞానస్వరూపము (నిరంతరము అసంకుచితమైన జ్ఞానమే ఆకారముగ కలదియు) (స్వరూపముచేతను గుణములచేతను) అనంతము అయిన బ్రహ్మమును అప్రాకృతాకాశమని పిలువబడు పరమపదమునయున్న దానినిగా ఎవ్వడు తెలిసికొనెనో (వాడు సమస్తకామములను పొందును) (తై. 2-1) అని, ఆ స్థానము ఎట్టివికారములేనిది పరమవ్యోమమను శబ్దముచే బోధింపబడునది అనియు తెలియుచున్నది. 'నాశరహితమగు

అప్రాకృతాకాశమను పరమపదమున నాపరబ్రహ్మమున్నది' (మహా.నా) అని ఆ పరమాత్మయొక్క స్థానము అక్షరమని వినబడినది కనుక, నాశ (వికార) సహితములైన సూర్యమండలాదులు పరమవ్యోమశబ్దముచే బోధింపబడవని చెప్పబడినది.

మూ॥ 'యత్రపూర్వేసాధ్యాస్సంతిదేవా' 'యత్ర ఋషయః ప్రథమజా యే పురాణాః' ఇత్యాదిషు చ తఏవసూరయః ఇతిగమ్యతే। 'తద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే విష్ణోర్యత్ పరమం పదమ్' ఇత్యత్రాపి, విప్రాసః=మేధావినః, విపన్యవః=స్తుతిశీలాః, జాగృవాంసః=అస్ఖలితజ్ఞానాః, తత్ విష్ణోః పరమంపదం సదా స్తువన్తః సమిన్ధతే ఇత్యర్థః।

అనువాదము:- 'ఎక్కడ ప్రాచీనులగు సాధ్యులు, దేవతలుకలరో' (పు-18) 'ఎక్కడ మొట్టమొదట ఆవిర్భవించిన ప్రాచీనఋషులు కలరో' మున్నగు వాక్యములందునువారే సూరులని తెలియుచున్నది. 'తద్విప్రాసః....' అనుచోటునకూడ, విప్రాసః = మేధాసంపన్నులు, విపన్యవః = స్తుతించుస్వభావము కలవారు, జాగృవాంసః = మెుక్కవోని జ్ఞానముకలవారు, ఈ అస్ఖలితజ్ఞానముకలవారే విష్ణువుయొక్క ఆ పరమపదమును నిరంతరము స్తుతించుచు ఒప్పుచున్నారనియర్థము.

మూ॥ ఏతేషాం పరిజనస్థానాదీనాం 'సదేవసోమ్యేదమగ్రఆసీత్' ఇత్యత్ర జ్ఞానబలైశ్వర్యాది కల్యాణగుణగణవత్ పరబ్రహ్మస్వరూపాన్తర్భూతత్వాత్, 'సదేవ...ఏకమేవా ద్వితీయమ్' ఇతి బ్రహ్మాన్తర్భావః అవగమ్యతే, ఏషామపి కల్యాణగుణైకదేశత్వాదేవ। 'సదేవసోమ్యేదమగ్రఆసీత్' ఇత్యత్ర- 'ఇదమ్' ఇతి శబ్దస్య కర్మవశ్యభోక్తృవర్గమిశ్రితభోగ్యభూతవిషయత్వాచ్చ 'సదాపశ్యంతిసూరయః' ఇతి సదాదర్శిత్వే నచ తేషాం కర్మవశ్యానన్తర్భావాత్

'అపహతపాప్మా' ఇత్యాది 'అపిపాసః' ఇత్యన్తేన స్వలీలోపకరణభూత త్రిగుణాత్మకప్రకృతిప్రాకృతతత్సంసృష్ట పురుషగతం హేయస్వభావం సర్వం ప్రతిషిధ్య—'సత్యకామః' ఇత్యనేన స్వభోగ్యభోగోపకరణజాతస్య సర్వస్య నిత్యతా ప్రతిపాదితా। సత్యాః కామాః యస్యాసౌ సత్యకామః। కామ్యంతే ఇతికామాః, తేనపరేణబ్రహ్మణా స్వభోగ్యతదుపకరణాదయః స్వాభిమతాః యే కామ్యంతే, తేసత్యాః నిత్యా ఇత్యర్థః। అన్యస్య లీలోపకరణస్యాఽపి వస్తునః ప్రమాణసంబంధయోగ్యత్వే సత్యపి వికారాస్పదత్వేన అస్థిరత్వాద్ తద్విపరీతం స్థిరత్వమ్ ఏషాం 'సత్య' పదేన ఉచ్యతే।

సత్యసంకల్పః ఇతి ఏతేషు భోగ్యతదుపకరణాదిషు నిత్యేషు నిరతిశయేషు అనన్తేషుసత్స్వపి, అపూర్వాణామ్ అపరిమితానామ్ అర్థానామపి సంకల్పమాత్రేణ సిద్ధింవదతి। ఏషాంచ భోగోపకరణానాం లీలోపకరణానాంచ, చేతనానామ్ అచేతనానాం, స్థిరాణామస్థిరాణాంచ, తత్సంకల్పాయత్త—స్వరూపస్థితిప్రవృత్తిభేదాది సర్వం వదతి 'సత్యసంకల్పః' ఇతి।

అనువాదము:- ఈ (పరమాత్మకుచెందిన) పరిచారకులు - నివాస స్థానము మున్నగునవి-'ఇది యంతయు (సృష్టికిముందు) సచ్ఛబ్దబోధ్యమగు బ్రహ్మమే అయి ఉండెను' అనుచోటున జ్ఞానము, బలము, ఐశ్వర్యము మొదలగు కల్యాణగుణములవలెనే పరబ్రహ్మముయొక్క స్వరూపములోనే అంతర్భవించియున్నవికనుక-'సత్పదార్థమొక్కటే—రెండవది లేదు' అని పరబ్రహ్మములో చేరియుండుట అనునది తెలియుచున్నది. ఇవికూడ కల్యాణగుణములలో ఒక భాగమేకదా! 'సదేవసోమ్య....' (ఛాం.) అనుచోటున 'ఇదమ్' (ఇది) అను శబ్దము, కర్మమునకు వశ

పడిన జీవవర్గముతో కలిసియున్న భోగ్యమైనవస్తుజాతమే బోధించును కావున–'సూరులెల్లప్పుడు దర్శించుచుందురు' అని నిరంతరము దర్శించు నట్టి దివ్యసూరులను, కర్మమునకు వశపడినవారిలో చేర్చుటకుదగదుకదా!

'అపహతపాప్మా' (నశించిన పాపము కలవాడు–పాపసంబంధమెంత మాత్రము లేనివాడు) అని యారంభించి 'అపిపాసః' (దప్పికలేనివాడు) అనునంతవరకుగల యుపనిషద్భాగముచే, తనయొక్క లీలకు సాధన మైన త్రిగుణాత్మకప్రకృతియందును, ప్రకృతిసంబంధముకలిగిన పదా ర్థములయందును, వాటితోకూడియుండిన జీవులయందునుకల నింద్యమైన సమస్తస్వభావమును నిషేధించి–'సత్యకామః' అనుపదముచే తనకు భోగ్యములును, భోగసాధనములునైన వస్తువులన్నియు నిత్యమని ప్రతి పాదింపబడినది. 'సత్యములైన కామములు ఎవ్వనికికలవో ఆతడు సత్య కాముడు'. కామ్యంతే = కామింపబడుచున్నవికనుక, 'కామాః' (కామ ములు), ఆపరమాత్మచే తనకు భోగ్యములును (అనుభవింపదగినవియు) భోగసాధనములునైనవి ఏవి ఇష్టములై కోరబడుచున్నవో అవి సత్య ములు, నిత్యములును అని యర్థము. ఇతరమైన లీలాసాధనమగు వస్తు వునకు (అనగా ప్రపంచాదికమునకు) ప్రమాణముచే సంబంధించియుండు యోగ్యత ఉన్నప్పటికిని వికారములకు (మార్పులకు) స్థానమగుచున్నదై స్థిరముకాదుకనుక, దానికంటె భిన్నమైన స్థిరత్వమే భగవంతుని భోగ్య భోగోపకరణాదులందు కలదని 'సత్య'పదముచే చెప్పబడుచున్నది.

['సత్యత్వమ్' అనుదానికి రెండు లక్షణములున్నవి. 1. ప్రమా ణములయొక్క సంబంధమునకు యోగ్యమైయుండుట, 2. ఎట్టి వికార ములు లేకుండుట. ఈ రెండు లక్షణములలోను ప్రపంచమనునది భగ వంతుని లీలోపకరణమే అయినప్పటికిని–సత్యత్వలక్షణములలో మొదటి లక్షణము దీనియందు అన్వయించినప్పటికిని–వికారములకు లోనుగాకుం డుటయను సత్యత్వలక్షణము దీనియందు (ప్రపంచమందు) పట్టదుకనుక ప్రపంచముకంటె వేరైన శ్రీవైకుంఠము, దానియందుగల సమస్తభోగ్య

జాతము, పరిజనవర్గము ఇదియంతయు సత్యమై భగవంతునిచే కామింప బడునదికనుక 'సత్యము'గా పేర్కొనదగినదని యభిప్రాయము.]

'సత్య సంకల్పః' అనుపదము ఈ నిత్యములు-నిరతిశయములు, అనంతములునైన భోగ్యవస్తువులు - భోగసాధనములు ఉన్నప్పటికిని, ముందెన్నడు లేనివి (అపూర్వములు) అసంఖ్యాకములు అయిన భోగవిష యములు సంకల్పమాత్రముచేతనే (పరమాత్మకు) సిద్ధింపగలవని చెప్పు చున్నది. ఈ భోగసాధనములు, లీలాసాధనములైన చేతనులు (జీవులు) అచేతనములు (ప్రకృతిమున్నగునవి) స్థిరములు, అస్థిరములు అనువీటి యన్నిటికినిగల-భగవంతుని సంకల్పమునకు వశపడిన స్వరూపము, స్థితి (ఉనికి) ప్రవృత్తి (వ్యవహారము) పారస్పరికభేదము, మున్నగు సమస్తమును 'సత్యసంకల్పః' అనుపదము చెప్పుచున్నది.

వివరణము:- ఇంతవరకు శ్రుతివచనప్రామాణ్యముచే భగవానుని స్థానము, దివ్యదేహము, పరిజనము, ఆయుధాదులు అన్నియు నిత్య ములు, వికారరహితములునైనవని నిరూపింపబడినది. 'పరమపద' శబ్దార్థముకూడ నిష్కర్షింపబడినది. ఇప్పుడు ఈ విషయములన్నియు ఇతిహాసపురాణాది ప్రసిద్ధములేనని, తత్ప్రామాణ్యమునుకూడ విశేషముగ నుట్టంకించుచున్నారు.

మూ॥ ఇతిహాసపురాణయోః వేదోపబృంహణయోశ్చ అయమర్థః ఉచ్యతే—

తౌతు మేధావినౌ దృష్ట్వా వేదేషుపరినిష్ఠితౌ।
వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః॥

ఇతి। వేదోపబృంహణతయా ప్రారబ్ధే శ్రీరామాయణే—
వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనః।
అనాదిమధ్యనిధనః మహతః పరమోమహాన్॥

తమసః పరమోధాతా శంఖచక్రగదాధరః।
శ్రీవత్సవక్షాః నిత్యశ్రీః అజయ్యశ్శాశ్వతోధ్రువః॥
శరానానావిధాశ్చాపి ధనురాయత విగ్రహమ్।
అన్వగచ్ఛన్త కాకుత్స్థం సర్వేపురుషవిగ్రహాః॥
వివేశవైష్ణవంధామ సశరీరః సహానుగః।

అనువాదము:- వేదోపబృంహకములగు (పోషకములగు) ఇతిహాస-పురాణములలో నీవిషయమిట్లు చెప్పబడుచున్నది.

"మేధాసంపన్నులై వేదములయందభినివేశముగల వారిరువురిని (కుశలవులను) చూచి వేదార్థోపబృంహణమునకై వాల్మీకి వారల పరిగ్రహించెను"అని (శ్రీరామా.బా.4-6) వేదార్థమునుపబృంహణమొనర్చుటకు (పరిపోషమునొనర్చుటకు) ప్రారంభింపబడిన శ్రీరామాయణమున- "ఈయన స్పష్టముగ సనాతనుడును, మహాయోగియు, ఆదిమధ్యాన్త రహితుడును, మహత్త్వముగల ఇంద్రాదులకంటె తదంతర్యామియై తన్నియామకుడగుటచే పరమమహత్త్వముకలవాడు. (దీనివలన షడ్భావ వికారశూన్యుడని తెలియజేయబడినది) ప్రాకృతమగు మండలముకంటె అవల అప్రాకృతమగు వైకుంఠమునయున్నవాడై శంఖ-చక్ర-గదాయుధముల ధరించి పోషకుడైనవాడును, శ్రీవత్సమను చిహ్నముతోకూడిన వక్షఃస్థలము కలవాడును, నిత్యానపాయినియైన లక్ష్మీదేవితోకూడిన వాడును, ఇతరులకు జయింపరానివాడును, శాశ్వతుడును (నాశరహితుడును), ధ్రువుడును (పరిణామరహితుడును) పరమాత్మయగు విష్ణువు. (యుద్ధ.కాం. 114వ సర్గ. 14,15 శ్లో.) (ఇవి రావణమరణానంతరము శ్రీరామచంద్రునుద్దేశించి మండోదరి పలికిన మాటలు. ఇక్కడ భగవంతుని అప్రాకృతదేహాదులు చెప్పబడినవి). "అనేక విధములగు శరములును, దీర్ఘమైన ఆకారముగల ధనుస్సు ఇవియన్నియు పురుషదేహముల ధరించి శ్రీరామచంద్రుని అనుసరించినవి. ఆ శ్రీరామచంద్రుడు శరీరముతోడనే అనుచరసహితుడై వైష్ణవస్థానమును ప్రవేశించినాడు." (ఉ.కాం).

మూ॥ శ్రీమద్వైష్ణవే పురాణే—

'సమస్తాః శక్తయశ్చైతాః నృపయత్రప్రతిష్ఠితాః।
తద్విశ్వరూపవైరూప్యం రూపమన్యద్ధరేర్మహత్॥
మూర్తంబ్రహ్మమహాభాగ సర్వబ్రహ్మమయోహరిః।'

'నిత్యైవేషా జగన్మాతా విష్ణోః శ్రీరనపాయినీ।
యథాసర్వగతోవిష్ణుః తథైవేయం ద్విజోత్తమ॥
దేవత్వే దేవదేహేయం మనుష్యత్వేచమానుషీ।
విష్ణోః దేహానురూపాం వైకరోత్యేషాత్మనస్తనుమ్॥'

'ఏకాన్తినః సదాబ్రహ్మధ్యాయినః యోగినోహియే।
తేషాంతత్ పరమంస్థానం యద్వైపశ్యన్తి సూరయః॥'

'కలాముహూర్తాదిమయశ్చకాలః నయద్విభూతేః
పరిణామహేతుః।'

అనువాదము:- 'ఓరాజా! ఈ సమస్తశక్తులు ఎవ్వనియందు ప్రతిష్ఠితములైయున్నవో అట్టి శ్రీహరియొక్కరూపము సమస్తప్రపంచము కంటె విలక్షణమై మహత్త్వము కలిగియున్నది'. (వి.పు.6-7-70)

'ఓ మహాత్మా! బ్రహ్మవిష్ణుశివాత్మకమగు త్రివిధశక్తితోడనుకూడియున్న శ్రీహరియే 'మూర్తబ్రహ్మము' (విగ్రహము ధరించినపరమాత్మ) (వి.పు. 1-22-6) 'నిఖిలలోకమాతయు, శ్రీహరికి నిత్యానపాయిని (ఎల్లప్పుడు ఒక్కక్షణమైనా స్వామిని విడచియుండనిది) యునగు లక్ష్మీదేవి (శ్రీహరివలెనే) నిత్యురాలు. ఎట్లుగ విష్ణువు సర్వాంతర్యామియో, ఓ ద్విజోత్తమా! ఈమెయు అట్టిదే! భగవానుడు దేవదేహమును పరిగ్రహించినప్పుడు ఈమె దేవదేహమునే ధరించినది. ఆయన మానవుడైనప్పుడు ఈమె మనుష్య దేహమును ధరించినది. శ్రీమహా

విష్ణువునకు తగిన తనదేహమునామె ధరించుచుండును' (వి.పు.1-9-145)

'యోగులును, నిరంతరము బ్రహ్మమును ధ్యానించువారును, శ్రీమన్నారాయణాత్మకమగు బ్రహ్మమునుతప్ప ఇతరమును ధ్యానింపని వారును అయిన జీవులకు, దివ్యసూరులచే దర్శింపబడునది పరమప్రాప్య మగు స్థానము' (వి.పు.1-6-39)

'కళలు, ముహూర్తములు మున్నగు అంశములతోనేర్పడిన కాలము ఏపరమాత్మయొక్కవిభూతికి పరిణామమును కల్గింపదో' (వి.పు. 4-1-84).

వివరణము:- పై విష్ణుపురాణ శ్లోకములు పరమాత్మయగు శ్రీమన్నారాయణుని అప్రాకృత దివ్యమంగళ విగ్రహమును, భగవద్దివ్య మహిషిని, భగవన్నివాసస్థానమును ఆవిష్కరించుచున్నవి. భగవద్విభూతి కాలాదికృతపరిణామములనెంతమాత్రము పొందదనికూడ చెప్పుచున్నవి.

మూ॥ మహాభారతేచ—

'దివ్యంస్థానమజరంచాప్రమేయం
 దుర్విజ్ఞేయంచాగమైః గమ్యమాద్యమ్।
గచ్ఛప్రభో! రక్షచాస్మాన్ ప్రపన్నాన్
 కల్పేకల్పేజాయమానః స్వమూర్త్యా॥

కాలఃసంపచ్యతే తత్రనకాలః తత్రవైప్రభుః। ఇతి।

అనువాదము:- "ఓ ప్రభూ! ప్రతికల్పమునను నీ స్వరూపముతో నావిర్భవించుచున్నవాడవై ప్రపన్నులమైన (నిన్నే ఉపాయముగా ఆశ్రయించిన) మమ్ము రక్షింపుము. దివ్యము (సత్యాదిలోకములకావల నున్నట్టిదియు) నాశరహితము, ఇంతయని కొలువరానిదియు, ప్రాకృత బుద్ధిచే భావింపరానిదియు, వేదపురాణాది శాస్త్రములచే మాత్రమే తెలియ దగినదియు, ఆద్యము (అన్నిటికంటె మొదటిది) అయిన నీస్థానమునకు వెడలుము." (భార, మౌసల. 5-28)

"కాలమే అక్కడ పరిణామమును చెందునుతప్ప కాలముచేనెంత మాత్రము పరిణామమేర్పడదు" అని.

మూ॥ పరస్య బ్రహ్మణో రూపవత్త్వం సూత్రకారశ్చవదతి —'అంత-స్తద్ధర్మోపదేశాత్' ఇతి।

అనువాదము:- పరబ్రహ్మమునకు రూపముకలదని బ్రహ్మసూత్ర కారుడిట్లు చెప్పుచున్నాడు. 'ఆదిత్యాంతర్గతముగను అక్ష్యన్తర్గతముగను నున్న పురుషుడు పరమాత్మయే, పరమాత్మధర్మములే ఉపదేశింపబడినవి కనుక. (బ్ర.సూ. 1-1-21).

వివరణము:- ఈ సూత్రమునకర్థమిది-

ఛాందోగ్యమున - "య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషః దృశ్యతే హిరణ్యశ్మశ్రుః హిరణ్యకేశః ఆప్రణఖాత్ సర్వఏవ సువర్ణః తస్య యథాకప్యాసంపుండరీకమేవమక్షిణీ" (ఈ ఆదిత్యునినడుమ స్వర్ణమయుడగు పురుషుడగుపించుచున్నాడు. బంగారపు మీసములు, బంగారపు కేశములుకలిగి, గోళ్ళమొదలు సమస్తము సువర్ణమే! అతనికి సూర్య కిరణవికసితమగు పుండరీకమువంటి కన్నులు) (ఛాం. 1-6) ఇట్లే - "అథయ ఏషోఽన్తరక్షిణి పురుషోదృశ్యతే" (ఇక అక్షి మధ్యభాగమున ఏ పురుషుడు కనుపించుచున్నాడో) (ఛాం. 4-15) అను ఆదిత్య మధ్య భాగమునను, అక్షి (కన్ను) యొక్క మధ్యభాగమునను ఉన్న పురుషుడు-జీవుడా లేక పరమాత్మయా? అని సందేహము. జీవుడేనని పూర్వ పక్షము. పరమాత్మయేనని సిద్ధాన్తము. అంతః = ఆదిత్యమండలము-అక్షిమధ్యభాగము అను నీ రెండుచోటలగల పురుషుడు పరమాత్మయే, ఏలన-తద్ధర్మోపదేశాత్ = జీవులయందు సంభవముకాని కేవల పరమాత్మ మాత్రనిష్ఠములైన ధర్మములే ఉపదేశింపబడినవి కనుక. 'ఏష ఆత్మా అపహతపాప్మా' ఇత్యాదిగ అపహతపాప్మత్వాది ధర్మములు పరమాత్మకే చెందినవికనుక. 'వేదాహమేతం పురుషం మహాన్తమ్' ఇత్యాది తైత్తి

రీయ నారాయణవచనము ఆ పురుషుని రూపమునుగురించి నిరూపించుచున్నది. కనుక పరమాత్మకు రూపమున్నదని సూత్రతాత్పర్యము స్పష్టమగుచున్నది.

## ॥ దివ్య మంగళ విగ్రహ వర్ణనము ॥

మూ॥ యోఽసావాదిత్యమండలాన్తర్వర్తీ, తప్తకార్తస్వరగిరివర-ప్రభః, సహస్రాంశుశతసహస్రకిరణః, గంభీరాంభఃసము-ద్భూత-సుమృష్టనాల-రవికరవికసిత - పుండరీకదలామలా-యతేక్షణః, సుభ్రూలలాటః, సునాసః, సుస్మితాధరవిద్రు-మః, సురుచిరకోమలగండః, కంబుగ్రీవః, సముస్నతాంస విలంబిచారురూపదివ్యకర్ణకిసలయః, పీనవృత్తాయతభుజః, చారుతరాతామ్రకరతలానురక్తాంగులీభిః అలంకృతః, తను-మధ్యః, విశాలవక్షఃస్థలః, సమవిభక్తసర్వాంగః, అనిర్దేశ్య దివ్యరూపసంహననః, స్నిగ్ధవర్ణః, ప్రబుద్ధపుండరీకచారు-చరణయుగలః, స్వానురూపపీతాంబరధరః, అమలకిరీటకుం-డల-హార-కౌస్తుభ-కేయూర-కటక-నూపురోదర బంధనా-ద్యపరిమితాశ్చర్యానన్త దివ్యభూషణః, శంఖచక్రగదాసి-శార్ఙ్గ - శ్రీవత్స-వనమాలాలంకృతః, అనవధికాతిశయసౌం-దర్యాహృతాశేషమనోదృష్టివృత్తిః, లావణ్యామృతపూరితా-శేషచరాచరభూతజాతః, అత్యద్భుతాచింత్యనిత్యయౌవనః, పుష్పహాససుకుమారః, పుణ్యగంధవాసితానన్త దిగంతరాలః, త్రైలోక్యాక్రమణ ప్రవృత్తగంభీరభావః, కరుణానురాగ-మధురలోచనాలోకితాశ్రితవర్గః, పురుషవరోదరీదృశ్యతే; సచ నిఖిలజగదుదయవిభవలయలీలః, నిరస్తసమస్త హేయః, సమస్తకల్యాణగుణనిధిః, స్వేతరసమస్తవస్తువిలక్షణః, పర-మాత్మా పరంబ్రహ్మ నారాయణః ఇత్యవగమ్యతే।

అనువాదము:- సూర్యమండల మధ్యభాగమున నే పురుషోత్తముడు లెస్సగ సాక్షాత్కరించుచున్నాడో ఆయన సమస్తజగత్తులయొక్క పుట్టుక-ఉనికి-లయము అనునవి లీలగా కలవాడు, నిఖిలదోషవిరహితుడు, సమస్తకల్యాణగుణములకు ఆకరమైనవాడు తనకంటె భిన్నమైనసమస్తవస్తువులకంటె (స్వభావగుణములబట్టి) విలక్షణుడు, పరమాత్మ, పరంబ్రహ్మమునైన శ్రీమన్నారాయణుడని తెలియుచున్నది.

ఆయన—పుటమునకాల్చి (వన్నెలుదీర్చిన) పెద్దబంగారు కొండవంటివాడు. నూరువేలమంది సూర్యుల దివ్యకాంతికలవాడు. లోతైన నీటిలో పుట్టిబలిసిన కాడగలిగి సూర్యకిరణములచే వికసించినతామరసముయొక్క రేకులవలె విమలములైన వెడదకన్నులుకలవాడు. సుందరములైన కనుబొమలు, నుదురుకలవాడు. అందమైన నాసికకలవాడు. స్వచ్ఛదరహాసయుతమగు పవడపు మోవికలవాడు. సుందరము మృదులములైన చెక్కిలికలవాడు. సంకువంటి మెడకలవాడు. ఎత్తైనమూపులపై వ్రేలాడుచు మనోహరములు దివ్యములునైన చిగురాకులవంటి చెవులుకలవాడు. బలిసినగుండ్రని పొడవైనభుజములుకలవాడు. మనోజ్ఞములై ఎఱ్ఱనైన అరచేతులందు చక్కగనమరిన వ్రేళ్ళతో నలంకరింపబడినవాడు. సన్ననినడుముకలవాడు. విపులమైన ఉరోభాగముకలవాడు. సమానముగ విభజింపబడిన అవయవములు కలవాడు. ఇట్టిదని వర్ణింపనలవికాని దివ్యదేహబంధముకలవాడు. నున్నని మేనిరంగుకలవాడు. వికసించిన సుందరపాదపద్మద్వంద్వము కలవాడు. తన శరీరప్రభకు తగిన పీతాంబరమును (పచ్చని పట్టుబట్టను) ధరించినవాడు. స్వచ్ఛములగు-కిరీటము-కుండలములు-హారములు - కౌస్తుభరత్నము - భుజకీర్తులు-మురుగులు-అందెలు-ఉదరదామము-మున్నగు అనన్యాశ్చర్యకరములగు దివ్యాలంకారములు కలవాడు. శంఖము-చక్రము-గద-ఖడ్గము-శార్ఙ్గము (ధనువు) శ్రీవత్సము (పుట్టుమచ్చ), వనమాల (దివ్యపుష్పమాల) అనువాటిచే భూషింపబడినవాడు. అపారమగు నతిశయముతోకూడిన సౌంద

ర్యముచే సమస్తచిత్తప్రవృత్తులను, నేత్రప్రవృత్తులను, ఆకట్టుకొన్న వాడు. సౌందర్యపీయూషరసముచే చరాచరప్రాణికోటిని ముంచెత్తిన వాడు. అత్యంతము ఆశ్చర్యకరమై ఊహింపవలనుకాని నిత్యమైన యౌవనముకలవాడు. కుసుమవికాసపేశలస్వభావుడు. పావనమగు పరిమళముచే అనంతములగు దిగంతరముల నింపినవాడు. ముల్లోకముల నాక్రమింపవలయునను గంభీరమనః ప్రవృత్తికలవాడు. దయా-ప్రీతుల నొలకించు మధురనయన ప్రసరణములచే, తననాశ్రయించినవారల చూచువాడు.

మూ॥ 'తద్ధర్మోపదేశాత్' (1-1-21) 'సఏష సర్వేషాంలోకానా-మీశః సర్వేషాం కామానామ్' 'సఏష సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః' ఇత్యాది దర్శనాత్। తస్యైతే గుణాః—'సర్వస్య-వశీ సర్వస్యేశానః' 'అపహతపాప్మా విజరః' ఇత్యాది-'సత్య సంకల్పః' ఇత్యన్తం, విశ్వతః పరమం నిత్యం విశ్వంనారా-యణం హరిమ్' 'పతిం విశ్వస్యాత్మేశ్వరమ్' ఇత్యాది వాక్య ప్రతిపాదితాః।

అనువాదము:- 'పరమాత్మ ధర్మములే ఉపదేశింపబడినవి కనుక' (బ్ర. సూ. 1-1-21) 'ఈయన సమస్త లోకములకు నియామకుడు. సమస్త కామములకును' 'ఈ పరమాత్మ సమస్త పాపముల కతీతుడైన వాడు.' మున్నగు నిర్దేశమువలన, ఈ పరమాత్మయొక్క గుణములు- 'అంతటిని వశపరచుకొని అంతటిని నియమించువాడు' 'పాప సంబంధ మెంతమాత్రము లేనివాడు. జర (ముదుసలితనము-అనగా ప్రాకృతిక వికారము) లేనివాడు.' అని యారంభించి 'సత్యసంకల్పుడు' అనునంత వరకును, 'జగత్తు కంటె ఉత్కృష్టుడును, నిత్యుడును, సర్వాత్మకుడును, నారాయణుడును, పాపముల హరించువాడును (అయిన పరమాత్మను)' (నారా. 4-11) 'సమస్త ప్రపంచమునకు పరిపాలకుడును, సమస్తాత్మలకు నియామకుడును అయిన వానిని' (నారా. 4-11)' మున్నగు వాక్యము

లచే చెప్పబడినవి.

మూ॥ వాక్యకారశ్చైతత్ సుస్పష్టమాహ — 'హిరణ్మయః పురుషో-దృశ్యతే' ఇతి ప్రాజ్ఞః సర్వాన్తరః స్యాత్, లోకకామేశోపదేశాత్, తథోదయాత్ పాప్మనామ్ ఇత్యాదినా। తస్యచ రూపస్య అనిత్యతాదివాక్యకారేణైవప్రతిషిద్ధమ్। 'స్యాద్రూపం-కృతకమనుగ్రహార్థం తచ్చేతసామైశ్వర్యాత్' ఇతి ఉపాసితుః అనుగ్రహార్థః పరమపురుషస్య రూపసంగ్రహః ఇతి పూర్వపక్షంకృత్వా 'రూపంవాతీంద్రియ మన్తఃకరణప్రత్యక్ష నిర్దేశాత్' ఇతి యథాజ్ఞానాదయః పరస్య బ్రహ్మణః స్వ-రూపతయానిర్దేశాత్ స్వరూపభూతాగుణాః, తథా ఇదమపి రూపంశ్రుత్యా స్వరూపతయా నిర్దేశాత్ స్వరూపభూత-మిత్యర్థః॥

అనువాదము:- వాక్యకారుడీ విషయమును స్పష్టముగ పేర్కొనినాడు — 'స్వర్ణమయుడగు పురుషుడు కన్పట్టుచున్నాడు' అని ప్రాజ్ఞుడైన (విద్వాంసుడైన) పరమాత్మ నిఖిలాంతరాత్మయగును. లోకముల కామముల తీర్చువాడని యుపదేశింపబడినందునను, పాపముల కతీతుడనుట వలనను'-మున్నగు వచనముచే-ఆ భగవంతుని రూపము అనిత్యమనుటను వాక్యకారుడే (బ్రహ్మనందియే) నిషేధించినాడు. 'ఉపాసకుల అనుగ్రహార్థమై స్వతంత్రశక్తివలన కల్పింపబడిన రూపముండవచ్చును.' అని ఉపాసకుని యనుగ్రహించుటకే పరమపురుషుడు రూపను గ్రహించుట అని పూర్వపక్షమును చేసి, 'మనఃప్రత్యక్షము నిర్దేశింపబడినది కనుక అతీంద్రియమగు (బాహ్యేంద్రియములచే గ్రహింపరాని) రూపమున్నది' అని (చెప్పినాడు). ఎట్లుగ-జ్ఞానము మున్నగు గుణములను పరబ్రహ్మమునకు స్వరూపముగా నిర్దేశించుటనుబట్టి అవి స్వరూపమును నిరూపించు (స్వాభావికములగు) గుణములో, అట్లే ఈ రూపముకూడ వేదవచనముచే స్వరూపముగనే నిర్దేశింపబడినది కనుక-స్వరూపమైనదేనని యర్థము.

మూ॥ భాష్యకారేణైతద్ వ్యాఖ్యాతమ్–'అంజసైవ విశ్వసృజో–రూపం, తత్తునచక్షుషాగ్రాహ్యం. మనసాత్వకలుషేణ సాధనాంతరవతాగృహ్యతే – 'నచక్షుషాగృహ్యతే, నాపివాచా, మనసాతు విశుద్ధేన' ఇతి శ్రుతేః। నహి అరూపాయాః దేవతాయాః రూపముపదిశ్యతే। యథాభూతవాది హి శాస్త్రమ్। 'మహారజతం వాసః' 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' ఇతి ప్రకరణాన్తరనిర్దేశాచ్చ సాక్షిణః' ఇత్యాదినా।

అనువాదము:– భాష్యకారుడగు ద్రమిడాచార్యునిచే నిటి వ్యాఖ్యానింపబడినది. 'సమస్త జగత్తును సృజించు పరమాత్ముని రూపము సూక్ష్మమైనది (స్వాభావికమైనది) కంటిచే గ్రహింపబడదు. వాక్కుచే గూడ గ్రహింపబడదు. నిర్మలమగు మనస్సుచే మాత్రమే గ్రహింపబడును.' అని శ్రుతివచనమున్నదికదా! రూపములేని దేవతకు రూపము ఉపదేశింపబడదుకదా! శాస్త్రమనగా ఉన్నదానిని ఉన్నట్లు చెప్పునదే కదా. 'కుసుంభవర్ణయుతమగు వస్త్రము' 'సూర్యవర్ణము కలిగి చీకటికావల నున్న ఆ మహాపురుషుని నేనెరుగుదును' అని ఇతర ప్రకరణములలో సాక్షియొక్క (రూపమును చూచినవానియొక్క) నిర్దేశము చేయబడినది కదా! మున్నగువానిచే (వాక్యములచే) (వ్యాఖ్యానింపబడినది).

మూ॥ 'హిరణ్మయ ఇతిరూపసామాన్యాత్ చంద్రముఖవత్' 'నమయడత్ర వికారమాదాయ ప్రయుజ్యతే, అనారభ్యత్వాదాత్మనః' ఇతి।

అనువాదము:– 'స్వర్ణమయుడు' అని రూపముయొక్క పోలికను బట్టి 'చంద్రునివంటి ముఖము' అను విధముగ (చెప్పబడినది) 'ఇక్కడ 'మయట్' అను ప్రత్యయము వికారార్థమున ప్రయోగింపబడలేదు (అనగా 'హిరణ్మయుడు' అనుచోటున స్వర్ణముయొక్క వికారము (పరిణామము)

కలవాడు పురుషుడని యర్థముకాదు) ఆత్మయనునది నిర్మింపబడునదికాదు కదా! (మట్టితో కుండ నిర్మింపబడినప్పుడు 'మృణ్మయము కుంభము' అని యందుము. ఆత్మ అట్టిదికాదని తాత్పర్యము. ఉజ్జ్వలదేహుడని భావము.)

మూ॥ యథాజ్ఞానాది కల్యాణగుణానన్త్య నిర్దేశాత్ అపరిమిత కల్యాణగుణవిశిష్టం పరంబ్రహ్మేత్యవగమ్యతే. ఏవమ్ 'ఆదిత్యవర్ణం పురుషమ్' ఇత్యాది నిర్దేశాత్ స్వాభిమతకల్యాణ-తమరూపః పరబ్రహ్మభూతః పురుషోత్తమోనారాయణః ఇతి జ్ఞాయతే। తథా 'అస్యేశానా' 'హ్రీశ్చతేలక్ష్మీశ్చపత్న్యౌ' 'సదాపశ్యన్తి సూరయః' 'తమసఃపరస్తాత్' 'క్షయన్తమస్య-రజసః పరాకే' ఇత్యాదినా పత్నీ పరిజనస్థానాదీనాం నిర్దేశా-దేవ తథైవ సంతీత్యవగమ్యతే। యథాహ భాష్యకారః-- 'యథాభూతవాది హి శాస్త్రమ్' ఇతి।

అనువాదము:- ఎట్లుగ-జ్ఞానము మున్నగు అనన్తములైన కల్యాణగుణములున్నవని నిర్దేశించుటవలన అపారములైన కల్యాణగుణములతో కూడినది పరబ్రహ్మమని తెలియుచున్నదో, అట్లే-'ఆదిత్యవర్ణుడగు పురుషుని' మున్నగు నిర్దేశమునుబట్టి తన కిష్టమైన అత్యన్త కల్యాణాస్పదమగు రూపము కలవాడు పరబ్రహ్మమగు పురుషోత్తముడు శ్రీమన్నారాయణుడు అని తెలియుచున్నది. అట్లే-'ఆ పరమాత్మకు సంబంధించిన ఈశ్వరి' 'భూమియు లక్ష్మియు నీ పత్నులు' 'ఎల్లప్పుడు సూరులుచూచుచుందురు' 'అజ్ఞానాంధకారముకంటె అవలనున్నది' 'ప్రకృతి కంటె అవల నివసించియున్న' మున్నగువాటిచే పత్నీ-పరిచారకబృందము-నివాసస్థానము అనువాటిని నిర్దేశించుటనుబట్టియే అట్లే కలరని తెలియుచున్నది. భాష్యకారుడు ( ద్రమిడాచార్యుడు ) 'ఉన్నదున్నట్లుగ - చెప్పునదే శాస్త్రము' అని చెప్పెను.

మూ॥ ఏతదుక్తంభవతి। యథా-'సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ' ఇతి

నిర్దేశాత్ పరమాత్మస్వరూపం సమస్త హేయప్రత్యనీకాన-పధికానన్దైక తానతయా అపరిచ్ఛేద్యతయాచ సకలేతరవిల-క్షణం, తథా-'యస్సర్వజ్ఞః సర్వవిత్' 'పరాస్యశక్తిర్వివి-ధైవశ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ' 'తమేవభాన్త-మనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి।' ఇత్యాది నిర్దేశాత్ రూప పరిజనస్థానాదయశ్చ సకలేతర విలక్షణాః స్వాసాధారణాః అనిర్దేశ్యరూపస్వభావాః ఇతి।

అనువాదము:- ఇది చెప్పబడినట్లగుచున్నది-ఎట్లుగ - 'సత్యమ్ జ్ఞానమనన్తం బ్రహ్మ' అని నిర్దేశించుటనుబట్టి పరమాత్మయొక్క స్వరూపము నిఖిలములైన నింద్య దోషములకు విరుద్ధమైన అపరిమితానందమే ఘనమైయుండి, అంతని కొలుచుటకు వీలుకానిదగుటచేతను తనకంటె వేరైన సమస్త వస్తుజాతముకంటెను విలక్షణమైనదో, అట్లే - 'ఎవ్వడు సర్వజ్ఞుడో-సర్వవేత్తయో' 'ఆ పరమాత్మయొక్క అత్యుత్కృష్టమగు శక్తి, నానా ప్రకారముగ జ్ఞానము, బలము-క్రియారూపముగ స్వభావసిద్ధమైనది' 'ప్రకాశించుచున్న ఆ పరమాత్మ ననుసరించియే సమస్తము ప్రకాశించుచున్నది. ఆ పరమాత్మయొక్క దీప్తి చేతనే ఈ సమస్త జగత్తు భాసించుచున్నది.' మున్నగు నిర్దేశములనుబట్టి నిరతిశయములును లెక్కింపనలవి కానివియునగు సమస్త విలక్షణములైన గుణములు, అట్లే-'ఆదిత్యవర్ణమ్' (సూర్యునివంటి కాంతి కలవానిని) ఇత్యాది నిర్దేశమునుబట్టి రూపము, పరివారము, నివాసస్థానము మున్నగునవి తనకంటె వేరైన సమస్తముకంటెను భిన్నములై తనకు మాత్రమే అసాధారణముగ ఏర్పడినవై ఇట్టివని నిరూపించుట వీలుకానివి కలవని (తెలియుచున్నది.)

## ॥ వేదములు అపౌరుషేయములని నిరూపించుట ॥

మూ॥ వేదాః ప్రమాణంచేత్, విధ్యర్థవాదమంత్రగతం సర్వమ్ అపూర్వమ్ అవిరుద్ధమ్ అర్థజాతం యథావస్థితమేవబోధయన్తి.

ప్రామాణ్యంచ శబ్దానామ్ – 'ఔత్పత్తికస్తు శబ్దస్యార్థేన సంబంధః' ఇత్యుక్తమ్। యథా అగ్నిజలాదీనామ్ ఔష్ణ్యాది- శక్తియోగః స్వాభావికః, యథాచ చక్షురాదీనామ్ ఇంద్రి- యాణాం బుద్ధివిశేష జననశక్తిః స్వాభావికీ, తథా శబ్దస్యాపి బోధకత్వశక్తిః స్వాభావికీ।

నచహస్త చేష్టాదివత్ సంకేతమూలం బోధకత్వమ్ ఇతి వక్తుం శక్యమ్ అనాద్యనుసంధానా విచ్ఛేదేఽపి సంకేత యితృ పురుషాజ్ఞానాత్, యానిసంకేతమూలానితాని సర్వాణి సాక్షాద్వాపరంపరయావా జ్ఞాయన్తే। నచ దేవదత్తాదిశబ్దవత్ కల్పయితుంయుక్తమ్। తేషుచసాక్షాద్వా పరంపరయావా సంకేతోజ్ఞాయతే, గవాదిశబ్దానాంతు అనాద్యను సంధానా విచ్ఛేదేఽపి సంకేతాజ్ఞానాదేవ బోధకత్వశక్తిః స్వాభావికీ। అతః అగ్న్యాదీనామ్ ఔష్ణ్యాదివత్ ఇంద్రియాణాం బోధ- కత్వశక్తివచ్చ శబ్దస్యాపి బోధకత్వశక్తిః ఆశ్రయణీయా।

అనువాదము:– వేదములు ప్రమాణమైనచో (అని) విధివాక్యము లందును, అర్థవాదవాక్యములందును, మంత్రములందును, చెప్పబడి నవియు ఇతర ప్రమాణములచే తెలియనివియు (అపూర్వములు) విరోధ మెంతమాత్రము లేనివియు అయిన సమస్త విషయములను యథాతథ ముగ (ఉన్నవి యున్నట్లుగనే) బోధించుచున్నవి. వేదములు ప్రమాణ ములను విషయము (జైమిని ఋషిచే పూర్వమీమాంసా సూత్రములలో) 'ఔత్పత్తికస్తు శబ్దస్యార్థేన సంబంధః' (శబ్దమునకు అర్థముతోగల సంబం ధము అనాదిసిద్ధము) (1-1-7) అని చెప్పబడినది. నిప్పు, నీరు మున్నగు వాటికి వెచ్చదనమును చల్లదనమును కలిగించు శక్తులయొక్క సంబం ధము ఎట్లు స్వభావసిద్ధమో, కన్నులు మున్నగు ఇంద్రియములకు (ఆయాయి వస్తువుల) జ్ఞానమును కలిగించు శక్తి ఎట్లుగ సహజసిద్ధమో అట్లే శబ్దమునకుకూడ అర్థమును బోధించు శక్తి సహజసిద్ధమైనది. (అనగా

ఎవ్వరిచేతను కల్పింపబడినది కాదని తాత్పర్యము). చేతిసైగలు ఎట్లుగ సంకేతమునుబట్టి (ఈ సైగకు ఇది యర్థము అను గురుతునుబట్టి) అర్థమును బోధించుచున్నవో శబ్దముకూడ అట్లే సంకేతమును మూలముగా జేసికొని అర్థమును బోధించుచున్నదనుట కుదరదు. అనాదిసిద్ధమైన అనుసంధానమునకు (ఈ శబ్దమునకిది యర్థమను సంబంధ గ్రహణమునకు) విచ్ఛేదము లేకున్నను, సంకేతమును కల్పించిన వ్యక్తి ఎవ్వడో తెలియదుకావున (శబ్దములకుగల బోధకత్వశక్తి సంకేతమూలమనుట వీలుకాదు కదా!) ఏ శబ్దములు సంకేతమును పురస్కరించుకొని యర్థముల బోధించునో ఆ యర్థములు సాక్షాత్తుగనో పరంపరగనో (ఒకరినుండి మరియొకరికి అను నీ క్రమమునవో) తెలియుచున్నవి.

దేవదత్తుడు మున్నగు శబ్దములకువలె సంకేతమూలమే బోధకత్వమని నిర్ణయించుట తగదు. దేవదత్తాది శబ్దముల విషయమున సాక్షాత్తుగనో పరంపరగనో సంకేతము తెలియుచున్నది. (దేవదత్తుడని ఒకనికి పేరు పెట్టినప్పుడు ఆ పేరు పెట్టినవాడు మనకు తెలియును కనుక సాక్షాత్తుగనో, లేక వాడిని ఆ పేరుతో పిలుచుచుండుటనుబట్టి పరంపరగనో ఆ పేరు వానికి సంకేతమని తెలియును. ఇవి ఆధునిక సంకేతములుకదా!) గోవు మున్నగు శబ్దములకు మాత్రము అనాదిసిద్ధమగు అనుసంధానమునకు విచ్ఛేదము లేకున్నను (అనాదికాలమునుండి ఎట్టి విచ్ఛేదము లేకయే ఆ వస్తువును ఆ శబ్దముచేతనే వ్యవహరించుచున్నప్పటికిని) ఇట్లు వ్యవహరించుటకు సంకేతమెవ్వరు కల్పించిరో తెలియదు కావుననే గవాది శబ్దములకు వాటివాటి యర్థమును బోధించుటకుగల శక్తి సహజసిద్ధమైనదేనని (అంగీకరింపవలయును) కనుక నిప్పు మున్నగువాటికి వేడిని కల్గించుట మున్నగు శక్తులెట్లు సహజసిద్ధములో, చక్షురాదీంద్రియములకు విషయముల గ్రహించు శక్తి ఎట్లు సహజసిద్ధమో అట్లే శబ్దములకుగూడనని ఆశ్రయింపవలసియున్నది.

వివరణము:- శబ్దములకర్థమును బోధించుటకు వలయుశక్తి సహజ

సిద్ధమా? లేక సంకేత మూలముగ కల్పింపబడినదా? అను విషయమున శాస్త్రకారులకు అభిప్రాయభేదమున్నది.

'సామయికత్వాత్ శబ్దాదర్థసంప్రత్యయస్య' (న్యా.సూ.2-1-55)

'శబ్దార్థముల జ్ఞానము సామయికము (సమయమునుబట్టి ఏర్పడునది) కదా' అను సూత్రముచే శబ్దార్థముల జ్ఞానము 'సమయమునుబట్టి ఏర్పడునని తెలియుచున్నది. సమయమనగానేమి? అని విచారించుచు- భాష్యకారుడగు వాత్స్యాయనుడు ఇట్లు పేర్కొనినాడు - 'కః పునరయం సమయః? అస్యశబ్దస్యేదమర్థజాతమభిధేయమితి అభిధానాభిధేయనియమ నియోగః। తస్మిన్నుపయుక్తే శబ్దార్థ సంప్రత్యయో భవతి। విపర్యయే హి శబ్దశ్రవణేఽపి ప్రత్యయాభావః। సంబంధవాదినోఽపి చాయమవర్జనీయ ఇతి।' (ఈ సమయమనగానేమి? ఈ శబ్దమునకీ యర్థసముదాయము బోధ్యము (బోధింపదగినది) అని శబ్దమునకును - దానిచే బోధింపదగిన యర్థమునకున నియమమును ఏర్పరచుట. ఇది యుపయోగింపబడినప్పుడే శబ్దార్థముల జ్ఞానము కల్గును. అట్లుకానిచో శబ్దమును విన్నప్పటికిని (నియమమును గ్రహింపనందున) జ్ఞానము కలుగదు. శబ్దార్థములకు నిత్య సంబంధమున్నదని వాదించు మీమాంసకులును, వైయాకరణులును ఈ సమయమును తప్పక అంగీకరింపవలసినదే). న్యాయవార్త్తిక టీకాకారులు దీనినిట్లు వివరించిరి. 'అభిధానాభిధేయయోః నియమః-గోశబ్దస్య సాస్నాదిమానేవార్థః, ఏవమశ్వశబ్దస్య కేసరాదిమానేవేతి। తస్మిన్నియోగః బోద్ధవ్యః ఇతి, భగవతః పరమేశ్వరస్య సర్గాదౌ, సోఽయం సమయః ఇత్యర్థః। సంబంధవాదినోఽపీతి। యేఽపిమీమాంసకాః వైయాకరణావా స్వాభావికం శబ్దార్థయోః సంబంధమాస్థిషత తేషామపి నైవ సత్తామాత్రేణ గమకః అపితుజ్ఞాతఃసన్। విజ్ఞానేచ అయమస్య వాచక ఇతివా, అస్మాదయం బోద్ధవ్య ఇతివా సంకేతఏవోపాయః। వృద్ధవ్యవహారోఽపి గవాది శబ్దానాం దేవదత్తాదిశబ్దవత్ సంకేతపూర్వ ఏవ। తద్ వరమస్తు సంకేత ఏవ। కృతమత్రస్వాభావికేన సంబంధేన। తన్మాత్రాదేవ ప్రయోగప్రతి

పత్తి వ్యవహారాణాముపపత్తేరిత్యర్థః।' 'శబ్దార్థములయొక్క నియమము (అనగా) గోవు అను శబ్దమునకు గంగడోలుకల వస్తువే అర్థము, ఇట్లే గుర్రమను శబ్దమునకు జూలు కలదియే అర్థము అని. ఈ విషయమున నియోగము (నియమము) తెలియదగును అని భగవంతుడగు పరమేశ్వరుడు సృష్ట్యాదిలో చేసినదే ఈ నియమము అని యర్థము. (సంబంధవాదులుకూడ) యే మీమాసంకులును, వైయాకరణులును శబ్దార్థములకు స్వభావసిద్ధమగు సంబంధమున్నదని అంగీకరించిరో, వారికికూడ కేవలమీ నియమమున్నంత మాత్రముననే అర్థమును తెలియజేయదు. ఇక ఆ నియమము తెలియబడినప్పుడు (అర్థమును తెలియజేయును) ఆ నియమమును తెలిసినప్పుడు ఈ శబ్దము ఈ అర్థమునకు బోధకము అనిగాని, ఈ శబ్దమువలన నీ యర్థము తెలియవలయుననిగాని ఏ సంకేతమున్నదో అదియే ఉపాయము. వృద్ధ వ్యవహారముగూడ దేవదత్తాదిశబ్దములకు వలెనే గోవు మున్నగు శబ్దముల విషయమునగూడ సంకేతమును మూలముగ జేసికొనియే ఏర్పడుచున్నది. కనుక 'సంకేతమే' ఉండనిమ్ము. సహజసిద్ధమగు సంబంధ మెందులకు? సంకేతమాత్రముననే శబ్దప్రయోగముల జ్ఞానము, వ్యవహారములును కుదురుచున్నవికదా అని యర్థము'

(న్యాయవార్తిక తాత్పర్యటీక)

ఈ సంకేతమూలమే శబ్దములకు బోధకత్వశక్తియను నైయాయిక వాదమును భగవద్రామానుజులు అంగీకరింపరైరి. మీమాంసకులును, వైయాకరణులును అంగీకరించినట్లు వీరును శబ్దార్థ సంబంధము అనాది సిద్ధమనియే అంగీకరించిరి.

'ఔత్పత్తికస్తుశబ్దస్యార్థేన సంబంధః' అను జైమినీయసూత్రమును బట్టి శబ్దార్థములకుగల సంబంధము అనాదిసిద్ధమనియు, అది సహజమనియు మీమాంసకు లంగీకరింతురు. పై సూత్రమును వ్యాఖ్యానించుచు శబరస్వామి– 'అపౌరుషేయః శబ్దస్యార్థేన సంబంధః' (శబ్దమునకు అర్థముతోగల సంబంధము పురుషకల్పితము కాదని తాత్పర్యము) అని పేర్కొని

నాడు. ఔత్పత్తికః = స్వాభావికము. అనగా సహజసిద్ధమని యర్థము. వైయాకరణులు ఇంచుమించుగ ఈ అభిప్రాయమునే వెలిబుచ్చిరి. వాక్యపదీయకారుడగు భర్తృహరి 'సంబంధసముద్దేశము'న-

ఇంద్రియాణాం స్వవిషయేష్వనాదిర్యోగ్యతాయథా।
అనాదిరర్థైశ్శబ్దానాం సంబంధో యోగ్యతా తథా॥ (వా.సం.స. 29)

'చక్షురాది ఇంద్రియములకు వాటివాటి విషయములందు అనాదిసిద్ధమైన యోగ్యత ఎట్లు కలదో అట్లే అర్థములతో శబ్దములకు యోగ్యతయే అనాదిసిద్ధమగు సంబంధము'. అని శబ్దార్థ సంబంధము అనాదిసిద్ధమని పేర్కొనినాడు.

భగవద్రామానుజులు ఈ వాదమునే ప్రస్తుత గ్రంథమున పరిగ్రహించి వేదముల కపౌరుషేయత్వమును నిరూపించుచున్నారు.

మూ॥ ననుచ ఇంద్రియవత్ శబ్దస్యాపిబోధకత్వం స్వాభావికం సంబంధగ్రహణం బోధకత్వాయ కిమితి అపేక్షితే? లింగవత్ ఇత్యుచ్యతే యథా – జ్ఞాత సంబంధ నియమం ధూమాది అగ్న్యాదివిజ్ఞానజనకం, తథా జ్ఞాతసంబంధనియమః శబ్దోఽపి అర్థవిశేషబుద్ధిజనకః। ఏవంతర్హి, శబ్దోఽపి అర్థవిశేషస్య లింగమితి అనుమానమేవస్యాత్, నైవమ్; శబ్దార్థయోః సంబంధః బోధ్యబోధకభావఏవ; ధూమాదీనాంతు సంబంధాన్తరమితి. తస్య సంబంధస్య జ్ఞానద్వారేణ బుద్ధిజనకత్వమితి విశేషః।

అనువాదము:- 'మరి, చక్షురాదీంద్రియములు ఎట్లుగ స్వాభావసిద్ధముగ నర్థముల గ్రహించుచున్నవో అట్లే శబ్దములును సహజముగనే బోధకత్వశక్తి కలిగియున్నవని యన్నప్పుడు, శబ్దములర్థముల బోధించుటకు ఆ రెండింటి సంబంధమును గ్రహింపవలసిన యవసరమేమున్నది?' అన్నచో-లింగమువలె (వహ్నిని తెలియజేయు ధూమాది సాధనములు

లింగములు—వాటివలె) నని చెప్పుదుము. ఎట్లుగ – (ధూమమున్నచోట నిప్పుండుననెడి) ధూమాగ్నులకుగల సంబంధము తెలిసినప్పుడే – ధూమాదులు అగ్న్యాదుల జ్ఞానమును పుట్టింప సమర్థములో, అట్లే (ఈ శబ్దమునకీ యర్థమున్నదను) సంబంధము తెలియబడినప్పుడే శబ్దముకూడ అర్థ విశేషముయొక్క జ్ఞానమును పుట్టించుచున్నది. 'మరి అట్లైనచో (ధూమాగ్నుల సంబంధమునకువలెనే శబ్దార్థ సంబంధముకూడ గ్రహింపక తప్పనిచో) శబ్దముకూడ అర్థవిశేషమునకు లింగము (అనుమాపకము లేదా కారణము) అగుచున్నది కనుక (శబ్దార్థ వ్యవహారముకూడ) అనుమాన ప్రమాణమే కావలసివచ్చును.' అన్నచో, ఇట్లుకాదు, శబ్దార్థములకుగల సంబంధము 'బోధ్యబోధకభావమే.' (బోధింపబడు అర్థమునకును దానిని బోధించు శబ్దమునకుగల సంబంధము) ఇక ధూమాదులకును అగ్నికినిగల సంబంధము మాత్రము వేరైనదే. ఈ సంబంధమనునది తెలియబడుటచేతనే జ్ఞానమును కల్గింపగలుగుటయని విశేషము.

మూ॥ ఏవం గృహీతసంబంధస్య బోధకత్వదర్శనాత్ అనాద్యను-
సంధానావిచ్ఛేదేఽపి సంకేతాజ్ఞానాత్ బోధకత్వశక్తిరేవేతి
నిశ్చీయతే। ఏవం బోధకానాం పదసంఘాతానాం సంసర్గ-
విశేషబోధకత్వేన వాక్యశబ్దాభిధేయానామ్ ఉచ్చారణ-
క్రమోయత్ర పురుషబుద్ధిపూర్వకః, తేపౌరుషేయాః శబ్దా
ఇత్యుచ్యంతే। యత్రతు ఉచ్చారణక్రమః పూర్వపూర్వో-
చ్చారణ క్రమజనిత సంస్కారపూర్వకః సర్వదా అపౌరు-
షేయాః తేచ వేదాః ఇత్యుచ్యన్తే।

అనువాదము:- ఇట్లు గ్రహింపబడిన సంబంధమునకే (అర్థ) బోధకత్వము కనుపించుచున్నది కనుకను, అనాదిసిద్ధమగు అనుసంధానమునకు (ఈ శబ్ద మీ యర్థమును బోధించునను వ్యవహారమునకు) భంగము (విచ్ఛేదము) లేకున్నను, ఈ శబ్దములకిది యర్థమని సంకేత మెట్లేర్పడినదో తెలియనందున (ఇది) స్వాభావికమగు బోధకత్వశక్తియే (అర్థమును

బోధించుటకు శబ్దమందుగల సామర్థ్యమే) నని నిశ్చయింపబడు చున్నది. ఈ విధముగ బోధించు పదసముదాయములు విశిష్టమగు సమన్వయమును (సంసర్గరూపమగు పరస్పర సంబంధమును) బోధించునవగుటచేతనే 'వాక్యము'ను శబ్దముచే బోధింపబడుచున్నది. ఈ వాక్యములయొక్క ఉచ్చారణక్రమము (అనగా శబ్దముల నుచ్చరించు విధానము) ఎక్కడ-(ఉచ్చరించునట్టి) పురుషునియొక్క బుద్ధి ననుసరించియుండునో ఆ శబ్దములు పౌరుషేయశబ్దములని చెప్పబడుచున్నవి. ఎక్కడ ఈ ఉచ్చారణక్రమము (తనకు) ముందుగల వారి ఉచ్చారణక్రమమువలన కల్గిన సంస్కారమునుబట్టి ఏర్పడునో (అనగా తనకంటె పూర్వులైన వారా శబ్దముల నెట్లుచ్చరించిరో పలుమారులు విని (అభ్యసించి) దానివలన కల్గిన సంస్కారమునుబట్టి యేర్పడినదైనచో) అట్టియెడ ఎల్లప్పుడును (ఆ శబ్దములు) అపౌరుషేయములై వేదములని చెప్పబడుచున్నవి.

మూ॥ ఏతదేవ వేదానా మపౌరుషేయత్వం నిత్యత్వంచ, యత్ పూర్వోచ్చారణక్రమజనితసంస్కారేణ తమేవక్రమవిశేషం స్మృత్వా తేనైవక్రమేణ ఉచ్చార్యమాణత్వమ్। తేచ ఆనుపూర్వీవిశేషేణ సంస్థితాః అక్షరరాశయో వేదాః ఋగ్యజుస్సామాథర్వ భేదభిన్నాః అనంతశాఖావర్తన్తే। తేచవిధ్యర్థవాదమంత్రరూపాః వేదాః పరబ్రహ్మభూతనారాయణస్వరూపం, తదారాధన ప్రకారం, ఆరాధితాత్ ఫలవిశేషం చ బోధయన్తి। పరమపురుషవత్ తత్స్వరూప తదారాధన—తత్ఫలజ్ఞాపక—వేదాఖ్యం శబ్దజాతం నిత్యమేవ।

అనువాదము:– వేదముల అపౌరుషేయత్వము నిత్యత్వము అనగా నిదియే, (ఏమన–) పూర్వపూర్వజనులయొక్క ఉచ్చారణక్రమమువలన పుట్టిన సంస్కారముననుసరించి ఆ క్రమమునే స్మరించి అదే క్రమముతో

ఉచ్చరింపబడుట. ఒక నియతమగు క్రమముతో కూడియున్న ఆ యక్షర సముదాయములు అనన్తశాఖలుగల ఋగ్వేదము-యజుర్వేదము-సామవేదము-అథర్వణవేదము అను భేదముకలిగి వేరువేరుగనున్నవి. విధి-అర్థవాదము-మంత్రము అను స్వరూపముకల యీ వేదములు పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుని స్వరూపమును, ఆయననారాధించు పద్ధతిని, ఆరాధింపబడిన పరమాత్మవలన కలుగు విశిష్టఫలమును, బోధించుచున్నవి. పరమపురుషునివలెనే ఆయన స్వరూపమును, ఆయనయొక్క ఆరాధనమును, దానియొక్క ఫలమును తెలియజేయునట్టి వేదమను శబ్దసముదాయము నిత్యమే.

వివరణము:- లోకములో పదసముదాయరూపములగు వాక్యముల నుచ్చరించు పద్ధతి ఆయాయివ్యక్తుల బుద్ధులపైనాధారపడి యుండును తప్ప-మార్పులేని క్రమవిధానమేదియు వాటికి ఉండదు. అనగా ఒకడుచ్చరించినవాక్యమునే వేరొకడు ఆ పదములనే ముందువెనుకలకు మార్చి, లేదా అర్థము చెడకుండునట్లు పదములమార్చి పలుకవచ్చును. ఇచ్చట అర్థబోధ కలుగుటయే ప్రధానముతప్ప ఉచ్చారణక్రమములోనెట్టి నియమము ఆవశ్యకముకాదు. ఇక వేదాత్మకములగు వాక్యముల కట్లు కాక ఉదాత్తానుదాత్తాది స్వరములచే బంధింపబడిన పదములయొక్క ఒక క్రమవిధానముండును. ఈ క్రమము పూర్వపూర్వ వైదికసంప్రదాయమునననుసరించియే యుండును. అనగా గురుశిష్యపరంపరగా ఎట్టి మార్పునులేక ఉచ్చరింపబడుట అను విశేషలక్షణముండునని అభిప్రాయము. తన చిత్తమునకు తోచినట్లు అర్థానుగుణముగ పదముల క్రమమును మార్చుటగాని, పర్యాయపదముల చేర్చుటగాని చేయరాదు. మార్చినచో వాటికిగల మహత్త్వము పోవును. కనుకనే-మంత్రోచ్చారణ విషయమున వైదికపాఠసంప్రదాయనిష్ఠుడగు గురువునుండి అభ్యసించిన విధానమునననుసరించితప్ప-ఇచ్చవచ్చినట్లు మంత్రములనుచ్చరించినచో స్వరవర్ణాదివైకల్యము కలిగి-ఆ మంత్రములు వజ్రాయుధములై యజ

మాసుని చంపునని శ్రుతియే చెప్పుచున్నది.

మంత్రోహీనః స్వరతోవర్ణతోవా
మిథ్యాప్రయుక్తః నతమర్థమాహ।
సవాగ్వజ్రోయజమానం హినస్తి
యథేంద్రశత్రుః స్వరతోఽపరాధాత్॥

మంత్రము స్వరముచేగాని, వర్ణములచేగాని దుష్టమైనచో ఆ మంత్రము ఈయవలసిన యర్థమునీయకపోగా విపరీతఫలములగూడ నిచ్చును. వృత్రుడనువాడు వేదమంత్రోచ్చారణ దోషమువలననే ఇంద్రుని చేతిలో చచ్చినాడని తాత్పర్యము. ఇట్టి వేదము భగవత్స్వరూప–తదారాధన–తత్ఫలాదుల ప్రతిపాదించునదేనని తాత్పర్యము.

మూ॥ వేదానామనన్తత్వాత్ దురవగాహత్వాచ్చ పరమపురుష–నియుక్తాః పరమర్షయః, కల్పేకల్పే నిఖిలజగదుపకారార్థం వేదార్థం స్మృత్వా విధ్యర్థవాదమంత్రమూలాని ధర్మశాస్త్రాణి ఇతిహాసపురాణానిచ చక్రుః।

అనువాదము:– వేదములు అనంతములు (అసంఖ్యాకములు) కనుకను, అవగాహన మొనర్చుకొనుటకు కష్టతరములైనవి కనుకను, పరమపురుషుడగు పరమాత్మచే నియోగింపబడినవారై ఋషిపుంగవులు ప్రతి కల్పమునను సమస్తలోకముల కుపకార మొనర్చుటకై వేదప్రతిపాదితములగు అర్థములను స్మరించి విధివాక్యములను (యజేత–యాగము చేయుము ఇత్యాదిగ విధించు వాక్యములను), అర్థవాదవాక్యములను (స్తుతి–నిందారూపముగ ప్రాశస్త్యమును–అప్రాశస్త్యమును బోధించు వాక్యములు), మంత్రములను (యాగాది ప్రయోగములందుగల విషయమును స్మరింపజేయు వేదభాగములు) ఆధారముగజేసికొని ధర్మశాస్త్రములను (స్మృతులను) (భారతాది) ఇతిహాసములను, (వైష్ణవాది) పురాణములను నిర్మించిరి.

మూ॥ లౌకికాశ్చ శబ్దా వేదరాశేః ఉద్ధృత్యైవ తత్తదర్థవిశేషనామ-
తయా పూర్వవత్ ప్రయుక్తాః పారంపర్యేణ ప్రయుజ్యంతే।
ననుచ వైదికా ఏవ సర్వే వాచకాః శబ్దాశ్చేత్—'ఛందస్యేవం భాషాయామేవమ్' ఇతి లక్షణభేదః కథముపపద్యతే? ఉచ్యతే।
తేషామేవ శబ్దానాం తస్యామేవ ఆనుపూర్వ్యాం వర్తమానానాం తథైవ ప్రయోగః, అన్యత్ర ప్రయుజ్యమానానామన్యథేతి న కశ్చిద్ దోషః।

అనువాదము:- లోకమున వ్యవహరింపబడు శబ్దములు వేదరాశి నుండి వెలికిదీసి ఆయాయి విశిష్టార్థములకు పేరులుగా ప్రయోగింపబడినవై కాలక్రమమున వ్యవహరింపబడుచున్నవి. మరి, వైదిక శబ్దములే అన్నియు (లోకమున) వాచకశబ్దములన్నచో 'వేదమున నిట్లు, లోకవ్యవహారమున నిట్లు' అని లక్షణములలోని భేదము ఎట్లుకుదురును? చెప్పబడుచున్నది-ఆ శబ్దములకే అదే అక్షరక్రమములలో నున్న వాటికి అట్లే (మార్పులేకుండగ) ప్రయోగము, వేరొకచోట ప్రయోగింపబడిన ఆ శబ్దములకే వేరగు విధానము, కనుక దోషమేమియు లేదు.

వివరణము:- వైదికశబ్దములే లోకమున ప్రయోగింపబడుచున్నవని పూర్వము చెప్పబడినది. అట్లైనచో-పాణినీయ వ్యాకరణాదులందు - 'ఛందసి సహః' 'ప్రత్యయే భాషాయాం నిత్యమ్' ఇత్యాదిగ వైదికశబ్దములకు - లౌకికశబ్దములకు ప్రయోగ - ప్రక్రియావిధానము వేరువేరుగ చెప్పబడినది. ఇదియెట్లు కుదురును? అనియన్నచో-పూర్వపూర్వోచ్చారణ క్రమము ననుసరించి మార్పులేని అవిచ్ఛిన్న సంప్రదాయము ననుసరించిన శబ్దప్రయోగములు వైదికములనియు, కాలమునుబట్టి భిన్నభిన్నార్థములలో భిన్నభిన్న పరిణామములతో ప్రయోగింపబడు శబ్దములు లౌకికములనియు, ఈ విధముగ శబ్దములవియే అయినను ప్రయోగభేదమునుబట్టి వైదికలౌకికవ్యవస్థ కుదురునని తాత్పర్యము.

మూ॥ ఏవమ్, ఇతిహాసపురాణ ధర్మశాస్త్రోప బృంహిత సాంగ వేద—

వేద్యః పరబ్రహ్మభూతః నారాయణః నిఖిలహేయప్రత్యనీకః సకలేతర విలక్షణః అపరిచ్ఛిన్న జ్ఞానానన్దైక స్వరూపః స్వాభావికానవధికాతిశయా సంఖ్యేయ కల్యాణగుణగణాకరః స్వసంకల్పానువిధాయి స్వరూపస్థితిప్రవృత్తి భేదచిదచిద్వస్తు జాతః, అపరిచ్ఛేద్యస్వరూపస్వభావానన్త మహావిభూతిః నానావిధానన్త చేతనాచేతనాత్మకప్రపంచ లీలోపకరణః ఇతి ప్రతిపాదితమ్।

అనువాదము:- ఈ విధముగ ఇతిహాసములు, పురాణములు, ధర్మశాస్త్రములు అను వీటిచే ఉపబృంహితమై (వివరణములచే పోషింపబడినదై) అంగములతో (శిక్షా, వ్యాకరణమ్, ఛందః, నిరుక్తం, జ్యోతిషం, కల్పః-అను ఆరు అంగములతో) కూడిన వేదముచే తెలియదగినవాడును, పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుడు సమస్త నింద్యదోషములకు విరుద్ధమైన స్వభావముకలవాడు, తనకంటె భిన్నమైన సమస్తప్రపంచము కంటె (స్వరూపముచేతను, గుణములచేతను) అత్యంత విలక్షణుడైన వాడును, కొలుచుటకు వీలుగాని అపారములైన జ్ఞానము, ఆనందము అనునవి స్వరూపముగ కలవాడు. సహజసిద్ధమైన అపరిమితాతిశయము గలిగి లెక్కింపనలవికాని కల్యాణగుణబృందములకు ఖనియైనవాడు. తన యొక్క సంకల్పముచే (ఇచ్ఛచే) నియమింపబడు స్వరూపము, ఉనికి, ప్రవృత్తి (చేష్ట మున్నగునది) పారస్పరికభేదము అనువీటితోకూడిన జీవ-జడాత్మక వస్తుసముదాయము కలవాడు. ఇంతయని కొలువరాని స్వరూపము, స్వభావము కలిగిన అపారమగు మహావిభూతి కలవాడు. (మహావిభూతిశబ్దము ఇచ్చట నిత్యవిభూతిని బోధించును. నిత్యవిభూతి యనగా భగవంతునకు భోగ్యముగను, భోగోపకరణములుగను అమరి యున్న శ్రీవైకుంఠాది సమస్తము.) అనేక విధములుగ అపారమై యున్న జీవ-జడాత్మక సమస్త ప్రపంచమును తన లీలకు సాధనముగా చేసికొన్నవాడు, (కనుక దీనిని లీలావిభూతియందురు.) అని చెప్పబడినది.

వివరణము:- ఇంతవరకు చాల విస్తారముగ నిరూపింపబడిన విషయములనే భగవద్రామానుజులు గ్రంథనిగమనార్థమై (గ్రంథమును ముగించుటకై) మరల సంగ్రహముగ ప్రదర్శించుచున్నారు. పై వాక్యములలో నిత్యవిభూతితోను, లీలావిభూతితోను కూడి నిఖిలవేదప్రతిపాద్యమైన శ్రీమన్నారాయణాత్మక పరంబ్రహ్మతత్త్వమును నిరూపించినారు. ఇప్పుడు సర్వశబ్దములచేతను, సర్వము శరీరముగా కలిగి-సర్వమునకంతరాత్మయైన శ్రీమన్నారాయణుడే సామానాధికరణ్యనిర్దేశమునుబట్టి ప్రతిపాదింపబడుచున్నాడని చెప్పబడుచున్నది.

మూ॥ 'సర్వం ఖల్విదంబ్రహ్మ' 'ఐతదాత్మ్యమిదంసర్వమ్' 'తత్త్వమసి శ్వేతకేతో!' ఏనమేకేవదన్త్యగ్నిం మరుతోఽన్యే ప్రజాపతిమ్। ఇంద్రమేకేపరేప్రాణమ్ అ'పరేబ్రహ్మశాశ్వతమ్॥' 'జ్యోతీంషిశుక్రాణిచయానిలోకేత్రయోలోకాలోక పాలాస్త్రయీచ। త్రయోగ్నయశ్చాహుతయశ్చపంచ సర్వే దేవా దేవకీపుత్రఏవ॥' 'త్వంయజ్ఞస్త్వంవషట్కారః త్వమోంకారః పరంతప!' 'ఋతధామావసుః పూర్వః వసూనాంత్వం ప్రజాపతిః' 'జగత్ సర్వం శరీరంతే స్థైర్యతే వసుధాతలమ్। అగ్నిః కోపః ప్రసాదస్తే సోమఃశ్రీవత్సలక్షణః॥' 'జ్యోతీంషి విష్ణుః భువనానివిష్ణుః వనానివిష్ణుర్గిరయోదిశశ్చ। నద్యస్సముద్రాశ్చ సఏవసర్వం యదస్తియన్నాస్తిచ విప్రవర్య।' ఇత్యాది సామానాధికరణ్యప్రయోగేషు సర్వైఃశబ్దైః సర్వశరీరతయా సర్వప్రకారం బ్రహ్మైవ అభిధీయత ఇతిభోక్తమ్।

అనువాదము:- 'ఈ సమస్తము బ్రహ్మము' 'ఇదియంతయు పరమాత్మనే ఆత్మగా కలిగియున్నది' 'బ్రహ్మాత్మకుడవు నీవు! ఓ శ్వేతకేతూ!' 'ఈ పరమాత్మను కొందరు అగ్నియని చెప్పుచున్నారు. కొందరు మరుత్తులనుచున్నారు. మరికొందరు ప్రజాపతి (బ్రహ్మ) అనుచున్నారు.

కొందరు ఇంద్రుడని, ప్రాణమని మరికొందరు, ఇతరులు నిత్యమగు పర బ్రహ్మమనియు చెప్పుచున్నారు'. 'లోకమునగల శుభ్రవర్ణములగు నక్షత్రాది గ్రహములును, మూడులోకములును, లోకపాలకులును, ఋగ్యజుస్సామాత్మకమగు వేదత్రయమును, దక్షిణాగ్ని, గార్హపత్యము, ఆహవనీయమను మూడగ్నులును, ఐదు ఆహుతులును, సమస్త దేవతలును దేవకీపుత్రుడగు శ్రీకృష్ణుడే!' 'నీవు యజ్ఞస్వరూపుడవు, నీవే వషట్కారము, నీవే ప్రణవము, నీవే ఉత్కృష్టమగు తపస్సువు.' 'పూర్వవసువులలో ఋతుధామయను నామముగల వసువు నీవే, నీవే ప్రజాపతివి' 'శ్రీవత్సమను చిహ్నముగల నీకు ఈ సమస్త జగత్తు దేహము, భూమియంతయు నీ ధైర్యము, వహ్ని నీ క్రోధము, ప్రసన్నత-చంద్రుడు' 'నక్షత్రాదులన్నియు విష్ణువే, లోకములు విష్ణువే, అరణ్యములు విష్ణువు, పర్వతములు విష్ణువు, దిక్కులు, నదులు, సముద్రములు, ఉన్నది-లేనిది అంతయు—ఓ మైత్రేయా! విప్రశ్రేష్ఠా! ఆ విష్ణువే!' మున్నగు సామానాధికరణ్య ప్రయోగములందు అన్ని శబ్దములచేతను సర్వము శరీరముగా కలిగి, సర్వము ప్రకారముగా (విడదీయరాని విశేషణముగా) కలిగిన బ్రహ్మమే చెప్పబడుచున్నదని చెప్పితిమి.

## ॥ సృష్టి ప్రకారము ॥

మూ॥ సత్యసంకల్పం పరంబ్రహ్మ స్వయమేవ – 'బహుప్రకారం స్యామ్' ఇతి సంకల్ప్య, అచిత్సమష్టిరూప మహాభూత–సూక్ష్మం వస్తు భోక్తృవర్గసమూహం చ స్వస్మిన్ ప్రలీనం స్వయమేవ విభజ్య, తస్మాత్ భూతసూక్ష్మాత్ వస్తునః మహా–భూతానిసృష్ట్వా, తేషుచ భోక్తృవర్గమాత్మతయా ప్రవేశ్య, తైః చిదచిదధిష్ఠితైః మహాభూతైః అన్యోన్యసంసృష్టైః కృత్స్నం జగత్ విధాయ, స్వయమపిసర్వస్య ఆత్మతయా ప్రవిశ్య పరమాత్మత్వేన అవస్థితం సర్వశరీరం బహు-

ప్రకారమవతిష్ఠతే।

అనువాదము:– అప్రతిహతమగు (మొక్కవోని) సంకల్పము కల్గిన ఆ పరబ్రహ్మము స్వయముగ 'అనేక విధములుగ అగుదునుగాక' అని సంకల్పించి, జడమైన ప్రకృతియొక్క సముదాయరూపములైన మహాభూతములయొక్క (పృథివ్యప్తేజోవాయ్వాకాశములయొక్క) సూక్ష్మవస్తువును, జీవసముదాయమును తనయందే ఇమిడియున్నదానిని తానే విభజించి, (వేరుచేసి) మహాభూతములయొక్క సూక్ష్మవస్తువునుండి (పంచ) మహాభూతములను సృజించి, వాటియందు భోగముననుభవించువారగు జీవులను ప్రవేశపెట్టి, అట్టి జీవులతో కూడియున్నవియు, ఒకదానితోనొకటి కలసియున్నవియునగు మహాభూతములతో సమస్త జగత్తును నిర్మించి, స్వయముగ జీవ–జడాత్మక వస్తుజాతమునకు తాను ఆత్మగా (లోపల) ప్రవేశించి పరమాత్మగా నున్నదగు ఆ పరబ్రహ్మమే సర్వము శరీరముగా కలిగినదియై అనేకవిధములుగా నున్నది.

వివరణము:– 'సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ ఇతి' (ఆ పరమాత్మ తానే అనేక ప్రకారములుగాపుట్టుదునుగాకయని సంకల్పించినది) అను (తైత్తిరీయ. ఉ. 6 అ.) వచనమునుబట్టి సమస్తమును సృజించి–దానిలో ఆ పరమాత్మయు ప్రవేశించి నామరూప విభాగార్థతను కలిగించినాడని పూర్వము నిరూపింపబడిన సృష్టిప్రక్రియయే ఇక్కడ సంగ్రహముగ మరల నిరూపింపబడినది.

మూ॥ యదిదం మహాభూతసూక్ష్మం వస్తు తదేవప్రకృతిశబ్దేన అభిధీయతే। భోక్తృవర్గసమూహ ఏవ పురుషశబ్దేన ఉచ్యతే। తౌచ ప్రకృతిపురుషౌ పరమాత్మశరీరతయా పరమాత్మప్రకారభూతౌ, తత్ప్రకారః పరమాత్మైవ ప్రకృతిపురుషశబ్దాభిధేయః॥ 'సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ ఇతి–తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్, తదనుప్రవిశ్య సచ్చత్య-

చ్చాభవత్, నిరుక్తంచా నిరుక్తంచ, నిలయనంచా నిలయనంచ, విజ్ఞానంచా విజ్ఞానంచ, సత్యంచా నృతంచ సత్యమభవత్' ఇతి పూర్వోక్తం సర్వమ్ అనయైవ శ్రుత్యావ్యక్తమ్

అనువాదము:- ఈ మహాభూతములయొక్క సూక్ష్మమగు (మూల) వస్తువేదికలదో అదియే 'ప్రకృతి'యను శబ్దముచే చెప్పబడుచున్నది. భోగించునట్టి జీవులయొక్క సముదాయమే 'పురుషుడ'ను శబ్దముచే చెప్పబడుచున్నది. ఈ ప్రకృతి-పురుషులు (వీటికే అచేతన-చేతనులని వ్యవహారము) ఇవి పరమాత్మకు శరీరమైనవగుటచేతనే, పరమాత్మనుండి వేరుచేయరాని విశేషణాంశములు (ప్రకారములు) వీటిని ప్రకారములుగా (వేరుచేయరాని విశేషణములుగ) గలవాడగు పరమాత్మయే 'ప్రకృతి' శబ్దముచేతను 'పురుష' శబ్దముచేతను బోధింపదగియున్నాడు. 'ఆ పరమాత్మ సంకల్పించెను. అనేకవిధములుగా పుట్టుదునుగాకయని. దానిని (జగత్తును) సృజించి దానిలోనే ప్రవేశించెను. దానిలో ప్రవేశించి నిర్వికారమగు చేతనమును (సచ్చ) వికారాస్పదమగు అచేతనమును (త్యచ్చ) ఆయెను. (జాతిగుణాది విశిష్టమగు) అచేతనము (నిరుక్తం) (జాతిగుణాది శూన్యమగు) చేతనము (అనిరుక్తమ్) ఆయెను. అచేతనమున కాధారమైన చేతనము (నిలయనమ్) చేతనమునాశ్రయించియున్న అచేతనము (అనిలయనమ్చ) ఆయెను. అజడము (విజ్ఞానము) జడమును (అవిజ్ఞానమును) ఆయెను. సత్యమని పిలువబడు నా పరబ్రహ్మమే నిర్వికారమైన చేతనాత్మకమగు సత్యవస్తువుగను, వికారాస్పదమైన అచేతనాత్మకమగు అనృతవస్తువుగను ఆయెను.' (తైత్తి. 2-6) అనిపూర్వము చెప్పబడినదంతయు ఈ శ్రుతివచనముచేతనే స్పష్టమైనది.

## ॥ భగవత్ ప్రాప్త్యుపాయ నిరూపణము ॥

మూ॥ భగవత్ప్రాప్త్యుపాయశ్చ శాస్త్రాధిగతతత్త్వజ్ఞానపూర్వక-స్వకర్మానుగృహీత-భక్తినిష్ఠాసాధ్యానవధికాతిశయ ప్రియ

విశదతమప్రత్యక్షతాపన్నానుధ్యానరూప–పరభక్తిరేవ ఇత్యుక్తమ్। భక్తిశబ్దశ్చ ప్రీతివిశేషేవర్తతే। ప్రీతిశ్చ జ్ఞానవిశేష ఏవ॥

అనువాదము:– భగవంతునిపొందుటకు ఉపాయము పరభక్తియే నని చెప్పబడినది. ఈ పరభక్తి శాస్త్రములవలన తెలియబడిన తత్త్వ జ్ఞానముకలిగి, తత్పూర్వకముగ స్వ (వర్ణాశ్రమోచిత) కర్మముల నాచరించుటచే పుట్టిన భక్తినిష్ఠచే (స్థిరభక్తిచే) సాధింపదగినదియు అపారమగు నతిశయముతోకూడి ప్రేమాస్పదమై, స్వచ్ఛమగు ప్రత్యక్షమువలె నేర్పడి అనుధ్యానమని పిలువబడునది. భక్తియను శబ్దము ప్రీతివిశేషమును బోధించుచున్నది. ప్రీతియనగా విశిష్టమగు జ్ఞానమే॥

వివరణము:– భక్తిస్వరూపము, 267, 268, 294, 298, 293 పుటలలోని అనువాద వివరణములలో చూడనగును.

## ॥ భగవంతునకు శేషము లేదా దాసుడైయుండుటే సుఖము ॥

మూ॥ ననుచ సుఖం ప్రీతిః ఇత్యనర్థాంతరమ్, సుఖంచ జ్ఞానవిశేష సాధ్యం పదార్థాంతరమితిలౌకికాః। నైవమ్, యేనచజ్ఞానవిశేషేణ తత్ సాధ్యమిత్యుచ్యతే, సఏవ జ్ఞానవిశేషః సుఖమ్।

అనువాదము:– 'మరి, సుఖము–ప్రీతి అను రెండిటికిని అర్థమొక్కటే. సుఖమనగా ఒకానొక జ్ఞానముచే సాధింపదగిన వేరొక పదార్థమని లోకవ్యవహారాభిజ్ఞులు చెప్పుదురు.' (అన్నచో) ఇది సరికాదు. ఏ జ్ఞానవిశేషముచేత ఆ సుఖము సాధింపదగినదని చెప్పబడుచున్నదో ఆ జ్ఞానవిశేషమే సుఖము.

మూ॥ ఏతదుక్తంభవతి–విషయజ్ఞానాని సుఖ–దుఃఖ–మధ్యస్థసాధా-

రణాని। తానిచ విషయాధీనవిశేషాణి తథా భవన్తి। యేనచ విషయవిశేషేణ విశేషితం జ్ఞానం సుఖస్యజనకమిత్యభిమతం తద్విషయజ్ఞానమేవ సుఖమ్। తదతిరేకి పదార్థాన్తరంనోప- లభ్యతే। తేనైవ సుఖిత్వ వ్యవహారోపపత్తేశ్చ।

అనువాదము:- ఇది చెప్పబడినదిట్లగుచున్నది. (లోకమున) విషయములవలన కలిగిన జ్ఞానములు సుఖమునకును, దుఃఖమునకు, ఈ రెండిటికంటె వేరైన తటస్థస్థితికిని సమానముగనే ఉండును. ఈ జ్ఞానములు విషయములలోని భేదమునుబట్టియే అట్లగుచున్నవి. ఏ విషయముతోకూడిన జ్ఞానము సుఖమును పుట్టించునదని ఇష్టమో, అట్టి విషయజ్ఞానమే సుఖము. దానికంటె వేరైన పదార్థమేదియు లభించుటలేదు. దానిచేతనే 'వీడు సుఖవంతుడు' అను వ్యవహారము కుదురుచున్నదికదా!

వివరణము:- లోకమున సుఖదుఃఖములకుగాని తటస్థబుద్ధికిగాని విషయములే (ఆయాయి వస్తువులే) నిమిత్తములు. కనుక ఏ విషయమును పురస్కరించుకొని సుఖము లేదా దుఃఖము పుట్టుచున్నదని భావింతుమో అట్టి విషయములయొక్క జ్ఞానమే సుఖము లేదా దుఃఖముతప్ప— ఆయాయి విషయజ్ఞానములకంటె వేరైన సుఖదుఃఖములనునవి ఏవియు లేవని తాత్పర్యము. దీనినిబట్టి సుఖదుఃఖములు జ్ఞానరూపములేననియు, సుఖరూపమగు ప్రీతికూడ జ్ఞానమేననియు స్పష్టమగుచున్నది.

మూ॥ ఏవం విధసుఖరూపజ్ఞానస్య విశేషకత్వం బ్రహ్మవ్యతిరిక్తస్య వస్తునః సాతిశయమ్ అస్థిరంచ, బ్రహ్మణశ్చ అనవధికాతి- శయం స్థిరంచ ఇతి-'ఆనందోబ్రహ్మ' ఇత్యుచ్యతే। విషయాయత్తత్వాత్ జ్ఞానస్య సుఖరూపతయా బ్రహ్మైవసుఖమ్।

తదిదమాహ-'రసోవైసః, రసంహ్యేవాయం లబ్ధ్వా ఆనందీభవతి' ఇతి. బ్రహ్మైవసుఖమితి బ్రహ్మలబ్ధ్వాసుఖీ భవతీత్యర్థః॥ పరమపురుషః స్వేనైవ స్వయమ్ అనవధికాతి-

శయసుఖస్యన్ పరస్యాపి సుఖం భవతి, సుఖరూపత్వావిశే-
షాత్, బ్రహ్మ యస్య జ్ఞానవిషయో భవతి స సుఖీ భవతి ఇత్యర్థః॥

అనువాదము:- ఇట్టి సుఖస్వరూపమగు జ్ఞానమునకు బ్రహ్మము కంటె వేరైన వస్తువువలన కలుగు విశేషము పరిమితము, తక్కువకాలము మాత్రమే ఉండునది. బ్రహ్మమువలన కలుగు విశేషము నిరవధికమై స్థిరమైనది (కనుకనే) 'ఆనందమే బ్రహ్మము'ని చెప్పబడుచున్నది. సుఖరూపమగు జ్ఞానమునది విషయమున కధీనపడియున్నది కనుక, (జ్ఞానమునకు విషయమైన) బ్రహ్మమే సుఖము. (ఉపనిషత్తు) దీనినే ఇట్లు చెప్పుచున్నది-'రసమే ఆ పరమాత్మ, రసమునే పొంది (జీవుడు) ఆనందించుచున్నాడు.' (తై.) అని, బ్రహ్మమే సుఖమనియు, బ్రహ్మమును పొంది ఆనందించుచున్నాడని యర్థము. పురుషోత్తముడగు శ్రీమన్నారాయణుడు తనచేత తానే అపారమగు నతిశయముతోకూడి సుఖమైనవాడై ఇతరమునకుకూడ సుఖమగుచున్నాడు. సుఖస్వరూపము సమానమే కదా! బ్రహ్మము ఎవ్వని జ్ఞానమునకు విషయమగునో ఆతడే సుఖము కలవాడగునని యర్థము.

మూ॥ తదేవం పరస్య బ్రహ్మణః అనవధికాతిశయాసంఖ్యేయ
కల్యాణగుణాకరస్య నిరవద్యస్య అనన్తమహావిభూతేః అన-
వధికాతిశయ సౌశీల్య వాత్సల్య సౌందర్య జలధేః సర్వశేషి-
త్వాత్। ఆత్మనః శేషత్వాత్ ప్రతిసంబంన్ధితయా అనుసం-
ధీయమానమ్ అనవధికాతిశయప్రీతి విషయం సత్ పరం
బ్రహ్మైవ ఏనమాత్మానం ప్రాపయతి ఇతి।

అనువాదము:- ఈ విధముగ అపారమగు అతిశయముతో (గొప్పతనముతో) కూడిన లెక్కింపనలవికాని కల్యాణగుణములకు స్థానమైనవాడును, ఎట్టి దొసగులు లేనివాడును, అనంతమగు మహావిభూతి కలవాడును, అంతులేని గొప్పతనముకల సౌశీల్యము (గొప్పవారికి చిన్న

వారిపట్ల గల సన్నిహిత ప్రవృత్తి) వాత్సల్యము (పెద్దలకు పిన్నలపట్ల గల ప్రీతి) సౌందర్యము మున్నగు గుణములకు సముద్రమువలె స్థానమైనవాడును, అయిన ఆ పరమాత్మయే సమస్తమునకు 'స్వామి' (శేషి) కనుక, జీవుడు శేషుడు (దాసుడు) కనుకను, ఆ పరమాత్మకు చెందినవాడనను సంబంధజ్ఞాన పురస్సరముగ ధ్యానింపబడినదై, అపరిమితమగు ప్రేమకు (పరితుష్టికి) ఆస్పదమైన పరబ్రహ్మమే అతని నుద్దేశించి (జీవునుద్దేశించి) తనకు తానే పొందించుకొనును అని.

వివరణము:- ఇక్కడ భగవంతునకు నేను శేషుడను (దాసుడను) అను అనుసంధానమే జీవునకు ప్రీతికరమని చెప్పబడినది.

మూ॥ ననుచ అత్యన్తశేషతైవ ఆత్మనః అనవధికాతిశయం సుఖమిత్యుక్తం భవతి। తదేతత్ సర్వలోకవిరుద్ధమ్। తథాహి- సర్వేషామేవచేతనానాం స్వాతంత్ర్యమేవ ఇష్టతమం దృశ్యతే। పారతంత్ర్యం దుఃఖతరమ్। స్మృతిశ్చ-'సర్వం పరవశందుఃఖం సర్వమాత్మవశం సుఖమ్' తథాచ - 'సేవాశ్వవృత్తిరాఖ్యాతా తస్మాత్తాం పరివర్జయేత్' ఇతి।

తదిదమ్ అనధిగతదేహాతిరిక్తాత్మ స్వరూపాణాం శరీరాత్మాభిమాన విజృంభితమ్। తథాహి-శరీరం హి మనుష్యత్వాది జాతిగుణాశ్రయపిండభూతం స్వతంత్రం ప్రతీయతే, తస్మిన్నేవ 'అహమ్' ఇతి సంసారిణాం ప్రతీతిః, ఆత్మాభిమానో యాదృశః తదనుగుణైవ పురుషార్థప్రతీతిః, సింహవ్యాఘ్రవరాహమనుష్య - యక్షరక్షః పిశాచదేవదానవ స్త్రీపుంసవ్యవస్థితాత్మాభిమానినాం సుఖానివ్యవస్థితాని, తానిచ పరస్పరవిరుద్ధాని, తస్మాత్ ఆత్మాభిమానానుగుణపురుషార్థ వ్యవస్థయా సర్వం సమాహితమ్।

అనువాదము:- 'మరి, 'అత్యన్తము దాసుడై యుండుటే ఆత్మకు

అపారమగు అతిశయము (విశేషము) గల సుఖము' అని చెప్పబడినట్లై నది. ఇది సమస్త లోకములకు విరుద్ధము. (అనుభవదూరమని తాత్ప ర్యము) ఎట్లనగా—సమస్త జీవులకును స్వాతంత్ర్యమే (దాస్యము లేకుండుటయే) మిక్కిలి ఇష్టముగా కన్పట్టుచున్నది. పరతంత్రత్వము (ఇతరులకు లొంగియుండుట) మిక్కిలి దుఃఖము. ధర్మశాస్త్రమిట్లుచెప్పు చున్నది–'ఇతరులకు వశమైనదంతయు దుఃఖము, తనకు వశమైనదంత యు సుఖము' (మను. 4-160) 'సేవయనునది శునక వృత్తి యంటిదని చెప్పబడినది. కనుక దానిని విడువవలయును' అని.

ఇదియంతయు శరీరముకంటె వేరైన ఆత్మ కలదను వివేకమును పొందనివారికి–శరీరమే ఆత్మయను అభిమానమువలన ఏర్పడినది. ఎట్ల నగా–శరీరమనగా మనుష్యత్వము మున్నగు జాతికిని, గుణములకును నెలవైన ఒక పదార్థము. ఇది స్వతంత్రముగ భాసించుచుండును. దీని యందే (దేహమందే) 'నేను' (అహమ్) అని సంసారులగు జీవులకు జ్ఞానము కలుగుచున్నది. ఆత్మాభిమానమెట్టిదో దానికి తగినట్లుగనే పురు షార్థములు అనుభవగోచరము లగుచుండును. సింహము, పులి, వరా హము, మనుష్యుడు, యక్షుడు, రాక్షసుడు, పిశాచము, దేవత, దాన వుడు, స్త్రీ, పురుషుడు మున్నగు దేహములయందు ఆత్మాభిమానము (ఈ దేహమే ఆత్మ అను జ్ఞానము) కలవారికి (జీవులకు) సుఖములు (ఆయా యి దేహములబట్టి) వేరువేరుగనున్నవి. అవి ఒకదానికంటె నొకటి విరుద్ధమైనవి. కనుక దేహమందు కలిగెడి ఆత్మ బుద్ధికి తగినట్లుగనే పురుషార్థములయొక్క వ్యవస్థ ఏర్పడుచున్నది. ఈ విధముగ అంతయు సమాధానింపబడినది.

వివరణము:– 22, 23, 24 పుటలలోని వివరణము చూడనగును.

మూ॥ ఆత్మస్వరూపం తు దేవాదిదేహ విలక్షణం జ్ఞానైకాకారమ్। తచ్చ పరశేషతైకస్వరూపమ్। యథావస్థితాత్మాభిమానే

> **తదనుగుణైవ పురుషార్థప్రతీతిః। 'ఆత్మా జ్ఞానమయోఽమలః' ఇతిస్మృతేః జ్ఞానైకాకారతా ప్రతిపన్నా; 'పతిం విశ్వస్య' ఇత్యాది శ్రుతిగణైః పరమాత్మశేషతైకాకారతా చ ప్రతిపాదితా, అతః సింహవ్యాఘ్రాది శరీరాత్మాభిమానవత్, స్వతంత్రాభిమానోఽపి కర్మకృత విపరీతాత్మజ్ఞానరూపో వేదితవ్యః।**

అనువాదము:- ఇక ఆత్మస్వరూపము దేవతలు మున్నగు శరీరములకంటె వేరైనదై జ్ఞానముమాత్రమే ఆకారముగాకలది. అది పరుడగు భగవంతునకు 'శేషమై' యుండుటే (దాసత్వమును పొంది యుండుటే) స్వరూపముగా కలిగియున్నది. ఉన్నదున్నట్లుగా ఆత్మయొక్క స్వరూపమును కలిగియున్నప్పుడు దానికి తగిన పురుషార్థమే అనుభవగోచరమగును. 'జ్ఞానస్వరూపుడైన ఆత్మ-నిర్మలుడు' అను స్మృతివచనమును (విష్ణుపురాణవచనమును) బట్టి ఆత్మ-జ్ఞానముమాత్రమే స్వరూపముగా కలదని ప్రతిపాదింపబడినది. కనుక సింహము, పులి మున్నగు శరీరములందు ఆత్మాభిమానమున్నట్లే 'నేను స్వతంత్రుడను' అను అభిమానముకూడ కర్మమువలన కలిగిన విపరీతజ్ఞానమేనని తెలియవలసియున్నది.

**మూ॥ అతః కర్మకృతమేవ పరమపురుష వ్యతిరిక్త విషయాణాం సుఖత్వమ్, అతఏవ తేషామ్ అల్పత్వమ్ అస్థిరత్వంచ। పరమపురుషస్యైవ స్వతఏవ సుఖత్వమ్। అతఃతదేవ స్థిరమ్ అనవధికాతిశయంచ, 'కంబ్రహ్మ ఖంబ్రహ్మ' 'ఆనందో బ్రహ్మ' 'సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ' ఇతిశ్రుతేః॥**

అనువాదము:- కనుక, పరమపురుషుడగు పరమాత్మకంటె వేరైన విషయములు సుఖజనకములనుట కర్మమునుబట్టి యేర్పడినదే. కనుకనే అవి-అల్పములు, అస్థిరములు. పరమపురుషుడే సహజముగ సుఖస్వరూ

పుడు. అందువలన పరమపురుషనిష్ఠమగు సుఖమే అపారమైనది. 'సుఖము బ్రహ్మము,' 'ఆకాశము బ్రహ్మము' 'ఆనందమే బ్రహ్మము' 'సత్య స్వరూపము, జ్ఞానస్వరూపము, అపరిచ్ఛిన్నమునైనది బ్రహ్మము' అను శ్రుతినిబట్టి (ఇదియే తెలియుచున్నది).

మూ॥ బ్రహ్మవ్యతిరిక్తస్య కృత్స్నస్య వస్తునః స్వరూపేణ సుఖత్వాభావః కర్మకృతత్వేనచ అస్థిరత్వం భగవతాపరాశరేణ ఉక్తమ్।

నరకస్వర్గసంజ్ఞైవై పాపపుణ్యే ద్విజోత్తమ।
వస్త్వేకమేవదుఃఖాయసుఖాయేర్ష్యాగమాయచ॥
కోపాయచ యతస్తస్మాత్ వస్తువస్త్వాత్మకంకుతః॥

సుఖదుఃఖాద్యేకాన్తరూపేణ వస్తునోవస్తుత్వం కుతః? తదేకాన్తతా పుణ్యపాపకృతేత్యర్థః॥

ఏవమ్ అనేక పురుషాపేక్షయా కస్యచిత్ సుఖమేవ కస్యచిత్ దుఃఖం భవతి ఇతి అవ్యవస్థాం ప్రతిపాద్య, ఏకస్మిన్నపి పురుషే నవ్యవస్థితమిత్యాహ—

తదేవప్రీతయే భూత్వా పునః దుఃఖాయజాయతే।
తదేవ కోపాయ యతః ప్రసాదాయచజాయతే॥
తస్మాద్ దుఃఖాత్మకంనాస్తి నచకించిత్ సుఖాత్మకమ్।

ఇతి। సుఖదుఃఖాత్మకత్వం సర్వస్యవస్తునః కర్మకృతం, నవస్తుస్వరూపకృతమ్; అతః కర్మావసానే తదపైతి ఇత్యర్థః॥

అనువాదము:- పరబ్రహ్మముకంటె వేరైన సమస్త వస్తువు స్వరూపమునుబట్టి సుఖరూపము కాకుండుట, కర్మమువలన కల్గినదగుటచే అస్థిరమైయుండుట (అనునది) భగవానుడగు పరాశరునిచే (విష్ణుపురాణమున) చెప్పబడినది.

'ఓ ద్విజోత్తమా! పాపపుణ్యములనునవే నరకము స్వర్గము అను పేరులను పొందియున్నవి. ఒకే వస్తువు దుఃఖమునకును, సుఖమునకును, ఈర్ష్యకును, కోపమునకును కారణమగుచున్నది. కనుక 'వస్తువు' వస్తువుగ నెక్కడున్నది?

కేవలము సుఖరూపముగనో, కేవల దుఃఖరూపముగనో ఏ వస్తువు వస్తువుగ ఎట్లున్నది? కేవలము పుణ్య పాపాత్మకమగు కర్మమునుబట్టి మాత్రమే ఆ వస్తువు సుఖముగనో, దుఃఖముగనో ఉన్నదని యర్థము.

ఈ విధముగ అనేక వ్యక్తులను పురస్కరించుకొని (చూచినప్పుడు) ఒకని సుఖమే, ఒకనికి దుఃఖమగుచున్నది, అని అవ్యవస్థను (నిశ్చయము లేకపోవుటను) ప్రతిపాదించి, ఒకే వ్యక్తియందుకూడ సుఖదుఃఖముల వ్యవస్థ లేదని చెప్పినాడు- 'అదియే ప్రీతికొరకై మరల దుఃఖకారణమగుచున్నది. అదియే కోపకారణమై, ఎందువలన మరల ప్రసన్నతకు కారణమగుచున్నదో-అందువలననే ఏ ఒక్క వస్తువును దుఃఖాత్మకముగాని, సుఖాత్మకముగాని కాదు'. అని, ప్రతి వస్తువు, సుఖదుఃఖాత్మకమగుట కర్మమునుబట్టియేకాని, వస్తు స్వభావమునుబట్టికాదు, కనుక కర్మము తొలగిపోగనే-అదియు తొలగిపోవుచున్నది.

మూ॥ యత్తు 'సర్వం పరవశం దుఃఖమ్' ఇత్యుక్తమ్, తత్ పరమ-పురుషవ్యతిరిక్తానాం పరస్పరశేషశేషిభావాభావాత్. తద్-వ్యతిరిక్తం ప్రతిశేషతా, దుఃఖమేవ ఇత్యుక్తమ్। 'సేవాశ్వ-వృత్తిరాఖ్యాతా' ఇత్యత్రాఽపి అసేవ్యసేవా శ్వవృత్తిరేవ ఇత్యుక్తమ్। 'సహ్యైశ్రమైః సదోపాస్యః సమస్తైః ఏకఏవతు' ఇతి సర్వైః ఆత్మయాథాత్మ్య విద్భిః సేవ్యః పురుషోత్తమ ఏకఏవ। యథోక్తం భగవతా—

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే॥ ఇతి।

అనువాదము:- 'పరులకు వశపడియుండుట అంతయు దుఃఖము' అనియనుట ఏదికలదో-అది-పరమపురుషునికంటె వేరైనవారిలో పరస్పరము శేషశేషిభావము (స్వామి-దాసభావము) లేదు కనుక, పరమాత్మకంటె వేరైనవారిని ఉద్దేశించి 'శేషుడు' (దాసుడు) అగుట దుఃఖమేనని చెప్పబడినది. 'సేవ-శునకప్రవృత్తియని చెప్పబడినది' అనుచోటునకూడ సేవింపరానివాని సేవ శ్వవృత్తియే (శునక ప్రవృత్తియే) అని చెప్పబడినది. 'ఆ పరమాత్మ ఒక్కడే సర్వాశ్రమములచేతను (బ్రహ్మచర్య గార్హస్థ్యాది సర్వవిధములగు ఆశ్రమముల పరిగ్రహించిన వారిచేతను) ఎల్లప్పుడు అందరిచే సేవింపదగియున్నాడు' అని ఆత్మయొక్క వాస్తవ స్థితినెరిగిన వారందరిచేతను సేవింపదగినవాడు పురుషోత్తముడగు శ్రీమన్నారాయణుడొక్కడే! భగవంతునిచే (శ్రీగీతలో) నిట్లు చెప్పబడినది- (శ్లో. 14/26)

'ఎవ్వడు స్థిరమైన భక్తియోగమును నాశ్రయించి నన్ను సేవించుచున్నాడో వాడే సత్త్వరజస్తమస్సులను ప్రాకృతగుణములదాటి బ్రహ్మభావమును పొంద సమర్థుడగును' అని.

మూ॥ ఇయమేవ భక్తిరూపా సేవా 'బ్రహ్మవిదాప్నోతి పరమ్' 'తమేవం విద్వానమృత ఇహ భవతి' 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' ఇత్యాదిషు వేదనశబ్దేన అభిధీయతే ఇత్యుక్తమ్। 'యమైవేష వృణుతే తేన లభ్యః' ఇతి విశేషణాత్ 'యమైవేష వృణుతే' ఇతి భగవతా వరణీయత్వం ప్రతీయతే। వరణీయశ్చ ప్రియతమః, యస్య భగవతి అనవధికాతిశయా ప్రీతి జాయతే స ఏవ భగవతః ప్రియతమః। తదుక్తమ్—భగవతైవ-ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం, స చ మమ ప్రియః' ఇతి తస్మాత్

పరభక్తిరూపాపన్నమేవ వేదనం తత్త్వతో భగవత్ప్రాప్తి సాధనమ్।

యథోక్తం భగవతా ద్వైపాయనేన మోక్షధర్మే సర్వోపనిషద్వ్యాఖ్యానరూపమ్ —

'న సందృశే తిష్ఠతి రూపమస్య
స చక్షుషా పశ్యతి కశ్చనైనమ్।
భక్త్యాచధృత్యాచ సమాహితాత్మా
జ్ఞానస్వరూపం పరిపశ్యతీహ॥

ఇతి। ధృత్యా సమాహితాత్మా, భక్త్యా పురుషోత్తమం పశ్యతి సాక్షాత్కరోతి, ప్రాప్నోతి ఇత్యర్థః। 'భక్త్యాత్వనన్యయాశక్యః' ఇత్యనేన ఐకార్థ్యాత్। భక్తిశ్చ జ్ఞానవిశేష ఏవేతి సర్వముపపన్నమ్।

అనువాదము:- ఈ భక్తిరూపమగు సేవయే 'బ్రహ్మమునుపాసించినవాడు పరమును పొందును' 'ఆ పరమాత్మనుపాసించినవాడు ఇక్కడే అమృతత్వమును పొందును' 'బ్రహ్మమునుపాసించినవాడు బ్రహ్మాత్మకుడే యగును' మున్నగు స్థలములలో వేదనము శబ్దముచే చెప్పబడుచున్నదని (పూర్వమే) చెప్పబడినది. 'ఎవ్వనిని పరమాత్మ వరించునో వానిచేతనే పొందబడును' అని విశేషణమునుబట్టి- 'ఎవ్వనిని పరమాత్మ వరించునో' అని, భగవంతునిచే వరింపదగియుండుట తెలియుచున్నది. వరింపదగినవాడు అత్యంతప్రేమాస్పదుడు, ఎవ్వనికి భగవంతునియందు నిరతిశయము అపారమునైన ప్రీతిపుట్టునో వాడే భగవంతునకు 'అత్యంత ప్రియుడు' అని. కనుక పరభక్తిరూపముగా నేర్పడిన 'వేదనము' (ఉపాసనము) వాస్తవముగ భగవంతునిపొందుటకు సాధనము (ఉపాయము).

భగవానుడగు కృష్ణద్వైపాయనునిచే— మోక్షధర్మమున (భారత

మున) నిఖిలోపనిషత్తుల వ్యాఖ్యానముగ నిది చెప్పబడినది—'ఆ పర మాత్మయొక్క రూపము ఎదుట అగుపింపదు. ఎవ్వడును కంటివే చూడ జాలడు. 'ధృతిచే' (ఇంద్రియ నిగ్రహముచే) మనస్సును నిలువరించిన వాడై, భక్తితో జ్ఞానస్వరూపుని (పరమాత్మను) ఇక్కడే చూచుచున్నా డు' అని.

ధృతిచే మనస్సును నిగ్రహించినవాడై (ఆత్మయనగా మనస్సు) భక్తితో భగవంతుని పురుషోత్తముని చూచుచున్నాడు. సాక్షాత్కరించు కొనుచున్నాడు (అనగా) పొందుచున్నాడని యర్థము. 'అనన్యమగు భక్తిచే పొందదగినవాడు' అనువాక్యముతో ఏకార్థత్వమున్నదికదా! భక్తి యనగా ఒకానొక జ్ఞానమే కనుక అంతయు కుదురుచున్నది.

మూ॥ సారాసార వివేకజ్ఞాః
గరీయాంసో విమత్సరాః।
ప్రమాణతంత్రాః సంతీతి
కృతో వేదార్థ సంగ్రహః॥

అనువాదము:- ఏదిసారము, ఏది నిస్సారము అని లెస్సగ వివే చింపగలవారును మాత్సర్యమునువీడి పెద్దమనస్సు కలవారును (అసంకు చిత బుద్ధులని తాత్పర్యము) ప్రమాణములకు కట్టుబడినవారును కలరని 'వేదార్థసంగ్రహము' నిర్మింపబడినది.

వివరణము:- ఇంతవరకు భగవత్ప్రాప్త్యుపాయము పరభక్తియని పిలువబడు సాధ్యభక్తియనియు, భక్తియనగా జ్ఞానవిశేషమేననియు, అదియే శ్రుతులలో 'వేదనము'గా చెప్పబడినదనియు భగవద్రామానుజులు పూర్వము నిరూపించినదానినే సంగ్రహముగ పునఃప్రతిపాదించి గ్రంథ మును ముగించినారు.

అసద్వాదపరామర్శాత్ పుంజితాశేషకిల్బిషమ్।
హరన్తం, మోహతిమిరం ప్రహరన్తం విశేషతః॥

భగవద్రామానుజార్యాణాం వేదతత్త్వార్థదర్శకమ్।
"వేదార్థసంగ్రహా"భిఖ్యగ్రంథమాంధ్ర్యాఽనువర్తితుమ్॥

వివరీతుం కృతోయత్నశ్చపలత్వనిబంధనః।
విదుషాం బాలసంక్రీడారసాస్వాదనలాలసమ్॥

మానసంప్రీణయన్, శ్రీమన్నారాయణపదాబ్జయోః।
ఆరాధనాత్మనాఽన్వియాత్ సజ్జనామోదకృద్భవేత్॥

ఇతి ప్రహ్వహృదా మూర్ధసంసజ్జితకరాంజలిః।
రంగరామానుజోహ్యేష వినివేదయతేతరామ్॥

నమో యతివరేణ్యాయ తత్త్వామృతవిహారిణే।
సంసారాంభోధికల్లోలమజ్జన్మాదృశధారిణే॥

॥ శ్రీకృష్ణార్పణమస్తు ॥

## -: పారిభాషికపదమాల :-

| రామానుజ దర్శనము | శాంకర దర్శనము |
| --- | --- |
| 1. పరబ్రహ్మము:- స్వరూపముచేతను, గుణములచేతను సర్వాతిశయముగల పరమాత్మయగు శ్రీమన్నారాయణుడు. అప్రాకృత దివ్యమంగళ విగ్రహము, అపరిమితములు, అసంఖ్యేయములునైన కల్యాణగుణములు కలవాడు. | నిర్గుణము, నిరాకారము, సకల కారణమునైన పరమాత్మతత్త్వము. |
| . జీవుడు:- పరమాత్మకంటె వేరై సూక్ష్మస్వరూపము కలవాడు. గుణ విశిష్టుడు. జ్ఞానమే స్వరూపముగను గుణముగను కలవాడు. కర్మబంధముచే సంసారమును పొందువాడు. బద్ధుడు, ముక్తుడు, నిత్యుడునని జీవుడు మూడు విధములు. | అవిద్యచే పరబ్రహ్మమందు కల్పింప బడినవాడే తప్ప, వాస్తవముగ లేడు. జీవులలో బద్ధ, ముక్త, నిత్యాది భేదములు లేవు. అపకృష్టోపాధ్యవచ్ఛిన్న చైతన్యము. |
| 3. ఈశ్వరుడు:- పరమాత్మయు, పరబ్రహ్మమునగు శ్రీమన్నారాయణుడే. సకల నియామకుడు. | అవిద్యచే పరబ్రహ్మమందు కల్పింపబడిన తత్త్వమేతప్ప వాస్తవముగలేదు. సకలాజ్ఞానావభాసకమైన అజ్ఞానావచ్ఛిన్న చైతన్యము. |
| 4. అవిద్య:- అజ్ఞానము, దేహాత్మభ్రమము. కర్మముకూడ అవిద్యయే. ఇదియే సంసారకారణము. జీవునాశ్ర | అనాది. బ్రహ్మమందు కల్పింపబడి జీవేశ్వరజగదాది ప్రతీతికి కారణమగుచున్నది. |

| | |
|---|---|
| యించి యుండునది అనాది. | వాస్తవమునకు ఇది మిథ్యా రూపమే. |
| 5. మాయ:– ఇది భగవానుని ఆశ్చర్యకరమగు శక్తి, దీనిని నాధారముగా జేసికొని భగవానుడు సృజించును. ఇది తుచ్ఛమైనదికాదు. | ఇది తుచ్ఛమైనది. యామా సామాయా, ఏదిలేనిదో అది యే మాయ. భ్రాంతిరూపము. |
| 6. మోక్షము:– కర్మబద్ధుడైన జీవునకు భగవత్ప్రపత్తిచే కర్మబంధము తొలగుట, శ్రీవైకుంఠప్రాప్తి, గుణాష్టకావిర్భావము, నిరతిశయానంద బ్రహ్మానుభవము. | అవిద్యతొలగుటద్వారా జీవాది భేదము నశించి బ్రహ్మణాదాత్మ్యానుభవము. |
| 7. జగత్తు:– జీవ–తిర్యగాది వివిధప్రాణి విశిష్టమైన భగవంతునిచే సృజింపబడి, భగవంతునకు ప్రకారముగ సముదియున్నది. సత్యము. భగవత్ శక్తి పరిణామరూపము. | అసత్యము – అవిద్యా కల్పితము. భ్రాన్తి రూపము. బ్రహ్మవివర్తరూపము. |
| 8. జ్ఞానము:– ధర్మభూతజ్ఞానము, ధర్మిభూతజ్ఞానము అని రెండు విధములు. స్వయంప్రకాశము, నిత్యము, స్వతః ప్రమాణము, మతి–ప్రజ్ఞా, సంవిత్–ధిషణా–ధీః–మనీషా మున్నగు శబ్దములచే బోధింపబడు ఒకానొక ద్రవ్యమే ధర్మభూతజ్ఞానము. ఇది జీవేశ్వరుల నాశ్రయించి యుండునది కనుక ధర్మము. ఇక జీవేశ్వరులకు స్వరూ | గుణము కాదు. పరబ్రహ్మ స్వరూపమే. స్వయంప్రకాశము, నిత్యము. |

పమైన జ్ఞానమే ధర్మిభూతజ్ఞానము.

9. ప్రకృతి:- సత్త్వరజస్తమోరూపము లైన మూడుగుణములకాశ్రయమై మాయయని పిలువబడు, నిత్యము, అక్షరము, అవిద్యారూపమునైన భగవచ్ఛక్తి. భగవత్సంకల్పముచే కార్యోన్ముఖావస్థలోనున్నప్పుడు అవ్యక్తమని పిలువబడును. సకలసృష్టికి మూలము.

ఇది మిథ్యా రూపము- అవిద్యాకల్పితము - అవిద్యా రూపము.

10. భక్తి:- భక్తియోగము-ప్రీతిరూపమైన అనుధ్యానము. ఇదియే ఉపాయమని భావింపబడినప్పుడు ఉపాయభక్తి యగును. దీనినాశ్రయించినవారు భక్తులు.

11. ప్రపత్తి:- భగవత్ప్రాప్తికి భగవానుడే ఉపాయమని స్థిరముగ భావించుట. ఇదియే సాధ్యభక్తియనిగూడ పిలువబడును. దీనినాశ్రయించినవారు ప్రపన్నులు. ప్రపత్తిలో అందరికి అధికారము కలదు.

12. నిత్యవిభూతి:- స్వయంప్రకాశము, పంచోపనిషన్మంత్రములచే ప్రతిపాదింపబడిన పరాకాశము మున్నగు అప్రాకృత పంచభూతములతో నేర్పడినది. నిత్యము. ఈశ్వరునకు,

నిత్యులకు, ముక్తాత్మలకు భోగ్య-భోగోపకరణ - భోగస్థాన రూపమైన శ్రీవైకుంఠాదికము.

13. లీలావిభూతి:- భగవల్లీలలకు ఆస్పదమైన ఈ చరాచరజగత్తు లీలా విభూతి-మిథ్యకాదు. సత్యము.

14. కైవల్యము:- ఇది కొందరిచే మాత్రమే మోక్షముగా అంగీకరింపబడినది. ఇది స్వాత్మానుభవముమాత్రమేనని వారిమతము. అర్చిరాది మార్గమున పరమపదమును పొందిన వానికి బ్రహ్మానందము తప్పదుకనుక కైవల్యములేదని పెద్దలు చెప్పుదురు. కైవల్యము మోక్షముకాదు.

కైవల్యమనగా మోక్షమే. ఆత్మయే బ్రహ్మము కనుక, ఆత్మానుభవరూపమగు కైవల్యమే మోక్షము.

15. శ్రుతి:- అనగా వేదము - ప్రమాణ మూర్ధన్యము-నిత్యము, సత్యము.

తత్త్వజ్ఞానము కలిగిన తరువాత వేదాది శాస్త్రము కూడ మిథ్యయే.

16. కర్మము:- అవిద్యారూపము. నిత్యనైమిత్తికాది బహువిధము. వర్ణాశ్రమాది కర్మముకూడ అవిద్యారూపమే అయినను తప్పక అంగీకరింపదగినదే.

అవిద్యారూపమే.

## దివ్యమంగళ విగ్రహమును నిరూపించు ప్రమాణములు

**1. యోఽసావాదిత్యమండలాన్తర్వర్తీ –**

'య ఏషోఽన్తరాదిత్యేహిరణ్మయః పురుషోదృశ్యతే' (ఛాం.1-6-6) 'య ఏష ఏతస్మిన్ మండలే పురుషోయశ్చాయం దక్షిణేక్షన్' (బృ.7-5-1) 'య ఏష ఏతస్మిన్ మండలేఽర్చిషి పురుషః' (తై.నా. 6-13)

**2. తప్తకార్తస్వరగిరివరప్రభః –**

'రుక్మాభంస్వప్నధీగమ్యమ్' (మను. 12-122) 'యదాపశ్యః పశ్యతేరుక్మవర్ణమ్' (ముం.ఉ. 3-1-3) 'ప్రతప్తకార్తస్వరవర్చసం ప్రభుమ్'

**3. సహస్రాంశు శతసహస్రకిరణః –**

'ఆదిత్యవర్ణం తమసఃపరస్తాత్' (పు.సూ. 20) 'దివిసూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా। యది భాః సదృశీసాస్యాద్ భాసస్తస్య మహాత్మనః॥' (గీత. 11-12)

**4. గంభీరాంభస్సముద్భూత సుమృష్టనాల – రవికరవికసిత పుండరీకదలామలాయతేక్షణః –**

'తస్యయథాకప్యాసం పుండరీకమేవమక్షిణీ' (ఛాం. 1-6-7) 'రామః కమలపత్రాక్షః' (రా.సుం. 35-8) 'పుండరీకపలాశాభ్యాం విప్రకీర్ణమివోదకమ్' (రా.సుం. 33-4) 'ప్రసన్నవదనం చారుపద్మపత్రోపమేక్షణమ్' (వి.పు. 6-7-80) 'త్వత్తః కమలపత్రాక్ష' (గీ. 11-2) 'యఃపరః పుండరీకాక్షః పరమాత్మాసనాతనః' (అహిర్బుధ్న్యసంహితా. 59-6)

**5. సుభ్రూలలాటః –**

'నారాయణనమస్తేస్తుపుండరీకాయతేక్షణ। సుభ్రూలలాట సునసే

సుస్మితాధరవిద్రుమ॥' (జితన్తావచనము 4-6)

**6. సురుచిరకోమలగండః –**

'సుకపోలమ్' (వి.పు. 6-7-80)

**7. కంబుగ్రీవః –**

కంబుగ్రీవో మహాహనుః (శ్రీరామా. బాల. 1-9)

**8. పీనవృత్తాయతభుజః –**

పీనవృత్తాయతభుజశ్రీవత్సకృతలక్షణ (జితన్తావచనము4-7)

**9. చారుతరాతామ్రకరతలానురక్తాంగులీభిరలంకృతః, తను మధ్యః, విశాలవక్షఃస్థలః –**

మహోరస్కో మహేష్వాసః (రామా. బాల. 1-10)

**10. సమవిభక్తసర్వాంగః –**

సమః సమవిభక్తాంగః (శ్రీరామా. సుం. 35-16)

**11. అనిర్దేశ్యదివ్యరూపసంహననః –**

రూపసంహననం లక్ష్మీం (శ్రీరామా. అరణ్య. 1-16)

**12 స్నిగ్ధవర్ణః –**

స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్ (శ్రీరామా. సుం. 35-16)

**13. ప్రబుద్ధపుండరీకచారుచరణయుగలః –**

త్వత్పాదకమలాదన్యత్ (జితన్తా) సంచింతయేత్ భగవతః చరణారవిందమ్ (భాగ. 3-28-21)

**14. స్వానురూపపీతాంబరధరః –**

తస్యమహారజతంవాసః (బృహ. 4-3-6)

**15.** అమలకిరీటకుండలహారకౌస్తుభకేయూరకటకనూపురో- దరబంధనాద్యపరిమితాశ్చర్యానన్తదివ్యభూషణః -

కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయవపుః ధృత శంఖచక్రః (బృ. పరాశరస్మృతి. 5)

**16.** శంఖచక్రగదాసిశార్ఙ్గశ్రీవత్సవనమాలాలంకృతః -

శంఖభృన్నందకీచక్రీ శార్ఙ్గధన్వాగదాధరః। రథాంగపాణిరక్షోభ్యః సర్వప్రహరణాయుధః (విష్ణుసహస్రనామములు)

**17.** అనవధికాతిశయసౌందర్యాహృతాశేషమనోదృష్టివృత్తిః-

రూపౌదార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్ (శ్రీరా. అయోధ్య. 3-29)

**18.** లావణ్యామృతపూరితాశేషచరాచరభూతజాతః -

'భువనసుందరః' (భాగ. 10-52-37) సాక్షాన్మన్మథమన్మథః (భాగ. 10-32-2)

**19.** అత్యద్భుతాచింత్యనిత్యయౌవనః -

యః పూర్వ్యాయ వేధసేనవీయసే (ఋ. 1-156-2)

**20.** పుష్పహాససుకుమారః -

సౌకుమార్యం సువేషతామ్ (రామా. అరణ్య. 1-13) పుష్పహాసః (విష్ణు.సహస్ర.)

**21.** పుణ్యగంధవాసితానన్తదిగంతరాలః -

సర్వగంధః సర్వరసః (ఛాం. 3-14-4) తస్యాననం పద్మసమాన గంధి (రామా. సుం. 36-28)

**22. త్రైలోక్యాక్రమణప్రవృత్తగంభీరభావః –**

సముద్రఇవగాంభీర్యే (రా.బా. 1-17)

**23 కరుణానురాగమధురలోచనావలోకితాశ్రితవర్గః –**

కరుణాపూర్ణదృష్టిభ్యాం దీనంమామవలోకయ (జితన్తా)

భూత్యానుకంపితధియా ఇహగృహీతమూర్తేః సంచింతయేద్భగ-
వతో వదనారవిందమ్ (భాగ. 3-28-29)

తస్యావలోకమధికం కృపయాతి ఘోరతాపత్రయోప
శమనాయ నిసృష్టమక్ష్ణోః।

స్నిగ్ధస్మితానుగుణితం విపులప్రసాదం ధ్యాయేచ్చిరం
విపులభావనయా గుహాయామ్॥ (భాగ. 3-28-31)

# శుద్ధిపత్రము

| పుట | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 10. | యాములు | యామునులు |
| 13. | సాంప్రదాయ | సంప్రదాయ |
| 28. | యమైవైష | యమేవైష |
| 41. | దన్యాప్రయూపమ్ | దన్యప్రయూపమ్ |
| 44. | తదన్యత్వమ్ | తదనన్యత్వమ్ |
| 48. | ఎవమ్ | ఏవమ్ |
| 64. | శ్వేతాశ్వర | శ్వేతాశ్వతర |
| 68. | దృష్టాన్తేః | దృష్టాన్తైః |
| 75. | ఉదంచపము | ఉదంచనము |
| 80. | అధిష్టాతృ | అధిష్ఠాతృ |
| 89. | త్రసర | త్రస |
| 96. | జీవాత్మ | జీవాత్మా |
| 102. | బ్రహ్మై | బ్రహ్మై |
| 125. | విభక్త్యంచ | విభక్త్యంత |
| 139. | కర్పింప | కల్పింప |
| 158. | వగతి | వదతి |
| 159. | ఇత్వారంభ | ఇత్యారంభ |
| 167. | దిలగి | తొలగి |
| 175. | బ్రహ్మ | బ్రహ్మ |
| 179. | వాదీన | వాదేఽన |
| 204. | దోపము | దోషము |
| | నానావిథానన్త | నానావిధానన్త |
| 205. | జీవసద్భావ | జీవసద్భావ |